శ్రీమతే రామానుజాయ నమః

ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదామ్,
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్.

## శ్రీమద్రామాయణే

# సుందరకాండః

## 1. ప్రథమః సర్గః

*(హనుమంతుని సముద్రలంఘనము)*

తతో రావణనీతాయా స్సీతాయా శ్శత్రుకర్శనః,
ఇయేష పద మన్వేష్టుం చారణాచరితే పథి. 1

అంతట (జాంబవంతుడు ప్రోత్సహించిన పిమ్మట) స్వకార్యము (సీతాన్వేషణము) నకు విరోధులను రూపుమాప సమర్థుడగు హనుమంతుడు, రావణు డపహరించిన సీతాదేవి యున్న తావును, చారణులు (గుంపుగా సంచరించు దేవగాయకులు) తిరుగాడు ఆకాశమార్గమున పోయి వెదుక దలంచెను. 1

విశే. కిష్కింధాకాండమున భగవంతునియందు మాత్రమే ఉండెడి సకల కల్యాణ గుణాకరత్వము చెప్పబడినది. ఈ సుందరకాండమం దాయనకు గల సర్వసంహారకత్వరూపమగు గుణము చెప్పబడుచున్నది. లేదా పూర్వకాండమున సర్వథా మిత్రులను కాపాడవలెనని చెప్పబడినది. ఇందు దూతయు, పతివ్రతయు ఎట్లు నడచుకొనవలెనో వివరింపబడినది. లేదా పూర్వకాండమున సర్వరక్షణప్రవృత్తుడైన విష్ణునికి ఆచార్యరూపమగు పురుషకారము లభించుట చెప్పబడినది. ఈ కాండమున అచార్యుని కృత్యము చెప్పబడుచున్నది. లేదా పూర్వకాండమున హనుమంతుడు మనస్సంకల్పముతో బయలుదేరుట చెప్పబడినది. ఇందు

దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః,
సముదగ్రశిరోగ్రీవో గవాం పతి రివాబభౌ. 2

అథ వైడూర్యవర్ణేషు శాద్వలేషు మహాబలః,
ధీర స్సలిలకల్పేషు విచచార యథాసుఖమ్. 3

ద్విజాన్ విత్రాసయన్ ధీమా నురసా పాదపాన్ హరన్,

---

అన్యుల కలవికాని సముద్రలంఘన మను కార్యమును నిరంతరాయముగ చేయ సమకట్టినవాడై హనుమంతుడు తల పైకెత్తి, మెడ చాచి, ఆబోతు వలె విరాజిల్లెను. 2

అంతట ధీరుడు, మహాబలుడగు హనుమంతుడు కొంచెము తెలుపుతో కూడిన ఆకుపచ్చరంగు (వైడూర్యవర్ణము) కలవై, చల్లదనముచే నీటిని పోలుచున్న పచ్చికబయళ్లపై సుఖముగా సంచరించెను. 3

ధీమంతుడగు హనుమంతుడు అట్లు విజృంభించిన సింహామువలె

---

శరీరముతో బయలుదేరుట వర్ణింపబడుచున్నది.

ఈ కాండమున ప్రధానపురుషుడగు ఆంజనేయస్వామి గురుస్థానీయుడు. ఆయన శత్రుకర్శనుడు. జ్ఞానము నిచ్చువాడు గురువు. ఆ జ్ఞానమునకు విరోధి అజ్ఞానము. దానిని పారద్రోలువాడు హనుమంతుడు.

'గుశబ్ద స్త్వంధకారః స్యాత్ రుశబ్ద స్తన్నిరోధకః,
అంధకారనిరోధిత్వాత్ గురు రిత్యభిధీయతే.'

గు–అనగా అంధకారము (అజ్ఞానము), రు–అనగా నిరోధించువాడు. అంధకారమును పారద్రోలువాడు కాన గురువవి చెప్పబడును. చారణు లనగా ధర్మములను ఆచరింపజేయువారు (చారయంతి ధర్మానితి చారణాః) అనగా పూర్వాచార్యులు. వారి మార్గమనగా సదాచారము. అం దున్నవా డనగా సదాచారవంతు డనుట. 'రావణు' డనగా అవివేకము. ఆ అవివేకము 'సీత' అను భగవత్పరతంత్రుడగు చేతనుని వశము చేసికొనినది. అట్టి చేతనుని స్థాన మనగా సంసారమండలము. అం దన్వేషణ మనగా ఏ చేతనుడు భగవత్ప్రాప్తికి పరితపించుచున్నాడని వెదకుట.

కిష్కింధాకాండతో శ్రీమద్రామాయణమున పదునొక్కవేల శ్లోకములు ముగిసినవి. ఈ కాండము పంద్రెండవవేయిలో ప్రథమశ్లోకముతోనే మొదలగుచున్నది. ఇందు గాయత్రీమంత్రమందలి పంద్రెండవ అక్షరము 'వ' ప్రయుక్తమైనది.

మృగాంశ్చ సుబహూన్ నిఘ్నన్ ప్రవృద్ధ ఇవ కేసరీ. 4
నీలలోహితమాంజిష్ఠ పత్రవర్ణై స్సితాసితైః,
స్వభావవిహితై శ్చిత్రై ర్ధాతుభి స్సమలంకృతమ్. 5
కామరూపిభి రావిష్ట మభీక్ష్ణం సపరిచ్ఛదైః,
యక్షకిన్నరగంధర్వై ర్దేవకల్పైశ్చ పన్నగైః. 6
స తస్య గిరివర్యస్య తలే నాగవరాయుతే,
తిష్ఠన్ కపివర స్తత్ర హ్రదే నాగ ఇవాబభౌ. 7
స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే,
భూతేభ్య శ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్. 8

---

విహరించుచుండగా అతని రొమ్ము తాకి చెట్లు కూలెను. ఆ చెట్ల నాశ్రయించియున్న పక్షులు బెదరెను. మృగములు (భీతిల్లి) చెల్లాచెదరై నశించెను. 4

నల్లనివి, ఎఱ్ఱనివి, పసుపువన్నె కలవి, ఆకుపచ్చరంగు కలవి, తెలుపు-నలుపుల మిశ్రవర్ణము కలవి, చిత్రవర్ణము కలవి అగు సహజసిద్ధమైన ధాతువులతో హనుమ నిలచిన మహేంద్రగిరి అలంకృతమై యుండెను. 5

అచ్చట కోరిన రూపు దాల్చగలవారు, అలంకారములు ధరించినవా రగు యక్షులు, కిన్నరులు, గంధర్వు లను దేవతలును, దేవతలతో సమానులగు పన్నగులును ఎక్కువగా విహరించుచుండిరి. 6

ఎల్లెడల శ్రేష్ఠములగు ఏనుగులు సంచరించు ఆ మహేంద్రపర్వతపు సుందరప్రదేశముపై నిలిచిన హనుమంతుడు మడుగులోని యేనుగువలె మిక్కిలి ప్రకాశించెను. 7

ఆయన తనకు విద్యాగురువగు సూర్యునకు, దేవరాజగు మహేంద్రునకు, వాయుదేవునకు, బ్రహ్మకు, తదితరదేవతావిశేషములకును ప్రణమిల్లి అటనుండి బయలుదేరవలెనని సంకల్పించెను. 8

అంజలిం ప్రాఙ్ముఖః కృత్వా పవనా యాత్మయోనయే,
తతో౽ భివవృధే గంతుం దక్షిణో దక్షిణాం దిశమ్. 9

ప్లవంగప్రవరై ర్దృష్టః ప్లవనే కృతనిశ్చయః,
వవృధే రామవృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు. 10

నిష్ప్రమాణశరీర స్సన్ లిలంఘయిషు రర్ణవమ్,
బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్. 11

స చచా లాచల శ్చాపి ముహూర్తం కపిపీడితః,
తరూణాం పుష్పితాగ్రాణాం సర్వం పుష్ప మశాతయత్. 12

తేన పాదపముక్తేన పుష్పౌఘేణ సుగంధినా,
సర్వత స్సంవృత శ్శైలో బభౌ పుష్పమయో యథా. 13

---

ఆయన తూర్పుదిశకు తిరిగి, తన తండ్రియగు వాయుదేవునకు మఱొక్క మాఱు సమస్కరించి, పిమ్మట సమర్థుడగుటచే దక్షిణదిశగా పోవుటకై తన శరీరమును పెంచెను. 9

హనుమంతు డట్లు ఎగురుటకు నిశ్చయించి, రాముని అభ్యుదయమును కోరుచు, కపిశ్రేష్ఠులు చూచుచుండగనే పున్నమి మున్నగు పర్వములందు ఉప్పొంగు సముద్రము వలె పెరిగెను. 10

అతడు సముద్రమును దాటగోరుచు, తన దేహమును కొలువరానంతగా పెంచి, భుజములచే, పాదములచే ఆ పర్వతమును గట్టిగా అణచెను. 11

ఆ మహేంద్రపర్వతము అచలము (కదలనిది) అయినను, హనుమంతుడు మర్దింపగా ఒక్క క్షణము చలించెను. ఆ కదలికకు కొండపై నున్న చెట్ల కొమ్మల కొనలందు విరబూసిన పూవు లన్నియు రాలిపడెను. 12

ఆ చెట్లు సుగంధము కల పుష్పరాశులను రాల్చి శిలాతలమును అన్నివైపుల కప్పివేయగా ఆ కొండ పూలకొండవలె ప్రకాశించెను. 13

తేన చోత్తమవీర్యేణ పీడ్యమాన స్స పర్వతః,
సలిలం సంప్రసుస్రావ మదం మత్త ఇవ ద్విపః. 14

పీడ్యమానస్తు బలినా మహేంద్ర స్తేన పర్వతః,
రీతీ ర్నిర్వర్తయామాస కాంచనాంజనరాజతీః. 15

ముమోచ చ శిలా శ్శైలో విశాలా స్సమనశ్శిలాః,
మధ్యమే నార్చిషా జుష్టో ధూమరాజీ రివానలః. 16

గిరిణా పీడ్యమానేన పీడ్యమానాని సర్వతః,
గుహావిష్టాని భూతాని వినేదు ర్వికృతైః స్వరైః. 17

స మహాసత్త్వసన్నాద శ్శైలపీడానిమిత్తజః,
పృథివీం పూరయామాస దిశ శ్చోపవనాని చ. 18

శిరోభిః పృథుభి స్సర్పా వ్యక్తస్వస్తికలక్షణైః,

---

మెచ్చదగు పరాక్రమము గల హనుమంతుడు మర్దించగా ఆ మహేంద్రపర్వతము మదించిన యేనుగు మదజలము కార్చినట్లు, మిక్కుటముగా జలము కార్చెను. 14

బలశాలియగు హనుమంతు డట్లు పీడింపగా, ఆ పర్వతమునందలి బంగారు, నీలము, వెండి ఖనిజపు రాళ్ళు బ్రద్దలై ఆ యా లోహముల రేఖ లగపడెను. 15

మండుచున్న అగ్ని తన (ఏడు జ్వాలలలో నాల్గవదగు ధూమ్రవర్ణ యను) నడిమి జ్వాలతో కూడి పొగలు గ్రక్కిన ట్లా మహేంద్రపర్వతము మణిశిలలతో గూడిన పెనురాళ్లను విరజిమ్మెను. 16

హనుమంతు డట్లు మహేంద్రపర్వతమును మర్దించుచుండగా దిగులుపడి, అంతటను గుహలలో దాగిన జంతువులు దీనస్వరముతో బిగ్గరగా అఱచెను. 17

మారుతి అట్లా కొండను మర్దించుటచే అందు నివసించిన పెద్ద పెద్ద జీవులు చేసిన ఆక్రందనధ్వని భూమిని, దిక్కులను, వనములను దద్దరిల్లజేసెను. 18

అట్టి మర్దనముచే తమ విపులములగు పడగలపై అర్ధచంద్రాకారపు (నల్లని)

వమంతః పావకం ఘోరం దదంశు ర్దశనై శ్శిలాః. 19

తా స్తదా సవిషై ర్దష్టాః కుపితై స్తై ర్మహాశిలాః,
జజ్వలుః పావకోద్దీప్తా బిభిదుశ్చ సహస్రధా. 20

యాని చౌషధజాలాని తస్మిన్ జాతాని పర్వతే,
విషఘ్నా న్యపి నాగానాం న శేకు శ్శమితుం విషమ్. 21

భిద్యతేఽయం గిరి[1] ర్భూతై రితి మత్వా తపస్వినః.
త్రస్తా విద్యాధరా స్తస్మా దుత్పేతుః స్త్రీగణై స్సహ. 22

పానభూమిగతం హిత్వా హైమ మాసవభాజనమ్,
పాత్రాణి చ మహార్హాణి కరకాంశ్చ హిరణ్మయాన్. 23

లేహ్యా నుచ్చావచాన్ భక్ష్యాన్ మాంసాని వివిధాని చ,

---

చిహ్నములు స్పష్టముగ అగపడగా, నోటినుండి భయంకరమగు అగ్ని వంటి విషము క్రక్కుచు సర్పములు కోరలతో రాళ్లను కఱచినవి. 19

కోపించిన విషసర్పములు ఆ పెనురాళ్లను కఱవగా అవి విషాగ్నిచే ప్రజ్వలించి, వేలకొలదిగా ముక్కలయ్యెను. 20

ఆ కొండపై మొలచిన ఓషధు లేవియును, విషము హరింపగలవైనను, ఆ సర్పముల విషమును పోగొట్టలేకపోయెను. 21

ఈ కొండను భూతము లేవో బ్రద్దలు చేయుచున్నవని తలచి తపస్వు లచటనుండి ఆకసమున కెగసిరి. 22

తమ స్త్రీలతో కలిసి మద్యము త్రాగుచు, మధురభక్ష్యములు తినుచున్న విద్యాధరులు పానభూమిపై గల బంగారు సారాయిగిన్నెను, విలువైన భోజన పాత్రలను, బంగారు కమండలములను, నాకదగిన పూదేనె మున్నగువానిని, ఆస్వాదింపదగిన వివిధ

---

1 భూతములు = బ్రహ్మరక్షస్సులు మున్నగు మహాభూతములు – తిలకవ్యాఖ్య. భూతాః భువి = పృథివ్యామ్, ఉతాః = వ్యాప్తాః. భూమిపై వ్యాపించిన దేవతావిశేషములు– రామాయణశిరోమణివ్యాఖ్య.

ఆర్షభాణి చ చర్మాణి ఖడ్గాంశ్చ కనకత్సరూన్. 24
కృతకంఠగుణాః క్షీబా రక్తమాల్యానులేపనాః,
రక్తాక్షాః పుష్కరాక్షాశ్చ గగనం ప్రతిపేదిరే. 25
హారనూపురకేయూర పారిహార్యధరాః స్త్రియః,
విస్మితా స్సస్మితా స్తస్థు రాకాశే రమణైః సహ. 26
దర్శయంతో మహావిద్యాం విద్యాధరమహర్షయః,
సహితా స్తస్థు రాకాశే వీక్షాంచక్రుశ్చ పర్వతమ్. 27
శుశ్రువుశ్చ తదా శబ్ద మృషీణాం భావితాత్మనామ్,
చారణానాం చ సిద్ధానాం స్థితానాం విమలేఽంబరే. 28
ఏష పర్వతసంకాశో హనుమాన్ మారుతాత్మజః,

---

భక్ష్యములను, పలురకముల మాంసములను, ఎద్దుతోలుతో చేయబడిన డాళ్లు, బంగారు పిడుల కత్తులను విడచి, తమ స్త్రీలతోగూడి భీతితో ఆకసమున కెగసిరి. 23-24

మెడలలో పుష్పమాలలు దాల్చి, మత్తులై, ఎఱ్ఱనైన మాలలు శిరమున ధరించి, ఎఱ్ఱచందనము దేహముపై పూసుకొని, సహజముగ పద్మములవంటివైనను మద్యపానముచే ఎఱ్ఱబారిన కన్నులు గల విద్యాధరు లాకాశమున కెగిరిపోయిరి. 25

ముత్యాలసరులు, అందెలు, భుజకీర్తులు, కంకణములు ధరించి రాజిల్లు విద్యాధరాంగనలు ఆ పర్వత మట్లు కదలుట కాశ్చర్యపడి, తమ రమణులను కూడి చిరునగవు లొలికించుచు ఆకసమున నిలువిరి. 26

మహర్షుల వంటి విద్యాధరశ్రేష్ఠులు అణిమాది అష్టసిద్ధిరూపమగు తమ మహావిద్యను ప్రయోగించి ఆకసమున నొక్కచోట నిలచి ఆ పర్వతము నవలోకించిరి. 27

వా రపుడు నిర్మలాకాశమున నిలచిన పరమాత్మనిష్ఠులగు మునులు, చారణులు, సిద్ధులు పలికిన ఈ వాక్యములు వినిరి. 28

"పర్వతమువలె పెద్ద శరీరముతో విలసిల్లు వాయుపుత్రుడగు ఈ హనుమంతుడు

తితీర్షతి మహావేగ స్సముద్రం మకరాలయమ్. 29
రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్,
సముద్రస్య పరం పారం దుష్ప్రాపం ప్రాప్తుమిచ్ఛతి. 30
ఇతి విద్యాధరాః శ్రుత్వా వచ స్తేషాం మహాత్మనామ్,
త మప్రమేయం దదృశుః పర్వతే వానరర్షభమ్. 31
దుధువే చ ప రోమాణి చకంపే చాచలోపమః,
ననాద సుమహానాదం సుమహానివ తోయదః. 32
అనుపూర్వ్యేణ వృత్తం చ లాంగూలం రోమభి శ్చితమ్,
ఉత్పతిష్యన్ విచిక్షేప పక్షిరాజ ఇవోరగమ్. 33
తస్య లాంగూల మావిద్ధ మాత్తవేగస్య పృష్ఠతః,
దదృశే గరుడేవేవ హ్రియమాణో మహోరగః. 34

మహావేగముతో మొసళ్ళకు నెలవగు సముద్రమును దాటగోరుచున్నాడు. 29

రామునికొరకు, రామకార్యసాధనోద్యుక్తులగు వానరులకొఱకును కష్టసాధ్యమగు కార్యము సాధింపగోరుచు, ఇతరులకు దాటశక్యముగాని సముద్రపు టవ్వలియొడ్డు నితడు చేరగోరుచున్నాడు". 30

విద్యాధరు లా మహాత్ములగు ఋషులు మున్నగువారి పై వాక్యములు విని అట్లు అంతులేని పెనురూపు దాల్చి కొండపై నున్న కపిశ్రేష్ఠుడగు హనుమంతుని చూచిరి. 31

పర్వతమువంటి పెద్దదైన హనుమంతుడు తన మేని వెంద్రుకలను ఉత్సాహముతో విదల్చెను. శరీరమును కంపింపజేసెను. పెనుమబ్బు వలె గర్జించెను. 32

అతడు ఆకాశమున ఎగురబోవుచు గుండ్రముగా వెంద్రుకలతో చుట్టచుట్టుకొని పైన లావుగా నుండి క్రమముగా సన్నబడిన తన తోకను గరుత్మంతుడు సర్పమును విదిలించునట్లు విదిల్చెను. 33

వేగము పెంచిన హనుమంతుని వెన్నంటియున్న తోక గరుత్మంతుడు పట్టి తీసికొనిపోవుచున్న మహాసర్పమువలె నుండెను. 34

బాహూ సంస్తంభయామాస మహాపరిఘసన్నిభౌ,
ససాద చ కపిః కట్యాం చరణౌ సంచుకోచ చ. 35

సంహృత్య చ భుజౌ శ్రీమాన్ తథైవ చ శిరోధరామ్,
[1]తేజః సత్త్వం తథా వీర్య మావివేశ స వీర్యవాన్. 36

మార్గ మాలోకయన్ దూరా దూర్ధ్వం ప్రణిహితేక్షణః,
రురోధ హృదయే ప్రాణా నాకాశ మవలోకయన్. 37

పద్భ్యాం దృఢ మవస్థానం కృత్వా స కపికుంజరః,
నికుంచ్య కర్ణౌ హనుమా నుత్పతిష్యన్ మహాబలః,
వానరాన్ వానరశ్రేష్ఠ ఇదం వచన మబ్రవీత్. 38

యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసనవిక్రమః,
గచ్ఛే త్తద్వ ద్గమిష్యామి లంకాం రావణపాలితామ్. 39

---

ఆ హనుమంతుడు గొప్ప యినుపగుదియల వలె నున్న తన భుజములను కొండపై గట్టిగా నొక్కిపట్టి, నడుము సన్నము చేసికొని, కాళ్ళను కుంచింపజేసికొనెను. 35

శ్రీమంతుడు, మహాబలుడగు హనుమంతుడు తన బాహువులను, మెడను సంకోచింపజేసి, తనలో సహజముగనే గూఢముగ నున్న తేజస్సును, సత్త్వమును, వీర్యమును పైకి తెచ్చుకొనెను. 36

అతడు తన చూపును పైకి ప్రసరింపజేసి దూరమునుండియే తాను పోవలసిన మార్గము నాలోకించుచు, హృదయముననే ఉచ్ఛ్వాసనిశ్వాసములను బిగబట్టెను. 37

మహాబలుడు, కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు పాదములతో కొండ నదిమిపెట్టి, చెవులు ముడుచుకొని, ఎగురబోవుచు వానరులతో ఇట్లనెను. 38

రాముడు విడచిన బాణ మెట్లు వాయువేగముతో పోవునో, అట్లే నేనును రావణుడు పాలించు లంకాపురి కేగెదను. 39

---

[1]తేజస్సు = శత్రువులను ఎదుర్కొను శక్తి, సత్త్వము=బలము, వీర్యము= ఆకాశాదులలో సంచరించగల సామర్థ్యము - రామానుజీయవ్యాఖ్య.

న హి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్,
అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్. 40
యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యా మ్యకృతశ్రమః,
బద్ధ్వా రాక్షసరాజాన మానయిష్యామి రావణమ్. 41
సర్వథా కృతకార్యోఽహ మేష్యామి సహ సీతయా,
ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్. 42
ఏవ ముక్త్వా తు హనుమాన్ వానరాన్ వానరోత్తమః,
ఉత్పపా తాథ వేగేన వేగవా నవిచారయన్. 43
సుపర్ణ మివ చాత్మానం మేనే స కపికుంజరః. 44
సముత్పతతి తస్మిం స్తు వేగా త్తే నగరోహిణః,
సంహృత్య విటపాన్ సర్వాన్ సముత్పేతు స్సమంతతః. 45
స మత్తకోయష్టిభకాన్ పాదపాన్ పుష్పశాలినః,

---

సీతాదేవి లంకలో కనబడనిచో, ఇదే వేగముతో దేవలోకమున కేగెదను. 40

స్వర్గముననను సీత కనబడదేని, ఎంతమాత్రము శ్రమచెందక, రాక్షసరాజగు రావణుని బంధించి తెచ్చెదను. 41

సర్వవిధములుగను కార్యము సాధించియే నేను సీతతో తిరిగి వత్తును. అట్లు కాదేని రావణునితో గూడ లంకనే పెకలించి యిటకు తెచ్చెదను. 42

అని వానరశ్రేష్ఠుడు, వేగవంతుడగు హనుమంతుడు వానరులతో పలికి, దూర మని కాని, సముద్ర మని కాని ఆలోచింపక, వేగముగ ఎగిరెను. అట్లెగురుచు తన్ను తాను గరుత్మంతునికి సాటిగా భావించెను. 43,44

హనుమంతుడు అట్లు ఎగురుచుండగా ఆ కొండపై నున్న చెట్లు అతని వేగమువలన తమ కొమ్మలను ముడుచుకొని అన్ని వైపులనుండియు పై కెగసినవి. 45

అతడు మదించిన కొంగలతో, విరబూసిన పూలతో ఒప్పారు చెట్లను తన తొడల

ఉద్వహ న్నూరువేగేన జగామ విమలేఽంబరే. 46

ఊరువేగోద్ధతా వృక్షా ముహూర్తం కపి మన్వయుః,
ప్రస్థితం దీర్ఘ మధ్వానం స్వబంధు మివ బాంధవాః. 47

త మూరువేగోన్మథితా స్సాలా శ్చాన్యే నగోత్తమాః,
అనుజగ్ము ర్హనూమంతం సైన్యా ఇవ మహీపతిమ్. 48

సుపుష్పితాగ్రై ర్బహుభిః పాదపై రన్వితః కపిః,
హనుమాన్ పర్వతాకారో బభూ వాద్భుతదర్శనః. 49

సారవంతోఽథ యే వృక్షా న్యమజ్జన్ లవణాంభసి,
భయా దివ మహేంద్రస్య పర్వతా వరుణాలయే. 50

స నానాకుసుమైః కీర్ణః కపి స్సాంకురకోరకైః,
శుశుభే మేఘసంకాశః ఖద్యోతై రివ పర్వతః. 51

విముక్తా స్తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః,

---

వేగముచే పెకలించి తనతో పైకెగురజేయుచు నిర్మలాకాశమున పయనించెను. 46

అ ట్లతని తొడలవేగముచే పై కెగసిన చెట్లు, దూరప్రయాణము చేయుటకు బయలుదేరిన తమ బంధువును సాగనంప వచ్చిన చుట్టములవలె క్షణకాలము హనుమ ననుసరించెను. అట్టిమద్ది చెట్లు, తక్కిన శ్రేష్ఠవృక్షములును, రాజు వెంట పోవు సైన్యములు వలె హనుమంతుని అనుసరించినవి. 47, 48

కొనవరకు విరియబూసిన అనేకవృక్షములు చుట్టును కుదురుకొని యుండగా, వాని నడుమ హనుమంతుడు, మహాపర్వతమువలె ఆశ్చర్యము గొలుపుచు కానవచ్చెను.

అట్లు పై కెగసిన చెట్లలో చేవకలిగి బరువైన చెట్లు హనుమంతు ననుసరింపజాలక దేవేంద్రునివలన భయపడిన పర్వతములవలె సముద్రమున పడి మునిగినవి. 50

ఆకాశమున మేఘమువలె నున్న హనుమంతుని శరీరముపై వివిధపుష్పములు, చిగురుటాకులు, మొగ్గలు పడుటచే అతడు మిణుగురులచే కొండవలె ప్రకాశించెను. 51

అవశీర్యంత సలిలే నివృత్తాః సుహృదో యథా. 52

లఘుత్వే నోపపన్నం తద్ విచిత్రం సాగరేఽపతత్,
ద్రుమాణాం వివిధం పుష్పం కపివాయుసమీరితమ్. 53

తారాచిత మివాకాశం ప్రబభౌ స మహార్ణవః. 54

పుష్పౌఘే ణానుబద్ధేన నానావర్ణేన వానరః,
బభౌ మేఘ ఇవాకాశే విద్యుద్గణవిభూషితః. 55

తస్య వేగసమాధూతైః పుష్పై స్తోయ మదృశ్యత,
తారాభి రభిరామాభి రుదితాభి రివాంబరమ్. 56

తస్యాంబరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ,
పర్వతాగ్రా ద్వినిష్క్రాంతౌ పంచాస్యావివ పన్నగౌ. 57

---

ఆ వృక్షములు హనుమంతుని కొంతదూరము వెంబడించి, అతని వేగము క్రమముగా వృద్ధినొందుటచే విడివడి, అతనిపై పుష్పములు కురిపించి, ప్రియమిత్రుని నీటిపట్టువఱకు వంపి మఱలివచ్చిన తక్కిన మిత్రులవలె నీట మునిగెను. 52

హనుమంతుని శరీరవేగముచే పై కెగసిన ఆ చెట్లపూలు, మిక్కిలి తేలికగా నున్న వగుటచే నీటిలో పడి మునగకుండెను. అవి నీటిపై తేలియాడుచు విచిత్రమగు శోభ కలిగియుండెను. అట్లు పుష్పములతో కూడిన మహాసముద్రము వందలకొలది నక్షత్రములతో కూడిన ఆకాశమువలె ప్రకాశించెను. 53,54

అనేకవర్ణములు గల పుష్పములు మేనిపై పడగా, వానితో హనుమ ఆకాశమున మెఱుపుతీగల సమూహముతో విలసిల్లు మేఘము వలె ప్రకాశించెను. 55

హనుమంతుని గమనవేగముచే నింగి కెగసిన పుష్పములు సముద్రమున పడగా, వానిచే ఆ సముద్రము ఉదయించిన సుందరనక్షత్రములచే ఆకాశమువలె కనుపించెను.

ఆకాశమున చేతులు చాచి హనుమ ఎగురుచుండగా అతని రెండు చేతులు, పర్వతశిఖరమునుండి వెలువడిన రెండు ఐదుతలల పాములవలె నుండెను. 57

పిబ న్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్,
పిపాసు రివ చాకాశం దదృశే స మహాకపిః. 58

తస్య విద్యుత్ప్రభాకారే వాయుమార్గానుసారిణః,
నయనే విప్రకాశేతే పర్వతస్థా వివానలౌ. 59

పింగే పింగాక్షముఖ్యస్య బృహతీ పరిమండలే,
చక్షుషీ సంప్రకాశేతే చంద్రసూర్యా వివోదితౌ. 60

ముఖం నాసికయా తస్య తామ్రయా తామ్ర మాబభౌ,
సంధ్యయా సమభిస్పృష్టం యథా తత్ సూర్యమండలమ్. 61

లాంగూలం చ సమావిద్ధం ప్లవమానస్య శోభతే,
అంబరే వాయుపుత్రస్య శక్రధ్వజ ఇవోచ్ఛ్రితః. 62

---

కపివరు డగు హనుమంతుడు సముద్రజలమునకు చేరువగా పోవునపుడు తరంగపంక్తులతో గూడ సముద్రజలమును త్రాగివేయుచున్నట్లును, పైపైకి దూరముగా సంచరించినపు డాకాశమును కబళింపగోరుచున్నట్లును అగపడెను. 58

హనుమంతు డట్లు వాయుమార్గమున పయనించుచుండగా మెరుపుల వలె వెలుగు అతని కన్నులు, పర్వతమందలి రెండగ్నులవలె ప్రకాశించెను. 59

వానరశ్రేష్ఠుడగు హనుమంతుని వృత్తాకారములైన పెద్ద పెద్ద కన్నులు పింగళవర్ణము కలవై, ఉదయించిన చంద్రసూర్యులవలె ప్రకాశించుచుండెను. 60

ఎఱ్ఱని ముక్కుచే ఎఱ్ఱబారిన హమమంతుని ముఖము, సంధ్యారాగముతో కూడిన సూర్యమండలమువలె ప్రకాశించెను. 61

హనుమంతు డాకసమున ఎగురుచు తోకను పైకెత్తగా, అది యెత్తైన ఇంద్రధ్వజము (ఇంద్రుని ప్రీతికై చేయు ఉత్సవాదులలో ఉత్సవసూచకముగా ఎగురవేయు జెండా) వలె శోభిల్లెను. 62

లాంగూలచక్రేణ మహాన్ శుక్లదంష్ట్రోఽనిలాత్మజః,
వ్యరోచత మహాప్రాజ్ఞః పరివేషీవ భాస్కరః. 63

స్ఫిగ్దేశే నాతితామ్రేణ రరాజ స మహాకపిః,
మహతా దారితేనేవ గిరిర్ గైరికధాతునా. 64

తస్య వానరసింహస్య ప్లవమానస్య సాగరమ్,
కక్షాంతరగతో వాయు ర్జీమూత ఇవ గర్జతి. 65

ఖే యథా నిపతం త్యుల్కా హ్యుత్తరాంతా ద్వినిస్సృతా,
దృశ్యతే సానుబంధా చ తథా స కపికుంజరః. 66

పతత్పతంగసంకాశో వ్యాయత శ్శుశుభే కపిః,
ప్రవృద్ధ ఇవ మాతంగః కక్ష్యయా బధ్యమానయా. 67

ఉపరిష్టా చ్ఛరీరేణ చ్ఛాయయా చావగాఢయా,

---

తెల్లని కోఱలు కలవాడు, మహాబుద్ధిశాలి యగు హనుమంతుడు, తన చుట్టును చక్రాకారముగ నున్న తోకచే పరిధి (గూడు)తో కూడిన సూర్యుని వలె భాసిల్లెను. 63

మిక్కిలి యెఱ్ఱనైన వాలమూలప్రదేశము (తోక ప్రారంభమగు చోటు)తో కూడిన హనుమ చీల్చబడిన పెద్దగైరికధాతువుతో కూడిన కొండవలె శోభిల్లెను. 64

అట్లు పైనుండి సముద్రము దాటుచున్న వానరశ్రేష్ఠుడగు హనుమంతుని బాహుమూల (చంక) ప్రదేశమునుండి వెడలిన వాయువు మేఘమువలె గర్జింపసాగెను.

ఆకాశమున ఉత్తరదిక్కునుండి బయలుదేరిన ఉల్క, తోకతో కూడి ఎడతెగక యెట్లగపడునో అట్లే ఆ కపిశ్రేష్ఠుడును అగపడెను. 66

ఆకాశముపై పోవుచున్న సూర్యునివలె నున్న విశాలకాయుడగు హనుమంతుడు, స్తంభమునకు కట్టివేయుటచే విడివిగా సాగుచున్న యేనుగువలె శోభిల్లెను. 67

అతడు సముద్రముపై అగపడు శరీరముతోను, క్రింద నీటిలో కానవచ్చు తన ప్రతిబింబముతోను, పైన తెరచాప మున్నగునవి కలిగి, క్రిందిభాగము నీటిలో నున్నదై

సాగరే మారుతావిష్టా నౌ రివాసీ త్తదా కపిః. 68

యం యం దేశం సముద్రస్య జగామ స మహాకపిః,
స స తస్యోరువేగేన సోన్మాద ఇవ లక్ష్యతే. 69

సాగర స్యోర్మిజాలానా మురసా శైలవర్ష్మణామ్,
అభిఘ్నం స్తు మహావేగః పుప్లువే స మహాకపిః. 70

కపివాత శ్చ బలవాన్ మేఘవాత శ్చ నిస్సృతః,
సాగరం భీమనిర్ఘోషం కంపయామాసతుర్ భృశమ్. 71

వికర్ష న్నూర్మిజాలాని బృహంతి లవణాంభసి,
పుప్లువే కపిశార్దూలో వికిరన్నివ రోదసీ. 72

మేరుమందరసంకాశా నుద్ధతాన్ స మహార్ణవే,

---

గాలి వాలుచే పోవుచున్న ఓడవలె నుండెను. 68

మహాకపి యగు హనుమంతుడు సముద్రముపై ఏ యే ప్రదేశమున సంచరించెనో ఆ యా సముద్రభాగమున ఎత్తైన తరంగములు లేచుటచే, అది అపస్మారము కలది వలె (భ్రమణము, నురుగులతో నీరు కక్కుట, పెద్దగా ధ్వనివేయుట మున్నగు లక్షణములతో) కనుపించెను. 69

మహావావరుడగు ఆ హనుమంతుడు పర్వతాకారముతో ఎగసిపడుచున్న అలలను తన రొమ్ముతో ఎదుర్కొనుచు, మహావేగముతో వముద్రము దాటెను. 70

మిక్కిలి బలముగల హనుమంతుని గమనవేగమువే వెడలిన వాయువు, మేఘముల వల్ల ఏర్పడిన గాలియును, భయంకరముగ గర్జించు సముద్రమును సైతము మిక్కిలి కలవరవఅచెను. 71

వానరశ్రేష్ఠుడగు హనుమంతుడు తన వేగముతో సముద్రమునందలి అలలను లాగుచు, వానిని భూమ్యాకాశముల నడుమ వెదజల్లుచున్నట్లు ఆకాశమున ఎగిరెను. 72

మహావేగముగల హనుమంతుడు మేరు, మందర పర్వతముల వలె మహోన్నతము

అతిక్రామన్ మహావేగ స్తరంగాన్ గణయ న్నివ. 73
తస్య వేగసముద్ధూతం జలం సజలదం తదా,
అంబరస్థం విబభ్రాజ శారదాభ్ర మివాతతమ్. 74
తిమినక్రఝషాః కూర్మా దృశ్యంతే వివృతా స్తదా,
వస్త్రాపకర్షణే నేవ శరీరాణి శరీరిణామ్. 75
ప్లవమానం సమీక్ష్యాథ భుజంగా స్సాగరాలయాః,
వ్యోమ్ని తం కపిశార్దూలం సుపర్ణ ఇతి మేనిరే. 76
దశయోజనవిస్తీర్ణా త్రింశద్యోజన మాయతా,
ఛాయా వానరసింహస్య జలే చారుతరాఽభవత్. 77
శ్వేతాభ్రఘనరాజీవ వాయుపుత్రానుగామినీ,
తస్య సా శుశుభే ఛాయా వితతా లవణాంభసి. 78

---

లైన సముద్రతరంగములను దాటిపోవుచు, వానిని లెక్కించుచు పోవుచుండెనో యన్నట్లుండెను. 73

హనుమంతుని వేగముచే పై కెగసిన నీరు, మేఘములతో కూడి తెల్లనై, ఆకాశమున వ్యాపించిన శరత్కాలమేఘమువలె కనుపించెను. 74

వస్త్రము తొలగింపగా మనుజుల అవయవము లగపడునట్లు, నీరు పై కెగయుటచే సముద్రమందలి పెనుచేపలు, మొసళ్ళు, పిల్లచేపలు, తాబేళ్ళు కనుపించెను. 75

అపుడు సముద్రమున నివసించు సర్పము లాకసమున మహావేగముతో ఎగురుచున్న హనుమంతుని చూచి గరుత్మంతుడని తలంచినవి. 76

ఆ కపిశ్రేష్ఠుని నీడ పదియోజనముల వెడల్పు, ముప్పది యోజనముల పొడవు కలిగి సముద్రపు నీటిలో మిక్కిలి సుందరముగ కనుపించెను. 77

హనుమ వెంట పోవుచున్న ఆ నీడ సముద్రమున వ్యాపించి తెల్లని మేఘముల దట్టమగు వరుసవలె ప్రకాశించెను. 78

శుశుభే స మహాతేజా మహాకాయో మహాకపిః,
వాయుమార్గే నిరాలంబే వక్షవానివ పర్వతః. 79

యేనాసౌ యాతి బలవాన్ వేగేన కపికుంజరః,
తేన మార్గేణ సహసా ద్రోణీకృత ఇవార్ణవః. 80

ఆపాతే పక్షిసంఘానాం పక్షిరాజ ఇవ వ్రజన్,
హనుమాన్ మేఘజాలాని ప్రకర్షన్ మారుతో యథా. 81

పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ,
కపినాఽఽకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే. 82

ప్రవిశ న్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే. 83

ప్లవమానం తు తం దృష్ట్వా ప్లవంగం త్వరితం తదా,

---

మహాతేజస్వి మహాశరీరధారి యగు హనుమంతుడు నిరాధారమగు ఆకాశమున తెక్కలుగల పర్వతమువలె ప్రకాశించెను. 79

బలవంతుడగు హనుమంతు డే మార్గమున వేగముగ పోవుచుండెనో ఆ మార్గమం దంతటను అతని గమనవేగముచే జల మడుగంటగా అపు డచట సముద్ర మొక్కమారుగా పెద్ద దొన్నెవలె కనుపించెను. 80

హనుమంతుడు పక్షిసమూహము సంచరించు ఆకాశమార్గమున పోవుచు పక్షిరాజగు గరుత్మంతునివలెను, వాయువువలెను మేఘములను తన వేగముతో కొనిపోవుచు విలసిల్లెను. 81

అట్లు హనుమంతునిచే కొనిపోబడుచున్న మహామేఘము లొకింత పసుపు కలిసిన ఎరుపు, ఎరుపు, నలుపు, పసుపురంగు కలవై ప్రకాశించెను. 82

హనుమంతుడు మబ్బులలో మాటిమాటికి ప్రవేశించుచు, వెలువడుచు, కొంతతడవు మబ్బుల మాటున దాగి మరల వెలువడుచుండు చంద్రునివలె కనుపించుచుండెను. 83

అట్లు వేగముగా సముద్రము దాటు హనుమంతుని చూచి, దేవతలు, గంధర్వులు,

వవర్షుః పుష్పవర్షాణి దేవగంధర్వదానవాః. 84

తతాప న హి తం సూర్యః ప్లవంతం వానరోత్తమమ్,

[1]సిషేవే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే. 85

ఋషయ స్తుష్టువు శ్చైనం ప్లవమానం విహాయసా,

జగుశ్చ దేవగంధర్వాః ప్రశంసంతో మహౌజసమ్. 86

నాగాశ్చ తుష్టువు ర్యక్షా రక్షాంసి విబుధాః ఖగాః,

ప్రేక్ష్య సర్వే కపివరం సహసా విగతక్లమమ్. 87

తస్మిన్ ప్లవగశార్దూలే ప్లవమానే హనూమతి,

ఇక్ష్వాకుకులమానార్థీ చింతయామాస సాగరః. 88

సాహాయ్యం వానరేంద్రస్య యది నాహం హనూమతః,

కరిష్యామి భవిష్యామి సర్వవాచ్యో వివక్షతామ్. 89

---

దానవులును పూలవానలు కురిపించిరి. 84

రామకార్యము సిద్ధింపవలెనని సముద్రముపై ఎగురుచున్న కపిశ్రేష్ఠుడగు హనుమంతునిపై సూర్యుడు తన వేడిమిని ప్రసరింపజేయలేదు. వాయువు కూడా చల్లగా వీచెను. 85

ఆకాశమార్గమున పోవుచున్న హనుమను ఋషులు స్తుతించిరి. దేవతలు, గంధర్వులును మహాతేజశ్శాలియగు అయనను ప్రశంసించుచు పాడిరి. 86

శ్రమనొందని హనుమంతుని అకస్మాత్తుగా చూచి నాగులు, యక్షులు, రక్షస్సులు (వీరు దిక్పాలకులగు రక్షస్సులకు సంబంధించినవారు) దేవతలు, పక్షులును పొగిడిరి. 87

కపిశ్రేష్ఠుడగు హనుమంతు డట్లు సముద్రము దాటుచుండగా ఇక్ష్వాకువంశప్రతిష్ఠ కోరు సాగరు డిట్లు తలంచెను. 88

వానరశ్రేష్ఠుడగు హనుమంతునకు నే నిపుడు తోడ్పడకున్నచో నోరుగల ప్రతివాదును నన్ను అన్ని విధములుగ నిందింపక మానదు. 89

---

[1] రామకార్యప్రవృత్తుడగుటచే హనుమ తనయుడైనను వాయుదేవునకు సేవ్యుడే అయ్యెను – రామానుజీయము.

అహ మిక్ష్వాకునాథేన సగరేణ వివర్ధితః,
ఇక్ష్వాకుసచివ శ్చాయం నావసీదితు మర్హతి. 90

తథా మయా విధాతవ్యం విశ్రమేత యథా కపిః,
శేషం చ మయి విశ్రాంత స్సుఖే నాతిపతిష్యతి. 91

ఇతి కృత్వా మతిం సాధ్వీం సముద్ర శ్ఛన్న మంభసి,
హిరణ్యనాభం మైనాక మువాచ గిరిసత్తమమ్. 92

త్వ మిహాసురసంఘానాం పాతాళతలవాసినామ్,
దేవరాజ్ఞా గిరిశ్రేష్ఠ పరిఘ స్సన్నివేశితః. 93

త్వ మేషాం జాతవీర్యాణాం పునరే వోత్పతిష్యతామ్,
పాతాళ స్యాప్రమేయస్య ద్వార మావృత్య తిష్ఠసి. 94

తిర్య గూర్ధ్వ మధ శ్చైవ శక్తి స్తే శైల వర్ధితుమ్,

---

నేను ఇక్ష్వాకుప్రభువగు సగరునిచే సంవర్ధితుడ నైతిని. ఇత డిక్ష్వాకువంశజుడగు రాముని దూత. ఇతనికి కష్టము కలుగరాదు. 90

కావున ఈ హనుమంతుడు నడుమ విశ్రమించునట్లు చేయుట నాకు కర్తవ్యము. అట్లు నాకడ విశ్రమించి, తక్కిన మార్గము నవలీలగ హనుమ దాటగలడు. 91

సముద్రు డిట్లు ఉత్తమమగు ఆలోచన చేసి, తన జలములలో దాగియున్న బంగారు శిఖరములుగల పర్వతశ్రేష్ఠుడగు మైనాకుని చూచి యిట్లనెను. 92

ఓ పర్వతశ్రేష్ఠుడా! దేవేంద్రుడు పాతాళలోకమున నున్న రాక్షసులు భూమిపైకి రాకుండునట్లు ఇనుపగడియవలె నిన్నడ్డముగా నుంచినాడు. 93

బలము కూడగట్టుకొని, మఱల భూమిపైకి రాబోవు ఈ రాక్షసులను నివారించుచు నీవు విస్తృతమగు పాతాళలోకపు ద్వారమును కప్పివైచి నిలిచి యున్నావు. 94

ఓ పర్వతశ్రేష్ఠుడా! నీవు అడ్డముగను, పైకిని, క్రిందకును గూడ పెరుగగలవాడవు.

తస్మాత్ సంచోదయామి త్వా ముత్తిష్ఠ గిరిసత్తమ. 95
స ఏష కపిశార్దూల స్త్వా ముపర్యేతి వీర్యవాన్,
హనుమాన్ రామకార్యార్థం భీమకర్మా ఖ మాప్లుతః. 96
అస్య సాహ్యం మయా కార్య మిక్ష్వాకుకులవర్తినః,
మమ హీక్ష్వాకవః పూజ్యాః పరం పూజ్యతమా స్తవ. 97
కురు సాచివ్య మస్మాకం న నః కార్య మతిక్రమేత్,
కర్తవ్య మకృతం కార్యం సతాం మన్యు ముదీరయేత్. 98
సలిలా దూర్ధ్వ ముత్తిష్ఠ తిష్ఠ త్వేష కపి స్త్వయి,
అస్మాక మతిథి శ్చైవ పూజ్యశ్చ ప్లవతాం వరః. 99
చామీకరమహానాభ దేవగంధర్వసేవిత,
హనుమాం స్త్వయి విశ్రాంత స్తత శ్శేషం గమిష్యతి. 100

---

కావున నిన్ను ప్రేరణ చేయుచున్నాను. నీ వింక లెమ్ము. 95

ఈ కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు ఎల్లరకు భయము గొల్పు గొప్పపనులు నిర్వహింపజాలినవాడు. పరాక్రమశాలి. సీతాన్వేషణ మను రామకార్యము సాధించుటకు నీమీదుగా ఆకాశమార్గమున పోవుచున్నాడు. 96

ఇక్ష్వాకువంశ్యుడగు రాముని సేవించు ఈ హనుమంతునకు నేను సహాయము చేయవలయును. నాకు ఇక్ష్వాకువంశ్యులు పూజనీయులు. నీకు మిక్కిలి పూజనీయులు.

మా పని మించిపోకముందే నీవు మాకు సహాయపడుము. చేయవలసిన పని చేయనిచో సత్పురుషులు కోపింతురు. 98

కపిశ్రేష్ఠుడగు ఈ హనుమ మన కతిథి, పూజనీయుడును. కాన నీవు నీటినుండి పైకి రమ్ము. ఇతనిని నీ శిఖరములపై విశ్రమింపనిమ్ము. 99

బంగారు శిఖరములు గలవాడవు, దేవతలచే, గంధర్వులచే గూడ సేవింపబడువాడవగు మైనాకుడా! హనుమంతుడు నీపై విశ్రమించి తక్కిన మార్గమును సుఖముగ దాటగలడు. 100

కాకుత్థ్స స్యానృశంస్యం చ మైథిల్యాశ్చ వివాసనమ్,
శ్రమం చ ప్లవగేంద్రస్య సమీక్ష్యోత్థాతు మర్హసి. 101

హిరణ్యనాభో మైనాకో నిశమ్య లవణాంభసః,
ఉత్పపాత జలా త్తూర్ణం మహాద్రుమలతాయుతః. 102

స సాగరజలం భిత్త్వా బభూ వాభ్యుత్థిత స్తదా,
యథా జలధరం భిత్త్వా దీప్తరశ్మి ర్దివాకరః. 103

స మహాత్మా ముహూర్తేన సర్వత స్సలిలావృతః,
దర్శయామాస శృంగాణి సాగరేణ నియోజితః. 104

శాతకుంభనిభైః శృంగై స్సకిన్నరమహోరగైః,
ఆదిత్యోదయసంకాశై రాలిఖద్భి రివాంబరమ్. 105

తప్తజాంబూనదైః శృంగైః పర్వతస్య సముత్థితైః,

---

రామచంద్రునికి సీతపై గల మిక్కిలి దయను, సీతాదేవి పరదేశనివాసమును, హనుమంతుని శ్రమమును ఆలోచించియైన నీ విక లెమ్ము. 101

బంగారు శిఖరములు గల మైనాకుడు సముద్రుని మాటలు విని పెద్దచెట్లు, తీగలతో కూడి శీఘ్రమే సముద్రజలమునుండి పైకి వచ్చెను. 102

ప్రకాశమానములగు కిరణములు గల సూర్యుడు మబ్బును చీల్చుకొని వెలువడినట్లు, మైనాకుడును సముద్రజలమును చీల్చుకొని అప్పుడే పైకి వచ్చెను. 103

సముద్రు డట్లు మహాత్ముడగు మైనాకుని ప్రేరింపగా అతడొక్క క్షణములో జలము కార్చుచు పైకి వచ్చి తన శిఖరములను ప్రదర్శించెను. 104

ఆకాశము నంటుచున్నట్లున్న, కిన్నరులు ఉరగుల కావాసమైన తన బంగారు శిఖరములతో సూర్యోదయమువలె ప్రకాశించుచు, మైనాకుడు పైకి వచ్చెను. 105

అట్లు మేలిమి బంగారముతో నిండిన మైనాకుని శిఖరములు సముద్రము నుండి పైపైకి పెరుగగా, వాని కాంతిచే, కత్తివలె నల్లనగు ఆకాశము బంగారు వన్నె

ఆకాశం శస్త్రసంకాశ మభవత్ కాంచనప్రభమ్. 106
జాతరూపమయైః శృంగైర్ భ్రాజమానైః స్వయంప్రభైః,
ఆదిత్యశతసంకాశః సో౽భవ ద్గిరిసత్తమః. 107
త ముత్థిత మసంగేన హనుమా నగ్రతః స్థితమ్,
మధ్యే లవణతోయస్య విఘ్నో౽య మితి నిశ్చితః 108
స త ముచ్ఛ్రిత మత్యర్థం మహావేగో మహాకపిః,
ఉరసా పాతయామాస జీమూతమివ మారుతః. 109
స తథా పాతిత స్తేన కపినా పర్వతోత్తమః,
బుద్ధ్వా తస్య కపే ర్వేగం జహర్ష చ ననంద చ. 110
త మాకాశగతం వీర మాకాశే సముపస్థితః,
ప్రీతో హృష్టమనా వాక్య మబ్రవీత్ పర్వతః కపిమ్,

---

గల దయ్యెను. 106

అట్లు బంగారముతో నిండిన వగుటవే స్వప్రకాశముచేతనే వెలుగొందు శిఖరములు గల మైనాకపర్వతము నూఱ్ఱురు సూర్యులకు సాటిగా నుండెను. 107

ఆ విధముగ సముద్రము నుండి పైకి లేచి, తన యెదుట నిలచిన పర్వతమును చూచి హనుమంతుడు తన ప్రయాణము నడుమ కలిగిన విఘ్నముగా తలంచెను. 108

మహావేగము గల ఆ హనుమ, అధికముగ పైపైకి పెరిగిన ఆ పర్వతమును మబ్బును గాలి చెదరగొట్టునట్లు తన రొమ్ము తాకుతో అనాయాసముగ పడవైచెను. 109

అట్లు హనుమంతుడు పడగొట్టగా, శ్రేష్ఠుడగు మైనాకపర్వతము అతని వేగము నెఱిగి పులకించి ఆనందించెను. 110

ఆ మైనాకుడు వెంటనే మనుష్యరూపము ధరించి ఆకాశమున పోవు వీరుడగు హనుమంతునకు చేరువనే తన శిఖరముపై నిలచి, పులకితాంతరంగుడై ప్రీతితో

మానుషం ధారయన్ రూప మాత్మన శ్శిఖరే స్థితః. 111
దుష్కరం కృతవాన్ కర్మ త్వ మిదం వానరోత్తమ,
నిపత్య మమ శృంగేషు విశ్రమస్వ యథాసుఖమ్. 112
రాఘవస్య కులే జాతై రుదధిః పరివర్ధితః,
స త్వాం రామహితే యుక్తం ప్రత్యర్చయతి సాగరః. 113
కృతే చ ప్రతికర్తవ్య మేష ధర్మః సనాతనః,
సోఽయం త్వత్ప్రతికారార్థీ త్వత్త స్సమ్మాన మర్హతి. 114
త్వన్నిమిత్త మనేనాహం బహుమానాత్ ప్రచోదితః,
తిష్ఠ త్వం కపిశార్దూల మయి విశ్రమ్య గమ్యతామ్. 115
యోజనానాం శతం చాపి కపి రేష సమాప్లుతః,
తవ సానుషు విశ్రాంతః శేషం ప్రక్రమతా మితి. 116

---

నతని కిట్లనెను. 111

'వానరోత్తమా! నీ వన్యుల కలవిగాని ఈ గొప్పపని (సముద్రలంఘన ప్రయత్నము) చేసితివి. కావున నా శిఖరములపై దిగి, సేద తీరువఱకు విశ్రమింపుము. 112

ఈ సాగరుడు రాముని పూర్వులచే పెంపొందింపబడినాడు. కావున రాముని హితము కోరి పోవుచున్న నిన్నాదరించుచున్నాడు. 113

తన కుపకరించిన వానికి ప్రత్యుపకారము చేయవలయును. ఇది సనాతనధర్మము. కావున నీ వాతిథ్యము స్వీకరింపవలెనని కోరుచున్న సముద్రుని కోర్కెను తీర్చి యతనిని సత్కరింపదగుదువు. 114

"ఓ మైనాకుడా! ఈ హనుమంతుడు నూరు యోజనముల దూరము ఎగుర నుద్యమించినాడు. నడుమ నీ సానువులం దొకింత విశ్రమించి తక్కిన దూరము దాటగలడు" అని యిట్లు నీ కాతిథ్య మిచ్చుటకై సముద్రుడే నన్ను సగౌరవముగ ప్రోత్సహించినాడు. కావున ఓ కపిశ్రేష్ఠుడా! నాపై యొకింత విశ్రమించి పొమ్ము. 115,116

తదిదం గంధవత్ స్వాదు కందమూలఫలం బహు,
తదాస్వాద్య హరిశ్రేష్ఠ విశ్రాంతోఽను గమిష్యసి. 117
అస్మాక మపి సంబంధః కపిముఖ్య త్వయాఽస్తి వై,
ప్రఖ్యాత స్త్రిషు లోకేషు మహాగుణపరిగ్రహః. 118
వేగవంతః ప్లవంతో యే ప్లవంగా మారుతాత్మజ,
తేషాం ముఖ్యతమం మన్యే త్వామహం కపికుంజర. 119
అతిథిః కిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా,
ధర్మం జిజ్ఞాసమానేన కిం పున స్త్వాదృశో మహాన్. 120
త్వం హి దేవవరిష్ఠస్య మారుతస్య మహాత్మనః,
పుత్ర స్తస్యైవ వేగేన సదృశః కపికుంజర. 121
పూజితే త్వయి ధర్మజ్ఞ పూజాం ప్రాప్నోతి మారుతః,

---

వానరశ్రేష్ఠుడవగు ఓ హనుమంతుడా! మంచి రుచి, వాసనగల ఈ కందమూలములను, పండ్లను తిని, కొంత తడవు విశ్రమించి, నీ వటుపై మఱల పోవచ్చును. 117

ఓ వానరముఖ్యుడా! మాకును, నీతో ముల్లోకములలో ప్రసిద్ధమగు ఇచ్చి పుచ్చుకొను సంబంధము లేకపోలేదు. ఇది సజ్జనసమ్మతమైన అతిథ్యరూపమగు ధర్మము. 118

వాయుతనయుడ వగు కపిశ్రేష్ఠుడా! మహావేగము, ఎగురుటలో కౌశలము గల వానరులలో నిన్ను ప్రధానునిగా తలంతును. 119

ధర్మాచరణమున శ్రద్ధగల పండితునకు అతిథి సామాన్యుడైనను పూజనీయుడు. అట్టిచో నీ వంటి మహాత్ము డతిథియైనచో మా బోంట్లకు పూజనీయుడు కాకుండునా? 120

ఓ వానరశ్రేష్ఠుడా! నీవు దేవశ్రేష్ఠుడు, మహాత్ముడగు వాయుదేవుని కుమారుడవు. వేగమున నీ వతనికి సాటియైనవాడవు. 121

ధర్మ మెఱిగినవాడా! నిన్ను పూజింతునేని నీ తండ్రి వాయువును పూజించినట్లగును.

తస్మాత్త్వం పూజనీయో మే శృణు చాప్యత్ర కారణమ్. 122
పూర్వం కృతయుగే తాత పర్వతాః పక్షిణోఽభవన్,
తే హి జగ్ము ర్దిశ స్సర్వా గరుడానిలవేగినః. 123
తత స్తేషు ప్రయాతేషు దేవసంఘా స్సహర్షిభిః,
భూతాని చ భయం జగ్ము స్తేషాం పతనశంకయా. 124
తతః క్రుద్ధ స్సహస్రాక్షః పర్వతానాం శతక్రతుః,
పక్షాం శ్ఛిచ్ఛేద వజ్రేణ తత్ర తత్ర సహస్రశః. 125
స మా ముపగతః క్రుద్ధో వజ్ర ముద్యమ్య దేవరాట్,
తతోఽహం సహసా క్షిప్తః శ్వసనేన మహాత్మనా. 126
అస్మిన్ లవణతోయే చ ప్రక్షిప్తః ప్లవగోత్తమ,

---

కావున నీవు నాకు పూజనీయుడవు. నీ తండ్రి నాకు పూజనీయుడు. అందులకు కారణము చెప్పెదను వినుము. 122

నాయనా! పూర్వము కృతయుగమున పర్వతములకు ఱెక్కలుండెడివి. అందువలన అవి గరుత్మంతునివలె, వాయువువలె వేగముగ అన్ని దిక్కులకు పోవుచుండెడివి. 123

పర్వతము లట్లు ఎగురుచుండగా దేవతలు, ఋషులు, సకలజీవరాశులును ఆ పర్వతములు తమపై పడునేమో యను శంకతో భయపడినవి. 124

అంత నూఱుయాగముల నొనర్చి శతక్రతుడని ప్రసిద్ధుడైన దేవేంద్రుడు పర్వతములపై కోపించెను. తాను సహస్రాక్షుడు (వేయి కన్నులు కలవాడు) అగుటచే ఆయన వెదకి వెదకి ఎచట దొరికిన అచటనే ఆ పర్వతముల ఱెక్కలను వజ్రాయుధముతో నఱికివైచెను. 125

దేవేంద్రు డట్లు వజ్రాయుధము చెత్తి నాకడకును వచ్చెను. అపుడు మహాత్ముడగు నీ తండ్రి వాయుదేవుడు శీఘ్రమే నన్ను దూరముగా విసరివైచెను. 126

కపిశ్రేష్ఠుడా! నీ తండ్రి అట్లు విసరివేయగా నే నీ సముద్రమున బడితిని. ఆయన

గుప్తపక్షసమగ్రశ్చ తవ పిత్రాభిరక్షితః. 127

తతో౽హం మానయామి త్వాం మాన్యో హి మమ మారుతః,
త్వయా మే హ్యేష సంబంధః కపిముఖ్య మహాగుణః. 128

అస్మి న్నేవంగతే కార్యే సాగరస్య మమైవ చ,
ప్రీతిం ప్రీతమనాః కర్తుం త్వ మర్హసి మహాకపే. 129

శ్రమం మోక్షయ పూజాం చ గృహాణ కపిసత్తమ,
ప్రీతిం చ బహు మన్యస్వ ప్రీతో౽స్మి తవ దర్శనాత్. 130

ఏవముక్తః కపిశ్రేష్ఠ స్తం నగోత్తమ మబ్రవీత్.
ప్రీతో౽స్మి కృత మాతిథ్యం మన్యు రేషో౽పనీయతామ్. 131

త్వరతే కార్యకాలో మే అహశ్చా ప్యతివర్తతే,
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్య మిహాంతరే. 132

---

నన్ను రక్షించిన కారణముచే నా ఱెక్కలు చెక్కు చెదరలేదు. 127

కావున నేను నిన్ను గౌరవించుచున్నాను. నాకు వాయుదేవుడు పూజనీయుడు. కపిశ్రేష్ఠుడా! మన నడుమ ఈ శ్రేష్ఠమగు సంబంధ మున్నదని గుర్తింపుము. 128

మహాత్ముడవగు ఓ వానరుడా! సాగరునకు, నాకును సంబంధించిన పూర్వవృత్తాంత మిట్లున్నది కనుక నీవు సంతోషముతో మా యభీష్టము నంగీకరింపదగుదువు. 129

కపిశ్రేష్ఠుడా! నీ శ్రమ తీర్చుకొనుము. మా సత్కారము స్వీకరింపుము. నేను చూపుచున్న ప్రేమను మన్నింపుము. నిన్ను చూచి నే నెంతో నంతసించితిని. 130

ఇట్లు మైనాకుడు పలుకగా హనుమంతు డతని కిట్లనెను. మైనాకుడా! నీ యాదరణమునకు నంతోషించితిని. నీ దర్శనాదులే నా కాతిథ్యతుల్యములైనవి. నీ సత్కారము నంగీకరింపనైతినని కోపింపకుము. 131

నేను కర్తవ్య మనుష్ఠింపవలసిన పమయము నన్ను తొందర చేయుచున్నది. పగలు గడచిపోవుచున్నది. (చీకటి పడకముందే లంకకు పోవలెను కదా.) నేను చేసిన

ఇత్యుక్త్వా పాణినా శైల మాలభ్య హరిపుంగవః,
జగా మాకాశ మావిశ్య వీర్యవాన్ ప్రహసన్నివ. 133

స పర్వతసముద్రాభ్యాం బహుమానా దవేక్షితః,
పూజిత శ్చోపపన్నాభి రాశీర్భి రనిలాత్మజః. 134

అథోర్ధ్వం దూర ముత్పత్య హిత్వా శైలమహార్ణవౌ,
పితుః పంథాన మాస్థాయ జగామ విమలేఽంబరే. 135

భూయ శ్చోర్ధ్వగతిం ప్రాప్య గిరిం త మవలోకయన్,
వాయుసూను ర్నిరాలంబే జగామ విమలేఽంబరే. 136

తద్ ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్,
ప్రశశంసు స్సురా స్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః. 137

---

ప్రతిజ్ఞ ననుసరించి నడుమ ఎచ్చటను నిలువరాదు. (రాముడు విడచిన బాణమువలె వాయువేగముతో రావణుడు పాలించు లంకకు పోయెదనని హనుమంతుని ప్రతిజ్ఞ).

అని పలికి పరాక్రమశాలియగు హనుమంతుడు మందహాసము చేయుచు తన హస్తముతో మైనాకుని తాకి, అకాశమున కెగసి పోయెను. 133

మైనాకుడు, సముద్రుడును వాయుపుత్రుడగు ఆ హనుమంతుని మిక్కిలి ఆదరముతో చూచిరి. 'నీవలన రాముని కార్యము సఫలము కావలె'నని కార్యసిద్ధికి తగినట్లు ఆశీస్సులతో అభినందించిరి. 134

హనుమంతుడును మానవాకృతి దాల్చిన మైనాక, సముద్రులను వీడ్కొని అట నుండి పైపైకి యెగసి వాయుమార్గమును చేరి, నిర్మలాకాశమున పయనించెను. 135

అతడు ఇంకను పైపైకి పోయి, అచటనుండి మైనాకుని చూచుచు నిరాధారమగు నిర్మలాకాశమున పయనించెను. 136

మిక్కిలి అసాధ్యమైన మైనాకజయ మను హనుమంతుని రెండవ కార్యమును చూచి సకలదేవతలు, సిద్ధులు, మహర్షులును మెచ్చుకొనిరి. (సముద్రలంఘనము హనుమంతుని మొదటి దుష్కరమైన కర్మ). 137

దేవతా శ్చాభవన్ హృష్టా స్తత్రస్థా స్తస్య కర్మణా,
కాంచనస్య సునాభస్య సహస్రాక్ష శ్చ వాసవః. 138
ఉవాచ వచనం ధీమాన్ పరితోషాత్ సగద్గదమ్,
సునాభం పర్వతశ్రేష్ఠం స్వయమేవ శచీపతిః. 139
హిరణ్యనాభ శైలేంద్ర పరితుష్టోఽస్మి తే భృశమ్,
అభయం తే ప్రయచ్ఛామి తిష్ఠ సౌమ్య యథాసుఖమ్. 140
సాహ్యం కృతం తే సుమహ ద్విక్రాంతస్య హనూమతః,
క్రమతో యోజనశతం నిర్భయస్య భయే సతి. 141
రామ స్యైష హితాయైవ యాతి దాశరథే ర్హరిః,
సత్క్రియాం కుర్వతా తస్య తోషితోఽస్మి దృఢం త్వయా. 142

---

స్వర్ణమయములగు ఉత్తమశిఖరములు కల మైనాకపర్వతము చేసిన హనుమత్సాహాయ్యరూప మగు పనిని చూచి దేవతలందఱును ఆనందించిరి. వేయి కన్నులతో దానిని చూచిన దేవేంద్రుడును ప్రీతుడయ్యెను. 138

ప్రశస్తమైన బుద్ధిగల దేవేంద్రుడు, సంతోషము కారణముగా డగ్గుత్తికతో కూడిన కంఠస్వరము కలవాడై శ్రేష్ఠములగు శిఖరములు గల ఆ మైనాకునితో స్వయముగా ఇట్లు పలికెను. 139

"సౌమ్యుడవు, బంగారు శిఖరములు కలవాడవగు ఓ పర్వతశ్రేష్ఠుడా! నీ యెడల నేను సంతుష్టుడనైతిని. నీ కిటుపై నా వలన అపకారము జరుగదని అభయ మిచ్చుచున్నాను. నీ వింక జంకు విడచి సుఖముగా నుండుము. 140

హనుమంతు డాకాశమార్గమున నూరు యోజనముల దూరము దాటి పోవుచుండగా అతని కేమగునో యని మే మెల్లరము భయపడితిమి. అట్టి సందర్భమున కూడ భయపడని హనుమకు నీవు చాల సహాయము చేసితివి. 141

ఈ హనుమ దశరథమహారాజు కుమారుడగు రాముని పనుపున దూతగా పోవుచున్నాడు. నీ వతనికి చేసిన సత్కారము నన్నెంతో సంతోషింపజేసినది." 142

తతః ప్రహర్ష మగమ ద్విపులం పర్వతోత్తమః,
దేవతానాం పతిం దృష్ట్వా పరితుష్టం శతక్రతుమ్. 143

స వై దత్తవర శ్శైలో బభూ వావస్థిత స్తదా,
హనుమాంశ్చ ముహూర్తేన వ్యతిచక్రామ సాగరమ్. 144

తతో దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః,
అబ్రువన్ సూర్యసంకాశాం సురసాం నాగమాతరమ్. 145

అయం వాతాత్మజ శ్శ్రీమాన్ ప్లవతే సాగరోపరి,
హనుమా న్నామ తస్య త్వం ముహూర్తం విఘ్న మాచర. 146

రాక్షసం రూప మాస్థాయ సుఘోరం పర్వతోపమమ్,
దంష్ట్రాకరాళం పింగాక్షం వక్త్రం కృత్వా నభస్సమమ్. 147

బల మిచ్ఛామహే జ్ఞాతుం భూయ శ్చాస్య పరాక్రమమ్,

---

దేవరాజగు ఇంద్రు డట్లు సంతసించుట చూచి పర్వతశ్రేష్ఠుడగు మైనాకుడును మిక్కిలి యానందించెను. 143

మైనాకు డట్లు దేవేంద్రునిచే నభయము పొంది, (హనుమంతుడు మఱలి వచ్చుటను ప్రతీక్షించుచు నీటిలో మునుగక) యట్లే నిలిచి యుండెను. హనుమంతుడును ముహూర్త కాలములో ఆ (సముద్ర) ప్రదేశమును గడచి ముందుకు పోయెను. 144

అంత దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు సూర్యుని వలె ప్రకాశించు నాగమాత యగు సురస యను నామె కిట్లనిరి. 145

వాయుపుత్రుడగు ఈ హనుమ సుదూరప్రయాణముచే గూడ అలసిపోక సముద్రముపై ఎగురుచున్నాడు. నీవు పెనుకోరలతో, గోరోచనపు వన్నెగల కన్నులతో భయంకరమై, పర్వతమువలె విపులమగు రాక్షసరూపము దాల్చి, నోటి నాకాశమువలె విపుల మొనర్చి హనుమంతుని గమనమునకు ముహూర్తకాలము విఘ్నము కలిగించుము. 146,147

మేము హనుమంతుని బలమును, శత్రువులను జయింపజాలిన అతని

త్వాం విజేష్య త్యుపాయేన విషాదం వా గమిష్యతి. 148
ఏవ ముక్తా తు సా దేవీ దైవతై రభిసత్కృతా,
సముద్రమధ్యే సురసా బిభ్రతీ రాక్షసం వపుః. 149
వికృతం చ విరూపం చ సర్వస్య చ భయావహమ్,
ప్లవమానం హమామంత మావృత్యేద మువాచ హ. 150
మమ భక్షః ప్రదిష్ట స్త్వ మీశ్వరై ర్వానరర్షభ,
అహం త్వాం భక్షయిష్యామి ప్రవిశేదం మమాననమ్. 151
ఏవ ముక్త స్సురసయా ప్రాంజలి ర్వానరర్షభః,
ప్రహృష్టవదనః శ్రీమా నిదం వచన మబ్రవీత్. 152
రామో దాశరథి ర్నామ ప్రవిష్టో దండకావనమ్,
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా. 153
అన్యకార్యవిషక్తస్య బద్ధవైరస్య రాక్షసైః,

---

పరాక్రమమును తెలియగోరుచున్నాము. అతడు నిన్ను ఉపాయముతో జయించునో లేక భీతిల్లి విషాదము నొందునో చూచెదము. 148

అని దేవత లట్లు తన్ను కోరి సత్కరించగా ఆ సురసాదేవి సముద్రమధ్యమున అనహజము, వికృతము, ఎల్లరకు భయంకరము అగు రాక్షసరూపము దాల్చి ఎగురుచున్న హనుమంతుని మార్గమున కడ్డు నిలచి యిట్లనెను. 149,150

ఓ వానరశ్రేష్ఠుడా! దేవతలు నిన్ను నా కాహారముగా నిర్దేశించిరి. నే నిదే నిన్ను భక్షింతును. నీవు నానోట ప్రవేశింపుము. 151

అని యిట్లు సురస పలుకగా అ వానరశ్రేష్ఠుడు, మిక్కిలి హర్షముతో ప్రకాశమానుడై ఆమెకు ప్రణామము చేసి ఇట్లనెను. 152

దశరథమహారాజు తనయుడగు రాముడు తమ్ముడగు లక్ష్మణునితోడను, భార్య సీతతోడను దండకారణ్యమున ప్రవేశించినాడు. 153

శూర్పణఖ ముక్కు, చెవులు కోయుట మున్నగు పనులచే రాక్షసులతో శత్రుత్వము

తస్య సీతా హృతా భార్యా రావణేన యశస్వినీ. 154

తస్యా స్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్,
కర్తు మర్హసి రామస్య సాహ్యం విషయవాసిని. 155

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్,
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే. 156

ఏవ ముక్తా హనుమతా సురసా కామరూపిణీ,
అబ్రవీ న్నాతివర్తే న్మాం కశ్చి దేష వరో మమ. 157

---

గొందిన రాముడు మాయామృగమును పట్టుటకై పోగా, అతని భార్య, యశస్విని యగు సీతను రావణు డపహరించినాడు. 154

నేను రామునాజ్ఞ తల దాల్చి దూతనై సీతాదేవి కడ కేగెదను. నీవు రాముని రాజ్యమం దున్నదానవు. కావున రామునకు సహాయము చేయదగుదువు. 155

అట్లు కాదేని, సీతాదేవిని చూచి, పిమ్మట అవలీలగా కార్యములు సాధించురాముని దర్శించి వచ్చి నీ నోట పడెదను. నా మాట నిజము. నీ కిదే ప్రతిజ్ఞచేయుచున్నాను. 156

అని యిట్లు హనుమ పలుకగా కామరూపిణియగు ఆ సురస "ఓయీ! నన్నతిక్రమించి యెవ్వడును పోజాలడు. నా కట్టి వరమున్న" దనెను. 157

---

157వ శ్లోకము తరువాత కొన్ని ప్రతులలో కనుపించు క్రింది శ్లోకములు ప్రక్షిప్తములు, అసంగతములును. నూరు యోజనములు హనుమ పెరుగుచో సముద్రము వెడల్పును అంతే కనుక ఇటు వానరులు, అటు రాక్షసులును హనుమంతుని తప్పక తెలిసికొని యుండెడివారు (గోవిందరాజీయము). ఆ శ్లోకము లివి.

తం ప్రయాంతం సముద్వీక్ష్య సురసా వాక్య మబ్రవీత్ ,
బలం జిజ్ఞాసమానా వై నాగమాతా హనూమతః. 1
ప్రవిశ్య వదనం మేఽద్య గంతవ్యం వానరోత్తమ,
వర ఏష పురా దత్తో మమ ధాత్రేతి సత్వరా,
వ్యాదాయ వక్త్రం విపులం స్థితా సా మారుతేః పురః. 2
ఏవ ముక్తః సురసయా క్రుద్ధో వానరపుంగవః,
అబ్రవీత్ కురు వై వక్త్రం యేన మాం విషహిష్యసే. 3

తద్దృష్ట్వా వ్యాదితం త్వాస్యం వాయుపుత్ర స్సుబుద్ధిమాన్,
సుసంక్షి ప్యాత్మనః కాయం బభూ వాంగుష్ఠమాత్రకః. 158

---

బుద్ధిమంతుడగు హనుమంతు డట్లు తెఱచిన యామె నోటిని చూచి, తన శరీరమును మిక్కిలి తగ్గించుకొని బొటనవ్రేలి పరిమాణము కలవాడయ్యెను. 158

---

ఇత్యుక్త్వా సురసాం క్రుద్ధో దశయోజన మాయతః,
దశయోజనవిస్తారో బభూవ హనుమాం స్తదా. 4
తం దృష్ట్వా మేఘసంకాశం దశయోజన మాయతమ్,
చకార సురసా చాస్యం వింశద్యోజన మాయతమ్. 5
హనుమాంస్తు తతః క్రుద్ధ స్త్రింశద్యోజన మాయతః,
చకార సురసా వక్త్రం చత్వారింశ త్తథోచ్ఛ్రితమ్. 6
బభూవ హనుమాన్ వీరః పంచాశద్యోజనోచ్ఛ్రితః,
చకార సురసా వక్త్రం షష్టియోజన మాయతమ్. 7
తథైవ హనుమా న్వీరః సప్తతీయోజనోచ్ఛ్రితః,
చకార సురసా వక్త్ర మశీతీయోజనాయతమ్. 8
హనుమా నచలప్రఖ్యో నవతీయోజనోచ్ఛ్రితః,
చకార సురసా వక్త్రం శతయోజన మాయతమ్. 9

వీని భావమిది: నాగమాత సురస, ఆకాశమున పోవుచున్న హనుమంతుని చూచి, అతని బలమెట్టిదో తెలిసికొన దలచి అతనితో 'ఓ వానరోత్తమా! నీవిపుడు నా నోట ప్రవేశించియే పోవలెను. నాకిది వెనుక బ్రహ్మ యిచ్చిన వరము" అని పలికి శీఘ్రమే తన విశాలమగు నోరు తెఱచి హనుమంతుని యెదుట నిలచెను. సురస మాటలు విని హనుమంతుడు కోపించి "నీవు నన్ను మ్రింగగోరితివి గదా. దానికి తగినట్లు నీ నోరు తెఱచి చూపు" మని పలికి పది యోజనములు పెరిగెను. అట్లు పదియోజనములు పెరిగి మేఘమువలె నున్న హనుమను చూచి సురస తన నోటి నిరువది యోజనములు విస్తరింపజేసెను. దానిని చూచి కోపించిన హనుమ ముప్పది యోజనములు పెరిగెను. అంత సురస తన నోటిని నలుబది యోజనములు పెంచెను. అంత హనుమంతుడు ఏబది యోజనములు శరీరము పెంచెను. సురస అరువది యోజనములు నోరు పెంచెను. వీరుడగు హనుమంతుడు డెబ్బది యోజనములు శరీరము పెంచెను. సురస తన నోటిని ఎనుబది యోజనములు విస్తరింపజేసెను. కొండవలె నున్న హనుమంతుడు తన శరీరమును తొంబది యోజనములు పెంచెను. సురస తన నోటిని నూరు యోజనములు పెంచెను.

సోఽభిపత్యాశు తద్వక్త్రం నిష్పత్య చ మహాజవః,
అంతరిక్షే స్థితః శ్రీమా నిదం వచన మబ్రవీత్. 159

ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే,
గమిష్యే యత్ర వైదేహీ సత్యం చాసీ ద్వర స్తవ. 160

తం దృష్ట్వా వదనా న్ముక్తం చంద్రం రాహుముఖా దివ,
అబ్రవీత్ సురసా దేవీ స్వేన రూపేణ వానరమ్. 161

అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్,
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా. 162

తత్ తృతీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్,
సాధు సాధ్వితి భూతాని ప్రశశంసు స్తదా హరిమ్. 163

స సాగర మనాధృష్య మభ్యేత్య వరుణాలయమ్,

---

మహావేగము గల హనుమంతుడు శీఘ్రమే యామె నోట ప్రవేశించి, బయటకు వచ్చి, ఆకాశమున నిలచి ఉత్సాహముతో ప్రకాశమానుడై యిట్లనెను. 159

'ఓ దాక్షాయణీ! నీ కిదే నమస్కారము. నేను నీ నోట ప్రవేశించి వెలువడుటచే బ్రహ్మవర మిపుడు సత్యమయ్యెను కదా. వే నిపుడు సీతమ్మ కడ కేగెదను. 160

అంతట సురస తన సహజరూపము దాల్చి, రాహువు నోటినుండి వెలికి వచ్చిన చంద్రునివలె తన నోటినుండి వెలువడిన హనుమంతునితో నిట్లనెను. 161

'ఋజుప్రవర్తన గల ఓ కపిశ్రేష్ఠుడా! నీ వింక సుఖముగ పోయి రమ్ము. సీతాదేవిని మహాత్ముడగు రాముని కడకు చేర్చుము.' 162

మిక్కిలి దుష్కరమగు హనుమంతుని యా మూడవ కార్యమును చూచి భూతములు బాగు బాగని అతనిని ప్రశంసించినవి. 163

వేగమున గరుడునకు సాటియగు హనుమంతుడును ఆకాశమార్గము జేరి

జగా మాకాశ మావిశ్య వేగేన గరుడోపమః. 164
సేవితే వారిధారాభిః పతగైశ్చ నిషేవితే,
చరితే కైశికాచార్యై రైరావతనిషేవితే. 165
సింహకుంజరశార్దూల పతగోరగవాహనైః,
విమానై స్సంపతద్భిశ్చ విమలై స్సమలంకృతే. 166
వజ్రాశనిసమాఘాతైః పావకై రుపశోభితే,
కృతపుణ్యై ర్మహాభాగైః స్వర్గజిద్భి రలంకృతే. 167
వహతా హవ్య మత్యర్థం సేవితే చిత్రభానునా,
గ్రహనక్షత్రచంద్రార్క తారాగణవిభూషితే. 168
మహర్షిగణగంధర్వ నాగయక్షసమాకులే,
వివిక్తే విమలే విశ్వే విశ్వావసునిషేవితే. 169

---

ఎదిరింపరాని ఆ సముద్రముపై యెప్పటివలె వెడలిపోయెను. 164

అతడు, మేఘములు కురిపించు వర్షధారలతో కూడినది, పక్షులు సంచరించునది, కైశికరాగ మాలపించు విద్యాధరులు విహరించునది, ఇంద్రధనుస్సుతో కూడినది, (లేదా ఐరావతమను ఇంద్రుని ఏనుగు విహరించునది), సింహములు, ఏనుగులు, పులులు, పక్షులు, సర్పములు లాగుచుండగా వేగముగ పోవు సుందరవిమానములు కలది, వజ్రము, పిడుగులు ఢీకొన్నట్లు అగ్నులు (తేజోవంతములగు నక్షత్రములు) ఢీకొనుట వల్ల ఏర్పడిన వెలుగులు కలది, పుణ్యము చేసి, స్వర్గమును సాధించిన మహాత్ములతో శోభిల్లునది, తక్కిన దేవతలకు హవిస్సును చేర్చుటకు అగ్నిదేవుడు తిరుగాడునది, గ్రహములు, అశ్విన్యాదిసప్తవింశతి (27) ప్రసిద్ధనక్షత్రములు, సూర్యచంద్రులు, తక్కిన నక్షత్రములు ప్రకాశించునది, మహామునులు, గంధర్వులు, నాగులు, యక్షులు అంతటను కలది, వ్యాపనశీలమైనది అగుటచే జనసమ్మర్దము లేక నిర్మలమైనది, విశ్వావసు వను గంధర్వరాజు విహరించునది, దేవేంద్రుని ఐరావతమను యేనుగు తిరుగాడునది, చంద్రసూర్యులు పయనించు మార్గమైనది, శుభకరమైనది,

దేవరాజగజాక్రాంతే చంద్రసూర్యపథే శివే,
వితానే జీవలోకస్య వితతే బ్రహ్మనిర్మితే. 170

బహుశ స్సేవితే వీరై ర్విద్యాధరగణై ర్వరైః,
జగామ వాయుమార్గే తు గరుత్మానివ మారుతిః. 171

ప్రదృశ్యమాన స్సర్వత్ర హనుమాన్ మారుతాత్మజః,
భేజేఽంబరం నిరాలంబం లంబపక్ష ఇవాద్రిరాట్. 172

ప్లవమానం తు తం దృష్ట్వా సింహికా నామ రాక్షసీ,
మనసా చింతయామాస ప్రవృద్ధా కామరూపిణీ. 173

అద్య దీర్ఘస్య కాలస్య భవిష్యా మ్యహ మాశితా,
ఇదం హి మే మహత్ సత్త్వం చిరస్య వశ మాగతమ్. 174

ఇతి సంచింత్య మనసా ఛాయా మస్య సమాక్షిపత్,
ఛాయాయాం గృహ్యమాణాయాం చింతయామాస వానరః. 175

---

విస్తృతమై జీవుల కెల్లరికి పైభాగమున బ్రహ్మచే నిర్మితమైన చాందినీ అయినది, వీరులు, శ్రేష్ఠులగు విద్యాధరుల కాటపట్టయినది అగు వాయుమార్గమున గరుత్మంతునివలె పోయెను. 165-171

వాయునందనుడగు హనుమంతుడు పొడవైన రెక్కలు కల పర్వతరాజు వలె అన్నివైపులకును అగపడుచు నిరాధారమగు ఆకాశమున పయనించెను. 172

కోరిన రూపము పొందగల సింహిక యను రాక్షసి అట్లు సముద్రము దాటుచున్న హనుమంతుని చూచి సంతోషముతో నుప్పొంగి తన మదిలో నిట్లు తలంచెను. 173

“చాలకాలమునకు పిమ్మట నేడు నాకు ఆహారము తినని లోటు తీరనున్నది. చిరకాలమునకు నా కీ పెద్ద ప్రాణి చేత జిక్కినది”. 174

అని మదిలో తలచి యా సింహక హనుమంతుని నీడను పట్టి లాగెను. అట్లు లాగుచుండగా హనుమంతు డిట్లు తలంచెను. 175

సమాక్షిప్తోఽస్మి సహసా పంగూకృతపరాక్రమః,
ప్రతిలోమేన వాతేన మహానౌ రివ సాగరే. 176

తిర్య గూర్ధ్వ మధశ్చైవ వీక్షమాణ స్తతః కపిః,
దదర్శ స మహత్ సత్త్వ ముత్థితం లవణాంభసి. 177

తద్ దృష్ట్వా చింతయామాస మారుతి ర్వికృతాననమ్. 178

కపిరాజేన కథితం సత్త్వ మద్భుతదర్శనమ్,
ఛాయాగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః. 179

స తాం బుద్ధ్వాఽర్థతత్త్వేన సింహికాం మతిమాన్ కపిః,
వ్యవర్ధత మహాకాయః ప్రావృషీవ వలాహకః. 180

తస్య సా కాయ ముద్వీక్ష్య వర్ధమానం మహాకపేః,
వక్త్రం ప్రసారయామాస పాతాళాంతరసన్నిభమ్,

---

"సముద్రమున ఎదురు గాలిచే పెద్ద ఓడవలె, వేగమంతయు కోల్పోతిని. ఒక్కమారుగా నన్నెవరో పట్టి (వెనుకకు) లాగివేయుచున్నారు." 176

పిమ్మట హనుమంతుడు ప్రక్కలకు, పైకి, క్రిందకు చూచుచు తుదకు సముద్రము నుండి పైకి లేచిన యొక పెద్ద జంతువును చూచెను. 177

వికృతమగు ముఖముగల దానిని చూచి హనుమంతు డిట్లు తలంచెను. 178

చూచుటకు ఆశ్చర్యము కలిగించుచు, మహాపరాక్రమము కలదై, ఏ జీవిదైనను దాని నీడను పట్టి తనవైపు లాగగల ఈ జంతువు సుగ్రీవుడు తెలిపినదే. ఇందు సందేహము లేదు. 179

బుద్ధిశాలియగు హనుమంతుడు తన నీడను పట్టి లాగుట అను కార్యముచే అది సింహికయే యని గుర్తించి వర్షాకాలపు మేఘమువలె తన దేహమును పెంచెను. 180

సింహికయు ఆ పెనుకోతి యగు హనుమంతుని శరీర మట్లు పెరుగుట చూచి, పాతాళబిలము వంటి తన నోరు తెఱచెను. మేఘపంక్తివలె గర్జించుచు హనుమంతుని

ఘనరాజీవ గర్జంతీ వానరం సమభిద్రవత్. 181

స దదర్శ తత స్తస్యా వివృతం సుమహ న్ముఖమ్,
కాయమాత్రం చ మేధావీ మర్మాణి చ మహాకపిః. 182

స తస్యా వివృతే వక్త్రే వజ్రసంహననః కపిః,
సంక్షిప్య ముహు రాత్మానం నిష్పపాత మహాబలః. 183

ఆస్యే తస్యా నిమజ్జంతం దదృశు స్సిద్ధచారణాః,
గ్రస్యమానం యథా చంద్రం పూర్ణం పర్వణి రాహుణా. 184

తత స్తస్యా నఖై స్తీక్ష్ణై ర్మర్మా ణ్యుత్కృత్య వానరః,
ఉత్పపా తాథ వేగేన మనస్సంపాతవిక్రమః. 185

తాం తు దృష్ట్వా చ ధృత్యా చ దాక్షిణ్యేన నిపాత్య చ,
స కపిప్రవరో వేగా ద్వవృధే పున రాత్మవాన్. 186

హృతహృత్ సా హనుమతా పపాత విధురాఽంభసి. 187

---

చెంబడించెను. అంతట మేధావి యగు హనుమంతుడు తన్ను కబళింపజాలునట్లు తెఱచిన ఆమె పెద్ద నోటిని, దేహపరిమాణమును, ప్రాణస్థానములను చూచెను181,182

వజ్రము వలె కఠినమైన దేహము గల మహాబలుడగు హనుమంతుడు తన శరీరమును క్రమముగా తగ్గించుకొని, తెఱచుకొన్న యామె నోట ప్రవేశించెను. 183

అట్లామె నోటపడుచు పర్వసమయమున రాహువు మ్రింగు పూర్ణచంద్రునివలె నున్న హనుమంతుని సిద్ధులు, చారణులును చూచిరి. 184

పిమ్మట హనుమంతు డామె అయువుపట్టును తన వాడి గోళ్ళతో చీల్చి, మనోగమనమును పోలిన వేగముతో (ఆమె తన నోరు మూసికొనుటకు పూర్వమే) పైకెగసెను. 185

ప్రశస్తమగు బుద్ధిగల హనుమంతు డామెను దూరమునుండియే చూచుటచేతను,

తాం హతాం వానరేణాశు పతితాం వీక్ష్య సింహికామ్,
భూతా న్యాకాశచారీణి తమూచుః ప్లవగోత్తమమ్. 188

భీమ మద్య కృతం కర్మ మహత్ సత్త్వం త్వయా హతమ్,
సాధయార్థ మభిప్రేత మరిష్టం ప్లవతాం వర. 189

యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర యథా తవ,
ధృతి ర్దృష్టి ర్మతి ర్దాక్ష్యం స కర్మసు న సీదతి. 190

స తై స్సంభావితః పూజ్యః ప్రతిపన్నప్రయోజనః,
జగా మాకాశ మావిశ్య పన్నగాశనవత్ కపిః. 191

ప్రాప్తభూయిష్ఠపారస్తు సర్వతః ప్రతిలోకయన్,

---

ధైర్యముచేతను, సామర్థ్యముచేతను పడవైచి, మఱల వేగముగ పెరిగెను. అతడట్లు గుండెను చీల్చగా ఆ సింహిక మృతినొంది నీటబడెను. 186-187

అట్లు హనుమంతుడు చంపగా నీటబడిన సింహికను చూచి ఆకాశసంచారులగు భూతము లతని కిట్లనెను. 188

వానరశ్రేష్ఠుడా! నీ విపు డొక గొప్ప జంతువును సంహరించి భీకరకార్యము సాధించితివి. ఇటుపై నీ యభీష్టమును శుభముగా సాధింపుము. 189

ఓ వానరశ్రేష్ఠుడా! నీవలె ధైర్యము, సూక్ష్మదృష్టి, బుద్ధికుశలత, సామర్థ్యము కలవాడు తాను చేపట్టిన పనులలో ఎన్నడును చెఱుపు నొందడు. 190

ఈ విధముగా సురసను జయించి, సింహికను సంహరించి, తన పని కడ్డు తొలగించుకొనిన పూజనీయుడగు హనుమంతుని ఆకాశచారులగు భూతములు గౌరవించినవి. పిమ్మట హనుమ ఆకాశమున కెగసి గరుడునివలె సాగిపోయెను. 191

హనుమంతు డట్లు నూఱు యోజనములు గడచి, ఇంచుమించుగా సముద్రపు అవ్వలి తీరమును చేరి అన్ని దిక్కులు పరికించి తీరమందు అడవుల వరుసను

యోజనానాం శతస్యాంతే వనరాజిం దదర్శ సః. 192

దదర్శ చ పతన్నేవ వివిధద్రుమభూషితమ్,
ద్వీపం శాఖామృగశ్రేష్ఠో మలయోపవనాని చ. 193

సాగరం సాగరానూపం సాగరానూపజాన్ ద్రుమాన్,
సాగరస్య చ పత్నీనాం ముఖాన్యపి విలోకయన్. 194

స మహామేఘసంకాశం సమీక్ష్యాత్మాన మాత్మవాన్,
నిరుంధంత మివాకాశం చకార మతిమాన్ మతిమ్. 195

కాయవృద్ధిం ప్రవేగం చ మమ దృష్ట్వైవ రాక్షసాః,
మయి కౌతూహలం కుర్యు రితి మేనే మహాకపిః. 196

తత శ్శరీరం సంక్షిప్య తన్మహీధరసన్నిభమ్,
పునః ప్రకృతి మాపేదే వీతమోహ ఇవాత్మవాన్. 197

---

చూచెను. 192

అత డట్లాకాశమున పోవుచునే పలువిధములగు చెట్లతో గూడిన ద్వీపమును, మలయపర్వతముపై తోటలను, నముద్రమును, దాని తీరమందలి నీటిమడుగులను, వాని ప్రక్క మొలచిన చెట్లను, నదీముఖములను చూచుచు పోయెను. 193, 194

పిమ్మట మహామేఘనదృశమై ఆకాశము నడ్డగించుచున్నటులున్న తన పెద్ద దేహమును చూచుకొని బుద్ధిశాలి కావున హనుమ ఇట్లు తలంచెను. 195

“పెరిగిన నా యీ శరీరమును, వేగమును చూడగనే రాక్షసులకు నేనెవ్వరో తెలిసికొనవలెనని, నన్ను పట్టవలెనని కుతూహలము కలుగక మానదు”. 196

అట్లు తలంచి, పర్వతాకారమగు తన శరీరమును చిన్నదిగా చేసికొని హనుమంతుడు, అజ్ఞానము తొలగిన జీవునివలె తన సహజరూపమును పొందెను. 197

తద్రూప మతిసంక్షిప్య హనుమాన్ ప్రకృతౌ స్థితః,
త్రీన్ క్రమానివ విక్రమ్య బలివీర్యహరో హరిః. 198

స చారునానావిధరూపధారీ, పరం సమాసాద్య సముద్రతీరమ్,
పరై రశక్యః ప్రతిపన్నరూప, స్సమీక్షితాత్మా సమవేక్షితార్థః. 199

తత స్స లంబస్య గిరే స్సమృద్ధే, విచిత్రకూటే నిపపాత కూటే,
సకేతకోద్దాలకనాలికేరే, మహాద్రికూటప్రతిమో మహాత్మా. 200

తతస్తు సంప్రాప్య సముద్రతీరం,
సమీక్ష్య లంకాం గిరివర్యమూర్ధ్ని,
కపిస్తు తస్మిన్నిపపాత పర్వతే,
విధూయ రూపం వ్యథయన్ మృగద్విజాన్. 201

---

హనుమంతుడు, మూడడుగులు మాత్రమే వేసి బలిచక్రవర్తి పరాక్రమగర్వము నణచి వామనుడు తన పూర్వరూపము దాల్చినట్లు తన రూపమును మిక్కిలి తగ్గించుకొని సహజరూపము దాల్చెను. 198

సుందరములగు వివిధరూపములు దాల్చగల హనుమంతు డట్లు అన్యుల కలవి కానివాడై సముద్రపు టవ్వలి యొడ్డున కేగి, తన పెనుశరీరమును చూచుకొని, తాను చేయవలసిన పని నూహించి, తన సహజరూపము దాల్చెను. 199

అంతట గొప్ప కొండశిఖరము వలె నున్న మహాత్ముడగు ఆ హనుమంతుడు, వివిధశిఖరములతో ఒప్పుచు, మొగలిపొదలు విరిగిచెట్లు కొబ్బరిచెట్లతో సుసంపన్నమై ఆకాశమునుండి వ్రేలాడుచున్నదో అన్నట్లు కొనలు తెలియరాకున్నదై వివిధాశ్చర్యములకు ఆలవాలమైన పర్వతశ్రేణికి చెందిన ఒక శిఖరముపై దిగెను. 200

అట్లు తన రూపమును సంక్షేపించుకొనిన హనుమంతుడు సముద్రతీరమును చేరి, లంబపర్వతశిఖరముపై నున్న లంకానగరమును చూచి, అచటి మృగములకు, పక్షులకు భయము కలిగించుచు ఆ కొండపై దిగెను. 201

స సాగరం దానవపన్నగాయుతం
బలేన విక్రమ్య మహోర్మిమాలినమ్,
నిపత్య తీరే చ మహోదధే స్తదా దదర్శ
లంకా మమరావతీ మివ. 202

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ప్రథమః సర్గః.*

---

ఆ హనుమంతు డట్లు దానవులు, పన్నగులు కలదై, పెద్ద పెద్ద అలల వరుసలతో కూడిన సముద్రమును తన బలముతో దాటి, తీరము చేరి యచట అమరావతివలె నున్న లంకానగరమును చూచెను. 202

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమందు*
*సుందరకాండమున ప్రథమసర్గము.*

# 2. ద్వితీయః సర్గః

*(హనుమంతుడు సముద్రము దాటి లంకను చూచుట)*

స సాగర మనాధృష్య మతిక్రమ్య మహాబలః,
త్రికూటశిఖరే లంకాం స్థితాం స్వస్థో దదర్శ హ. 1

తతః పాదపముక్తేన పుష్పవర్షేణ వీర్యవాన్,
అభివృష్టః స్థిత స్తత్ర బభౌ పుష్పమయో యథా. 2

యోజనానాం శతం శ్రీమాం స్తీర్త్వాఽప్యుత్తమవిక్రమః,
అనిశ్వసన్ కపి స్తత్ర న గ్లాని మధిగచ్ఛతి. 3

శతా న్యహం యోజనానాం క్రమేయం సుబహూన్యపి,
కిం పున స్సాగర స్యాంతం సంఖ్యాతం శతయోజనమ్. 4

స తు వీర్యవతాం శ్రేష్ఠః ప్లవతామపి చోత్తమః,

---

మహాబలుడగు హనుమంతు డట్లు దాటరాని సముద్రమును దాటి, సేదతీరి, త్రికూటపర్వతశిఖరముపై నున్న లంకానగరమును చూచెను. 1

అపు డా పర్వతమందలి చెట్లు పూలవాన కురిపించెను. పరాక్రమశాలి యగు హనుమంతు డా పూలలో నిండి, పూలతో చేయబడిన కోతివలె నుండెను. 2

శ్రీమంతుడు, శ్రేష్ఠమైన వేగము (లేక గొప్ప పరాక్రమము) కలవాడగు హనుమంతు డట్లు నూరుయోజనముల వెడలుపు కల సముద్రము దాటియు, కొంచెమైనను నిట్టూర్చలేదు. ఆయాసపడలేదు. 3

"వందలాది యోజనములు కూడ దాటగల నాకు నూరు యోజనముల దూరమే యున్న యీ సాగరము దాటుటెంత" అని హనుమ తలంచెను. 4

పరాక్రమశాలులు, ఎగురుటలో సమర్థులగు వానరులలో మేటియగు

జగామ వేగవాన్ లంకాం లంఘయిత్వా మహోదధిమ్. 5

శాద్వలాని చ నీలాని గంధవంతి వనాని చ,
గండవంతి చ మధ్యేన జగామ నగవంతి చ. 6

శైలాంశ్చ తరుసంఛన్నాన్ వనరాజీశ్చ పుష్పితాః,
అభిచక్రామ తేజస్వీ హనుమాన్ ప్లవగర్షభః. 7

స తస్మి న్నచలే తిష్ఠన్ వనా న్యుపవనాని చ,
స నగాగ్రే చ తాం లంకాం దదర్శ పవనాత్మజః. 8

సరళాన్ కర్ణికారాంశ్చ ఖర్జూరాంశ్చ సుపుష్పితాన్,
ప్రియాళాన్ ముచుళిందాంశ్చ కుటజాన్ కేతకానపి. 9

ప్రియంగూన్ గంధపూర్ణాంశ్చ నీపాన్ సప్తచ్ఛదాం స్తథా,
అసనాన్ కోవిదారాంశ్చ కరవీరాంశ్చ పుష్పితాన్. 10

పుష్పభారనిబద్ధాంశ్చ తథా ముకులితా నపి,

---

హనుమంతుడు గొప్ప వేగముతో మహాసముద్రమును దాటి లంకను వేరెను. 5

వానరశ్రేష్ఠుడు, తేజశ్శాలియగు హనుమంతుడు నల్లని పచ్చికపట్టులను, మంచి వాసనలు గుబాళించు అడవులను, పెనురాలతో కూడి, నడుమ ప్రశస్తవృక్షములు కల వనములను దాటి, చెట్లతో నిండిన కొండలను, పూచిన వనసమూహములను గడచి ముందునకు పోయెను. 6-7

ఆ వాయుపుత్రుడు లంబగిరిపై నిలిచి అడవులను, పూదోటలను చూచుచు, త్రికూటాచలశిఖరమున లంకానగరమును తిలకించెను. 8

ఆ హనుమంతు డచట చక్కగా పూసిన సరళవృక్షములను, కొండగోగులను, ఖర్జూరపు చెట్లను, మోరటచెట్లను, నిమ్మచెట్లను, కొండమల్లెచెట్లను, మొగలిచెట్లను, సుగంధము గల పిప్పలిచెట్లను, మంకెనచెట్లను, ఏడాకుల అరటులను, వేగిసచెట్లను, దేవకాంచనవృక్షములను, పూచిన గన్నేరుచెట్లను, పూలబరువునకు కొంచెము వంగినవి,

పాదపాన్ విహగాకీర్ణాన్ పవనాధూతమస్తకాన్. 11
హంసకారండవాకీర్ణా వాపీః పద్మోత్పలాయుతాః,
ఆక్రీడాన్ వివిధాన్ రమ్యాన్ వివిధాంశ్చ జలాశయాన్. 12
సంతతాన్ వివిధైర్ వృక్షై స్సర్వర్తుఫలపుష్పితైః,
ఉద్యానాని చ రమ్యాణి దదర్శ కపికుంజరః. 13
సమాసాద్య చ లక్ష్మీవాన్ లంకాం రావణపాలితామ్,
పరిఖాభి స్సపద్మాభి స్సోత్పలాభి రలంకృతామ్. 14
సీతాపహరణార్థేన రావణేన సురక్షితామ్,
సమంతా ద్విచరద్భిశ్చ రాక్షసై రుగ్రధన్విభిః. 15
కాంచనే నావృతాం రమ్యాం ప్రాకారేణ మహాపురీమ్,
గృహైశ్చ గ్రహసంకాశై శ్శారదాంబుదసన్నిభైః. 16
పాండురాభిః ప్రతోళీభి రుచ్చాభి రభిసంవృతామ్,

మొగ్గలు తొడిగినవి, పక్షులతో నిండినవి, గాలికి కదలాడు కొమ్మల కొనలు కలవి అగు చెట్లను, హంసలు కారండవము లను పక్షులు వ్యాపించియుండగా, తామరలతో కలువలతో కూడియున్న పెద్ద బావులను, పలువిధములగు జన సామాన్య యోగ్యములగు సుందర క్రీడాస్థానములను, సర్వర్తువులలో పండు పండ్లతో, పూలతో శోభిల్లు పలుచెట్లతో వ్యాప్తమైన రాజయోగ్య సుందరోద్యానములను, వివిధ సరోవరములను చూచెను. 9-13

అట్లు జయహేతుకమగు కాంతితో విలసిల్లు హనుమంతుడు, రావణుడు పాలించు లంకను చేరెను. ఆ లంకాపురి చుట్టును గల అగడ్తలు తామరలు, కలువలతో విలసిల్లు చుండెను. సీత నపహరించుకొని వచ్చుటచే రావణుడు, పెద్దపెద్ద విండ్లు ధరించి నలుదిక్కులందు తిరుగాడు రాక్షసుల నా లంకకు కావలి యుంచెను. ఆ మహానగరము బంగారుపూతతో కూడిన ప్రాకారములతో నుందరముగ నుండెను.

అట్టాలకశతాకీర్ణాం పతాకాధ్వజమాలినీమ్. 17
తోరణైః కాంచనై ర్దివ్యై ర్లతాపంక్తివిచిత్రితైః,
దదర్శ హనుమాన్ లంకాం దివి దేవపురీమివ. 18
గిరిమూర్ధ్ని స్థితాం లంకాం పాండురై ర్భవనై శ్శుభైః,
దదర్శ స కపిశ్రేష్ఠః పుర మాకాశగం యథా. 19
పాలితాం రాక్షసేంద్రేణ నిర్మితాం విశ్వకర్మణా,
ప్లవమానా మివాకాశే దదర్శ హనుమాన్ పురీమ్. 20
వప్రప్రాకారజఘనాం విపులాంబునవాంబరామ్,
శతఘ్నీశూలకేశాంతా మట్టాలకవతంసకామ్. 21
మనసేవ కృతాం లంకాం నిర్మితాం విశ్వకర్మణా,

---

గ్రహములవలెను, శరత్కాలపు మేఘముల వలెను అచటి గృహములు ఉన్నతములు, ప్రకాశమానములై యుండెను. వీథులు గృహసంబంధముచే ఉన్నతములు, ధవళములై యుండెను. నూర్లకొలది కోటబురుజులతో, పతాకలతో, ధ్వజములతో ఆ నగరము వెలుగొందుచుండెను. బంగారు వికారములు, శ్రేష్ఠములు, తీగెల వంటి రేఖలు చిత్రింపబడిన ద్వారప్రదేశములతో కూడి స్వర్గమున అమరావతివలె నున్న యా నగరమును హనుమంతుడు చూచెను. 14-18

తెల్లని శుభకరములగు గృహములతో పర్వతశిఖరముపై ఆకాశమంటుచున్నట్లు విలసిల్లు లంకను హనుమ దర్శించెను. 19

విశ్వకర్మనిర్మితమై రావణుడు పరిపాలించుచున్న ఆ పట్టణము కొండకొనపై నుండుటచే ఆకాశమున తేలుచున్నటులుండగా హనుమ చూచెను. 20

కోటగోడల కాధారముగ నిర్మించిన తిన్నెలు కటిప్రదేశముగా గలది, అగడ్తజలములే నూతన వస్త్రములుగా గలది, శతఘ్నులు (ఇనుపముండ్లు గల కట్టెలు) శూలములు వెంట్రుకల మొనలుగా గలది, కోట బురుజులే కర్ణాభరణములుగా గలదియు నై,

ద్వార ముత్తర మాసాద్య చింతయామాస వానరః. 22

కైలాసశిఖరప్రఖ్యా మాలిఖంతీ మివాంబరమ్,
డీయమానా మివాకాశ ముచ్ఛ్రితై ర్భవనోత్తమైః. 23

సంపూర్ణాం రాక్షసైర్ఘోరై ర్నాగై ర్భోగవతీ మివ,
అచింత్యాం సుకృతాం స్పష్టాం కుబేరాధ్యుషితాం పురా. 24

దంష్ట్రిభి ర్బహుభి శ్శూరై శ్శూలపట్టిసపాణిభిః,
రక్షితాం రాక్షసై ర్ఘోరై ర్గుహా మాశీవిషైరివ. 25

తస్యాశ్చ మహతీం గుప్తిం సాగరం చ నిరీక్ష్య సః,
రావణం చ రిపుం ఘోరం చింతయామాస వానరః. 26

ఆగత్యాపీహ హరయో భవిష్యంతి నిరర్థకాః,
న హి యుద్ధేన వై లంకా శక్యా జేతుం సురైరపి. 27

---

విశ్వకర్మయే నిర్మించినను, వైభవమునుబట్టి ఎవ్వడో మహానుభావుడు సంకల్ప మాత్రముననే సృజించినట్టిది వలె నున్న లంకానగరపు ఉత్తరద్వారమునకు చేరిన హనుమ సీత నెట్లు వెదకుటయా యని ఆలోచింపసాగెను. 21,22

కైలాసపర్వతశిఖరమువలె మహోన్నతమై ఆకాశము నొఱయుచున్నదివలె నొప్పుచు, ఉన్నతములైన మహాభవనములచే ఆకాశమున కెగురుచున్నట్లు కనుపించుచు, సర్పములతో పాతాళమువలె భీకరులైన రాక్షసులతో కూడి, ఊహింపరానిదై, చక్కని నిర్మాణము కలిగి, చూడ చక్కనై, పూర్వము కుబేరుని నివాసమై, సర్పములచే కాపాడబడు గుహవలె, కోఱలుగలిగి, శూలములు అడ్డకత్తులు చేత ధరించిన శూరులు, భయంకరులగు రాక్షసు లనేకులు కాపాడుచున్న లంకను చూచి, దానిని రాక్షసులు కట్టు దిట్టముగా రక్షించుచుండుటను గమనించి, దాని చుట్టును దాటరాని సముద్రమును పరికించి, రావణుడు భీకరశత్రు వగుటను ఊహించి హనుమంతు డిట్లు తలపోసెను. 23-26

'వానరు లిచటకు వచ్చినను వారి రాక నిష్ఫలమే యగును. ఈ లంక దేవతలకైనను యుద్ధమున జయింపరానిది.' 27

ఇమాం తు విషమాం దుర్గాం లంకాం రావణపాలితామ్,
ప్రాప్యాపి స మహాబాహుః కిం కరిష్యతి రాఘవః. 28

అవకాశో న సాంత్వస్య రాక్షసే ష్వభిగమ్యతే,
న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే. 29

చతుర్ణామేవ హి గతి ర్వానరాణాం మహాత్మనామ్,
వాలిపుత్రస్య నీలస్య మమ రాజ్ఞశ్చ ధీమతః. 30

యావ జ్జానామి వైదేహీం యది జీవతి వా న వా,
తత్రైవ చింతయిష్యామి దృష్ట్వా తాం జనకాత్మజామ్. 31

తత స్స చింతయామాస ముహూర్తం కపికుంజరః,
గిరిశృంగే స్థిత స్తస్మిన్ రామ స్యాభ్యుదయే రతః. 32

---

మిక్కిలి నిమ్నోన్నతమై, అన్యులకు చొరరాక రావణపాలితమగు ఈ లంకను చేరి మహాభుజుడగు రాముడు (ఒకే బాణముతో సాలములను-గిరిని-పాతాళమును కొట్టిన వాడయినను) మాత్ర మేమి చేయగలడు? 28

రాక్షసులు అసురస్వభావులు. వారికడ సాంత్వము (బుజ్జగింపుమాట) చెల్లదు. పోనీ దానమిత్తుమా యన్నను వారు మిగుల సంపన్నులుగాన ధనమునకు వశపడరు. బలదర్పితులు గాన భేదమున కవకాశము లేదు. బుద్ధి, పరాక్రమము కలవారు గాన యుద్ధముచేతను నిగ్రహింప రానివారు. 29

ఈ లంకకు రాగలుగుటయు నలుగురికే సాధ్యము. వాలిపుత్రుడగు అంగదుడు, నీలుడు, ధీమంతుడు మాకు రాజగు సుగ్రీవుడును ఈ మహాత్ములే ఆ ముగ్గురు. నేను నాల్గవ వాడను. 30

సీతాదేవి బ్రతికియున్నదో లేదో మొదట తెలిసికొనియే పిమ్మట ఆమెను దర్శించి, కర్తవ్య మాలోచించెదను. 31

మఱల రాముని అభ్యుదయమం దాసక్తికలవాడై కపిశ్రేష్ఠుడగు మారుతి యా పర్వతశిఖరమున నిలిచి యొక్క క్షణ మిట్లాలోచించెను. 32

అనేన రూపేణ మయా న శక్యా రక్షసాం పురీ,
ప్రవేష్టుం రాక్షసై ర్గుప్తా క్రూరై ర్బలసమన్వితైః. 33
ఉగ్రౌజసో మహావీర్యా బలవంతశ్చ రాక్షసాః,
వంచనీయా మయా సర్వే జానకీం పరిమార్గతా. 34
లక్ష్యాలక్ష్యేణ రూపేణ రాత్రౌ లంకాపురీ మయా,
ప్రవేష్టుం ప్రాప్తకాలం మే కృత్యం సాధయితుం మహత్. 35
తాం పురీం తాదృశీం దృష్ట్వా దురాధర్షాం సురాసురైః,
హనుమాం శ్చింతయామాస వినిశ్చిత్య ముహు ర్ముహుః. 36
కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజామ్,
అదృష్టో రాక్షసేంద్రేణ రావణేన దురాత్మనా. 37

---

క్రూరులు, బలవంతులగు రాక్షసులు ఈ నగరమును కాపాడుచున్నారు. నే నీ రూపముతోనే ఇందు ప్రవేశింపదగదు. 33

ఈ రాక్షసులు ప్రచండమగు తేజముకలవారు. మహాబలపరాక్రమసంపన్నులు. నేను సీతాదేవిని వెదకునపుడు వీరిని వంచింపక తప్పదు. 34

నేను కనుపింతునా రాక్షసులు పట్టుకొందురు. కనుపించకుండునంత చిన్న రూపము ధరింతునా, అంత చిన్న రూపముతో లంకనెల్ల వెదకుట కష్టము. కావున చూడదగినంత పెద్దదిగాని, అగపడనంత చిన్నదిగాని కాక మధ్యమరూపము దాల్చి రాత్రికాలమున లంకలో ప్రవేశించి యీ మహాకార్యమును సాధించుట యుక్తము. 35

అట్లు దేవదానవుల కెవ్వరికిని ఎదిరింపరానట్టి దుర్భేద్యనిర్మాణము గల ఆ లంకానగరమును చూచి హనుమంతుడు, సీతాన్వేషణ మెట్లు చేయవలెనా యని మాటిమాటికి నిశ్చయించుకొని, ఇట్లాలోచించెను. 36

దురాత్ముడైన రాక్షసరాజు రావణుని కగపడక ఏ యుపాయముచే జనకమహారాజు కూతురు సీతను దర్శింపగలను? 37

న వినశ్యేత్ కథం కార్యం రామస్య విదితాత్మనః,
ఏకా మేకశ్చ పశ్యేయం రహితే జనకాత్మజామ్. 38

భూతాశ్చార్థా విపద్యంతే దేశకాలవిరోధితాః,
విక్లబం దూత మాసాద్య తమ స్సూర్యోదయే యథా. 39

అర్థానర్థాంతరే బుద్ధి ర్నిశ్చితాఽపి న శోభతే,
ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః. 40

న వినశ్యేత్ కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్,
లంఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్. 41

మయి దృష్టే తు రక్షోభీ రామస్య విదితాత్మనః,
భవేద్ వ్యర్థ మిదం కార్యం రావణానర్థ మిచ్ఛతః. 42

---

జగద్విదితుడగు రాముని కార్యము నశింపకుండు టెట్లు? సీతాదేవి ఒంటరిగా నుండగా నే నొంటరిగ ఏకాంతమున ఆమె నెట్లు చూతును? 38

దాదాపు సిద్ధప్రాయములు (ఫలింపనున్నవి) అగు పనులు కూడ అవివేకియగు దూతచేతిలో పడి, దేశకాలవిరోధము నొంది, సూర్యోదయముచే చీకట్లు నశించిన చందమున చెడిపోవును. 39

ఇది కార్య మిది అకార్యమని కార్యాకార్యములకు సంబంధించి రాజు, మంత్రులు కూడి నిర్ణయించినను, ఆ నిశ్చయరూపమగు బుద్ధి, అవివేకి యగు దూతకడ శోభిల్లదు. తాము పండితులమని (తమ కన్నియు తెలియునని) భావించి అట్టి దూతలు పనులు పాడుచేయుదురు. 40

రామకార్యము చెడకుండు టెట్లు? నే నవివేకిని కాకుండు టెట్లు? నే నీ దుస్తర సముద్రము దాటుట విఫలము కాకుండు టెట్లు? 41

పగలు లంకలో ప్రవేశింతునా నన్ను రాక్షసులు చూచిరేని రావణుని కీడు గోరు మహాత్ముడగు రాముని కార్యము నిష్ఫలమగును. 42

న హి శక్యం క్వచిత్ స్థాతు మవిజ్ఞాతేన రాక్షసైః,
అపి రాక్షసరూపేణ కిముతాన్యేన కేనచిత్. 43

వాయురప్యత్ర నాజ్ఞాత శ్చరేదితి మతి ర్మమ,
న హ్యస్త్యవిదితం కించి ద్రాక్షసానాం బలీయసామ్. 44

ఇహాహం యది తిష్ఠామి స్వేన రూపేణ సంవృతః,
వినాశ ముపయాస్యామి భర్తు రర్థశ్చ హీయతే. 45

తదహం స్వేన రూపేణ రజన్యాం హ్రస్వతాం గతః,
లంకా మభిపతిష్యామి రాఘవ స్యార్థసిద్ధయే. 46

రావణస్య పురీం రాత్రౌ ప్రవిశ్య సుదురాసదామ్,
విచిన్వన్ భవనం సర్వం ద్రక్ష్యామి జనకాత్మజామ్. 47

ఇతి సంచింత్య హనుమాన్ సూర్య స్యాస్తమయం కపిః,

---

రాక్షసరూపమునే దాల్చి ఎచటనైన ఉందమన్నను ఈ రాక్షసులకు తెలియకుండుట సాధ్యము కాదు. (వారు తెలిసికొనగలరు). అట్టిచో మరి యే రూపమున నున్నను తెలిసికొనగలరని వేరుగా చెప్పవలెనా? 43

రాక్షసులకు తెలియక వాయువు గూడ సంచరింపదని నా యభిప్రాయము. బలీయులగు రాక్షసులకు తెలియని దేదియు లేదు. 44

నేను సహజమగు నా పెద్దరూపముతో నెచటనైన దాగియుందునా తప్పక వినాశము పొందెదను. నా స్వామి కార్యమును చెడును. 45

కావున నేను చిన్నరూపు దాల్చి రాముని సీతాన్వేషణరూపమగు కార్యము సఫలమగు కొఱకు రాత్రివేళ లంకలో ప్రవేశింతును. 46

సామాన్యులకు చేరరాని లంకానగరమును రాత్రివేళ ప్రవేశించి, రావణుని భవనమంతయు వెదకి సీతాదేవిని కనుగొనెదను. 47

వీరుడగు హనుమంతుడిట్లు తలచి, సీతాదేవిని చూడవలెనను కుతూహలము

ఆచకాంక్షే తదా వీరో వైదేహ్యా దర్శనోత్సుకః. 48

సూర్యే చాస్తం గతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః,
వృషదంశకమాత్ర స్సన్ బభూ వాద్భుతదర్శనః. 49

ప్రదోషకాలే హనుమాం స్తూర్ణ ముత్ప్లుత్య వీర్యవాన్,
ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్. 50

ప్రాసాదమాలావితతాం స్తంభైః కాంచనరాజతైః,
శాతకుంభమయై ర్జాలై ర్గంధర్వనగరోపమామ్. 51

సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీమ్,
తలైః స్ఫటికసంకీర్ణైః కార్తస్వరవిభూషితైః. 52

వైదూర్యమణిచిత్రైశ్చ ముక్తాజాలవిభూషితైః,
తలై శ్శుశుభిరే తాని భవనాన్యత్ర రక్షసామ్. 53

---

కలవాడై, సూర్యాస్తమయ మెప్పుడగునా యని వేచియుండెను. 48

సూర్యు డస్తమించి రాత్రి అగుటతోడనే హనుమ తన రూపమును సంకోచపఱచి, చూచువారి కాశ్చర్యము కలిగించుచు పిల్లియంత చిన్నరూపము దాల్చెను. 49

రాత్రి ప్రారంభసమయమున పరాక్రమశాలియగు ఆ హనుమంతుడు శీఘ్రమే ఎగిరి చక్కగా నిర్మింపబడిన పెద్ద పెద్ద రాజమార్గములు కల సుందరమగు లంకానగరమున ప్రవేశించెను. 50

బారులుగా నున్న మహాభవనములతో కూడినదై, బంగారము, వెండితో నిర్మింపబడిన స్తంభములు కలిగి, బంగారముతో నిర్మింపబడిన కిటికీలతో, గంధర్వనగరము వలె నున్నదై, ఏడంతస్తులు ఎనిమిదంతస్తులు గలిగి, స్ఫటికమణులు పొదిగిన నేలలు కలిగి, బంగారముచే నలంకరింపబడిన మహాభవనములతో విలసిల్లు ఆ మహానగరమును హనుమంతుడు దర్శించెను. 51,52

ఆ లంకలోని భవనములు వైదూర్యమణిచిత్రితములై యుండగా భూతలములు ముత్యాలముగ్గులతో నలంకరింపబడి యుండెను. 53

కాంచనాని విచిత్రాణి తోరణాని చ రక్షసామ్,
లంకా ముద్ద్యోతయామాసు స్సర్వత స్సమలంకృతామ్. 54
అచింత్యా మద్భుతాకారాం దృష్ట్వా లంకాం మహాకపిః,
ఆసీ ద్విషణ్ణో హృష్టశ్చ వైదేహ్యా దర్శనోత్సుకః. 55
స పాండురోద్విద్ధవిమానమాలినీం
మహార్హజాంబూనదజాలతోరణామ్,
యశస్వినీం రావణబాహుపాలితాం
క్షపాచరై ర్భీమబలై స్సమావృతామ్. 56
చంద్రోఽపి సాచివ్య మివాస్య కుర్వం
స్తారాగణై ర్మధ్యగతో విరాజన్,

---

సువర్ణనిర్మితము లగుటచే ఆశ్చర్యకరములగు బహిర్ద్వారములు అంతటను అలంకరింపబడిన ఆ రాక్షసుల లంకను మిక్కిలి ప్రకాశింపజేయుచుండెను. 54

హనుమయు సీతాదేవి నెప్పుడు దర్శింతునా యని యువ్విళ్లూరుచు, ఊహింప నలవి కానిది, అద్భుతరూపము గలది అగు లంకను చూచి దుఃఖితుడు, ఆనందించిన వాడును అయ్యెను. సున్నము (వెల్ల) వేయబడిన ఉన్నతములైన ఏడంతస్తుల గృహములు వరుసగా గలది, మహామూల్యములు సువర్ణమయములగు కిటికీలు బహిర్ద్వారములు కలది, కీర్తిమంత మైనది, రావణుని బాహుబలముచే కాపాడబడినది, మహాబలులగు రాక్షసులతో కూడినదగు ఆ లంకానగరమును చూచి హనునుంతుడు విషాదమును, హర్షమును పొందెను. (లంకానగరము దుష్ప్రవేశమగుటచే ఎట్లు ప్రవేశింపగలనా అని విషాదము. అద్భుతముగ నుండుటచే హర్షము) 55, 56

చంద్రుడును-సముద్రుడు, మైనాకుడు, సూర్యులవలె తానును ఆ హనుమంతునకు సహాయపడుచున్నట్లు చుక్కల నడుమ వెలుగుచు, తన వెన్నెలతో లోకమును ప్రకాశింప

జ్యోత్స్నావితానేన వితత్య లోక
ముత్తిష్ఠతే నైకసహస్రరశ్మిః. 57
శంఖప్రభం క్షీరమృణాలవర్ణ,
ముద్గచ్ఛమానం వ్యవభాసమానమ్,
దదర్శ చంద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీవ హంసమ్. 58

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్వితీయః సర్గః.*

---

జేయుచు, వేలకొలది కిరణములతో నుదయించెను. 57

వానరవీరుడగు హనుమంతుడును, శంఖము పాలు తామరతూడులవలె ధవళకాంతితో నొప్పుచు, సరస్సునుండి ఎగురుచున్న హంసవలె ఆకాశమున పైపైకి పోవుచున్న చంద్రుని దర్శించెను. 58

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమందు*
*సుందరకాండమున ద్వితీయసర్గము సమాప్తము.*

# 3. తృతీయః సర్గః

*(లంకాధిదేవత హనుమంతుని అడ్డగించుట)*

స లంబశిఖరే లంబే లంబతోయదసన్నిభే,
సత్త్వ మాస్థాయ మేధావీ హనుమాన్ మారుతాత్మజః. 1
నిశి లంకాం మహాసత్త్వో వివేశ కపికుంజరః,
రమ్యకాననతోయాఢ్యాం పురీం రావణపాలితామ్. 2
శారదాంబుధరప్రఖ్యై ర్భవనై రుపశోభితామ్,
సాగరోపమనిర్ఘోషాం సాగరానిలసేవితామ్. 3
సుపుష్టబలసంఘుష్టాం యథైవ విటపావతీమ్,
చారుతోరణనిర్యూహాం పాండురద్వారతోరణామ్. 4
భుజగాచరితాం గుప్తాం శుభాం భోగవతీ మివ,

---

అట్లు సముద్రమును అవలీలగా దాటుట మున్నగు మహాకార్యములు సాధించి, ప్రసిద్ధుడైన వానరోత్తముడు హనుమ, లంబపర్వతశిఖర మొక్కటి వంగి వ్రేలాడుచున్న మేఘమువలె నుండగా దానిపై నిలచి, బుద్ధిశాలి కావున అప్పుడు తన కర్తవ్య మేమా అని ఆలోచించి, లంకలోనికి చొచ్చుటకు వలయు బలపరాక్రమములు కూడగట్టుకొని, సుందర వనములు, జలములు కలదై, రావణపాలితమైన లంకలో రాత్రివేళ ప్రవేశించెను. 1-2

ఆ నగరము శరత్కాలమేఘమువలె తెల్లనై ప్రకాశించు అనేకమందిరములతో, సముద్రఘోషను తలపించుచు చెలరేగిన జనుల కలకలధ్వనులతో, చల్లగా వీచు సాగర సమీరములతో విలసిల్లుచుండెను. బలిష్ఠులగు సైనికులు చేయు సింహనాదము లచట విజృంభించుచుండెను. కుబేరుని అలకాపురివలె సుందరమై, ముఖద్వారములు

తాం సవిద్యుద్ఘనాకీర్ణాం జ్యోతిర్మార్గనిషేవితామ్. 5
మందమారుతసంచారాం యథేంద్ర స్యామరావతీమ్,
శాతకుంభేన మహతా ప్రాకారే ణాభిసంవృతామ్. 6
కింకిణీజాలఘోషాభిః పతాకాభి రలంకృతామ్,
ఆసాద్య సహసా హృష్టః ప్రాకార మభిపేదివాన్. 7
విస్మయావిష్టహృదయః పురీ మాలోక్య సర్వతః.
జాంబూనదమయై ర్ద్వారై ర్వైడూర్యకృతవేదికైః, 8
వజ్రస్ఫటికముక్తాభి ర్మణికుట్టిమభూషితైః,
తప్తహాటకనిర్యూహై రాజతామలపాండురైః. 9

---

వెల్లవేయబడి తెల్లదనముతో ప్రకాశింపగా, ద్వారములవద్ద మదపు టేనుగులు కలిగి, సర్పసంచారముచే కాపాడబడుచున్న శుభమైన భోగవతీనగరమువలె రాక్షసవీరసంచారముచే అది సురక్షితమై యుండెను. అచటి భవనములు ఉన్నతములై యుండెను. అందుచే ఆ భవనములలో మెరుపులతో కూడిన మేఘములు వ్యాపించగా, నక్షత్రమార్గమున విలసిల్లుచు పిల్లవాయువులు మెల మెల్లన వీచుచుండగా అది ఇంద్రుని అమరావతిని తలపించుచుండెను. దాని ప్రాకారము మిక్కిలి పెద్దదై, బంగారు వికారమై నగరము చుట్టును నెలకొని యుండెను. చిరుగంటలు మ్రోగుచున్న పతాకలు అంతటను అలంకరించబడి యుండెను. హనుమంతుడు అట్టి లంకాపురికి వేగమే పోయి, ప్రాకారము చేరుకొని, హర్షము నొందెను. 3-7

అతడు ఆ పట్టణమును అన్నివైపులనుండియు పరికించి మిక్కిలి ఆశ్చర్యపడెను. బంగారు ద్వారములు, వైడూర్యఖచితములైన అరుగులు, వజ్ర-స్ఫటిక-ముక్తా- మాణిక్య నిబద్ధములయిన వేలలు కలవి, మేలి బంగారము పోతపోసి నిర్మించిన మదపుటేనుగులు కలవి, వెండితో నిర్మించినవి వలె తెల్లనై, నిర్మలములై వైడూర్యఖచితములై స్ఫటికరేణుపూరితములైన మెట్లు కలవి, సుందరములైన చతుశ్శాలలు కలవి, క్రౌంచములు, నెమిళ్ల కూతలు వినిపించునవి, రాజహంసలు విహరించునవి,

వైడూర్యకృతసోపానైః స్ఫాటికాంతరపాంసుభిః,
చారుసంజవనోపేతైః ఖమివోత్పతితై శ్శుభైః. 10
క్రౌంచబర్హిణసంఘుష్టై రాజహంసనిషేవితైః,
తూర్యాభరణనిర్ఘోషై స్సర్వతః ప్రతినాదితామ్. 11
వస్వోకసారాప్రతిమాం తాం వీక్ష్య నగరీం తతః,
ఖమివోత్పతితుం కామాం జహర్ష హనుమాన్ కపిః. 12
తాం సమీక్ష్య పురీం రమ్యాం రాక్షసాధిపతే శ్శుభామ్,
అనుత్తమా మృద్ధియుతాం చింతయామాస వీర్యవాన్. 13
నేయ మన్యేన నగరీ శక్యా ధర్షయితుం బలాత్,
రక్షితా రావణబలై రుద్యతాయుధధారిభిః. 14
కుముదాంగదయో ర్వాపి సుషేణస్య మహాకపేః,
ప్రసిద్ధేయం భవే ద్భూమిర్ మైందద్వివిదయో రపి. 15

---

ఆకాశమునకు ఎగురుచున్నట్లున్నవి అగు శుభకరమహోన్నత గృహములతో కూడి, తూర్యములు ఆభరణముల ధ్వనులు ఎల్లెడల మార్మోగగా తూర్పున నున్న ఇంద్రుని వస్వోకసారమను నగరమునకు దీటైన ఆ లంకను చూచి హనుమంతుడు సంతసించెను. 8-12

సుందరమై, మంగళకరమై, ఉత్తమోత్తమమై, సంపత్సమృద్ధమైన రావణుని లంకాపురిని చూచి పరాక్రమశాలి యగు హమమంతు డిట్లు తలంచెను. 13

'ఎల్లప్పుడు రాక్షసులు ఆయుధములు చేపట్టి కాపాడుచుండుటచే ఈ లంకానగరిని బలముచే నెవ్వరును ఎదిరింపజాలరు. 14

ఈ లంకాపురి కుముదునకు, అంగదునకు, గొప్ప వానరుడగు సుషేణునకు, మైందునకు, ద్వివిదునకు తెలిసి యుండవచ్చును. 15

సూర్యతనయుడగు సుగ్రీవునకు, కుశపర్వుడను వానరునకు, ఋక్షునకు,

వివస్వత స్తనూజస్య హరేశ్చ కుశపర్వణః,
ఋక్షస్య కేతుమాలస్య మమ చైవ గతి ర్భవేత్. 16

సమీక్ష్య తు మహాబాహూ రాఘవస్య పరాక్రమమ్,
లక్ష్మణస్య చ విక్రాంత మభవత్ ప్రీతిమాన్ కపిః. 17

తాం రత్నవసనోపేతాం కోష్ఠాగారావతంసకామ్,
యంత్రాగారస్తనీ మృద్ధాం ప్రమదామివ భూషితామ్. 18

తాం నష్టతిమిరాం దీప్తై ర్భాస్వరైశ్చ మహాగృహైః,
నగరీం రాక్షసేంద్రస్య దదర్శ స మహాకపిః. 19

అథ సా హరిశార్దూలం ప్రవిశంతం మహాబలమ్,
నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్. 20

సా తం హరివరం దృష్ట్వా లంకా రావణపాలితా,

---

కేతుమాలునకు, నాకును ఈ నగరము చేరశక్యమగును. (ఇచట హనుమ తన పేరు చివఱ చెప్పుట ఆయన వినయమునకు సూచకము.) 16

అంతట మహాభుజుడగు హనుమంతుడు రామలక్ష్మణుల విక్రమమును ఊహించి (వా రనాయాసముగ లంకను జయింపగలరని తలంచి) సంతుష్టుడయ్యెను. 17

అతడు రత్నములే వస్త్రములుగా కలిగి, సామగ్రి నిలువచేయు కోష్ఠములే (కొట్లే) కర్ణాభరణములుగా గలిగి, యంత్రాగారములే స్తనములుగా గలిగి అలంకరించుకొన్న యువతివలె నున్న లంకను చూచెను. 18

మహాకపియగు హనుమంతుడు రత్నకాంతు లీనుచు, సుధాధవళితములైన మహాగృహములచే చీకట్లు తొలగిన రావణుని లంకానగరమును దర్శించెను. 19

మహాబలుడు, కపిశ్రేష్ఠుడగు మారుతి అట్లు ప్రవేశించుచుండగా, లంకానగరాధిదేవత నిజ (రాక్షస) రూపముతో హనుమంతుని చూచెను. 20

రావణుడు పరిపాలించు ఆ లంకాపురి, హనుమంతుని చూచి, వికృతమగు

స్వయమే వోత్థితా తత్ర వికృతాననదర్శనా. 21

పురస్తాత్ కపివర్యస్య వాయుసూనో రతిష్ఠత,
ముంచమానా మహానాద మబ్రవీత్ పవనాత్మజమ్. 22

కస్త్వం కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ,
కథయ స్వేహ యత్తత్త్వం యావత్ ప్రాణా ధరంతి తే. 23

న శక్యం ఖల్వియం లంకా ప్రవేష్టుం వానర త్వయా,
రక్షితా రావణబలై రభిగుప్తా సమంతతః. 24

అథ తా మబ్రవీ ద్వీరో హనుమా నగ్రతః స్థితామ్,
కథయిష్యామి తే తత్త్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి. 25

కా త్వం విరూపనయనా పురద్వారేऽవతిష్ఠసి,
కిమర్థం చాపి మాం రుద్ధ్వా నిర్భర్త్సయసి దారుణా. 26

---

ముఖము, కండ్లు కలదై లేచి అతడున్నచోటనే నిలచెను. 21

ఆమె యట్లు వాయుపుత్రుడగు హనుమంతుని యెదుట నిలచి, పెద్దగా అఱచుచు ఇట్లనెను. 22

"ఓ వానరా! నీవెవ్వడవు? ఏ పనికై యిటకు వచ్చితివి? నీ ప్రాణములున్నంత లోపల 'ప్రాణాన్ హరామి' అను పాఠమున నీ ప్రాణములు తీయులోపల అని యర్థము) నీ విపుడు వాస్తవము తెలుపుము. 23

ఓ వానరుడా! రావణసైన్యములు కాపాడుచుండుటచే, సర్వవిధములుగా సురక్షితమైన యీ లంకలో నీకు ప్రవేశింపలేవు." 24

అపుడు హనుమంతుడు తన యెదుట నిలచిన యామె కిట్లనెను – "అమ్మా! నీ వడిగిన విషయముల వాస్తవము చెప్పెదను. 25

వికృతములగు కన్నులతో పురద్వారమున నిలచియున్న నీ వెవ్వతెవు? నీ వేల భీకర రూపముతో నన్నడ్డగించి బెదరించుచున్నావు?" 26

హనుమద్వచనం శ్రుత్వా లంకా సా కామరూపిణీ,
ఉవాచ వచనం క్రుద్ధా పరుషం పవనాత్మజమ్. 27

అహం రాక్షసరాజస్య రావణస్య మహాత్మనః,
ఆజ్ఞాప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీ మిమామ్. 28

న శక్యా మా మవజ్ఞాయ ప్రవేష్టుం నగరీ త్వయా,
అద్య ప్రాణైః పరిత్యక్తః స్వప్స్యసే నిహతో మయా. 29

అహం హి నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ,
సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా. 30

లంకాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
యత్నవాన్ న హరిశ్రేష్ఠః స్థిత శ్శైల ఇవాపరః. 31

స తాం స్త్రీరూపవికృతాం దృష్ట్వా వానరపుంగవః,
ఆబభాషేఽథ మేధావీ సత్త్వవాన్ ప్లవగర్షభః. 32

---

హనుమంతుని మాట విని కామరూపిణి యగు ఆ లంక కోపముతో ఇట్లు కఠినముగా పలికెను. 27

"నేను రాక్షసరాజు, మహాత్ముడగు రావణుని ఆజ్ఞను శిరసావహించుదానను. నన్నెదిరింప నెవ్వరికిని సాధ్యము కాదు. నే నీ నగరమును కాపాడుచుందును. 28

న న్నవమానించి (లక్ష్యము చేయక) నీ వీ నగరమున ప్రవేశింపలేవు. నీ విపుడే ప్రాణములు వీడి దీర్ఘనిద్ర పోయెదవు లెమ్ము. 29

వానరుడా! నేను లంకను. నేనే యన్నివైపులనుండి యీ నగరమును రక్షింతునని నీ కిదే తెలిపితిని." 30

లంక చెప్పిన మాటలు విని వాయునందనుడగు హనుమంతుడు యుద్ధమునకు సిద్ధపడి వేఱొక పర్వతమా యనునట్లు నిశ్చలుడై నిలచెను. 31

బుద్ధిమంతుడు, బలవంతుడగు హనుమంతుడు స్త్రీరూపముతో వికృతముగ నున్న ఆమెను చూచి యిట్లు పలికెను. 32

ద్రక్ష్యామి నగరీం లంకాం సాట్టప్రాకారతోరణామ్,
ఇత్యర్థ మిహ సంప్రాప్తః పరం కౌతూహలం హి మే. 33

వనా న్యుపవనా నీహ లంకాయాః కాననాని చ,
సర్వతో గృహముఖ్యాని ద్రష్టు మాగమనం హి మే. 34

తస్య తద్వచనం శ్రుత్వా లంకా సా కామరూపిణీ,
భూయ ఏవ పున ర్వాక్యం బభాషే పరుషాక్షరమ్. 35

మా మనిర్జిత్య దుర్బుద్ధే రాక్షసేశ్వరపాలితామ్,
న శక్య మద్య తే ద్రష్టుం పురీయం వానరాధమ. 36

తత స్స కపిశార్దూల స్తా మువాచ నిశాచరీమ్,
దృష్ట్వా పురీ మిమాం భద్రే పునర్యాస్యే యథాగతమ్. 37

తతః కృత్వా మహానాదం సా వై లంకా భయావహామ్,
తలేన వానరశ్రేష్ఠం తాడయామాస వేగితా. 38

---

"కోటబురుజులు, ప్రాకారములు, బహిర్ద్వారములతో కూడిన లంకానగరమును చూడగోరి వచ్చితిని. నా కీ నగరిని చూడవలెనని మిక్కిలి కోరిక కలదు. 33

లంకలోని వనములు, ఉపవనములు, అడవులు, ప్రధానములగు యిండ్లు చూచుటకే వచ్చితిని." 34

అతడు పలికిన ఆ మాట విని కామరూపిణి యగు లంక మఱల నిట్లు కఠినోక్తులు పలికెను. 35

'ఓ దుర్బుద్ధి వగు హనుమంతుడా! నన్ను ఓడింపక రాక్షసరాజగు రావణుడు పాలించు ఈ లంకానగరమును నీవు చూడలేవు'. 36

అంత ఆ హనుమంతుడు – 'ఓ మంగళరూపిణీ! నే నీ పట్టణమును చూచి, వచ్చిన త్రోవనే పోయెదను' అని యా రాక్షసితో పలికెను. 37

అపు డా లంక భయము కలుగునట్లు పెద్దగా నఱచి, వేగముగా తన యఱచేతిని

తత స్స కపిశార్దూలో లంకయా తాడితో భృశమ్,
ననాద సుమహానాదం వీర్యవాన్ పవనాత్మజః. 39

తత స్సంవర్తయామాస వామహస్తస్య సోఽంగులీః,
ముష్టినాఽభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః. 40

స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధః స్వయం కృతః . 41

సా తు తేన ప్రహారేణ విహ్వలాంగీ నిశాచరీ,
పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా. 42

తతస్తు హనుమాన్ ప్రాజ్ఞస్తాం దృష్ట్వా వినిపాతితామ్,
కృపాం చకార తేజస్వీ మన్యమానః స్త్రియం తు తామ్. 43

తతో వై భృశసంవిగ్నా లంకా సా గద్గదాక్షరమ్,
ఉవా చాగర్వితం వాక్యం హనుమంతం ప్లవంగమమ్. 44

---

చాచి యా వావరశ్రేష్ఠుని కొట్టెను. 38

లంక తన్నట్లు తీవ్రముగ కొట్టగా పరాక్రమశాలి అగు హనుమంతుడు పెద్దగా ధ్వని చేసెను. 39

పిమ్మట కోపము పెల్లుబుకగా ఆ హనుమంతుడు తన ఎడమ చేతి వ్రేళ్ళు ముడుచుకొని, పిడికిలితో నామెను కొట్టెను. 40

ఆమె స్త్రీ కావున చంపరాదని హనుమంతు డామెపై మిక్కిలి కోపము చూపలేదు. అయినను ఆ రాక్షసి ఆ దెబ్బచేతనే తెలివి తప్పి ముఖము, కండ్లు వికృతములు కాగా వెంటనే నేలపై బడెను. 41,42

పిమ్మట ప్రాజ్ఞుడు, తేజశ్శాలియగు హనుమంతు డామె యట్లు నేలబడుట గాంచి ఆడుది గదా యని (సంహరింపక) దయ దాల్చెను. 43

అపు డా లంక మతింతగా భయపడినదై, గర్వము వీడి హీనస్వరము కలదై హనుమంతునితో నిట్లు పలికెను. 44

ప్రసీద సుమహాబాహో త్రాయస్వ హరిసత్తమ,
సమయే సౌమ్య తిష్ఠంతి సత్త్వవంతో మహాబలాః. 45
అహం తు నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ,
నిర్జితాహం త్వయా వీర విక్రమేణ మహాబల. 46
ఇదం తు తథ్యం శృణు వై బ్రువంత్యా మే హరీశ్వర,
స్వయంభువా పురా దత్తం వరదానం యథా మమ. 47
యదా త్వాం వానరః కశ్చి ద్విక్రమా ద్వశ మానయేత్,
తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయ మాగతమ్. 48
స హి మే సమయ స్సౌమ్య ప్రాప్తో౽ద్య తవ దర్శనాత్,
స్వయంభూవిహిత స్సత్యో న తస్యాస్తి వ్యతిక్రమః. 49
సీతానిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః,

---

"ఓ మహాభుజుడవగు హనుమంతుడా! నాయందు ప్రసన్నుడవు కమ్ము. కపిశ్రేష్ఠుడా! నన్ను కాపాడుము. సౌమ్యుడా! ధీరులు, మహాబలులు 'స్త్రీలను చంపరా' దను నియమము పాటింతురు. 45

ఓ వానరుడా! నీ కగపడు ఈ లంకాపురిని నేనే. వీరుడవు, మహాబలుడవగు నీవు పరాక్రమముచే నన్ను జయించితివి. 46

ఓ వానరేశ్వరా! పూర్వము నాకు బ్రహ్మ వరమిచ్చినాడు. ఆ వరమేమో వాస్తవముగా చెప్పెదను వినుము. 47

'ఎప్పు డొకానొక వానరుడు తన పరాక్రమముచే నిన్ను వశము చేసికొనునో అపుడే రాక్షసులకు భయ మేర్పడునని నీ వెఱుంగుము' అని బ్రహ్మ చెప్పినాడు. 48

ఓ సౌమ్యుడా! నీ దర్శనముచే నిపు డా సమయ మాసన్నమైనది. బ్రహ్మ ఆనతి సత్యమే; దానికి తిరుగు లేదు. 49

సీత కారణముగా దుర్మార్గుడైన రాక్షసరాజు రావణునకు, సకలరాక్షసులకును

రక్షసాం చైవ సర్వేషాం వినాశ స్సముపాగతః. 50

తత్ ప్రవిశ్య హరిశ్రేష్ఠ పురీం రావణపాలితామ్,
విధత్స్వ సర్వకార్యాణి యాని యానీహ వాంఛసి. 51

ప్రవిశ్య శాపోపహతాం హరీశ్వర
శ్శుభాం పురీం రాక్షసముఖ్యపాలితామ్,
యదృచ్ఛయా త్వం జనకాత్మజాం సతీం
విమార్గ సర్వత్ర గతో యథాసుఖమ్. 52

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే తృతీయః సర్గః.*

---

వినాశకాల మాసన్నమైనది. 50

కావున ఓ కపిశ్రేష్ఠుడా! రావణుడు పాలించు లంకానగరమును ప్రవేశించి, ఏ యే కార్యములు చేయదలంచితివో వాని నెల్ల యాచరించుము. 51

ఓ వానరేశ్వరా! మంగళకరమైనది, రాక్షసముఖ్యుడగు రావణునిచే పరిపాలింపబడుచున్నది, యిట్లు శాపముచే బలహీనపడినది యగు లంకలో ప్రవేశించి, సుఖముగా నెల్లెడల తిరుగుచు సాధ్వియగు సీతాదేవిని వెదకుము." అని లంక హనుమంతునితో పలికెను. 52

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున తృతీయ సర్గము.*

# 4. చతుర్థః సర్గః

*(హనుమంతుడు లంకలో ప్రవేశించుట)*

స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీమ్,
విక్రమేణ మహాతేజా హనుమాన్ కపిసత్తమః,
[1]అద్వారేణ మహాబాహుః ప్రాకార మభిపుప్లువే. 1

ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజహితంకరః,
చక్రే ౭థ పాదం [2]సవ్యం చ శత్రూణాం స తు మూర్ధని. 2

మహాపరాక్రమశాలి, మహాభుజుడు, వానరశ్రేష్ఠుడగు హనుమంతుడు, కామరూపముగల శ్రేష్ఠనగరమగు లంక నట్లు పరాక్రమముచే జయించి, ద్వారము కానట్టి ప్రదేశమున ప్రాకారమును దాటెను. 1

సుగ్రీవునకు హితము గూర్చువాడగు హనుమంతుడు, తన ఎడమ పాదమును లంకలో శత్రువుల శిరముపై నిడినట్లు మోపి ప్రవేశించెను. 2

1. హనుమ ద్వారమున పోకుండుటకు రెండు కారణములు. ఒకటి లంకాపరాజయము రాక్షసులకు తెలియకుండుట. రెండు -

"శ్లో. గ్రామం వా వగరం వాపి పత్తనం వా పరస్య హి,
విశేషాత్ సమయే సౌమ్య న ద్వారేణ విశే న్నృపః".

(రాజు లేక రాజపురుషుడు శత్రునగరము, లేదా గ్రామము నొక విశిష్టకార్యసాధనకై ప్రవేశింపవలసినపుడు ప్రధానద్వారమున పోరాదు) అను వచనము.

2. ప్రయాణసమయము, గృహప్రవేశము, వివాహము ఈ సందర్భములలో మొదట కుడిపాదము నుంచియు, శత్రునగరమున ప్రవేశించునపుడు ఎడమ పాదము నుంచియు రాజు (రాజపురుషుడుగాని) ప్రవేశింపవలెనని బృహస్పతివచనము. అట్లు శత్రునగరప్రవేశము చేయువాడు మోపిన ఎడమపాదము శత్రువు శిరముపై మోపినట్లగును. శత్రువు పరాజితుడగునని భావము -

ప్రవిష్ట స్సత్త్వసంపన్నో నిశాయాం మారుతాత్మజః. 3
స మహాపథ మాస్థాయ ముక్తాపుష్పవిరాజితమ్,
తతస్తు తాం పురీం లంకాం రమ్యామభియయౌ కపిః. 4
హసితోత్కృష్టనినదై స్తూర్యఘోషపురస్సరైః,
వజ్రాంకుశనికాశైశ్చ వజ్రజాలవిభూషితైః,
గృహమేఘైః పురీ రమ్యా బభాసే ద్యౌ రివాంబుదైః. 5
ప్రజజ్వాల తదా లంకా రక్షోగణగృహై శ్శుభైః,
సితాభ్రసదృశై శ్చిత్రైః పద్మ [1]స్వస్తికసంస్థితైః,

బలవంతుడగు హనుమంతుడు రాత్రివేళ లంకలో ప్రవేశించి ముత్యములతో పూలతో ప్రకాశించు రాజమార్గమున పోయెను. అత డట్లు రాజమార్గమును బట్టి సుందరమగు లంకానగరమున తిరుగజొచ్చెను. 3-4

ఆ లంకానగరమున నృత్తగీతవాద్యధ్వనులు, అట్టహాసములును బోరుకొలుపుచుండెను. ఐరావతము వలె తెల్లనై, వజ్రఖచితములైనవి, వజ్ర, అంకుశ రూపములతో నిర్మించబడినవి అగు మేలైన యిండ్లతో కూడిన ఆ లంక మేఘములతో ఆకాశమువలె ప్రకాశించెను. 5

పద్మము, స్వస్తిక మను నిర్మాణవిశేషము గలవి, వర్ధమాన మను లక్షణము గలవి, తెల్లని మేఘములవలె నున్నవి, ఆశ్చర్యము గొల్పునవి యగు ఉత్తమములగు

"ప్రయాణకాలే చ గృహప్రవేశే వివాహకాలేఽ పి చ దక్షిణాంఘ్రిమ్,
కృత్వాగ్రత శ్శత్రుపురప్రవేశే వామం నిదధ్యా చ్చరణం నృపాలః."

1 స్వస్తికము లనబడు గృహములు చతురస్రాకృతి కలవి -
చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతోభద్రసంజ్ఞితా,
పశ్చిమద్వారరహితా మధ్యావర్తా హయాననా.
దక్షిణద్వారరహితా వర్ధమానా ధనప్రదా,
ప్రాగ్ద్వారరహితా స్వస్తికాఖ్యా పుత్రధనప్రదా. (-మహేశ్వరతీర్థీయవ్యాఖ్య)

వర్ధమానగృహై శ్చాపి సర్వత స్సువిభూషితా. 6

తాం చిత్రమాల్యాభరణాం కపిరాజహితంకరః,

రాఘవార్థం చరన్ శ్రీమాన్ దదర్శ చ ననంద చ. 7

భవనా ద్భవనం గచ్ఛన్ దదర్శ పవనాత్మజః,

వివిధాకృతిరూపాణి భవనాని తత స్తతః. 8

శుశ్రావ మధురం గీతం త్రిస్థానస్వరభూషితమ్,

స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసా మివ. 9

శుశ్రావ కాంచీనినదం నూపురాణాం చ నిస్వనమ్,

సోపాననినదాం శ్చైవ భవనేషు మహాత్మనామ్. 10

ఆస్ఫోటితనినాదాంశ్చ క్ష్వేళితాంశ్చ తత స్తతః,

---

రాక్షసుల గృహములతో నా లంకాపురి యంతటను చక్కగా అలంకరింపబడి యుండెను. 6

స్వామికార్యమును సాధించుట యను సంపదతో నలరారు హనుమంతుడు సుగ్రీవునకు హితము గూర్చువాడై, రాముని వనికై తిరుగుచు, విచిత్ర పుష్పమాలాలంకృతమగు లంకను చూచి 'దుష్ప్రవేశమగు లంకలో ప్రవేశింప గలిగితిని. కావున తప్పక రామసుగ్రీవుల మనోరథ మీడేరు' నని తలంచి యానందించెను. 7

వాయుపుత్రుడగు హనుమ లంకలో నొక భవనమునుండి వేఱొక భవనమున కేగుచు, పలు ఆకృతులుగల భవనములను చూచెను. 8

ఱొమ్ము, కంఠము, శిరముల నుండి పుట్టిన స్వరములతో శోభిల్లు మధురగీతమును స్వర్గమునం దప్సరలువలె మదవతులగు స్త్రీలు పాడగా వినెను. 9

హనుమ మహాత్ములగు రాక్షసుల భవనములయందు స్త్రీల (మణులు గ్రుచ్చిన) మొలత్రాళ్ళ ధ్వనిని, అందెల ధ్వనిని, అందెలు ధరించిన ఆడువారు మెట్లెక్కుటవలన కలిగెడు ధ్వనిని, చేతులను వ్యత్యస్తముగా చేసికొని భుజములను తట్టుటవలన కలుగు

శుశ్రావ జపతాం తత్ర మంత్రాన్ రక్షోగృహేషు వై. 11
స్వాధ్యాయనిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః,
రావణస్తవసంయుక్తాన్ గర్జతో రాక్షసా నపి. 12
రాజమార్గం సమావృత్య స్థితం రక్షోబలం మహత్,
దదర్శ మధ్యమే గుల్మే రావణస్య చరాన్ బహూన్. 13
దీక్షితాన్ జటిలాన్ ముండాన్ గోఽజినాంబరవాససః,
దర్భముష్టిప్రహరణా నగ్నికుండాయుధాం స్తథా. 14
కూటముద్గరపాణీంశ్చ దండాయుధధరానపి,
ఏకాక్షా నేకకర్ణాంశ్చ లంబోదరపయోధరాన్. 15

---

ధ్వనిని, సింహనాదములను, జపము చేయువారు పలుకు వివిధ వేదమంత్రములను వినెను. 10,11

హనుమంతుడు వేదాధ్యయనము చేయువారును, రావణుని స్తోత్రము చేయుచు గర్జించువారును అగు రాక్షసుల నాదములు వినెను. 12

అతడు రాజమార్గము నావరించి నిలచిన పెద్ద రాక్షససేనను, నగరపు నడిమి ప్రదేశమున రావణుడు తనవారి వృత్తాంతము రహస్యముగా తెలిసికొనుటకు నియమించిన చారు లనేకులను చూచెను. 13

హనుమంతు డచట దీక్షలో నున్నవారు, జడలు దాల్చినవారు, బోడితలవారు, ఎద్దుతోలు కట్టుకున్నవారు, దిగంబరులు, దర్భలు ధరించిన పిడికిళ్లే ఆయుధములుగా దాల్చినవారు, జయము కోరి హోమము చేయుటచే అగ్నికుండములే ఆయుధములుగా కలవారును, కూటములు, ముద్గరములు, దండములు అను ఆయుధములు చేత పట్టినవారును, ఒంటి కంటి వారును, ఒంటిచెవి వారును, వ్రేలాడు పొట్టి స్తనములు గలవారు, భయంకరులును, వంకర మొగమువారును, విషమావయవములు గలవారును, పొట్టివారును, విండ్లుగల వారును, కత్తులు గలవారును, శతఘ్ని యను ఇనుపగద, ముసల మను జానెడు దండాయుధము కలవారును, పరిఘ మను

కరాళాన్ భుగ్నవక్త్రాంశ్చ వికటాన్ వామనాంస్తథా,
ధన్వినః ఖడ్గిన శ్చైవ శతఘ్నీముసలాయుధాన్. 16
పరిఘోత్తమహస్తాంశ్చ విచిత్రకవచోజ్జ్వలాన్,
నాతిస్థూలా న్నాతికృశా న్నాతిదీర్ఘాతిహ్రస్వకాన్.
నాతిగౌరా న్నాతికృష్ణా న్నాతికుబ్జాన్న వామనాన్. 17
విరూపాన్ బహురూపాంశ్చ సురూపాంశ్చ సువర్చసః,
ధ్వజీన్ పతాకిన శ్చైవ దదర్శ వివిధాయుధాన్. 18
శక్తివృక్షాయుధాం శ్చైవ పట్టిపాశనిధారిణః,
క్షేపణీపాశహస్తాంశ్చ దదర్శ స మహాకపిః. 19
స్రగ్విణ స్త్వనులిప్తాంశ్చ వరాభరణభూషితాన్,

---

ఆయుధవిశేషము చేత ధరించినవారును, ఆశ్చర్యము గొలుపు కనులతో ప్రకాశించువారును, మిక్కిలి లావులేని వారును, మిక్కిలి సన్నగిలి యుండనివారును, మిక్కిలి పొడవు లేని వారును, మిక్కిలి పొట్టిదనము లేనివారును, మిక్కిలి తెల్లదనము లేనివారును, మిక్కిలి నల్లదనము లేనివారును, మిక్కిలి గూనిలేనివారును, మిక్కిలి మరిగుజ్జులు గానివారును, చక్కని తేజస్సు కలవారును, రాజచిహ్నములు గలవి, లేనివి యగు టెక్కెములు పట్టుకొనినవారును అగు పలువురు ఆయుధధారులను చూచెను. 14-18

ఆ మహాకపి హనుమ, శక్తి యను దానిని, వృక్షములను ఆయుధములుగా దాల్చినవారును, పదునైన యినుపకత్తిని, అశని యను ఆయుధమును దాల్చినవారును, పడవతెడ్లు, త్రాళ్లు, చేతులందు గలవారును అగు రాక్షసులను చూచెను. 19

పుష్పమాలలు ధరించినవారును, చందనము పూసికొన్నవారును, శ్రేష్ఠములగు అలంకారములు ధరించినవారును, పలువేషములు గలవారును, పరువురు కలసి స్వేచ్ఛగా తిరుగువారును, పదునైన శూలములు దాల్చువారును, వజ్ర మను ఆయుధము

నానావేషసమాయుక్తాన్ యథా స్వైరగతాన్ బహూన్,
తీక్ష్ణశూలధరాం శ్చైవ వజ్రిణశ్చ మహాబలాన్. 20

శతసాహస్ర మవ్యగ్ర మారక్షం మధ్యమం కపిః,
రక్షోధిపతినిర్దిష్టం దదర్శాంతఃపురాగ్రతః. 21

స తదా తద్గృహం దృష్ట్వా మహాహాటకతోరణమ్,
రాక్షసేంద్రస్య విఖ్యాత మద్రిమూర్ధ్ని ప్రతిష్ఠితమ్. 22

పుండరీకావతంసాభిః పరిఖాభి రలంకృతమ్,
ప్రాకారావృత మత్యంతం దదర్శ స మహాకపిః. 23

త్రివిష్టపనిభం దివ్యం దివ్యనాదవినాదితమ్,
వాజిహేషితసంఘుష్టం నాదితం భూషణై స్తదా. 24

రథై ర్యానై ర్విమానైశ్చ తథా హయగజై శ్శుభైః,

---

దాల్చినవారును, మహాబలము గలవారును అగు రాక్షసుల నచట హనుమ చూచెను. 20

ఏమరుపాటు లేక రావణునిచే నాజ్ఞాపించబడినవారై నగరము నడుమ అంతః పురమునకు ఎదుట కావలియున్న లక్ష సైనికులను హనుమంతుడు చూచెను. 21

అంత హనుమంతుడు బంగారముతో నిర్మితమైన బహిర్ద్వారము కలిగిన రావణ భవనమును చూచెను. అది యొక పర్వతశిఖరముపై నెలకొనియుండెను. 22

మహాకపి హనుమంతుడు తెల్లతామరలతో శోభిల్లు అగడ్తలు కలిగి, ప్రాకార పరివేష్టితమైన ఆ భవనమును తిలకించెను. 23

ఆ భవనము దేవలోకమువలె దివ్యమై యుండెను. శ్రేష్ఠములగు వివిధధ్వనులును, గుఱ్ఱముల సకిలింతలు, స్త్రీపురుషులు ధరించిన కనక కంకణ మణి మంజీరాది భూషణ ధ్వనులును అందు మారుమ్రోగుచుండెను. 24

రథములు, పల్లకి మున్నగు వాహనములు, విమానములు, మంగళకరములగు గుఱ్ఱములు, ఏనుగులు, తెలిమబ్బుల నమూహమువలె నున్న నాల్గు దంతముల తెల్ల

వారణైశ్చ చతుర్దంతైః శ్వేతాభ్రనిచయోపమైః. 25
భూషితం రుచిరద్వారం మత్తైశ్చ మృగపక్షిభిః,
రక్షితం సుమహావీర్యై ర్యాతుధానై స్సహస్రశః,
రాక్షసాధిపతే ర్గుప్త మావివేశ మహాకపిః. 26
స హేమజాంబూనదచక్రవాళం మహార్హముక్తామణిభూషితాంతమ్,
పరార్థ్యకాలాగురుచందనాక్తం స రావణాంతఃపుర మావివేశ. 27

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చతుర్థః సర్గః.*

---

యేనుగులు, వలసినంతగా ఆహార విహారము లొనర్చి మత్తిల్లిన మృగములు, పక్షులు అందు శోభిల్లుచుండెను. ఆ భవనద్వారము కడు సుందరమై యుండెను. ఆ ద్వారదేశమున మహాపరాక్రమశాలులగు వేలాది రాక్షసులు కావలియుండిరి. అట్టి ఆ భవనమున హనుమ ప్రవేశించెను. 25,26

ఆ హనుమంతుడు జంబూనదియందు, మఱియు వేఱు ప్రదేశము లందును పుట్టిన రెండు విధములైన బంగారముచేతను పూయబడిన ప్రాకారము కలది, గొప్ప వెలగల ముత్యములతో నలంకరింపబడినది, మేలైన నల్లని అగురువు, చందనములు పూయబడినది అగు రావణుని అంతఃపురమున ప్రవేశించెను. 27

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నాల్గవ సర్గము సమాప్తము.*

# 5. పంచమః సర్గః

*(హనుమంతుడు లంకలో సీతను వెదకుట)*

తత స్స మధ్యంగత మంశుమంతం, జ్యోత్స్నావితానం మహదుద్వమంతమ్,
దదర్శ ధీమాన్ దివి భానుమంతం, గోష్ఠే వృషం మత్తమివ భ్రమంతమ్. 1
లోకస్య పాపాని వినాశయంతం, మహోదధిం చాపి సమేధయంతమ్,
భూతాని సర్వాణి విరాజయంతం, దదర్శ శీతాంశు మథాభియాంతమ్. 2
యా భాతి లక్ష్మీ ర్భువి మందరస్థా, తథా ప్రదోషేషు చ సాగరస్థా,
తథైవ తోయేషు చ పుష్కరస్థా రరాజ సా చారునిశాకరస్థా. 3
హంసో యథా రాజతపంజరస్థః, సింహో యథా మందరకందరస్థః

---

పిమ్మట బుద్ధిమంతుడగు హనుమంతుడు, ఆకాశము నడుమ విలసిల్లుచు, వెన్నెల పిండుమ మెండుగా వెదజల్లుచు, ఆవుల మందలో తిరుగు ఆబోతు వలె నున్న చంద్రుని చూచెను. 1

హనుమంతుడు జనుల పాపఫలమగు దుఃఖములను పోగొట్టువాడును, సముద్రమును వృద్ధినొందించువాడును, సకలప్రాణులను ప్రకాశింపజేయువాడును అగు చంద్రు డాకసమున పోవుచుండుట చూచెను. 2

భూమిపై మందరపర్వతమున కెట్టి కాంతి గలదో, సాయంకాలములలో సముద్రము నం దెట్టి ప్రకాశముండునో, జలములలో కమలములం దే వెలుగుండునో అట్టి ప్రకాశమే చంద్రునియందు సుందరముగా నుండెను. 3

(ఆకాశగర్భమంతయు వెన్నెలతో నిండి యుండుటచే) వెండిపంజరమం దున్న హంసవలెను, (శ్వేతగిరి యగుటచే) మందరపర్వతపు గుహాయం దున్న సింహమువలెను, (ఆకాశము నల్లని రూపము గల దగుటచే) మదించిన యేనుగు

వీరో యథా గర్వితకుంజరస్థః, చంద్రో విబభ్రాజ తథాంబరస్థః. 4
స్థితః కకుద్మానివ తీక్ష్ణశృంగో, మహాచలః శ్వేత ఇవోచ్చశృంగః,
హస్తీవ జాంబూనదబద్ధశృంగో, రరాజ చంద్రః పరిపూర్ణశృంగః 5
వినష్టశీతాంబుతుషారపంకో, మహాగ్రహగ్రాహవినష్టపంకః,
ప్రకాశలక్ష్మ్యాశ్రయనిర్మలాంకో, రరాజ చంద్రో భగవాన్ శశాంకః. 6
శిలాతలం ప్రాప్య యథా మృగేంద్రో, మహారణం ప్రాప్య యథా గజేంద్రః
రాజ్యం సమాసాద్య యథా నరేంద్ర, స్తథా ప్రకాశో విరరాజ చంద్రః. 7
ప్రకాశచంద్రోదయవష్టదోషః, ప్రవృత్తరక్షఃపిశితాశదోషః,
రామాభిరామేరితచిత్తదోషః, స్వర్గప్రకాశో భగవాన్ ప్రదోషః. 8

---

నెక్కిన వీరునివలెను, ఆకాశమున చంద్రు డధికముగ ప్రకాశించెను. 4

వాడియైన కొమ్ములు గల (తెల్లని) యెద్దువలెను, ఎత్తైన శిఖరములు గల తెల్లని కొండవలెను, బంగారు తొడుగు వేయబడిన కోరలుగల ఐరావతము వలెను, సకల కళాపరిపూర్ణుడై చంద్రుడు ప్రకాశించెను. 5

హిమరూపమగు మాలిన్యము తొలగినవాడును, మహాగ్రహములగు శుక్ర బృహస్పత్యాదులు కప్పి విడచుటచే (లేదా తన తేజముతో మహాగ్రహములను కూడా తిరస్కరించుటచే) వ్యక్తమైన నిర్మలత గలవాడును, లేదా మహాగ్రహ మగు సూర్యుని కిరణములను స్వీకరించుటచే నశించిన యంధకారము గలవాడును, గొప్ప కాంతిని పొందుటచే స్పష్టముగ నగపడుచున్న మచ్చకలవాడు నై మహాప్రభావశాలి చంద్రుడు ప్రకాశించెను. 6

ఎత్తైన రాతిపై నిలచిన సింహము వలె, మహాయుద్ధము చేయునపుడు ఏనుగు వలె, రాజ్యము సంపాదించినపుడు రాజువలె, చంద్రుడు కాంతిమంతుడై యొప్పెను. 7

ప్రకాశమానుడగు చంద్రు డుదయించుటచే చీకటులు తొలగినదై, రక్కస్సులు మాంసభక్షులగు వారి సంచారము విరివిగా నుండుటచే దోషవంతమై, సుందరాంగనల వారి ప్రియుల కోపరూపమగు అభిమానమును పారద్రోలునదై, స్వర్గమువలె ఆనందప్రదము శ్రీమంతమునైన ప్రదోషకాలము (సాయంకాలము) గడిచినది. 8

తంత్రీస్వనాః కర్ణసుఖాః ప్రవృత్తాః, స్వపంతి నార్యః పతిభిస్సువృత్తాః
నక్తంచరాశ్చాపి తథా ప్రవృత్తా,విహర్తుమత్యద్భుతరౌద్రవృత్తాః. 9
మత్తప్రమత్తాని సమాకులాని రథాశ్వభద్రాసనసంకులాని,
వీరశ్రియా చాపి సమాకులాని దదర్శ ధీమాన్ స కపిః కులాని. 10
పరస్పరం చాధిక మాక్షిపంతి, భుజాం శ్చ పీనా నధివిక్షిపంతి,
మత్తప్రలాపా నధికం క్షిపంతి, మత్తాని చాన్యోన్య మధిక్షిపంతి. 11
రక్షాంసి వక్షాంసి చ విక్షిపంతి, గాత్రాణి కాంతాసు చ విక్షిపంతి,
రూపాణి చిత్రాణి చ విక్షిపంతి, దృఢాని చాపాని చ విక్షిపంతి. 12
దదర్శ కాంతాశ్చ సమాలభంత్య, స్తథా పరాస్తత్ర పునః స్వపంత్యః

---

వీనులవిం దొనరించు వీణావాద్యములు విననైనవి. పతివ్రతలగు కాంతలు తమ పతులతో గూడి శయనించిరి. మిక్కిలి ఆశ్చర్యము కలిగించు భీకరకృత్యములు చేయుచు రాక్షసులు విహరింపసాగిరి. 9

పరాక్రమశాలి, ధీమంతుడగు హనుమ, నుద్యపానముచే మదించినవారితోడను ఏమఱుపాటు గల జనులతోడను కూడినవి, జనసమ్మర్దము కలవి, రథ గజ తురంగములు, ఉత్తమాసనములతో నిండినవి, వీరలక్ష్మితో నొప్పునవి యగు గృహములను చూచెను. 10

అచట ఒండొరుల నధికముగా అధిక్షేపము జేసికొనువారును, బలిసిన భుజముల నొండొరులపై వేయువారును, త్రాగినవారు చేయునట్టి ప్రలాపము లధికముగా చేయుచున్నవారును, మత్తెక్కి తమలో తా మధిక్షేపము చేసుకొనువారును, ఱొమ్ములు విఱుచుకొనుచున్నవారును, భార్యలపై (కాలు, చేతులు మున్నగు) అవయవములు వేయువారును, విచిత్రరూపములు దాల్చినవారును, గట్టి విండ్లను ఎక్కుపెట్టి తిరుగువారును అగు రాక్షసులను హనుమ చూచెను. 11,12

అచట కొందరు స్త్రీ లొడలికి చందనాదులు పూసుకొనుచుండిరి. మఱికొందరు నిదురించుచుండిరి. సుందరాంగులు కొందఱు నవ్వుచుండిరి. కోపించిన కొందరు

సురూపవక్త్రాశ్చ తథా హసంత్యః, క్రుద్ధాః పరాశ్చాపి వినిశ్శ్వసంత్యః. 13
మహాగజై శ్చాపి తథా నదద్భిః, సుపూజితై శ్చాపి తథా సునద్భిః,
రరాజ వీరైశ్చ వినిశ్శ్వసద్భిః, హ్రదో భుజంగై రివ నిశ్వసద్భిః. 14
బుద్ధిప్రధానాన్ రుచిరాభిధానాన్, సంశ్రద్దధానాన్ జగతః ప్రధానాన్,
నానావిధానాన్ రుచిరాభిధానాన్, దదర్శ తస్యాం పురి యాతుధానాన్. 15
ననంద దృష్ట్వా స చ తాన్ సురూపాన్, నానాగుణా నాత్మగుణానురూపాన్,
విద్యోతమానాన్ స తదానురూపాన్, దదర్శ కాంశ్చిచ్చ పునర్విరూపాన్. 16
తతో వరార్హా స్సువిశుద్ధభావా, స్తేషాం స్త్రియ స్తత్ర మహానుభావాః,
ప్రియేషు పానేషు చ సక్తభావా, దదర్శ తారా ఇవ సుప్రభావాః. 17

---

వనితలు నిట్టూర్చుచుండిరి. 13

ఘీంకరించు మదపుటేనుగులతో, పూజితులైన సత్పురుషులతో, యుద్ధమునకు తగిన ప్రతివీరులు లేక నిట్టూర్చు వీరులతో, ఆ పట్టణము నిట్టూర్చు పాములతో మడుగువలె నొప్పెను. 14

హనుమంతు డట శ్రేష్ఠబుద్ధులును, మనోహరనామధారులును, మిగుల శ్రద్ధాళువులును, నానాకారములు గలవారును, చక్కగా వ్యవహరించువారును అగు రాక్షసముఖ్యులను చూచెను. 15

పలువిధములగు ఉత్తమగుణములు కలవారు, తమ గుణములకు తగినట్లు వ్యవహరించువారును, సుందరరూపులును, అట్లే తేజోవంతులై తదనురూపములగు గుణములు కలవారును అగు కొందఱు వికృతాకారులను హనుమంతుడు చూచెను. 16

శ్రేష్ఠులగు పురుషులకు తగినవారును, భర్తల యెడ నిర్మలహృదయము కలవారును, పాతివ్రత్యమను గొప్ప ప్రభావము గలవారును (లేక గొప్ప కటాక్షభుజాక్షేపాది అనుభావములు కలవారును), తమ పతులయెడను పానమందును ఆసక్తి గలవారును, గొప్పకాంతిగల నక్షత్రముల వలె వెలుగొందువారును అగు స్త్రీల నచట మారుతి దర్శించెను. 17

శ్రియా జ్వలంతీ స్త్రపయోపగూఢా
నిశీథకాలే రమణోపగూఢాః,
దదర్శ కాశ్చిత్ ప్రమదోపగూఢా
యథా విహంగాః కుసుమోపగూఢాః. 18

అన్యాః పున ర్హర్మ్యతలోపవిష్టా, స్తత్ర ప్రియాంకేషు సుఖోపవిష్టాః,
భర్తుః ప్రియా ధర్మపరా నివిష్టా, దదర్శ ధీమాన్ మదనాభివిష్టాః. 19

అప్రావృతాః కాంచనరాజివర్ణాః, కాశ్చి త్పరార్థ్యా స్తపనీయవర్ణాః,
పునశ్చ కాశ్చిత్ శశలక్ష్మవర్ణాః, కాంతప్రహీణా రుచిరాంగవర్ణాః. 20

తతః ప్రియాన్ ప్రాప్య మనోభిరామాన్,
సుప్రీతియుక్తాః ప్రసమీక్ష్య రామాః
గృహేషు హృష్టాః పరమాభిరామా,
హరిప్రవీర స్స దదర్శ రామాః. 21

అచట కాంతితో నొప్పువారును, అర్ధరాత్రినమయమున పతులతో గూడి సిగ్గుపడువారును, హర్షపరిపూర్ణలును, పుష్పాలంకృతలై పూలచే గప్పబడిన పక్షులవలె మన్నవారును అగు స్త్రీలను హనుమ చూచెను. 18

కొందరు స్త్రీలు మేడలపైన తమ పతుల తొడలపై గూర్చుండి వారి కానందము కలిగించుచుండగా, మఱికొందరు ధర్మతత్పరలగు వనితలు భర్తలకు ప్రీతి గూర్చుచు మదనపరవశలై యుండగా హనుమ చూచెను. 19

కొందఱు వనితలు ముసుగులు తీసివేసికొని బంగారు రేఖలవలె మెఱయుచుండిరి. కొందఱు మేలిమి బంగారమువలె ప్రకాశించుచుండిరి. మఱికొందరు పతుల నెడబాసి చంద్రుని వలె తెల్లగా నుండిరి. ఇంకను కొందరు సుందరశరీరవర్ణము కలిగియుండిరి.

హనుమంతు డచట, తమ ప్రియుల చెంత కభిసారికలై పోయి తత్సమాగమముచే మిక్కిలి సంతోషము నందిన కొందరు సుందరాంగనలను, తమ గృహములందే ప్రముదితలై యున్న పరమసౌందర్యవతులగు పతివ్రతలను చూచెను. 21

చంద్రప్రకాశాశ్చ హి వక్త్రమాలా, [1]వక్రాక్షిపక్ష్మాశ్చ సునేత్రమాలాః,
విభూషణానాం చ దదర్శ మాలాః, శతహ్రదానా మివ చారుమాలాః. 22
న త్వేవ సీతాం పరమాభిజాతాం, పథి స్థితే రాజకులే ప్రజాతామ్,
లతాం ప్రఫుల్లామివ సాధుజాతాం, దదర్శ తన్వీం [1]మనసాభిజాతామ్. 23
సనాతనే వర్త్మని సన్నివిష్టాం రామేక్షణాం తాం మదనాభివిష్టామ్,
భర్తుర్మనః శ్రీమదనుప్రవిష్టాం, స్త్రీభ్యో వరాభ్యశ్చ సదా విశిష్టామ్. 24

---

ఆ హనుమ సీతాన్వేషణము చేయుచు, చంద్రునివలె ప్రకాశించు రాక్షసాంగనల మోములను, వంకరయైన తెప్పవెంట్రుకలుగల వారి సుందరనేత్రములను, మెఱుపుతీగల వలె కాంతిమంతములగు వారి యాభరణములను చూచెను. 22

అంతేకాని పరమసౌందర్యవతి, సన్మార్గనిష్ఠమగు రాజవంశమున పుట్టినది, గోముగా నెదిగి, విలసిల్లు పూదీగె వలె కోమలశరీరము కలది, తన సంకల్పమాత్రముననే అయోనిజయై జన్మించినది అగు సీతాదేవిని కానడయ్యెను. 23

అవిచ్ఛిన్న మగు పాతివ్రత్యధర్మము నవలంబించినది, రాముని దర్శింపగలనను నిశ్చయబుద్ధి గలది, మన్మథావేశము నొందినది, తన్నే తలంచు రాముని హృదయమున

---

1 ముఖములు, నేత్రములను చూచుట మానవరాక్షసభేదము తెలియుకొఱకు. వారి యాభరణములు చూచుట రాముడు చెప్పిన సీతాభరణము లగునో కాదో నిర్ణయించుకొనుటకు. ఈ విషయము 15వ సర్గలోని క్రింది శ్లోకముల వలన తేటతెల్లమగును.

'తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీమనిందితామ్,
తర్కయామాస సీతేతి కారణై రుపపాదిభిః.
వైదేహ్యా యాని చాంగేషు తదా రామో౽న్వకీర్తయత్,
తా న్యాభరణజాలాని శాఖాశోభీ న్యలక్షయత్.

(రాజపుత్రిక యగుట, విశాలనయనములు కలిగియుండుట, రాముడు ముందు పేర్కొనిన ఆభరణములు కలిగియుండుటచే హనుమ ఆమె సీత యని నిశ్చయించెను).

[1]యస్మాత్తు ధర్షితా చాహ మపాపా చాప్యనాథవత్,
తస్మాత్తవ వధార్థం వై ఉత్పత్స్యే౽హం ధ్రువం పునః.

అను ఉత్తరకాండ శ్లోకము ననుసరించి సీతాదేవి స్వసంకల్పముచేతనే జన్మించెనని తెలియనగును.

ఉష్ణార్దితాం సానుసృతాస్రకంఠీం పురా వరార్హోత్తమనిష్కకంఠీమ్,
సుజాతపక్ష్మామభిరక్తకంఠీం వనే ప్రనృత్తామివ నీలకంఠీమ్. 25
అవ్యక్తరేఖామివ చంద్రరేఖాం పాంసుప్రదిగ్ధామివ హేమరేఖామ్,
క్షతప్రరూఢామివ బాణరేఖాం వాయుప్రభిన్నామివ మేఘరేఖామ్. 26
సీతామపశ్యన్ మనుజేశ్వరస్య, రామస్య పత్నీం వదతాం వరస్య,
బభూవ దుఃఖాభిహతశ్చిరస్య ప్లవంగమో మంద ఇవాచిరస్య. 27

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచమః సర్గః.*

---

ప్రవేశించియున్నది, ఉత్తమవనితలలో నెల్ల శ్రేష్ఠురా లయినది.... 24

రామవిరహమువలన కలిగిన తాపముచే పీడింపబడినది, పూర్వము శ్రేష్ఠమగు నిష్కమను ఆభరణమును కంఠమున ధరించినది, ఇప్పుడు ఎడతెగని కన్నీరే ఆభరణముగా గలది, సుందరములగు ఱెప్పవెండ్రుకలు కలది, చక్కని కంఠస్వరము కలది, వనమున నృత్యము చేయు నెమలి వలె నున్నదియు... 25

స్పష్టముగ అగపడని చంద్రరేఖ వలె నున్నది, (మిక్కిలి కృశించియుండుటకు, కాంతి తఱిగియుండుటకు ఇది దృష్టాంతము.) దుమ్ముచే కలుషితమైన బంగారు శలాకవలె నున్నది, (సహజముగ శుద్ధస్వభావము కలిగి ఆగంతుకమాలిన్యముతో కూడియుండుట కిది దృ.) బాణము లోన గుచ్చుకొని దానిని పెఱికివైచినపుడు లోపల నొక ముక్క చిక్కి, పైన మాత్రము మందులచే నొకింత మానిన గాయము వలె నున్నది, (అధికమైన అంతర్వేదన కిది దృ.) గాలిచే చెదరిన మేఘలేఖ వలె నున్నదియు (ఓదార్పరాని విధముగ శిథిలత నొందుట కిది దృ.). 26

మనుజేశ్వరుడు, భాషణకౌశలము కలవారిలో శ్రేష్ఠుడైన రాముని భార్యయగు సీతాదేవిని, చాల తడవు వెదకి, యామె కానరాక హనుమంతుడు తోడనే మూఢుని వలె దుఃఖితుడయ్యెను. 27

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున అయిదవ సర్గము.*

# 6. షష్ఠః సర్గః

*(హనుమంతుడు రావణభవనమును చూచుట)*

స నికామం విమానేషు విషణ్ణః కామరూపధృత్,
విచచార పున ర్లంకాం లాఘవేన సమన్వితః. 1

ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్,
ప్రాకారే ణార్కవర్ణేన భాస్వరే ణాభిసంవృతమ్. 2

రక్షితం రాక్షసై ర్ఘోరై స్సింహై రివ మహ ద్వనమ్,
సమీక్షమాణో భవనం చకాశే కపికుంజరః. 3

రూప్యకోపహితై శ్చిత్రై స్తోరణైర్హేమభూషితైః,
విచిత్రాభిశ్చ కక్ష్యాభి ర్ద్వారైశ్చ రుచిరైర్వృతమ్. 4

---

తన కభిమతమగు రూపము ధరించగలవాడగు హనుమంతుడు విమానాకృతిగల రావణగృహములందు సీతను కానక, మిగుల దుఃఖించి, మఱియొకమారు వేగముగ సీతాన్వేషియై లంకలో తిరిగెను. 1

తిరిగి ధైర్యసంపన్నుడగు హనుమంతుడు సూర్యునివలె ఎఱ్ఱనై ప్రకాశించు ప్రాకారముచే పరివృతమైన రావణభవనము ప్రవేశించెను. 2

భీకరసింహములచే మహారణ్యము కాపాడబడినట్లు, భయంకరులగు రాక్షసులు కావలియున్న, సూర్యునివలె ప్రకాశించు రావణభవనమును చూచుచు, దాని కాంతులచే హనువు ప్రకాశించెను. 3

వెండిచే నిర్మింపబడి, బంగారుతో నలంకరింపబడిన వివిధవర్ణములు గల బహిర్ద్వారములతో, పలువిధములగు గదులతో సుందరద్వారములతో గూడినదియు. 4

గజాస్థితై ర్మహామాత్రై శ్శూరైశ్చ విగతశ్రమైః,
ఉపస్థిత మసంహార్యై ర్హయైః స్యందనయాయిభిః. 5

సింహవ్యాఘ్రతనుత్రాణై ర్దాంతకాంచనరాజతైః,
ఘోషవద్భి ర్విచిత్రైశ్చ సదా విచరితం రథైః. 6

బహురత్నసమాకీర్ణం పరార్ధ్యాసనభాజనమ్,
మహారథసమావాసం మహారథమహాసనమ్. 7

దృశ్యైశ్చ పరమోదారై స్తై స్తైశ్చ మృగపక్షిభిః,
వివిధై ర్బహుసాహస్రైః పరిపూర్ణం సమంతతః. 8

వినీతై రంతపాలైశ్చ రక్షోభిశ్చ సురక్షితమ్,
ముఖ్యాభిశ్చ వరస్త్రీభిః పరిపూర్ణం సమంతతః. 9

ముదితప్రమదారత్నం రాక్షసేంద్రనివేశనమ్,

---

ఏనుగుల నధిరోహించి తిరుగు ప్రధానులగు రాజపురుషులు, మహాకార్యమును గూడ శ్రమలేకయే అవలీలగ సాధించు శూరులును కలది, వధింపశక్యము గానివై, రథములకు పూన్పదగినవగు మేలి గుఱ్ఱములతో కూడినదియు... 5

సింహముల, పులుల చర్మములతో కప్పబడినవి, దంతములతో బంగారముతో వెండితో నిర్మింపబడినవి, యిటు నటు పోవుటచే శబ్దము చేయునవి, విచిత్రములైనవి అగు రథముల సంచారము కలదియు... 6

అనేకరత్నములతో కూడినదియు, శ్రేష్ఠములగు ఆసనములు, పాత్రలు కలదియు, మహారథులగు రాక్షసుల కావాసమైనదియు, శ్రేష్ఠరథములు ఉత్తమాసనములు కలదియు..7

సుందరములు, మహాకృతి గలవి, నానావిధములగు వేలాది మృగముల, పక్షుల సంచార మంతటను కలదియు.... 8

సుశిక్షితులగు బాహ్యరక్షకులగు రాక్షసులచే చక్కగా కాపాడబడుచున్నదియు, ఉత్తమవంశ సంజాతలగు సుందరస్త్రీలతో నంతటను నిండియున్నదియు... 9

వరాభరణసంహ్రాదై స్సముద్రస్వననిస్వనమ్. 10
తద్రాజగుణసంపన్నం ముఖ్యై శ్చాగరుచందనైః,
మహాజనై స్సమాకీర్ణం సింహైరివ మహద్వనమ్. 11
భేరీమృదంగాభిరుతం శంఖఘోషనినాదితమ్,
నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసై స్సదా. 12
సముద్రమివ గంభీరం సముద్రమివ నిస్స్వనమ్,
మహాత్మనో మహద్వేశ్మ మహారత్నపరిచ్ఛదమ్,
మహారత్నసమాకీర్ణం దదర్శ స మహాకపిః. 13
విరాజమానం వపుషా గజాశ్వరథసంకులమ్,
లంకాభరణ మిత్యేవ సోఽమన్యత మహాకపిః . 14

---

సంతోషముతో కూడిన శ్రేష్ఠవనితలు కలది, రాక్షసశ్రేష్ఠుల కావాసమైనది, ఉత్తమములగు ఆభరణముల మ్రోతలచే సముద్రమువలె ధ్వనించుచున్నదియు... 10

ఛత్రచామరాది రాజలక్షణములు కలదియు, శ్రేష్ఠములగు అగరు, చందనాది లేపనద్రవ్యములు కలదియు, సింహములతో మహారణ్యము వలె గొప్పజనులతో కూడినదియు.... 11

భేరులు, మృదంగముల మ్రోత కలదియు, శంఖధ్వనితో మహాశబ్దము కలదియు, నిత్యము గంధపుష్పాదులతో నర్చించుట కలదియు, పర్వసమయములందు (రావణు డాహితాగ్ని యగుటచే) దర్శపూర్ణమాసాదిహోమము చేయుట కలదియు, రాజభవన మగుటచే సదా రాక్షసులచే నమస్కరింపబడునదియు... 12

సముద్రము వలె మిక్కిలి గంభీరమైనదియు, సవ్వడి లేని సముద్రమువలె ఉన్నదియు, మేలి మణుల కప్పుతో విలసిల్లుచు, మహారత్నమయమైనది యగు మహాత్ముడైన రావణుని ఉత్తమప్రాసాదమును హనుమంతుడు చూచెను. 13

ఆ భవనము ఏనుగులు, గుఱ్ఱములు, రథములచే వ్యాపించబడినదై సుందర రూపముతో నలరారుచుండెను. దాని నా మహాకపి యగు హనుమ లంకకే

చచార హనుమాం స్తత్ర రావణస్య సమీపతః. 15

గృహాద్ గృహం రాక్షసానా ముద్యానాని చ వానరః,
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః. 16

అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్,
తతో ఽన్యత్ పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్. 17

అథ మేఘప్రతీకాశం కుంభకర్ణనివేశనమ్,
విభీషణస్య చ తదా పుప్లువే స మహాకపిః. 18

మహోదరస్య చ గృహం విరూపాక్షస్య చైవ హి,
విద్యుజ్జిహ్వస్య భవనం విద్యున్మాలే స్తథైవ చ . 19

వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజా స్సారణస్య చ ధీమతః. 20

---

యలంకారమని తలంచి, ఆ రావణుని భవనమునకు చేరువనే సీతను వెదకుచు తిరుగసాగెను. 14,15

రావణుని కుమారులు, మంత్రులు, మున్నగువారి గృహములలో నొకదాని పిమ్మట వేఱొకదానిని, వాని యుద్యానవనములను చూచుచు, హనుమంతుడు జంకు లేక యెల్లెడల సంచరించెను. 16

గొప్ప వేగము కలవాడు, పరాక్రమశాలి యగు హనుమ ప్రహస్తుని యింటికి పోయెను. అచటనుండి వెడలి మహాపార్శ్వుని భవనమునకు పోయెను. 17

పిమ్మట మహాకపి యగు హనుమంతుడు మేఘము వలె ఉన్నతమైన కుంభకర్ణుని యింటికి, విభీషణుని గృహమునకును పోయెను. 18

మహాకపి, మహాతేజు డగు హనుమంతు డటుపిమ్మట మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వ, వజ్రదంష్ట్ర, శుకు లను రాక్షసప్రవరుల గృహములకు, ధీమంతుడగు సారణుని ఇంటికి సీతను వెదుకబోయెను. 19,20

తథా చేంద్రజితో వేశ్మ జగామ హరియూథపః,
జంబుమాలే స్సుమాలేశ్చ జగామ హరిసత్తమః. 21
రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రో స్తథైవ చ .
వజ్రకాయస్య చ తథా పుప్లువే స మహాకపిః, 22
ధూమ్రాక్షస్య చ సంపాతే ర్భవనం మారుతాత్మజః.
విద్యుద్రూపస్య భీమస్య ఘనస్య విఘనస్య చ. 23
శుకనాసస్య వక్రస్య శఠస్య వికటస్య చ,
బ్రహ్మకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః. 24
యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య నాదినః,
విద్యుజ్జిహ్వేంద్రజిహ్వానాం తథా హస్తిముఖస్య చ. 25
కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి,
క్రమమాణః క్రమేణైవ హనుమాన్ మారుతాత్మజః. 26
తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
తేషా మృద్ధిమతా మృద్ధిం దదర్శ స మహాకపిః. 27

---

మహావానరుడు, వానరయూథపతి, వానరప్రముఖుడగు హనుమ అట్లు వెదకుచు, ఇంద్రజిత్తు, జంబుమాలి, సుమాలి, రశ్మికేతువు, సూర్యశత్రువు, వజ్రకాయుడను రాక్షస ప్రవరుల గృహములకు సీతను వెదుకబోయెను. 21,22

మహాకీర్తిశాలి హనుమంతు డచట ధూమ్రాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, శుకనాసుడు, వక్రుడు, శఠుడు, వికటుడు, బ్రహ్మకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, నాది, విద్యుజ్జిహ్వుడు, ఇంద్రజిహ్వుడు, హస్తిముఖుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు అను సమృద్ధిశాలు రగు రాక్షసుల గృహములకు వరుసగా పోయి, ఆ యా రాక్షసుల వైభవోపేతములగు భవనములలో, వారి సంపదలను చూచెను. 23-27

సర్వేషాం సమతిక్రమ్య భవనాని సమంతతః,
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్. 28

రావణ స్యోపశాయిన్యో దదర్శ హరిసత్తమః,
విచరన్ హరిశార్దూలో రాక్షసీ ర్వికృతేక్షణాః,
శూలముద్గరహస్తాశ్చ శక్తితోమరధారిణీః. 29

దదర్శ వివిధాన్ గుల్మాన్ తస్య రక్షఃపతే ర్గృహే. 30

రాక్షసాంశ్చ మహాకాయాన్ నానాప్రహరణోద్యతాన్,
రక్తాన్ శ్వేతాన్ సితాంశ్చైవ హరీంశ్చాపి మహాజవాన్. 31

కులీనాన్ రూపసంపన్నాన్ గజాన్ పరగజారుజాన్,
నిష్ఠితాన్ గజశిక్షాయా మైరావతసమాన్ యుధి. 32

---

తరువాత శ్రీమంతుడగు హనుమంతు డా రాక్షసుల భవనము లన్నింటిని దాటి తిరిగి రావణుని భవనమునకు పోయెను. 28

అచట తిరుగుచు నా హరిశ్రేష్ఠుడగు హనుమ రావణుడు విద్రించు సమయమున మేల్కొని కావలియుండు రాక్షసస్త్రీలను చూచెను. వారు శూలములు, ముద్గరములు, శక్తులు, తోమరము లను నాయుధములు చేతులలో ధరించి యుండిరి. 29

అత డా రావణునింట కావలియున్న వివిధములగు సైన్యములను చూచెను. 30

అట్లు కావలియున్న రాక్షసులు పెనుమేను గలవారై, పలువిధములగు ఆయుధములు ధరించి యుండిరి. అచట ఎఱుపు, తెలుపు రంగు కలిగి, మహావేగము గల గుఱ్ఱములు కట్టివేయబడియుండెను. 31

అచట ఉత్తమమగు గజజాతులలో పుట్టినవి, చక్కని రూపము గలవి, శత్రు గజములను పీడించునవి, గజశిక్షలో సుశిక్షితములైనవి, యుద్ధమున ఐరావతమునకు సాటియై, శత్రుసైన్యమును చంపునవి అగు ఏనుగు లుండెను. వర్షించు మేఘముల వలె, స్రవించు కొండలవలె మదజలము గార్చునవి, మేఘగర్జనము వంటి

నిహంతౄన్ పరసైన్యానాం గృహే తస్మిన్ దదర్శ సః,
క్షరతశ్చ యథా మేఘాన్ స్రవతశ్చ యథా గిరీన్. 33
మేఘస్తనితనిర్ఘోషాన్ దుర్ధర్షాన్ సమరే పరైః. 34
సహస్రం వాహినీ స్తత్ర జాంబూనదపరిష్కృతాః.
హేమజాలపరిచ్ఛన్నా స్తరుణాదిత్యసన్నిభాః,
దదర్శ రాక్షసేంద్రస్య రావణస్య నివేశనే. 35
శిబికా వివిధాకారా స్స కపి ర్మారుతాత్మజః,
లతాగృహాణి చిత్రాణి చిత్రశాలాగృహాణి చ . 36
క్రీడాగృహాణి చాన్యాని దారుపర్వతకానపి,
కామస్య గృహకం రమ్యం దివాగృహక మేవ చ,
దదర్శ రాక్షసేంద్రస్య రావణస్య నివేశనే. 37
స మందరగిరిప్రఖ్యం మయూరస్థానసంకులమ్,
ధ్వజయష్టిభి రాకీర్ణం దదర్శ భవనోత్తమమ్. 38

---

ఘీంకారము గలవి, యుద్ధమున శత్రువుల కెదిరింపరానివి అగు యేనుగుల నా రావణగృహమున హనుమ చూచెను. 32-34

హనుమంతు డా రావణగృహమున జంబూనదిలో పుట్టిన సువర్ణముతోడను, సాధారణమగు బంగారముతోడను చేయబడిన ఆభరణములను ధరించి, బాలసూర్యునివలె భాసమానులైన వేయిమంది సైనికులను చూచెను. 35

వాయునందనుడగు హనుమంతుడు అనేకములగు ఆకృతులు గల పల్లకీలను, విచిత్రములగు లతాగృహములను, చిత్రశాలలను, క్రీడాభవనములను, కొయ్యతో నిర్మించిన క్రీడాశైలములను, సుందరరతిగృహములను, పగలు సుఖోపభోగార్థమగు సుందరగృహమును రావణుని భవనమున దర్శించెను. 36,37

మందరపర్వతమువలె మహోన్నతము, క్రీడామయూరముల నివాసస్థానములతో

అనేకరత్నసంకీర్ణం నిధిజాలం సమంతతః.
ధీరనిష్ఠితకర్మాంతం గృహం భూతపతే రివ. 39

అర్చిర్భిశ్చాపి రత్నానాం తేజసా రావణస్య చ,
విరరాజాథ తద్వేశ్మ రశ్మిమానివ రశ్మిభిః. 40

జాంబూనదమయాన్యేవ శయనా న్యాసనాని చ,
భాజనాని చ ముఖ్యాని దదర్శ హరియూథపః. 41

మధ్వాసవకృతక్లేదం మణిభాజనసంకులమ్,
మనోరమ మసంబాధం కుబేరభవనం యథా. 42

నూపురాణాం చ ఘోషేణ కాంచీనాం నినదేన చ,
మృదంగతలఘోషైశ్చ ఘోషవద్భి ర్వినాదితమ్. 43

---

గూడినది, జెండాలు కట్టిన కట్టలతో గూడినది యగు రావణుని ధనాగారము చూచెను. అది యనేకరత్నపరిపూర్ణమై అంతటను అనేకనిధులు కలదై, ధీరుడు కర్తవ్యనిష్ఠుడగు రావణుని పరాక్రమరూపమగు కర్మకు ఫలమైనట్టిదై, శివుని దివ్యభవనమువలె నుండెను. 38,39

రత్నకాంతులచేతను, రావణుని తేజస్సుచేతను, ఆ భవనము కిరణములచే సూర్యునివలె తేజరిల్లెను. 40

ఆ భవనమున హనుమ మంచములు, పీటలు, ప్రధానమగు పాత్రలు అన్నియు సువర్ణమయములై యుండుట చూచెను. 41

విశాలమైన ఆ భవనమున నేల తేనెతో చేయబడిన మద్యముతో తడిసియుండెను. మణిమయపాత్ర లంతటను ఉండెను. అది మనోహరమై విశాలమై కుబేరుని భవనమువలె ఉండెను. 42

మ్రోయుచున్న అందెల రవములతో, మొలత్రాళ్ళు చిరుగజ్జెల నాదముతో, మద్దెల మ్రోతలతో మహాధ్వని గలదియు, ప్రాసాదము లనేకములతో కూడినదియు, వందలాది

ప్రాసాదసంఘాతయుతం స్త్రీరత్నశతసంకులమ్,
సువ్యూఢకక్ష్యం హనుమాన్ ప్రవివేశ మహాగృహమ్. 44

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షష్ఠః సర్గః.*

---

స్త్రీరత్నములతో వ్యాప్తమైనదియు, విశాలమగు కక్ష్యలు కలదియు అగు రావణుని ఆ మహాగృహమందు హనుమంతుడు ప్రవేశించెను. 43,44

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఆరవ సర్గము సమాప్తము.*

# 7. సప్తమః సర్గః

*(హనుమ రావణుని గృహవైభవమును చూచుట)*

స వేశ్మజాలం బలవాన్ దదర్శ, వ్యాసక్తవైదూర్యసువర్ణజాలమ్,
యథా మహత్ప్రావృషి మేఘజాలం, విద్యుత్పినద్ధం సవిహంగజాలమ్. 1
నివేశనానాం వివిధాశ్చ శాలాః, ప్రధానశంఖాయుధచాపశాలాః
మనోహరాశ్చాపి పునర్విశాలా, దదర్శ వేశ్మాద్రిషు చంద్రశాలాః.
గృహాణి నానావసురాజితాని, దేవాసురై శ్చాపి సుపూజితాని,
సర్వైశ్చ దోషైః పరివర్జితాని, కపిర్దదర్శ స్వబలార్జితాని. 3
తాని ప్రయత్నాభిసమాహితాని, మయేన సాక్షాదివ నిర్మితాని,
మహీతలే సర్వగుణోత్తరాణి, దదర్శ లంకాధిపతే ర్గృహాణి. 4

---

మహాబలవంతుడగు హనుమంతుడు వైదూర్యమణిఖచితము, సువర్ణమయమై, వివిధ పక్షిసమూహములతో కూడినదగుటచే వర్షాకాలమున మెఱుపులచే వ్యాప్తమై, పక్షులతో కూడిన మేఘసమూహమువలె నున్న భవనసముదాయమును చూచెను. 1

అందు పలువిధములగు గృహాంతశ్శాల లుండెను. అవి కొన్ని ముఖ్యములగు శంఖములు, తక్కిన ఆయుధములు, విండ్లను కలిగి యుండెను. మఱికొన్ని హర్మ్య, ప్రాసాదాదులందు సుందరములు, విశాలములగు పైమేడ లుండగా హనుమ చూచెను.

ఆ భవనము లనేకరత్నకాంతులతో ప్రకాశించుచుండెను. అవి దేవతలచే అసురులచే గూడ ప్రశంసింపబడి యుండెను. వానిని రాక్షసులు తమ బాహుబలముతో సంపాదించిరి. వావియం దే దోషమును కానరాకుండెను. 3

అవి కడుశ్రద్ధతో ప్రయత్నపూర్వకముగా చక్కగా మలచబడినవి. వానిని విశ్వకర్మయే నిర్మించినను, 'మయుడే వచ్చి స్వయముగా భూమిపై సర్వగుణాన్వితములుగా నిర్మించెనా' యనిపించుచుండును. అట్టి రావణగృహములను హనుమంతుడు చూచెను. 4

తతో దద ర్శోచ్ఛ్రితమేఘరూపం, మనోహరం కాంచనచారురూపమ్,
రక్షోధిప స్యాత్మబలానురూపం, గృహోత్తమం హ్యప్రతిరూపరూపమ్. 5
మహీతలే స్వర్గమివ ప్రకీర్ణం, శ్రియా జ్వలంతం బహురత్నకీర్ణమ్,
నానాతరూణాం కుసుమావకీర్ణం, గిరేరివాగ్రం రజసావకీర్ణమ్. 6
నారీప్రవేకై రివ దీప్యమానం, తటిద్భి రంభోదవ దర్చ్యమానమ్,
హంసప్రవేకై రివ వాహ్యమానం, శ్రియా యుతం ఖే సుకృతాం విమానమ్. 7
యథా నగాగ్రం బహుధాతుచిత్రం, యథా నభశ్చ గ్రహచంద్రచిత్రమ్,
దదర్శ యుక్తీకృతమేఘచిత్రం, విమానరత్నం బహురత్నచిత్రమ్. 8
మహీ కృతా పర్వతరాజిపూర్ణా, శైలాః కృతా వృక్షవితానపూర్ణాః,

---

పిమ్మట హనుమంతుడు మేఘమువలె ఉన్నతమైనది, మనోహరమైనది, బంగారముతో నిర్మితమగుటచే సుందరరూపము కలది, రావణుని బలమునకు సాటియైనది, సాటిలేని సౌందర్యము కలదగు శ్రేష్ఠగృహమును దర్శించెను. 5

ఆ రావణగృహము భూతలమునకు దిగివచ్చిన స్వర్గమువలె నుండెను. అనేక రత్నములతో కూడినదై కాంతులు వెదజల్లుచుండెను. నానావృక్షముల పూలతో వ్యాప్తమై పుప్పొడితో నిండిన కొండకొనవలె నుండెను. 6

అది మెఱుపుతీగలచే మేఘము వలె, సుందరనారీజనములతో ప్రకాశించుచు, ఎల్లరిచే శ్లాఘించబడుచు, ఆకాశమున శ్రేష్ఠములగు హంసలు మోయగా శోభిల్లు పుణ్యపురుషుల విమానము వలె వెలుగొందుచుండెను. 7

మఱియు వివిధరత్నములతో ఆశ్చర్యకరమై విలసిల్లు ఆ విమానరత్నము అనేక ధాతువులచే చిత్రింపబడిన పర్వతాగ్రమువలెను, గ్రహములచే చంద్రునిచే చిత్రమై యొప్పు ఆకాశమువలెను, ఒక్కచోట మబ్బులు గుమిగూడిన సుందరచిత్రములు కలదై యుండెను. 8

ఆ విమానముపై భూమి కొండలతో నిండినదిగను, పర్వతములు చెట్ల వరుసలతో నిండినవిగను, చెట్లు పుష్పసమూహములతో నిండినట్లుగను, పూలు కింజల్కములతో,

వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః, పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్. 9
కృతాని వేశ్మాని చ పాండురాణి, తథా సుపుష్పాణ్యపి పుష్కరాణి,
పునశ్చ పద్మాని సకేసరాణి, ధన్యాని చిత్రాణి తథా వనాని. 10
పుష్పాహ్వయం నామ విరాజమానం, రత్నప్రభాభిశ్చ వివర్ధమానమ్,
వేశ్మోత్తమానా మపి చోచ్చమానం, మహాకపి స్తత్ర మహావిమానమ్. 11
కృతాశ్చ వైడూర్యమయా విహంగా, రూప్యప్రవాళైశ్చ తథా విహంగాః,
చిత్రాశ్చ నానావసుభిర్భుజంగా, జాత్యానురూపాస్తురగా శ్శుభాంగాః. 12
ప్రవాళజాంబూనదపుష్పపక్షా, స్సలీల మావర్జితజిహ్మపక్షాః,
కామస్య సాక్షాదివ భాంతి పక్షాః, కృతా విహంగాస్సుముఖా స్సుపక్షాః. 13

---

రేకులతో నిండినట్లుగను చిత్రింపబడి యుండెను. 9

అందు తెల్లని భవనములు, చక్కని పూలతో కూడిన కొలనులు, కింజల్కములతో గూడిన తామరలు, శ్రేష్ఠములై ఆశ్చర్యము కలిగించు వనములు చిత్రింపబడి యుండెను.

రత్నకాంతు లతిశయించుచుండగా వానిచే మిక్కిలి ప్రకాశించుచు, ఉత్తమభవనముల కంటె ఉన్నతమైన పుష్పక మను పేరు గల మహావిమానమును హనుమంతు డచట చూచెను. 11

ఆ విమానముపై కొన్ని పక్షులు వైడూర్యములచే నిర్మించబడెను. మఱికొన్ని వెండిచే, పగడములచే చేయబడెను. వివిధరత్నములచే వివిధవర్ణములగు సర్పములును, ఆ యా అశ్వజాతి స్పష్టమగునట్లు చక్కని అవయవములు గల గుఱ్ఱములును చిత్రింపబడెను. 12

అందు సుందరముఖములు, అందమైన ఱెక్కలుగల పక్షులు చిత్రింపబడియుండెను. వాని ఱెక్కలు విలాసముగ కొంచెము ముడుచుకొనుటచే వంకరగా నుండెను. వానిపై పగడము, బంగారములతో పూలు చిత్రింపబడియుండెను. అవి మన్మథునకు సహాయకారులవలె నుండెను. 13

నియుజ్యమానాస్తు గజాస్సుహస్తా, స్సకేసరా శ్చోత్పలపత్రహస్తాః
బభూవ దేవీ చ కృతా సుహస్తా, లక్ష్మీస్తథా పద్మిని పద్మహస్తా. 14

ఇతీవ తద్గృహమభిగమ్య శోభనం
సవిస్మయో నగమివ చారు శోభనమ్,
పునశ్చ తత్పరమసుగంధి సుందరం
హిమాత్యయే నగమివ చారుకందరమ్. 15

తతస్స తాం కపిరభిపత్య పూజితాం
చరన్ పురీం దశముఖబాహుపాలితామ్,
అదృశ్య తాం జనకసుతాం సుపూజితాం
సుదుఃఖితః పతిగుణవేగనిర్జితామ్. 16

---

ఆ విమానముపై తామరకొలను, అందు లక్ష్మీదేవి నభిషేకించుటకై స్వయముగ నుద్యుక్తములైన ఏనుగులు చిత్రింపబడియుండెను. వాని తొండములు సుందరములై యుండెను. అవి కలువపూలను తమ తొండములతో ధరించి యుండెను. వానితో బాటుగా ఆ కొలనులో సుందరహస్తములు కలదై, ఆ హస్తములందు కమలములు దాల్చి, ఏనుగులచే నభిషేకింపబడుచున్న లక్ష్మీదేవి ప్రకాశించుచు చిత్రింపబడియుండెను. 14

హనుమంతు డట్లు సుందరము, మంగళకరమై, పర్వతమువలె ఉన్నతమై ఉన్న రావణభవన మంతయు తిరిగి (ఎచ్చటను స్త్రీలతో గూడి రావణుడు కనుపించకుండుటచే) ఆశ్చర్యచకితుడై వసంతమునందు సుందరగుహలతో కూడిన పర్వతమువలె, ఆ భవన మద్భుతమై సుగంధభరితమై చూపట్టగా మఱల నా గృహమందే తిరుగజొచ్చెను. 15

పిమ్మట ఆ హనుమంతుడు రావణుని బాహుబలముచే కాపాడబడుచు రాక్షసుల కాదరణీయమైన దగు లంకానగరమున తిరుగుచు, తన పతి రాముని దొడ్డగుణములచే వశీకృతయైన, పూజ్యురాలగు జానకి నెచ్చటను కానక, మిగుల దుఃఖితుడయ్యెను. 16

తతస్తదా బహువిధభావితాత్మనః,
కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః,
అపశ్యతో౽భవదతిదుఃఖితం మన,
స్సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః. 17

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తమః సర్గః.*

---

పలువిధములుగ నాలోచించువాడు, నిశ్చితబుద్ధి గలవాడు, సదాచారసంపన్నుడు, మహాత్ముడు, ఉత్తమమగు దర్శనశక్తి గలవాడగు హనుమంతుని మనస్సు సీతాదేవిని చూడక మిక్కిలి చింతాక్రాంతమయ్యెను. 17

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమందు ఏడవ సర్గము సమాప్తము.*

# 8. అష్టమః సర్గః

*(హనుమంతుడు పుష్పకవిమానమును చూచుట)*

స తస్య మధ్యే భవనస్య సంస్థితం, మహద్విమానం మణివజ్రచిత్రితమ్,
ప్రతప్తజాంబూనదజాలకృత్రిమం, దదర్శ వీరః పవనాత్మజః కపిః. 1
త దప్రమేయాప్రతికారకృత్రిమం, కృతం స్వయం సాధ్వితి విశ్వకర్మణా,
దివం గతం వాయుపథప్రతిష్ఠితం, వ్యరాజతా౽౽దిత్యపథస్య లక్ష్మవత్. 2
న తత్ర కించి న్న కృతం ప్రయత్నతో, న తత్ర కించి న్న మహార్హరత్నవత్,
న తే విశేషా నియతా స్సురేష్వపి, న తత్ర కించిన్న మహావిశేషవత్. 3
తపస్సమాధానపరాక్రమార్జితం, మనస్సమాధానవిచారచారిణమ్,

---

వీరుడగు హనుమంతు డట్లు భవనము నడుమ పెద్ద విమానమును చూచెను. అది మణులతో, వజ్రములతో చిత్రింపబడి యుండెను. దాని గవాక్షములు మేలిమి బంగారముతో నిర్మించబడి యుండెను. 1

ఆ విమానసౌందర్య మిట్టిదని తెలుప నలవికాదు. అట్టిది వేఱొకటి నిర్మించుటకును సాధ్యము కాదు. విశ్వకర్మ స్వయముగ దానిని రూపొందించి దాని నిర్మాణమును ప్రశంసించెను. అది భూమికి సన్నిహితమగు వాయుమార్గమైన అంతరిక్షమున నున్నదై సూర్యుని గమనమార్గమును సూచించుచు ప్రకాశించుచుండెను. 2

ఆ విమానమున ప్రయత్నపూర్వకముగ నిర్మింపబడని భాగమే లేదు. అమూల్య రత్నములు పొదుగబడని ప్రదేశమే లేదు. అందలి విశిష్టత దేవభవనములందును కానరాదు. అందు రచనావిశేషము కొఱవడిన చోటు లేనే లేదు. 3

తపోబలలబ్ధమైన పరాక్రమముచే రావణుడు సంపాదించినది, మనోనిశ్చయాను

అనేకసంస్థానవిశేషనిర్మితం, తత స్తతస్తుల్యవిశేషదర్శనమ్. 4
మన స్సమాధాయ తు శీఘ్రగామినం,
దురావరం మారుతతుల్యగామినమ్,
మహాత్మనాం పుణ్యకృతాం మహర్ధినాం,
యశస్వినా మగ్ర్యముదా మివాలయమ్. 5
విశేష మాలంబ్య విశేషసంస్థితం, విచిత్రకూటం బహుకూటమండితమ్,
మనోభిరామం శరదిందునిర్మలం, విచిత్రకూటం శిఖరం గిరే ర్యథా. 6
వహంతి యం కుండలశోభితాననా, మహాశనా వ్యోమచరా నిశాచరాః,
వివృత్తవిధ్వస్తవిశాలలోచనా, మహాజవా భూతగణాస్సహస్రశః. 7

---

గుణముగ ఏ ప్రదేశమునకైన పోవునది, అనేక విమాన గోపురాది సన్నివేశములతో నిర్మింపబడినది, అట నట సర్వతోరమణీయమగు విశేషదర్శనము కలది యగు పుష్పక విమానమును హనుమ దర్శించెను. 4

ఆ విమానము స్వామిచిత్తమును మదిలో నిలుపుకొని శీఘ్రముగా పోవునదియు, అన్యులకు దుర్లభమైనదియు, వాయువేగము కలదియు అయి, మహాత్ములు, పుణ్యవంతులు, మహాధనవంతులు, కీర్తిశాలురు, మహానందము కలవారగు ఇంద్రాదుల నివాసమువలె నుండెను. 5

విశిష్టములగు రత్నాదిసమూహములచే దివ్యమగు సంస్థానవిశేషము కలదై, అనేక శిఖరములు విచిత్రములగు అవాంతరశిఖరములు కలదై, మనోహరమై, శరత్కాల చంద్రునివలె నిర్మలమై, విచిత్రములగు అవాంతర శిఖరములతో కూడిన పర్వతశిఖరము వలె నున్న విమానమును హనుమ చూచెను. 6

కుండలములతో శోభిల్లు ముఖములు గలవారు, బహుభోజనులు, ఆకాశచారులు, గుండ్రనై, నొక్కువడిన వెడద కన్నులు కలవారు, వేగవంతు లగు వేలాది రాక్షసులు, భూతములు మోయుచున్నట్లు చిత్రితమైన విమానమును హనుమ చూచెను. 7

వసంతపుష్పోత్కరచారుదర్శనం, వసంతమాసాదపి కాంతదర్శనమ్,
స పుష్పకం తత్ర విమానముత్తమం, దదర్శ తద్వానరవీరసత్తమః. 8

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టమః సర్గః.*

---

ఇట్లు వానరవీరులలో శ్రేష్ఠుడగు హనుమంతుడు వసంతకాలపు పుష్పసమూహము వలె మందరమై కనుపించునది, వసంతమాసము కంటెను మనోహరదర్శనము కలది, శ్రేష్ఠమైనది అగు పుష్పకవిమానమును చూచెను. 8

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమం దెనిమిదవ సర్గము సమాప్తము.*

# 9. నవమః సర్గః

*(హనుమంతుడు రావణాంతఃపురము దర్శించుట)*

తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపుల మాయతమ్,
దదర్శ భవనశ్రేష్ఠం హనుమాన్ మారుతాత్మజః. 1

అర్ధయోజనవిస్తీర్ణ మాయతం యోజనం హి తత్,
భవనం రాక్షసేంద్రస్య బహుప్రాసాదసంకులమ్. 2

మార్గమాణస్తు వైదేహీం సీతా మాయతలోచనామ్,
సర్వతః పరిచక్రామ హనుమా నరిసూదనః. 3

ఉత్తమం రాక్షసావాసం హనుమా నవలోకయన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్. 4

చతుర్విషాణైర్ద్విరదై స్త్రివిషాణై స్తథైవ చ,

---

అట్లు వాయుపుత్రుడగు హనుమంతుడు రావణుని నివాసమగు మహాభవనము నడుమ విశాలమగు ఉత్తమభవనమును చూచెను. 1

రాక్షసరాజగు రావణుని యా భవనము అర యామడ వెడలుపు, ఆమడ పొడవు గలదై యనేకములగు మేడలు కలిగి యుండెను. 2

శత్రువులను నాశము చేయువాడగు హనుమంతుడు విశాలనేత్రి అగు సీతాదేవిని వెదకుచు చుట్టుపక్కలనున్న రావణుని సోదరులు, కుమారులు, మంత్రులు మున్నగు వారి భవనములం దెల్ల తిరిగెను. 3

శ్రీమంతుడగు హనుమంతుడు రాక్షసుల శ్రేష్ఠములగు నివాసముల నెల్ల చూచుచు ఆ నివాసములకు వెలవైన రావణుని భవనమును చేరెను. 4

విస్తృతమైన ఆ భవనము చుట్టును నాలుగు దంతములు, మూడు దంతములు

పరిక్షిప్త మసంబాధం రక్ష్యమాణ ముదాయుధైః. 5
రాక్షసీభిశ్చ పత్నీభీ రావణస్య నివేశనమ్,
ఆహృతాభిశ్చ విక్రమ్య రాజకన్యాభి రావృతమ్. 6
తన్నక్రమకరాకీర్ణం తిమింగిలఝషాకులమ్,
వాయువేగసమాధూతం పన్నగైరివ సాగరమ్. 7
యా హి వైశ్రవణే లక్ష్మీ ర్యా చేంద్రే హరివాహనే,
సా రావణగృహే సర్వా నిత్యమే వానపాయినీ. 8
యా చ రాజ్ఞః కుబేరస్య యమస్య వరుణస్య చ,
తాదృశీ తద్విశిష్టా వా ఋద్ధీ రక్షోగృహే ష్విహ. 9
తస్య హర్మ్యస్య మధ్యస్థం వేశ్మ చాన్యత్ సునిర్మితమ్,

---

గల ఏనుగులు యుండెను. ఆయుధములు దాల్చి రాక్షసులు దానిని కాపాడుచుండిరి. 5

ఆ భవనమందు రావణుని రాక్షసజాతి భార్యలు, పరాక్రమించి అతడు చెరపట్టి తెచ్చిన రాజకన్యలు నుండిరి. 6

ఇట్లాయుధపాణులగు పురుషులు, స్త్రీలతో కూడి ఆ ప్రాసాదము మొసళ్ళు, పెనుమీలచే వ్యాప్తమై, తిమింగిలములు, చేపలచే కలచి వేయబడి వాయువేగముచే కల్లోలితమై పాములతో కూడినట్టి సముద్రము వలె నుండెను. 7

కుబేరునికిని, పచ్చని గుఱ్ఱములు కల దేవేంద్రునికిని ఏ సంపదయున్నదో (తక్కిన దిక్పతులకును ఇది యుపలక్షణము) ఆ సంపదయంతయు నిత్య మెడతెగక రావణుని ఆ గృహమం దుండెను. 8

యక్షరాజగు కుబేరునికి, యమునకు, వరుణునకు ఎట్టి సమృద్ధి కలదో అట్టిది గాని లేదా అంతకంటె ఎక్కువగాని సమృద్ధి రావణుని సోదరులు, పుత్రులు మున్నగు రాక్షసుల యిండ్లలో నుండెను. 9

విశాలమగు ఆ రావణుని మహాభవనము నడుమ అనేక మదపుటేనుగులతో

బహునిర్యూహసంకీర్ణం దదర్శ పవనాత్మజః. 10

బ్రహ్మణోఽర్థే కృతం దివ్యం దివి య ద్విశ్వకర్మణా,
విమానం పుష్పకం నామ సర్వరత్నవిభూషితమ్. 11

పరేణ తపసా లేభే యత్ కుబేరః పితామహాత్,
కుబేర మోజసా జిత్వా లేభే తద్రాక్షసేశ్వరః. 12

ఈహామృగసమాయుక్తైః కార్తస్వరహిరణ్మయైః,
సుకృతై రాచితం స్తంభైః ప్రదీప్తమివ చ శ్రియా. 13

మేరుమందరసంకాశై రుల్లిఖద్భి రివాంబరమ్,
కూటాగారైః శ్శుభాకారై స్సర్వత స్సమలంకృతమ్. 14

జ్వలనార్కప్రతీకాశం సుకృతం విశ్వకర్మణా,
హేమసోపానసంయుక్తం చారుప్రవరవేదికమ్. 15

---

కూడి, చక్కగా నిర్మింపబడిన పుష్పకవిమానమును హనుమంతుడు మఱల చూచెను. 10

శ్రేష్ఠము, సర్వరత్నవిభూషితమగు ఆ పుష్పక మను విమానమును స్వర్గమున విశ్వకర్మ బ్రహ్మకై నిర్మించెను. కుబేరుడు తీవ్రతప మొనర్చి, దానిని బ్రహ్మనుండి సంపాదించెను. కుబేరుని తన పరాక్రమముచే జయించి రావణుడు దానిని చేజిక్కించుకొనెను. 11,12

ఆ పుష్పకము బంగారు, వెండితో నిర్మింపబడి తోడేళ్ళ చిత్రములు గల సుందర స్తంభములతో కూడి మిక్కిలి శోభిల్లుచు, మేరు, మందర పర్వతములవలె ఉన్నతమై, నింగిని తాకుచున్నదో యనిపించుచు అంతటను సుందరములగు మేడలతో కూడియుండెను. 13,14

అగ్నివలెను సూర్యునివలెను శోభిల్లు ఆ భవనమును విశ్వకర్మ మిక్కిలి కౌశలముతో నిర్మించెను. అది బంగారుమెట్లు, ఉత్తమవేదికలతో శోభిల్లుచుండెను. దాని గోడలపై అలంకారార్థము స్వస్తికము, సర్వతోభద్రము మున్నగు ఆకారములతో చేయబడిన

జాలవాతాయనై ర్యుక్తం కాంచనైః స్ఫాటికైరపి,
ఇంద్రనీలమహానీలమణిప్రవరవేదికమ్. 16

విద్రుమేణ విచిత్రేణ మణిభిశ్చ మహాధనైః,
నిస్తులాభిశ్చ ముక్తాభి స్తలే నాభివిరాజితమ్. 17

చందనేన చ రక్తేన తపనీయనిభేన చ,
సుపుణ్యగంధినా యుక్త మాదిత్యతరుణోపమమ్. 18

కూటాగారై ర్వరాకారై ర్వివిధై స్సమలంకృతమ్,
విమానం పుష్పకం దివ్య మారురోహ మహాకపిః. 19

తత్రస్థ స్స తదా గంధం పానభక్ష్యాన్నసంభవమ్,
దివ్యం సమ్మూర్ఛితం జిఘ్ర ద్రూపవంత మివానిలమ్. 20

స గంధస్తం మహాసత్త్వం బంధు ర్బంధుమివోత్తమమ్,
ఇత ఏహీ త్యువాచేవ తత్ర యత్ర స రావణః. 21

---

జాలములు (కిటికీలు)ను, ఇంద్రనీల మహానీల (సింహళద్వీపమున పుట్టిన నీలము) మణిఖచితవేదికలు నుండెను. విచిత్రములైన పగడములు, మహామూల్యములగు మణులు, సాటిలేని గుండ్రని ముత్యములు నేలమాళిగపై తాపబడి యా భవనము ప్రకాశించుచుండెను. బంగారమువలె తేజరిల్లు రక్తచందనము సుగంధమును గుబాళించుచుండగా ఆ భవనము బాలభానుని పగిది భాసిల్లుచుండెను. ఇట్టి నానావిధ భవన సముదాయముచే నలంకరింపబడియున్న దివ్యమగు పుష్పకవిమానమును మహాకపి మారుతి యధిరోహించెను. 15-19

హనుమంతు డా భవనముపై నిలచి మద్యములు, పిండివంటలు, అన్నములనుండి వెడలినదై రూపు దాల్చిన వాయువు వలె నున్న దివ్యగంధము నాఘ్రాణించెను. 20

ఆ సుగంధము, ఒక బంధువు తన శ్రేష్ఠబంధువు నిటు రమ్మని యాహ్వానించినట్లు మహాబలుడగు హనుమంతుని రావణుడున్న చోటి కాహ్వానించెనా యనిపించుచుండెను. 21

తత స్తాం ప్రస్థిత శ్శాలాం దదర్శ మహతీం శుభామ్,
రావణస్య మనఃకాంతాం కాంతామివ వరస్త్రియమ్. 22

మణిసోపానవికృతాం హేమజాలవిభూషితామ్,
స్ఫాటికై రావృతతలాం దంతాంతరితరూపికామ్. 23

ముక్తాభిశ్చ ప్రవాళైశ్చ రూప్యచామీకరై రపి,
విభూషితాం మణిస్తంభై స్సుబహుస్తంభభూషితామ్. 24

సమై ర్ఋజుభి రత్యుచ్చై స్సమంతాత్ సువిభూషితైః,
స్తంభైః పక్షై రివాత్యుచ్చై ర్దివం సంప్రస్థితామివ. 25

మహత్యా కుథయాస్తీర్ణాం పృథివీలక్షణాంకయా,
పృథివీమివ విస్తీర్ణాం సరాష్ట్రగృహమాలినీమ్. 26

నాదితాం మత్తవిహగై ర్దివ్యగంధాధివాసితామ్,

---

హనుమంతు డట్లు బయలుదేరి రావణుని హృదయమునకు ప్రీతిని గూర్చు శ్రేష్ఠతరుణి వలె విలసిల్లుచున్న మంగళకరము, విశాలమగు భవనమును చూచెను. 22

అందలి మెట్లు మణులు పొదుగబడియుండెను. కిటికీలు బంగారుతో చేయబడెను. నేల స్ఫటికమణిఖచితమై యుండెను. బొమ్మలు గజదంతముతో నిర్మింపబడియుండెను. మణిస్తంభములు ముత్యములు, పగడములు, వెండి, బంగారముతో నిర్మింపబడెను. ఇట్లు సమములు, వంకరలేనివి, అలంకరింపబడినవి, మిక్కిలి ఎత్తైనవగు అనేక స్తంభములతో ఉన్నతమైన ఆ భవనము తెక్కలతో నాకాశమున కెగుర సమకట్టినది వలె నుండెను. 23-25

ఆ భవనము నదులు, సముద్రములు, కొండలు, రాష్ట్రములు మున్నగు పృథ్వీలక్షణములు చక్కగా నగపడునట్లు చిత్రింపబడిన చిత్రకంబళముచే కప్పబడిన నేలకలదై, రాష్ట్రములు, గృహసముదాయముతో కూడిన భూమివలె విస్తరించియుండెను.

రావణుని ఆ గృహమున పక్షులు మత్తిల్లి కిలకిలధ్వను లొనర్చు చుండెను.

పరార్థ్యాస్తరణోపేతాం రక్షోధిపనిషేవితామ్. 27

ధూమ్రా మగరుధూపేన విమలాం హంసపాండురామ్,
చిత్రాం పుష్పోపహారేణ కల్మాషీమివ సుప్రభామ్. 28

మనస్సంహ్లాదజననీం వర్ణస్యాపి ప్రసాధినీమ్,
తాం శోకనాశినీం దివ్యాం శ్రియ స్సంజననీమివ. 29

ఇంద్రియా ణీంద్రియార్థైస్తు పంచ పంచభి రుత్తమైః,
తర్పయామాస మాతేవ తదా రావణపాలితా. 30

స్వర్గో౽యం దేవలోకో౽య మింద్రస్యేయం పురీ భవేత్,
సిద్ధి ర్వేయం పరా హి స్యా దిత్యమన్యత మారుతిః. 31

ప్రధ్యాయత ఇవాపశ్యత్ ప్రదీప్తాం స్తత్ర కాంచనాన్,

---

దివ్యగంధము గుబాళించుచుండెను. వెలలేని తివాచీలు భూతలముపై పఱచబడెను. 27

ఆ భవనము స్వచ్ఛమై హంసవలె తెల్లనిదైనను అగరుధూపముచే బూడిదరంగు కలదివలె నుండెను. వివిధవర్ణములు గల పుష్పాలంకారములచే వసిష్ఠుని నందినీధేనువువలె కాంతిమంతమై యుండెను. 28

ఆ గృహము చూపరుల మనస్సుల కానందము కలిగించుచు వారి ముఖవర్ణమును తన ప్రకాశముచే మఱింతగా కాంతిమంతము చేసి, శోకము పోగొట్టుచు శ్రేష్ఠమై సిరిసంపదలకు పుట్టినిల్లువలె నుండెను. 29

రావణరక్షితమగు ఆ భవనము అటకు పోయినవారి పంచేంద్రియములకు వలయు హృద్యములగు విషయములను సమకూర్చి, తల్లివలె వారిని తృప్తిపరచెను. 30

ఇది స్వర్గమా లేక ముఖ్యులగు ముప్పదిముగ్గురు దేవతల కావాసమగు దేవలోకమా లేక ఇంద్రుని అమరావతియా లేక బ్రహ్మస్థానమా యని హనుమంతు డా భవనవైభవమున కచ్చెరు వందెను. 31

హనుమంతు డచట బంగారు దీపపాత్రలలో నిశ్చలముగా వెలుగు దీపములను

ధూర్తానివ మహాధూర్తై ర్దేవనేన పరాజితాన్. 32

దీపానాం చ ప్రకాశేన తేజసా రావణస్య చ,
అర్చిర్భి ర్భూషణానాం చ ప్రదీప్తే త్యభ్యమన్యత. 33

తతోఽపశ్యత్ కుథాసీనం నానావర్ణాంబరస్రజమ్,
సహస్రం వరనారీణాం నానావేషవిభూషితమ్. 34

పరివృత్తేఽర్ధరాత్రే తు పాననిద్రావశం గతమ్,
క్రీడిత్వోపరతం రాత్రౌ సుష్వాప బలవత్తదా. 35

తత్ ప్రసుప్తం విరురుచే నిశ్శబ్దాంతరభూషణమ్,
నిశ్శబ్దహంసభ్రమరం యథా పద్మవనం మహత్. 36

తాసాం సంవృతదంతాని మీలితాక్షాణి మారుతిః,
అపశ్యత్ పద్మగంధీని వదనాని సుయోషితామ్. 37

---

చూచెను. అవి కుశలురగు జూదగాండ్రచే జూదమున నోడి ఏమియు తోచక నిశ్చేష్టులైన జూదరుల వలె నుండెను. 32

దీపముల కాంతి, రావణుని తేజము, ఆభరణముల ప్రకాశములు అంతటను వ్యాపించగా "ఈ శాల తగులబడుచున్నదా ఏమి" యని హనుమంతుడు తలంచెను. 33

అంత హనుమ వివిధవర్ణములు గల వస్త్రములు, మాలలు దాల్చి నానా వేషములతో నలంకరించుకొని, కంబళిపై నున్న శ్రేష్ఠవనితలు వేయిమందిని చూచెను. 34

అర్ధరాత్రి వరకు వివిధక్రీడలతో ప్రొద్దు పుచ్చి యలసియుండుటచేతను, మద్యము త్రాగుటచేతను వారందరును గాఢనిద్రలో మునిగి యుండిరి. 35

నిద్రించిన రాక్షసాంగనలున్న ఆ భవనము, వారి కదలికలు లేక నగల సవ్వడి లేనిదై శబ్దము చేయని హంసలు, తుమ్మెదలతో కూడిన పెద్ద తామరకొలనువలె నుండెను. 36

వారు కన్నులు, పలువరుస కాసరాకుండ పెదవులు మూసికొని యుండిరి. ఉత్తమజాతికి చెందిన ఆ స్త్రీలయొక్క ముఖములు పద్మగంధము కలిగియుండెను. 37

ప్రబుద్ధానీవ పద్మాని తాసాం భూత్వా క్షపాక్షయే,
పున స్సంవృతపత్రాణి రాత్రావివ బభు స్తదా. 38

ఇమాని ముఖపద్మాని నియతం మత్తషట్పదాః,
అంబుజానీవ ఫుల్లాని ప్రార్థయంతి పునః పునః. 39

ఇతి చామన్యత శ్రీమా నుపపత్త్యా మహాకపిః,
మేనే హి గుణత స్తాని సమాని సలిలోద్భవైః. 40

సా తస్య శుశుభే శాలా తాభిః స్త్రీభి ర్విరాజితా,
శారదీవ ప్రసన్నా ద్యౌ స్తారాభి రభిశోభితా. 41

స చ తాభిః పరివృత శ్శుశుభే రాక్షసాధిపః,
యథా హ్యుడుపతిః శ్రీమాం స్తారాభి రభిసంవృతః. 42

యా శ్చ్యవంతేఽంబరా త్తారాః పుణ్యశేషసమావృతాః,

---

వారి ముఖములు ఉదయము పద్మములవలె వికాసము పొంది, రాత్రి తిరిగి రేకులు ముడుచుకొన్న వద్మముల వలె ప్రకాశించెను. 38

'తుమ్మెద లీ ముఖపద్మములను గాంచి వికసించిన పద్మములని భ్రమించి మకరందమం దాశతో వీనిపై మాటిమాటికి తప్పక వ్రాలగలవు' అని హనుమంతుడు సయుక్తికముగ తలంచెను. సౌందర్య సౌగంధ్యాదిగుణములచే వారి ముఖములు పద్మములకు సాటి యని తలంచెను. 39,40

రావణుని భవన మా స్త్రీలతో విరాజిల్లుచు, వక్షత్రములతో శోభిల్లు శరత్కాలపు నిర్మలాకాశము వలె వ్రకాశించెను. 41

ఆ వనితలతో కూడిన రాక్షసరాజగు రావణుడు నక్షత్రములతో పరివేష్టితుడైవ శ్రీమంతుడగు చంద్రునివలె భాసిల్లెను. 42

'ఈ వనిత లందరును తా మనుభవింపగా మిగిలిన పుణ్యముచే ఆకాశము (స్వర్గము) నుండి భూమిపై బడి యీ రూపముతో నిచట కలసి యున్నా'రని

ఇమాస్తా స్సంగతాః కృత్స్నా ఇతి మేనే హరి స్తదా. 43

తారాణామివ సువ్యక్తం మహతీనాం శుభార్చిషామ్,
ప్రభావర్ణప్రసాదాశ్చ విరేజు స్తత్ర యోషితామ్. 44

వ్యావృత్తగురుపీనస్రక్ ప్రకీర్ణవరభూషణాః,
పానవ్యాయామకాలేషు నిద్రాపహృతచేతసః. 45

వ్యావృత్తతిలకాః కాశ్చిత్ కాశ్చి దుద్భ్రాంతనూపురాః,
పార్శ్వే గళితహారాశ్చ కాశ్చిత్ పరమయోషితః. 46

ముక్తాహారావృతా శ్చాన్యాః కాశ్చి ద్విస్రస్తవాససః,
వ్యావిద్ధరశనాదామాః కిశోర్య ఇవ వాహితాః. 47

సుకుండలధరా శ్చాన్యా విచ్ఛిన్నమృదితస్రజః,

---

హనుమంతుడు తలంచెను. 43

(ఏలననగా) అచట ఆ యువతుల కాంతి, వర్ణము, ప్రసన్నత యను నీ మూడును, సుందరమగు కాంతిగల శ్రేష్ఠములగు నక్షత్రముల కాంతి, వర్ణము, నిర్మలతవలె నుండెను. 44

మధుపానమునకు పిమ్మట రతికేళియందు (లేదా నృత్య, గీత, క్రీడాదులయందు) తాము ధరించిన పెద్ద పెద్ద పుష్పమాలలు స్థానము తప్పి, యాభరణములు చెదరి యుండగా ఆ యంగన లట్లే ఒడలు మఱచి నిదురింపసాగిరి. 45

వారిలో కొందరు ధరించిన తిలకము తొలగి యుండెను. కొందరి అందెలు స్థానము తప్పెను. కొందరి హారములు ప్రక్కలకు జారెను. 46

కొందరు ధరించిన ముత్యాలహారము తెగి ముత్యములు వారి చుట్టును వ్యాపించెను. కొందరు ధరించిన వస్త్రములు జారెను. కొందరి మొలత్రాళ్ళు వదులగుటచే మార్గాయాసము తొలగుకొఱకు కట్లు వదులు చేయగా నేలపై పొరలు ఆడగుఱ్ఱముల వలె ప్రకాశించుచుండిరి. 47

కొందరు చక్కని కుండలములు ధరించియుండిరి. వారు దాల్చిన మాలలు,

గజేంద్రమృదితాః ఫుల్లా లతా ఇవ మహావనే. 48

చంద్రాంశుకిరణాభాశ్చ హారాః కాసాంచి దుత్కటాః,
హంసా ఇవ బభు స్సుప్తాః స్తనమధ్యేషు యోషితామ్. 49

అపరాసాం చ వైడూర్యాః కాదంబా ఇవ పక్షిణః,
హేమసూత్రాణి చాన్యాసాం చక్రవాకా ఇవాభవన్. 50

హంసకారండవాకీర్ణా శ్చక్రవాకోపశోభితాః,
ఆవగా ఇవ తా రేజు ర్జఘనైః పులినైరివ. 51

కింకిణీజాలసంకోశా స్తా హైమవిపులాంబుజాః,
భావగ్రాహా యశస్తీరా స్సుప్తా నద్య ఇవాబభుః. 52

మృదుష్వంగేషు కాసాంచిత్ కుచాగ్రేషు చ సంస్థితాః,

---

దారము తెగి నలిగియుండెను. వా రా మాలలతో మహారణ్యమున గజశ్రేష్ఠము తొక్కివేసిన పూతీగలవలె నుండిరి. 48

కొందరు స్త్రీలు స్తనములనడుమ దాల్చిన లావైన ముత్యాలమాలలు చంద్రకిరణముల వలె తెల్లని కాంతిగలవై నిదురించిన హంసలవలె నుండెను. 49

కొందరు స్తనమధ్యప్రదేశమున దాల్చిన పగడములు కాదంబపక్షులవలెను, మఱికొందఱు ధరించిన స్వర్ణహారములు చక్రవాకపక్షులవలెను చూపట్టెను. 50

విశాలమగు పిరుదులు కల ఆ స్త్రీలు నిద్రావస్థలో మునిగి హంసలు, కారండవములు, చక్రవాకములతో కూడిన యిసుకతిన్నెలు గల నదుల వలె ప్రకాశించుచుండిరి. 51

ఆ స్త్రీలు గజ్జెలే మొగ్గలు, బంగారు ఆభరణములే వికసించిన పద్మములు, శృంగార చేష్టలే మొసళ్ళు, యశస్సునకు కారణమైన తనుకాంతియే తీరముగా గల నదులవలె ప్రకాశించుచుండిరి. 52

కొందఱు నిద్రించుటకై అలంకారములు తీసివైచినను, మృదువైన వారి

బభూవు ర్భూషణానీవ శుభా భూషణరాజయః. 53

అంశుకాంతాశ్చ కాసాంచి న్ముఖమారుతకంపితాః,
ఉపర్యుపరి వక్త్రాణాం వ్యాధూయంతే పునః పునః. 54

తాః పతాకా ఇవోద్ధూతాః పత్నీనాం రుచిరప్రభాః,
నానావర్ణసువర్ణానాం వక్త్రమూలేషు రేజిరే. 55

వవల్గు శ్చాత్ర కాసాంచిత్ కుండలాని శుభార్చిషామ్,
ముఖమారుతసంసర్గా న్మందం మందం సుయోషితామ్. 56

శర్కరాసవగంధై శ్చ ప్రకృత్యా సురభి స్సుఖః,
తాసాం వదననిశ్వాసః సిషేవే రావణం తదా. 57

రావణాననశంకాశ్చ కాశ్చి ద్రావణయోషితః,
ముఖాని స్మ సపత్నీనాముపాజిఘ్రన్ పునః పునః. 58

---

యంగములపై శుభములగు ఆభరణముల ముద్రలు చెఱుగక ఆభరణములవలెనే ప్రకాశించినవి. 53

వారు ముఖముపై కప్పుకొనిన సూక్ష్మములగు వస్త్రముల కొనలు వారి నిశ్వాస వాయువులచే కదలుచు మాటిమాటికి ముఖముపై పడుచుండెను. 54

ఆ రావణభార్యల నిశ్వాసవాయువు కారణముగా వారు ధరించిన సుందరవస్త్రముల కొనలు వివిధవర్ణములచే కాంతి మంతములై కదలుచు జెండాలవలె ప్రకాశించినవి. 55

మిక్కిలి కాంతిగల కొందఱు స్త్రీలు ధరించిన చెవిపోగులు తోటి వారి నిట్టూర్పు గాలికి మెల్లగా కదలుచుండెను. 56

సహజముగనే సుగంధియై చక్కెరతో చేసిన మద్యము త్రాగుటచే నింకను సువాసితమైన అ స్త్రీల ముఖనిశ్వాస మపుడు రావణుని సేవించెను. 57

కొందఱు రావణుని భార్యలు సవతుల ముఖములను రావణుని ముఖమే యని భ్రమపడి మాటిమాటికి అఘ్రాణించిరి. 58

అత్యర్థం సక్తమనసో రావణే తా వరస్త్రియః,
అస్వతంత్రాః సపత్నీనాం ప్రియ మేవాచరం స్తదా. 59

బాహూ నుపనిధా యాన్యాః పారిహార్యవిభూషితాన్,
అంశుకాని చ రమ్యాణి ప్రమదా స్తత్ర శిశ్యిరే. 60

అన్యా వక్షసి చాన్యస్యా స్తస్యాః కాశ్చిత్ పునర్భుజమ్,
అపరా త్వంక మన్యస్యా స్తస్యా శ్చాప్యపరా భుజౌ. 61

ఊరుపార్శ్వకటీపృష్ఠ మన్యోన్యస్య పమాశ్రితాః,
పరస్పరనివిష్టాంగ్యో మదస్నేహవశానుగాః. 62

అన్యోన్యభుజసూత్రేణ స్త్రీమాలా గ్రథితా హి సా,
మాలేవ గ్రథితా సూత్రే శుశుభే మత్తషట్పదా. 63

---

రావణునియందు మిక్కిలి మక్కువ గల ఆ సుందరాంగనలు, రాగాంధలై, తమ ముఖమును రావణుని ముఖమని భ్రమించి లిఘ్రాణించు తమ సవతులపై కోపింపక వారికి ప్రియమే చేకూర్చిరి. 59

కొందరు స్త్రీలు కడియము తొడిగిన తమ భుజములను, సుందరములగు సూక్ష్మ వస్త్రములను తలగడగా చేసికొని యచట శయనించిరి. 60

వారిలో నొకతె వేఱొకతె యురముపై తలయుంచి పరుండగా మఱికొంద రామె భుజములపై తలలుంచి నిద్రించిరి. మఱియొకతె వేఱొక స్త్రీ తొడపై తలయుంచి నిదురింపగా ఆమె భుజములపై తలయుంచి వేఱొకతె నిద్రించెను. 61

మద్యపానమువలన కలిగిన మదము, స్నేహములచే పరవశలైన యా స్త్రీలు ఒండొరుల తొడలు, ప్రక్కలు, మొలభాగములపై తలలుంచి, యొండొరులపై తమ కాలుచేతులు వైచి నిదురించిరి. 62

ఒండొరుల భుజము లను దారముచే గుచ్చబడిన ఆ స్త్రీసమూహ మను మాల, నల్లని కురులు అను మదించిన తుమ్మెదలు కలదై, దారముచే గుచ్చబడిన పుష్పమాలికవలె శోభిల్లెను. 63

లతానాం మాధవే మాసి ఫుల్లనాం వాయుసేవనాత్,
అన్యోన్యమాలాగ్రథితం సంసక్తకుసుమోచ్చయమ్. 64
వ్యతివేష్టితసుస్కంధ మన్యోన్యభ్రమరాకులమ్,
ఆసీ ద్వనమివోద్ధూతం స్త్రీవనం రావణస్య తత్. 65
ఉచితేష్వపి సువ్యక్తం న తాసాం యోషితాం తదా,
వివేక శ్శక్య ఆధాతుం భూషణాంగాంబరస్రజామ్. 66
రావణే సుఖసంవిష్టే తాః స్త్రియో వివిధప్రభాః,
జ్వలంతః కాంచనా దీపాః ప్రైక్షం తానిమిషా ఇవ. 67

---

వసంతుర్తువునందు మలయానిలసంచారముచే పుష్పించిన లతావన మెట్లు కంపించునో, అట్లే ముఖవాయుసంచారముచే తాము ధరించిన చీరల కొంగులు కదలుచుండగా, రావణస్త్రీసమూహము కూడ కదలినట్లుండెను. ఎట్లు తీగలన్నియు కలసి మాలగా నేర్పడునో, ఎట్లు శాఖోపశాఖలుగా కలసి పోవునో, ఎట్లు వాని పూలు, ఆ పూలపై వ్రాలిన తుమ్మెదలు కలసియుండిన ట్లగపడునో అట్లే ఒక్కచో కూర్చుండిన రావణుని స్త్రీలును మాలవలె నుండిరి. వారి భుజములు పరస్పరము పెనవైచుకొనబడి యుండెను. అట్లే వారి జడలు, జడలలో ధరించిన పూలు, వానిపై వ్రాలిన తుమ్మెదలును కలిసియుండినటు లయ్యెను. 64,65

ఆ సమయమున, ఆ రాక్షసాంగన లట్లు పెనవైచుకొని యుండుటచే ఉచితస్థానములందే ధరించినవైనను వారి ఆభరణములు, అవయవముల నాచ్ఛాదించు వస్త్రములు, పుష్పమాలికలు, ఇవి వీరి వని నిశ్చితముగా చెప్పుటకు వీలు కాకుండెను. 66

రావణుడు సుఖముగ నిద్రించుచుండగా బంగారు దీపపాత్రలలో వెలుగుచుండు దీపములు నిశ్చలములై వివిధకాంతులు గల యా రాక్షసకాంతలను తెప్పపాటు లేక చూచుచున్నటు లుండెను. (రావణుడు మేల్కొంచి యుండగా దీపములు కూడా ఆ స్త్రీలను నిశ్చలదృష్టితో చూడలేకపోయినవని సూచితము.) 67

రాజర్షిపితృదైత్యానాం గంధర్వాణాం చ యోషితః,
రాక్షసానాం చ యాః కన్యాస్తస్య కామవశం గతాః. 68

యుద్ధకామేన తాస్సర్వా రావణేన హృతాః స్త్రియః,
సమదా మదనేనైవ మోహితాః కాశ్చి దాగతాః. 69

న తత్ర కాచిత్ ప్రమదా ప్రసహ్య, వీర్యోపపన్నేన గుణేన లబ్ధా,
న చాన్యకామాపి న చాన్యపూర్వా, వినా వరార్హాం జనకాత్మజాం తామ్. 70

న చాకులీనా న చ హీనరూపా, నాదక్షిణా నానుపచారయుక్తా,
భార్యాఽభవత్తస్య న హీనసత్త్వా, న చాపి కాంతస్య న కామనీయా. 71

బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య, [1]యదీదృశీ రాఘవధర్మపత్నీ,

రాజర్షుల స్త్రీలు, పితరుల వనితలు, దైత్యాంగనలు, గంధర్వకాంతలు, రాక్షసకన్యలు అందరును రావణుని కామించి, యతనికి వశపడిరి. 68

రావణుడు యుద్ధప్రియు డగుటచే, తాను కన్యలను కొనివచ్చుచో వారికి సంబంధించినవారు తనపై యుద్ధమునకు వత్తురను ఆలోచనతో వారిని తెచ్చెనే కాని వారిని కామించి కాదు. మఱియు, మదవతు లతనిని తామే వలచి వచ్చిరి. 69

కేవలము సీతాదేవి తప్ప ఆ వనితలలో నెవ్వరును బలాత్కారముగ రావణునిచే తేబడినవారు లేరు. వారి యంగీకారముతోనే రావణుడు వారిని తెచ్చెను. అందు వేఱొకనిని వలచిన వనిత కాని, పూర్వమే ప్రియుడు కల వనితగాని లేరు. 70

వారిలో ఉత్తమవంశమున పుట్టనిది గాని, విరూపము కలదిగాని, నేర్పులేనిది గాని, రావణుని సేవింపనిది గాని, బలహీనురాలు గాని, పతియగు రావణునకు ప్రీతిపాత్రురాలు కానిది గాని యగు భార్య యొక్కతెయు లేదు. 71

హనుమంతుడు శత్రువులకును హితము కోరువాడగుటచే ‘ ఈ రావణుడెల్లపు

[1] లేదా ‘పూర్వశ్లోకమున సీత రావణభార్యలవలె తన భర్తతో గూడిన దగుచో, ఈ రావణు డామె నపహరింపకుండినచో బాగుగా నుండెడిదని హనుమ తలంచెను. అట్లు సీతాదేవిని రావణభార్యతో పోల్చి హీనోపమ చేసితినే యని పశ్చాత్తప్తుడై చింతించెను. అట్లే రావణు డీ

ఇమా యథా రాక్షసరాజభార్యాః, సుజాతమస్యేతి హి సాధుబుద్ధేః. 72
పునశ్చ సోఽచింతయదార్తరూపో, ధ్రువం విశిష్టా గుణతో హి సీతా,
అథాయమస్యాం కృతవాన్ మహాత్మా, లంకేశ్వరః కష్ట మనార్యకర్మ. 73

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే నవమః సర్గః.*

---

డెట్లు తన కాంతల నెడబాయకున్నాడో అట్లే సీతయు రాము నెడబాయకుండునట్లు ఆమెను రావణుడు రామున కర్పించునో రావణుని సంపద అవిచ్ఛిన్నమై యుండును కదా' అని తలంచెను. 72

అనంతరము, "సీతాదేవి పాతివ్రత్యగుణవిశిష్టురాలు. గొప్ప కులమున బుట్టియు, ఈ రావణుడు సీతాపహరణ మను నీచకార్యమున కొడిగట్టినాడు. ఎంత కష్టము" అని తలచి " సీతాదేవి ధృఢవ్రత కావున ఆమె పాతివ్రత్యమున కెట్టి భంగమును కలుగదు. కనుక రావణు డామెను తెచ్చి దుష్కృత్యమే చేయుచున్నా డని మిక్కిలి దుః ఖించెను. 73

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున తొమ్మిదవ సర్గము.*

---

సీత నపహరించి చాల యన్యాయమగు పని చేసినాడు. ఇతని సకల లంకైశ్వర్యము నాశము గాక తప్ప' దనియు చింతించెను.

లేదా 'రాముని ధర్మపత్నియగు సీత యే విధముగ రావణునిచే బలాత్కారముగ తీసికొని రాబడెనో అట్లే రాక్షసరాజు భార్యలందరు సుగ్రీవునిచే బంధింపబడుచో బాగుగ నుండెడిది' అని సన్మంత్రిగా హనుమ ఆలోచించెను.

లేదా సద్బుద్ధి కలవాడైనను, హనుమంతున కొక్క క్షణము 'ఈ రాక్షసరాజు భార్యలంద రెట్లు రావణునియం దనురక్తలైరో యట్లే సీతాదేవియు అనురక్తురా లగుచో బాగుగ నుండెడిది' అని ఆలోచన కలిగెను. ఐశ్వర్యాధిక్యము చూచుటవలన కలిగిన విస్మయమే దానికి కారణము. అందువలననే ముందు ముందు రావణుని సభలో చూచి, 'అహో రూప మహో ధైర్యం ' ఇత్యాది హనుమంతుడు పలుకుట. ఇట్లు హఠాత్తుగా పలికి, పిమ్మట దుఃఖించెను – 'సీత పాతివ్రత్యగుణముచే అందరికంటెను శ్రేష్ఠురాలు కావున నే నిట్లేల పలికితి'నని సంతప్తహృదయుడై వే నీమె విషయమున అనార్యకృత్యమును (అసమంజనమగు ఆలోచనను) చేసితివే యని చింతించెను. ( –గోవిందరాజీయము)

# 10. దశమః సర్గః

*(హనుమంతుడు మండోదరిని చూచుట)*

తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితమ్,
అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్. 1

దాంతకాంచనచిత్రాంగై ర్వైడూర్యైశ్చ వరాసనైః,
మహార్హాస్తరణోపేతై రుపపన్నం మహాధనైః. 2

తస్య చైకతమే దేశే సోఽగ్ర్యమాలావిభూషితమ్,
దదర్శ పాండురం ఛత్రం తారాధిపతిసన్నిభమ్. 3

జాతరూపపరిక్షిప్తం చిత్రభానుసమప్రభమ్,
అశోకమాలావితతం దదర్శ పరమాసనమ్. 4

---

హనుమంతు డట్లు రావణుని అంతఃపురమును పరిశీలించుచు, అతడు శయనించు పర్యంక (మంచ)ముమ చూచెను. స్ఫటికములు, రత్నములు పొదిగిన ఆ శయనము ఇంద్రాది దేవతల శయ్యవలె శ్రేష్ఠమై యుండెను. 1

అచట రావణుడు శయనము దిగినపుడు విశ్రమించుటకై అమూల్యములగు ఆసనము లుండెను. వానిని వైడూర్యములు, దంతములు, బంగారములతో ఆశ్చర్యకరముగ నిర్మించిరి. ఆ ఆసనములపై విలువైన పరుపులు పరచియుండెను. 2

ఆ మంచమునకు శిరోభాగమున శ్రేష్ఠములగు పుష్పమాలికలతో అలంకృతమై, చంద్రునివలె ప్రకాశించు తెల్లగొడుగును హనుమంతుడు చూచెను. 3

శ్రేష్ఠమగు ఆ మంచము బంగారుపూత కల దగుటచే సూర్యునివలె ప్రకాశించుచు, అశోకపుష్పమాలలచే అలంకృతమై యుండెను. 4

వాలవ్యజనహస్తాభి ర్వీజ్యమానం సమంతతః,
గంధైశ్చ వివిధై ర్జుష్టం వరధూపేన ధూపితమ్. 5
పరమాస్తరణాస్తీర్ణ మావికాజినసంవృతమ్,
దామభి ర్వరమాల్యానాం సమంతా దుపశోభితమ్. 6
తస్మిన్ జీమూతసంకాశం ప్రదీప్తోత్తమకుండలమ్,
లోహితాక్షం మహాబాహుం మహారజతవాససమ్. 7
లోహితే నానులిప్తాంగం చందనేన సుగంధినా,
సంధ్యారక్త మివాకాశే తోయదం సతటిద్గణమ్. 8
వృత మాభరణై ర్దివ్యైః సురూపం కామరూపిణమ్,
సవృక్షవనగుల్మాఢ్యం ప్రసుప్తమివ మందరమ్. 9
క్రీడి త్వోపరతం రాత్రౌ వరాభరణభూషితమ్,
ప్రియం రాక్షసకన్యానాం రాక్షసానాం సుఖావహమ్. 10

---

స్త్రీలు ఆ శయనమునకు నలువైపులను నిలచి, వింజామరలు చేపట్టి విసరుచుండిరి. వివిధ సుగంధద్రవ్యములచే ఆ పర్యంకప్రదేశము పరిమళించుచుండెను. ఉత్తమమగు ధూప మంతటను వ్యాపించుచుండెను. 5

ఆ మంచముపై ఉత్తమమగు పఱుపు వేయబడియుండెను. దానిపై గొఱ్ఱెతోలు పరచిరి. శ్రేష్ఠములగు పూలమాలలు ఆ ప్రదేశమును శోభిల్లజేయుచుండెను. 6

రాక్షసకన్యలకు ప్రియుడు, రాక్షసులకు సుఖము కలిగించువాడగు రావణుడు రాత్రి వివిధక్రీడలు సలిపి, మద్యపానము చాలించి, ప్రకాశించు ఆ శయనముపై నిదురించుచుండగా హనుమంతుడు చూచెను. రావణు డపుడు మేఘమువలె నల్లనై, మెరయుచున్న మేలైన కుండలములు దాల్చి, ఎఱ్ఱని కన్నులు, విశాలభుజములు కలవాడై, బంగారునరిగ వస్త్రములు దాల్చి, గుబాళించు రక్తచందనము శరీరముపై పూసికొని, ఆకాశమున మెరుపులతో కూడి సంధ్యారాగముచే ఎఱ్ఱబారిన మేఘమువలె

పీత్వా౽ప్యుపరతం చాపి దదర్శ స మహాకపిః,
భాస్వరే శయనే వీరం ప్రసుప్తం రాక్షసాధిపమ్. 11

నిఃశ్వసంతం యథా నాగం రావణం వానరర్షభః,
ఆసాద్య పరమోద్విగ్నః సో౽పాసర్పత్ సుభీతవత్. 12

అథా౽౽రోహణ మాసాద్య వేదికాంతర మాశ్రితః,
సుప్తం రాక్షసశార్దూలం ప్రేక్షతే స్మ మహాకపిః. 13

శుశుభే రాక్షసేంద్రస్య స్వపత శ్శయనోత్తమమ్,
గంధహస్తిని సంవిష్టే యథా ప్రస్రవణం మహత్. 14

కాంచనాంగదనద్ధౌ చ దదర్శ స మహాత్మనః,

---

నుండెను. సుందరుడు, కామరూపి అగు అతడు దివ్యాభరణములు ధరించి, చెట్లు, తోటలు, పొదలతో కూడినదై (సముద్రమథనమునకు పిమ్మట) నిశ్చలమైయున్న మందరపర్వతమువలె, లోకమును పలుమార్లు కలచివైచి, ఒడలు మరచి నిదురించుచుండెను. 7-11

బుసకొట్టు సర్పమువలె నిశ్వసించుచున్న రావణుని చెంతకు చేరి హనుమంతుడు మిక్కిలి భయపడినవానివలె ఉద్వేగము నంది, వెంటనే యొకింత దూరము వెనుకకు పోయెను. 12

పిమ్మట అతడు మెట్లపై నుండి వెడలి వేరొక వేదిక నెక్కి నిలచి యటనుండియే నిదురించిన రావణుని చూడసాగెను. 13

తన గాలి సోకినంతనే సామాన్యగజములను వెరపించు గంధగజము ప్రవేశించిన సెలయేరు, యితరగజములు రాకుండుటచే ఏకాంతమున నున్నట్లు, రాక్షసేంద్రుడగు రావణుడు శయనించిన ఆ శ్రేష్ఠమగు పాన్పు, భయమువలన అన్యులు చేరకుండుటచే వివిక్తమై శోభిల్లెను. 14

పిమ్మట హనుమంతుడు తెల్లనైన పాన్పుపై రావణుడు భుజములు జారవిడచియుంచగా చూచెను. అవి బంగారు బాహుపురులతో విలసిల్లుచు,

విక్షిప్తౌ రాక్షసేంద్రస్య భుజా వింద్రధ్వజోపమౌ. 15
ఐరావతవిషాణాగ్రై రాపీడనకృతవ్రణౌ,
వజ్రోల్లిఖితపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ. 16
పీనౌ సమసుజాతాంసౌ సంగతౌ బలసంయుతౌ,
సులక్షణనఖాంగుష్ఠౌ స్వంగుళీతలలక్షితౌ. 17
సంగతౌ పరిఘాకారౌ వృత్తౌ కరికరోపమౌ,
విక్షిప్తౌ శయనే శుభ్రే పంచశీర్షా వివోరగౌ. 18
శశక్షతజకల్పేన సుశీతేన సుగంధినా,
చందనేన పరార్థ్యేన స్వనులిప్తౌ స్వలంకృతౌ. 19
ఉత్తమస్త్రీవిమృదితౌ గంధోత్తమనిషేవితౌ,
యక్షపన్నగగంధర్వదేవదానవరావిణౌ. 20
దదర్శ స కపి స్తస్య బాహూ శయనసంస్థితౌ,

---

ఇంద్రధ్వజములవలె నుండెను. ఐరావతముతో పూర్వము పోరాడినపు దేర్పడిన గాయపు మచ్చలు, దేవేంద్రుని వజ్రాయుధపు గాట్లు వానిపై ప్రకాశించుచుండెను. బలిసిన మూపుతో, విష్ణుచక్రపు గాయముల మచ్చలతో కూడినవై, దృఢములై, వరస్పురనధృశములై, చక్కని మూపుగలవై, సంగతములై, దృఢమగు సంధిబంధము కలవై, మిక్కిలి బలము కలవై, మంచి లక్షణములు గల గోళ్ళు బొటన వ్రేళ్ళు అఱచేతులు కలవై, గడియమానులవలె నున్నవై, గుండ్రములైన ఏనుగు తొండముల వలె నొప్పుచు, ఆ భుజములు ఐదుతలల పాములవలె నుండెను. 15-18

ఆ రావణుని భుజములు కుందేలు నెత్తురువలె ఎఱ్ఱనై, మిక్కిలి చల్లనై, సుగంధము గల శ్రేష్ఠచందనముచే చక్కగా పూయబడినవై, అలంకరింపబడినవై, ఉత్తమస్త్రీలచే ఒత్తబడినవై, శ్రేష్ఠమగు సుగంధము కలవై, యక్షులు-కిన్నరులు- గంధర్వులు-దేవతలు-

మందర స్యాంతరే సుప్తౌ మహాహీ రుషితావివ. 21

తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశః శృంగాభ్యామివ మందరః. 22

చూతపున్నాగసురభి ర్వకుళోత్తమసంయుతః,
మృష్టాన్నరససంయుక్తః పానగంధపురస్సరః. 23

తస్య రాక్షససింహస్య నిశ్చక్రామ మహాముఖాత్,
శయానస్య వినిశ్వాసః పూరయన్నివ తద్గృహమ్. 24

ముక్తామణివిచిత్రేణ కాంచనేన విరాజితమ్,
మకుటే నాపవృత్తేన కుండలోజ్జ్వలితాననమ్. 25

రక్తచందనదిగ్ధేన తథా హారేణ శోభినా,
పీనాయతవిశాలేన వక్షసాఽభివిరాజితమ్. 26

---

దానవులను యుద్ధమున పీడించునవై మందరపర్వతము నడుమ నిద్రించుచున్నట్టి కోపించిన మహాసర్పముల వలె నుండగా హనుమ చూచెను. 19-21

రాక్షసరాజగు ఆ రావణుడు, అట్టి బలిసిన బాహువులు కలవాడై, శిఖరములు రెంటితో కూడిన మందరపర్వతము వలె శోభిల్లెను. 22

అట్లు నిదురించుచున్న రావణుని పెద్ద నోటినుండి మామిడి, పొన్న పూల సుగంధము కలవి, పొగడపూల ఉత్తమగంధముతో కూడినవి, మృష్టాన్నరసముల వాసనతో కూడినవి, మద్యగంధము కలవి యగు నిట్టూర్పులు ఆ గృహమును నింపుచున్నవో యనునట్లు వెలువడినవి. 23,24

బంగారముతో చేయబడినదై, ముత్యములు పొదుగబడినదై, నిద్రావశముచే కొంచెము ప్రక్కకు తొలగినదైన కిరీటముతో ప్రకాశించువాడును, కుండలకాంతిచే తేజరిల్లు ముఖము కలవాడును, బలిష్ఠము, విశాలమునై, రక్తచందనము పూయబడినదైన ముత్యాలహారముతో విరాజిల్లు వక్షఃస్థలము గలవాడును, తెల్లని

పాండరే ణాపవిద్ధేన క్షౌమేణ క్షతజేక్షణమ్,
మహార్హేణ సుసంవీతం పీతే నోత్తమవాసపా. 27

మాషరాశిప్రతీకాశం నిఃశ్వసంతం భుజంగవత్,
గాంగే మహతి తోయాంతే ప్రసుప్తమివ కుంజరమ్. 28

చతుర్భిః కాంచనై ర్దీపై ర్దీప్యమానచతుర్దిశమ్,
ప్రకాశీకృతసర్వాంగం మేఘం విద్యుద్గణై రివ. 29

పాదమూలగతా శ్చాపి దదర్శ సుమహాత్మనః,
పత్నీ స్స ప్రియభార్యస్య తస్య రక్షఃపతే ర్గృహే. 30

శశిప్రకాశవదనా శ్చారుకుండలభూషితాః,
అమ్లానమాల్యాభరణా దదర్శ హరియూథపః. 31

నృత్తవాదిత్రకుశలా రాక్షసేంద్రభుజాంకగాః,

---

ఉత్తరీయము ధరించినవాడును, విలువైన శ్రేష్ఠవస్త్రము దాల్చినవాడును, మినుములరాశి వలె నల్లగా నున్నవాడును, పామువలె నిట్టూర్చుచున్నవాడును, నాలుగు దిక్కులందును నాలుగు బంగారు దీపపాత్ర లుండుటచే నలుగడల ప్రకాశము కలవాడును, తన పాదమూలము చెంతనే యున్న భార్యలతో గూడి మెఱుపుల సమూహములచే అంతటను ప్రకాశమానమగు మేఘము వలె నున్నవాడును అగు మహాపరాక్రమశాలి రావణుని హనుమంతు డచట చూచెను. 25-30

ఆ హనుమంతుడు చంద్రునివలె ప్రకాశించు మోము గలవారును, సుందరములైన కర్ణాభరణములు ధరించినవారును, వాడిపోని పుష్పమాలల నలంకరించుకొనినవారును అగు రావణుని ప్రియభార్యలను చూచెను. 31

హనుమంతు డచట నృత్తమందును, వాద్యములందును నేర్పుకలవారును, రావణునిచే తొడపై కూర్చుండబెట్టుకొని, ఆలింగనము చేసికొని లాలింపబడినవారును, ఉత్తమములగు నగలు ధరించినవారును అగు రావణభార్యలను వారు

వరాభరణధారిణ్యో నిషణ్ణా దదృశే హరిః. 32
వజ్రవైడూర్యగర్భాణి శ్రవణాంతేషు యోషితామ్,
దదర్శ తాపనీయాని కుండలా న్యంగదాని చ . 33
తాసాం చంద్రోపమై ర్వక్త్రై శ్శుభై ర్లలితకుండలైః,
విరరాజ విమానం త న్నభ స్తారాగణై రివ. 34
మదవ్యాయామఖిన్నా స్తా రాక్షసేంద్రస్య యోషితః,
తేషు తే ష్వవకాశేషు ప్రసుప్తా స్తనుమధ్యమాః. 35
అంగహారై స్తథైవాన్యా కోమలై ర్నృత్తశాలినీ,
విన్యస్తశుభసర్వాంగీ ప్రసుప్తా వరవర్ణినీ. 36
కాచి ద్వీణాం పరిష్వజ్య ప్రసుప్తా సంప్రకాశతే,

---

నిదురించుచుండగా చూచెను. 32

తమ భుజములపై తల లుంచుకొని నిదురించుచుండుటచే, ఆ స్త్రీలు ధరించిన వజ్రవైడూర్యములు పొదిగిన కర్ణాభరణములును, బాహుపురులును గూడ చెవుల కంటియున్నటులే అతని కగపడెను. 33

చంద్రునితో సాటియైనవి, మంగళకరమైనవి, రమ్యమైన కమ్మలు గలవి అగు ముఖములతో విలసిల్లు రాక్షసస్త్రీలతో కూడిన ఆ విమానము నక్షత్రసమూహములతో ఆకాశము వలె ప్రకాశించెను. 34

సన్నని నడుము గల ఆ రావణభార్యలు, మద్యము త్రాగి, మత్తిల్లి, అలసి సొలసి, అవకాశమున్న తావున శయనించిరి. 35

వారిలో నొక యుత్తమవనిత, నృత్తకుశల యగుటచే, నిద్రలో కూడ వాసనాబలముచే తన అంగములను విలాసముగ నా యా యోగ్యప్రదేశములందు నిలుపుచు గాఢనిద్రలో నుండెను. 36

నదీప్రవాహమున కొట్టుకొనిపోవుచు అతర్కితముగ కలసిన పడవతో గూడిన

మహానదీప్రకీర్ణేవ నళినీ పోత మాశ్రితా. 37

అన్యా కక్షగతేనైవ మడ్డుకే నాసితేక్షణా,
ప్రసుప్తా భామినీ భాతి బాలపుత్రేవ వత్సలా. 38

పటహం చారుసర్వాంగీ పీడ్య శేతే శుభస్తనీ,
చిరస్య రమణం లబ్ధ్వా పరిష్వజ్యేవ భామినీ. 39

కాచి ద్వంశం పరిష్వజ్య సుప్తా కమలలోచనా,
రహః ప్రియతమం గృహ్య సకామేవ చ కామినీ. 40

విపంచీం పరిగృహ్యాన్యా నియతా నృత్తశాలినీ,
నిద్రావశ మనుప్రాప్తా సహకాంతేవ భామినీ. 41

అన్యా కనకసంకాశై ర్మృదుపీనై ర్మనోరమైః,
మృదంగం పరిపీడ్యాంగైః ప్రసుప్తా మత్తలోచనా. 42

---

తామరతీగవలె వేరొకతె వీణను కౌగిలించుకొని నిదురించుచు ప్రకాశించుచుండెను. 37

నల్లని కన్నులు గల వేఱొకతె తన చంకలోనే దుమ్మెట యను వాద్యము నుంచుకొని నిదురించుచు, చిన్న తనయునితో కూడిన మాతృమూర్తి వలె శోభిల్లుచుండెను. 38

సర్వావయవసుందరమూర్తి, చక్కని స్తనములు గల మఱియొకతె, దేశాంతరము పోయి, చిరకాలమునకు మఱలివచ్చిన పతిని కౌగిలించుకొనిన వనిత వలె, తప్పెటను గట్టిగా పట్టుకొని నిదురించెను. 39

పద్మములవంటి కన్నులుగల ఇంకొక్కతె, ఏకాంతమున ప్రియుని గూడిన మదనార్తయగు వనిత వలె గట్టిగా వేణువును కౌగిలించుకొని నిదురించెను. 40

నృత్తముచే ప్రకాశించు మఱియొకతె, విపంచి యనబడు ఏడు తీగల వీణను పట్టుకొని ప్రియునితో గూడిన కాంతవలె విలసిల్లుచు నిద్రాపరవశ యయ్యెను. 41

మదిరాక్షియగు మఱొక్కతె బంగారువన్నె కలవి, మృదువైనవి, బలిసినవి యగు తన సుందరాంగములతో మద్దెలను గట్టిగా కౌగిలించుకొని నిదురించినది. 42

భుజపార్శ్వాంతరస్థేన కక్షగేన కృశోదరీ,
పణవేన సహానింద్యా సుప్తా మదకృతశ్రమా. 43

డిండిమం పరిగృహ్యాన్యా తథై వాసక్తడిండిమా,
ప్రసుప్తా తరుణం వత్స ముపగూహ్యేవ భామినీ. 44

కాచి దాడంబరం నారీ భుజసంయోగపీడితమ్,
కృత్వా కమలపత్రాక్షీ ప్రసుప్తా మదమోహితా. 45

కలశీ మపవిధ్యాన్యా ప్రసుప్తా భాతి భామినీ,
వసంతే పుష్పశబలా మాలేవ పరిమార్జితా. 46

పాణిభ్యాం చ కుచౌ కాచిత్ సువర్ణకలశోపమౌ,
ఉపగూ హ్యాబలా సుప్తా నిద్రాబలపరాజితా. 47

అన్యా కమలపత్రాక్షీ పూర్ణేందుసదృశాననా,

---

మచ్చలేని లావణ్యముగల యొక తలోదరి మదముచే అలసి, పణవ మను వాద్య విశేషమును భుజముల ప్రక్కగా, చంకలో నుంచుకొని నిద్రించెను. 43

మఱియొకతె డిండిమము నొకదానిని చేతపట్టుకొని, వేరొక డిండిమమును కౌగిలించుకొన్నదై, ప్రియుని హత్తుకొని, తనయు నెత్తుకొన్న భామిని వలె నిదురించెను. 44

తామరఱేకుల వంటి కన్నులుగల యొక్కతె మద్యము త్రాగి, మదవతియై ఆడంబర మను వాద్యమును కౌగిలించుకొని నిదురించెను. 45

మఱియొక భామిని సర్వాభరణములు దాల్చి, నీటితో నిండిన కలశమును తనపై బోరగిల జేసికొనినదై, వసంతకాలమున వాడిపోకుండునట్లుగా తడుపబడిన చిత్రవర్ణముగల పూలమాలవలె నున్నదై, నిద్రించుచు శోభిల్లెను. 46

వేఱొక వనిత బంగారు కలశములవలె నున్న తన స్తనములను చేతులతో మూసికొని నిద్రాపరవశ యయ్యెను. 47

కమలపత్రముల వంటి కన్నులు కలది, పున్నమి చందురుని బోలు మోముగలది

అన్యా మాలింగ్య సుశ్రోణీం ప్రసుప్తా మదవిహ్వలా. 48
ఆతోద్యాని విచిత్రాణి పరిష్వజ్య వరస్త్రియః,
నిపీడ్య చ కుచై స్సుప్తాః కామిన్యః కాముకానివ. 49
తాసా మేకాంతవిన్యస్తే శయానాం శయనే శుభే,
దదర్శ రూపసంపన్నా మపరాం స కపిః స్త్రియమ్. 50
ముక్తామణిసమాయుక్తై ర్భూషణై స్సువిభూషితామ్,
విభూషయంతీమివ తత్ స్వశ్రియా భవనోత్తమమ్. 51
గౌరీం కనకవర్ణాభా మిష్టా మంతఃపురేశ్వరీమ్,
కపి ర్మందోదరీం తత్ర శయానాం చారురూపిణీమ్. 52
స తాం దృష్ట్వా మహాబాహు ర్భూషితాం మారుతాత్మజః,

---

యగు మదవతి యొక్కతె చక్కని పిరుదులు గల వేరొకతెను కౌగిలించుకొని మత్తిలి నిదురించెను. 48

సుందరాంగనలు కొందరు విచిత్రములగు నాల్గు విధములగు వాద్యములను కౌగిలించుకొని, ప్రియులను తమ స్తనములతో పీడించుచు కౌగిలించుకొనిన కామినుల వలె నిదురించిరి. 49

వారి శయనప్రదేశమున కాక, వేరొకచోట ఉత్తమశయనముపై పరుండియున్న మిక్కిలి సుందరరూపము గల యొక వనితను హనుమంతుడు చూచెను. 50

ఆమె ముత్యములతో గూర్చబడిన యలంకారములతో చక్కగా నలంకరించుకొనినదై, తన కాంతిచే ఆ శ్రేష్ఠభవనమునే ప్రకాశింపజేయుచున్నదా యనిపించుచుండెను. 51

మేలిమి బంగారమువలె మెఱయుచున్నది, రావణునకు మిక్కిలి ప్రియురాలు, సుందర రూపము కలది, అంతఃపురప్రధానురాలు అగు మండోదరి యచట నిదురించుచుండగా హనుమ చూచెను. 52

మహాభుజుడగు హనుమంతు డట్లు చక్కగా నలంకరించుకొనియున్న మండోదరిని

తర్కయామాస సీతేతి రూపయౌవనసంపదా.
హర్షేణ మహతా యుక్తో ననంద హరియూథపః. 53

ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
ననంద చిక్రీడ జగౌ జగామ,
స్తంభానరోహ న్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్. 54

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే దశమః సర్గః.*

---

చూచి, సౌందర్యము, యౌవనములనుబట్టి ఆమె సీతయే యని యూహించెను. వెంటనే పులకితుడై మిక్కిలి యానందించెను. 53

హనుమంతుడు తన యానందమును వానరసహజములైన చేష్టలచే వ్యక్తము చేయుచు జబ్బలు చఱచికొనెను. తోకను ముద్దిడుకొనెను. ఆనందపారవశ్యము నందెను. ఆడెను. పాడెను. ఇటు నటు తిరిగెను. స్తంభముల నెక్కెను. వానిపై నుండి క్రిందకు దూకెను. 54

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదవ సర్గము.*

# 11. ఏకాదశః సర్గః

*(హనుమంతుడు రావణభవనమున సీతను వెదకుట)*

అవధూయ చ తాం బుద్ధిం బభూవావస్థిత స్తదా,
జగామ చాపరాం చింతాం సీతాం ప్రతి మహాకపిః. 1

న రామేణ వియుక్తా సా స్వప్తు మర్హతి భామినీ,
న భోక్తుం నాప్యలంకర్తుం న పాన ముపసేవితుమ్,
నాన్యం నర ముపస్థాతుం సురాణామపి చేశ్వరమ్. 2

న హి రామపమః కశ్చి ద్విద్యతే త్రిదశేష్వపి,
అన్యేయ మితి నిశ్చిత్య పానభూమౌ చచార సః. 3

క్రీడితే నాపరాః క్లాంతా గీతేన చ తథాపరాః,
నృత్తేన చాపరాః క్లాంతా పానవిప్రహతా స్తథా. 4

మురజేషు మృదంగేషు పీఠికాసు చ సంస్థితాః,

---

హనుమంతు డామె మండోదరి యని, సీత కాదని తెలిసికొనగనే తన చపలభావమును విడచి, సీతనుగూర్చి వేరొక ఆలోచన కలవాడయ్యెను. 1

సీతాదేవి రాము నెడబాసి నిదురింపదు, భుజింపదు, అలంకరించుకొనదు, పానీయాదులు త్రాగదు. ఇతరుడు దేవేంద్రుడైనను చెంత కేగదు. రామునకు సాటి యగువాడు దేవతలలోనే లేదు. ఈమె సీత కాదు. వేరొక్కతె యని నిశ్చయించి హనుమంతుడు పానభూమి (మద్యము త్రాగుచోటు) కడకు పోయెను. 2,3

రావణుని స్త్రీలలో కొందరు క్రీడించుటచేతను, మరికొందరు పాడుటచేతను, ఇంకను కొందరు నృత్యముచేతను, కొందరు మద్యసేవనముచేతను అలసి యుండిరి.

తథాఒ_ఒ_ స్తరణముఖ్యేషు సంవిష్టాశ్చాపరాః స్త్రియః. 5
అంగనానాం సహస్రేణ భూషితేన విభూషణైః,
రూపసల్లాపశీలేన యుక్తగీతార్థభాషిణా. 6
దేశకాలాభియుక్తేన యుక్తవాక్యాభిధాయినా,
రతాభిరతసంసుప్తం దదర్శ హరియూథపః. 7
తాసాం మధ్యే మహాబాహు శ్శుశుభే రాక్షసేశ్వరః,
గోష్ఠే మహతి ముఖ్యానాం గవాం మధ్యే యథా వృషః. 8
స రాక్షసేంద్ర శ్శుశుభే తాభిః పరివృతః స్వయమ్,
కరేణుభి ర్యథారణ్యే పరికీర్ణో మహాద్విపః. 9
సర్వకామై రుపేతాం చ పానభూమిం మహాత్మనః,
దదర్శ హరిశార్దూల స్తస్య రక్షఃపతే ర్గృహే. 10

---

వారు మద్దెళ్ళపై, పీటలపై పాన్పులపై మేను వాల్చి నిదురించిరి. 4,5

అట్లు వివిధాలంకారములతో అలంకరించబడినవారును, తమ సౌందర్యమును (లేదా రావణసౌందర్యమును) వర్ణించువారును, ఆ యా సమయమువకు తగిన పాటలు పాడి, వాని యర్థము వివరించుచున్నవారును, దేశకాలానుగుణముగ వ్యవహరించువారును, ఔచిత్యానుగుణముగ మాటలాడువారును అగు పలువురు స్త్రీలను భోగేచ్ఛతో అనుభవించి నిదురించుచున్న రావణుని హనుమంతుడు చూచెను. 6,7

ఆ వనితల నడుమ నున్న రావణుడు, మందలోని ఉత్తమగోసమూహము నడుమ వృషభము వలె ప్రకాశించెను. 8

ఆ స్త్రీలతో పరివేష్టితుడైన ఆ రాక్షసరాజు మహారణ్యమున ఆడు ఏనుగులచే పరివేష్టితమగు మహాగజము వలె విరాజిల్లెను. 9

కపిశ్రేష్ఠు డగు హనుమంతుడు మహాత్ముడు, రాక్షసరాజగు రావణు నింట యిష్టములగు సకలపదార్థములు గల పానభూమిని చూచెను. 10

మృగాణాం మహిషాణాం చ వరాహాణాం చ భాగశః,
తత్ర న్యస్తాని మాంసాని పానభూమౌ దదర్శ సః. 11

రౌక్మేషు చ విశాలేషు భాజనే ష్వర్ధభక్షితాన్,
దదర్శ హరిశార్దూలో మయూరాన్ కుక్కుటాం స్తథా. 12

వరాహవార్ధ్రాణసకాన్ దధిసౌవర్చలాయుతాన్,
శల్యాన్ మృగమయూరాంశ్చ హనుమా నన్వవైక్షత. 13

క్రకరాన్ వివిధాన్ సిద్ధాం శ్చకోరా నర్ధభక్షితాన్,
మహిషా నేకశల్యాంశ్చ ఛాగాంశ్చ కృతనిష్ఠితాన్. 14

లేహ్యానుచ్చావచాన్ పేయాన్ భోజ్యాని వివిధాని చ . 15

తథా౽౽ మ్లలవణోత్తంసై ర్వివిధై రాగషాడబైః,

---

ఆ పానభూమియందు హనుమ మృగములు, దున్నలు, వరాహముల మాంసములు వేర్వేరు పాత్రలలో నుండగా చూచెను. 11

విశాలములగు వెండిపాత్రలలో సగము తివి విడచిన నెమలి, కోడి మాంసములను హనుమ చూచెను. 12

వరాహములు, ఖడ్గమృగములు, ముండ్లపందులు, లేళ్ళు, నెమళ్ళ మాంసములును, పెరుగు, సౌవర్చల మనబడు లవణము (వంజుకొనుటకు) అచట పాత్రలలో నుండుట హనుమంతుడు చూచెను. 13

చక్కగా పక్వము చేయబడిన వివిధములగు కొక్కెర మాంసములను, సగము తినగా మిగిలిన చకోర మాంసమును, దున్నపోతు మాంసమును, మత్స్యములను, సుపక్వమైన మేకమాంసమును, వివిధములగు పచ్చండ్లను, త్రాగదగిన చారు మున్నగు వానిని, పాయసాదులను, వివిధములగు భోజ్యపదార్థములను హనుమంతు డట చూచెను. 14,15

మఱియు అమ్ల, లవణ ప్రధానములై తెల్లావాలు కలిపిన షడ్రససంయుత

హారనూపురకేయూరై రపవిద్ధై ర్మహాధనైః. 16
పానభాజనవిక్షిప్తైః ఫలైశ్చ వివిధైరపి,
కృతపుష్పోపహారా భూ రధికం పుష్యతి శ్రియమ్. 17
తత్ర తత్ర చ విన్యస్తై స్సుశ్లిష్టై శ్శయనాసనైః,
పానభూమి ర్వినా వహ్నిం ప్రదీప్తే వోపలక్ష్యతే. 18
బహుప్రకారై ర్వివిధై ర్వరసంస్కారసంస్కృతైః,
మాంసైః కుశలసంపృక్తైః పావభూమిగతైః పృథక్. 19
దివ్యాః ప్రసన్నా వివిధా స్సురాః కృతసురా అపి,
శర్కరాసవ మాధ్వీక పుష్పాసవ ఫలాసవాః. 20
వాసచూర్ణైశ్చ వివిధై ర్మృష్టా స్తై స్తైః పృథక్ పృథక్,

---

భక్ష్యములతోడను, విడివిడిగా పడియున్న అనర్ఘములగు హారములు, అందెలు, బాహుపురులతోడను, పెద్ద పెద్ద పానపాత్రలం దుంచబడిన వివిధఫలములతోను, అంతటను అలంకారార్థమై వెదజల్లబడిన పుష్పాలంకరణములతోను, ఆ ప్రదేశము అధికముగా శోభిల్లుచుండెను. 16,17

ఆ పానభూమియందు చక్కగా పాకము చేసి, తగు ద్రవ్యములు కలిపి, సమర్థులగు వంటవారు వండిన పలువిధములగు మాంసములతోడను, ఆ యా ప్రదేశములందు వ్యవధానము కలుగకుండగా ఏర్పాటు చేయబడిన సువర్ణ, రత్నమయములగు మంచములు, ఆసనములతోడను కూడిన యా పానభూమి అగ్నిలేకయే మండుచున్నట్లు ప్రకాశించెను. 18,19

హనుమంతు డచట అమృతమథనసమయమున పుట్టిన మద్యజాతికి చెందినవి, నిర్మలములు అగు పలువిధములగు మద్యములను, చక్కెరతో తేనెతో ఫలరసములతో చేయబడిన కృత్రిమమద్యములను, పలువిధములగు సుగంధద్రవ్యములు చేర్చబడి వేర్వేరు పాత్రలలో నుండగా చూచెను. పుష్పమాలలు అన్నివైపులను అలంకరింపబడి

సంతతా శుశుభే భూమి ర్మాల్యైశ్చ బహుసంస్థితైః. 21
హిరణ్మయైశ్చ వివిధై ర్భాజనైః స్ఫాటికై రపి,
జాంబూనదమయై శ్చాన్యైః కరకై రభిసంవృతా. 22
రాజతేషు చ కుంభేషు జాంబూనదమయేషు చ,
పానశ్రేష్ఠం తదా భూరి కపి స్తత్ర దదర్శ హ. 23
సోఽ పశ్య చ్ఛాతకుంభాని శీధో ర్మణిమయాని చ,
రాజతాని చ పూర్ణాని భాజనాని మహాకపిః. 24
క్వచి దర్ధావశేషాణి క్వచిత్ పీతాని సర్వశః,
క్వచిన్నైవ ప్రపీతాని పానాని స దదర్శ హ. 25
క్వచి ద్భక్ష్యాంశ్చ వివిధాన్ క్వచిత్ పానాని భాగశః,
క్వచి దన్నావశేషాణి పశ్య న్వై విచచార హ. 26
క్వచిత్ ప్రభిన్నైః కరకైః క్వచి దాలోళితై ర్ఘటైః,

---

యుండెను. బంగారు పాత్రలు, స్ఫటిక పాత్రలు, బంగారు చెంబులతో ఆ పానభూమి మిక్కిలి సుందరమై యుండెను. 20-22

హనుమంతు డచట వెండి కడవలలోను, బంగారు కలశములలోను సమృద్ధిగా నున్న దివ్యమగు మద్యమును చూచెను. 23

అట్లే బంగారు పాత్రలలో, మణిమయ పాత్రలలో, వెండి గిన్నెలలోను నిండుగా నున్న మద్యమును చూచెను. 24

అందు కొన్ని పాత్రలలో సగమును, కొన్ని పాత్రలలో నిశ్శేషముగను, మఱికొన్నింటిలో పూర్ణముగను సారాయి యుండుట హనుమ చూచెను. 25

ఒకచో పలుభక్ష్యములను, వేఱొకచో వేర్వేరు భక్ష్యభాగములను, మరొక్కచో తినగా పాత్రలలో మిగిలిన పదార్థములను చూచుచు హనుమ తిరిగెను. 26

ఒకచో పగిలిన చెంబులు, వేరొకచో దొరలుచున్న కడవలు, మఱొక్కచో

క్వచిత్ సంపృక్తమాల్యాని జలాని చ ఫలాని చ. 27
శయనాన్యత్ర నారీణాం శుభ్రాణి బహుధా పునః,
పరస్పరం సమాశ్లిష్య కాశ్చి త్సుప్తా వరాంగనాః. 28
కాశ్చిచ్చ వస్త్ర మన్యస్యాః స్వపంత్యాః పరిధాయ చ,
ఆహృత్య చాబలాః సుప్తా నిద్రాబలపరాజితాః. 29
తాసా ముచ్ఛ్వాసవాతేన వస్త్రం మాల్యం చ గాత్రజమ్,
నాత్యర్థం స్పందతే చిత్రం ప్రాప్య మంద మివానిలమ్. 30
చందనస్య చ శీతస్య శీధో ర్మధురసస్య చ,
వివిధస్య చ మాల్యస్య ధూపస్య వివిధస్య చ . 31
బహుధా మారుత స్తత్ర గంధం వివిధ ముద్వహన్,
స్నానానాం చందనానాం చ ధూపానాం చైవ మూర్ఛితః,
ప్రవవౌ సురభి ర్గంధో విమానే పుష్పకే తదా. 32

---

పూలమాలలు, కొన్నిచోట్ల నీరు, పండ్లు నుండగా హనుమ చూచెను. 27

అందు స్త్రీజనము నిద్రించుచున్న వివిధములగు తెల్లని పాన్పులను హనుమ చూచెను. వానిపై ఆ సుందరాంగన లొకరి నొకరు కౌగిలించుకొని నిదురించిరి. 28

అందు కొందరు, నిదురించుచున్న వేఱొకతె ధరించిన వస్త్రమును లాగివైచి తాము దానిని కప్పుకొని గాఢనిద్రలో మునిగిరి. 29

వారు మేనిపై ధరించిన వస్త్రములు, మాలలును, పిల్లవాయువుచే చలించినట్లు వారి నిశ్వాసవాయువుచే నించుక కదలుచుండెను. 30

చల్లని చందనము, తీయని వాసనగల కల్లు, పలువిధములగు పూలమాలలు, వివిధధూపముల నానావిధగంధమును వహించుచు వాయువు వీచెను. అపుడా పుష్పక విమానమున స్నాన యోగ్యమగు చందనము, ధూనముల మగంధము వ్యాపించెను. 31,32

శ్యామావదాతా స్తత్రాన్యాః కాశ్చిత్ కృష్ణా వరాంగనాః,
కాశ్చిత్ కాంచనవర్ణాంగ్యః ప్రమదా రాక్షసాలయే. 33

తాసాం నిద్రావశత్వాచ్చ మదనేన విమూర్ఛితమ్,
పద్మినీనాం ప్రసుప్తానాం రూప మాసీ ద్యథైవ హి. 34

ఏవం సర్వ మశేషేణ రావణాంతఃపురం కపిః,
దదర్శ సుమహాతేజా న దదర్శ చ జానకీమ్. 35

నిరీక్షమాణశ్చ తదా తాః స్త్రియ స్స మహాకపిః,
జగామ మహతీం చింతాం ధర్మసాధ్వసశంకితః. 36

పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్,
ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి. 37

న హి మే పరదారాణాం దృష్టి ర్విషయవర్తినీ,
అయం చాత్ర మయా దృష్టః పరదారపరిగ్రహః. 38

---

ఆ రావణుని కాంతలలో కొందరు నలుపు తెలుపుల మిశ్రమవర్ణము కలవారు, కొందరు నల్లనివారు, కొందరు సువర్ణచ్ఛాయ కలవారును ఉండిరి. 33

వారు రతిక్రీడలు సలిపి, నిద్రాపరవశ లగుటచే అలసిరి. వారి రూపములు ముకుళించిన పూవులు కల తామరతీగలవలె నుండినవి. 34

ఇట్లు మహాతేజశ్శాలియగు హనుమంతుడు రావణుని యంతఃపుర మంతయు చూచెను. కాని సీతను మాత్రము కనజాలడయ్యెను. 35

మహాకపియగు హనుమంతు డట్లు రావణుని అంతఃపురకాంతలను చూచుచు ఇట్లు తలపోసెను. "నిదురించుచున్న పరవనితలను చూచుట యను యీ పని నాకు మిక్కిలి ధర్మలోపము కలిగించగలదు. 36,37

నా దృష్టి పరస్త్రీసుఖాదులం దాసక్తము గాదు. అట్లయ్యును, నేనిచట రావణుడు తనమందిరమున కాంతలతో శయనింపగా చూచితిని". 38

తస్య ప్రాదురభూ చ్చింతా పున రన్యా మనస్వినః,
నిశ్చితైకాంతచిత్తస్య కార్యనిశ్చయదర్శినీ. 39

కామం దృష్ట్వా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః,
న హి మే మనసః కించి ద్వైకృత్య ముపపద్యతే. 40

మనో హి హేతు స్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే,
శుభాశుభా స్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్. 41

నాన్యత్ర హి మయా శక్యా వైదేహీ పరిమార్గితుమ్,
స్త్రియో హి స్త్రీషు దృశ్యంతే సదా సంపరిమార్గణే. 42

యస్య సత్త్వస్య యా యోనిస్తస్యాం తత్ పరిమార్గ్యతే,
న శక్యా ప్రమదా నష్టా మృగీషు పరిమార్గితుమ్. 43

తదిదం మార్గితం తావ చ్ఛుద్ధేన మనసా మయా,

---

అని తలంచి, తదేకదృష్టితో ఆలోచించి కార్యనిశ్చయము చేసికొనిన ఆ హనుమంతునకు వేరొక విధమగు ఆలోచన కలిగెను. 39

రావణుని విశ్వాసము చూరగొనిన అతని కాంతల నెల్ల జూచితిని. అయినను, దానివలన నా మదిలో నెట్టి దుష్టభావనయు కలుగలేదు. 40

మంచిపనిని గాని, చెడ్డపనినిగాని చేయుటకై సకలేంద్రియములను ప్రవర్తింప జేయునది మనస్సు. అది నాయం దెంతమాత్రము చెదరక కుదురుగ నున్నది. 41

నేను వేరొందు ప్రదేశమున సీతాదేవిని వెదుకతగదు. వెదకుచో ఎప్పుడైనను స్త్రీలు స్త్రీలలోనే కదా కనుపింతురు. 42

ఏ ప్రాణి ఏ జాతికి చెందినదో ఆ జాతిలోనే దానిని వెదక వలయును. తప్పిపోయిన వనితను ఆడులేళ్ళలో వెదకుట శక్యము కాదు. 43

నేను చాల పరిశుద్ధమగు మనస్సుతో ఈ రావణాంతఃపుర మంతయు సీతాదేవికై

రావణాంతఃపురం సర్వం దృశ్యతే న చ జానకీ. 44

దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ వీర్యవాన్,
అవేక్షమాణో హనుమా న్నైవాపశ్యత జానకీమ్. 45

తామపశ్యన్ కపి స్తత్ర పశ్యం శ్చాన్యా వరస్త్రియః,
అపక్రమ్య తదా వీరః ప్రధ్యాతు ముపచక్రమే. 46

స భూయస్తు పరం శ్రీమాన్ మారుతి ర్యత్న మాస్థితః,
ఆపానభూమి ముత్సృజ్య తద్విచేతుం ప్రచక్రమే. 47

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకాదశః సర్గః.*

---

వెదకితిని. కాని ఆమె కనుపించుట లేదు. 44

ఇట్లు తలచి పరాక్రమశాలియగు హనుమంతుడు మఱల సీతాదేవికై వెదకుచు దేవకన్యలను, గంధర్వకన్యలను, నాగకన్యలను చూచెను గాని సీతాదేవిని మాత్రము కానడయ్యెను. 45

వీరుడగు హనుమంతు డా భవనమున సీతాదేవిని కానక, తక్కిన ఉత్తమకాంతలను చాలమందిని చూచుచు, ఆమె యెచట నుండునా యని ఆలోచించసాగెను. 46

శ్రీమంతు డగు హనుమంతుడు మఱల నింకను అధికముగ ప్రయత్నము చేయుచు, ఆ పానభూమిని వీడి రావణాంతఃపురముననే సీతాదేవిని వెదుకసాగెను. 47

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదకొండవ సర్గము.*

# 12. ద్వాదశః సర్గః

*(సీత కనుపించకుండుటచే హనుమంతుడు చింతించుట)*

స తస్య మధ్యే భవనస్య మారుతి, ర్లతాగృహాం శ్చిత్రగృహా న్నిశాగృహాన్,
జగామ సీతాం ప్రతి దర్శనోత్సుకో,న చైవ తాం పశ్యతి చారుదర్శనామ్. 1
సచింతయామాస తతో మహాకపిః, ప్రియామపశ్యన్ రఘునందనస్య తామ్,
ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే, విచిన్వతో దర్శనమేతి మైథిలీ. 2
సా రాక్షసానాం ప్రవరేణ జానకీ, స్వశీలపంరక్షణతత్పరా సతీ,
అనేన నూనం ప్రతి దుష్టకర్మణా, హతా భవే దార్యపథే పరే స్థితా. 3
విరూపరూపా వికృతా వివర్చపో, మహాననా దీర్ఘవిరూపదర్శనాః,
సమీక్ష్య సా రాక్షసరాజయోషితో, భయాద్వినష్టా జనకేశ్వరాత్మజా. 4

---

హనుమంతు డా రావణభవనమునందు సీతాన్వేషణతత్పరుడై లతాగృహములను, చిత్తరువులుగల యిండ్లను, రాత్రి నివాసమునకు తగిన యిండ్లను చూచెను కాని యెచ్చటను సుందరనేత్రి యగు సీతాదేవిని చూడలేదు. 1

ఆ మహాకపి హనుమంతుడు, రాముని ధర్మపత్ని సీతను గానక 'అయ్యో! సీత తప్పక మరణించియే యుండును. లేనిచో ఏల కనిపించదు?' అని తలంచెను. 2

శ్రేష్ఠమగు సన్మార్గమున ప్రవర్తించు సీతాదేవి, రాక్షసముఖ్యుడగు రావణు డెంత నిర్బంధించినను, తన శీలమును కాపాడుకొను ప్రయత్నము చేయుచు, దురాత్ముడగు రావణునిచే చంపబడియుండును. 3

న్యూనాధికరూపములు గలవారును, వికృతవేషము కలవారును, తేజోహీనులును, పెనుమొగము వారును, పెద్దవి, విరూపము లగు కన్నులు గలవారును అగు రావణుని భార్యలను చూచి, జానకి భయముతో మరణించి యుండును. 4

సీతా మదృష్ట్వా హ్యనవాప్య పౌరుషం,విహృత్య కాలం సహ వానరైశ్చిరమ్,
న మేఽస్తి సుగ్రీవసమీపగా గతిః, సుతీక్ష్ణదండో బలవాంశ్చ వానరః. 5

దృష్ట మంతఃపురం సర్వం దృష్టా రావణయోషితః,
న సీతా దృశ్యతే సాధ్వీ వృథా జాతో మమ శ్రమః. 6

కిన్ను మాం వానరా స్సర్వే గతం వక్ష్యంతి సంగతాః,
గత్వా తత్ర త్వయా వీర కిం కృతం తద్వదస్వ నః. 7

అదృష్ట్వా కిం ప్రవక్ష్యామి తా మహం జనకాత్మజామ్,
ధ్రువం ప్రాయ ముపైష్యంతి కాలస్య వ్యతివర్తనే. 8

కిం వా వక్ష్యతి వృద్ధశ్చ జాంబవా నంగదశ్చ సః,
గతం పారం సముద్రస్య వానరాశ్చ సమాగతాః. 9

అనిర్వేదః శ్రియో మూల మనిర్వేదః పరం సుఖమ్,

---

సీతను కానక, శత్రువులపై పరాక్రమము చూపక, చాల తడవు వానరులతో గడపిన నాకు మా రాజగు సుగ్రీవుని చెంతకు పోవుటకు వీలుకాదు. ఆయన బలవంతుడు, తీవ్రదండన విధించువాడును అగుటే యిందులకు కారణము. 5

అంతఃపుర మంతయు వెదకితిని. రావణస్త్రీలను చూచితిని. పతివ్రతయగు సీతాదేవి యగపడలేదు. నా శ్రమ యంతయు విఫలమైనది. 6

సీతాదేవిని చూడకయే నేను కిష్కింధ చేరుదునేని నన్ను వానరులు కలిసికొని 'వీరుడా! నీవు లంకకేగి చేసిన దేమో తెలుపు" మని యడుగరా? 7

సీతను చూడని నే నేమని చెప్పుదును? కాలాతీత మగుచో, వానరులు ప్రాయోపవేశము చేయుదురు. 8

వృద్ధుడగు జాంబవంతుడు, యువరాజగు అంగదుడు, తక్కిన వానరులును నిష్ఫలముగా లంకకు పోయివచ్చిన నన్నేమందురు? 9

ఉత్సాహమే సంపదకు మూలము. ఉత్సాహమే పరమసుఖము. ఉత్సాహమే

అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః. 10
కరోతి సఫలం జంతోః కర్మ యత్తత్ కరోతి సః,
తస్మాదనిర్వేదకృతం యత్నం చేష్టేఽహ ముత్తమమ్. 11
భూయస్తావ ద్విచేష్యామి దేశాన్ రావణపాలితాన్,
ఆపానశాలా విచితా స్తథా పుష్పగృహాణి చ . 12
చిత్రశాలాశ్చ విచితా భూయః క్రీడాగృహాణి చ,
నిష్కుటాంతరరథ్యాశ్చ విమానాని చ సర్వశః. 13
ఇతి సంచింత్య భూయోఽపి విచేతు ముపచక్రమే,
భూమీగృహాం శ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి. 14
ఉత్పత న్నిపతంశ్చాపి తిష్ఠన్ గచ్ఛన్ పునః పునః,
అపావృణ్వంశ్చ ద్వారాణి కవాటా న్యవఘాటయన్. 15
ప్రవిశ న్నిష్పతం శ్చాపి ప్రపత న్నుత్పతన్నపి,

---

ఎల్లపుడు మనుజుని సకలకార్యములలో పాల్గొనునట్లు చేయును. అతడు చేయ తలపెట్టిన పనిని సఫలము చేయును. కావున ఉత్సాహముతో మరింతగా ప్రయత్నించెదను. 10,11

రావణుడు రక్షించు సకలప్రదేశములను మఱల వెదకెదను. నే నిప్పటివరకు పానశాలలు, పుష్పగృహములు, చిత్రశాలలు, క్రీడాగృహములు, ఉద్యానవనముల నడుమనున్న వీథులు, విమానములు వెదకితిని' అని తలంచి మఱల భూబిల గృహములు, చతుష్పథ మంటపములు, ఇండ్లకు దూరముగ స్వేచ్ఛావిహారార్థము నిర్మింపబడిన గృహములను వెదక నారంభించెను. 12-14

అట్లు సీతను వెదకుటకై మాటిమాటికి ఎగురుచు-దూకుచు, ఆగుచు-పోవుచు, తలుపులు తెఱచుచు - మూయుచు, లోన ప్రవేశించుచు - వెలువడుచు

సర్వమ ప్యవకాశం స విచచార మహాకపిః. 16
చతురంగుళమాత్రోఽపి నావకాశ స్స విద్యతే,
రావణాంతఃపురే తస్మిన్ యం కపి ర్న జగామ సః. 17
ప్రాకారాంతరరథ్యాశ్చ వేదికా శ్చైత్యసంశ్రయాః,
దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ సర్వం తేనావలోకితమ్. 18
రాక్షస్యో వివిధాకారా విరూపా వికృతా స్తథా,
దృష్టా హనుమతా తత్ర న తు సా జనకాత్మజా. 19
రూపేణాప్రతిమా లోకే వరా విద్యాధరస్త్రియః,
దృష్టా హనుమతా తత్ర న తు రాఘవనందినీ. 20
నాగకన్యా వరారోహాః పూర్ణచంద్రనిభాననాః,
దృష్టా హనుమతా తత్ర న తు సీతా సుమధ్యమా. 21

---

సకలావకాశములలో హనుమంతుడు సంచరించెను. 15,16

అట్లు హనుమంతుడు వెదుక నారంభించగా లంకలో అతడు తిరుగనిచోటు నాలు గంగుళముల మేరయైనను లేకుండెను. 17

ప్రాకారము నడుమనున్న వీథులు, చతుష్పథమంటపములు, దిగుడుబావులు, కొలనులు, అన్నింటిని హనుమ పరిశీలించెను. 18

హనుమంతు డచట నానావిధములగు ఆకారములతో వికృతరూపము గల రాక్షస స్త్రీలను చూచెను కాని సీతను మాత్రము చూడజాలడయ్యెను. 19

సాటిలేని రూపముగల శ్రేష్ఠవిద్యాధరాంగనలను హనుమ చూచెను.కాని రాము నానందింపజేయు సీతను మాత్రము చూడలేదు. 20

పూర్ణచంద్రుని బోలు సుందరమైన మోముగల నాగకన్యలను హనుమంతుడు చూచెను గాని మంచి నడుముగల సీతను చూడలేదు. 21

ప్రమథ్య రాక్షసేంద్రేణ నాగకన్యా బలాద్ధృతాః,
దృష్టా హనుమతా తత్ర న సా జనకనందినీ. 22

సోఽపశ్యం స్తాం మహాబాహుః పశ్యం శ్చాన్యా వరస్త్రియః,
విషసాద ముహుర్ధీమాన్ హనుమాన్ మారుతాత్మజః. 23

ఉద్యోగం వానరేంద్రాణాం ప్లవనం సాగరస్య చ,
వ్యర్థం వీక్ష్యాఽనిలసుత శ్చింతాం పున రుపాగమత్. 24

అవతీర్య విమానాచ్చ హనుమాన్ మారుతాత్మజః,
చింతా ముపజగా మాథ శోకోపహతచేతనః. 25

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్వాదశః సర్గః.*

---

రావణునిచే బలాత్కారముగ తేబడిన నాగకన్యల నతడు చూచెను. కాని సీతను మాత్రము చూడలేదు. 22

మహాభుజుడు, ధీమంతుడు, వాయునందను డగు హనుమంతుడు సీతాదేవిని చూడక, తక్కిన శ్రేష్ఠవనితలను మాత్రమే చూచి మఱల విషాదము నందెను. 23

వానరశ్రేష్ఠుల ప్రయత్నము, తాను సముద్రము దాటుట వ్యర్థమగుట చూచి హనుమ మఱల చింతించెను. 24

వాయునందనుడగు హనుమంతు డా విమానము నుండి దిగి, శోకముచే మనస్సు కలతనొందగా మిక్కిలి చింతించెను. 25

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పంద్రెండవ సర్గము.*

# 13. త్రయోదశః సర్గః

*(హనుమ అశోకవనమున సీత నన్వేషింపదలంచుట)*

విమానాత్తు సుసంక్రమ్య ప్రాకారం హరియూథపః,
హనుమాన్ వేగవా నాసీ ద్యథా విద్యుద్ ఘనాంతరే. 1

సంపరిక్రమ్య హనుమాన్ రావణస్య నివేశనాత్,
అదృష్ట్వా జానకీం సీతా మబ్రవీ ద్వచనం కపిః. 2

భూయిష్ఠం లోళితా లంకా రామస్య చరతా ప్రియమ్,
న హి పశ్యామి వైదేహీం సీతాం సర్వాంగశోభనామ్. 3

పల్వలాని తటాకాని సరాంసి సరిత స్తథా,
నద్యోఽనూపవనాంతాశ్చ దుర్గాశ్చ ధరణీధరాః,
లోళితా వసుధా సర్వా న తు పశ్యామి జానకీమ్. 4

---

వానరయూథప్రధానుడగు హనుమంతుడు విమానమునుండి ప్రాకారము పైకి దూకి, మేఘముల నడుమ మెఱపువలె వేగముగ పోయెను. 1

హనుమంతు డట్లు రావణగృహమును వీడి వచ్చి, జానకి నెచ్చటను గానక తనలో నిట్లనుకొనెను. 2

"రామునకు ప్రియము చేకూర్చువాడ నగు నేను లంక నంతను పూర్తిగా వెదకితిని కాని సర్వాంగసుందరి యగు సీత నా కగపడలేదు. 3

నీటిగుంటలు, చెరువులు, సరస్సులు, సెలయేళ్ళు, నదులు, నీటిపట్టుల కడనుండు వనములు, చొరరాని ప్రదేశములు, కొండలు-ఒకటి యేమి! ఈ భూమిపై ఎల్లెడల వెదకితిని. సీత మాత్రము అగపడుటలేదు. 4

ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే,
ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తా మహమ్. 5
కిం ను సీతాఽథ వైదేహీ మైథిలీ జనకాత్మజా,
ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణమ్. 6
క్షిప్ర ముత్పతతో మన్యే సీతా మాదాయ రక్షసః,
బిభ్యతో రామబాణానా మంతరా పతితా భవేత్. 7
అథవా హ్రియమాణాయాః పథి సిద్ధనిషేవితే,
మన్యే పతితమార్యాయా హృదయం ప్రేక్ష్య సాగరమ్. 8
రావణ స్యోరువేగేన భుజాభ్యాం పీడితేన చ,
తయా మన్యే విశాలాక్ష్యా త్యక్తం జీవిత మార్యయా. 9
ఉపర్యుపరి వా నూనం సాగరం క్రమత స్తథా,

---

గృధ్రరాజగు సంపాతి సీత రావణు నింట ఉన్నదని చెప్పినాడు. కాని నా కామె యిచ్చట కానరాకున్నది. 5

నాగటిచాలున ఉద్భవించినది, సదాచారవంతులకు పుట్టినిల్లగు మిథిలానగర సంబంధముచే పవిత్రచరిత్ర గలది, కర్మిష్ఠుడగు జనకుని కూతురు అగు సీతాదేవి కామపరవశయై రావణుని చేరునా? (చేరదు) 6

సీతను తీసికొని రామబాణములకు భయపడి రావణుడు వేగముగా ఆకసమున ఎగిరిపోవుచుండగా నడుమ ఆమె పడిపోయియుండును. 7

లేదా సిద్ధులు సంచరించు ఆకాశమార్గమున సీతను కొనిపోవుచుండగా నడుమ సముద్రమును చూచి యామె హృదయము జారియుండును. 8

లేదా రావణుడు సీతను తీసికొని వచ్చునప్పు డతని మహావేగముచేతను, బాహువులతో గట్టిగా బంధించుటచేతను విశాలాక్షి పూజ్యురాలగు ఆమె ప్రాణములు విడచియుండును. 9

లేదా పైనుండి సముద్రమును దాటుచుండగా సీత రావణుని చేతులనుండి

వివేష్టమానా పతితా సముద్రే జనకాత్మజా. 10
అహో క్షుద్రేణ వాఽనేన రక్షంతీ శీల మాత్మనః,
అబంధు ర్భక్షితా సీతా రావణేన తపస్వినీ. 11
అథవా రాక్షసేంద్రస్య పత్నీభి రసితేక్షణా,
అదుష్టా దుష్టభావాభి ర్భక్షితా సా భవిష్యతి. 12
సంపూర్ణచంద్రప్రతిమం పద్మపత్రనిభేక్షణమ్,
రామస్య ధ్యాయతీ వక్త్రం పంచత్వం కృపణా గతా. 13
హా రామ లక్ష్మణే త్యేవం హాఽయోధ్యే చేతి మైథిలీ,
విలప్య బహు వైదేహీ న్యస్తదేహా భవిష్యతి. 14
అథవా నిహితా మన్యే రావణస్య నివేశనే,
నూనం లాలప్యతే సీతా పంజరస్థేవ శారికా. 15
జనకస్య సుతా సీతా రామపత్నీ సుమధ్యమా,

---

దొఱలి సముద్రమున పడియుండును. 10

అయ్యో! బంధువులు చెంతలేని దీనురా లగు సీత తన శీలము గాపాడుకొనుచు నీచుడగు రావణునిచే భక్షింపబడి యుండును. 11

లేదా నల్లని కనులు గలది, సద్భావము గలది యగు ఈమెను దుష్టభావముగల రావణుని భార్యలు తినివేసి యుందురు. 12

లేదా పూర్ణచంద్రునితో సమానుడు, తామరరేకులవంటి కన్నులు గలవాడగు రాముని మోమునే తలంచుచు దీనయై మరణించియుండును. 13

అయ్యో! రామా! లక్ష్మణా! ఓ అయోధ్యా! యని పలుమారు విలపించుచు, సీత తుదకు మరణించియుండును. 14

లేక పంజరమందు చిలుకను వలె రావణు డామెను తన ఇంటనే బంధించగా మిక్కిలి దుఃఖించుచుండును. 15

జనకుని కూతురు, రాముని ధర్మపత్ని, చక్కని నడుము కలది, కలువల వంటి

కథ ముత్పలపత్రాక్షీ రావణస్య వశం వ్రజేత్. 16

వినష్టా వా ప్రణష్టా వా మృతా వా జనకాత్మజా,
రామస్య ప్రియభార్యస్య న నివేదయితుం క్షమమ్. 17

నివేద్యమానే దోషః స్యాత్ దోషః స్యా దనివేదనే,
కథం ను ఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతి మే. 18

అస్మి న్నేవంగతే కార్యే ప్రాప్తకాలం క్షమం చ కిమ్,
భవేదితి మతం భూయో హనుమాన్ ప్రవిచారయత్. 19

యది సీతా మదృష్ట్వాఽహం వానరేంద్రపురీ మితః,
గమిష్యామి తతః కో మే పురుషార్థో భవిష్యతి. 20

మమేదం లంఘనం వ్యర్థం సాగరస్య భవిష్యతి,
ప్రవేశశ్చైవ లంకాయా రాక్షసానాం చ దర్శనమ్. 21

---

కన్నులు కలది యగు సీత యెట్లు రావణుని వశమగును? 16

సీతను భూగృహాదులలో దాచియుంచుటచే ఆమె కనుపించకున్నను, సముద్ర పతనాదులచేత ప్రాణములు వీడినను, రామునితో ఎడబాటుచే స్వయముగనే మరణించినను, భార్యానురక్తుడగు రామున కీ విషయము తెలుపదగదు. 17

రామున కిది తెలుపుదునా (చెప్పుబోవు) దోషము కలుగును. అట్లని చెప్పకుందునా వాస్తవమును చెప్పక స్వామిని వంచించిన దోషము తప్పదు. నే నిపుడు ఏమి చేయవలెను? ఇది నాకు చాల సంకటముగా తోచుచున్నది. 18

ఇట్లుండగా నిపుడు కాలోచితము, యోగ్యమగు కృత్యమేది? అని కర్తవ్యమును హనుమంతుడు మఱల ఆలోచించెను. 19

నేను సీతను గానక యిటనుండి కిష్కింధ కేగుదునా నాకు చేకూరు ప్రయోజన మేమున్నది? 20

నేను సముద్రము దాటుట, లంకలో ప్రవేశించుట, రాక్షసులను చూచుట సర్వము వ్యర్థమే యగును. 21

కిం మాం వక్ష్యతి సుగ్రీవో హరయో వా సమాగతాః,
కిష్కింధాం సమనుప్రాప్తం తౌ వా దశరథాత్మజౌ. 22
గత్వా తు యది కాకుత్థ్సం వక్ష్యామి పర మప్రియమ్,
న దృష్టేతి మయా సీతా తత స్త్యక్ష్యతి జీవితమ్. 23
పరుషం దారుణం క్రూరం తీక్ష్ణ మింద్రియతాపనమ్,
సీతానిమిత్తం దుర్వాక్యం శ్రుత్వా స న భవిష్యతి. 24
తం తు కృచ్ఛ్రగతం దృష్ట్వా పంచత్వగతమానసమ్,
భృశానురక్తో మేధావీ న భవిష్యతి లక్ష్మణః. 25
వినష్టౌ భ్రాతరౌ శ్రుత్వా భరతోఽపి మరిష్యతి,
భరతం చ మృతం దృష్ట్వా శత్రుఘ్నో న భవిష్యతి. 26
పుత్రాన్ మృతాన్ సమీక్ష్యాథ న భవిష్యంతి మాతరః,

---

కిష్కింధ కేతెంచిన నన్ను చూచి మా రాజు సుగ్రీవుడు, నన్ను కలసికొన్న తక్కిన వానరులు, ఏమందురు? 22

నేను కిష్కింధ కేగి "సీత నా కగపడలే"దని రామున కత్యంతము దుఃఖకరమగు వార్త చెప్పుదునా, ఆయన వెంటనే ప్రాణములు విడుచును. 23

కర్ణకఠోరము, భయంకరము, ఉగ్రము, అసహ్యము, సకలేంద్రియ సంతాపనము అగు "సీత కనుపించలే" దను వార్త విని రాముడు బ్రతుకడు. 24

రాముడు చాల కష్టస్థితిలో నుండి, మరణింప నిశ్చయించుకొనగా, అన్నయం దత్యంతానురక్తుడు, మేధావి యగు లక్ష్మణుడును జీవింపడు. 25

రామలక్ష్మణులు మరణించి రని విని భరతుడును మరణించును. భరతుడు మరణించుట చూచి శత్రుఘ్నుడు బ్రతుకడు. 26

తమ కుమారులు మరణింపగా చూచిన తల్లులగు కౌసల్య, సుమిత్ర, కైకలును

కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ న సంశయః. 27

కృతజ్ఞ స్సత్యసంధశ్చ సుగ్రీవః ప్లవగాధిపః,
రామం తథాగతం దృష్ట్వా తత స్త్యక్ష్యతి జీవితమ్. 28

దుర్మనా వ్యథితా దీనా నిరానందా తపస్వినీ,
పీడితా భర్తృశోకేన రుమా త్యక్ష్యతి జీవితమ్. 29

వాలిజేన తు దుఃఖేన పీడితా శోకకర్శితా,
పంచత్వం చ గతే రాజ్ఞి తారాఽపి న భవిష్యతి. 30

మాతాపిత్రో ర్వినాశేన సుగ్రీవవ్యసనేన చ,
కుమారోఽప్యంగదః కస్మా ద్ధారయిష్యతి జీవితమ్. 31

భర్తృజేన తు దుఃఖేన హ్యభిభూతా వనౌకసః,
శిరాం స్యభిహనిష్యంతి తలై ర్ముష్టిభిరేవ చ. 32

---

జీవింప రనుట నిస్సంశయము. 27

కృతజ్ఞుడు, సత్యసంధుడు, వానరరాజగు సుగ్రీవుడు రాముని యా దురవస్థను జూచి వెంటనే ప్రాణములు వీడును. 28

అపుడు పతివ్రత యగు రుమయు భర్తృశోకముతో మనస్సు చెడి, బాధ నొంది, ఆనందము లేక, దీనయై, మరణించును. 29

వాలి మరణముచే మున్నే దుఃఖపీడితయైన తార, రాజుకూడ మరణించుచో తప్పక ప్రాణములు విడుచును. 30

తల్లిదండ్రులు మరణించి, సుగ్రీవుడు నశింపగా కుమారుడగు అంగదుడు మాత్ర మెట్లు జీవించును? 31

తమ ప్రభువు మరణించె నని తెలిసి, శోకపీడితులై, ఒడలు తెలియక, వానరులును పిడికిళ్లతో కొట్టుకొని, రాళ్ళతో తలలు బాదుకొని మరణింతురు. 32

మంచిమాటలతో, బహుమానములతో, మన్ననతో, సుగ్రీవుడు లాలించిన వానరులు

సాంత్వే నానుప్రదానేన మానేన చ యశస్వినా,
లాలితాః కపిరాజేన ప్రాణాం స్త్యక్ష్యంతి వానరాః. 33
న వనేషు న శైలేషు న నిరోధేషు వా పునః,
క్రీడా మనుభవిష్యంతి సమేత్య కపికుంజరాః. 34
సపుత్రదారా స్సామాత్యా భర్తృవ్యసనపీడితాః,
శైలాగ్రేభ్యః పతిష్యంతి సమేత్య విషమేషు చ. 35
విష ముద్బంధనం వాపి ప్రవేశం జ్వలనస్య వా,
ఉపవాస మథో శస్త్రం ప్రచరిష్యంతి వానరాః. 36
ఘోర మారోదనం మన్యే గతే మయి భవిష్యతి,
ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసామ్. 37
సోఽహం నైవ గమిష్యామి కిష్కింధాం నగరీ మితః,
న చ శక్ష్యామ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా. 38

---

ఆయన లేక జీవించరు. 33

సుగ్రీవు నెడబాసిన వానరశ్రేష్ఠు లరణ్యమందుగాని, కొండలపై గాని, గృహాదులందు కాని కలసి క్రీడింపజాలరు. 34

తమ ప్రభువు మరణించె నను దుఃఖము పీడించగా వానరశ్రేష్ఠులు తమ ఆలుబిడ్డలతో, మంత్రులతో గూడ మిట్టపల్లముల క్రిందపడి కొండకొనలనుండి సమతలముపై, లేదా ఎగుడు దిగుడు నేలపై పడి మడియుదురు. 35

విషము త్రాగియో, ఉరిపోసికొనియో, అగ్నిప్రవేశము చేసియో, ఉపవసించియో, ఆయుధములతో పొడుచుకొనియో వానరులు చత్తురు. 36

కావున నేను కిష్కింధకు పోవుటచే ఇక్ష్వాకువంశము, వానరసమూహాము నశింపగా భయంకరమగు రోదనమే మిగులును. 37

కావున నే నిటనుండి కిష్కింధానగరికి పోజాలను. సీతాదేవిని చూడక నా ప్రభువగు సుగ్రీవుని చూడజాలను. 38

మయ్యగచ్ఛతి చేహస్థే ధర్మాత్మానౌ మహారథౌ,
ఆశయా తౌ ధరిష్యేతే వానరాశ్చ మనస్వినః. 39

హస్తాదానో ముఖాదానో నియతో వృక్షమూలికః,
వానప్రస్థో భవిష్యామి హ్యదృష్ట్వా జనకాత్మజామ్. 40

సాగరానూపజే దేశే బహుమూలఫలోదకే,
చితాం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధ మరణీసుతమ్. 41

ఉపవిష్టస్య వా సమ్యగ్ లింగినీం సాధయిష్యతః,
శరీరం భక్షయిష్యంతి వాయసాః శ్వాపదాని చ . 42

ఇదం మహర్షిభి ర్దృష్టం నిర్యాణ మితి మే మతిః,
సమ్యగాపః ప్రవేక్ష్యామి న చేత్ పశ్యామి జానకీమ్. 43

---

నే నిటనుండి పోవక, యిచటనే యున్నచో, ధర్మాత్ములు మహారథులగు రామలక్ష్మణులు, మంచి మనస్సుకల వానరులు సీతాదేవిని చూడగల మను ఆశతో జీవింతురు. 39

సీతాదేవి అగపడనిచో నేను చేతి కందినది, నోటపడినది మాత్రము తినుచు, వృక్షమూలమున నివసించుచు వానప్రస్థుని జీవితము గడిపెదను. 40

లేదా అధికముగా దుంపలు, పండ్లు, జలములు గల సముద్రతీరప్రదేశమున చితిపేర్చి ప్రజ్వలించు అగ్నిలో పడెదను. 41

లేదా ఒకచో గూర్చుండి నేను సన్న్యాస మవలంబించగా (లేదా శరీరము నుండి ఆత్మను విడిపింపబోవగా) నా శరీరమును కాకులు మున్నగు పక్షులు, పులులు మున్నగు జంతువులు భక్షించును. 42

ఇది మహర్షు లుపదేశించిన మరణమార్గమని తలంతును. సీతను చూడకున్నచో నీట మునిగియైన మరణింతును. 43

ఈ రాత్రి మొదట లంకాధిదేవతను గెలుచుటచే శుభారంభము కలదైనది, నా

సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ,
ప్రభగ్నా చిరరాత్రీయం మమ సీతా మపశ్యతః. 44
తాపసో వా భవిష్యామి నియతో వృక్షమూలికః,
నేతః ప్రతిగమిష్యామి తా మదృష్ట్వాఽసితేక్షణామ్. 45
యదీతః ప్రతిగచ్ఛామి సీతా మనధిగమ్య తామ్,
అంగద స్సహ తై స్సర్వై ర్వానరై ర్న భవిష్యతి. 46
వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి,
తస్మాత్ ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః. 47
ఏవం బహువిధం దుఃఖం మనసా ధారయన్ ముహుః,
నాధ్యగచ్ఛ త్తదా పారం శోకస్య కపికుంజరః. 48

---

సీతాన్వేషణమున కనువుగా వెన్నెల కాయుటచే సుందరమైనది, హనుమంతుని సీతాన్వేషణమునకు (ఈ రాత్రి) సహకరించెనని జనులు పలుమాగు చేయు కీర్తియే మాలగా కలది, హనుమంతుడు లంకలో ప్రవేశించిన రాత్రి యని ప్రసిద్ధమైనది, జాగరణముచే ఎంతకును తెల్లవారక చిరకాల విశిష్టమైన ఈ రాత్రి ఇప్పుడు సమాప్తమైనది. ఇట్టి రాత్రి శుభకరమైనను సీత అగపడక నాకు నిష్ఫలమే అయినది. 44

లేదా నియమముతో ఏ చెట్టుక్రిందనో నివసించుచు తాపసుడ నయ్యెదను. సీతాదేవిని కానక యిటనుండి వెనుకకుమాత్రము పోవజాలను. 45

సీతాదేవి యునికి తెలిసికొనక నే నిటనుండి వెడలుదునా, అంగదుడు తక్కిన వానరులును బ్రతుకరు. 46

మరణించుచో బహుదోషములు కలుగును. అట్లుకాక జీవించుచో శుభములు చూడవచ్చును. కావున నేను మరణింపను. జీవించుచో తప్పక శ్రేయము కలుగును. 47

ఇట్లా కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు మాటిమాటికి పరిపరివిధముల మదిలో దుఃఖము నిలుపుకొని శోకమునుండి బయటపడడయ్యెను. 48

రావణం వా వధిష్యామి దశగ్రీవం మహాబలమ్,
కామమస్తు హృతా సీతా ప్రత్యాచీర్ణం భవిష్యతి. 49

అథ వైనం సముత్క్షిప్య ఉపర్యుపరి సాగరమ్,
రామా యోపహరిష్యామి పశుం పశుపతే రివ. 50

ఇతి చింతాం సమాపన్నః సీతా మనధిగమ్య తామ్,
ధ్యానశోకపరీతాత్మా చింతయామాస వానరః. 51

యావత్ సీతాం హి పశ్యామి రామపత్నీం యశస్వినీమ్,
తావ దేతాం పురీం లంకాం విచినోమి పునః పునః. 52

సంపాతివచనా చ్చాపి రామం య ద్యానయా మ్యహమ్,
అపశ్యన్ రాఘవో భార్యాం నిర్దహేత్ సర్వవానరాన్. 53

ఇహైవ నియతాహారో వత్స్యామి నియతేంద్రియః,
న మత్కృతే వినశ్యేయు స్సర్వే తే నరవానరాః. 54

---

సీత విషయ మట్లుండుగాక. మహాబలుడు, దశగ్రీవుడగు రావణుని వధింతును. దీనిచే వైరమునకు ప్రతీకారము కాగలదు. 49

లేదా రావణు నెత్తికొని సముద్రము మీదుగా వెడలి వచ్చి అగ్నిహోత్రమున పశువును సమర్పించినట్లు రాముని కిత్తుము." 50

అని యిట్లు సీతను గానక చింతించుచు, ఆ విషయమునే మదిలో ఎడతెగక భావించుచు, హనుమంతుడు మఱల నిట్లాలోచించెను. 51

కీర్తిశాలిని యగు సీత అగపడునంతవఱకు నేను మాటిమాటికి ఈ లంకాపురిలో వెదకెదను. 52

సంపాతి చెప్పెను కదా యని రాము నిటకు కొనివత్తునా, రాముడు భార్యను చూడనిచో వానరుల నెల్ల కాల్చివైచును. 53

కావున నే నిచటనే ఆహారనియమము పాటించి, జితేంద్రియుడనై నివసింతును. నాకై వానరులందరు నశింపరాదు. 54

అశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా,
ఇమా మధిగమిష్యామి న హీయం విచితా మయా. 55
వసూన్ రుద్రాంస్తథాఽఽదిత్యాసశ్వినౌ మరుతోఽపి చ,
నమస్కృత్వా గమిష్యామి రక్షసాం శోకవర్ధనః. 56
జిత్వా తు రాక్షసాన్ సర్వా నిక్ష్వాకుకులనందినీమ్,
సంప్రదాస్యామి రామాయ యథా సిద్ధిం తపస్వినే. 57
స ముహూర్తమివ ధ్యాత్వా చింతావగ్రథితేంద్రియః,
ఉదతిష్ఠ న్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః. 58
నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ, దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో, నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః
స తేభ్యస్తు నమస్కృత్య సుగ్రీవాయ చ మారుతిః,

---

ఈ అశోకవనము పెద్ద పెద్ద మ్రానులతో కూడియున్నది. సీత యిం దున్నదేమో చూచెదను. ఈ వన మింతకుముందు నేను వెదకనిదే. 55

వసువులకు, రుద్రులకు, ఆదిత్యులకు, అశ్వినులకు, వాయువునకు నమస్కరించి రాక్షసుల శోకము పెంపొందించుచు అశోకవనమున కేగెదను. 56

సకలరాక్షసులను జయించి, తపస్వికి తపస్సిద్ధిని వలె, రామున కిక్ష్వాకువంశము నానందింపజేయు సీతాదేవిని సమర్పింతును. 57

మహాతేజశ్శాలి వాయుపుత్రుడగు హనుమంతుడు చింతచే ఇంద్రియములు కలత నొందగా నొక్క ముహూర్తకాల మిట్లు తలపోసి, లేచి నిలబడెను. 58

"రామలక్ష్మణులకు నమస్కారము; సీతాదేవికి నమస్కారము; రుద్ర, ఇంద్ర, యమ, వాయువులకు నమస్కారము; చంద్రసూర్యులకు, మరుద్గణములకు నమస్కారము". 59

అని హనుమ వారికిట్లు ప్రణామ మొనర్చి, పిమ్మట తన రాజు సుగ్రీవునకును

దిశ స్సర్వా స్సమాలోక్య హ్యశోకవనికాం ప్రతి. 60
స గత్వా మనసా పూర్వ మశోకవనికాం శుభామ్,
ఉత్తరం చింతయామాస వానరో మారుతాత్మజః. 61
ధ్రువం తు రక్షోబహులా భవిష్యతి వనాకులా,
అశోకవనికా చింత్యా సర్వసంస్కారసంస్కృతా. 62
రక్షిణ శ్చాత్ర విహితా నూనం రక్షంతి పాదపాన్,
భగవానపి సర్వాత్మా నాతిక్షోభం ప్రవాతి వై. 63
సంక్షిప్తోఽయం మయాత్మా చ రామార్థే రావణస్య చ,
సిద్ధిం మే సంవిధాస్యంతి దేవా స్సర్షిగణా స్త్విహ. 64
బ్రహ్మా స్వయంభూ ర్భగవాన్ దేవాశ్చైవ దిశంతు మే,
సిద్ధి మగ్నిశ్చ వాయుశ్చ పురుహూతశ్చ వజ్రభృత్. 65

---

నమస్కరించి, అశోకవన మెంత విశాలమో తెలియగోరి దిక్కు లన్నియు పరిశీలించెను. 60

హనుమంతు డట్లు ముందుగా మనస్సుచేతనే శుభకరమగు అశోకవనమున ప్రవేశించి (ప్రవేశింపవలెనని మదిలో నిశ్చయించి) అనంతరకర్తవ్య మాలోచించెను. 61

ఈ యశోకవనమున తప్పక చాలమంది రాక్షసులుందురు. వృక్షములును (జలమును) విస్తారముగ నుండును. దున్నుట, గడ్డి మున్నగునవి తీసివేయుటవంటి సంస్కారములు చేయబడిన యీ యశోకవనమున నేను తప్పక సీతను వెదుకవలసినదే.

తప్పక రాక్షసు లిచట వృక్షములకు కావలి యుందురు. సర్వాత్ముడయ్యు వాయు విచట మెల్లగ వీచునే కాని అమితముగా చెట్లను కదల్పడు. 63

రామకార్యము సాధించుటకును, రావణునకు కనుపించకుండుటకొరకును నా శరీరమును (కార్యానుకూలమగునట్లు) సూక్ష్మముగా చేసికొంటిని. ఇంక దేవతలు, ఋషులు నాకు కార్యసిద్ధిని చేకూర్చుదురుగాక. 64

తనంత దానే జన్మించిన భగవంతుడగు బ్రహ్మయు, దేవతలును, అగ్నియు, వాయువును, వజ్రాయుధము దాల్చిన దేవేంద్రుడును, పాశము చేత ధరించిన

వరుణః పాశహస్తశ్చ సోమాదిత్యౌ తథైవ చ,
అశ్వినౌ చ మహాత్మానౌ మరుత శ్శర్వ ఏవ చ. 66

సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవ యః ప్రభుః,
దాస్యంతి మమ యే చాన్యే హ్యదృష్టాః పథి గోచరాః. 67

తదున్నసం పాండురదంత మవ్రణం, శుచిస్మితం పద్మపలాశలోచనమ్,
ద్రక్ష్యే తదార్యావదనం కదా న్వహం, ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్. 68

క్షుద్రేణ పాపేన నృశంసకర్మణా, సుదారుణాలంకృతవేషధారిణా,
బలాభిభూతా హ్యబలా తపస్వినీ, కథం ను మే దృష్టిపథేఽద్య సా భవేత్. 69

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రయోదశః సర్గః.*

---

వరుణుడును, సూర్య చంద్రులును, మహాత్ములగు అశ్వినీదేవతలును, మరుత్తులును, శివుడును నాకు కార్యసిద్ధిని కలిగింతురుగాక. 65,66

సకలభూతములును, ఆ భూతములకు ప్రభువు (పూర్వోక్తబ్రహ్మరుద్రాదుల కధిపతి) అగు విష్ణువును నాకు సిద్ధిని చేకూర్తురు గాక. అట్లే నా కగపడని, మార్గమందుండు తక్కిన దేవతలును కార్యసిద్ధిని కలిగింతురుగాక. 67

ఉన్నతమైన నాసిక కలదియు, తెల్లని పలువరుస గలదియు, ఏ దోషమును లేనిదియు, తెల్లని చిరునగవు గలదియు, తామరరేకుల వంటి కన్నులు గలదియు, నిర్మలచంద్రునివలె తన దర్శనముచే ఆహ్లాదము కలిగించునదియు (ఇవి రాముడు చెప్పిన లక్షణములు) అగు సీతాదేవిముఖము నెపుడు దర్శింతును? 68

'నీచుడు, పాపి, క్రూరకార్యములు చేయువాడు, భయంకరుడయ్యును అలంకారములచే ప్రసన్నవేషము గలవాడును అగు రావణుడు బలాత్కారముగ అపహరించిన సీతాసాధ్వి యెవుడు నా దృష్టిపథమున పడునో' అని యిట్లు హనుమంతుడు తలంచెను. 69

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదమూడవ సర్గము.*

# 14. చతుర్దశః సర్గః

*(హనుమ అశోకవనములో సీతను వెదకుట)*

స ముహూర్తమివ ధ్యాత్వా మనసా చాధిగమ్య తామ్,
అవప్లుతో మహాతేజాః ప్రాకారం తస్య వేశ్మనః. 1

స తు సంహృష్టసర్వాంగః ప్రాకారస్థో మహాకపిః,
పుష్పితాగ్రాన్ వసంతాదౌ దదర్శ వివిధాన్ ద్రుమాన్. 2

సాలా నశోకాన్ భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్,
ఉద్దాలకా న్నాగవృక్షాం శ్చూతాన్ కపిముఖా నపి. 3

అథామ్రవణసంఛన్నాం లతాశతసమావృతామ్,
జ్యాముక్త ఇవ నారాచః పుప్లువే వృక్షవాటికామ్. 4

స ప్రవిశ్య విచిత్రాం తాం విహగై రభినాదితామ్,

---

మహాతేజస్వి యగు హనుమంతు డొకింత తడ వాలోచించి, సీతాదేవిని మదిలో తలంచి, రావణభవనమునుండి అశోకవనప్రాకారమును చేరెను. 1

హనుమంతు డా ప్రాకారముపై కూర్చుండి సర్వాంగములు పులకింపగా, వసంతారంభమున పూచిన కొనకొమ్మలు గల పలుచెట్లను చూచెను. 2

మద్దిచెట్లు, అశోకములు, సంపెంగచెట్లు, విరిగిచెట్లు, పొన్నచెట్లు, మామిడిచెట్లు, కపిముఖములు (తీగెకానుగచెట్లు) చక్కగా పుష్పించి యుండుట చూచెను. 3

పిమ్మట హనుమంతుడు మామిడిచెట్లచే కప్పివేయబడినది, వందల కొలది లతలచే నావరింపబడినదైవ ఆ వృక్షవనములో వింటినారినుండి వెడలిన బాణమువలె వేగముగా ప్రవేశించెను. 4

అతడు జనులెల్లరకు హర్షము కలిగించుచు మృగపక్షులతో రమ్యమగు వసంత

రాజతైః కాంచనై శ్చైవ పాదపై స్సర్వతో వృతామ్. 5
విహగైర్ మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్,
ఉదితాదిత్యసంకాశాం దదర్శ హనుమాన్ కపిః. 6
వృతాం నానావిధైర్ వృక్షైః పుష్పోపగఫలోపగైః,
కోకిలైర్ భృంగరాజైశ్చ మత్తైర్నిత్యనిషేవితామ్. 7
ప్రహృష్టమనుజే కాలే మృగపక్షిసమాకులే,
మత్తబర్హిణసంఘుష్టాం నానాద్విజగణాయుతామ్. 8
మార్గమాణో వరారోహాం రాజపుత్రీ మనిందితామ్,
సుఖప్రసుప్తాన్ విహగాన్ బోధయామాస వానరః. 9
ఉత్పతద్భిర్ ద్విజగణైః పక్షై స్సాలా స్సమాహతాః,
అనేకవర్ణా వివిధా ముముచుః పుష్పవృష్టయః. 10

---

ప్రారంభకాలమున అశోకవనిలో ప్రవేశించెను. ఆ వనము పక్షుల కిలకిలారావములతో కూడినదై చుట్టును వెండి బంగారు వన్నె చెట్లతో నిండియుండెను. నానావిధపక్షులు, మృగములు తిరుగాడు ప్రదేశమగుటచే అది విచిత్రమై, పలువిధములైన అవాంతర వనములతో కూడి ఉదయించు సూర్యునివలె నుండెను. నానావిధములగు పుష్పవృక్షములు, పండ్లచెట్లు అందు మెండుగా నుండెను. మత్తిల్లిన కోకిలలు, గండుతుమ్మెదలు అందు సదా నివసించుచుండెను. నెమళ్లు మదించి నాట్యము చేయుచుండెను. పలుజాతుల పక్షు లచట వాసము చేయుచుండెను. 5-8

సుందరమగు నడుము, ఏ లోపము లేని చక్కదనముతో కూడిన సీతకై హనుమంతుడు వెదకుచుండగా, అతని సంచారముచే చెట్లు కదలి, వానిపై సుఖముగా నిద్రించుచున్న పక్షులు మేల్కొనెను. 9

అట్లు పక్షు లెగురుచుండగా వాని ఱెక్కల తాకిడిచే వృక్షము లనేకవర్ణములు గల పలువిధములగు పూలవానలు కురిపించినవి. 10

పుష్పావకీర్ణ శ్శుశుభే హనుమాన్ మారుతాత్మజః,
అశోకవనికామధ్యే యథా పుష్పమయో గిరిః. 11

దిశ స్సర్వాః ప్రధావంతం వృక్షషండగతం కపిమ్,
దృష్ట్వా సర్వాణి భూతాని వవంత ఇతి మేనిరే. 12

వృక్షేభ్యః పతితైః పుష్పై రవకీర్ణా పృథగ్విధైః,
రరాజ వసుధా తత్ర ప్రమదేవ విభూషితా. 13

తరస్వినా తే తరవ స్తరసా౽భిప్రకంపితాః,
కుసుమాని విచిత్రాణి సస్పృజుః కపినా తదా. 14

నిర్ధూతపత్రశిఖరా శ్శీర్ణపుష్పఫలా ద్రుమాః,
నిక్షిప్తవస్త్రాభరణా ధూర్తా ఇవ పరాజితాః. 15

హనూమతా వేగవతా కంపితాస్తే నగోత్తమాః,

---

వాయుపుత్రు డగు హనుమంతు డా పుష్పములతో నిండినవాడై అశోక వనమధ్యమున పూలకొండ వలె శోభిల్లెను. 11

చెట్ల గుంపులో నుండి అన్ని దిశలకు పరుగెత్తుటచే పుష్పభరితుడైన హనుమంతుని చూచి భూతములన్నియు అతడు వసంతుడని తలంచెను. 12

ఆ వనమందలి భూమి చెట్లనుండి రాలి పడిన వివిధపుష్పములతో కూడినదై అలంకరించుకొనిన వనితవలె ప్రకాశించెను. 13

అపుడు బలవంతుడగు హనుమంతునిచే బలముగా కదల్పబడిన చెట్లు, వివిధ వర్ణములు గల పూలను కురిపించినవి. 14

అట్లు ఆకులు, శాఖాగ్రములు కదలుటచే చెట్ల పూవులు, పండ్లు నేల రాలగా ఆ చెట్లు, జూదమున సర్వస్వము నోడి, తమ అమూల్యములగు వస్త్రములు, నగలను సైతము కోల్పోయిన జూదరులవలె నుండెను. 15

వేగవంతుడగు హనుమంతుడు పూలతో ప్రకాశించు ఆ శ్రేష్ఠవృక్షములను కదల్పగా

పుష్పపర్ణఫలా న్యాశు ముముచుః పుష్పశాలినః. 16

విహంగసంఘైర్హీనా స్తే స్కంధమాత్రాశ్రయా ద్రుమాః,
బభూవు రగమా స్సర్వే మారుతేనేవ నిర్ధుతాః. 17

నిర్ధూతకేశీ యువతి ర్యథా మృదితవర్ణకా,
నిష్పీతశుభదంతోష్ఠీ నఖై ర్దంతైశ్చ విక్షతా. 18

తథా లాంగూలహస్తైశ్చ చరణాభ్యాం చ మర్దితా,
బభూ వాశోకవనికా ప్రభగ్నవరపాదపా. 19

మహాలతానాం దామాని వ్యధమ త్తరసా కపిః,
యథా ప్రావృషి వింధ్యస్య మేఘజాలాని మారుతః. 20

స తత్ర మణిభూమీశ్చ రాజతీశ్చ మనోరమాః,
తథా కాంచనభూమీశ్చ దదర్శ విచరన్ కపిః. 21

---

అవి పూలను, ఆకులను, పండ్లను శీఘ్రమే రాల్చినవి. 16

అట్లు హనుమంతుడు కదల్చిన ఆ వృక్షములు, గాలికి కంపించినవి వలె పక్షి సమూహములు ఎగిరిపోయి, ఆకులు పూలు రాలిపోగా, బోదెలు మాత్రము మిగిలి యుండుటచే చేరదగినవి కాకుండెను. 17

హనుమంతుడు తోకతో, చేతులతో, కాళ్ళతో శ్రేష్ఠవృక్షములను విఱుగగొట్టగా అశోకవనిక జుట్టుముడి వీడి, చందనాద్యంగరాగము తొలగి, చుంబింపబడిన దంతములు, పెదవులు గలదై, దంతక్షత, నఖక్షతములు కల యువతివలె కనుపించెను. 18,19

వర్షాకాలమున వింధ్యపర్వతము నాశ్రయించిన మేఘసమూహములను వాయువు చెదరగొట్టినట్లు పెనుతీగ జొంపములను హనుమంతుడు తన బలముచే చెదరగొట్టెను.

హనుమంతు డట్లు తిరుగుచు అచట మనోహరములగు మణిమయభూములను, వెండి, బంగారు రేకులతో కప్పబడిన నేలలను చూచెను. 21

వాపీశ్చ వివిధాకారాః పూర్ణాః పరమవారిణా,
మహార్హై ర్మణిసోపానై రుపపన్నా స్తత స్తతః. 22

ముక్తాప్రవాళసికతాః స్ఫాటికాంతరకుట్టిమాః,
కాంచనై స్తరుభి శ్చిత్రై స్తీరజై రుపశోభితాః. 23

ఫుల్లపద్మోత్పలవనా శ్చక్రవాకోపకూజితాః,
నత్యూహరుతసంఘుష్టా హంససారసనాదితాః. 24

దీర్ఘాభిర్ ద్రుమయుక్తాభి స్సరిద్భిశ్చ సమంతతః,
అమృతోపమతోయాభి శ్శివాభి రుపసంస్కృతాః. 25

లతాశతై రవతతా స్సంతానకుసుమావృతాః,
నానాగుల్మావృతఘనాః కరవీరకృతాంతరాః. 26

---

అట్లే నిర్మలజలములు కల పలు ఆకృతులు కల దిగుడుబావులను హనుమ చూచెను. అవి యట నట అనర్ఘములు, మణిఖచితములగు సోపానములతో కూడియుండెను. 22

స్ఫటికపు రాతితో కట్టబడిన భూప్రదేశమువ నా యా వ్యవహితప్రదేశములు ముత్యములు, వగడముల పొడులతో నింపబడి యుండెను. అవి ఆ దిగుడుబావుల తీరములందు మొలచిన కాంచనవృక్షములతో శోభిల్లుచుండెను. 23

ఆ దిగుడుబావులు వికసించిన తామరలతో, కలువలతో నిండి యుండెను. చక్రవాక పక్షుల కూజితములతో, భరతపక్షుల అఱపులతో, హంసలు, సారసముల నాదములతో వ్యాపించి యుండెను. 24

వానికి అన్నివైపులను చాల పొడవైన వాగులుండెను. వాని కిరుప్రక్కల వృక్షము లుండెను. ఆ వాగులు అమృతమువలె మధురములగు పవిత్రజలములతో రమ్యముగా నుండెను. 25

అవి వందలకొలది లతలతో, సంతానకపుష్పములతో నావరింపబడి యుండెను. అనేక పొదరిండ్లతో అవి దట్టముగ నుండెను. వాని నడుమ గన్నేరు చెట్లుండెను. 26

తతోఽమ్బుధరసంకాశం ప్రవృద్ధశిఖరం గిరిమ్,
విచిత్రకూటం కూటైశ్చ సర్వతః పరివారితమ్. 27

శిలాగృహై రవతతం నానావృక్షై స్సమావృతమ్,
దదర్శ హరిశార్దూలో రమ్యం జగతి పర్వతమ్. 28

దదర్శ చ నగా త్తస్మా న్నదీం నిపతితాం కపిః,
అంకాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్. 29

జలే నిపతితాగ్రైశ్చ పాదపై రుపశోభితామ్,
వార్యమాణామివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబంధుభిః. 30

పున రావృత్తతోయాం చ దదర్శ స మహాకపిః,
ప్రసన్నామివ కాంతస్య కాంతాం పునరుపస్థితామ్. 31

తస్యాదూరాత్ స పద్మిన్యో నానాద్విజగణాయుతాః,
దదర్శ హరిశార్దూలో హనుమాన్ మారుతాత్మజః. 32

---

హనుమంతు డట నొక సుందరపర్వతమును చూచెను. దాని శిఖరములు చాల ఎత్తుగా నుండి, విచిత్రములై ఎల్లెడల వ్యాపించెను. ఆ కొండ మేఘమువలె నుండెను. అది గుహలతో కూడి, వివిధవృక్షములచే ఆవరింపబడియుండెను. 27,28

హనుమంతు డా కొండపైనుండి పడుచున్న నదిని చూచెను. అది ప్రియుని తొడపై నుండి క్రిందపడిన ప్రియురాలివలె నుండెను. 29

కొన్ని చెట్ల శాఖాగ్రములు నది నీటిలోనికి వంగియుండెను. అవి, ఒక వనిత భర్తపై అలుకతో పుట్టినింటికి వెడలిపోవ నుంకించగా, వలదని వారించు బంధువుల చేతులవలె నుండెను. 30

అందొకచో జలములు వెనుకకు మఱలగా ఆ నది, తనపతిపై కోపము వీడి, ప్రసన్నురాలై తిరిగి వచ్చిన కాంతవలె నుండుట గాంచెను. 31

కపిశ్రేష్ఠుడు, వాయునందనుడగు హమమంతుడు ఆ నది చెంతనే వివిధపక్షి సమూహములతో కూడిన తామరకొలనులను చూచెను. 32

కృత్రిమాం దీర్ఘికాం చాపి పూర్ణాం శీతేన వారిణా,
మణిప్రవరసోపానాం ముక్తాసికతశోభితామ్. 33

వివిధైర్ మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్,
ప్రాసాదై స్సుమహద్భిశ్చ నిర్మితై ర్విశ్వకర్మణా. 34

కాననైః కృత్రిమైశ్చాపి సర్వత స్సమలంకృతామ్. 35

యే కేచిత్ పాదపా స్తత్ర పుష్పోపగఫలోపగాః,
సచ్ఛత్రా స్సవితర్దీకా స్సర్వే సౌవర్ణవేదికాః. 36

లతాప్రతానై ర్బహుభిః పర్ణైశ్చ బహుభి ర్వృతామ్,
కాంచనీం శింశుపా మేకాం దదర్శ హనుమాన్ కపిః.
వృతాం హేమమయీభిస్తు వేదికాభి స్సమంతతః. 37

సోఽపశ్య ద్భూమిభాగాంశ్చ గర్తప్రస్రవణాని చ,
సువర్ణవృక్షా నపరాన్ దదర్శ శిఖిసన్నిభాన్. 38

---

హనుమంతు డచట చల్లని నీటితో నిండినది, శ్రేష్ఠములగు మణులు పొదుగబడిన మెట్లు గలది, ముత్యముల ఇసుకతో శోభిల్లునది, అనేక పశు సమూహములతో ఆశ్చర్యజనకమైనది, చిత్రములగు వనములు కలది, విశ్వకర్మ నిర్మించిన పెద్ద మేడలు ఉద్యానవనములు చెంతనే కలదగు దిగుడుబావిని చూచెను. 33-35

అచటనున్న పుష్పించెడి, ఫలించెడి వృక్షములకు క్రింద గొడుగులు, వానిక్రింద వచ్చినవారు కూర్చుండుటకై బంగారు వేదికలు నిర్మించబడి యుండెను. 36

హనుమంతు డచట నొక బంగారు వర్ణముగల శింశుపావృక్షమును చూచెను. అది అనేకలతలతో, ఆకులతో చుట్టబడి యుండెను. 37

హనుమంతు డచట గోతులతో, సెలయేళ్లతో కూడిన భూభాగములను, అగ్నివలె ప్రకాశించు బంగారు వన్నెగల వృక్షములు కొన్నింటిని చూచెను. 38

మేరుపర్వతపు కాంతులచే సూర్యునివలె, బంగారు వన్నెచెట్ల కాంతిచే ప్రకాశించు

తేషాం ద్రుమాణాం ప్రభయా మేరో రివ దివాకరః,
అమన్యత తదా వీరః కాంచనో౽స్మీతి వానరః. 39

తాం కాంచనై స్తరుగణై ర్మారుతేన చ వీజితామ్,
కింకిణీశతనిర్ఘోషాం దృష్ట్వా విస్మయ మాగమత్. 40

స పుష్పితాగ్రాం రుచిరాం తరుణాంకురపల్లవామ్,
తామారుహ్య మహాబాహు శ్శింశుపాం పర్ణసంవృతామ్. 41

ఇతో ద్రక్ష్యామి వైదేహీం రామదర్శనలాలసామ్,
ఇతశ్చేతశ్చ దుఃఖార్తాం సంపతంతీం యదృచ్ఛయా. 42

అశోకవనికా చేయం దృఢం రమ్యా దురాత్మనః,
చంపకై శ్చందనైశ్చాపి వకుళైశ్చ విభూషితా. 43

ఇయం చ నళినీ రమ్యా ద్విజసంఘనిషేవితా,
ఇమాం సా రామమహిషీ నూన మేష్యతి జానకీ. 44

---

హనుమ తాను బంగారు దేహము కలవాడనని తలంచెను. 39

ఆయన బంగారు చెట్లతో కూడినదియు, వాయువుచే వీచబడినదియు, అనేకములగు మువ్వల మ్రోతలు కలదియు అగు అశోకవృక్షమును చూచి మిక్కిలి యాశ్చర్యపడెను. 40

మహాభుజుడగు హనుమంతుడు పుష్పించిన కొమ్మలతో కూడినదియు, రమ్యమైనదియు, లేత చిగుళ్లు, ఆకులు కలదియు, ఆకులతో దట్టముగా కప్పబడినదియు అగు ఆ శింశుపావృక్షము నెక్కి.... 41

'రాముని చూడవలెనని యువ్విళ్ళూరుచున్న సీత నిచట చూచెదను. దుఃఖముచే పీడితయై అప్రయత్నముగనే యిటు నటు తిరుగుచుండు సీతాదేవి నిట చూచెదను. 42

ఇది నిశ్చయముగ పాపాత్ముడగు రావణుని యశోకవనము. ఇది నంపెంగ తీగలతో, చందనవృక్షములతో, పొగడచెట్లతో రమ్యమై యున్నది. 43

పక్షిసమూహములు చెంతనే గల యీ తామరకొలను ఎంతో సుందరముగ నున్నది. రాముని భార్య సీత తప్పక యిట కేతెంచును. 44

సా రామా రామమహిషీ రాఘవస్య ప్రియా సతీ,
వనసంచారకుశలా నూన మేష్యతి జానకీ. 45
అథవా మృగశాబాక్షీ వనస్యాస్య విచక్షణా,
వనమేష్యతి సార్యేహ రామచింతానుకర్శితా. 46
రామశోకాభిసంతప్తా సా దేవీ వామలోచనా,
వనవాసే రతా నిత్య మేష్యతే వనచారిణీ. 47
వనేచరాణాం సతతం నూనం స్పృహయతే పురా,
రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ. 48
సంధ్యాకాలమనా శ్యామా ధ్రువమేష్యతి జానకీ,
నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ. 49
తస్యా శ్చాప్యనురూపేయ మశోకవనికా శుభా,

---

రాముని ఇల్లాలు, ఆయనకు ప్రియము గూర్చునది, అడవిలో తిరుగుటలో నేర్పుగల దగుటచే జానకి తప్పక యిట కేతెంచును. 45

లేదా లేడిపిల్ల చూపులవంటి చూపులు కలది, ఈ విహారమునకు తగిన ఎరుక కలది, పూజ్యురాలు అగు సీత రామునిగూర్చిన శోకముతో కృశించి యీ వనమునకు వచ్చును. 46

సుందరనేత్రములు కలది, రామవిరహమువలని శోకముచే పీడింపబడినది, నిత్యము వనవాసమందు ఆసక్తిగలది అగు సీత, ఈ వనమునకు తప్పక వచ్చును. 47

రాముని ప్రియభార్య, జనకుని కూతురు, పతివ్రతయగు నీమె పూర్వము వనచారులగు పశుపక్ష్యాదుల హితము గోరెడిది. కాన ఆమె యిటు రాగలదు. 48

సుందరరూపము గలది, యౌవనవతి, సంధ్యాసమయ మెప్పుడా యని యెదురు చూచునది అగు జానకి, పవిత్రజలము కల యీ నదికి సంధ్యోపాసనకై ప్రతిదినము వచ్చును. 49

శుభా యా పార్థివేంద్రస్య పత్నీ రామస్య సమ్మతా. 50

యది జీవతి సా దేవీ తారాధిపనిభాననా,
ఆగమిష్యతి సావశ్య మిమాం శివజలాం నదీమ్. 51

ఏవం తు మత్వా హనుమా న్మహాత్మా
ప్రతీక్షమాణో మనుజేంద్రపత్నీమ్,
అవేక్షమాణశ్చ దదర్శ సర్వం
సుపుష్పితే పర్ణఘనే నిలీనః. 52

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చతుర్దశః సర్గః.*

---

రాజశ్రేష్ఠుడగు రామునకు పత్ని, తన శుభాచరణముచే భర్తృసమ్మతయు అగు సీత కీ శుభమగు అశోకవనము తగియున్నది. 50

చంద్రునిబోలు మోముగల సీతాదేవియే జీవించియున్నచో ఆమె తప్పక పవిత్ర జలములు గల యీ నదికి వచ్చును. 51

అని యిట్లు మహాత్ముడగు హనుమంతుడు తలపోయుచు, రాజశ్రేష్ఠుడగు రాముని భార్య సీతకై చూచుచు, బాగుగా పూచి, యాకులు దట్టముగా గలిగిన యా శింశుపా వృక్షమునందు దాగియుండి సర్వమును చూచుచుండెను. 52

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదునాల్గవ సర్గము.*

# 15. పంచదశః సర్గః

*(హనుమంతు దశోకవనమందు సీతను దర్శించుట)*

స వీక్షమాణ స్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీమ్,
అవేక్షమాణశ్చ మహీం సర్వాం తా మన్వవైక్షత. 1

సంతానకలతాభిశ్చ పాదపై రుపశోభితామ్,
దివ్యగంధరసోపేతాం సర్వత స్సమలంకృతామ్. 2

తాం స నందనసంకాశాం మృగపక్షిభి రావృతామ్,
హర్మ్యప్రాసాదసంబాధాం కోకిలాకులనిస్వనామ్. 3

కాంచనోత్పలపద్మాభి ర్వాపీభి రుపశోభితామ్,
బహ్వాసనకుథోపేతాం బహుభూమిగృహాయుతామ్. 4

సర్వర్తుకుసుమై రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః,

---

హనుమంతు డా శింశుపావృక్షముపై గూర్చుండి, యటనుండి సీతను వెదకుచు భూమిపై నలుదిక్కుల తన దృష్టిని ప్రసరింపజేసెను. 1

ఆ వనము సంతానకము లనబడు తీగలతోను, వృక్షములతోను శోభిల్లుచుండెను. మంచి వాసన, రుచిగల పుష్పములతోను, ఫలములతోను అంతటను అలంకరింప బడియుండెను. 2

అది దేవేంద్రుని నందనవనమువలె నున్నదై, మృగములు, పక్షులు విరివిగా కలదై, మేడలు, భవంతులతో నిండి, కోకిలల కలకలధ్వనులు కలిగియుండెను. 3

ఆ వనము బంగారు వర్ణము గల కలువలు, తామరలతో నిండిన దిగుడు బావులతో కూడి, అనేకములగు పీఠములు, ఆస్తరణములతో శోభిల్లుచుండెను. 4

అచటి చెట్లు అన్ని ఋతువులలో పుష్పించు పూలతో, పండ్లతో కూడి సుందరమై

పుష్పితానా మశోకానాం శ్రియా సూర్యోదయప్రభామ్.
ప్రదీప్తామివ తత్రస్థో మారుతి స్సముదైక్షత. 5

నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణా మివాసకృత్. 6

వినిష్పతద్భి శ్శతశ శ్చిత్రైః పుష్పావతంసకైః,
అమూలపుష్పనిచితై రశోకై శ్శోకనాశనైః. 7

పుష్పభారాతిభారైశ్చ స్పృశద్భిరివ మేదినీమ్,
కర్ణికారైః కుసుమితైః కింశుకైశ్చ సుపుష్పితైః. 8

స దేశః ప్రభయా తేషాం ప్రదీప్త ఇవ సర్వతః. 9

పున్నాగా స్సప్తపర్ణాశ్చ చంపకోద్దాలకా స్తథా,
వివృద్ధమూలా బహవ శ్శోభంతే స్మ సుపుష్పితాః. 10

---

యుండెను. ఎఱ్ఱగా పూసిన అశోకముల శోభచే సూర్యోదయకాంతి కల ఆ వనము వెలుగుచున్నదో అన్నట్లు ఉండగా హనుమంతుడు చూచెను. 5

మాటిమాటికి ఱెక్కలను విదలించుకొను వందలాది పక్షు లీ అశోకవనమును అకులు, రెమ్మలు లేకుండునట్లు చేయుచున్నవా యనునట్లుండెను. 6

చిత్రవర్ణము గల పుష్పములు శిరోభూషణములుగా గలిగి అట్టి పుష్పములు అగ్రమునుండి మొదటి వరకు వ్యాపించుటచే, చూచువారల శోకమును పోగొట్టు అశోకవృక్షములలోను, అమితమగు పుష్పభారముచే వంగి నేలను తాకుచున్నవో యనునటు లున్న కొండగోగుల తోడను, చక్కగా పుష్పించిన మోదుగుచెట్లతోడను శోభిల్లు అశోకవనమును హనుమంతుడు చూచెను. 7,8

అట్లు ఎఱ్ఱగా పూచిన అశోకము మున్నగు వృక్షముల కాంతిచే నా ప్రదేశమంతయు జ్వలించుచున్నదో యనిపించుచుండెను. 9

పున్నాగములు, ఏడాకుల యరటులు, సంపెంగలు, ఉద్దాలకము లను చెట్లు బాగుగా విస్తరించిన మొదళ్ళు కలవై, బాగుగా పుష్పించి శోభించుచుండెను. 10

శాతకుంభనిభాః కేచిత్ కేచి దగ్నిశిఖోపమాః,
నీలాంజననిభాః కేచి త్తత్రాశోకా స్సహస్రశః. 11

నందనం వివిధోద్యానం చిత్రం చైత్రరథం యథా,
అతివృత్త మివాచింత్యం దివ్యం రమ్యం శ్రియా వృతమ్.
ద్వితీయమివ చాకాశం పుష్పజ్యోతిర్గణాయుతమ్. 12

పుష్పరత్నశతై శ్చిత్రం పంచమం సాగరం యథా,
సర్వర్తుపుష్పై ర్నిచితం పాదపై ర్మధుగంధిభిః. 13

నానానినాదై రుద్యానం రమ్యం మృగగణై ర్ద్విజైః,
అనేకగంధప్రవహం పుణ్యగంధం మనోరమమ్.
శైలేంద్రమివ గంధాఢ్యం ద్వితీయం గంధమాదనమ్. 14

అశోకవనికాయాం తు తస్యాం వానరపుంగవః,

---

ఆ యశోకపుష్పములలో కొన్ని బంగారు వన్నె, కొన్ని అగ్నిజ్వాల వర్ణము, కొన్ని కాటుక రంగు కలిగియుండెను. అవి వేల సంఖ్యలో నుండెను. వానితో నా యశోకవనము అనేక పూదోటలతో కూడిన యింద్రుని నందనవనమును, కుబేరుని చైత్రరథమను పేరుగల యుద్యానవనమును అతిశయించినది వలె ఊహింపనలవికాని దివ్యసౌందర్యముతో నొప్పుచు, పూవు లను తారలతో రెండవ యాకాశమో యనదగుచున్నదై యుండెను. 11,12

ఆ వనము వందలకొలదిగా కల పూవు లను రత్నములతో వేఱొక సముద్రము వలె నుండెను. అన్ని ఋతువులలో పూచు పూలు కలదై, తేనెవాసన కల చెట్లతో కూడి యుండెను. 13

ఆ వనము పశుపక్షులు చేయు వివిధనాదములతో రమణీయముగ నుండెను. అనేకసుగంధములు గుబాళించు వాయువుతో కూడి మనోహరమై సుగంధసమృద్ధమగుటచే పర్వతరాజగు రెండవ గంధమాదనమా అనిపించుచుండెను. 14

అట్టి ఆ యశోకవనమం దా హనుమ సమీపముననే యొక మహోభవనమును

స దదర్శావిదూరస్థం చైత్యప్రాసాద ముచ్ఛ్రితమ్, 15
మధ్యే స్తంభసహస్రేణ స్థితం కైలాసపాండురమ్,
ప్రవాళకృతసోపానం తప్తకాంచనవేదికమ్. 16
ముష్ణంత మివ చక్షూంషి ద్యోతమాన మివ శ్రియా,
విమలం ప్రాంశుభావత్వా దుల్లిఖంత మివాంబరమ్. 17
తతో మలినసంవీతాం రాక్షసీభి స్సమావృతామ్,
ఉపవాసకృశాం దీనాం నిశ్వసంతీం పునః పునః,
దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖా మివామలామ్. 18
మందం ప్రఖ్యాయమానేన రూపేణ రుచిరప్రభామ్,
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః. 19

---

చూచెను. అది వేయి స్తంభములు కలిగి, మిక్కిలి ఎత్తైనదై, కైలాసపర్వతమువలె తెల్లనై ప్రకాశించు చుండెను. ఆ భవనపు మెట్లు పగడములతో పొదుగబడెను. వేదికలు బంగారముతో నిర్మింపబడెను. 15,16

చూచువారి కా భవనము కనులకు మిరుమిట్లు గొలుపుచు చూపును పోగొట్టునా యనిపించుచుండెను. కాంతితో భవన మంతయు విరాజిల్లుచుండెను. ఆ భవనము స్వచ్ఛముగ నుండెను. మిగుల ఎత్తై ఆకాశమును తాకుచున్నదో యన్నటు లుండెను. 17

అంతట హనుమంతుడు మలినవస్త్రము ధరించి, చుట్టును రాక్షసస్త్రీలు కావలి కాయుచుండగా, ఆహారము తీసికొనకుండుటచే చిక్కి, దీనురాలై మాటిమాటికి నిట్టూర్చుచు, శుక్లపక్షపు ప్రారంభమున నిర్మలమై ప్రకాశించు సన్నని చంద్రరేఖవలె నొప్పు ఒక వనితను చూచెను. 18

కిష్టపరిస్థితిలో నుండుటచే చూచుటతోడనే యాకారమును బట్టి (సీత యని) గుర్తింపరాకున్నను, సుందరమగు ప్రకాశముకలదై, పొగలచే కప్పబడిన అగ్నిజ్వాలవోలె ఆమె కనుపించుచుండెను. 19

పీతే నైకేన సంవీతాం క్లిష్టే నోత్తమవాససా,
సపంకా మనలంకారాం విపద్మామివ పద్మినీమ్. 20

వ్రీళితాం దుఃఖసంతప్తాం పరిమ్లానాం తపస్వినీమ్,
గ్రహే ణాంగారకే ణేవ పీడితా మివ రోహిణీమ్. 21

అశ్రుపూర్ణముఖీం దీనాం కృశా మనశనేన చ,
శోకధ్యానపరాం దీనాం నిత్యం దుఃఖపరాయణామ్. 22

ప్రియం జన మపశ్యంతీం పశ్యంతీం రాక్షసీగణమ్,
స్వగణేన మృగీం హీనాం శ్వగణాభివృతా మివ. 23

నీలనాగాభయా వేణ్యా జఘనం గత యైకయా,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ. 24

---

జీర్ణమై పసుపు పచ్చని యొకే ప్రధానవస్త్రము ధరించినదై , శరీరమునకు సంస్కారములు (స్నానము మొ॥) లేమిచే భూమినుండి యావిర్భవించినదో యన్నటులు మురికి గల్గి, ఆభరణములు దాల్చక, పద్మములు లేని తామరకొలనువలె నుంచెను. 20

ఆమె పరపురుషుని బారి పడితినే యని సిగ్గుతో, పతి నెడబాయుటచే కలిగిన దుఃఖముతో, శోభ తఱిగి, వాడినదై, దయనీయస్థితి నొంది కుజగ్రహముచే పీడింపబడిన రోహిణివలె గన్పట్టుచుండెను. 21

కన్నుల నీరు నింపుకొని, ఆహారము మానుటచే, దీనయై, తన స్థితికి వగచుచు, సదా రాముచే తలంచుచు ఆమె దుఃఖపడుచుండెను. 22

ఆమె తన కిష్టులగువారిని కానక, క్రూరస్వభావముకల రాక్షసస్త్రీలు మాత్రమే కనుపింపగా, స్వజాతిమృగములు దగ్గరలో లేక, వేటకుక్కల నడుమనున్న ఆడులేడివలె నుండెను. 23

నల్లనై, పిరుదులవఱకు ప్రసరించి, కృష్ణసర్పమువలె నున్న ఒకే జడతో, వర్షాకాలము గడువగా శరదృతువునం దటవీసమూహముచే భూమివలె ఆమె కనుపించెను. 24

సుఖార్హాం దుఃఖసంతప్తాం వ్యసనానా మకోవిదామ్,
తాం సమీక్ష్య విశాలాక్షీ మధికం మలినాం కృశామ్,
తర్కయామాస సీతేతి కారణై రుపపాదిభిః. 25

హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా,
యథారూపా హి దృష్టా వై తథారూపేయ మంగనా. 26

పూర్ణచంద్రాననాం సుభ్రూం చారువృత్తపయోధరామ్,
కుర్వంతీం ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః. 27

తాం నీలకేశీం బింబోష్ఠీం సుమధ్యాం సుప్రతిష్ఠితామ్,
సీతాం పద్మపలాశాక్షీం మన్మథస్య రతిం యథా. 28

ఇష్టాం సర్వస్య జగతః పూర్ణచంద్రప్రభామివ,

---

రాజపుత్రి యగుటచే, సుఖము లనుభవింపదగియు దుఃఖ మనుభవించుచున్నదియు, మున్నెన్నడు కష్టముల నెఱుగనిదియు, విశాలనేత్రములు కలదియు, మిగుల మలినయై చిక్కియున్న ఆమెను హనుమంతుడు చూచి యుక్తియుక్తములగు చెప్పబోవు కారణములచే నామె సీత యని యూహించెను. 25

'నాడు స్వేచ్ఛారూపధారి యగు రావణాసురునిచే అపహరింపబడుచున్నదై సీతాదేవి ఏ రూపముతో నుండినదని వింటినో ఆ రూపముతోనే ఈమె యిపు డగపడుచున్నది' అని హనుమ తలంచెను. 26

ఆమె పున్నమి చంద్రునిబోలు మోము, చక్కని కనుబొమలు, సుందరములై, గుండ్రనివగు స్తనములు కలదై, చిరకాలము స్నానముచేయకున్నను తన దేహకాంతిచే దిక్కుల చీకట్లను పోగొట్టుచుండెను. 27

ఆమె నల్లని కేశములు, దొండపండ్ల వంటి పెదవులు, చక్కని నడుము కలిగి కుదురుగ కూర్చొనియున్నదై, తామరరేకులవంటి కన్నులతో మన్మథునిభార్య రతీదేవి వలె నుండెను. 28

పూర్ణచంద్రుని కాంతి యెట్లు సకలజనుల కభిమతమో అట్లే ఎల్లరకును

భూమౌ సుతను మాసీనాం నియతామివ తాపసీమ్. 29
నిశ్శ్వాసబహులాం భీరుం భుజగేంద్రవధూమివ. 30
శోకజాలేన మహతా వితతేన న రాజతీమ్,
సంసక్తాం ధూమజాలేన శిఖామివ విభావసోః. 31
తాం స్మృతీమివ సందిగ్ధా మృద్ధిం నిపతితా మివ,
విహతామివ చ శ్రద్ధా మాశాం ప్రతిహతామివ. 32
సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ,
అభూతే నాపవాదేన కీర్తిం నిపతితా మివ. 33
రామోపరోధవ్యథితాం రక్షోహరణకర్శితామ్,
అబలాం మృగశాబాక్షీం వీక్షమాణాం తత స్తతః. 34
బాష్పాంబుపరిపూర్ణేన కృష్ణవక్రాక్షిపక్ష్మణా,

---

ప్రీతిపాత్రురాలై, సుందరరూపముకలదై తపస్విని వలె నియమవతియై, భూమిపై కూర్చుండి, భయముతో నిట్టూర్చుచు సర్పరాజకన్యవలె నుండెను. 29,30

అమె మిగుల పెల్లుబుకు శోకవేగము కప్పివేయగా, పొగగ్రమ్మిన యగ్నిజ్వాలవలె ప్రకాశింపకుండెను. 31

సందేహము కలిగించు అర్థముకల స్మృతివాక్యమువలెను, క్షీణించిన సంపదవలెను, సడలిన శ్రద్ధవలెను, నిరోధించబడిన ఆశవలెను సీతాదేవి కన్పట్టెను. 32

అమె విఘ్నములతో కూడిన కార్యసిద్ధివలె, కపటముతో కూడిన యాలోచనవలె, మిథ్యాపవాదముచే పతనమైన కీర్తివలె గన్పట్టెను. 33

రామసమాగమమున కంతరాయ మేర్పడుటచే మిగుల వ్యథజెందినదై, రావణునిచే గొనిరాబడుటచే కృశించినదై, దుర్బలయై, లేడిపిల్ల కన్నులవంటి విశాలనేత్రములు కలదై, భయముతో నిటు నటు జూచుచున్నదై సీతాదేవి కనుపించెను. 34

కన్నీటితో నిండి, నల్లని వక్రములైన కనురెప్పలతో అప్రసన్నమగు ముఖముతో

వదనే నాప్రసన్నేన నిఃశ్వసంతీం పునః పునః. 35
మలపంకధరాం దీనాం మండనార్హామమండితామ్,
ప్రభాం నక్షత్రరాజస్య కాలమేఘై రివావృతామ్. 36
తస్య సందిదిహే బుద్ధి ర్ముహు స్సీతాం నిరీక్ష్య తు,
ఆమ్నాయానా మయోగేన విద్యాం ప్రశిథిలా మివ. 37
దుఃఖేన బుబుధే సీతాం హనుమా ననలంకృతామ్,
సంస్కారేణ యథా హీనాం వాచమర్థాంతరం గతామ్. 38
తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీ మనిందితామ్,
తర్కయామాస సీతేతి కారణై రుపపాదిభిః. 39
వైదేహ్యా యాని చాంగేషు తదా రామోఽన్వకీర్తయత్,

---

ఆమె మాటిమాటికి నిట్టూర్చుచుండెను. 35

ఆమె శరీరము మురికిగా నుండెను. ముఖమున దైన్య ముట్టిపడుచుండెను. అలంకరించు కొనదగియు నామె యలంకరించుకొనలేదు. ఇట్లామె కారుమేఘములు గ్రమ్మిన చంద్రుని కాంతివలె నగపడెను. 36

కృశించుట, మాలిన్యము సోకుట మున్నగు హేతువులచే సీత మాటిమాటికి అభ్యాసము లేమిచే తటిగిన విద్యవలె కన్పట్టుచు, ఈమె సీతయేనా అను సందేహమును హనుమంతునకు కలుగచేసెను. 37

శబ్దవ్యుత్పత్తి కొఱవడుటచే చెప్పదలచిన అర్థమును గాక వేఱొక అర్థమిచ్చునది, అలంకారరహితమైనది యగు వాక్కువలె భూషణములు దాల్చక యున్న సీతాదేవిని హనుమంతుడు మిగుల కష్టముతో పోల్చుకొనగలిగెను. 38

విశాలమైన కన్నులు కలది, నిందింపబడనిది, రాజపుత్రి అగు ఆమెను హనుమంతుడు యుక్తియుక్తములగు కారణములచే సీతగా నూహించెను. 39

నాడు సీతాన్వేషణార్థము పోవునప్పుడు రాముడు సీత అవయవములం దే యే

తాన్యాభరణజాలాని శాఖాశోభీ న్యలక్షయత్. 40

సుకృతౌ కర్ణవేష్టౌ చ శ్వదంష్ట్రౌ చ సుసంస్థితౌ,
మణివిద్రుమచిత్రాణి హస్తే ష్వాభరణాని చ. 41

శ్యామాని చిరయుక్తత్వా త్తథా సంస్థానవంతి చ,
తాన్యేవైతాని మన్యేఽహం యాని రామోఽన్వకీర్తయత్. 42

తత్ర యా న్యవహీనాని తా న్యహం నోపలక్షయే,
యాన్యస్యా నావహీనాని తానీమాని న నంశయః. 43

పీతం కనకపట్టాభం స్రస్తం తద్వసనం శుభమ్,
ఉత్తరీయం నగాసక్తం తదా దృష్టం ప్లవంగమైః. 44

భూషణాని చ ముఖ్యాని దృష్టాని ధరణీతలే,
అనయైవాపవిద్ధాని స్వనవంతి మహాంతి చ. 45

---

యాభరణము లున్నటులు వర్ణించెనో వానిని హనుమ చెట్టుకొమ్మలపై వ్రేలాడుచున్న వానినిగా చూచెను. 40

ఈ చక్కని కుండలములు, త్రికర్ణము లను పుష్పాకారపు కర్ణాభరణములు, మణిప్రవాళ ఖచితములగు హస్తాభరణములు అవియే. 41

ఈమె చిరకాలము ధరించుటచే ఈ నగలు వన్నె తరిగి నల్లగా నున్నవి. వీని గుర్తు లీమె అవయవములపై ఏర్పడినవి. రాముడు పేర్కొనిన నగ లివియే యని తలంతును. 42

నాడు సీతమ్మ ఋశ్యమూకముపై జారవిడచిన నగ లీమె చెంత కనుపించుట లేదు. అట్లు పడవేయని నగలే యిచట నున్నవి. సందేహము లేదు. 43

పచ్చనై, బంగారు పట్టీవలె మెరయుచు, శుభకరమైన ఈమె ఉత్తరీయవస్త్రము నాడు ఋశ్యమూకముపై పడగా నుగ్రీవాదివానరులు చూచిరి. 44

నా డీమె జారవిడచిన ముఖ్యమైన అమూల్యాభరణములు భూమిపై శబ్దము చేయుచు పడగా వానరులు చూచిరి. 45

ఇదం చిరగృహీతత్వా ద్వసనం క్లిష్టవత్తరమ్,
తథాఽపి నూనం తద్వర్ణం తథా శ్రీమద్యథేతరత్. 46

ఇయం కనకవర్ణాంగీ రామస్య మహిషీ ప్రియా,
ప్రణష్టా ఽపి సతీ యాఽస్య మనసో న ప్రణశ్యతి. 47

ఇయం సా యత్కృతే రామ శ్చతుర్భిః పరితప్యతే,
కారుణ్యే నానృశంస్యేన శోకేన మదనేన చ. 48

స్త్రీ ప్రణష్టేతి కారుణ్యా దాశ్రితే త్యానృశంస్యతః,
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ. 49

అస్యా దేవ్యా యథా రూప మంగప్రత్యంగసౌష్ఠవమ్,
రామస్య చ యథారూపం తస్యేయ మసితేక్షణా. 50

అస్యా దేవ్యా మన స్తస్మిం స్తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్,

---

ఈమె చిరకాలము కట్టుకొనుటచే చీర మిక్కిలి నలిగియున్నది. అయినను దీని కాంతి ఋశ్యమూకముపై విడచిన ఉత్తరీయపు కాంతిని పోలియున్నది. 46

పసిడి మేని చాయ కల ఈమె రామునికి ప్రియమైన ఇల్లాలు. ఈమె పతి చూపులకు దూరమైనను, మనసునుండి దూరము కాలేదు. 47

ఈమెకొరకే రాముడు కరుణ, సౌజన్యము, శోకము, కామము అను ఈ నాల్గింటిచే బాధపడుచున్నాడు. 48

ఇట్లు అగపడకపోయినది స్త్రీకదా అని కరుణ, నా రక్షణలో నుండినది ఇట్లాయనే అని సౌజన్యము, భార్య కనుపించలేదని శోకము, తన కెంతో ప్రీతిపాత్రురాలని కామము. (వీనితో బాధపడుచున్నాడు). 49

ఈమెను పోలు రూపము శరీరావయవముల పొందికను రాముడు, ఆయనను పోలు రూపము, అవయవసౌష్ఠవము నీ నల్లని కనులు గల సీతయు కలిగి ఒకరి కొకరు తగియున్నారు. 50

ఈమె మనస్సు రామునియందే నెలకొనియున్నది. అట్లే ఆయన మనస్సు ఈమెయందే

తేనేయం స చ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి. 51

దుష్కరం కృతవాన్ రామో హీనో యదనయా ప్రభుః,
ధారయ త్యాత్మనో దేహం న శోకే నావసీదతి. 52

దుష్కరం కురుతే రామో య ఇమాం మత్తకాశినీమ్,
సీతాం వినా మహాబాహు ర్ముహూర్తమపి జీవతి. 53

ఏవం సీతాం తదా దృష్ట్వా హృష్టః పవనసంభవః,
జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్. 54

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచదశః సర్గః.*

---

స్థిరమై యున్నది. కావుననే వారిట్లు ఒకరిపై నొకరు ఆశలు పెంచుకొని క్షణకాలమైనను జీవించగలుగుచున్నారు. 51

రాముడు, సీత లేకున్నను దేహము ధరించియున్నాడు. (సీత అస్వతంత్ర కావున శరీరము విడువజాలదు). రాముడు పురుషుడు కనుక స్వతంత్రుడైనను దేహము దాల్చియే యున్నాడు. శోకపరవశుడై కృశించి నశించుటలేదు. ఇట్టి దుష్కరకార్యము నిత దాచరించినాడు. 52

ఉత్తమవనిత యగు సీతను వీడి ఇప్పటివరకు ఆ మహాభుజుడగు రాముడు ముహూర్తమైనను జీవించియున్నారు. మరెవ్వరు ఇట్టి పతివ్రతను విడిచి ఉండలేరు. కావున ఇత దెవ్వరికిని సాధ్యముకాని పనినే చేయుచున్నాడు. 53

వాయుతనయుడు హనుమంతు డపు డట్లు మాసిన వస్త్రము దాల్చి ఉపవాసాది వ్రత ధర్మముల నాచరించుచున్న సీతను చూచి, సంతోషించి, రాముని తిరిగి పొందుటకు అవసరమగు పతివ్రతాధర్మములను ఈమె అనుష్ఠించుచున్నది కనుక ప్రభువగు రాముడు మహాభాగ్యశాలి యని అతనిని ప్రశంసించెను. 54

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదునైదవ సర్గము.*

# 16. షోడశః సర్గః

*(సీతాదేవి దుర్దశను చూచి హనుమంతుడు విలపించుట)*

ప్రశస్య తు ప్రశస్తవ్యాం సీతాం తాం హరిపుంగవః,
గుణాభిరామం రామం చ పున శ్చింతాపరో ௨భవత్. 1

స ముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః,
సీతా మాశ్రిత్య తేజస్వీ హనుమాన్ విలలాప హ. 2

మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా,
యది సీతా௨పి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః. 3

రామస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ [1]ధీమతః,

వానరశ్రేష్ఠుడగు హనుమంతు డట్లు ప్రశంసింపదగిన సీతాదేవిని, గుణాభిరాముడగు రాముని కొనియాడి మఱల నిట్లు చింతాక్రాంతుడయ్యెను. 1

పరాక్రమశాలి యగు హనుమంతుడు సీతను గూర్చి యొకింతతడ వాలోచించి కన్నీరు కనుల నిండగా నిట్లు విలపించెను. 2

'గురువులచే సుశిక్షితుడైన లక్ష్మణునకు పూజింపదగినది, రామునకు ప్రియురాలు అయిన సీతయు యిట్లు దుఃఖపీడితురా లగుట చూడగా కాల మెవ్వరికిని అతిక్రమింపరానిదని స్పష్టము. (జగద్రక్షకులగు రామలక్ష్మణులు రక్షించుచున్నను సీతాదేవి కిట్టి దుఃఖము కలిగె ననగా కాల మెట్లు బలవత్తరమో తెలియును.) 3

1 ఏతద్ వ్రతం మమ' (ఇది నాకు వ్రతము), 'అప్యహం జీవితం జహ్యామ్' (నేను ప్రాణములనైన విడతును) ఇత్యాదికమగు రాముని పట్టుదలను ఎఱిగినదని భావము. రాముడు మాయలేడి ననుసరించి పోయినను అప్పుడే 'వీడు లేడి కాదు; మారీచు'డని నిశ్చయించగల బుద్ధిశాలి కావున లక్ష్మణునకు ధీమంతుడని విశేషణము. సర్వేశ్వరునికంటెను ముందుగా ఆశ్రితరక్షణోద్యుక్తుడని సూచితము.

నాత్యర్థం క్షుభ్యతే దేవీ గంగేవ జలదాగమే. 4

[1]తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్,
రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా. 5

తాం దృష్ట్వా నవహేమాభాం లోకకాంతా మివ శ్రియమ్,

---

రాముని నిశ్చయమును, ధీమంతుడగు లక్ష్మణుని కర్తవ్యనిష్ఠను ఎఱిగిన దగుటచే తానెట్టి ప్రయత్నము చేయక వర్షర్తువులో గంగానది పొంగి పొఱలవలసియున్నను కలతచెందనట్లు ఎంతమాత్రము కలవరపడుటలేదు. 4

స్వభావము, వయస్సు, నడవడి, వంశము, సాముద్రిక లక్షణములు తనతో సహగముగ కల ఈ నల్లని కన్నుల సీత రామునకును, రాము డీమెకును తగియున్నారు. 5

నూతనమగు బంగారమువలె ప్రకాశించుచు, లోకమున కెల్ల ప్రియము చేకూర్చుచు, లక్ష్మీదేవివలె నున్న ఆమెను చూచి, హనుమంతుడు వెంటనే రాముని స్మరించి తనలో

---

1 అస్యా దేవ్యా మన స్తస్మిం స్తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్' (ఈమె మనస్సు రామునియందు, ఆయన మన సీమెయందు స్థిరముగ నున్నది.) ఇత్యాదులచే సీతారాముల తుల్యస్వభావ మూహింపనగును. పదునారేండ్లవానికి అష్టవర్ష యగు కన్య భార్య యగుటచే సీతారాముల వయస్సున కనురూపత, 'దోషో యద్యపి తస్య స్యాత్ సతా మేత దగర్హితమ్' (విభీషణునిలో పరులు చెప్పెడి దోషమున్నను, మైత్రినిగోరి వచ్చినవానిని విడువను. అట్లు వానిని గ్రహించుట శిష్టసమ్మతము గూడ) ఇత్యాదులచే రామవృత్తము, 'పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ, కార్యం కరుణ మార్యేణ న కశ్చి న్నాపరాధ్యతి' (నీవు చెప్పిన చొప్పున పాపులై, నా యభిప్రాయము ననుసరించి అపాపులునై వధ్యులైన వారిపై గూడ ఆర్యులు కరుణింతురు. అపరాధము చేయనివా రెవ్వరు?) ఇత్యాదులచే సీతావృత్తమును అనురూపము లగుట స్పష్టము. లోకమున సుందరునకు సుందరిగాని, సుందరికి సుందరుడుగాని ఆలుమగ లగుట యను ఆనురూప్యము సులభము గాదు. కాని వీరిరువుర కట్టి ఆనురూప్యము సర్వవిధములుగ నుండుట చూచిన హనుమ కాశ్చర్యము కల్గినది. అసితేక్షణ (నల్లని కన్నులు గలది) యను విశేషణముచే రామునికంటె సీతానయనసౌందర్య మధికమని చెప్పబడినది. కావుననే రాముడు 'న జీవేయం క్షణమపి వినా తా మసితేక్షణామ్' (నల్లనినేత్రములు కల జానకి లేక నేనొక క్షణమైన జీవింపను.) అనును.

జగామ మనసా రామం వచనం చేద మబ్రవీత్. 6

అస్యా హేతో ర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః,
రావణప్రతిమో వీర్యే కబంధశ్చ నిపాతితః. 7

విరాధశ్చ హత స్సంఖ్యే రాక్షసో భీమవిక్రమః,
వనే రామేణ విక్రమ్య మహేంద్రేణేవ శంబరః. 8

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్,
నిహతాని జనస్థానే శరై రగ్నిశిఖోపమైః. 9

ఖరశ్చ నిహత స్సంఖ్యే త్రిశిరాశ్చ నిపాతితః,
దూషణశ్చ మహాతేజా రామేణ విదితాత్మనా. 10

ఐశ్వర్యం వానరాణాం చ దుర్లభం వాలిపాలితమ్,
అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతమ్. 11

---

తానిట్లు భావించెను. 6

విశాలములైన కన్నులు గల యీమెకొరకే రాముడు మహాబలుడగు వాలిని పరిమార్చినాడు. పరాక్రమమున రావణునకు సాటియైన కబంధుని చంపినాడు. 7

అడవిలో తనతో తలపడిన భీకర పరాక్రమముగల విరాధు డను రాక్షసునికూడ ఈమె రాముడు దేవేంద్రుడు శంబరుని చంపినట్లు సంహరించినాడు. 8

జనస్థానమున భీకరకృత్యము లొనర్చు పదునాలుగువేల రాక్షసుల నగ్నిజ్వాలల వంటి బాణములచే రాము డీమె కారణముగనే చంపినాడు. 9

ఈమె కారణముగనే ఆత్మవిదుడగు రాముడు యుద్ధమునందు ఖరుడు, దూషణుడు, త్రిశిరస్కుడను మహాతేజస్వులగు రాక్షసులను సంహరించెను. 10

ఈమె కారణముగనే, వాలి పరిపాలించుచుండుటచే, అన్యులకు పొందశక్యము గానిది, లోకమున గౌరవస్థానమైనది యగు వానరరాజ్యాధిపత్యమును సుగ్రీవుడు పొందినాడు. 11

సాగరశ్చ మయా క్రాంతః శ్రీమాన్ నదనదీపతిః,
అస్యా హేతో ర్విశాలాక్ష్యాః పురీ చేయం నిరీక్షితా. 12
యది రామ స్సముద్రాంతాం మేదినీం పరివర్తయేత్,
అస్యాః కృతే జగచ్చాపి యుక్తమిత్యేవ మే మతిః. 13
రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా,
త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్ కలామ్. 14
ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః,
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా. 15
ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే,
పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారసాంసుభిః. 16
విక్రాంత స్యార్యశీలస్య సంయుగే ష్వనివర్తినః,

---

విశాలనయనములు గల ఈమె నిమిత్తమే శ్రీమంతుడు, నదములకు నదులకును పతియగు సముద్రుని దాటివచ్చి నే నీ పురము జూచితిని. 12

ఈమెకొరకై రాముడు సముద్రము వరకు వ్యాపించివ సకలధరిత్రిని తలక్రిందులు చేసినను లేదా ప్రపంచమునే తలక్రిందులు చేసినను యుక్తమే యని నా అభిప్రాయము.

ముల్లోకముల అధిపత్యమా లేక జనకుని కూతురగు సీతయా గొప్పదవి విచారించుచో, సమస్తత్రైలోక్యరాజ్యమును సీత యొక్క పదునారవపాలున కైన సాటి కాజాలదని చెప్పగలను. 14

ధర్మశీలుడు, మహాత్ముడు, మిథిలాధిపతి యగు జనకమహారాజు పుత్రికయే యీమె. భర్తయందు దృఢభక్తి కలది. పద్మపరాగముల వలె పవిత్రములైన యజ్ఞక్షేత్రపరాగములచే కప్పబడియుండి నాగటికఱ్ఱున దున్నబడిన యజ్ఞక్షేత్రమందు భూమిని భేదించుకొని పైకి వచ్చిన దీమెయే. 15,16

పరాక్రమశాలి, శ్రేష్ఠమగు స్వభావము కలవాడు, యుద్ధమున వెన్నుజూపనివాడగు

స్నుషా దశరథ స్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ. 17

ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య రామస్య విదితాత్మనః,
ఇయం సా దయితా భార్యా రాక్షసీవశ మాగతా. 18

సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృస్నేహబలాత్కృతా,
అచింతయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్. 19

సంతుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణే రతా,
యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా. 20

సేయం కనకవర్ణాంగీ నిత్యం సుస్మితభాషిణీ,
సహతే యాతనా మేతా మనర్థానా మభాగినీ. 21

ఇమాం తు శీలసంపన్నాం ద్రష్టు మర్హతి రాఘవః,
రావణేన ప్రమథితాం ప్రపామివ పిపాసితః. 22

---

దశరథమహారాజున కీ యశోవతి యగు జానకి పెద్దకోడలు. 17

ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, ప్రశస్తబుద్ధిశాలి రామునకు ప్రియపత్ని యగు ఈమె రాక్షసస్త్రీలకు చిక్కినది. 18

నకలభోగసాధనములను, తల్లులు మున్నగు వారిని విడిచి, వానియం దెంతమాత్రము ఆశ లేనిదై భర్తయెడల ప్రేమతో దుఃఖములను గణింపక నిర్జనారణ్యమున ప్రవేశించినదై, పండ్లను దుంపలను తినుటచేతనే సంతుష్టి నందుచు, భర్తను సేవించుటయం దనురక్తయై, అడవిలో కూడ రాజభవనమందువలెనే ఈమె మిక్కిలి సంతోషము నందుచున్నది. 19,20

బంగారు వన్నెగల శరీరము గలది, ఎల్లపుడు చిరునవ్వుతో మాటలాడునది, కష్టములు పడదగనిదగు ఈమె ఈ క్లేశములను సహించుచున్నది. 21

రావణుడు బాధించుచున్న శీలవతియగు ఈ సీతను రాముడు దప్పిక గొన్నవాడు పానీయశాలను చూచి నట్లు చూచి ఆనందించగలడు. 22

అస్యా నూనం పునర్లాభా ద్రాఘవః ప్రీతి మేష్యతి,
రాజా రాజ్యపరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీమ్. 23

కామభోగైః పరిత్యక్తా హీనా బంధుజనేన చ,
ధారయ త్యాత్మనో దేహం తత్సమాగమకాంక్షిణీ. 24

నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్పఫలద్రుమాన్,
ఏకస్థహృదయా నూనం రామమే వానుపశ్యతి. 25

భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి,
ఏషా తు రహితా తేన భూషణార్హా న శోభతే. 26

దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః,
ధారయ త్యాత్మనో దేహం న దుఃఖే నావసీదతి. 27

ఇమా మసితకేశాంతాం శతపత్రనిభేక్షణామ్,

---

పోగొట్టుకొనిన రాజ్యమును తిరిగి సంపాదించిన రాజువలె యీామె లభించుటచే రాముడు తప్పక ప్రీతి నొందును. 23

స్రక్చందనాదిభోగములు విడచి, బంధువులకు దూరమైన యీామె రామసమాగమమునే కోరుచు ప్రాణములు నిలుపుకొనుచున్నది. 24

ఈమె రాక్షసస్త్రీలను గాని, పుష్ప, ఫలవృక్షములను గాని చూచుట లేదు. ఏకాగ్రతతో రామునే ధ్యానించుచున్నది. 25

స్త్రీలకు తక్కిన స్వర్ణాద్యాభరణము లన్నింటికంటెను భర్తయే శ్రేష్ఠమగు అభరణము. అట్టి భర్తృరూపమగు ఆభరణము లేక, ఆభరణములు ధరింప యోగ్యురాలయినను ఈమె శోభించుట లేదు. 26

ప్రభు వగు రాము డీమె నెడబాసి దుఃఖముతో నశింపక, దేహమును ధరించుచు అన్యుల కలవి కాని పనినే యాచరించుచున్నాడు. 27

నల్లని కురులు గలది, కమలముల వంటి కన్నులు గలది, సుఖము

సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః. 28

క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యామ్,
సా రాక్షసీభి ర్వికృతేక్షణాభి
స్సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే. 29

హిమహతనళినీవ నష్టశోభా, వ్యసనపరంపరయా నిపీడ్యమానా,
సహచరరహితేవ చక్రవాకీ, జనకసుతా కృపణాం దశాం ప్రపన్నా.

అస్యా హి పుష్పావనతాగ్రశాఖా
శ్శోకం దృఢం వై జనయం త్యశోకాః,
హిమవ్యపాయేన చ మందరశ్మి
రభ్యుత్థితో నైకసహస్రరశ్మిః. 31

---

లనుభవింవదగినది యగు ఈమె దుఃఖితయై యుండుట చూడగా ఈమెను పూర్వము చూచి యెరుగని నా వంటి వాని మనస్సు కూడ వ్యథ జెందినది. (పరమదయాళువగు రాముని విషయము వేఱుగా చెప్పవలెనా?) 28

సహనమున భూదేవిని పోలినది, కమలనయన యగు ఎవ్వతెను రామలక్ష్మణులు పూర్వము రక్షించెడివారో యా సీత నిపుడు వికృతనేత్రములు గల రాక్షసాంగనలు శింశుపావృక్షమూలమున కావలి కాయుచున్నారు. 29

మంచు తగిలి, వాడి, సొంపు చెడిన తీగవలె, ఎడతెగని కష్టము లనుభవించిన జనకమహారాజు పుత్రిక సీత, సహచరు నెడబాసిన ఆడుచక్రవాకము వలె కాంతి తొలగి దీనస్థితిని పొందియున్నది. 30

పుష్పభారముచే వంగిన (శోకము పోగొట్టునట్టి) అశోకవృక్షములు, అనేకవేల కిరణములతో ప్రకాశించు చంద్రుడును ఈమెకు శోకమునే కలిగించుచున్నారు. 31

ఇత్యేవ మర్థం కపి రన్వవేక్ష్య, సీతేయ మిత్యేవ నివిష్టబుద్ధిః,
సంశ్రిత్య తస్మి న్నిషసాద వృక్షే, బలీ హరీణా మృషభ స్తరస్వీ. 32

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షోడశః సర్గః.*

---

అని యిట్లు బలిష్ఠుడు, వానరశ్రేష్ఠుడగు హనుమంతు డన్ని విషయములను చక్కగా గమనించి, ఈమె సీతయే యని నిశ్చయించి, యా శింశుపావృక్షముపై కూర్చుండెను. 32

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదునారవ సర్గము.*

# 17. సప్తదశః సర్గః

*(హనుమంతుడు సీతాదర్శనముచే సంతుష్టుడగుట)*

తతః కుముదషండాభో నిర్మలో నిర్మలం స్వయమ్,
ప్రజగామ నభ శ్చంద్రో హంసో నీల మివోదకమ్. 1

సాచివ్యమివ కుర్వన్ స ప్రభయా నిర్మలప్రభః,
చంద్రమా రశ్మిభి శ్శీతై స్సిషేవే పవనాత్మజమ్. 2

స దదర్శ తత స్సీతాం పూర్ణచంద్రనిభాననామ్,
శోకభారైరివ న్యస్తాం భారై ర్నావ మివాంభసి. 3

దిదృక్షమాణో వైదేహీం హనుమా న్మారుతాత్మజః,
స దదర్శావిదూరస్థా రాక్షసీ ర్ఘోరదర్శనాః. 4

---

అటు పిమ్మట తెల్లకలువల సమూహము వలె ప్రకాశించుచు నిర్మలుడగు చంద్రుడు, హంస నల్లని జలములోనికి పోవునట్లు నిర్మలాకాశములోనికి పోయెను. 1

నిర్మలమగు కాంతి గల చంద్రుడు తన కాంతితో సాహాయ్యము చేయుచున్న వానివలె చల్లని కిరణములు ప్రసరింపజేసి హనుమంతుని సేవించెను. 2

అట్లు చంద్రుని వెన్నెల చక్కగా ప్రసరించిన పిమ్మట హనుమ పూర్ణచంద్రుని వంటి మోముగల సీతాదేవిని చూచెను. ఆమె బరువుతో నిండిన నావవలె, శోకభారమున మునిగియుండెను. 3

వాయునందను డగు హనుమంతుడు సీతను చూడగోరి అన్వేషించు సందర్భమున ఒకే కన్నుగలది, ఒకే చెవి గలది, పెద్ద చెవులతో తలను కప్పుకొనునది, చెవులు లేనిది, నీరుపంది చెవుల వంటి చెవులు కలది, ఊర్ధ్వముఖమగు ముక్కుగలది, పెద్ద

ఏకాక్షీ మేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
అకర్ణాం శంకుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాసనాసికామ్. 5
అతికాయోత్తమాంగీం చ తనుదీర్ఘశిరోధరామ్,
ధ్వస్తకేశీం తథాకేశీం కేశకంబళధారిణీమ్. 6
లంబకర్ణలలాటాం చ లంబోదరపయోధరామ్,
లంబోష్ఠీం చుబుకోష్ఠీం చ లంబాస్యాం లంబజానుకామ్. 7
హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా,
కరాళాం భుగ్నవక్త్రాం చ పింగాక్షీం వికృతాననామ్. 8
వికృతాః పింగళాః కాలీః క్రోధనాః కలహప్రియాః,
కాలాయసమహాశూలకూటముద్గరధారిణీః. 9
వరాహమృగశార్దూలమహిషాజశివాముఖీః,
గజోష్ట్రహయపాదీశ్చ నిఖాతశిరసోఽపరాః. 10

---

తల గలది, సన్ననై, పొడవైన మెడగలది, స్వల్పముగ జుట్టు కలది, వెంద్రుకలే లేనిది, కంబళివలె నున్న వెంద్రుకలు కలది, వ్రేలాడు చెవులు-నొసలు కలది, వ్రేలాడు పొట్ట-స్తనములు కలది, వ్రేలాడు పెదవులు కలది. గడ్డము నందు పెదవులు కలది, వ్రేలాడు ముఖము గలది, వ్రేలాడు మోకాళ్ళు గలది, పొట్టిది, పొడుగైనది, గూనిది, వంకరగా నున్నది, మతిగుజ్జుది, పెద్ద పండ్లు గలది, సొట్టమొగము కలది, గోరోచనవర్ణపు కండ్లు కలది, వికృతపు ముఖము కలది ఇట్లు భయంకరాకారములు గల రాక్షసస్త్రీలను చూచెను. 4-8

కపిశ్రేష్ఠ డగు హనుమంతు డచట వికృతవేషము కలవారును, గోరోచనపు వర్ణము కలవారును, నల్లనివారును, కోపము కలవారును, కలహమం దిష్టము కలవారును, ఉక్కుతో చేయబడిన పెద్ద శూలములను కత్రలను ఇనుపగుదియలను

ఏకహస్తైకపాదాశ్చ ఖరకర్ణ్యశ్వకర్ణికాః,
గోకర్ణీ ర్హస్తికర్ణీశ్చ హరికర్ణీ స్తథాపరాః. 11

అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాః,
గజసన్నిభనాసాశ్చ లలాటోచ్ఛ్వాసనాసికాః. 12

హస్తిపాదా మహాపాదా గోపాదాః పాదచూళికాః,
అతిమాత్రశిరోగ్రీవా అతిమాత్రకుచోదరీః. 13

అతిమాత్రాస్యనేత్రాశ్చ దీర్ఘజిహ్వానఖా స్తథా,
అజాముఖీ ర్హస్తిముఖీ ర్గోముఖీ స్సూకరీముఖీః. 14

హయోష్ట్రఖరవక్త్రాశ్చ రాక్షసీ ర్ఘోరదర్శనాః,
శూలముద్గరహస్తాశ్చ క్రోధనాః కలహప్రియాః. 15

---

ధరించువారును, వంది మొగమువారును, లేడిమొగము గలవారును, పులిమొగమువారును, ఎనుబోతు మొగమువారును, మేకమొగమువారును, నక్కమొగమువారును, ఏనుగుపాదములవారును, ఒంటెకాళ్ళవారును, గుర్రపుకాళ్లవారును, దేహములోపల నుండు తల కలవారును, ఒక చేయి, ఒక కాలు కలవారును, గాడిద చెవులవారును, గుఱ్ఱపుచెవులవారును, ఆవుచెవుల వారును, ఏనుగుచెవులవారును, కోతిచెవులవారును, ముక్కు లేనివారును, పెద్దముక్కు గల వారును, అడ్డముక్కు కలవారును, ముక్కు ఊడిన (తెగిన) వారును, ఏనుగుముక్కు కలవారును, ఊర్ధ్వముఖమగు ముక్కు గలవారును, ఏనుగుకాళ్ళవారును, పెనుగాళ్లవారును, గోపాదములవారును, పాదములందు జుట్టు కలవారును, పెద్దతల-మెడ కలవారును, పెద్ద కుచములు - పొట్ట కలవారును, పెద్ద ముఖము కన్నులు కలవారును, పొడవైన నాలుక-గోళ్ళు కలవారును, మేకమొగమువారును, ఏనుగు మొగమువారును, ఆవు మొగమువారును, వందిమొగమువారును, గుఱ్ఱపుమొగమువారును, ఒంటెమొగమువారును, గాడిదమొగమువారునై

కరాళా ధూమ్రకేశీశ్చ రాక్షసీ ర్వికృతాననాః,
పిబంతీ స్సతతం పానం సదా మాంససురాప్రియాః. 16
మాంసశోణితదిగ్ధాంగీ ర్మాంసశోణితభోజనాః,
తా దదర్శ కపిశ్రేష్ఠో రోమహర్షణదర్శనాః.
స్కంధవంత ముపాసీనాః పరివార్య వనస్పతిమ్. 17
తస్యాధస్తాచ్చ తాం దేవీం రాజపుత్రీ మనిందితామ్,
లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజామ్. 18
నిష్ప్రభాం శోకసంతప్తాం మలసంకులమూర్ధజామ్,
క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌ తారాం నిపతితామివ. 19
చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శనదుర్గతామ్,

---

భయంకరముగ కనిపించువారును, శూలములు, ఇనుపగుదియలు చేత ధరించినవారును, కోపస్వభావులును, కలహప్రియులును, పెద్ద దంతములు కలవారును, నలుపు ఎఱుపుల మిశ్రమపు రంగుకల వెంట్రుకలు కలవారును, వికృతములగు ముఖములు కలవారును, సదా మద్యము తాగుచు , మద్యమాంసములందు మక్కువ కలవారును, రక్తమాంసములను దేహముపై పూసికొన్నవారును, రక్తమాంసము లాహారముగ కలవారును, చూడగనే గగుర్పాటు కలిగించువారును, పెద్ద బోదెగల ఆ వృక్షరాజమును పరివేష్టించి కూర్చుండియున్నవారును అగు రాక్షసస్త్రీలను చూచెను. 9-17

సీతాసందర్శనముచే కలిగిన శోభతో వెలుగొందు హనుమంతుడు ఆ చెట్టు క్రింద రాజపుత్రి, అనవద్యసౌందర్యవతి జానకిని చూచెను. 18

ఆమె కాంతి తొలగినదై, శోకపీడితయై, మాసిన శిరోజములు కలదై, పుణ్యము క్షీణింపగా, చెలవు తప్పి, నేల రాలిన తారవలె నుండెను. 19

పతివ్రతాధర్మము నాచరించుటచే కీర్తిసంపన్నురాలును, పతిని గానక తల్లడిల్లు చున్నదియు, శ్రేష్ఠములగు ఆభరణములు ధరింపనిదియు, పతిస్నేహమే అలంకారముగా

భూషణై రుత్తమైర్హీనాం భర్తృవాత్సల్యభూషణామ్. 20

రాక్షసాధిపసంరుద్ధాం బంధుభిశ్చ వినాకృతామ్,
వియూథాం సింహసంరుద్ధాం బద్ధాం గజవధూమివ. 21

చంద్రరేఖాం పయోదాంతే శారదాభ్రై రివావృతామ్,
క్లిష్టరూపా మసంస్పర్శా దయుక్తామివ వల్లకీమ్. 22

సీతాం భర్తృవశే యుక్తా మయుక్తాం రాక్షసీవశే,
అశోకవనితామధ్యే శోకసాగర మాప్లుతామ్. 23

తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్,
దదర్శ హనుమాన్ దేవీం లతా మకుసుమా మివ. 24

పా మలేన చ దిగ్ధాంగీ వపుషా చాప్యలంకృతా,
మృణాలీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ. 25

---

కలదియు, రావణుడు నిరోధించినదియు, బంధువులకు దూరమైనదియు అయి తన గుంపు నెడబాసి, సింహము అడ్డగించి బంధించిన ఆడేనుగువలెను, వర్షాకాలమునకు పిమ్మట శరత్కాలమేఘము లాక్రమించిన చంద్రరేఖవలెను, తీగలు కూర్చని వీణవలెను, నలుగుపెట్టుట మున్నగు దేహసంస్కారము లేక సౌందర్యము తరిగియున్న సీతాదేవిని హనుమంతుడు చూచెను. 20-22

తన భర్తకు మాత్రమే వశమం దుండినది, రాక్షసులకు వశము కానిది, అశోకవనము నడుమ శోకసాగరమున మునిగియున్నది, క్రూరగ్రహములచే పరివేష్టింపబడిన రోహిణీ నక్షత్రమువలె రాక్షసస్త్రీలతో కూడియున్నదై, యలంకారములు లేక పూవులు లేని తీగవలె నున్న సీతను హనుమ చూచెను. 23,24

సహజముగనే సర్వావయవసౌందర్యశాలిని అయ్యును మురికిగా నున్న దేహముచే నామె, బురద అంటిన తామరతీగవలె కొంచెము ప్రకాశించుచు, ప్రకాశింపకయు నుండెను. 25

మలినేన తు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్,
సంవృతాం మృగశాబాక్షీం దదర్శ హనుమాన్ కపిః. 26
తాం దేవీం దీనవదనా మదీనాం భర్తృతేజసా,
రక్షితాం స్వేన శీలేన సీతా మసితలోచనామ్. 27
తాం దృష్ట్వా హనుమాన్ సీతాం మృగశాబనిభేక్షణామ్,
మృగకన్యామివ త్రస్తాం వీక్షమాణాం పమంతతః. 28
దహంతీమివ నిశ్శ్వాసై ర్వృక్షాన్ పల్లవధారిణః,
సంఘాతమివ శోకానాం దుఃఖస్యోర్మి మివోత్థితామ్. 29
తాం క్షమాం సువిభక్తాంగీం వినాభరణశోభినీమ్,
ప్రహర్ష మతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీమ్. 30
హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణామ్,

---

మలినమై, నలిగియున్న వస్త్రము దాల్చినదై, లేడిపిల్ల కన్నులవంటి కన్నులు గలదై, దీనమగు ముఖము కలదైనను, తన భర్త పరాక్రమమును తలంచుకొని ధైర్యము వహించి, తన శీలమే తనకు రక్షణముగా కల, నల్లని నేత్రములు కల సీతాదేవిని హనుమంతుడు దర్శించెను. 26,27

లేడిపిల్ల కన్నుల వంటి కన్నులు కలదియు, ఆడులేడివలె అంతట బెదరుచూపులు ప్రసరింపజేయునదియు, చిగురించిన చెట్లను తనవేడి నిట్టూర్పులచే దహించుచున్నదో యన్నట్లున్నదియు, శోకముల సమూహమువలె నున్నదియు, పైకి ఎగసిన దుఃఖసాగరపు అలవలె ఉన్నదియు, సహనశీలయు (క్షామాం అను పాఠమున కృశించినదియు), చక్కని అవయవముల అమరిక గలదియు, ఆభరణములు లేకయే శోభిల్లునదియు అగు సీతను చూచి హనుమంతు డధికముగా హర్షము నొందెను. 28-30

మదిరాక్షియగు ఆ సీతను గాంచి హనుమంతు డానందపారవశ్యముతో కన్నీరు గార్చెను. వెంటనే రాముని తలచుకొని నమస్కరించెను. 31

ముమోచ హనుమాం స్తత్ర నమశ్చక్రే చ రాఘవమ్. 31

నమస్కృత్వా చ రామాయ లక్ష్మణాయ చ వీర్యవాన్,
సీతాదర్శనసంహృష్టో హనుమాన్ సంవృతోఽభవత్. 32

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తదశః సర్గః.*

---

పరాక్రమశాలి యగు ఆ హనుమంతు డట్లు సీతను చూచినందులకు సంతోషించి, రామలక్ష్మణులకు ప్రణమిల్లి, శింశుపావృక్షపు ఆకుల నడుమ దాగి యుండెను. 32

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదునేడవ సర్గము.*

# 18. అష్టాదశః సర్గః

*(రావణుడు రాక్షసవనితలతో కూడి సీతను చూడవచ్చుట)*

తథా విప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపమ్,
విచిన్వతశ్చ వైదేహీం కించి చ్ఛేషా నిశాఽభవత్. 1

షడంగవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్,
శుశ్రావ బ్రహ్మఘోషాన్ స విరాత్రే బ్రహ్మరక్షసామ్. 2

అథ మంగళవాదిత్రైః శబ్దైః శ్రోత్రమనోహరైః,
ప్రాబుధ్యత మహాబాహు ర్దశగ్రీవో మహాబలః. 3

విబుధ్య తు యథాకాలం రాక్షసేంద్రః ప్రతాపవాన్,
స్రస్తమాల్యాంబరధరో వైదేహీ మన్వచింతయత్. 4

భృశం నియుక్త స్తస్యాం చ మదనేన మదోత్కటః,

---

హనుమంతు డట్లు పూచిన చెట్లు గల వనమును చూచుచు, సీతను వెదకుచుండగా రాత్రి చివరి జాము మాత్రము మిగిలెను. 1

ఆ అపరరాత్రియందు సాంగవేదపండితులు, శ్రేష్ఠములగు యాగములు చేయించగల వారగు బ్రహ్మరక్షస్సుల (బ్రాహ్మణత్వముతో కూడిన రాక్షసుల) వేదఘోషములను హనుమంతు డాకర్ణించెను. 2

అంతట శ్రవణసుఖముగా మంగళవాద్యములు మ్రోగగా మహాభుజుడు, మహాబలుడగు రావణుడు నిద్రనుండి మేల్కొనెను. 3

రావణు డట్లు సమయము తప్పక ఎప్పటివలె మేలుకొని, నిద్రావశముచే జారిన మాలలు, వస్త్రములు కలవాడై సీతను తలంచెను. 4

ఆ రావణుడు మన్మథునిచే సీతాదేవి విషయమున ప్రోత్సహించబడినవాడై తన

న స తం రాక్షసః కామం శశా కాత్మని గూహితుమ్. 5

స సర్వాభరణై ర్యుక్తో బిభ్ర చ్ఛ్రియ మనుత్తమామ్,
తాం నగై ర్బహుభి ర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః. 6

వృతాం పుష్కరిణీభిశ్చ నానాపుష్పోపశోభితామ్,
సదామదైశ్చ విహగై ర్విచిత్రాం పరమాద్భుతామ్. 7

ఈహామృగైశ్చ వివిధై ర్జుష్టాం దృష్టిమనోహరైః,
వీథీ స్సంప్రేక్షమాణశ్చ మణికాంచనతోరణాః. 8

నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితై ర్వృతామ్,
అశోకవనికామేవ ప్రావిశత్ సంతతద్రుమామ్. 9

అంగనాశతమాత్రం తు తం వ్రజంత మనువ్రజత్,
మహేంద్రమివ పౌలస్త్యం దేవగంధర్వయోషితః. 10

దీపికాః కాంచనీః కాశ్చి జ్జగృహు స్తత్ర యోషితః,

---

కామవేగమును అదుపువేసికొనజాలడయ్యెను. 5

అతడు సర్వాభరణములను ధరించి, సాటిలేని కాంతితో విలసిల్లుచు, మణులతో బంగారముతో నిర్మించబడిన బహిర్ద్వారములు కల ఉద్యానవీథులను చూచుచు, పుష్ప ప్రధానములు, ఫలప్రధానములగు వివిధవృక్షములు కలది, కొలనులతో కూడినది, వివిధ పుష్పములతో శోభిల్లునది, ఎల్లప్పుడు మదించిన పక్షులచే విచిత్రమై ఆశ్చర్యము కలిగించునది, చూపును, మనసును ఆకట్టుకొను వివిధములగు తోడేళ్ళతో కూడినది, వివిధమృగసమూహములు కలది, నేలరాలిన పండ్లతో కూడినది, వృక్షములు దట్టముగా కలది అగు అశోకవనమును ప్రవేశించెను. 6-9

దేవేంద్రుని వెంట దేవకాంతలు, గంధర్వకాంతలు పోయిన చందమున, రావణుని వెన్నంటి నూఱుమంది రాక్షసాంగనలు పోయిరి. 10

అందు కొందరు బంగారు దీపస్తంభములు పట్టుకొనగా మఱికొందఱు

వాలవ్యజనహస్తాశ్చ తాలవృంతాని చాపరాః. 11
కాంచనైరపి భృంగారై ర్జహ్రు స్సలిల మగ్రతః,
మండలాగ్రాన్ బృసీం చైవ గృహ్యాన్యాః పృష్ఠతో యయుః. 12
కాచిద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ,
దక్షిణా దక్షిణేనైవ తదా జగ్రాహ పాణినా. 13
రాజహంసప్రతీకాశం ఛత్రం పూర్ణశశిప్రభమ్,
సౌవర్ణదండ మపరా గృహీత్వా పృష్ఠతో యయౌ. 14
నిద్రామదపరీతాక్ష్యో రావణ స్యోత్తమాః స్త్రియః,
అనుజగ్ముః పతిం వీరం ఘనం విద్యుల్లతా ఇవ. 15
వ్యావిద్ధహారకేయూరా స్సమామృదితవర్ణకాః,
సమాగళితకేశాంతాః సస్వేదవదనా స్తథా. 16

---

చామరములు, ఇంకను కొందఱు విసనకఱ్ఱలు చేత ధరించిరి. 11

కొందఱు బంగారుపాత్రలలో జలము నింపుకొని ముందు నడచిరి. తక్కినవారు కత్తులను, చిరుచాపలను, తీసికొని వెనుకనే పోయిరి. 12

చాతుర్యము గల యొక వనిత మద్యపూర్ణమగు మణిమయపాత్రను తన కుడిచేత ధరించి వెడలెను. 13

బంగారు కఱ్ఱ కలదై, పూర్ణచంద్రుని బోలు కాంతి గలదై, రాజహంసవలె నున్న ఛత్రమును చేతబట్టి వేఱొకతె వెంట వెడలెను. 14

నిద్రామదముతో నిండిన రావణుని ఉత్తమకాంతలు మేఘము వెంట మెఱుపుతీగలు వలె పతి ననుసరించిరి. 15

వారు తాల్చిన హారములు, బాహుపురులు నిద్రావశముచే తారుమారయ్యెను. శరీరమం దలముకొనిన చందనాదులు మాసిపోయెను. శిరోజముల కొనలు జారి వ్రేలాడుచుండెను. ముఖమున చెమట పట్టెను. కైపు కొంత మిగిలియుండుటచేతను,

ఘూర్ణంత్యో మదశేషేణ నిద్రయా చ శుభాననాః,
స్వేదక్లిష్టాంగకుసుమా స్సుమాల్యాకులమూర్ధజాః. 17
ప్రయాంతం నైర్ఋతపతిం నార్యో మదిరలోచనాః,
బహుమానాచ్చ కామాచ్చ ప్రియా భార్యా స్తమన్వయుః. 18
స చ కామపరాధీనః పతి స్తాసాం మహాబలః,
సీతాసక్తమనా మందో మదాంచితగతి ర్బభౌ. 19
తతః కాంచీనినాదం చ నూపురాణాం చ నిస్వనమ్,
శుశ్రావ పరమస్త్రీణాం స కపి ర్మారుతాత్మజః. 20
తం చాప్రతిమకర్మాణ మచింత్యబలపౌరుషమ్,
ద్వారదేశ మనుప్రాప్తం దదర్శ హనుమాన్ కపిః. 21
దీపికాభి రనేకాభి స్సమంతా దవభాసితమ్,

---

నిద్రచేతను వారు తిరుగుడు పడుచుండిరి. చెమటచే ఆ యా అవయవములందు వారు దాల్చిన పూలు వాడిపోయెను. మేలైన పుష్పమాలలు రమ్యములగు కురులలో చెదరిపోగా రావణుని ప్రియభార్యలగు ఆ మదిరాక్షులు భర్తపై ఆదరమువల్లను, మిక్కిలి కామమువల్లను అట్లు పోవుచున్న రాక్షసరాజును అనుసరించిపోయిరి. 16-18

కామపరవశు డగుటచే సీతపై మరులుగొన్న మనస్సు కల, ఆ కాంతల భర్త రావణుడు మత్తెక్కి, విలాసముగా అడుగులు వేయుచు ప్రకాశించెను. 19

అపుడు వాయుపుత్రుడగు హనుమంతుడు ఆ శ్రేష్ఠవనితలు నడచునప్పుడు వారు దాల్చిన మొలత్రాటి చిరుగజ్జెలు, నూపురములు ధ్వనించగా వినెను. 20

హనుమంతుడు సాటిలేని ఘనకార్యములు సాధించువాడును, ఊహింపనలవికాని బలపౌరుషములు కలవాడును అగు రావణుడు అశోకవనపు ద్వారప్రదేశము కడ కేతెంచుట చూచెను. 21

రావణుడు పోవుచుండగా అతని ముందు పరిమళించు నూనెలతో తడిసిన

గంధతైలావసిక్తాభి ర్ధ్రియమాణాభి రగ్రతః. 22

కామదర్పమదై ర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణమ్,
సమక్షమివ కందర్ప మపవిద్ధశరాసనమ్. 23

మథితామృతఫేనాభ మరజోవస్త్ర ముత్తమమ్,
సలీల మనుకర్షంతం విముక్తం సక్త మంగదే. 24

తం పత్రవిటపే లీనః పత్రపుష్పఘనావృతః,
సమీపమివ సంక్రాంతం నిధ్యాతు ముపచక్రమే. 25

అవేక్షమాణస్తు తతో దదర్శ కపికుంజరః,
రూపయౌవనసంపన్నా రావణస్య వరస్త్రియః. 26

తాభిః పరివృతో రాజా సురూపాభి ర్మహాయశాః,

---

అనేక దివిటీలు వెలుగుచుండుటచే అతడు అన్నివైపులనుండి ప్రకాశించుచుండెను. మదనతాపము, గర్వము, మద్యపానములవలన కలిగిన వికారములతో కూడినవాడును, వంకరయై, ఎఱ్ఱనై, విశాలములగు కన్నులు కలవాడును, తన విల్లైన చెఱకుగడను వీడి సమక్షమునకు వచ్చిన మన్మథునివలె నున్నవాడును, మజ్జిగ, గుమ్మపాల నురుగు వలె తెల్లనై, నిర్మలమైన శ్రేష్ఠవస్త్రము జారి బాహువులందు తగులుకొనగా, దానిని విలాసముతో పైకి లాగుకొనుచున్న వాడును అగు రావణుని, ఆ హనుమ చూచెను. 22–24

చెట్టు కొమ్మల మాటున మరుగునపడి, దట్టమగు ఆకులచే, పూలచే, కప్పబడిన హనుమ రావణుడు దూరమున వచ్చుచున్నను, తేజముచే దగ్గరకు వచ్చినట్లే అతనిని చూడసాగెను. 25

హనుమంతు డట్లు పరీక్షించుచు, సౌందర్యము, యౌవనములతో అలరారు రావణుని ఉత్తమకాంతలను చూచెను. 26

మహాకీర్తిశాలి రావణు డా సుందరాంగనలతో పరివేష్టితుడై మృగములతో,

తన్మృగద్విజసంఘుష్టం ప్రవిష్టః ప్రమదావనమ్. 27
క్షీబో విచిత్రాభరణ శ్శంకుకర్ణో మహాబలః,
తేన విశ్రవసః పుత్ర స్స దృష్టో రాక్షసాధిపః, 28
వృతః పరమనారీభి స్తారాభి రివ చంద్రమాః.
తం దదర్శ మహాతేజా స్తేజోవంతం మహాకపిః. 29
రావణోఽయం మహాబాహు రితి సంచింత్య వానరః,
అవప్లుతో మహాతేజా హనుమాన్ మారుతాత్మజః. 30
స తథా ప్యుగ్రతేజా స్స న్నిర్ధూత స్తస్య తేజసా,
పత్రగుహ్యాంతరే సక్తో హనుమాన్ సంవృతోఽభవత్. 31

---

పక్షులతో, సంకులమైన ఆ ప్రమదావన మగు (అంతఃపురవనితలు విహరించు వనము) అశోకవనమును ప్రవేశించెను. 27

మద్యపానమత్తుడు, విచిత్రములగు ఆభరణములు దాల్చినవాడు, గర్వముచే స్తబ్ధములైన చెవులు గలవాడు, మహాబలుడు, విశ్రవస్సు కుమారుడు, రాక్షసరాజగు రావణుడు చుక్కలచే చంద్రునివలె, ఉత్తమకాంతలచే పరివేష్టితుడై యుండగా మహాతేజశ్శాలి, మహావానరుడగు హనుమంతు డా తేజస్వియగు రావణుని చూచెను. 28,29

మహాతేజము కల వాయుపుత్రు డగు హనుమంతుడు 'ఇతడే మహాభుజుడగు రావణు' డని నిశ్చయించి యతని సర్వచేష్టలను స్పష్టముగ చూడదలచినవాడై, తా నెక్కియున్న పై కొమ్మనుండి క్రింది కొమ్మకు దిగెను. 30

హనుమంతుడు తాను భయంకరతేజము కలవా డయ్యును, రావణుని తేజమునకు డీలుపడి ఆకులతో దట్టముగ నున్న తావున కనుపించకుండు నట్లు దాగి యుండెను. 31

స తా మసితకేశాంతాం సుశ్రోణీం సంహతస్తనీమ్,
దిదృక్షు రసితాపాంగా ముపావర్తత రావణః. 32

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టాదశః సర్గః.*

---

రావణుడును, నల్లని కేశములు, సుందరమగు నడుము, బలిసి నడుమ వ్యవధానము లేని స్తనములు, నల్లని కనుకొనలు కలది యగు సీతను చూడగోరి యామె చెంతకు వచ్చెను. 32

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పదునెనిమిదవ సర్గము.*

# 19. ఏకోనవింశః సర్గః

*(రావణుడు సీత దుర్దశను చూచుట)*

తస్మిన్నేవ తతః కాలే రాజపుత్రీ త్వనిందితా,
రూపయౌవనసంపన్నం భూషణోత్తమభూషితమ్. 1

తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్,
ప్రావేపత వరారోహా ప్రవాతే కదళీ యథా. 2

ఆచ్ఛాద్యోదర మూరుభ్యాం బాహుభ్యాం చ పయోధరౌ,
ఉపవిష్టా విశాలాక్షీ రుదంతీ వరవర్ణినీ. 3

దశగ్రీవస్తు వైదేహీం రక్షితాం రాక్షసీగణైః,
దదర్శ సీతాం దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే. 4

అసంవృతాయా మాసీనాం ధరణ్యాం సంశితవ్రతామ్,

---

అంత, దోషరహితయు, ఉత్తమమగు నడుము కలదియు అగు రాజపుత్రి సీత చక్కని రూపము, యౌవనముతో కూడినవాడును, మేలైన ఆభరణములు దాల్చినవాడును అగు రాక్షసరాజు రావణుని చూచుచునే పెనుగాలికి కదలిపోవు అరటిచెట్టువలె వణకి పోయెను. 1,2

విశాలములగు కన్నులు గల ఆ సుందరి భయముతో తన తొడలచే ఉదరమును, బాహువులచే స్తనములను కప్పుకొని యేడ్చుచు కూర్చుండెను. 3

విదేహారాజపుత్రి అగు సీత రాక్షసీగణములు తన చుట్టును కావలియుండగా, దుఃఖపీడితయై, నడిసముద్రమున మునిగిన నావవలె నున్నదై పాతివ్రత్యధర్మమవలంబించి ఏ ఆస్తరణము లేని కటికనేలపై కూర్చుండినదై, నఱకివేయగనే నేలగూలిన

ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివ వనస్పతేః. 5
మలమండనచిత్రాంగీం మండనార్హా మమండితామ్,
మృణాళీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ. 6
సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః,
సంకల్పహయసంయుక్తై ర్యాంతీ మివ మనోరథైః. 7
శుష్యంతీం రుదతీ మేకాం ధ్యానశోకపరాయణామ్,
దుఃఖస్యాంత మపశ్యంతీం రామాం రామ మనువ్రతామ్. 8
వేష్టమానాం తథాఽఽవిష్టాం పన్నగేంద్రవధూ మివ,
ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా. 9
వృత్తశీలకులే జాతా మాచారవతి ధార్మికే,

---

చెట్టుకొమ్మవలె నున్నదై, అంగములపై అవరించియున్న ఆశ్చర్యము కలిగించు తనుశోభ గలదై, భూషణములు ధరింపదగియున్నను, అలంకరించుకొనక, బురదతో కూడిన తామరతీగవలె ప్రకాశించి ప్రకాశింపక యుండగా హనుమ చూచెను. 4-6

ఆమె రాజశ్రేష్ఠుడు, బుద్ధిశాలి యగు రాముని కడకు సంకల్పము లను గుఱ్ఱములు కట్టిన కోరిక లను రథముపై కూర్చుండి పోవుచున్నటులుండెను. 7

రామవియోగదుఃఖముచే వాడిపోవుచు, విలపించుచు, ఒంటరియై, రామునే ధ్యానించుచు, ఆయనకై శోకించుచు, రామునే అనుసరించుచున్నదై దుఃఖపు తుదిని ఆమె కానకుండెను. 8

మణిమంత్రాదులచే కట్టివేయబడిన ఆడుసర్పమువలె చుట్టుకొని యున్నదై, ధూమకేతు గ్రహము (పొగయే జండావలె కలది) కప్పివేయగా దురపిల్లుచున్న రోహిణీనక్షత్రము వలె నుండెను. 9

దృఢమగు స్వభావము కలిగి, సమయాచారముతో నొప్పుచు, యజ్ఞాది ధర్మప్రధానమగు వంశమున పుట్టినదై, పిదప, వివాహరూపమగు సంస్కారమును

పున స్సంస్కారమాపన్నాం జాతామివ చ దుష్కులే. 10
అభూతే నాపవాదేన కీర్తిం నిపతితా మివ,
ఆమ్నాయానా మయోగేన విద్యాం ప్రశిథిలా మివ. 11
సన్నామివ మహాకీర్తిం శ్రద్ధా మివ విమానితామ్,
పూజామివ పరిక్షీణా మాశాం ప్రతిహతా మివ. 12
ఆయతీ మివ విధ్వస్తా మాజ్ఞాం ప్రతిహతా మివ,
దీప్తామివ దిశం కాలే పూజా మపహృతా మివ. 13
పద్మినీ మివ విధ్వస్తాం హతశూరాం చమూ మివ,
ప్రభా మివ తమోధ్వస్తా ముపక్షీణా మివాపగామ్. 14

---

పొంది, అ సంస్కారము ద్వారా దుష్టవంశమున మరల పుట్టినది వలె నుండెను. (కుమారుల కుపనయన మెట్లో కూతురులకు పెండ్లియు అట్లే రెండవ జన్మము. 'వైవాహికో విధిః స్త్రీణామౌపనాయనికః స్మృతః' అని స్మృతి). 10

ఆమె అసత్యమగు అపవాదముచే చెడిన కీర్తివలెను, అవృత్తి లేక మఱచిన విద్యవలెను ఉండెను. 11

ఆమె క్షీణించిన మహాకీర్తివలెను, అవమానింపబడిన శ్రద్ధవలెను (అవమానము చేయబడిన సందర్భములలో అవమానితునకు అవమానించినవానిపై శ్రద్ధ, ఆదరము సన్నగిల్లును) స్వల్పమగు పూజాద్రవ్యములతో కూడిన పూజవలెను, భగ్నమైన ఆశవలెను ఉండెను. 12

ఆమె తఱిగిన ధనలాభము వలెను, నిరోధించబడిన ఆజ్ఞవలెను, ఉత్పాత సమయమున మండుచున్న దిశవలెను, అపహరించబడిన పూజాద్రవ్యమువలెను ఉండెను. 13

మరియు ఆమె మంచు పడుటచే నశించిన తామరతీగవలెను, శూరులు నశించిన సేనవలెను, చీకట్లు ముంచెత్తిన వెలుగువలెను, నీరులేక సన్నబడుచున్న నదివలెను ఉండెను. 14

వేదీమివ పరామృష్టాం శాంతా మగ్నిశిఖా మివ,
పౌర్ణమాసీ మివ నిశాం రాహుగ్రస్తేందుమండలామ్. 15
ఉత్కృష్టపర్ణకమలాం విత్రాసితవిహంగమామ్,
హస్తిహస్తపరామృష్టా మాకులాం పద్మినీమివ. 16
పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితా మివ,
పరయా మృజయా హీనాం కృష్ణపక్షనిశా మివ. 17
సుకుమారీం సుజాతాంగీం రత్నగర్భగృహోచితామ్,
తప్యమానా మివోష్ణేన మృణాలీ మచిరోద్ధృతామ్. 18
గృహీతా మాళితాం స్తంభే యూథపేన వినాకృతామ్,
నిశ్శ్వసంతీం సుదుఃఖార్తాం గజరాజవధూమివ. 19

---

అమె తాకదగని వస్తువులచే మైలపడిన యజ్ఞవేదికవలెను, చల్లారిన అగ్నిజ్వాలవలెను, రాహువు కబళించిన చంద్రమండలము గల పున్నమిరాత్రివలెను ఉండెను. 15

అమె, ఏనుగు తన తొండముతో కలచివేసి ఆకులను, పద్మములను పీకివేసి, పక్షులను భయపెట్టగా ఆకులమైన తామరకొలనువలె ఉండెను. 16

అమె పతివియోగదుఃఖముచే పీడింపబడుచు, వేఱొక జలాశయమునకు నీరు మఱల్చుటచే శుష్కించిన నదివలె యుండెను. శ్రేష్ఠమగు శరీరసంస్కారము లేక కృష్ణపక్షరాత్రి వలె నుండెను. 17

కోమలశరీరము కలదై, సుందరాంగియై, మణులు పొదిగిన మహాసౌధములలో నుండదగిన సీత, అప్పుడే పెఱికివేయుటచే వేడికి కమిలిపోయిన తామరతూడువలె నుండెను. 18

అమె తమవారి గుంపునుండి వేఱుచేసి బంధించబడినదై, నిట్టూర్చుచు, దుః ఖపీడితయైన గజరాజు భార్యవలె నుండెను. 19

ఏకయా దీర్ఘయా వేణ్యా శోభమానా మయత్నతః,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ. 20

ఉపవాసేన శోకేన ధ్యానేన చ భయేన చ,
పరిక్షీణాం కృశాం దీనా మల్పాహారాం తపోధనామ్. 21

ఆయాచమానాం దుఃఖార్తాం ప్రాంజలిం దేవతామివ,
భావేన రఘుముఖ్యస్య దశగ్రీవపరాభవమ్. 22

సమీక్షమాణాం రుదతీ మనిన్దితాం, సుపక్ష్మతామ్రాయతశుక్లలోచనామ్,
అనువ్రతాం రామ మతీవ మైథిలీం, ప్రలోభయామాస వధాయ రావణః.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకోనవింశః సర్గః.*

---

ఆమె పొడవైన నల్లని యొంటిజడ దాల్చి, శరత్కాలమున నల్లనివృక్షముల వరుసచే అయత్నముగనే శోభిల్లు భూమి వలె నుండెను. 20

ఆమె ఉపవాసముచేతను, దుఃఖముచేతను, రామునే తలంచుటచేతను, క్షీణించి, కృశించి, దీనయై, జలము మాత్రమే ఆహారముగ గొనుచు, తపము చేయుచుండెను. 21

ఆమె దుఃఖపీడితయై తన మనస్సులో రాముడు వచ్చి రావణుని పరాభవించవలెనని యంజలి ఘటించి దేవతను ప్రార్థించుచున్నదివలె నుండెను. 22

ఆమె నన్నీ రాక్షసుని బారినుండి కాపాడువా రెవరా యని చూచుచు, విలపించుచుండెను. ఏ వంకయు లేక, చక్కని కనుఱెప్పలు కలదై, కొనలయం దెఱ్ఱనై, నడుమ తెల్లనైన విశాలనేత్రములు గలదై, రామునియందే లగ్నమైన మనస్సు కల ఆమెను రావణుడు మంచిమాటలతో భంగపడునట్లు చేయసాగెను. 23

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున పందొమ్మిదవ సర్గము.*

# 20. వింశః సర్గః

*(రావణుడు సీతను ప్రలోభపెట్టుట)*

స తాం పతివ్రతాం దీనాం నిరానందాం తపస్వినీమ్,
సాకారై ర్మధురై ర్వాక్యై ర్న్యదర్శయత రావణః. 1
మాం దృష్ట్వా నాగనాసోరు గూహమానా స్తనోదరమ్,
అదర్శన మివాత్మానం భయా న్నేతుం త్వ మిచ్ఛసి. 2
కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే,
సర్వాంగగుణసంపన్నే సర్వలోకమనోహరే. 3
నేహ కేచి న్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః,
వ్యపసర్పతు తే సీతే భయం మత్త స్సముత్థితమ్. 4

---

ఆ రావణుడు పతివ్రతయు, దీనురాలును, ఆనందము లేనిదియు, దయనీయయు అగు సీతకడ మధురములగు మాటలతో తన మనోగతమగు నభిప్రాయము నిట్లు వ్యక్తీకరించెను. 1

ఓ ఏనుగు తొండముల వంటి తొడలు గలదానా! నన్ను జూచి, నీ స్తనములను, ఉదరమును కప్పివైచుకొనుచు నిన్ను నా కగపడకుండునట్లు చేసికొన దలచుచుంటివి. 2

విశాలమగు కన్నులు కలదానవు, సర్వాంగసౌందర్యముతో విలసిల్లుదానవు, సకల జనులకు మనోహరమైనదానవగు ఓ సీతా! నేను నిన్ను మోహించుచున్నాను. ప్రియురాలా! నన్నాదరింపుము. 3

ఇచట మనుజులు గాని, కామరూపులై సంచరించు రాక్షసులుగాని మఱెవ్వరును లేరు. నేనో, నిన్ను కామించుచుంటిని. కావున నీకు నాపై భయము వలదు. 4

స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః,
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా. 5

ఏవం చైత దకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి,
కామం కామ శ్శరీరే మే యథాకామం ప్రవర్తతామ్. 6

దేవి నేహ భయం కార్యం మయి విశ్వసిహి ప్రియే,
ప్రణయస్వ చ తత్త్వేన మైవం భూ శ్శోకలాలసా. 7

ఏకవేణీ ధరాశయ్యా ధ్యానం మలిన మంబరమ్,
అస్థానే ప్యుపవాసశ్చ నైతా న్యౌపయికాని తే. 8

విచిత్రాణి చ మాల్యాని చందనా న్యగరూణి చ,
వివిధాని చ వాసాంసి దివ్యా న్యాభరణాని చ. 9

మహార్హాణి చ పానాని శయనా న్యాసనాని చ,

---

ఓ పిఱికిదానా! పరస్త్రీలతో రమించుట, బలవంతముగా వారిని తీసికొని వచ్చుట నిస్సంశయముగా రాక్షసులకు ధర్మము. కావున నా యీ పని అధర్మమని తలం పకుము. 5

అట్లయినను సీతా! నాపై వలపు చూపని నిన్ను తాకను. దానిచే నా శరీరమున కామము యథేచ్ఛగా ప్రసరించిన ప్రసరింపనిమ్ము. 6

ఓ దేవీ! నీ విచట భయపడవలసిన పనిలేదు. ప్రియురాలా! నా మాట నమ్ముము. వాస్తవముగ నన్ను ప్రేమింపుము. అంతేగాని యిట్లు శోకముచే దురపిల్లకుము. 7

ఒంటిజడ, భూశయనము, సరధ్యానము, మలినవస్త్రధారణము, అసందర్భమగు ఉపవాసము నీ కివి తగనివి. 8

నన్ను చేరి అనేకవర్ణములు గల పుష్పమాలలు, చందనము, అగరువులు, వివిధ వస్త్రములు, దివ్యాభరణములు, గొప్ప విలువగల పానీయములు, శయనములు, ఆసనములు, గీతము, నృత్తము, వాద్యము ఈ సకల భోగములను

గీతం నృత్తం చ వాద్యం చ లభ మాం ప్రాప్య మైథిలి. 10
స్త్రీరత్న మసి మైవం భూః కురు గాత్రేషు భూషణమ్,
మాం ప్రాప్య హి కథం ను స్యా స్త్వమనర్హా సువిగ్రహే. 11
ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే,
యదతీతం పున ర్నైతి స్రోత శ్శీఘ్ర మపామివ. 12
త్వాం కృత్వోపరతో మన్యే రూపకర్తా స విశ్వసృట్,
న హి రూపోపమా త్వన్యా తవాస్తి శుభదర్శనే. 13
త్వాం సమాసాద్య వైదేహి రూపయౌవనశాలినీమ్,
కః పుమా నతివర్తేత సాక్షాదపి పితామహః. 14
యద్యత్ పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే,

---

అనుభవింపుము. 9,10

నీవు వనితలలో శ్రేష్ఠురాలవు. నీ విటు లుండదగదు. నీ శరీరమునం దలంకారములు ధరించుము. సుందరాంగీ! నన్ను చేరియు నీ వీ భోగముల కెట్లు తగవు? 11

సీతా! సుందరమగు నీ యౌవనము గడచి పోవుచున్నది. (లేదా భృత్యుడనగు నా యీ యౌవనము నీది. ఈ సుందరమగు యౌవనము నీ సేవకు సమర్పించుకొనకయే వ్యర్థమగుచున్నది - మహేశ్వరతీర్థీయము). పాఱిన నీటివలె గడచిన యౌవనము తిరిగిరాదు. 12

విశ్వమును సృజించిన బ్రహ్మ సౌందర్యరాశి వగు నిన్ను సృష్టించి, యీ సుందరరూప నిర్మాణము నిటుపై విరమించి యుండును. సుందరములగు కన్నులు గలదానా! రూపమున నీకు సాటి వేఱొక్కతె లేనే లేదు కదా. 13

ఓ సీతా! సౌందర్యయౌవనములతో విలసిల్లు నీ చెంతకు వచ్చిన బ్రహ్మదేవుడు కూడ నిన్నారాధింపక యుండజాలడు. అట్టిచో సామాన్యు డారాధింపడా? 14

ఓ సుందరీ! సర్వావయవసౌందర్యము గల నీ శరీరమునం దెట నెట నా చూపు

తస్మిం స్తస్మిన్ పృథుశ్రోణి చక్షు ర్మమ నిబధ్యతే. 15
భవ మైథిలి భార్యా మే మోహ మేనం విసర్జయ,
బహ్వీనా ముత్తమస్త్రీణా మాహృతానా మిత స్తతః,
సర్వాసా మేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ. 16
లోకేభ్యో యాని రత్నాని సంప్రమ థ్యాహృతాని వై,
తాని మే భీరు సర్వాణి రాజ్యం చైత దహం చ తే. 17
విజిత్య పృథివీం సర్వాం నానానగరమాలినీమ్,
జనకాయ ప్రదాస్యామి తవ హేతో ర్విలాసిని. 18
నేహ పశ్యామి లోకేఽన్యం యో మే ప్రతిబలో భవేత్,
పశ్య మే సుమహ ద్వీర్య మప్రతిద్వంద్వ మాహవే. 19
అసకృత్ సంయుగే భగ్నా మయా విమృదితధ్వజాః,

---

ప్రసరించుచున్నదో ఆ పట్టునుండి చూపు మఱలకున్నది. 15

ఓ సీతా! నీవు నా భార్యవు కమ్ము. నేను శత్రువు నను శంకవీడుము. నే నా యా ప్రదేశములనుండి బాహుబలముతో కొని తెచ్చిన యుత్తమస్త్రీ లందరికిని పట్టమహిషి వగుము. 16

నా పరాక్రమముతో నేను లోకములనుండి సంపాదించిన సకలరత్నములు, నా యీ లంకారాజ్యము, నేనును నీవారమే. 17

ఓ విలాసవతీ! వివిధనగరములతో విలసిల్లు ఈ పృథివి నంతను నీకై జయించి నీ తండ్రి జనకుని కిచ్చెదను. 18

నా కెదురొడ్డి నిలువగలవా డింకొక దుండగా చూడలేదు. యుద్ధమున సాటిలేని నా పరాక్రమమును చూడుము. 19

అనేకమార్లు దేవాసురులు యుద్ధమున నాతో తలపడి టెక్కెములు విఱిగి నా

అశక్తాః ప్రత్యనీకేషు స్థాతుం మమ సురాసురాః. 20
ఇచ్ఛయా క్రియతా మద్య ప్రతికర్మ తవోత్తమమ్. 21
సప్రభా ణ్యవసజ్యంతాం తవాంగే భూషణాని చ,
సాధు పశ్యామి తే రూపం సంయుక్తం ప్రతికర్మణా. 22
ప్రతికర్మాభినంయుక్తా దాక్షిణ్యేన వరాననే,
భుంక్ష్వ భోగాన్ యథాకామం పిబ భీరు రమస్వ చ. 23
యథేష్టం చ ప్రయచ్ఛ త్వం పృథివీం వా ధనాని చ,
లలస్వ మయి విస్రబ్ధా ధృష్ట మాజ్ఞాపయస్వ చ. 24
మత్ప్రసాదా ల్లలంత్యాశ్చ లలంతాం బాంధవా స్తవ,
ఋద్ధిం మమానుపశ్య త్వం శ్రియం భద్రే యశశ్చ మే. 25
కిం కరిష్యసి రామేణ సుభగే చీరవాససా,
నిక్షిప్తవిజయో రామో గతశ్రీ ర్వనగోచరః,

---

యెదుట నిలువలేరైరి. 20

స్వేచ్ఛగా నీ విపుడు నీ శరీరమును సుందరముగా నలంకరించుకొనుము. 21

ప్రకాశమానములగు భూషణములను నీ శరీరమున ధరింపుము. నీ వట్లలంకరించుకొనగా అలంకృతమై సుందరముగా నున్న నీ రూపమును చూచెదను. 22

చక్కగా అలంకరించుకొని భోగము లనుభవింపుము. మద్యము త్రాగుము. పిరికిదానా! నాతో క్రీడింపుము. 23

నీవు స్వేచ్ఛగా భూమిని గాని, ధనములనుగాని దానము చేయుము. నన్ను విశ్వసించి ప్రేమింపుము. ధైర్యముతో నాజ్ఞాపింపుము. ఓ మంగళరూపిణీ! నా అనుగ్రహముచే నీవు సుఖించుచుండగా, నీవలన బంధుజనులును ధనాదులచే ఆనందింతురు గాక. నా సంపదను, సౌందర్యమును, కీర్తిని పరికింపుము. 24,25

సుందరీ! నారవస్త్రములు దాల్చు రామునితో ఏమి పని? రాముడు జయము

ప్రతీ స్థండిలశాయీ చ శంకే జీవతి వా న వా. 26

న హి వైదేహి రామ స్త్వాం ద్రష్టుం వాప్యుపలప్స్యతే,
పురోబలాకై రసితై ర్మేఘై ర్జ్యోత్స్నా మివావృతామ్. 27

న చాపి మమ హస్తా త్త్వాం ప్రాప్తు మర్హతి రాఘవః,
హిరణ్యకశిపుః కీర్తి మింద్రహస్తగతా మివ. 28

చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని,
మనో హరసి మే భీరు సుపర్ణః పన్నగం యథా. 29

క్లిష్టకౌశేయవసనాం తన్వీమ ప్యనలంకృతామ్,
త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభా మ్యహమ్. 30

---

నొందక, రాజ్యము కోల్పోయి, వనచారియై, వ్రతములు చేయుచు, కటికనేలపై నిదురించుచు ఇపుడు జీవించుచున్నాడో లేదో సంచేహమే. 26

సీతా! ముందుభాగమున కొంగలు కల నల్లని మేఘములు క్రమ్ముకొనగా మఱుగుపడిన వెన్నెల చూచుటకు వీలుకానట్లు రామునకు నిన్ను చూచుటకైన సాధ్యము కాదు. 27

ఇంద్రుని చేజిక్కిన తన భార్యయగు కీర్తిని హిరణ్యకశిపుడు పొందినట్లు రాముడు నా చేతినుండి నిన్ను పొందజాలడు. ("దేవతలు రాజ్యకాంక్షతో హిరణ్యకశిపుని రాజశిబిరమును కూలద్రోసిరి. దేవేంద్రుడు హిరణ్యకశిపుని భార్య నపహరించెను" అని శ్రీమద్భాగవతమున ప్రహ్లాదవచనము. ఇచట హిరణ్యకశిపుని భార్యయే కీర్తిశబ్దముచే చెప్పబడెను. మఱల హిరణ్యకశిపుడు తన భార్యను తాను సంపాదించెను.) 28

సుందరమగు చిరునవ్వు, సుందరమగు పలువరున, సుందర నేత్రములు కలదానా! విలాసినీ! గరుత్మంతుడు సర్పమునువలె నీవు నా మనస్సును హరించుచున్నావు. 29

నలిగిన వస్త్రము దాల్చి, కృశించి, యలంకరించుకొనకున్నను, నిన్ను చూచిన పిమ్మట నా భార్యలను చూచి ఆనందింపలేకున్నాను. ప్రీతి నొందకున్నాను. 30

అంతఃపురనివాసిన్యః స్త్రియ స్సర్వగుణాన్వితాః,
యావత్యో మమ సర్వాసా మైశ్వర్యం కురు జానకి. 31

మమ హ్యసితకేశాంతే త్రైలోక్యప్రవరాః స్త్రియః,
తాస్త్వాం పరిచరిష్యంతి శ్రియ మప్సరసో యథా. 32

యాని వైశ్రవణే సుభ్రు రత్నాని చ ధనాని చ,
తాని లోకాంశ్చ సుశ్రోణి మాం చ భుంక్ష్వ యథాసుఖమ్. 33

న రామ స్తపసా దేవి న బలేన న విక్రమైః,
న ధనేన మయా తుల్య స్తేజసా యశసాఽపి వా. 34

పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీం చ,
మయి లల లలనే యథాసుఖం త్వం

---

ఓ జానకీ! సకలసద్గుణములతో విలసిల్లు నా అంతఃపురకాంత లందరిపై నీవు పెత్తనము చేయుము. 31

ఓ నల్లని కురుల కొనలు కలదానా! ముల్లోకములలోను ఉత్తమలగు నా యంతః పుర కాంతలు శ్రీదేవికి అప్సరల వలె నీకు పరిచర్య చేతురు. 32

ఓ సుందరములగు కనుబొమలు, చక్కని పిరుదులు కలదానా! కుబేరుని కడ ఏ యే రత్నములు, ధనరాశు లున్నచో వానిని, లోకములను, నన్నును సుఖముగా ననుభవింపుము. 33

ఓ దేవీ! తపముచే గాని, బలముచే గాని, పరాక్రమముచే గాని, ధనముచే గాని, తేజముచే గాని, కీర్తిచే గాని రాముడు నాకు సరిగాడు. 34

ఓ లలనా! నీవు నాతో కూడి పానము చేయుము. విహరింపుము. క్రీడింపుము. భోగముల ననుభవింపుము. నీకు ధనరాశు లిత్తును. భూమి నెల్ల నొసంగుదును. నీవు నాయం దనురాగము కలిగియుండుము. నిన్ను గూడి నీ బంధువులును నీతో

త్వయి చ సమేత్య లలంతు బాంధవా స్తే. 35

కుసుమితతరుజాలసంతతాని
భ్రమరయుతాని సముద్రతీరజాని,
కనకవిమలహారభూషితాంగీ
విహర మయా సహ భీరు కాననాని. 36

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే వింశః సర్గః.*

---

కలసి సంతోషింతురుగాక. 35

ఓ పిఱికిదానా! పూచిన చెట్లు దట్టముగా కలవై, తుమ్మెదల ఝుంకారముతో కూడి, సముద్రతీరమున నున్న వనములలో స్వచ్ఛస్వర్ణమయములగు హారముల నలంకరించుకొని నాతో కూడి విహరింపుము' అని రావణుడు సీతతో పలికెను. 36

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదవ సర్గము.*

# 21. ఏకవింశః సర్గః

*(సీత రావణుని ప్రార్థనను తిరస్కరించుట)*

తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః,
అర్తా దీనస్వరా దీనం ప్రత్యువాచ శనై ర్వచః. 1
దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ,
చింతయంతీ వరారోహా పతిమేవ పతివ్రతా,
[1]తృణ మంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా. 2

---

సీత భయంకరుడగు ఆ రావణుని మాటలు విని, దుఃఖము నొంది, దీనయై, దీనస్వరముతో మెల్లగా నిట్లనెను. 1

సుందరమగు నడుము గలది, స్వభావముచే తెల్లని చిరునగవుగలది, పతివ్రత యగు ఆ సీత, దుఃఖపీడితయై, భయముచే వణకుచు, దయనీయయై, తన పతియగు రాముచే ధ్యానించుచు, తనకు రావణునకు నడుమ నొక గడ్డిపోచను వైచి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. 2

---

1. సీతాదేవి తనకు రావణునకు నడుమ గడ్డిపోచ వేయుట కీ హేతువు లూహించదగినవిగా తనిశ్లోకీ వ్యాఖ్య పేర్కొన్నది --

1) పరపురుషుని ముఖము చూచుచు ముఖాముఖి మాటలాడరాదను మర్యాద పాటించుట.

2) రావణుని తృణము వలె అలక్ష్యము చేయుట.

3) నేను చెప్పబోవు మాట నీతడు తృణసమానముగనే చూచి లక్ష్యము చేయడని భావించుట.

4) "స శ్లాఘ్య స్స గుణీ ధన్య స్స కులీన స్స బుద్ధిమాన్,
స శూర స్స చ విక్రాంతో యం త్వం దేవి నిరీక్షసే".

(ఓ లక్ష్మీదేవి! నీ వెవ్వని జూతువో అతడు పొగడదగినవాడు. గుణవంతుడు,

నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః,
న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్. 3

అకార్యం న మయా కార్య మేకపత్న్యా విగర్హితమ్,
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా. 4

ఏవ ముక్త్వా తు వైదేహీ రావణం తం యశస్వినీ,
రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచన మబ్రవీత్. 5

నాహ మౌపయికీ భార్యా పరభార్యా సతీ తవ,
సాధు ధర్మ మవేక్షస్వ సాధు సాధువ్రతం చర. 6

---

రావణా! నీ మనస్సును నానుండి నీ భార్యలపై మరల్చుము. పాపము చేసినవాడు మోక్షము నెట్లు కోరదగదో నీవును అట్లే నన్ను కోరదగదు. 3

శ్రేష్ఠమగు వంశమున బుట్టి, యుత్తమమగు ఇక్ష్వాకువంశమున ప్రవేశించిన పతివ్రతనగు నేను నింద్యమగు నీ కోరిక నాచరింపదగదు. 4

కీర్తిమతి యగు సీత రావణునితో అట్లు పలికి యతనికి విముఖముగా తిరిగి, యతని ననాదరము చేయుచు మఱల నిట్లనెను. 5

నేను పరభార్య నగుటచే నీకు భార్యనగుట తగదు. నీవు సజ్జనుల ధర్మమును పరిశీలింపుము. సజ్జనుల యాచారమునే యనుష్ఠింపుము. 6

---

సత్కులప్రసూతుడు, బుద్ధిమంతుడు, శూరుడు, పరాక్రమశాలియు అగుమ). అమ విష్ణుపురాణవచనానుసారము రావణుడు తన కటాక్షపాతార్హుడు కారాదని తలంచుట.

5) నా ప్రభువు తృణమొక్కటి త్రుంచి దానితో కాకాసురుని దౌష్ట్య మణచినట్లు, ఈ తృణముచే నే నితనిని నిరసింతునని తలంచుట.

6) అచేతనమును చేతనమువలె భావించి సంబోధించి మాటలాడ దలంచుట.

7) చెంతనే యున్న యీతనికి దూరముగ నుండవలెనని తలంచుట.

8) నీవు పశుసమానుడవు, నీ కిదియే భోగ్యవస్తువని సూచించుట.

9) రామవిరోధముచే నీవు నీ వారందరితో నశింతువు. ఈ గడ్డిపోచను త్రుంచి తెలుపుచున్నాను సుమా! యని సూచించుట.

యథా తవ తథాన్యేషాం దారా రక్ష్యా నిశాచర,
ఆత్మాన ముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్. 7
అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేంద్రియమ్,
నయంతి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్. 8
[1]ఇహ సంతో న వా సంతి సతో వా నానువర్తసే,
తథా హి విపరీతా తే బుద్ధి రాచారవర్జితా. 9
వచో మిథ్యాప్రణీతాత్మా పథ్యముక్తం విచక్షణైః,

---

ఓ రాక్షసుడా! నీ వెట్లు నీ భార్యలు శీలవతు లగువట్లు కాపాడవలెనో, పరభార్యలను, అట్లే కాపాడవలెనని ఆత్మ (నీ) దృష్టాంతముతో నిశ్చయించి నీ భార్యలతో రమింపుము. 7

తన భార్యలతో తృప్తినొందక, చపలచిత్తుడై, యింద్రియముల చాంచల్యమునకు వశుడై, శఠుడై, పరభార్యలతో రమించువాని ఆయువు, ఐశ్వర్యము మున్నగువానిని క్షయింపజేయు పరాభవమును పరభార్యలు కలిగింతురు. 8

ఇంత విశాలమయ్యు దుర్జను లధికముగా గల యీ ప్రదేశమందు ని న్నీ పాపకృత్యము నుండి వారించు సజ్జనులే లేకుండిరా? 9

లేక నీవు అసత్యమగు స్నేహమును రాక్షసులపై ప్రదర్శించుచు సజ్జనులు నీకు

---

1 లేకేమి? విభీషణాదు లుండగా లేరని యెట్లు చెప్పగలవు? ఉన్నను వారి ననుసరింపవా? వారును –

"తద్విద్ధి ప్రాణిపాతేన పరిప్రశ్నేన సేవయా,
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః".

కావున జ్ఞానులకు నమస్కరించి, సేవించి కర్తవ్యమును తెలిసికొమ్ము. తత్త్వము నెఱిగిన ఆ జ్ఞానులు నీకు జ్ఞాన ముపదేశింతురు" అనినట్లు వందనము చేయక నీ కుపదేశింపరు. నీ వెన్నడును అట్టివారికి నమస్కరింపలేదు. అది యెట్లు తెలిసిన దందువా? నీ బుద్ధివైపరీత్యమే నీవు సజ్జనుల ననుసరింపవని సూచించుచున్నది. పరబుద్ధి యగపడదు కదా! నా బుద్ధి నీకెట్లు తెలిసిన దందువేమో. నీ దురనుష్ఠానమే నీ బుద్ధిని సూచించుచున్నదని భావము. (తనిశ్లోకి)

రాక్షసానా మభావాయ త్వం వా న ప్రతిపద్యసే. 10

అకృతాత్మాన మాసాద్య రాజాన మనయే రతమ్,
సమృద్ధాని వినశ్యంతి రాష్ట్రాణి నగరాణి చ. 11

తథేయం త్వాం సమాసాద్య లంకా రత్నౌఘసంకులా,
అపరాధా త్తవైకస్య నచిరా ద్వినశిష్యతి. 12

స్వకృతై ర్హన్యమానస్య రావణాదీర్ఘదర్శినః,
అభినందంతి భూతాని వినాశే పాపకర్మణః. 13

ఏవం త్వాం పాపకర్మాణం వక్ష్యంతి నికృతా జనాః,
దిష్ట్యైతద్ వ్యసనం ప్రాప్తో రౌద్ర ఇత్యేవ హర్షితాః. 14

శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధనేన వా,
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా. 15

---

హితము బోధింపగా రాక్షసవినాశమున కా హితోక్తి నంగీకరింపకుంటివా? 10

సదుపదేశమును గ్రహింపజాలక, నీతిబాహ్యమగు కర్మయం దాసక్తుడగు రాజు పాలనలో సుసంపన్నములగు రాష్ట్రములును, నగరములును వినాశము పొందును. 11

అట్లే రత్నసమూహములతో నిండిన ఈ లంకానగరము నీ యొక్కని దోషమువలన కొలదికాలముననే నశింపనున్నది. 12

రావణా! తా నొనర్చిన పాపకృత్యములచేతనే చంపబడనున్నవాడును, దూరదృష్టి లేనివాడును అగు పాపి నశించగా ప్రాణు లభినందించును. 13

ఇట్లు నీచే వంచింపబడినవా రెల్లరు నిన్ను పాపకార్యములు చేసినవాడవని చెప్పెదరు. 'ఈ భయంకరుడు మన భాగ్యవశముచే నిట్టి వినాశము పొందె' నని వారు హర్షింతురు. 14

నీ ఐశ్వర్యముచే గాని ధనముచే గాని నన్ను లోభపెట్టజాలవు. వెలుగు సూర్యునికంటె వేఱు ఎట్లు కాదో, అట్లే రామునికంటె వేఱైనదానను గాను. 15

ఉపధాయ భుజం తస్య లోకనాథస్య సత్కృతమ్,
కథం నామోపధాస్యామి భుజ మన్యస్య కస్యచిత్. 16

అహ మౌపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః,
వ్రతస్నాతస్య విప్రస్య విద్యేవ విదితాత్మనః. 17

సాధు రావణ రామేణ మాం సమానయ దుఃఖితామ్,
వనే వాశితయా సార్ధం కరేణ్వేవ గజాధిపమ్. 18

మిత్ర మౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా,
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాऽసౌ పురుషర్షభః. 19

విదిత స్స హి ధర్మజ్ఞ శ్శరణాగతవత్సలః,
తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి. 20

---

లోకనాథుడగు రాముని పూజనీయమగు దక్షిణబాహువును ఉపధానము (తలగడ)గా చేసికొని (ఆయనచే) శ్లాఘింపబడిన నేను వేఱొక్కని అపూజ్యమగు భుజము నెట్లు ఉపధానముగా చేసికొనగలను? 16

విద్యావ్రతస్నాతుడు, ధీమంతుడగు విప్రునకు యోగాభ్యాసరూపమగు విద్యవలె, శీలవయోవృత్తాదులచే నే నా రామునకే తగిన భార్యను. 17

రావణా! రామవిరహముచే నేను దుఃఖితనై యున్నాను. అడవిలో యౌవనముతో కూడిన (వాసితయా అను పాఠమున బంధింపబడిన యని యర్థము). ఆడేనుగుతో గజరాజును వలె ఆహ్వానపూర్వకముగా రాముని కొనివచ్చి నాతో కూర్పుము. 18

నీవు లంకలో (లేదా భూమిపై) చిరకాలము నిలువగోరుదువేని, బంధుమిత్ర సుతాదులతో నీ చిత్రవధ నిచ్ఛగింపవేని రాముని మిత్రత్వమును పొందుట యుక్తము. 19

రాముడు ధర్మమెఱిగినవాడని, శరణాగతవత్సలుడని జగద్విదితము. నీవు నిజముగ జీవింపగోరుదు వేని ఆయనతో చెలిమిచేయుము. 20

ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్,
మాం చాస్మై ప్రయతో భూత్వా నిర్యాతయితు మర్హసి. 21
ఏవం హి తే భవేత్ స్వస్తి సంప్రదాయ రఘూత్తమే,
అన్యథా త్వం హి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ. 22
వర్జయే ద్వజ్ర ముత్సృష్టం వర్జయే దంతక శ్చిరమ్,
త్వద్విధం తు న సంక్రుద్ధో లోకనాథ స్స రాఘవః. 23
రామస్య ధనుష శ్శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్,
శతక్రతువిసృష్టస్య నిర్ఘోష మశనే రివ. 24
ఇహ శీఘ్రం సుపర్వాణో జ్వలితాస్యా ఇవోరగాః,
ఇషవో నిపతిష్యంతి రామలక్ష్మణలక్షణాః. 25

---

నీ వా రాముని శరణుజొచ్చి ప్రసన్నుని చేసికొనుము. శరణాగతుల దోషములను విస్మరించుట ఆయన స్వభావము. కావున నీపై కోపింపడు. నీ విప్పటికైనను నీ మదిలోని దోషము విడచి నన్నాయనకు తిరిగి సమర్పింపుము. 21

రావణా! నీ వట్లు నన్నా రఘూత్తమునకు సమర్పించిన నీకు శుభము కలుగును. వేఱొక విధముగా ప్రవర్తింతువేని నీకు వినాశము తప్పదు. 22

ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధము నిన్ను విడువవచ్చును గాక; యముడు చిరకాలము నిన్ను చంపక విడువవచ్చు గాక! లోకనాథుడగు రాముడే కోపించినచో నీవంటివానిని చంపక విడువడు. 23

దేవేంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధపు మ్రోతవలె పెద్దధ్వని కల రాముని ధనుష్టంకారమును వినెదవు గాక. 24

అచిరకాలముననే యిచట సుందరమైన కణుపులు కలవి, మండుచున్న ముఖములు గల సర్పములవలె ప్రకాశించునవి, రామలక్ష్మణనామాంకితములైనవి అగు బాణము లీ లంకలో పడగలవు. 25

రక్షాంసి పరినిఘ్నంతః పుర్యా మస్యాం సమంతతః,
అసంపాతం కరిష్యంతి పతంతః కంకవాససః. 26

రాక్షసేంద్రమహాసర్పాన్ స రామగరుడో మహాన్,
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్. 27

అపనేష్యతి మాం భర్తా త్వత్తశ్శీఘ్ర మరిందమః,
అసురేభ్యః శ్రియం దీప్తాం విష్ణు స్త్రిభిరివ క్రమైః. 28

జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే,
అశక్తేన త్వయా రక్షః కృత మేత దసాధు వై. 29

ఆశ్రమం తు తయో శ్శూన్యం ప్రవిశ్య నరసింహయోః,
గోచరం గతయో ర్భ్రాత్రో రపనీతా త్వయాధమ. 30

నహి గంధ ముపాఘ్రాయ రామలక్ష్మణయో స్త్వయా,

---

రామలక్ష్మణులు విడచిన కంకపత్రములు గల బాణములు రాక్షసులను చీల్చి చెండాడుచు ఈ లంకాపురియం దెల్లెడల నే మాత్ర మవకాశము మిగులకుండునట్లు పడగలవు. 26

గరుత్మంతు డెట్లు వేగముగ ఉరగులను చంపునో అట్లే మహాత్ముడగు రాము డను గరుడుడు ప్రముఖరాక్షసు లను మహాసర్పములను నశింపజేయగలడు. 27

(నా చేతినుండి నిన్ను రాముడు పొందజాలడంటివి కదా) శత్రువుల నణచివేయజాలిన నా పతి రాముడు విష్ణువు మూడడుగులతో అసురులనుండి రాజ్యలక్ష్మిని తప్పించినట్లు నీకడనుండి శీఘ్రమే నన్ను తప్పించగలడు. 28

ఓ రాక్షసుడా! జనస్థానమున రాక్షససైన్య మంతయు నశింపగా, ఏమియు చేయజాలక తుదకు నన్నపహరించుట యను పాడుపని వేసితివి. 29

అధముడా! రామలక్ష్మణులు బయటకు పోవుటచే ఆ నరశ్రేష్ఠులు లేనట్టి ఆశ్రమమున ప్రవేశించి నీవు నన్నపహరించితివి. 30

శక్యం సందర్శనే స్థాతుం శునా శార్దూలయో రివ. 31

తస్య తే విగ్రహే తాభ్యాం యుగగ్రహణ మస్థిరమ్,
వృత్రస్యే వేంద్రబాహుభ్యాం బాహో రేకస్య నిగ్రహః. 32

క్షిప్రం తవ స నాథో మే రామ స్సౌమిత్రిణా సహ,
తోయ మల్ప మివాదిత్యః ప్రాణా నాదాస్యతే శరైః. 33

గిరిం కుబేరస్య గతోఽ పధాయ వా,
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః,
అసంశయం దాశరథే ర్న మోక్ష్యసే,
మహాద్రుమః కాలహతోఽ శనేరివ. 34

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకవింశః సర్గః.*

---

పులులను చూచి కుక్క వాని యెదుట ఎట్లు నిలువజాలదో అట్లే రామలక్ష్మణుల గంధము తగిలినను నీ వా చెంత నుండజాలవు. కావుననే నీ వట్లు వారు లేనపుడే నన్నపహరించితివి. 31

రెండు బాహువులతో ఇంద్రుడు పోరుచుండగా ఒంటిచేతితో వృత్రాసురు డెంత విజృంభించినను జయము పొందనట్లు యుద్ధమున రామలక్ష్మణు లిరువురితో తలపడు నీకు జయము లభించుట జరుగదు. 32

శీఘ్రమే నా నాథుడీరి రాముడు లక్ష్మణునితో గూడి, సూర్యుడు తన వేడి కిరణములతో అల్పజలమును వలె, బాణములతో నీ ప్రాణములను హరింపగలడు. 33

నీకు పోగాలము దాపురించుటచే రాముని బారినుండి తప్పించుకొన నెంచి, పారిపోయి, కైలాసపర్వతమున కేగినను, వరుణపాలితములగు అధోలోకములలో దాగినను, కాలహతమగు మహావృక్షము పిడుగుపాటును తప్పించుకొనలేనట్లు రాముని నుండి తప్పించుకొనలేవు. ఇది నిశ్చయము' అని సీత రావణుని హెచ్చరించెను. 34

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువది యొకటవ సర్గము.*

# 22. ద్వావింశః సర్గః

*(రావణుడు సీతను బెదరించి తన అంతఃపురమునకు పోవుట)*

సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసాధిపః,
ప్రత్యువాచ తతః సీతాం విప్రియం[1] ప్రియదర్శనామ్. 1

యథా యథా సాంత్వయితా వశ్యః స్త్రీణాం తథా తథా,
యథా యథా ప్రియం వక్తా పరిభూత స్తథా తథా. 2

సన్నియచ్ఛతి మే క్రోధం త్వయి కామః నముత్థితః,
ద్రవతోఽ_మార్గ మాసాద్య హయానివ సుసారథిః. 3

వామః కామో మనుష్యాణాం యస్మిన్ కిల నిబధ్యతే,
జనే తస్మిం స్త్వనుక్రోశః స్నేహశ్చ కిల జాయతే. 4

ఏతస్మాత్ కారణా న్న త్వాం ఘాతయామి వరాననే,

---

రావణు డా విధముగ తన కప్రియముగ సీత పలికిన కఠినోక్తు లాలకించి, ప్రీతిని కలిగించు దర్శనము కల ఆమె కి ట్లప్రియము పలికెను. 1

పురుషు డనువయించినకొలది స్త్రీలకు వశపడును. వారికి ప్రీతి కలుగునట్లు మాటలాడిన కొలది పరాభవము నందును. 2

పెడత్రోవను బోవు గుఱ్ఱములను సమర్థుడగు సారథి నిరోధించినట్లు, నీపై కలిగిన కామము నా కోపము నడ్డగించుచున్నది. 3

కామము ప్రతికూలస్వభావము కలది. ఏ మనుజుల యెడ ఆ కామ మేర్పడునో, వారియందు దయ, ప్రేమయు కలుగును. 4

ఓ సుము[illegible] కావుననే నీవు వధింపదగియున్నను, అవమానింపదగియున్నను,

వధార్హా మవమానార్హాం మిథ్యాప్రవ్రజితే రతామ్. 5
పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషి మామ్,
తేషు తేషు వధో యుక్తస్తవ మైథిలి దారుణః. 6
ఏవ ముక్త్వా తు వైదేహీం రావణో రాక్షసాధిపః,
క్రోధసంరంభసంయుక్త స్సీతా ముత్తర మబ్రవీత్. 7
ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధి స్తే మయా కృతః,
తతః శయన మారోహ మమ త్వం వరవర్ణిని. 8
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్,
మమ త్వాం ప్రాతరాశార్థ మాలభంతే మహానసే. 9
తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేంద్రేణ జానకీమ్,
దేవగంధర్వకన్యా స్తా విషేదు ర్వికృతేక్షణాః. 10

---

కపటముగ వానప్రస్థవేషము ధరించిన రామునే ప్రేమించుచున్నను నిన్ను చంపించుట లేదు. 5

ఓ సీతా! నీవు నన్నే యే కఠినోక్తు లాడితివో వాని వానికి ఫలముగ నిన్ను క్రూరముగ వధించుట యుక్తము. 6

రాక్షసరాజగు రావణుడు సీతతో నిట్లు పలికి, కోపప్రణయములతో కూడినవాడై సీతతో మరల నిట్లనెను. 7

సుందరీ! నేను నీ కిచ్చిన గడువు పండ్రెండు నెలలలో నింక రెండు నెలలే కాపాడ వలసియున్నది. కావున నిపుడైనను నాతో శయనముపై పరుండుము. 8

ఈ రెండు నెలలు గడువగా, నన్ను భర్తగా ఇష్టపడని నిన్ను చంపి నా ప్రాంతః కాలపు భోజనమునకై వంటగదిలో వండుట కుపక్రమింతురు. 9

రాక్షసరాజగు రావణు డట్లు సీతను భయపెట్టుచుండగా, దేవకన్యలు, గంధర్వ కన్యలును కనులనుండి నీరుగార్చుచు విషాదము నొందిరి. 10

ఓష్ఠప్రకారై రపరా వక్త్రనేత్రై స్తథాఽ పరాః,
సీతా మాశ్వాసయామాసు స్తర్జితాం తేన రక్షసా. 11
తాభి రాశ్వాసితా సీతా రావణం రాక్షసాధిపమ్,
ఉవా చాత్మహితం వాక్యం వృత్తశౌండీర్యగర్వితమ్. 12
నూనం న తే జనః కశ్చి దస్తి నిశ్శ్రేయసే స్థితః,
నివారయతి యో న త్వాం కర్మణోఽ స్మాద్విగర్హితాత్. 13
మాం హి ధర్మాత్మనః పత్నీం శచీమివ శచీపతేః,
త్వదన్యస్త్రిషు లోకేషు ప్రార్థయే న్మనసాఽ పి కః. 14
రాక్షసాధమ రామస్య భార్యా మమితతేజసః,
ఉక్తవా నసి యత్పాపం క్వ గత స్తస్య మోక్ష్యసే. 15
యథా దృప్తశ్చ మాతంగః శశశ్చ సహితౌ వనే,

---

దుఃఖముచే ఏర్పడిన పెదవుల చలనముచే కొందరు, ముఖవికారములచే కొందరు, నేత్రభంగిమలచే కొందరు ఆ రాక్షసుడు భయపెట్టిన సీత నోదార్చిరి. 11

వారటు లూరడిట్లజేయగా సీత, పాతివ్రత్యబలగర్వితముగ రాక్షసరాజగు రావణునితో తనకు మేలగు విధముగ ఇట్లనెను. 12

నీ శ్రేయస్సు కోరి నింద్యమగు ఈ పనినుండి నిన్ను నివారించువాడే లేడా? 13

దేవేంద్రునకు శచీదేవి వలె ధర్మాత్ముడగు రామునకు భార్యనైన నన్ను ముల్లోకములలో నీవు తప్ప వేఱెవ్వరు మదిలోనైనను కామింతురు? 14

ఓ తుచ్ఛరాక్షసుడా! అమితపరాక్రమశాలి రాముని భార్యనగు నాతో పలికిన పాపపు మాటలకు ఫల మనుభవింపక నీ వెచటకు పోయి తప్పించుకొనెదవు? 15

అడవిలో యుద్ధముచేయు తలంపుతో మదపుటేనుగు - కుందేలు తలపడిన ఎట్లుండునో మీరిరువురికిని సమాగమము అట్లుండును. అందు మదగజము వంటి

తథా ద్విరదవ ద్రామ స్త్వం నీచ శశవత్ స్మృతః. 16
స త్వ మిక్ష్వాకునాథం వై క్షిప న్నిహ న లజ్జసే,
చక్షుషో ర్విషయం తస్య న తావ దుపగచ్ఛసి. 17
ఇమే తే నయనే క్రూరే విరూపే కృష్ణపింగళే,
క్షితౌ న పతితే కస్మా న్మా మనార్య నిరీక్షతః. 18
తస్య ధర్మాత్మనః పత్నీం స్నుషాం దశరథస్య చ,
కథం వ్యాహరతో మాం తే స జిహ్వా వ్యవశీర్యతే. 19
అసందేశాత్తు రామస్య తపస శ్చానుపాలనాత్,
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా. 20
నాపహర్తు మహం శక్యా త్వయా రామస్య ధీమతః,
విధిస్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః. 21

---

వాడు రాముడు. నీచుడవగు నీవు కుందేలు వంటివాడవు. 16

అట్టి నికృష్టుడవగు నీ విక్ష్వాకునాథుడగు నా పతిని మాయామృగవ్యాజముతో దూరము కొనిపోయి సిగ్గువడవైతివి. నీ వింకను ఆయన కంటబడలేదు గదా. 17

అనార్యుడా! నన్ను (పాపదృష్టితో) చూచుచుంటివే! క్రూరములు, పిల్లి కళ్లవలె గోరోజన వర్ణముకలవి, వికృతములు అయిన నీ కన్ను లేల నేల రాలవు? 18

పాపాత్ముడా! ధర్మాత్ముడగు రాముని భార్యను, దశరథుని కోడలి నగు న న్నీవిధముగ పలుకుచుంటివే? నీ నాలుక వ్రయ్యలు కాకున్నదేమి? 19

ఓ రావణుడా! నా కుపద్రవము కలిగించువారిని శపించుమని రామునాజ్ఞ లేనందు వల్లను, పాతివ్రత్యరూపమగు తపస్సు చేయుచుండుటవల్లను నా తేజస్సుతో నిన్ను భస్మము చేయవలసి యున్నను అట్లు చేయనైతివి. 20

ధీమంతుడగు రాముని భార్యవగు నేను నీ కపహరింప శక్యము కాను. దైవము నీ చావుకొరకే నీచే నిట్టి యకృత్యము చేయింపదలచెను. ఇందు సంశయము లేదు. 21

శూరేణ ధనదభ్రాత్రా బలై స్సముదితేన చ,
అపోహ్య రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్. 22
సీతాయా వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః,
వివృత్య నయనే క్రూరే జానకీ మన్వవైక్షత. 23
నీలజీమూతసంకాశో మహాభుజశిరోధరః,
సింహసత్త్వగతిః శ్రీమాన్ దీప్తజిహ్వోగ్రలోచనః. 24
చలాగ్రమకుటప్రాంశు శ్చిత్రమాల్యానులేపనః,
రక్తమాల్యాంబరధర స్తప్తాంగదవిభూషణః. 25
శ్రోణిసూత్రేణ మహతా మేచకేన సుసంవృతః,
అమృతోత్పాదనద్ధేన భుజగేనేన మందరః. 26
తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,

---

నీవు శూరుడవు, యక్షరాజగు కుబేరునకు అన్నవు, సేనాసమన్వితుడవు కదా! మాయామృగవ్యాజముతో రాముని దూరము పంపి ఆయన భార్య నగు నన్నేల దొంగిలించి తెచ్చితివి? 22

సీత పలికిన కఠినోక్తులు విని రావణుడు క్రూరములగు కన్నులు గిరగిర త్రిప్పుచు సీతను చూచెను. 23

అపుడు మేఘమువలె నల్లనై, పెద్ద మూపు, మెడ కలిగి, సింహపు బలము, నడకతో కూడిన శ్రీమంతుడగు ఆ రావణుడు నాలుక కొన, కన్నులు వెలుగుచుండగా, కోపమువల్ల కిరీటపు కొన చలింపగా, పొగడరియై కనుపించుచు, చిత్రవర్ణముగల పుష్పమాలలు దాల్చి, ఒడలికి చందన మలదికొని, ఎఱ్ఱని పుష్పమాలలు, వస్త్రములు దాల్చి మిక్కిలి ప్రకాశించు భుజకీర్తులు, అలంకారములు ధరించి, ఇంద్రనీలమణిఖచితమగుటచే నల్లనైన పెద్ద మొలత్రాడు ధరించుటచే అమృతమును పుట్టించుటకు సర్పమును కట్టిన మందరపర్వతమువలె నుండెను. పర్వతాకారుడగు

శుశుభేஉచలసంకాశః శృంగాభ్యామివ మందరః. 27

తరుణాదిత్యవర్ణాభ్యాం కుండలాభ్యాం విభూషితః,
రక్తపల్లవపుష్పాభ్యా మశోకాభ్యా మివాచలః. 28

స కల్పవృక్షప్రతిమో వసంత ఇవ మూర్తిమాన్,
శ్మశానచైత్యప్రతిమో భూషితోஉపి భయంకరః. 29

అవేక్షమాణో వైదేహీం కోపసంరక్తలోచనః,
ఉవాచ రావణ స్సీతాం భుజంగ ఇవ నిశ్శ్వసన్. 30

అనయే నాభిసంపన్న మర్థహీన మనువ్రతే,
నాశయామ్యహమద్య త్వాం సూర్యః సంధ్యామివౌజసా. 31

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణః శత్రురావణః,

---

ఆ రాక్షసరాజు పరిపూర్ణములైన భుజములచే, శిఖరములచే మందరపర్వతమువలె మిక్కిలి ప్రకాశించెను. 24-27

బాలసూర్యునివలె మెఱయు కుండలములు దాల్చిన ఆ రావణుడు ఎఱ్ఱని చిగుళ్లు, పూలతో నిండిన రెండశోకవృక్షములతో కూడిన కొండవలె నుండెను. 28

ఇట్లలంకరించుకొని, కల్పవృక్షమువలె ప్రకాశించుచు, రూపుదాల్చిన వసంతునివలె భూషణములు ధరించియున్నను, భయంకరుడై యుండుటచే శ్మశానమందలి చెట్టువలె చూచుటకు భీతిగొల్పు చుండెను. 29

ఆ రావణుడు కోపముచే కన్ను లెఱ్ఱబారగా సీతను చూచుచు పామువలె నిట్టూర్చుచు నిట్లనెను. 30

నీతిమాలిన, దరిద్రుడైన వాని నంటిపెట్టుకొనినదానా! ని న్నిపుడే సూర్యుడు ప్రాతః సంధ్యను వలె నా తేజముతో నాశము చేతును. 31

అని యా రావణుడు ఒంటికంటిది, ఒంటి చెవిది, చేట చెవులతో తలను కప్పుకొనినది, ఆవుచెవులు గలది, ఏనుగుచెవులు కలది, వ్రేలాడుచెవులు కలది,

సందిదేశ తత స్సర్వా రాక్షసీ ర్ఘోరదర్శనాః. 32
ఏకాక్షీ మేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
గోకర్ణీం హస్తికర్ణీం చ లంబకర్ణీ మకర్ణికామ్. 33
హస్తిపాద్యశ్వపాద్యౌ చ గోపాదీం పాదచూళికామ్,
ఏకాక్షీ మేకపాదీం చ పృథుపాదీ మపాదికామ్. 34
అతిమాత్రశిరోగ్రీవా మతిమాత్రకుచోదరీమ్,
అతిమాత్రాస్యనేత్రాం చ దీర్ఘజిహ్వా మజిహ్వికామ్.
అనాసికాం సింహముఖీం గోముఖీం సూకరీముఖీమ్. 35
యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ,
తథా కురుత రాక్షస్యః సర్వాః క్షిప్రం సమేత్య చ. 36
ప్రతిలోమానులోమైశ్చ సామదానాదిభేదనైః,
అవర్జయత వైదేహీం దండ స్యోద్యమవేన చ. 37
ఇతి ప్రతిసమాదిశ్య రాక్షసేంద్రః పునః పునః,

---

చెవులు లేనిది, ఏనుగు కాళ్ళది, గుఱ్ఱపు కాళ్ళది, ఆవుకాళ్లది, పాదములందు వెంట్రుకలు కలది, ఒంటికంటిది, ఒంటికాలిది, పెద్దకాళ్ళు కలది, కాళ్లులేనిది, పెద్ద తల, మెడ కలది, పెద్ద కుచములు, కడుపు కలది, పెద్ద మొగము, కండ్లు గలది, పెద్ద నాలుక కలది, నాలుకయే లేనిది, ముక్కులేనిది, సింహముఖము వంటి ముఖము కలది, గోముఖము వంటి ముఖము కలది, పందిముఖము వంటి ముఖము గలది అగు భయంకరరూపముగల రాక్షసాంగనల కిట్లాజ్ఞాపించెను. 32-35

మీరందరును కలసి ఈమెకు ప్రతికూలముగనో, అనుకూలముగనో ఆచరించి, సామ, దాన, భేదోపాయములచే లేదా తుదకు దండోపాయముచే శీఘ్రమే నా కీమె వశమగునట్లు చేయుడు. 36,37

కామమన్యుపరీతాత్మా జానకీం పర్యతర్జయత్. 38

ఉపగమ్య తతః క్షిప్రం రాక్షసీ ధాన్యమాలినీ,
పరిష్వజ్య దశగ్రీవ మిదం వచన మబ్రవీత్. 39

మయా క్రీడ మహారాజ సీతయా కిం తవానయా,
వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర. 40

నూన మస్యా మహారాజ న దివ్యాన్ భోగసత్తమాన్,
విదధా త్యమరశ్రేష్ఠ స్తవ బాహుబలార్జితాన్. 41

అకామాం కామయానస్య శరీర ముపతప్యతే,
ఇచ్ఛంతీం కామయానస్య ప్రీతి ర్భవతి శోభనా. 42

ఏవ ముక్తస్తు రాక్షస్యా సముత్క్షిప్త స్తతో బలీ,
ప్రహసన్ మేఘసంకాశో రాక్షసః స న్యవర్తత. 43

---

అని యా రాక్షసరాజగు రావణుడు మాటిమాటికి వారి నాజ్ఞాపించి కామము, కోపములతో నిండినవాడై సీతను బెదరించెను. 38

అపుడు ధాన్యమాలిని యను రాక్షసి శీఘ్రమే వచ్చి రావణుని కౌగిలించుకొని యిట్లనెను. 39

ఓ మహారాజా! నాతో క్రీడింపుము. రాక్షసేశ్వరా! కాంతి తప్పిన శరీరము కలది, దీనురాలు, మానవస్త్రీ అగు సీతతో నీ కేల? 40

మహారాజా! దేవశ్రేష్ఠుడగు విధాత దివ్యములు, నీ బాహుబలముతో సంపాదించినవి అగు వివిధభోగముల నీమె కనుభవయోగ్యములుగా విధించి యుండలేదు. (అట్లు విధివిహితము లగుచో నీమె యేల నిట్లు ప్రతికూలముగ నాచరించును?). 41

తన్ను ప్రేమించని స్త్రీని కామించువాని దేహము తాపమునే పొందును. తన్ను ప్రేమించు వనితను కామించువానికి మిక్కిలి ప్రీతి చేకూరును. 42

అని ధాన్యమాలిని పలికి యతనిని లేవనెత్తగా బలిష్ఠుడు, మేఘమువలె నల్లనైనవాడు అగు ఆ రాక్షసుడు లేచి, నవ్వుచు మఱలెను. 43

ప్రస్థితః స దశగ్రీవః కంపయన్నివ మేదినీమ్,
జ్వలద్భాస్కరవర్ణాభం ప్రవివేశ నివేశనమ్. 44

దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ సర్వతః,
పరివార్య దశగ్రీవం వివిశు స్తద్ గృహోత్తమమ్. 45

స మైథిలీం ధర్మపరా మవస్థితాం,
ప్రవేపమానాం పరిభర్త్స్య రావణః,
విహాయ సీతాం మదనేన మోహితః
స్వమేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్. 46

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్వావింశః సర్గః.*

---

అట్లు బయలుదేరిన రావణుడు భూమి యదరునట్లు అడుగులు వేయుచు, సూర్యునివలె ప్రకాశముతో నొప్పు తన భవనమున ప్రవేశించెను. 44

దేవకన్యలు, గంధర్వకన్యలు, నాగకన్యలును రావణున కన్ని వైపులను పరివేష్టించి యా శ్రేష్ఠభవనమున ప్రవేశించిరి. 45

ఈ విధముగ ధర్మనిష్ఠ కలది, భయముతో వణకుచున్నదగు సీతను భయపెట్టి, యామెను విడచి, కామపీడితుడగుచు రావణుడు ప్రకాశించుచున్న తవ భవనమున ప్రవేశించెను. 46

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువది రెండవ సర్గము.*

# 23. త్రయోవింశః సర్గః

*(రాక్షసాంగనలు సీతను బుజ్జగించుట)*

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణ శ్శత్రురావణః,
సందిశ్య చ తత స్సర్వా రాక్షసీ ర్నిర్జగామ హ. 1

నిష్క్రాంతే రాక్షసేంద్రే తు పున రంతఃపురం గతే,
రాక్షస్యో భీమరూపా స్తా స్సీతాం సమభిదుద్రువుః. 2

తత స్సీతా ముపాగమ్య రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
పరం పరుషయా వాచా వైదేహీ మిద మబ్రువన్. 3

పౌలస్త్యస్య వరిష్ఠస్య రావణస్య మహాత్మనః,
దశగ్రీవస్య భార్యాత్వం సీతే న బహుమన్యసే. 4

తత స్త్వేకజటా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
ఆమంత్ర్య క్రోధతామ్రాక్షీ సీతాం కరతలోదరీమ్. 5

---

శత్రువులను రోదింపచేయువాడగు రావణుడట్లు సీతతో పలికి సకలరాక్షసవనితలకు ఆనతి నిచ్చి వెడలిపోయెను. 1

రావణు డటు లంతఃపురమునకు వెడలిపోవగనే, భయంకరాకారముగల రాక్షసవనితలు సీత చెంతకు పరుగెత్తిరి. 2

అపుడా రాక్షసాంగనలు సీతను సమీపించి తీవ్రమగు కోపముతో, మిక్కిలి కఠినోక్తులతో నిట్లు పలికిరి. 3

సీతా! రావణుడు పులస్త్యబ్రహ్మ వంశమువాడు, శ్రేష్ఠుడు, మహాత్ముడు. నీ వాతని భార్యవగుట నేల గౌరవముగా దలంపవు? 4

అపుడు ఏకజట యను రాక్షసి సన్నని నడుము కల సీతను పిలిచి, కోపముతో కన్ను లెఱ్ఱబారగా నిట్లనెను. 5

ప్రజాపతీనాం షణ్ణాం తు చతుర్థో యః ప్రజాపతిః,
మానసో బ్రహ్మణః పుత్రః పులస్త్య ఇతి విశ్రుతః. 6

పులస్త్యస్య తు తేజస్వీ మహర్షి ర్మానస స్సుతః,
నామ్నా స విశ్రవా నామ ప్రజాపతిసమప్రభః. 7

తస్య పుత్రో విశాలాక్షి రావణ శ్శత్రురావణః,
తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితు మర్హసి. 8

మయోక్తం చారు సర్వాంగి వాక్యం కిం నానుమన్యసే. 9

తతో హరిజటా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
వివర్త్య నయనే కోపా న్మార్జారసదృశేక్షణా. 10

యేన దేవా స్త్రయస్త్రింశ ద్దేవరాజశ్చ నిర్జితాః,
తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితు మర్హసి. 11

---

"మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అను నార్గురు ప్రజాపతులలో నాల్గవవాడగు పులస్త్యుడు బ్రహ్మమానసపుత్రుడు. 6

ఆ పులస్త్యుని మనఃసంకల్పమువలన బుట్టిన తేజశ్శాలి యగు మహర్షి విశ్రవస్సు అనుపేరు కలవాడు. ఆయన ప్రజాపతులకు సాటియగు తేజము కలవాడు. 7

ఓ విశాలాక్షివగు సీతా! ఆ విశ్రవస్సు కుమారుడే శత్రువులను యుద్ధమున రోదింపజేయు రావణుడు. రాక్షసరాజగు ఆ రావణునకు నీవు భార్యవు కాదగుదువు. 8
సర్వాంగసుందరీ! నీవేల నామాట నంగీకరింపవు." 9

పిమ్మట పిల్లికన్నుల వంటి కన్నులుగల హరిజట యను రాక్షసి కోపముతో కన్నులు త్రిప్పి యిట్లనెను. 10

"ముప్పదిమూడు (కోట్ల) దేవతలను, దేవేంద్రునికూడ జయించిన రాక్షసరాజగు రావణునకు నీవు భార్యవు కాదగుదువు." 11

అప్పుడు ప్రఘస యను రాక్షసి మిక్కిలి కోపించి, సీతను బెదిరించుచు నిట్లు

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భర్త్సయంతీ తదా ఘోర మిదం వచన మబ్రవీత్. 12
వీర్యోత్సిక్తస్య శూరస్య సంగ్రామే ష్వనివర్తినః,
బలినో వీర్యయుక్తస్య భార్యాత్వం కిం న లప్స్యసే. 13
ప్రియాం బహుమతాం భార్యాం త్యక్త్వా రాజా మహాబలః.
సర్వాసాం చ మహాభాగాం త్వా ముపైష్యతి రావణః. 14
సమృద్ధం స్త్రీసహస్రేణ నానారత్నోపశోభితమ్,
అంతఃపురం సముత్సృజ్య త్వా ముపైష్యతి రావణః. 15
అన్యా తు వికటా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్. 16
అసకృ ద్దేవతా యుద్ధే నాగగంధర్వదానవాః,
నిర్జితా స్సమరే యేన స తే పార్శ్వ ముపాగతః. 17
తస్య సర్వసమృద్ధస్య రావణస్య మహాత్మనః,

---

భీకరముగా పలికెను. 12

"బలగర్వితుడు, శూరుడు, యుద్ధమున వెన్ను జూపనివాడు, శక్తిమంతుడు, పరాక్రమ వంతుడగు రావణునకు భార్య వేల కాకున్నావు? 13

భార్యలందరిలో ప్రియురాలు, మిక్కిలి గౌరవము కలది యగు మండోదరి యను భార్యను వీడి, తన భార్యలలో నెల్ల మహాభాగ్యవతినిగా చేసి మహాబలుడు రావణుడు నిన్ను చేరగలడు. 14

వేలకొలది స్త్రీలతో సమృద్ధమైనది, వివిధరత్నములతో శోభిల్లునది యగు నంతః పురమును వీడి రావణుడు నిన్ను చేరగలడు. 15

అంత వికట యను వేఱొక రాక్షసి యిట్లనెను. "యుద్ధమున ననేక మారులు దేవతలను, ఉరగులను, గంధర్వులను, జయించిన రావణుడు నీ చెంతకు వచ్చినాడు. 16,17

ఓ అధమురాలా! రావణుడు రాక్షసరాజు. సర్వసంపదలు సమృద్ధిగా కలవాడు.

కిమద్య రాక్షసేంద్రస్య భార్యాత్వం నేచ్ఛసేఽధమే. 18

తతస్తు దుర్ముఖీ నామ రాక్షసీ వాక్య మబ్రవీత్. 19

యస్య సూర్యో న తపతి భీతో యస్య చ మారుతః,
న వాతి స్మాయతాపాంగే కిం త్వం తస్య న తిష్ఠసి. 20

పుష్పవృష్టిం చ తరవో ముముచు ర్యస్య వై భయాత్,
శైలాశ్చ సుభ్రు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి. 21

తస్య నైర్ృతరాజస్య రాజరాజస్య భామిని,
కిం త్వం న కురుషే బుద్ధిం భార్యార్థే రావణస్య హి. 22

సాధు తే తత్త్వతో దేవి కథితం సాధు భామిని,
గృహాణ సుస్మితే వాక్య మన్యథా న భవిష్యసి. 23

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రయోవింశః సర్గః*

---

నీవేల ఆయనకు భార్యవు కాగోరవు? 18

అపుడు దుర్ముఖి యను రాక్షసి యిట్లు పలికెను. "విశాలనేత్రములు గల ఓ సీతా! ఎవనివలన భయముతో సూర్యుడు ఎండ తీవ్రముగా కాయడో, వాయువు వేగముగ వీచడో అట్టి రావణుని పక్షమున నుండవేల? 19,20

ఓ సుందరములగు కనుబొమ్మలు కల భామినీ! ఎవనివలన భయముతో వృక్షములు పూలవాన కురిపించెనో, కొండలు, మబ్బులు జలము సమృద్ధిగా నిచ్చెనో, అట్టి రాక్షస రాజు, రాజాధిరాజు రావణునకు భార్యవు కావలెనని యేల తలంపవు? 21,22

ఓ రమ్యమగు చిరునగవు గలదానా! నే నిట్లు హితముగా పలికిన వాస్తవమును నీవు చక్కగా గ్రహింపుము. అట్లు కానిచో నీవు జీవింపవు. 23

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదిమూడవ సర్గము.*

# 24. చతుర్వింశః సర్గః

*(రాక్షసవనితలు సీతను బెదరించుట)*

తత స్సీతా ముపాగమ్య రాక్షస్యో వికృతాననాః,
పరుషం పరుషా నార్య ఊచు స్తాం వాక్య మప్రియమ్. 1

కిం త్వ మంతఃపురే సీతే సర్వభూతమనోహరే,
మహార్హశయనోపేతే న వాస మనుమన్యసే. 2

మానుషీ మానుషస్యైవ భార్యాత్వం బహుమన్యసే,
ప్రత్యాహర మనో రామా న్న త్వం జాతు భవిష్యసి. 3

త్రైలోక్యవసుభోక్తారం రావణం రాక్షసేశ్వరమ్,
భర్తార ముపసంగమ్య విహరస్వ యథాసుఖమ్. 4

మానుషీ మానుషం తం తు రామ మిచ్ఛసి శోభనే,
రాజ్యాద్ భ్రష్ట మసిద్ధార్థం విక్లబం త్వ మనిందితే. 5

---

అవుడు వికృతములగు ముఖములును, క్రూరస్వభావమును గలవారగు రాక్షసాంగనలు సీతను చేరి, యిటు లప్రియము లగు మాటలను కఠినముగా బలికిరి. 1

ఓ సీతా! ఎల్లజీవులకు మనోహరమైనది, గొప్ప వెలగల శయనములతో కూడినదగు రావణుని యంతఃపురమున నివసించుటకు ఏల ఇష్టపడవు? 2

నీవు మనుష్యస్త్రీవి కనుక మనుష్యుడగు రామునకు భార్య వగుటను గొప్పగా తలంచుచున్నావు. నీ మనస్సును రాముని నుండి మరల్చుకొమ్ము. లేనిచో నీవు బ్రతుకవు. 3

ముల్లోకముల సంపదల ననుభవించువాడు, రాక్షసరాజగు రావణుని భర్తగా బడసి సుఖము లనుభవించుచు విహరింపుము. 4

ఓ అనవద్యసౌందర్యవతీ! మనుష్య స్త్రీవగు నీవు మనుష్యుడగు రాముని కోరుచున్నావు. కాని ఆ రాముడు రాజ్యహీనుడు. విఫలమనోరథుడు, క్లేశపరవశుడును. 5

రాక్షసీనాం వచ శ్ర్శుత్వా సీతా పద్మనిభేక్షణా,
నేత్రాభ్యా మశ్రుపూర్ణాభ్యా మిదం వచన మబ్రవీత్. 6
యదిదం లోకవిద్విష్ట ముదాహరథ సంగతాః,
నైత న్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతి వః. 7
న మానుషీ రాక్షసస్య భార్యా భవితు మర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 8
దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః,
తం నిత్య మనురక్తాఽస్మి యథా సూర్యం సువర్చలా. 9
యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి,
అరుంధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా. 10
లోపాముద్రా యథాఽగస్త్యం సుకన్యా చ్యవనం యథా,
సావిత్రీ సత్యవంతం చ కపిలం శ్రీమతీ యథా. 11

---

పద్మములవంటి కన్నులుగల సీత ఆ రాక్షసస్త్రీల మాటలు విని కనుల నీరు నిండగా యిట్లు పలికెను. 6

మీరందరును కలసి యిట్లు నన్నుగూర్చి జననిందితములగు మాటలు పలుకుచుంటిరే. మీ కీ మాటలు పాపముగ తోచుటలేదా? 7

మానవస్త్రీ రాక్షసుని భార్య కాదగదు. మీరందరు కలసి నన్ను తినివేసినను సరే మీ మాటల నాచరింపను. 8

దీనుడే కాని, రాజ్యహీనుడే గాని పతియే నాకు మిన్న. సువర్చల సూర్యునియం దనురాగము కలిగియున్నట్లు దే నతనియందే ఎల్లపు దనురాగము కలిగియుందును. 9

మహాభాగ్యవతి యగు శచీదేవి దేవేంద్రుని, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర అగస్త్యుని, సుకన్య చ్యవనుని, సావిత్రి సత్యవంతుని, శ్రీమతి కపిలుని, దమయంతి సౌదాసుని, కేశిని సగరుని, దమయంతి నలుని అనువర్తించి యున్నట్లే

సౌదాసం మదయంతీవ కేశినీ సగరం యథా,
నైషధం దమయంతీవ భైమీ పతి మనువ్రతా,
తథాఽహ మిక్ష్వాకువరం రామం పతి మనువ్రతా. 12
సీతాయా వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
భర్త్సయంతి స్మ పరుషై ర్వాక్యై రావణచోదితాః. 13
అవలీన స్స నిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే,
సీతాం సంతర్జయంతీ స్తా రాక్షసీ రశృణోత్ కపిః. 14
తా మభిక్రమ్య సంకుద్ధా వేపమానాం సమంతతః,
భృశం సంలిలిహు ర్దీప్తాన్ ప్రలంబాన్ దశనచ్ఛదాన్. 15
ఊచుశ్చ పరమక్రుద్ధాః ప్రగృహ్యాశు పరశ్వథాన్,
నేయ మర్హతి భర్తారం రావణం రాక్షసాధిపమ్. 16
సంభర్త్స్యమానా భీమాభీ రాక్షసీభి ర్వరాననా,

---

నేనును యిక్ష్వాకువంశ్యులలో శ్రేష్ఠుడగు నా పతి రాము ననుసరించి యున్నదానను. 10-12

సీతాదేవి పలుకులు విని మిక్కిలి కోపించిన రాక్షసాంగనలు, రావణునిచే ప్రేరితలై కఠినోక్తులతో సీతను భయపెట్టసాగిరి. 13

శింశుపావృక్షముపై దాగియున్న హనుమంతు డేమియు మాటలాడక అట్లు సీతను బెదరించు రాక్షసాంగనల మాటలు వినసాగెను. 14

ఆ రాక్షసస్త్రీలు మిక్కిలి కోపము కలవారై సీతను చుట్టుముట్టి కాంతిమంతములై, వ్రేలాడుచున్న తమ పెదవులను నాకుచు, వేగముగ గొడ్డళ్ళు చేతబట్టి, తమ కోపమును ప్రకటించుచు నిట్లనిరి. "ఈమె రాక్షసరాజగు రావణుని భర్తగా పొంద తగదు." 15,16

ఆ సుముఖి సీత భయంకరరాక్షసస్త్రీలు అట్లు బెదిరించుచుండగా కన్నీరు

పా బాష్ప ముపమార్జంతీ శింశుపాం తా ముపాగమత్. 17
తత స్తాం శింశుపాం సీతా రాక్షసీభి స్సమావృతామ్,
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా. 18
తాం కృశాం దీనవదనాం మలినాంబరధారిణీమ్,
భర్త్సయాంచక్రిరే సీతాం రాక్షస్య స్తాం సమంతతః. 19
తత స్తాం వినతా నామ రాక్షసీ భీమదర్శనా,
అబ్రవీత్ కుపితాకారా కరాళా నిర్ణతోదరీ. 20
సీతే పర్యాప్త మేతావద్ భర్తుః స్నేహో నిదర్శితః,
సర్వత్రాతికృతం భద్రే వ్యసనా యోపకల్పతే. 21
పరితుష్టాస్మి భద్రం తే మానుష స్తే కృతో విధిః,
మమాపి తు వచః పథ్యం బ్రువంత్యాః కురు మైథిలి. 22

---

తుడుచుకొనుచు, హనుమంతు డెక్కియున్న శింశుపావృక్షము చెంతకే పోయెను. 17

పిమ్మట విశాలాక్షి యగు ఆ సీత రాక్షసాంగనలు పరివేష్టించియున్న శింశుపావృక్షము చెంతకు పోయి శోకమున మునిగియుండెను. 18

కృశించి, దీనవదనయై, మలినవస్త్రములు దాల్చియున్న సీతను రాక్షసాంగన లన్నివైపులనుండియు భయపెట్టసాగిరి. 19

అపుడు భయంకరనేత్రములు గలది, భయంకరాకృతి కలది, కృశోదరి యగు వినత యను రాక్షసి, మిక్కిలి కోపము నొందినదై యిట్లనెను. 20

సీతా! నీ వింతవఱకు నీ భర్తపై స్నేహము ప్రదర్శించితివి. ఇంక చాలును. ఓ శుభాంగీ! ఎచ్చటనైనను అవసరమును మించి చేసిన పని కష్టములకే కారణమగును. 21

నీ పతిభక్తికి సంతోషించితిని. నీ విప్పటివరకు మనుష్యజాతికి తగిన పాతివ్రత్యధర్మము నిర్వహించితివి. సీతా! ఇంక నేను చెప్పెడి హితమును గూడ ఒకింత విని ఆచరింపుము. 22

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్,
విక్రాంతం రూపవంతం చ సురేశ మివ వాసవమ్,
దక్షిణం త్యాగశీలం చ సర్వస్య ప్రియదర్శనమ్. 23

మానుషం కృపణం రామం త్యక్త్వా రావణ మాశ్రయ,
దివ్యాంగరాగా వైదేహి దివ్యాభరణభూషితా, 24
అద్యప్రభృతి సర్వేషాం లోకానా మీశ్వరీ భవ.
అగ్నేః స్వాహా యథా దేవీ శచీవేంద్రస్య శోభనే. 25

కిం తే రామేణ వైదేహి కృపణేన గతయుషా,
ఏతదుక్తం చ మే వాక్యం యది త్వం న కరిష్యసి,
అస్మిన్ ముహూర్తే సర్వాస్త్వాం భక్షయిష్యామహే వయమ్. 26

అన్యా తు వికటా నామ లంబమానపయోధరా,
అబ్రవీత్ కుపితా సీతాం ముష్టి ముద్యమ్య గర్జతీ. 27

---

రావణుని నీ భర్తగా సేవింపుము. ఆయన సర్వరాక్షసులకు ప్రభువు. దేవరాజగు ఇంద్రునివంటివాడు, పరాక్రమశాలి, రూపవంతుడు, చతురుడు, త్యాగశీలుడు, దర్శించువారికి ప్రీతిని కలిగించును. 23

కల్యాణీ! నీ వింక మనుష్యుడు, దీనుడగు రాముని విడచి రావణు నాశ్రయింపుము. దివ్యములగు చందనాదులు పూసికొని, దివ్యాభరణముల నలంకరించుకొని, అగ్నికి స్వాహాదేవివలెను, ఇంద్రునకు శచీదేవీవలెను రావణునకు భార్యవై నేటినుండి సకల లోకములకు ఈశ్వరివి కమ్ము. 24,25

ఓ సీతా! రాముడు దీనుడై యున్నాడు. అతని ఆయువు చెల్లినది. అతనితో నీకేల? నేను చెప్పినట్లు చేయనిచో మేమందఱ మిప్పుడే నిన్ను భక్షింతుము. 26

అపుడు వ్రేలాడుచున్న స్తనములు గల వికట యను వేరొక రాక్షసి కోపముతో పిడికిలి బిగించి ఎత్తి గర్జించుచు నిట్లనెను. 27

బహూ న్యప్రియరూపాణి వచనాని సుదుర్మతే,
అనుక్రోశా న్మృదుత్వాచ్చ సోఢాని తవ మైథిలి.
న చ నః కురుషే వాక్యం హితం కాలపురస్కృతమ్. 28

ఆనీతాఽసి సముద్రస్య పార మన్యై ర్దురాసదమ్,
రావణాంతఃపురం ఘోరం ప్రవిష్టా చాసి మైథిలి. 29

రావణస్య గృహే రుద్ధా మస్మాభిస్తు సురక్షితామ్,
న త్వాం శక్తః పరిత్రాతు మపి సాక్షాత్ పురందరః. 30

కురుష్వ హితవాదిన్యా వచనం మమ మైథిలి,
అల మశ్రుప్రపాతేన త్యజ శోక మనర్థకమ్. 31

భజ ప్రీతిం ప్రహర్షం చ త్యజైతాం నిత్యదైన్యతామ్.
సీతే రాక్షసరాజేన సహ క్రీడ యథాసుఖమ్. 32

---

ఓ దుష్టబుద్ధిగల సీతా! నీవు పలికిన అప్రియములగు మాటలెన్నో నీపై దయచేతను, మా మృదుత్వముచేతను సహించితిమి. సమయోచితముగ మేము పలికిన హితోక్తిని నీ వాచరింపకున్నావు. 28

ఓ సీతా! రావణుడు అన్యులకు చేరరాని సముద్రపు టివ్వలియొడ్డుకు నిన్ను కొని తెచ్చినాడు. నీ విపు డతని భయంకరమగు అంతఃపురమున ప్రవేశించినావు. 29

నిన్ను రావణునింట నిలిపి మేము బాగుగ కాపాడుచుండగా సాక్షాత్తుగా దేవేంద్రుడు వచ్చినను నిన్ను రక్షింపజాలడు. 30

సీతా! నీ మేలు కోరి చెప్పుచున్నాను. నేను చెప్పినట్లు చేయుము. కన్నీరు కార్చకుము. నిష్ప్రయోజనమగు శోకము వీడుము. 31

సీతా! నీవు ప్రేమను, ఆనందమును పొందుము. నిత్యదైన్యము వీడి రాక్షసరాజగు రావణునితో సుఖముగ క్రీడించుము. 32

ఓ పిరికిదానా! స్త్రీల యౌవనము స్థిరముకాదని నీ వెఱుగుదువు కదా! ఆ యౌవనము

జానాసి హి యథా భీరు స్త్రీణాం యౌవన మధ్రువమ్,
యావ న్న తే వ్యతిక్రామేత్ తావత్ సుఖ మవాప్నుహి. 33

ఉద్యానాని చ రమ్యాణి పర్వతోపవనాని చ,
సహ రాక్షసరాజేన చర త్వం మదిరేక్షణే. 34

స్త్రీసహస్రాణి తే సప్త వశే స్థాస్యంతి సుందరి,
రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్. 35

ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి,
యది మే వ్యాహృతం వాక్యం న యథావత్ కరిష్యసి. 36

తత శ్చండోదరీ నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భ్రామయంతీ మహచ్ఛూల మిదం వచన మబ్రవీత్. 37

ఇమాం హరిణలోలాక్షీం త్రాసోత్కంపిపయోధరామ్,
రావణేన హృతాం దృష్ట్వా దౌహృదో మే మహా నభూత్. 38

---

గడచిపోవు లోపలనే సుఖము పొందుము. 33

ఓ మదిరాక్షీ! నీవు రాక్షసరాజగు రావణునితో గూడి సుందరోపవనములలో, పర్వతప్రాంతోద్యానములలో విహరింపుము. 34

ఓ సుందరీ! ఏడువేలమంది రాక్షసస్త్రీలు నీ యధీనమం దుండెదరు. కావున సకల రాక్షసరాజగు రావణుని భర్తగా సేవింపుము. 35

సీతా! నేను చెప్పినట్లు నీ వాచరింపవేని, నీ గుండెను పెఱికి యైన భక్షించెదను. 36

పిమ్మట చండోదరి యను రాక్షసి తీవ్రకోపముతో పెద్దశూలము త్రిప్పుచు నిట్లనెను. 37

లేడివలె చంచలములగు కన్నులు గలది, భయముచే వణకు స్తనములు గలది, రావణుడు అపహరించి తెచ్చినదగు ఈమెను చూడగా నాకు తినవలెనని అధికమైన కోరిక కలిగినది. 38

యకృత్ప్లీహ మథోత్పీడం హృదయం చ సబంధనమ్,
ఆంత్రాణ్యపి తథా శీర్షం ఖాదేయ మితి మే మతిః. 39
తతస్తు ప్రఘసా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్.
కంఠ మస్యా నృశంసాయాః పీడయామ కిమాస్యతే, 40
నివేద్యతాం తతో రాజ్ఞే మానుషీ సా మృతేతి హ,
నాత్ర కశ్చన సందేహః ఖాదతేతి స వక్ష్యతి. 41
తతస్త్వజాముఖీ నామ రాక్షసీ వాక్య మబ్రవీత్.
విశ స్యేమాం తత స్సర్వా స్సమాన్ కురుత పీలుకాన్, 42
విభజామ తత స్సర్వా వివాదో మే న రోచతే.
పేయ మానీయతాం క్షిప్రం లేహ్యముచ్చావచం బహు. 43

---

"కడుపునకు కుడివైపున నుండు కాలఖండమను మాంసపిండమును, ఎడమవైపున ఉండు గుల్మమను మాంసపిండమును, దానిపైనుండు మాంసమును, పద్మకోశమువలె నుండు హృదయరూపమగు మాంసమును, దానిని నిలిపియుంచు అధోమాంసమును, ప్రేగులను, తలను తినవలెనని నా కోరిక" అనెను. 39

అంతట ప్రఘస యను రాక్షసి యిట్లు పలికెను. ఇంకను ఉపేక్షింపవేల, ఈ క్రూరురాలి మెడ నొక్కివేయుదము. 40

తరువాత అ మానవాంగన మరణించెనని రాజునకు నివేదించుదము. దానిని తినివేయుడని ఆయన చెప్పును. ఇందు సందేహ మేమియు లేదు. 41

అప్పు డజాముఖి యను రాక్షసి యిట్లనెను. "ఈమెను చంపి అందరును సమాసముగా మాంసఖండములు చేయుడు. పిమ్మట మన మందరము పంచుకొందము. నాకు తగవనిన గిట్టదు. శీఘ్రమువే మద్యము మున్నగు వివిధపేయద్రవ్యములను, తేనె మున్నగు వివిధ లేహ్యపదార్థములను తెండు" అనెను. 42,43

తత శ్శూర్పణఖా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్.
అజాముఖ్యా యదుక్తం హి తదేవ మమ రోచతే, 44
సురా చానీయతాం క్షిప్రం సర్వశోకవినాశినీ,
మానుషం మాంస మాస్వాద్య నృత్యామోఽథ నికుంభిలామ్. 45
ఏవం సంభర్త్స్యమానా సా సీతా సురసుతోపమా,
రాక్షసీభి స్సుఘోరాభిర్ ధైర్య ముత్సృజ్య రోదితి. 46

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చతుర్వింశః సర్గః*

---

అంత శూర్పణఖ యను రాక్షసి యిట్లనెను. "అజాముఖి చెప్పినదియే నాకును నచ్చిన మాట. 44

సర్వశోకములను పోగొట్టు మద్యమును శీఘ్రమే తెండు. మనుష్యమాంసము తిని లంకానగరి పశ్చిమద్వారమున నుండు భద్రకాళి ప్రీతికై నృత్యము చేయుదము". 45

దేవకన్యవలె సుందరాంగి యగు సీత యిట్లా భయంకరరాక్షసాంగనలు బెదరించగా ధైర్యము కోల్పోయి ఏడ్వజొచ్చెను. 46

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదినాల్గవ సర్గము.*

# 25. పంచవింశః సర్గః

*(రాక్షసవనితల ఉపదేశమును సీత త్రోసిపుచ్చుట)*

తథా తాసాం వదంతీనాం పరుషం దారుణం బహు,
రాక్షసీనా మసౌమ్యానాం రురోద జనకాత్మజా. 1
ఏవ ముక్తా తు వైదేహీ రాక్షసీభి ర్మనస్వినీ,
ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా. 2
న మానుషీ రాక్షసస్య భార్యా భవితు మర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 3
సా రాక్షసీమధ్యగతా సీతా సురసుతోపమా,
న శర్మ లేభే దుఃఖార్తా రావణేన చ తర్జితా. 4
వేపతే స్మాధికం సీతా విశంతీ వాంగ మాత్మనః,

---

ఇట్లు కఠినాత్మ లగు ఆ రాక్షసవనితలు భీకరముగా కఠినోక్తులనేకములు పలుకుచుండగా సీత ఏడ్వసాగెను. 1

పాతివ్రత్యముచే మనోదార్ఢ్యము గల సీత రాక్షసాంగనల పలుకులు విని మిక్కిలి భయపడినదై గద్గదస్వరముతో నిట్లనెను. 2

నేను మానవవనితను; రాక్షసునకు భార్య యగుట తగదు. కావున కావలయుచో మీరందరు నన్ను తినివేయుడు. అంతేకాని మీ మాటల నాచరింపను. 3

దేవకన్యను బోలు ఆ సీత రాక్షసాంగనల నడుమ చిక్కి రావణుడు కూడ భయపెట్టగా దుఃఖము పీడించగా సుఖము పొందదయ్యెను. 4

అడవిలో తన జాతి గుంపు నెడబాసి, తోడేళ్ళకు చిక్కి పీడింపబడుచున్న ఆడులేడివలె,

వనే యూథపరిభ్రష్టా మృగీ కోకై రివార్దితా. 5
సా త్వశోకస్య విపులాం శాఖా మాలంబ్య పుష్పితామ్,
చింతయామాస శోకేన భర్తారం భగ్నమానసా. 6
సా స్నాపయంతీ విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః,
చింతయంతీ న శోకస్య తదాంత మధిగచ్ఛతి. 7
సా వేపమానా పతితా ప్రవాతే కదలీ యథా,
రాక్షసీనాం భయత్రస్తా వివర్ణవదనాఽభవత్. 8
తస్యా స్సా దీర్ఘవిపులా వేపంత్యా సీతయా తదా,
దదృశే కంపినీ వేణీ వ్యాలీవ పరిసర్పతీ. 9
సా నిఃశ్వసంతీ దుఃఖార్తా శోకోపహతచేతనా,
ఆర్తా వ్యసృజ దశ్రూణి మైథిలీ విలలాప హ. 10
హా రామేతి చ దుఃఖార్తా హా పున ర్లక్ష్మణేతి చ,

---

సీత తన శరీరమును మిగుల ముడుచుకొని భయముతో వణకసాగెను. 5

ఆమె బాగుగా పుష్పించిన అశోకవృక్షపు కొమ్మ నొకదానిని పట్టుకొనియున్నదై, మనస్సు శోకముచే తల్లడిల్లగా, తన పతినే తలంచుచుండెను. 6

ఆమె విపులములగు స్తనములను కన్నీటితో తడుపుచు, రామునే ధ్యానించుచు, అంతులేని దుఃఖము కలదయ్యెను. 7

ఆమె పెనుగాలికి అరటిబోదెవలె వణకుచు, రాక్షసాంగనలను చూచి భయపడుచు, కాంతిహీనమగు ముఖము కలదయ్యెను. 8

అట్లు వణుకుచున్న సీతయొక్క పొడవై విశాలమైన జడయు కదలుచు, పాకిపోవు పామువలె కనుపించెను. 9

ఆ సీత యట్లు నిట్టూర్చుచు, రాక్షసాంగనల మాటలను వినుటవలన కలిగిన దుః

హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ. 11
లోకప్రవాద స్సత్యోఽయం పండితై స్సముదాహృతః,
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా. 12
యత్రాహ మేవం క్రూరాభీ రాక్షసీభి రిహార్దితా,
జీవామి హీనా రామేణ ముహూర్తమపి దుఃఖితా. 13
ఏషాఽ ల్పపుణ్యా కృపణా వినశిష్యా మ్యనాథవత్,
సముద్రమధ్యే నౌః పూర్ణా వాయువేగై రివాహతా. 14
భర్తారం త మపశ్యంతీ రాక్షసీవశ మాగతా,
సీదామి ఖలు శోకేన కూలం తోయహతం యథా. 15
తం పద్మదళపత్రాక్షం సింహవిక్రాంతగామినమ్,
ధన్యాః పశ్యంతి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్. 16

---

ఖ ముచే పీడింపబడి, రామవిరహార్తయై, శోకముచే మనస్సు కలతచెందగా, కన్నీరు కార్చుచు, 'హా రామా! లక్ష్మణా! అయ్యో అత్తా! కౌసల్యా! సుమిత్రా! యని యేడ్చెను. 10,11

స్త్రీకిగాని, పురుషునకుగాని, అకాలమృత్యువు చాల దుర్లభమని పండితులు పలుకు జనప్రవాదము యథార్థము. ఏలననగా, నేనిచట ఇంతటి క్రూరాత్మలగు రాక్షసస్త్రీలు పీడించుచుండగా, రాము నెడబాసి యొక్క నిముసమైన జీవింపగలుగుచున్నాను. నాకు అకాలమృత్యువు కలుగుట లేదు. 12,13

కొంచెము పుణ్యమే చేసికొన్న నేను, దీననై సముద్రమధ్యమున సరకుతో నిండి పెనుగాలి తాకిడికి లోనైన ఓడవలె అనాథనై నశింతును. 14

నేను నా భర్తయగు రాముని కానక, రాక్షసస్త్రీలకు వశపడి, నీటి ఒరవడిచే కోసివేయబడిన తీరమువలె శోకముచే నశింతును. 15

వికసించిన తామరరేకులవంటి కన్నులు గలవాడు, సింహమువలె నడచువాడు, కృతజ్ఞుడు, ప్రియము పలుకువాడగు నా నాథుని దర్శనము భాగ్యశాలురకే కలుగును. 16

సర్వథా తేన హీనాయా రామేణ విదితాత్మనా,
తీక్ష్ణం విష మివాస్వాద్య దుర్లభం మమ జీవితమ్. 17
కీదృశం తు మయా పాపం పురా జన్మాంతరే కృతమ్,
యే నేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్. 18
జీవితం త్యక్తు మిచ్ఛామి శోకేన మహతా వృతా,
రాక్షసీభిశ్చ రక్షంత్యా రామో నాసాద్యతే మయా. 19
ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతామ్,
న శక్యం యత్పరిత్యక్తు మాత్మచ్ఛందేన జీవితమ్. 20

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచవింశః సర్గః.*

---

మహాబుద్ధిశాలి యగు రాము నెడబాసి తీవ్రమయిన విషము పానము చేసినవాని వలె నేను జీవించుట దుర్లభము. 17

పూర్వజన్మమున నే నెంతో ఘోరపాప మొనరించి యుండవలయును. దానివల్లనే నే నీ భయంకరదుఃఖమును పొందుచున్నాను. 18

ఈ మహాశోకముచే పీడింపబడుచు, నేను మరణింప గోరుచున్నాను. రాక్షసస్త్రీలు కావలియుండగా నేను రాముని చేరలేకున్నాను. 19

మనుజులు కోరినపుడు మరణము కలుగదే. అగ్నిలోనో, నీటనో పడి మరణించుద మన్నను నేను భర్త కధీనురాలను. ఆయన యాజ్ఞ లేక నా ప్రాణము లెట్లు విడుతును? ఛీ! చచ్చుటకును వీలుకాని పరాధీన మగు ఈ బ్రతుకేటి బ్రతుకు' అని యిట్లు సీత పలువిధముల విలపించెను. 20

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదియైదవ సర్గము.*

# 26. షడ్వింశః సర్గః

*(సీతాదేవి తన కిక మరణమే శరణమని తలంచుట)*

ప్రసక్తాశ్రుముఖీ త్యేవం బ్రువంతీ జనకాత్మజా,
అధోముఖముఖీ బాలా విలప్తు ముపచక్రమే. 1

ఉన్మత్తేవ ప్రమత్తేవ భ్రాంతచిత్తేవ శోచతీ,
ఉపావృత్తా కిశోరీవ వివేష్టంతీ మహీతలే. 2

రాఘవస్య ప్రమత్తస్య రక్షసా కామరూపిణా,
రావణేన ప్రమథ్యాహ మానీతా క్రోశతీ బలాత్. 3

రాక్షసీవశ మాపన్నా భర్త్స్యమానా సుదారుణమ్,
చింతయంతీ సుదుఃఖార్తా నాహం జీవితు ముత్సహే. 4

న హి మే జీవితే నార్థో నైవార్థై ర్న చ భూషణైః,

---

జనకుని కూతురగు సీత కన్నులనుండి కన్నీ రొలుకుచుండగా ఇట్లు పలికి, తల వంచుకొని విలపించసాగెను. 1

ఆమె పిచ్చిదానివలె, పరాకు పడినదానివలె, నిలకడలేని మనస్సు కలది వలె, శ్రమ తొలగుటకొఱకు పొరలింపబడిన ఆడుగుఱ్ఱమువలె నేలబడి దొరలుచు ఇట్లు విలపించెను. 2

రాముడు (రాక్షసమాయ నూహింపక) అనవహితుడై యుండగా కామరూపియగు రావణు డాక్రోశించుచున్న నన్ను బలాత్కారముగ నిచటకు కొనివచ్చినాడు. 3

నే నిచట రాక్షసస్త్రీల చేతులలో చిక్కి వారు దారుణముగ బెదిరించగా, నా పతినే తలంచి శోకించుచు జీవించగోరను. 4

మహారథుడగు రాము నెడబాసి, ఈ రాక్షసాంగనల నడుమ చిక్కిన నా కీ

వసంత్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథమ్. 5
అశ్మసార మిదం నూన మథవా ప్యజరామరమ్,
హృదయం మమ యేనేదం న దుఃఖే నావశీర్యతే. 6
ధిఙ్మా మనార్యా మసతీం యాహం తేన వినా కృతా,
ముహూర్తమపి రక్షామి జీవితం పాపజీవితా. 7
కా చ మే జీవితే శ్రద్ధా సుఖే వా తం ప్రియం వినా,
భర్తారం సాగరాంతాయా వసుధాయాః ప్రియంవదమ్. 8
భిద్యతాం భక్ష్యతాం వాపి శరీరం విసృజామ్యహమ్,
న చాప్యహం చిరం దుఃఖం సహేయం ప్రియవర్జితా. 9
చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్,
రావణం కిం పునరహం కామయేయం విగర్హితమ్. 10

---

భవనములు, భూషణములు జీవితము ఎందులకు? 5

నా హృదయము రాతివలె చాల గట్టిదై యుండును. లేదా జరామరణములు లేనిదై యుండును. కావుననే దుఃఖముచే అది బ్రద్దలగుట లేదు. 6

నేను పాపవతిని, దుష్టురాలను. నా పతియగు రాము నెడబాసి యొక్క నిముషమైన జీవింపవలసినదిగాదు. అట్టిచో నిట్లు రామవిరహము సహించుచు జీవితము గడుపుచున్న నాకు నింద యగుగాక! 7

సముద్రపర్యంతము విస్తరించియున్న భూమికి ప్రభువు, ప్రియము పలుకువాడగు నా ప్రియపతి లేక నా కీ జీవితముపై గాని, సుఖములపై గాని మమకార మేమున్నది? 8

ఓ రాక్షసులారా! నన్ను చీల్చుడు, తినుడు. ఎట్లైనను నేను శరీరము విడతును. నా కాంతుని వీడి చిరకాల మీ దుఃఖమును సహింపనొల్లను. 9

నే నా రాక్షసుని నా యెడమకాలితో నైనను తాకను. అట్టిచో నింద్యుడగు ఆ రావణుని కామింపనని వేరుగా చెప్పవలెనా? 10

ప్రత్యాఖ్యాతం న జానాతి నాత్మానం నాత్మనః కులమ్,
యో నృశంసస్వభావేన మాం ప్రార్థయితు మిచ్ఛతి. 11

ఛిన్నా భిన్నా విభక్తా వా దీప్తే వాగ్నౌ ప్రదీపితా,
రావణం నోపతిష్ఠేయం కిం ప్రలాపేన వ శ్చిరమ్. 12

ఖ్యాతః ప్రాజ్ఞః కృతజ్ఞశ్చ సానుక్రోశశ్చ రాఘవః,
సద్వృత్తో నిరనుక్రోశ శ్శంకే మద్భాగ్యసంక్షయాత్. 13

రాక్షసానాం సహస్రాణి జనస్థానే చతుర్దశ,
యే నైకేన నిరస్తాని స మాం కిం నాభిపద్యతే. 14

నిరుద్ధా రావణే నాహ మల్పవీర్యేణ రక్షసా,
సమర్థః ఖలు మే భర్తా రావణం హంతు మాహవే. 15

---

క్రూరస్వభావముతో రావణుడు నన్ను కోరుచున్నాడే కాని, తన్ను నేను నిరాకరించు చుంటిననిగాని, తన వంశగౌరవమునుగాని గుర్తించుటలేదు. 11

నన్ను చీల్చినను, ముక్కలు ముక్కలుగా విభజించినను, మండుచున్న అగ్నిలో కాల్చినను రావణుని చెంతకు మాత్రము చేరను. మీ యధికప్రసంగ మేల? 12

రాముడు కైకేయి వంటి దోషవతులలో గూడ గుణమునే చూచు ప్రాజ్ఞుడు. తన కెవరు చిన్న ఉపకారము చేసినను, సంతోషించుటే గాక దానిని మరువని కృతజ్ఞుడు. తనకు చిన్న ఉపకారము చేసినవారికిని కష్టము కలిగినచో అతిదుఃఖితుడగుట యను జాలిగుణము కలవాడు. శత్రువులలో గూడ నిట్టివాడని ప్రసిద్ధి గాంచినవాడు. అట్టివాడు నాపై దయజూపి దర్శన మిచ్చుటలే దనగా అది నా అదృష్టము కొరవడుటచేతనే యని తలంతును. 13

జనస్థానమున తానొక్కడే పదునాలుగువేల రాక్షసులను సంహరించినవా డేల నన్ను రక్షింపడు? 14

స్వల్పపరాక్రమమే కల రావణుడు నన్నిచట నిరోధించినాడు. నా భర్త యుద్ధమున రావణుని చంప సమర్థుడు. 15

విరాధో దండకారణ్యే యేన రాక్షసపుంగవః,
రణే రామేణ నిహత స్స మాం కిం నాభిపద్యతే. 16

కామం మధ్యే సముద్రస్య లంకేయం దుష్ప్రధర్షణా,
న తు రాఘవబాణానాం గతిరోధీహ విద్యతే. 17

కిన్ను తత్కారణం యేన రామో దృఢపరాక్రమః,
రక్షసాపహృతాం భార్యా మిష్టాం నాభ్యవపద్యతే. 18

ఇహస్థాం మాం న జానీతే శంకే లక్ష్మణపూర్వజః,
జానన్నపి హి తేజస్వీ ధర్షణం మర్షయిష్యతి. 19

హృతేతి యోఽధిగత్వా మాం రాఘవాయ నివేదయేత్,
గృధ్రరాజోఽపి స రణే రావణేన నిపాతితః. 20

కృతం కర్మ మహత్తేన మాం తథాఽభ్యవపద్యతా,
తిష్ఠతా రావణద్వంద్వే వృద్ధేనాపి జటాయుషా. 21

---

దండకారణ్యమున రాక్షసవీరుడగు విరాధుని సంహరించిన రాము డేల నన్ను కాపాడడు? 16

సముద్రము నడుమనున్న ఈ లంక శత్రువుల కెదిరింపరాని దగుచో కావచ్చును. కాని రాముని బాణముల వేగము నాపజాలున దేదియు నిచట లేదు. 17

తిరుగులేని పరాక్రమముగల రాముడు రావణు డపహరించిన తన ప్రియ భార్య నేల కాపాడడు? 18

నే నీ లంకలో నున్నట్లు రాము డెరుగడని తలంతును. అట్లెరుగుచో తేజశ్శాలి కనుక రాక్షసుల ఈ తిరస్కారమును సహించునా? 19

నన్నిట్లు రావణు డపహరించెనని తెలిసికొని, రామునకు తెలుపగల జటాయువును సయితము రావణుడు యుద్ధమున సంహరించెను. 20

జటాయువు వృద్ధుడైనను రాముని (వంటి రాక్షసుని)తో ద్వంద్వయుద్ధము చేసి, నన్ను రక్షించుటకు మహాప్రయత్నమే చేసినాడు. 21

యది మామిహ జానీయా ద్వర్తమానాం స రాఘవః,
అద్య బాణై రభిక్రుద్ధః కుర్యా ల్లోక మరాక్షసమ్. 22
విధమేచ్చ పురీం లంకాం శోషయేచ్చ మహోదధిమ్,
రావణస్య చ నీచస్య కీర్తిం నామ చ నాశయేత్. 23
తతో నిహతనాథానాం రాక్షసీనాం గృహే గృహే,
యథాహ మేవం రుదతీ తథా భూయో న సంశయః. 24
అన్విష్య రక్షసాం లంకాం కుర్యా ద్రామ స్సలక్ష్మణః,
న హి తాభ్యాం రిపు ర్దృష్టో ముహూర్తమపి జీవతి. 25
చితాధూమాకులపథా గృధ్రమండలసంకులా,
అచిరేణ తు లంకేయం శ్మశానసదృశీ భవేత్. 26
అచిరేణైవ కాలేన ప్రాప్స్యామ్యేవ మనోరథమ్,

---

నేనిచట నున్నట్లు తెలిసినచో రాము డిప్పుడే కోపించి బాణములతో లోకమున రాక్షసులే లేకుండునట్లు చేయును. లంకానగరి నూదివేయును. సముద్రమును ఎండించి వైచును. నీచుడగు రావణుని కీర్తిప్రతిష్ఠలు నాశనము చేయును. 22,23

అంత రాముడు, తమ పతులను చంపగా నే నిపు డెటు లేడ్చుచుంటినో యంతకంటెను అధికముగ ఇంటింటను రాక్షసాంగనల రోదనము గలుగును. ఇందు సందేహము లేదు. 24

రాముడు లక్ష్మణసమేతుడై లంక నెల్ల వెదకి రాక్షససంహార మొనర్చును. వారి కంటపడి శత్రువొక్క ముహూర్తమైవను జీవింపజాలడు. 25

అంతటను రాక్షసులను కాల్చుటచే చితులనుండి పైకెగసిన పొగ క్రమ్ముకొని, గ్రద్దల సమూహములు తిరుగాడుచుండగా నీ లంక యచిరకాలముననే శ్మశానము వంటి దగును. 26

అచిరకాలముననే నా మనోరథ మీడేరును. మీ దుర్మార్గమే మీకు కలుగనున్న

దు(ష్ప్రస్థానోఽయ మాఖ్యాతి సర్వేషాం వో విపర్యయమ్. 27

యాదృశా నీహ దృశ్యంతే లంకాయా మశుభాని వై,
అచిరేణ తు కాలేన భవిష్యతి హతప్రభా. 28

నూనం లంకా హతే పాపే రావణే రాక్షసాధమే,
శోషం యాస్యతి దుర్ధర్షా ప్రమదా విధవా యథా. 29

పుణ్యోత్సవసముత్థా చ నష్టభర్త్రీ సరాక్షసీ,
భవిష్యతి పురీ లంకా నష్టభర్త్రీ యథాంగనా. 30

నూనం రాక్షసకన్యానాం రుదంతీనాం గృహే గృహే,
శ్రోష్యామి నచిరాదేవ దుఃఖార్తానా మిహ ధ్వనిమ్. 31

సాంధకారా హతద్యోతా హతరాక్షసపుంగవా,
భవిష్యతి పురీ లంకా నిర్దగ్ధా రామసాయకైః. 32

---

కీడును తెలుపుచున్నది. 27

ఈ లంకలో అగపడు అశుభములను బట్టి యిది చాల త్వరలోనే కాంతిహీనమై పోగలదు. 28

పాపాత్ముడు, రాక్షసాధము డగు రావణుడు నశింపగా ఇప్పటివఱకు కాంతిమంతముగ నుండిన లంక, సంపదలన్నియు నశింపగా, పతి మరణించిన పడతివలె సొంపులేక వెలవెల పోగలదు. ఇది నిశ్చయము. 29

ఈ లంకాపురియు రాక్షసులు, రాక్షసభర్త రావణుడును మరణింపగా భర్త మరణించిన వనితవలె మంగళోత్సవములు లేనిది కాగలదు. 30

ఈ లంకలో నింటింట రాక్షసకన్యలు దుఃఖపీడితలై యేడ్చుచుండగా వారి రోదనధ్వనిని త్వరలోనే వినగలను. 31

ఎఱ్ఱని కనుకొనలు కల శూరుడగు రాముడు నేను రావణుని ఇంట నున్నట్లు తెలిసికొనునేని, ఈ లంకాపురిని తనబాణములచే తగులబెట్టును. అపుడు చీకట్లు

యది నామ స శూరో మాం రామో రక్తాంతలోచనః,
జానీయా ద్వర్తమానాం హి రావణస్య నివేశనే. 33
అనేన తు నృశంసేన రావణే నాధమేన మే,
సమయో యస్తు నిర్దిష్ట స్తస్య కాలో௨యమాగతః. 34
అకార్యం యే న జానంతి నైర్ఋతాః పాపకారిణః,
అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతి హి సాంప్రతమ్. 35
నైతే ధర్మం విజానంతి రాక్షసాః పిశితాశనాః,
ధ్రువం మాం ప్రాతరాశార్థే రాక్షసః కల్పయిష్యతి. 36
సాహం కథం కరిష్యామి తం వినా ప్రియదర్శనమ్,
రామం రక్తాంతనయన మపశ్యంతీ సుదుఃఖితా. 37
యది కశ్చిత్ ప్రదాతా మే విష స్యాద్య భవే దిహ,
క్షిప్రం వైవస్వతం దేవం పశ్యేయం పతినా వినా. 38

---

కమ్మి, కాంతి తొలిగిన లంకలోని రాక్షసవీరు లందరును నశింతురు. 32,33

క్రూరుడు, అధముడగు ఈ రావణుడు నా కిచ్చిన గడువు కూడ సమీపించినది. 34

ఈ రాక్షసులకు పాపకృత్యములు చేయుట స్వభావము. వారికి కార్యాకార్యములు తెలియవు. వారి అధర్మమువల్ల ఇపుడు గొప్ప అనర్థమే కలుగనున్నది. మాంసభక్షులగు ఈ రాక్షసులు ధర్మము నెఱుగరు. రావణుడు తప్పక నన్ను ప్రాతఃకాలభోజనమునకై ఉపయోగించును. 35,36

ఎఱ్ఱని కనుకొనలు గలవాడు, ప్రియదర్శనుడగు రాముని కానక మిక్కిలి దుఃఖించుచు నే నిపు డేమి చేయుదును? 37

నా కిపు డిచట ఎవ్వరైన విషమిచ్చువా రున్నచో, పతి నెడబాసిన నేను శీఘ్రమే యమలోకమునకు పోయెదను. 38

రామలక్ష్మణులు నేను జీవించియున్నానని యెఱుగరు. ఎఱిగియున్నచో తప్పక

నాజానా జ్జీవతీం రామ స్స మాం లక్ష్మణపూర్వజః,
జానంతౌ తౌ న కుర్యాతాం నోర్వ్యాం హి మమ మార్గణమ్. 39
నూనం మమైవ శోకేన  స వీరో లక్ష్మణాగ్రజః,
దేవలోక మితో యాత స్త్యక్త్వా దేహం మహీతలే. 40
ధన్యా దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః,
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్. 41
అథవా నహి తస్యార్థో ధర్మకామస్య ధీమతః,
మయా రామస్య రాజర్షే ర్భార్యయా పరమాత్మనః. 42
దృశ్యమానే భవేత్ ప్రీతి స్సౌహృదం నాస్త్యపశ్యతః,
నాశయంతి కృతఘ్నాస్తు న రామో నాశయిష్యతి. 43
కిం ను మే న గుణాః కేచిత్ కిం వా భాగ్యక్షయో మమ,

---

నాకై భూమండలమెల్ల వెదకుదురు. 39

నిశ్చయముగా, నా ఎడబాటు వలని శోకముతో, వీరుడగు రాముడు భూమిపై తన శరీరమును వీడి స్వర్గమున కేగియుండును. 40

అట్లు స్వర్గమున కేగిన పద్మనయనుడగు నా నాథుడు రాముని చూడజాలిన దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులును ధన్యులు. 41

రాముని స్వభావము చాల గొప్పది. అతడు రాజైనను ఋషితుల్యుడు. అతనికి ధర్మమందే ఇచ్చకాని కామమందు కాదు. అతని మనస్సు గొప్పది. అట్టివానికి భార్యతో పని ఏమి? 42

చూచుచున్ననే ప్రీతి నిలచును. చూడకున్నచో ప్రీతి యుండదు. నన్ను చూడకుండుటచే రామునకు నాపై ప్రీతి తొలగియుండునా? అట్లు జరుగదు. పూర్వము కలిగిన ప్రీతిని కృతఘ్నులు వీడుదురు. రాముడట్లు మఱచువాడు కాదు. 43

నాకు ముఖ్యుడగు రాముడు నా కగపడక యిట్లు దుఃఖముతో నశించుచున్నానే.

యాఽహం సీదామి రామేణ హీనా ముఖ్యేన భామినీ. 44
శ్రేయో మే జీవితా న్మర్తుం విహీనాయా మహాత్మనః,
రామా దక్లిష్టచారిత్రా చ్ఛూరా చ్ఛత్రునిబర్హణాత్. 45
అథవా న్యస్తశస్త్రౌ తౌ వనే మూలఫలాశినౌ,
భ్రాతరౌ హి నరశ్రేష్ఠౌ సంవృత్తౌ వనగోచరౌ. 46
అథవా రాక్షసేంద్రేణ రావణేన దురాత్మనా,
ఛద్మనా సాదితౌ శూరౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. 47
సాఽహ మేవం గతే కాలే మర్తు మిచ్ఛామి సర్వథా,
న చ మే విహితో మృత్యు రస్మిన్ దుఃఖేఽపి వర్తతి. 48
ధన్యాః ఖలు మహాత్మానో మునయ స్త్యక్తకిల్బిషాః,
జితాత్మానో మహాభాగా యేషాం న స్తః ప్రియాప్రియే. 49

---

ఇందులకు కారణము నేను చేసిన పాపమో లేక నా దురదృష్టమో తెలియకున్నది. 44

మహాత్ముడు, ఉత్తమమగు నడవడి కలవాడు, శూరుడు, శత్రువినాశకు డగు నా పతి రాము నెడబాసి జీవించుటకంటె నాకు మరణమే శ్రేయము. 45

లేక నరశ్రేష్ఠులగు రామలక్ష్మణులు మునివృత్తి నవలంబించి అడవిలో దుంపలు, పండ్లు తినుచు వనవాసులై నారా యేమి? 46

లేక దురాత్ముడగు రాక్షసరాజు రావణుడు కపటోపాయముచే రామలక్ష్మణులను వధింపలేదు గదా! 47

కాలస్థితి యిటులుండగా అన్నివిధములుగను మరణించుటకే నే నిష్టపడుచున్నాను. ఇంతటి దుఃఖము కలుగుచున్నను నాకు చావు రాకున్నది. 48

మహాధైర్య సంపన్నులు, పాపరహితులు, జితాంతఃకరణులు, మహాభాగ్యము కలవారగు మునులు ధన్యులు. ఏలననగా వారికి “ఇది మాకు ప్రియము, ఇది

ప్రియా న్న సంభవే ద్దుఃఖ మప్రియా దధికం భయమ్,
తాభ్యాం హి యే వియుజ్యంతే నమస్తేషాం మహాత్మనామ్. 50
సాऽహం త్యక్తా ప్రియేణేహ రామేణ విదితాత్మనా,
ప్రాణాం స్త్యక్ష్యామి పాపస్య రావణస్య గతా వశమ్. 51

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షడ్వింశః సర్గః.*

---

అప్రియ" మని నంసారులకు వలె ప్రియాప్రియము లుండవు. 49

ప్రియమైన దానివలన దుఃఖము కలుగక సుఖమే కలుగును. అప్రియమైనదానివలన సుఖము కలుగక మిక్కిలి దుఃఖమే కలుగును. ఎవరీ ప్రియాప్రియములు రెంటినుండియు విముక్తులో అట్టి మహాత్ములకు నమస్కారము. 50

నేను ప్రశస్తబుద్ధిశాలి, నా పతి రామునికి దూరమై, పాపి యగు రావణునకు చిక్కి జీవింపజాలను. ప్రాణములు విడచెదను." అని సీత దుఃఖించెను. 51

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదియారవ సర్గము.*

# 27. సప్తవింశః సర్గః

*(త్రిజటాస్వప్నవృత్తాంతము)*

ఇత్యుక్తాః సీతయా ఘోరా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
కాశ్చి జ్జగ్ము స్తదాఖ్యాతుం రావణస్య తరస్వినః. 1

తతః సీతా ముపాగమ్య రాక్షస్యో ఘోరదర్శనాః,
పునః పరుష మేకార్థ మనర్థార్థ మథాబ్రువన్. 2

అద్యేదానీం తవానార్యే సీతే పాపవినిశ్చయే,
రాక్షస్యో భక్షయిష్యంతి మాంసమేత ద్యథాసుఖమ్. 3

సీతాం తాభి రనార్యాభి ర్దృష్ట్వా సంతర్జితాం తదా,
రాక్షసీ త్రిజటా వృద్ధా శయానా వాక్య మబ్రవీత్. 4

ఆత్మానం ఖాద తానార్యా న సీతాం భక్షయిష్యథ,

---

అని యిట్లు సీత పలుకగా, ఆ రాక్షసాంగవలు తీవ్రముగ కోపించిరి. అందు కొందరు సీత మరణింప నిశ్చయించినదని బలవంతుడగు రావణునకు చెప్పుటకై వెడలిరి. 1

పిమ్మట భయంకరాకారులైన ఏకాక్షి మున్నగు రాక్షసవనితలు సీతను సమీపించి, అనర్థకములగు ముందు చెప్పిన మాటలనే మరల ఇట్లు పలికిరి. 2

సీతా! నీవు ఆదరమునకు తగినదానవు కావు. చచ్చెదనని పాపమున కొడిగట్టితివే. రాక్షసస్త్రీ లిపుడే ప్రీతిగా నీ మాంసము భుజింతురు. 3

అపు డట్లు రాక్షసస్త్రీలు సీతను భయపెట్టుచుండుట చూచి అప్పటివఱకు నిదురించుచున్న వృద్ధరాక్షసి త్రిజట యను నామె యిట్లనెను. 4

ఓ దుష్టరాక్షసవనితలారా! జనకుని పుత్రిక, దశరథమహారాజు కోడలు, సకలజనులకు

జనకస్య సుతా మిష్టాం స్నుషాం దశరథస్య చ. 5
స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రాక్షసానా మభావాయ భర్తు రస్యా భవాయ చ. 6

ఏవ ముక్తా స్త్రిజటయా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
సర్వా ఏవాబ్రువన్ భీతా స్త్రిజటాం తా మిదం వచః.
కథయస్వ త్వయా దృష్టః స్వప్నోఽయం కీదృశో నిశి. 7
తాసాం శ్రుత్వా తు వచనం రాక్షసీనాం ముఖాచ్చ్యుతమ్,
ఉవాచ వచనం కాలే త్రిజటా స్వప్నసంశ్రితమ్. 8

గజదంతమయీం దివ్యాం శిబికా మంతరిక్షగామ్,
యుక్తాం హంససహస్రేణ స్వయ మాస్థాయ రాఘవః,
శుక్లమాల్యాంబరధరో లక్ష్మణేన సహాగతః. 9

---

పూజ్యురాలగు సీతను తినకుడు. అట్లు తినవలెనని యున్నచో మిమ్ము మీరే తినుడు. 5

నేడు నేనొక భయంకరము, గగుర్పాటు కలిగించునది అగు కలగంటిని. ఆ కల రాక్షసవినాశమును, యీమె భర్త కభ్యుదయమును సూచించుచున్నది. 6

త్రిజట యిట్లు పలుకగనే మొదట తీవ్రముగా కోపించి, వెనువెంటనే భయపడిన యా రాక్షసాంగన లందరును 'రాత్రి నీ కగపడిన స్వప్న మెట్టిదో తెలుపుము' అని త్రిజటను ప్రశ్నించిరి. 7

వారి మాటలు విని త్రిజట ప్రాతఃకాలమున తాను చూచిన స్వప్న మెట్టిదో వివరించెను. 8

రాముడు లక్ష్మణసమేతుడై తెల్లని మాలలు, వస్త్రములు దాల్చి ఏనుగుదంతములతో చేయబడినది, అత్యంతసుందరమైనది, ఆకాశమున పోవునది, వేయిహంసలతో కూర్చబడినది యగు పల్లకి నారోహించి రాగా చూచితిని. 9

అట్లే సీతయు తెల్లని వస్త్రములు దాల్చి, సముద్రము నడుమనున్న తెల్లని కొండపై

స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లాంబరావృతా,
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వత మాస్థితా,
రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా. 10

రాఘవశ్చ మయా దృష్ట శ్చతుర్దంతం మహాగజమ్.
ఆరూఢ శ్శైలసంకాశం చచార సహలక్ష్మణః. 11

తతస్తౌ నరశార్దూలౌ దీప్యమానౌ స్వతేజసా,
శుక్లమాల్యాంబరధరౌ జానకీం పర్యుపస్థితౌ. 12

తత స్తస్య నగస్యాగ్రే హ్యాకాశస్థస్య దంతినః,
భర్త్రా పరిగృహీతస్య జానకీ స్కంధ మాశ్రితా. 13

భర్తు రంకాత్ సముత్పత్య తతః కమలలోచనా,
చంద్రసూర్యౌ మయా దృష్టా పాణినా పరిమార్జతీ. 14

తత స్తాభ్యాం కుమారాభ్యా మాస్థిత స్స గజోత్తమః,

---

నెక్కి కాంతి సూర్యునితో కూడినట్లు రామునితో కూడియుండగా స్వప్నమున చూచితిని. 10

రాముడు లక్ష్మణునితో గూడి కొండవలె నున్న నాలుగు దంతముల పెద్ద ఏనుగుపై అధిరోహించి తిరుగుచుండగా చూచితిని. 11

అంతట తమ తేజముతో ప్రకాశించు ఆ రామలక్ష్మణులు తెల్లని పుష్పమాలలు, వస్త్రములు ధరించి సీత చెంతకు వచ్చిరి. 12

పిమ్మట అట్లు తెల్లని కొండపై ఆకాశమునందు రాము డెక్కియున్న ఆ ఏనుగు మూపుపై సీతయు అధిరోహించినది. 13

అంత పద్మముల వంటి కన్నులు గల సీత రాముని ఒడినుండి లేచి సూర్యచంద్రులను తన చేతులతో పట్టుకొనుచుండగా చూచితిని. 14

పిమ్మట ఆ రామలక్ష్మణులు, విశాలనయనములు గల సీత ముగ్గురును అధిష్ఠించిన

సీతయా చ విశాలాక్ష్యా లంకాయా ఉపరి స్థితః. 15
పాండురర్షభయుక్తేన రథే నాష్టయుజా స్వయమ్,
ఇహోపయాతః కాకుత్స్థ స్సీతయా సహ భార్యయా. 16
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ వీర్యవాన్,
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభమ్,
ఉత్తరాం దిశ మాలోక్య జగామ పురుషోత్తమః. 17
ఏవం స్వప్నే మయా దృష్టో రామో విష్ణుపరాక్రమః,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ భార్యయా. 18
న హి రామో మహాతేజా శ్శక్యో జేతుం సురాసురైః,
రాక్షసై ర్వాపి చాన్యై ర్వా స్వర్గః పాపజనై రివ. 19
రావణశ్చ మయా దృష్టః క్షితౌ తైలసముక్షితః,

---

యా శ్రేష్ఠమగు ఏనుగు లంకానగరముపై నిలిచెను. 15

తెల్లని యెద్దు లెనిమిది పూన్చిన రథము నధిరోహించి రాముడు భార్యయగు సీతాదేవితో స్వయముగా నిటకు వచ్చినాడు. 16

పరాక్రమశాలి, పురుషోత్తముడగు రాముడు సోదరుడు లక్ష్మణునితో, భార్య సీతతో గూడి అత్యంతసుందరము, సూర్యునివలె తేజోవంతమగు పుష్పకవిమానము నెక్కి, ఉత్తరదిశగా పోయెను. 17

ఈ విధముగా విష్ణువునకు సాటి యగు పరాక్రమము గల రాముడు సోదరుడు లక్ష్మణునితో, భార్య సీతతో కూడి స్వప్నమున నా కగపడినాడు. 18

స్వర్గము పాపుల కెట్లు జయింప (సంపాదింప) రానిదో యట్లు మహాతేజశ్శాలి యగు రాముడు, సురులకు గాని, యసురులకు గాని, రాక్షసులకు గాని, ఇతరులకు గాని జయింప శక్యముగాడు. 19

రావణుడును శరీరమం దంతటను నూనె పూసికొని ఎఱ్ఱని వస్త్రములు దాల్చి

రక్తవాసాః పిబన్మత్తః కరవీరకృతస్రజః. 20
విమానాత్ పుష్పకా దద్య రావణః పతితో భువి,
కృష్యమాణః స్త్రియా దృష్టో ముండః కృష్ణాంబరః పునః. 21
రథేన ఖరయుక్తేన రక్తమాల్యానులేపనః,
పిబం స్తైలం హసన్ నృత్యన్ భ్రాంతచిత్తాకులేంద్రియః,
గర్దభేన యయౌ శీఘ్రం దక్షిణాం దిశ మాస్థితః. 22
పునరేవ మయా దృష్టో రావణో రాక్షసేశ్వరః,
పతితోఽవాక్ఛిరా భూమౌ గర్దభా ద్భయమోహితః. 23
సహసోత్థాయ సంభ్రాంతో భయార్తో మదవిహ్వలః,
ఉన్మత్త ఇవ దిగ్వాసా దుర్వాక్యం ప్రలపన్ బహు. 24
దుర్గంధం దుస్సహం ఘోరం తిమిరం నరకోపమమ్,

---

గన్నేరు పూలమాల ధరించి మద్యము త్రాగుచు మత్తెక్కి నేలపై బడి కలలో కనుపించెను. 20

రావణుడు బోడితల గలవాడై, నల్లని వస్త్రములు దాల్చి పుష్పకవిమానము నుండి నేలబడగా, యొక స్త్రీ అతనిని పట్టి ఈడ్చుచుండగా జూచితిని. 21

రావణుడు ఎఱ్ఱని పూలమాలలు, రక్తచందనాదులు దాల్చి, నూనె త్రాగుచు, నవ్వుచు, నాట్యము చేయుచు, భ్రాంతచిత్తుడై, యింద్రియములు అదుపు తప్పగా, గాడిదలు కట్టిన రథము నెక్కి దక్షిణదిశకు పోవుచుండగా చూచితిని. 22

మఱల రాక్షసేశ్వరుడు రావణుడు భయముచే దిక్కు తెలియక, తలక్రిందులుగా గాడిదపై నుండి భూమిపై బడుట చూచితిని. 23

అట్లు నేలబడిన రావణుడు శీఘ్రమే లేచి భయపీడితుడై, మదవివశుడై, చెడ్డమాటలు పలుకుచు, చెడువాసన కలిగి, సహింపరాక భయంకరమై, చీకట్లతో నిండి, నరకమువలె

మలపంకం ప్రవిశ్యాశు మగ్నస్తత్ర స రావణః. 25
కంఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ,
కాలీ కర్దమలిప్తాంగీ దిశం యామ్యాం ప్రకర్షతి. 26
ఏవం తత్ర మయా దృష్టః కుంభకర్ణో నిశాచరః.
రావణస్య సుతా స్సర్వే దృష్టా స్తైలసముక్షితాః. 27
వరాహేణ దశగ్రీవ శ్శింశుమారేణ చేంద్రజిత్,
ఉష్ట్రేణ కుంభకర్ణశ్చ ప్రయాతా దక్షిణాం దిశమ్. 28
ఏకస్తత్ర మయా దృష్టః శ్వేతచ్ఛత్రో విభీషణః,
శుక్లమాల్యాంబరధర శ్శుక్లగంధానులేపనః. 29
శంఖదుందుభినిర్ఘోషై ర్నృత్తగీతై రలంకృతః,
ఆరుహ్య శైలసంకాశం మేఘస్తనితనిఃస్వనమ్. 30
చతుర్దంతం గజం దివ్య మాస్తే తత్ర విభీషణః,

---

నున్న మలపు బురదలో పడి, శీఘ్రమే అందు మునిగెను. 24,25

ఎఱ్ఱని వస్త్రములు దాల్చిన యొక నల్లని యాదుది యొడలికి బురద పూసికొని, రావణుని మెడకు త్రాడుకట్టి, దక్షిణదిశకు లాగికొని పోవుచుండెను. 26

కుంభకర్ణుదును యీ విధముగనే యుండగా నేను స్వప్నమున చూచితిని. రావణుని కుమారులందరును నూనెతో తడిసిన ఒడలితో కనుపించిరి. 27

రావణుడు పందిని, ఇంద్రజిత్తు మొసలిని, కుంభకర్ణు డొంటెను ఎక్కి దక్షిణదిశగా పోయిరి. 28

ఒక్క విభీషణుడు మాత్రము తెల్లని గొడుగు దాల్చి, తెల్లని పుష్పమాలలు, తెల్లని వస్త్రములు ధరించి, తెల్లని చందనము శరీరమున పూసికొని, శంఖములు, భేరుల ధ్వనులతో, నృత్తగీతములతో నొప్పుచు పర్వతమువలె ఉన్నతమైనది, మేఘగర్జనను బోలు ఘీంకారము గలది, నాలుగు దంతములతో నొప్పునది యగు దివ్యగజమును

చతుర్భి స్సచివై స్సార్ధం వైహాయస ముపస్థితః. 31
సమాజశ్చ మయా దృష్టో గీతవాదిత్రనిఃస్వనః,
పిబతాం రక్తమాల్యానాం రక్షసాం రక్తవాససామ్. 32
లంకా చేయం పురీ రమ్యా సవాజిరథకుంజరా,
సాగరే పతితా దృష్టా భగ్నగోపురతోరణా. 33
లంకా దృష్టా మయా స్వప్నే రావణే నాభిరక్షితా,
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా. 34
పీత్వా తైలం ప్రనృత్తాశ్చ ప్రహసంత్యో మహాస్వనాః,
లంకాయాం భస్మరూక్షాయాం ప్రవిష్టా రాక్షసస్త్రియః. 35
కుంభకర్ణాదయ శ్చేమే సర్వే రాక్షసపుంగవాః,
రక్తం నివసనం గృహ్యా ప్రవిష్టా గోమయహ్రదే. 36

---

తన నలుగురు మంత్రులతో గూడి యధిరోహించి యాకాశమున నిలచెను. 29-31

వే నచట ఎఱ్ఱని మాలలు దాల్చి, ఎఱ్ఱని వస్త్రములు కట్టుకొని, తైలపానము చేయుచున్న రాక్షసుల పెద్ద గుంపును చూచితిని. వా రొనర్చు గీతవాద్యాదుల ధ్వనులు వింటిని. 32

గోపురములు, బహిర్ద్వారములు విరిగి గుఱ్ఱములు, రథములు, ఏనుగులతో సహా ఈ లంకానగరము సముద్రమున పడుటను చూచితిని. 33

రావణుడు కాపాడు ఈ లంకను రాముని దూత, బలశాలి అగు వానరు డొకడు తగులబెట్టగా కలలో చూచితిని. 34

అట్లు తగులబడి భస్మావశేషమై ప్రవేశింపరాని లంకలో రాక్షసస్త్రీలు ప్రవేశించిరి. వారు నూనె త్రాగి, బిగ్గరగా అట్టహాసము చేయుచు నృత్యము చేయుచుండిరి. 35

కుంభకర్ణుడు మున్నగు ఈ రాక్షసశ్రేష్ఠు లందరును ఎఱ్ఱని వస్త్రములు దాల్చి ఆవుపేడ నిలువయుండు గోతిలో పడిరి. 36

అపగచ్ఛత నశ్యధ్వం సీతా మాప స రాఘవః,
ఘాతయేత్ పరమామర్షీ సర్వై స్సార్ధం హి రాక్షసైః. 37

ప్రియాం బహుమతాం భార్యాం వనవాస మనువ్రతామ్,
భర్త్సితాం తర్జితాం వాపి నానుమంస్యతి రాఘవః. 38

తదలం క్రూరవాక్యై ర్వ స్సాంత్వ మే వాభిధీయతామ్,
అభియాచామ వైదేహీ మేతద్ధి మమ రోచతే. 39

యస్యా మేవంవిధః స్వప్నో దుఃఖితాయాం ప్రదృశ్యతే,
సా దుఃఖై ర్వివిధై ర్ముక్తా ప్రియం ప్రాప్నో త్యనుత్తమమ్. 40

భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః కిం వివక్షయా,
రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానా ముపస్థితమ్. 41

---

కావున ఓ రాక్షసవనితలారా! మీ రింక తొలగిపొండు. ఇచట అగపడకుడు. అచిరకాలములో రాముడు సీతను పొందును. ఆయన మిక్కిలి కోపము వహించి సకలరాక్షసులతో బాటు మిమ్ము గూడ (లేక రావణుని) వధించగలడు. 37

ఆయనకు ఇష్టురాలు, పూజనీయురాలు, వనవాసధర్మ మవలంబించినది అగు భార్య సీతను మీరు బెదరించినను, భయపెట్టినను రాముడు సహింపడు. 38

కావున మీరింతవరకు పలికిన కఠినోక్తులు చాలును. మధురవచనములే పలుకుడు. మనము సీతాదేవిని అభయము యాచించుదము. ఇదియే నాకు యోగ్య మనిపించుచున్నది. 39

దుఃఖితురాలైన ఏ వనితకు సంబంధించి యిట్టి కలను గాంతుమో, ఆమె సకల దుఃఖములు తొలగి తనకు మిక్కిలి ప్రియమైన దానిని పొందును. 40

ఓ రాక్షసాంగనలారా! ఇప్పటివరకు మన మీమెను బెదరించితిమి కదా. ఇపుడు మమ్ము కాపాడుమని ఎట్లు కోరుదుమని సంకోచము వలదు. అట్లు బెదరించియున్నను కాపాడుమని ఆమెను కోరుడు. రామునివలన రాక్షసులకు గొప్ప భయము వాటిల్లనున్నది. 41

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా,
అల మేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్. 41

అపి చాస్యా విశాలాక్ష్యా న కించి దుపలక్షయే,
విరూపమపి చాంగేషు సుసూక్ష్మమపి లక్షణమ్. 43

ఛాయావైగుణ్యమాత్రం తు శంకే దుఃఖ ముపస్థితమ్,
అదుఃఖార్హా మిమాం దేవీం వైహాయస ముపస్థితామ్. 44

అర్థసిద్ధిం తు వైదేహ్యాః పశ్యా మ్యహ ముపస్థితామ్,
రాక్షసేంద్రవినాశం చ విజయం రాఘవస్య చ. 45

నిమిత్తభూత మేతత్తు శ్రోతు మస్యా మహత్ ప్రియమ్,
దృశ్యతే చ స్ఫురచ్చక్షుః పద్మపత్ర మివాయతమ్. 46

ఈషచ్చ హృషితో వాస్యా దక్షిణాయా హ్యదక్షిణః,

---

జనకుని కూతురు సీతకు ప్రణామముచేసిన చాలును, మన యపరాధములు మన్నించి ప్రసన్నురాలగును. ఓ రాక్షసాంగనలారా! ఈమె రానున్న ఉపద్రవమునుండి మనలను కాపాడగలుగును. 42

అంతేకాదు; విశాలమగు నేత్రములు గల యీామె అవయవములలో నించుకైన వైకల్యము లేక, దుఃఖప్రాప్తిని సూచించు లక్షణమేదియు కనపడుటలేదు. 43

దుఃఖము లనుభవింపదగనిదై, విమానము మున్నగు దివ్యభోగములకు తగిన ఈమె శరీరమున కాంతి యొకింత తగ్గుటచే మాత్రమే యీామె కీ దుఃఖము కలిగినదని యూహించుచున్నాను. 44

రాక్షసరాజు నశించుట, రాముడు జయించుట అను నీ కార్యసిద్ధి సీతాదేవికి నమీపకాలములోనే జరుగనున్నటులు నా కగపడుచున్నది. 45

తామరరేకువలె విశాలమైన యీామె (ఎడమ) కన్ను అదరుచు కనుపించుచున్నది. ఇది యీామె తనకు మిక్కిలి అభిమతమగు వార్తను వినగలదని సూచించుచున్నది. 46

అకస్మాదేవ వైదేహ్యా బాహు రేకః ప్రకంపతే. 47

కరేణుహస్తప్రతిమ స్సవ్య శ్చోరు రనుత్తమః,
వేపమాన స్సూచయతి రాఘవం పురతః స్థితమ్. 48

[1]పక్షీ చ శాఖానిలయం ప్రవిష్టః
పునః పున శ్చోత్తమసాంత్వవాదీ,
సుస్వాగతాం వాచ ముదీరయానః
పునః పున శ్చోదయతీవ హృష్టః. 49

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తవింశః సర్గః.*

---

మనలను రక్షింప సమర్థురాలగు ఈ సీతాదేవి యెడమభుజ మొకింత పులకితమై యాకస్మికముగ కంపించుచున్నది. 47

ఆడేనుగు తొండమువంటి యీామె యెడమతొడ కొంచెముగా అదరుచు రాముడు శీఘ్రమే నీ ఎదుట నిలుచునని సూచించుచున్నది. 48

కొమ్మలపైన నివసించు యీ పింగళపక్షి మిక్కిలి సంతోషముతో కూడినదై, మాటిమాటికి (ఉత్తరోత్తర) మధురముగ కూయుచు, సీత కభిమతుడగు బంధువు వచ్చునని స్వాగతము పలుకుచు రామాగమనమును చెప్పుచున్నది వలె నున్నది. 49

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదియేడవ సర్గము.*

---

1. ఈ శ్లోకమును పూర్వాచార్యు లిట్లు వ్యాఖ్యానించిరి:

పక్షి అనగా ప్రశస్తపక్షములు (తెక్కలు) కల *గరుడపక్షి*. అది తెక్కలు చాచుకొని ప్రదక్షిణముగ తిరుగుచు వచ్చి, చిగిర్చి పుష్పించియున్న కొమ్మపై దృఢముగా కూర్చుండెను. శాఖ అనగా మిక్కిలి తేమగల చెట్టుయొక్క భాగము. ప్రదక్షిణముగ తిరుగుట, ఆర్ద్రశాఖపై దిగుట, మిక్కిలి దృఢముగా కూర్చుండుట శుభసూచకము. ఆ శాఖపై కూర్చుండి ప్రహర్షమును పొందినది. దానిపై లభించు పండు తినుట మున్నగువానిచే సంతోషించినది. మాటిమాటికి ఉత్తమసాంత్వవచనము చేయుచున్నది అనగా ఉత్తరోత్తరముగా ప్రీతివచనము పలుకుచున్నది.

"నీవు శోకింపకుము. నీ పతి శీఘ్రమే రాగలడు. ఇది శోకింపదగిన సందర్భము కా"దని ఓదార్చుచున్నదో అన్నటులున్నది. స్వాగతవాక్యము పలుకుచున్నది. యనగా రామునకు నీకంటె నధికసంతాపము కలుగుచున్నదని చెప్పుచున్నటు లున్నది. విరహక్లేశము నొందిన యామెకు స్వాగతము పలుకుట యనగా నీ విరహ మెవ్వనితోనో అట్టి రాము డింతకంటెను విరహసంతప్తుడై యున్నాడు సుమా అని తెలుపుటయే. మాటిమాటికి చోదనము (ప్రేరణ) చేయుట యనగా ప్రియునిరాక తప్పదని తెలిసెను కదా. నీ వింక స్నానాలంకరణాదుల నేల చేసికొనవని సీతను ప్రేరణ చేయుచున్నది వలె నని ఉత్ప్రేక్ష. హృష్టః=హర్షించినది. అనగా నాయకుడు వచ్చు సమయమున కలుగు హర్షము తనదే యని దాని సూచనమును గగుర్పాటు నొందిన కేశములచే గరుడుడు సూచించుచున్నటు లుండెను.

రామాయణ ముత్తమకావ్యము. అది యెట్లన, కావ్యము ఉత్తమము, మధ్యమము, అధమమని మూడు విధములు. ఏ కావ్యమున వ్యంగ్యము వాచ్యము నతిశయించునో అది యుత్తమకావ్యము. దీనినే ధ్వని యందురు. ఏ కావ్యమున వ్యంగ్యము వాచ్యచమత్కారమును మించదో యది మధ్యమకావ్యము. దీనికే గుణీభూతవ్యంగ్యమనియు పేరు. ఏ కావ్యమున వ్యంగ్యమే యుండదో అది అధమకావ్యము. దీనినే చిత్రకావ్య మందురు. వ్యంగ్యము పదమం దుండునది, వాక్యమం దుండునది, ప్రబంధమం దుండునది యని త్రివిధము. ఈ సుందరకాండరూపమగు ప్రబంధముచే అనాదిగా భవత్సంబంధము కల చేతనుని ఉజ్జీవింపజేయుటలో వ్యాపృతుడైన ఆచార్యుని ప్రవృత్తి సూచింపబడుచున్నది. ఈ విషయము "తతో రావణనీతాయాః" (సుం. కాం. 1-1) అను శ్లోక వివరణావసరమున చెప్పబడినది. ఇందు లంకాపదముచే శరీరము సూచితము. ఏకాక్షి మున్నగు రాక్షసాంగన లింద్రియములు. రావణ కుంభకర్ణు లహంకార మమకారములు, ఇంద్రజిత్తు మున్నగువారు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య, దంభాదులు. అట్టి లంకలో నిర్బంధింపబడిన సీతవంటివాడు చేతనుడు. ఆ చేతనునకు జ్ఞానోపదేశకు డగుటచే ఆచార్యతుల్యుడు మారుతి. అట్టి ఆచార్యుని లక్షణ మీ శ్లోకముచే సూచింపబడుచున్నది. పక్షీ-పక్షిశబ్దముచే గమనసాధనములగు జ్ఞానకర్మలు చెప్పబడును. (ఉభాభ్యా మేవ పక్షాభ్యాం యథా ఖే పక్షిణాం గతిః, తథైవ జ్ఞానకర్మభ్యాం నియతా పరమా గతిః) 'బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసాఽనాశకేన' అను శ్రుతిచే అంగాంగిభావముచే జ్ఞానకర్మలు రెంటికిని సంగ్రహము. దీనినే -

"ఆచినోతి హి శాస్త్రార్థా నాచారే స్థాపయత్యపి,
స్వయ మాచరతే యస్మా త్తస్మా దాచార్య ఉచ్యతే".

అని ఆచార్యశబ్దనిర్వచనము చేయబడినది. శాఖాశబ్దముచే వేదశాఖలు చెప్పబడుచున్నవి.

నిలయశబ్దముచే వానియం దేకతాత్పర్యము కలిగియుండుట చెప్పబడినది. వానిని త్యజించుచో ప్రత్యవాయము చెప్పబడినది కనుక దీనినే శిక్ష యిట్లు చెప్పుచున్నది-

'అధీతమపి యో వేదం విముంచతి నరాధమః,

భ్రూణహా స తు విజ్ఞేయో వియోవి మధిగచ్ఛతి' అని.

మఱియు నిలయశబ్దముచే ఆ వేదార్థవిషయకమగు శ్రవణము, మననము, నిదిధ్యాసనము అను తదనుష్ఠానత్రయము చెప్పబడును. దీనిచే -

ఆచార్యో వేదసంపన్నో విష్ణుభక్తో విమత్సరః,

మంత్రజ్ఞో మంత్రభక్తశ్చ సదా మంత్రాశ్రయ శ్శుచిః.

గురుభక్తిసమాయుక్తః పురాణజ్ఞో విశేషతః,

ఏవం లక్షణసంపన్నో గురు రిత్యభిధీయతే'

అని ఆచార్యలక్షణము చెప్పబడినది. ప్రహృష్టః అనగా సదా సంతుష్టహృదయుడు. దీనిచే సర్వవిధములుగా సేవనీయుడగుట చెప్పబడినది.

'అహ్లాదశీతనేత్రాంబుః పులకీకృతగాత్రవాన్,

సదా పరగుణావిష్టో ద్రష్టవ్య స్సర్వదేహిభిః' అని.

పునః పునశ్చోత్తమసాంత్వవాదీ – ఉత్తము లనగా 'ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ' అని చెప్పబడిన పరమాత్మ. ఆ పరమాత్మవిషయక మగు సాంత్వమును శిష్యులకు చెప్పువాడు ఉత్తమసాంత్వవాది. పునః పునః అనుదానిచే కర్షకు డొకసారి వ్యవసాయము ఫలింపకున్నను కృషిని విడువక మాటి మాటికి కృషియందే ప్రవర్తించునట్లు, ఆచార్యుడును శిష్యు డొకప్పుడు తన వచనమును వినకున్నను చెప్పుట మానడని చెప్పబడినది. దీనిచే భగవంతునికంటె ఆచార్యుని గొప్పదనము చెప్పబడినది. భగవంతుడు అర్జునునకు గీతోపదేశ మొనర్చి, ఆశ్వమేధికపర్వమున అర్జునుడు ముందు చెప్పిన ఉపదేశము మఱచి మఱల నడుగగా 'నూనమశ్రద్దధానోఽసి దుర్మేధా శ్చాపి పాండవ' అని మఱల నేను చెప్పననెను. మఱియు, 'సుస్వాగతాం వాచ ముదీరయానః' చక్కగా సంప్రదాయమునకు విఘాతము కలుగకుండునట్లు ఆచార్యపరంపరగా తనకు వచ్చిన అష్టాక్షరాది మంత్రరాజరూపమగు వాక్కును నిర్హేతుకమగు దయతోడనే పలుకుచు 'ఆచార్యాణా మసౌ వసౌ. విత్యాభగవత్తః" అని గురుపరంపర వనుసంధింపదగుట దీనిచే సూచితము. 'పునః పున శ్చోదయతీవ' అవగా తాను చెప్పిన విషయము ననుష్ఠించుటకు ప్రేరణను చూపుచున్నారు. లేనిచో నుపదేశ మనర్థకము కాగలదు. అందువలననే ఆచార్యులు 'స్థాలిత్యే శాసితారం' అని గురువునుగూర్చి నుడివిరి. 'హృష్ట' హర్షము నొందినవా డనుటచే శిష్యశిక్షణమే ఆచార్యుని స్వప్రయోజనమని చెప్పబడినది. '(తనిశ్లోకి)

# 28. అష్టావింశః సర్గః

*(సీత జడతో ఉరిపోసికొని మరణింపదలంచుట)*

సా రాక్షసేంద్రస్య వచో నిశమ్య, తద్రావణ స్యాప్రియ మప్రియార్తా,
సీతా వితత్రాస యథా వనాంతే, సింహాభిపన్నా గజరాజకన్యా. 1
సా రాక్షసీమధ్యగతా చ భీరు, ర్వాగ్భిర్ భృశం రావణతర్జితా చ,
కాంతారమధ్యే విజనే విసృష్టా, బాలేవ కన్యా విలలాప సీతా. 2
సత్యం బతేదం ప్రవదంతి లోకే, నాకాలమృత్యు ర్భవతీతి సంతః,
యత్రాహమేవం పరిభర్త్స్యమానా, జీవామి కించిత్ క్షణమప్యపుణ్యా. 3
సుఖాద్విహీనం బహుదుఃఖపూర్ణ, మిదం తు నూనం హృదయం స్థిరంమే,
విశీర్యతే యన్న సహస్రధాఽద్య, వజ్రాహతం శృంగమివాచలస్య. 4

---

ఆ సీత రాక్షసరాజగు రావణుడు పలికిన అప్రియవచనములు విని, దుఃఖితయై యడవిలో సింహమునకు చిక్కిన యాడేనుగు వలె భయము నొందెను. 1

పిరికి దగు ఆమె రాక్షసస్త్రీల నడుమ చిక్కి, పరుషోక్తులచే రావణుడు చాల భయపెట్టగా, నిర్జనమగు అరణ్యమధ్యమున విడువబడిన బాలిక వలె విలపించెను. 2

అయ్యో! రాక్షసులు నన్నిట్లు భయపెట్టుచున్నను, పుణ్యము లేనిదాన నగుటచే ప్రాణములు విడువక క్షణమైనను బ్రతుకుచున్నాను. అకాలమున మృత్యువు కలుగదని సజ్జనులు పలుకుమాట మిక్కిలి యథార్థము. 3

నా హృదయము సుఖములకు దూరమై, బహుదుఃఖభరితమయ్యును చాల స్థిరమైనది. కావుననే ఇంతటి దురవస్థ నొందినను వజ్రాయుధముచే వ్రయ్యలు చేయబడిన పర్వతశిఖరము వలె ఇది వేయి ముక్క లగుటలేదు. 4

నైవాస్తి దోషో మమ నూనమత్ర, వధ్యాహ మస్యాప్రియదర్శనస్య,
భావం న చాస్యాహమనుప్రదాతు, మలం ద్విజో మంత్ర మివాద్విజాయ. 5
నూనం మమాంగా న్యచిరా దనార్య, శ్శస్త్రైశ్శితై శ్ఛేత్స్యతి రాక్షసేంద్రః,
తస్మి న్ననాగచ్ఛతి లోకనాథే, గర్భస్థజంతో రివ శల్యకృంతః. 6
దుఃఖం బతేదం మమ దుఃఖితాయా, మాసౌ చిరా యాధిగమిష్యతో ద్వౌ,
బద్ధస్య వధ్యస్య తథా నిశాంతే, రాజాపరాధా దివ తస్కరస్య. 7
హా రామ హా లక్ష్మణ హా సుమిత్రే, హా రామమాత స్సహ మే జనన్యా,
ఏషా విపద్యా మ్యహ మల్పభాగ్యా, మహార్ణవే నౌరివ మూఢవాతా. 8
తరస్వినౌ ధారయతా మృగస్య, సత్త్వేన రూపం మనుజేంద్రపుత్రౌ,

---

నే నాత్మహత్య చేసికొనుట దోషముకాదు. చూచువారికి రోత కలిగించు రావణునిచే నే నెట్లును చావక తప్పదు. అంతకంటె ఆత్మహత్యయే నయము. అట్లుకాక, రావణునకు వశవడి ప్రాణములు నిలుపుకొనుటయు తగదు. ద్విజుడు ద్విజేతరునకు మంత్రోపదేశము చేయుటవలె, నేను నా హృదయమును ఆ రాక్షసుని కర్పింపలేను. 5

లోకనాథుడగు నా పతి రెండు నెలలు గడువు ముగియులోపల నిట కేతెంచనిచో, ఈ అయోగ్యుడగు రావణుడు, శస్త్రచికిత్సకుడు కడుపులో నున్న మృతశిశువును వెలికి తీయుటకు ముక్కలు ముక్కలు చేసినట్లు వాడియైన ఆయుధములతో నా అవయవములను ముక్కలు చేయగలడు. 6

రాజాపచారము చేసి, ప్రాతఃకాలమున వధించుటకై యా రాత్రి బంధింపబడియున్న దొంగ కెట్టి దుఃఖము కలుగునో యట్లే చిరకాలముగ దుఃఖితురాలనైన నాకు ఈ రెండు నెలల గడువు సమీపించుచున్నదే యని దుఃఖము కలుగుచున్నది. 7

హా రామా! లక్ష్మణా! సుమిత్రా! ఓ నా తల్లీ! రామమాతవగు కౌసల్యాదేవీ! అల్ప భాగ్యము గల నేను మహాసముద్రమున సుడిగాలి తాకిడికి చిక్కిన ఓడవలె నిట్లు ఆపదల నందుచున్నాను. 8

లేడిరూపమును ధరించిన దుష్టప్రాణి, పిడుగుపాటు రెండు సింహములను

నూనం విశస్తౌ మమ కారణా త్తౌ, సింహర్షభౌ ద్వావివ వైద్యుతేన. 9
నూనం స కాలో మృగరూపధారీ, మా మల్పభాగ్యాం లులుభే తదానీమ్,
యత్రార్యపుత్రం విససర్జ మూఢా, రామానుజం లక్ష్మణపూర్వజం చ. 10
హా రామ సత్యవ్రత దీర్ఘబాహో, హా పూర్ణచంద్రప్రతిమానవక్త్ర,
హా జీవలోకస్య హితః ప్రియశ్చ, వధ్యాం న మాం వేత్సి హి రాక్షసానామ్. 11
అనన్యదేవత్వ మియం క్షమా చ, భూమౌ చ శయ్యా నియమశ్చ ధర్మే,
పతివ్రతాత్వం విఫలం మమేదం, కృతం కృతఘ్నేష్వివ మానుషాణామ్. 12
మోఘో హి ధర్మశ్చరితో మయా౽యం, తథైకపత్నీత్వమిదం నిరర్థమ్,
యా త్వాం న పశ్యామి కృశా వివర్ణా, హీనా త్వయా సంగమనే నిరాశా. 13

---

చంపినట్లు వేగవంతులగు ఆ రాజపుత్రులను నా కారణముగ వధించియుండును. 9

నిశ్చయముగ ఆ యముడే లేడి రూపు దాల్చి అల్పభాగ్యము గల నన్నపుడు లోభపెట్టినాడు. కావుననే నే నపుడు తెలివిలేక రామలక్ష్మణులను పంపితిని. 10

అయ్యో! సత్యవ్రతుడవు, దీర్ఘభుజుడవు, పూర్ణచంద్రునితో సమానమగు ముఖము కలవాడవు, జీవు లెల్లరకు ప్రియుడవు హితుడవగు రామా! నేను రాక్షసులచే చంపబడనుండుట నెఱుగకుంటివి గదా. 11

పతిని దక్క అన్యుని దైవముగా కొలువకుండుట, రాక్షసుల దారుణవచనముల నిట్లు సహించుట, భూమిపై పరుండుట, నీవే రక్షకుడ వని రక్షకత్వధర్మమును ఏర్పరచుకొనుట, భర్త ననుసరించుట యను నియమమునే అంటిపెట్టుకొనియుండుట యను నా యీ వ్రత మంతయు మనుజులలో కృతఘ్నులకు చేసిన ఉపకారము వలె విఫలమైనది. 12

నా ధర్మాచరణ మంతయు నిష్ప్రయోజనమైనది. అట్లే నా ఏకపత్నీవ్రతము కూడ నిరర్థకమైనది. కావుననే నేను నిన్ను గానకున్నను, కృశించి, కళతప్పి, నీవు చెంతలేక, నిన్ను కలిసికొనగలనను ఆశయైనను లేనిదాన నగుచున్నాను. 13

పితు ర్నిదేశం నియమేన కృత్వా, వనా న్నివృత్త శ్చరితవ్రతశ్చ,
స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభి, స్త్వం రంస్యసే వీతభయః కృతార్థః. 14

అహం తు రామ త్వయి జాతకామా, చిరం వినాశాయ నిబద్ధభావా,
మోఘం చరిత్వా చ తపోవ్రతం చ, త్యక్ష్యామి ధిగ్ జీవిత మల్పభాగ్యా. 15

సా జీవితం క్షిప్రమహం త్యజేయం, విషేణ శస్త్రేణ శితేన వాపి,
విషస్య దాతా న హి మేఽస్తి కశ్చి, చ్ఛస్త్రస్య వా వేశ్మని రాక్షసస్య. 16

ఇతీవ దేవీ బహుధా విలప్య, సర్వాత్మనా రామ మనుస్మరంతీ,
ప్రవేపమానా పరిశుష్కవక్త్రా, నగోత్తమం పుష్పిత మాససాద. 17

శోకాభితప్తా బహుధా విచింత్య, సీతాఽథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా,

---

వనవాసరూపమగు తండ్రి యాజ్ఞను నియమముతో పాలించి, వన్యవృత్తివ్రతమును యథావిధిగ నిర్వహించి, యడవినుండి మఱలి వచ్చి, సకలపురుషార్థములు సాధించి, వనవాసభయము తొలగిపోగా, నేను మరణించుటచే మఱల పలువురు వెడదకన్నుల స్త్రీలను పెండ్లియాడి వారితో నీవు క్రీడించెదవు. 14

రామా! నీయం దనురాగము కలదాననగు నేను ఆత్మవినాశముకొరకే, నీయందు మనసు నిలిపి, ఉపవాసనియమముల నూఱక యాచరించినాను. అయ్యో! తుదకు అల్పభాగ్యవతినై ప్రాణములు విడుచుచున్నాను. 15

ఇట్లు అల్పభాగ్యవతినై శీఘ్రమే విషము త్రాగి, లేదా వాడియైన ఆయుధము నుపయోగించి ఆత్మహత్య చేసికొనెదను. కాని, ఈ రాక్షసులిందరిలో నాకు విషమిచ్చువారు గాని, ఆయుధమిచ్చువారు గాని లేకున్నారు. 16

అని యిట్లు సీతాదేవి పలువిధముల విలపించి, పరిపూర్ణభావముతో రామునే తలంచుచు, భయముతో వణకుచు, నోరెండగా, పూచిన యా శింశుపావృక్షముకడకు వచ్చెను. 17

ఆ సీత యట్లు శోకపీడితయై పలువిధములుగా చింతించి, తన జడమ పట్టుకొని

ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్ర, మహం గమిష్యామి యమస్య మూలమ్. 18
ఉపస్థితా సా మృదుసర్వగాత్రీ
శాఖాం గృహీత్వాఽథ నగస్య తస్య,
తస్యాస్తు రామం ప్రవిచింతయంత్యా
రామానుజం స్వం చ కులం శుభాంగ్యాః. 19
శోకానిమిత్తాని తథా బహూని, ధైర్యార్జితాని ప్రవరాణి లోకే,
ప్రాదు ర్నిమిత్తాని తదా బభూవుః, పురాపి సిద్ధా న్యుపలక్షితాని. 20

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టావింశః సర్గః.*

---

"నే నీ జడను మెడకు ఉరిపోసికొని యముని చెంత కేగెద"నని తలంచెను. 18

కోమలమైన సకలావయవములు గల సీత యట్లు తలపోసి యా శింశుపావృక్షపు కొమ్మను గట్టిగా పట్టుకొని నిలచెను. ఇట్లు రాముని, లక్ష్మణుని, తన వంశమును తలచుకొనుచున్న యా శుభాంగి యగు సీతకు శుభసూచకములు, లోకప్రసిద్ధములు, పూర్వము సత్ఫలము నిచ్చినట్టివి అగు శకునములు కాననయ్యెను. 19,20

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువదియెనిమిదవ సర్గము.*

# 29. ఏకోనత్రింశః సర్గః

*(సీత శుభశకునములు చూచుట)*

తథాగతాం తాం వ్యథితామనిందితాం, వ్యపేతహర్షాం పరిదీనమానసామ్,
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే, నరం శ్రియా జుష్ట మివోపజీవినః. 1
తస్యా శ్శుభం వామ మరాళపక్ష్మ, రాజీవృతం కృష్ణవిశాలశుక్లమ్,
ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా, మీనాహతం పద్మమివాభితామ్రమ్. 2
భుజశ్చ చార్వంచితపీనవృత్తః, పరార్థ్యకాలాగరుచందనార్హః,
అనుత్తమేనాధ్యుషితః ప్రియేణ, చిరేణ వామ స్సమవేపతాశు. 3
గజేంద్రహస్తప్రతిమశ్చ పీన, స్తయోర్ద్వయో స్సంహతయో స్సుజాతః,
ప్రస్పందమానః పున రూరురస్యా, రామం పురస్తాత్ స్థితమాచచక్షే. 4

---

అట్లు వచింపశక్యముగాని దుఃఖము కలదియు, యిటుపైన నే కష్టములు వచ్చునో యని వ్యథ చెందినదియు, రాము నెడబాసినను తన ధర్మమునకు కట్టుబడి దోషరహితయై యున్నదియు, హర్షము తొలగినదియు, దీనమైన మనస్సు కలదియు అగు సీతను, సంపద నొందినవాని చెంతకు సేవకు లేతెంచునట్లు శుభశకునము లాశ్రయించినవి. 1

శుభమైనది, వంకరలయిన తెప్ప వెండ్రుకలు కలది, నడుమ నల్లనై చుట్టును తెల్లనై కొనలయం దెఱ్ఱనైన దగు సీతాదేవి యెడమకన్ను, చేపచే కొట్టబడిన కమలమువలె అదరెను. 2

సొగసై, మంచి బలుపు కలిగి, గుండ్రనై, మేలయిన కృష్ణాగరుచందనలేపమునకు తగినది, పురుషశ్రేష్ఠుడు రామునకు చిరకాలము తలగడయైన సీతాదేవి యెడమ భుజము శీఘ్రమే కంపించెను. 3

ఏనుగు తొండమువలె లావై, బలిసి, సుందరమైన ఆమె తొడలలో యెడమతొడ బాగుగా కంపించుచు, "రాముడు నీముందే యున్నా"డని సూచించెను. 4

శుభం పునర్హేమసమానవర్ణ, మీషద్రజోధ్వస్త మివామలాక్ష్యాః,
వాసస్స్థితాయాశ్శిఖరాగ్రదత్యాః, కించిత్పరిస్రంసత చారుగాత్ర్యాః 5
ఏతై ర్నిమిత్తై రపరైశ్చ సుభ్రూః, స్సంబోధితా ప్రాగపి సాధు సిద్ధైః,
వాతాతపక్లాంత మివ ప్రణష్టం, వర్షేణ బీజం ప్రతిసంజహర్ష 6
తస్యాః పునర్బింబఫలాధరోష్ఠం, స్వక్షిభ్రు కేశాంత మరాళపక్ష్మ,
వక్త్రం బభాసే సితశుక్లదంష్ట్రం, రాహోర్ముఖాచ్చంద్ర ఇవ ప్రముక్తః 7
సా వీతశోకా వ్యపనీతతంద్రీ, శాంతజ్వరా హర్షవివృద్ధసత్త్వా,
అశోభతార్యా వదనేన శుక్లే, శీతాంశునా రాత్రిరి వోదితేన. 8

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకోనత్రింశః సర్గః.*

---

నిర్మలములైన నేత్రములు, మొనలుదేరిన పలువరున, సుందరావయవములు కల సీతాదేవి ధరించినది, కొంచెముగా దుమ్ముపడి కాంతి తగ్గియున్నది బంగారువన్నె గలది అగు శుభప్రదమైన చీర యొకింత జారినది. 5

పూర్వమే సత్ఫలము నిచ్చునవిగా అనుభవముచే నిర్ణయించబడిన ఈ పూర్వోక్త శకునములచేతను, ఇంకను మతికొన్నింటిచేతను రామసమాగమము నూహించినదై సీతాదేవి పెనుగాలి - యెండల తాకిడికి ఎండి, గుర్తు పట్టరాని విత్తనము వర్షము పడుటతోడనే మొలకెత్తినట్లు ఆనందించెను. 6

దొండపండువలె ఎఱ్ఱని పెదవి కలది, సుందరములగు నేత్రములు, కనుబొమలు, ముంగురులు కలది, వంకరలైన కనురెప్పలు గలది, మిక్కిలి తెల్లని దంతములు కలది యగు సీతమోము రాహువు నోటినుండి విడువబడిన చంద్రునివలె ప్రకాశించెను. 7

పూజ్యురాలగు సీత ఆ శుభశకునములచే శోకము తొలగి, మాంద్యము వీడి, తాప ముడిగి, ఆనందమువలన మనోవికాసము నొంది, శుక్లపక్షపు చంద్రునిచే రాత్రి ప్రకాశించినట్లు శోభిల్లెను. 8

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఇరువది తొమ్మిదవ సర్గము.*

# 30. త్రింశః సర్గః

*(హనుమంతుడు సీత నోదార్పదలంచుట)*

హనుమానపి విక్రాంత స్సర్వం శుశ్రావ తత్త్వతః,
సీతాయా స్త్రిజటాయాశ్చ రాక్షసీనాం చ తర్జనమ్. 1

అవేక్షమాణ స్తాం దేవీం దేవతామివ నందనే,
తతో బహువిధాం చింతాం చింతయామాస వానరః. 2

యాం కపీనాం సహస్రాణి సుబహూ న్యయుతాని చ,
దిక్షు సర్వాసు మార్గంతే సేయ మాసాదితా మయా. 3

చారేణ తు సుయుక్తేన శత్రో శ్శక్తి మవేక్షతా,
గూఢేన చరతా తావ దవేక్షిత మిదం మయా. 4

రాక్షసానాం విశేషశ్చ పురీ చేయ మవేక్షితా,

---

పరాక్రమశాలియగు హనుమంతుడు సీతావృత్తాంతము, త్రిజటాస్వప్నవృత్తాంతము, సీతను రాక్షసాంగనలు బెదరించుట యను నీ సర్వమును యథాతథముగ వినెను. 1

నందనవనమందున్న దేవతవలె ఆ యశోకవనమున నున్న సీతను చూచి హనుమంతుడు పరిపరివిధములుగా ఆలోచించెను. 2

ఏ సీతకై వేలు, పదివేల కొలది వానరు లన్ని దిక్కులందును వెదకుచున్నారో అట్టి యీమెను నేను చూడగలిగితిని. 3

చక్కగా సీతాన్వేషణము చేయుటకు నియమితుడనై శత్రువు శక్తిని పరిశీలించుచు, రహస్యముగా సంచరించుచు నే నంతయు గమనించితిని. 4

రాక్షసుల విశిష్టత, ఈ పట్టణపరిసరములు, రాక్షసరాజు రావణుని ప్రభావములను

రాక్షసాధిపతే రస్య ప్రభావో రావణస్య చ. 5
యుక్తం తస్యాప్రమేయస్య సర్వసత్త్వదయావతః,
సమాశ్వాసయితుం భార్యాం పతిదర్శనకాంక్షిణీమ్. 6
అహ మాశ్వాసయా మ్యేనాం పూర్ణచంద్రనిభాననామ్,
అదృష్టదుఃఖాం దుఃఖార్తాం దుఃఖస్యాంత మగచ్ఛతీమ్. 7
యద్యహ మిమాం దేవీం శోకోపహతచేతనామ్,
అనాశ్వాస్య గమిష్యామి దోషవద్ గమనం భవేత్. 8
గతే హి మయి తత్రేయం రాజపుత్రీ యశస్వినీ,
పరిత్రాణ మవిందంతీ జానకీ జీవితం త్యజేత్. 9
మయా చ స మహాబాహుః పూర్ణచంద్రనిభాననః,
సమాశ్వాసయితుం న్యాయ్య స్సీతాదర్శనలాలసః. 10

---

నేను పరిశీలించితిని. 5

అంతులేని మహిమ సకలజీవులపై దయ గల, తన పతి రాముని చూడగోరు సీతను నే నోదార్చుట యుక్తము. 6

పూర్ణచంద్రుని బోలు ముఖము కలది, మున్నెన్నడును దుఃఖము లనుభవించనిది, దుఃఖము బాధింపగా ఎంతకును దాని నుండి బయటపడనిది యగు నీమెను నే నోదార్చెదను. 7

శోకపీడితమైన హృదయముగల యీ సీతాదేవిని ఓదార్చకయే మఱల కిష్కింధకు పోదునేని దోషము కలుగును. 8

నే నట్లు పోవుదునేని, కీర్తిశాలిని యీ సీత, రాక్షసుల బారినుండి తప్పించుకొను మార్గము తెలియక మరణించును. 9

నే నా మహాభుజుడు, పూర్ణచంద్రునిబోలు ముఖము కలవాడు, సీతను చూడవలెనని యువ్విళ్ళూరుచున్నవాడగు రాము నెట్టైన ఊఱడిల్లజేయుట న్యాయము. 10

నిశాచరీణాం ప్రత్యక్ష మనర్హం చాపి భాషణమ్,
కథం ను ఖలు కర్తవ్య మిదం కృచ్ఛ్రగతో హ్యాహమ్. 11
అనేన రాత్రిశేషేణ యది నాశ్వాస్యతే మయా,
సర్వథా నాస్తి పందేహః పరిత్యక్ష్యతి జీవితమ్. 12
రామశ్చ యది పృచ్ఛేన్మాం కిం మాం సీతాఽబ్రవీ ద్వచః,
కిమహం తం ప్రతిబ్రూయా మసంభాష్య సుమధ్యమామ్. 13
సీతాసందేశరహితం మా మిత స్త్వరయా గతమ్,
నిర్దహే దపి కాకుత్స్థః క్రుద్ధ స్తీవ్రేణ చక్షుషా. 14
యది చోద్యోజయిష్యామి భర్తారం రామకారణాత్,
వ్యర్థ మాగమనం తస్య ససైన్యస్య భవిష్యతి. 15
అంతరం త్వహ మాసాద్య రాక్షసీనా మిహ స్థితః,

---

నే నీ రాక్షసస్త్రీల సమక్షమున సీతతో మాటలాడగూడదు. ఇపు డేమి చేయవలెను? నేనిపుడు సంకటమున బడితినే! 11

నే నీ రాత్రి గడచు లోపల నీమె నూఅడిల్లచేయనిచో నీమె ప్రాణములు విడచుటలో సందేహము లేదు. 12

'సీత నా కేమని చెప్పమన్నది' అని రాము డడుగుచో, నే నామెతో మాటలాడక ఏమని చెప్పుదును? 13

సీతాసందేశము లేక తొందరపాటుతో మఱలివచ్చిన నన్ను చూచి, రాముడు కోపించి తీవ్రమగు చూపుతో కాల్చును. 14

నేను సీతాదేవి నోదార్చకయే (కిష్కింధకు పోయి) రామునికై సుగ్రీవుని యుద్ధమునకు ప్రేరణచేసి కొనివత్తునేని, అప్పటికి సీత తప్పక మరణించును. కనుక సైన్యసమేతముగా మా రాజురాక నిష్ఫలమగును. 15

నే నిచ్చటనే వేచి యుండి, రాక్షసులు తొలగిపోయి మాటలాడు అవకాశము

శనై రాశ్వాసయిష్యామి సంతాపబహుళా మిమామ్. 16

అహం త్వతితనుశ్చైవ వానరశ్చ విశేషతః,
వాచం చోదాహరిష్యామి మానుషీ మిహ సంస్కృతామ్. 17

యది వాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతామ్,
రావణం మాన్యమానా మాం సీతా భీతా భవిష్యతి. 18

వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణమ్,
అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్య మర్థవత్,
మయా సాంత్వయితుం శక్యా నాన్యథేయ మనిందితా. 19

సేయ మాలోక్య మే రూపం జానకీ భాషితం తథా,
రక్షోభి స్త్రాసితా పూర్వం భూయ స్త్రాసం గమిష్యతి. 20

తతో జాతపరిత్రాసా శబ్దం కుర్యా న్మనస్వినీ,
జానమానా విశాలాక్షీ రావణం కామరూపిణమ్. 21

---

లభింపగనే, మిక్కిలి దుఃఖపడుచున్న ఈమె నోదార్తును. 16

నేను మిక్కిలి చిన్నవాడను. విశేషించి కోతిని. నే నీమెతో సామాన్య మానవులు మాటలాడు సంస్కృతమైన (శుద్ధమగు) భాషతో మాటలాడెదను. 17

అట్లుగాక ద్విజులు వ్యవహరించు సంస్కృతభాషలో మాటలాడుదునేని యీామె నన్ను రావణుడని భ్రమించి భయపడును. 18

వానరుడెట్లు యీ రీతిని సంస్కృతమైన భాషతో మాటలాడునని ఈమె సందేహింప వచ్చును. కావున నేను అర్థవంతముగ మానుషవాక్యమే పలుకవలయును. వేరొక విధముగ ఏ దోషము లేని యీామె నోదార్పశక్యము కాదు. 19

నే నట్లు సంస్కృతమగు భాషతోనే మాటలాడుదునేని నా రూపము చూచి, నా మాటలు విని, పూర్వమే రాక్షసులకు భయపడిన సీత మరింత భయపడును. 20

పిమ్మట మానవతి విశాలాక్షి యగు ఈమె నేను కామరూపముగల రావణుడనని తలంచి భయముతో అఱచును. 21

సీతయా చ కృతే శబ్దే సహసా రాక్షసీగణః,
నానాప్రహరణో ఘోర స్సమేయా దంతకోపమః. 22

తతో మాం సంపరిక్షిప్య సర్వతో వికృతాననాః,
వధే చ గ్రహణే చైవ కుర్యు ర్యత్నం యథాబలమ్. 23

గృహ్య శాఖాః ప్రశాఖాశ్చ స్కంధాం శ్చోత్తమశాఖినామ్,
దృష్ట్వా విపరిధావంతం భవేయు ర్భయశంకితాః. 24

మమ రూపం చ సంప్రేక్ష్య వనే విచరతో మహత్,
రాక్షస్యో భయవిత్రస్తా భవేయు ర్వికృతాననాః. 25

తతః కుర్యు స్సమాహ్వానం రాక్షస్యో రక్షసామపి,
రాక్షసేంద్రనియుక్తానాం రాక్షసేంద్రనివేశనే. 26

తే శూలశక్తినిస్త్రింశవివిధాయుధపాణయః,
ఆపతేయు ర్విమర్దేఽస్మిన్ వేగే నోద్విగ్నకారిణః. 27

---

సీత యట్లు అఱవగనే వెనువెంటనే భయంకరరూపముగల రాక్షసాంగనలు నానాయుధములు చేత ధరించి మృత్యువువలె నాపైకి వత్తురు. 22

పిమ్మట అన్నివైపులనుండి వికృతరూపులగు రాక్షసాంగనలు పెద్దకొమ్మలు, చిన్నకొమ్మలు, పెద్దచెట్ల బోదెలు పట్టుకొని నన్ను చుట్టుముట్టి బంధించుటకు, వధించుటకు శక్తికొలది ప్రయత్నింతురు. నేను అన్నివైపులకు పరుగిడుచుండుట చూచి వారు భయముతో నన్ను శంకింతురు. 23,24

వనములో పరుగిడుచున్న నా పెనురూపు చూచి యీ వికృతముఖులైన రాక్షసస్త్రీలు భయముతో సందేహపడెదరు. 25

పిమ్మట ఈ రాక్షసస్త్రీలు రావణునింట కావలియున్న రాక్షసులను పిలుతురు. 26

అంతట రాక్షసులు శూలములు, శక్తులు, కోలలు మున్నగు ఆయుధములు చేత ధరించి, చూచువారికి భయము కలిగించుచు వేగముగ యుద్ధమునకు వత్తురు. 27

సంరుద్ధ స్తైస్తు పరితో విధమన్ రక్షసాం బలమ్,
శక్నుయాం న తు సంప్రాప్తుం పరం పారం మహోదధేః. 28
మాం వా గృహ్ణీయు రాప్లుత్య బహవ శ్శీఘ్రకారిణః,
స్యాదియం చాగృహీతార్థా మమ చ గ్రహణం భవేత్. 29
హింసాభిరుచయో హింస్యు రిమాం వా జనకాత్మజామ్,
విపన్నం స్యాత్తతః కార్యం రామసుగ్రీవయో రిదమ్. 30
ఉద్దేశే నష్టమార్గేఽస్మిన్ రాక్షసైః పరివారితే,
సాగరేణ పరిక్షిప్తే గుప్తే వసతి జానకీ. 31
విశస్తే వా గృహీతే వా రక్షోభి ర్మయి సంయుగే,
నాన్యం పశ్యామి రామస్య సాహాయ్యం కార్యసాధనే. 32
విమృశంశ్చ న పశ్యామి యో హతే మయి వానరః,

---

వారు న న్నన్నివైపులనుండి అడ్డగింపగా రాక్షససైన్యములను చెండాడగలను. కాని అలసి, సముద్రము దాటి అవ్వలియొడ్డుకు పోవజాలను. 28

లేదా వేగముగ వారు నాపై కెరిగి నన్ను పట్టుకొందురు. దీనిచే నా ప్రయోజనము చెడుటే గాక నన్నును వారు బంధించవచ్చును. 29

హింసించుటయందు మక్కువగల వీరీమెను చంపుదురు గూడ. అట్టిచో రామసుగ్రీవులు నా కొసగిన పని సంకటమున పడును. 30

సీతయు భూమార్గము లేకపోవుటచే ప్రవేశింపరాక, రాక్షసులతో నిండి, చుట్టును సముద్రము కల ఈ లంకలో ఎవ్వరికిని కానరాని చోట నున్నది. 31

యుద్ధమున నన్నీ రాక్షసులు చంపినను, బంధించినను రామునకు సీతయున్న తావును తెలుపగలవాడు వేరొకడు నా కగపడడు. 32

నేనెంత ఆలోచించినను నేను మరణింపగా నూరు యోజనముల వెడలుపుగల

శతయోజనవిస్తీర్ణం లంఘయేత మహోదధిమ్. 33

కామం హంతుం సమర్థోఽస్మి సహస్రాణ్యపి రక్షసామ్,
న తు శక్ష్యామి సంప్రాప్తుం పరం పారం మహోదధేః. 34

అసత్యాని చ యుద్ధాని సంశయో మే న రోచతే,
కశ్చ నిస్సంశయం కార్యం కుర్యాత్ ప్రాజ్ఞస్ససంశయమ్. 35

ప్రాణత్యాగశ్చ వైదేహ్యా భవే దనభిభాషణే,
ఏష దోషో మహాన్ హి స్యా న్మమ సీతాభిభాషణే. 36

భూతా శ్చార్థా వినశ్యంతి దేశకాలవిరోధితాః,
విక్లబం దూత మాసాద్య తమ స్సూర్యోదయే యథా. 37

అర్థానర్థాంతరే బుద్ధి ర్నిశ్చితాపి న శోభతే,

---

సముద్రమును దాటి రాముని కడకు పోగలవానిని వేఱొక్కని చూడకున్నాను. 33

వేలాది రాక్షసులను నేనొక్కడనే చంప సమర్థుడను. కాని అ పైన అలసి, ఈ మహాసముద్రపు టవ్వలియొడ్డును చేరజాలను. 34

యుద్ధమున జయాపజయము లనిశ్చితములు. నాకు సంశయముతో కూడిన పని యిష్టము కాదు. తెలివిగలవా డెవ్వడు సంశయింవదగిన పని ననాలోచితముగ చేయ సమకట్టును? 35

నే నీమెతో మాటలాడకుందువేని ఈమె తప్పక మరణించును. అట్లని ఈమెతో మాటలాడుదునేని ముందు చెప్పిన మహాదోషము కలుగును. 36

దేశకాలములను విచారింపక అవివేకి యగు దూత చేయు పనులు ఫలించనున్నవికూడ సూర్యోదయమున చీకటివలె నశించును. 37

యజమాని 'యిది కర్తవ్యము, ఇది యకర్తవ్య'మని మంత్రులతో ఆలోచించి కార్యమును నిశ్చయించినప్పటికిని తామే తెలివిగలవారమని తలంచు బుద్ధిహీనులగు

ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః. 38
న వినశ్యేత్ కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్,
లంఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్. 39
కథం ను ఖలు వాక్యం మే శృణుయా న్నోద్విజేత వా,
ఇతి సంచింత్య హనుమాం శ్చకార మతిమాన్ మతిమ్. 40
రామ మక్లిష్టకర్మాణం స్వబంధు మనుకీర్తయన్,
నైనా ముద్వేజయిష్యామి తద్బంధుగతమానసామ్. 41
ఇక్ష్వాకూణాం వరిష్ఠస్య రామస్య విదితాత్మనః,
శుభాని ధర్మయుక్తాని వచనాని సమర్పయన్. 42
శ్రావయిష్యామి సర్వాణి మధురాం ప్రబ్రువన్ గిరమ్,
శ్రద్ధాస్యతి యథా హీయం తథా సర్వం సమాదధే. 43

---

దూతలు ఆ పనులను పాడు చేయుదురు. 38

నా స్వామికార్య మెట్లు చెడకుండును? నేను వివేకహీనుడను కాకుండుట ఎట్లు? నా యీ సముద్రతరణ మెట్లు సఫలమగును? 39

ఈమె నా మాట విని భయనడకుండుట ఎట్లు? అని పలుమార్లు ఆలోచించి హనుమ యిట్లు నిశ్చయించెను. 40

అవలీలగ మహాకార్యములు సాధింపగల యీమె భర్త యగు రాముని కీర్తించుచు, ఆయనయందే మనసు నిలిపిన యీమెకు భయము కలుగకుండునట్లు చేసెదను. 41

ఇక్ష్వాకువంశ్యులలో శ్రేష్ఠుడు, బుద్ధిశాలి యగు రాముని శుభకరములు, ధార్మికములైన అన్నికృత్యములను ఈమెకడ మధురములగు మాటలతో ముచ్చటింతును. ఈమె నా మాటలపై విశ్వానము చూపునట్లు చేసెదను. 42,43

ఇతి స బహువిధం మహానుభావో
జగతిపతేః ప్రమదా మవేక్షమాణః,
మధురమవితథం జగాద వాక్యం
ద్రుమవిటపాంతరమాస్థితో హనూమాన్. 44

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రింశః సర్గః.*

---

అని ఆ మహాభావుడగు హనుమంతుడు లోకేశ్వరుడగు రాముని భార్యను చూచుచు చెట్టుకొమ్మ నడుమనుండి ఇట్లు మధురములై ఫలప్రదములగు ఈ వాక్యముల నిట్లు పలికెను. 44

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదవ సర్గము.*

# 31. ఏకత్రింశః సర్గః

*(హనుమంతుడు సీతకు రామచరితమును చెప్పుట)*

ఏవం బహువిధాం చింతాం చింతయిత్వా మహాకపిః,
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ. 1

రాజా దశరథో నామ రథకుంజరవాజిమాన్,
పుణ్యశీలో మహాకీర్తి రృజు రాసీ న్మహాయశాః. 2

రాజర్షీణాం గుణశ్రేష్ఠ స్తపసా చర్షిభి స్సమః,
చక్రవర్తికులే జాతః పురందరసమో బలే. 3

అహింసారతి రక్షుద్రో ఘృణీ సత్యపరాక్రమః,
ముఖ్య శ్చేక్ష్వాకువంశస్య లక్ష్మీవాన్ లక్ష్మివర్ధనః. 4

---

అటు లా మహావానరుడు హనుమంతుడు పరిపరివిధముల తలపోసి, సీతాదేవి సమీపమున నిట్లు మధురముగ పలికెను. 1

శ్రేష్ఠములగు రథములు, ఏనుగులు, గుఱ్ఱములు విస్తారముగ గల దశరథు డను మహారాజు ఉండెను. ఆయన పవిత్రస్వభావము కలవాడు. దాతగా గొప్ప కీర్తినందినవాడు. ఋజు (కపటము లేని) స్వభావము కలవాడు. పరాక్రమశాలిగా ప్రసిద్ధి పొందినవాడు. 2

గుణములచే రాజర్షులందరిలో శ్రేష్ఠుడు; తపముచే ఋషులకు సాటియైనవాడు. చక్రవర్తుల వంశమున పుట్టినవాడు; బలమున దేవేంద్రునితో సమానుడు. 3

అహింసాధర్మమందు మక్కువ కలవాడు. ఉదాత్తస్వభావుడు. దయాళువు. విఫలముగాని పరాక్రమము గలవాడు. ఇక్ష్వాకువంశమున ప్రధానుడు. ఉత్తమసంపద కలవాడు. ఆశ్రితుల సంపదను పెంపొందించువాడు. 4

పార్థివవ్యంజనై ర్యుక్తః పృథుశ్రీః పార్థివర్షభః,
పృథివ్యాం చతురంతాయాం విశ్రుత స్సుఖద స్సుఖీ. 5

తస్య పుత్రః ప్రియో జ్యేష్ఠ స్తారాధిపనిభాననః,
రామో నామ విశేషజ్ఞః శ్రేష్ఠ స్సర్వధనుష్మతామ్. 6

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా,
రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః. 7

తస్య సత్యాభిసంధస్య వృద్ధస్య వచనాత్ పితుః,
సభార్య స్సహ చ భ్రాత్రా వీరః ప్రవ్రాజితో వనమ్. 8

తేన తత్ర మహారణ్యే మృగయాం పరిధావతా,
రాక్షసా నిహతా శ్శూరా బహవః కామరూపిణః. 9

---

ఆ రాజశ్రేష్ఠుడు సాముద్రికశాస్త్రమున చెప్పబడిన సకలరాజలక్షణములు కలవాడు. గొప్ప దేహకాంతి కలవాడు. చతుస్సాగరపర్యంతభూమండలమున ప్రసిద్ధుడు. ప్రజలకు సుఖకరుడై, తానును మిక్కిలి సుఖము లనుభవించువాడు. 5

ఆ రాజునకు చంద్రబింబమును బోలు ముఖము గలవాడు, సకల ధర్మవిశేషముల నెఱిగినవాడు, విలుకాండ్రలో శ్రేష్ఠుడు, ప్రీతిపాత్రుడగు రాముడను జ్యేష్ఠపుత్రుడు కలడు. 6

శత్రువులకు సంతాపము కలిగించు ఆ రాముడు తన క్షత్రియధర్మమును, తన బంధువుల ధర్మమును, సకలజనుల ధర్మమును కాపాడువాడు. 7

వృద్ధుడు సత్యసంధు డగు తన తండ్రి దశరథుడు, తాను చేసిన ప్రతిజ్ఞ తప్పలేక అడవికి పొమ్మనగా వీరుడగు రాముడు, భార్య సీతతో, సోదరుడు లక్ష్మణునితో అడవికి పోయెను. 8

ఆ మహారణ్యమున వేటాడుచు రాముడు కామరూపులు, శూరులగు పెక్కండ్రు రాక్షసులను చంపెను. 9

జనస్థానవధం శ్రుత్వా హతౌ చ ఖరదూషణౌ,
తత స్త్వమర్షాపహృతా జానకీ రావణేన తు,
వంచయిత్వా వనే రామం మృగరూపేణ మాయయా. 10
స మార్గమాణ స్తాం దేవీం రామ స్సీతా మనిందితామ్,
ఆసపాద వనే మిత్రం సుగ్రీవం నామ వానరమ్. 11
తత స్స వాలినం హత్వా రామః పరపురంజయః,
ప్రాయచ్ఛత్ కపిరాజ్యం తత్ సుగ్రీవాయ మహాబలః. 12
సుగ్రీవేణాపి సందిష్టా హరయః కామరూపిణః,
దిక్షు సర్వాసు తాం దేవీం విచిన్వంతి సహస్రశః. 13
అహం సంపాతివచనా చ్ఛతయోజన మాయతమ్,
అస్యా హేతో ర్విశాలాక్ష్యా స్సాగరం వేగవాన్ ప్లుతః. 14
యథారూపాం యథావర్ణాం యథాలక్ష్మీం చ నిశ్చితామ్,

---

రాముడు జనస్థానమున వేలాది రాక్షసులను, ఖరదూషణులను సంహరించగా రావణుడు విని కోపముతో మాయామృగరూపము దాల్చిన మారీచుని చూపి రాముని మోసపుచ్చి సీత నపహరించెను. 10

రాము డపుడు శీలవతియగు సీతకై వెదకుచు, ఆ యడవిలో సుగ్రీవు డను వానరునితో చెలిమి చేసికొనెను. 11

మహాబలుడు, శత్రునగరములను జయించువాడగు రాముడు వాలిని చంపి వానరరాజ్యమును సుగ్రీవున కిచ్చెను. 12

అంత సుగ్రీవుని అజ్ఞ చొప్పున కామరూపులగు వానరులు వేలాదిగా సీత నన్నిదిక్కులందును వెదకుచున్నారు. 13

నేను సంపాతి చెప్పిన విధముగ నూరు యోజనములు వెడల్పు గల సముద్రము నీ విశాలాక్షియగు సీతకై వేగముగా దాటితిని. 14

అశ్రౌషం రాఘవస్యాహం సేయ మాసాదితా మయా. 15

విరరా మైవ ముక్త్వాఽసౌ వాచం వానరపుంగవః,
జానకీ చాపి తచ్ఛ్రుత్వా విస్మయం పరమం గతా. 16

తతస్సా వక్రకేశాంతా సుకేశీ కేశసంవృతమ్,
ఉన్నమ్య వదనం భీరు శ్శింశుపావృక్ష మైక్షత. 17

నిశమ్య సీతా వచనం కపేశ్చ, దిశశ్చ సర్వాః ప్రదిశశ్చ వీక్ష్య,
స్వయం ప్రహర్షం పరమం జగామ, సర్వాత్మనా రామ మనుస్మరంతీ. 18

సా తిర్యగూర్ధ్వం చ తథాప్యధస్తా, న్నిరీక్షమాణా తమచింత్యబుద్ధిమ్,
దదర్శ పింగాధిపతే రమాత్యం, వాతాత్మజం సూర్య మివోదయస్థమ్. 19

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకత్రింశః సర్గః.*

---

రాముని భార్య సీత ఎట్టి రూపము, వర్ణము, కాంతి కలది యని వింటినో ఆ సీతమ్మ చెంతకే వచ్చినాను. 15

వానరశ్రేష్ఠుడగు హనుమంతు డిట్లు పలికి ఊరకుండెను. సీతయు ఆతని పలుకులు విని మిక్కిలి ఆశ్చర్యపడెను. 16

అంతట కొనలు వంకరయై, సుందరములైన కేశములు గల సీతమ్మ, భయపడునది కావున కురులు క్రమ్మియున్న తన ముఖము పైకెత్తి శింశుపావృక్షమును చూచెను. 17

అటు లా సీతాదేవి హనుమంతుని వాక్యములు విని, దిక్కులు, విదిక్కులను కలియచూచి, ఎవ్వరును కనిపించక రామునే మదిలో ధ్యానించుచు మిక్కిలి హర్షము పొందెను. 18

ఆమె శింశుపావృక్షపు ప్రక్కలను, పైనను, క్రిందను పరిశీలించుచు, ఊహింపరాని మహాబుద్ధిశాలియు, సుగ్రీవుని సచివుడును, ఉదయమానుడగు సూర్యునివలె ప్రకాశించుచున్నను వాయుపుత్రుడగు హనుమంతుని చూచెను. 19

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదియొకటవ సర్గము.*

# 32. ద్వాత్రింశః సర్గః

*(సీత హనుమంతుని చూచి విస్మయ మందుట)*

తత శ్శాఖాంతరే లీనం దృష్ట్వా చలితమానసా,
వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాతపింగళమ్. 1
సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినమ్,
ఫుల్లాశోకోత్కరాభాసం తప్తచామీకరేక్షణమ్. 2
మైథిలీ చింతయామాస విస్మయం పరమం గతా. 3
అహో భీమ మిదం రూపం వానరస్య దురాసదమ్.
దుర్నిరీక్షమితి జ్ఞాత్వా పునరేవ ముమోహ సా. 4
విలలాప భృశం సీతా కరుణం భయమోహితా,

---

అంత నా సీతాదేవి కొమ్మలనడుమ దాగినవాడును, తెల్లని వస్త్రము ధరించినవాడును, మెఱుపుల సమూహామువలె పింగళవర్ణముగల హనుమంతుని చూచి మొదట భయముతో కలత జెందెను. 1

పిమ్మట ఆమె యా వృక్షముపై వికసించిన అశోకపుష్పముల కాంతితో వెలుగుచు, మేలిమి బంగారమువలె ప్రకాశించు నేత్రములు కలవాడై వినయశాలియై ప్రియము పలుకుచున్న హనుమంతుని దర్శించెను. 2

అతనిని చూచి సీత పరమాశ్చర్యము నొంది యిట్లు 'అయ్యో! ఈ వానరుని రూపము - చెంతకు పోవుటకే కాదు, చూచుటకు గూడ సాధ్యము కాక భీకరముగ నున్నదే' అని భయపడి మరల మూర్ఛనొందెను. 3,4

తిరిగి తెన్పరిల్లి ఆమె భయభ్రాంతయై 'రామా! రామా! లక్ష్మణా!' యనుచు మిక్కిలి

రామ రామేతి దుఃఖార్తా లక్ష్మణేతి చ భామినీ,
రురోద బహుధా సీతా మందం మందస్వరా సతీ. 5

సా తం దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవ దుపస్థితమ్,
మైథిలీ చింతయామాస స్వప్నోఽయమితి భామినీ. 6

సా వీక్షమాణా పృథుభుగ్నవక్త్రం, శాఖామృగేంద్రస్య యథోక్తకారమ్,
దదర్శ పింగాధిపతే రమాత్యం, వాతాత్మజం బుద్ధిమతాం వరిష్ఠమ్. 7

సా తం సమీక్ష్యైవ భృశం విసంజ్ఞా, గతాసుకల్పేవ బభూవ సీతా,
చిరేణ సంజ్ఞాం ప్రతిలభ్య భూయో, విచింతయామాప విశాలనేత్రా. 8

స్వప్నే మయాఽయం వికృతోఽద్య దృష్టః, శాఖామృగ శ్శాస్త్రగణైర్నిషిద్ధః,
స్వస్త్యస్తు రామాయ సలక్ష్మణాయ, తథా పితుర్మే జనకస్య రాజ్ఞః. 9

---

దీనముగా విలపించెను. మందస్వరముతో పలువిధములుగ ఏడ్చెను. 5

ఆ సీత అట్లు వినయవంతుడై చెంత నిలచిన హనుమంతుని చూచి, అట్లు చూచుట కల యేమో యని తలంచెను. 6

ఆమె అట్లు వరిశీలించుచు వంకరయైన పెద్దముఖము కలవాడై, వానరరాజగు సుగ్రీవుని ఆజ్ఞ పాటించు సచివుడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, వాయుపుత్రుడు హనుమంతుని చూచెను. 7

విశాలాక్షి యగు సీత ఆ హనుమంతుని చూచుచునే తెలివితప్పి ప్రాణములేని దానివలె అయ్యెను. చిరకాలమున కామె తెప్పరిల్లి, మఱల నిట్లాలోచించెను. 8

నే నీనాడు వికృతాకారము గల వానరుని చూచితిని. కోతివి కలలో చూచుటను శాస్త్రము నిషేధించినది (అట్లగపడిన కీడు కలుగును నా రామునకు, లక్ష్మణునకును ఏమయ్యెనో!) రామునకు శుభమగుగాక! లక్ష్మణునకు శుభమగుగాక! అట్లే నా తండ్రి జనకమహారాజునకు శుభమగుగాక! 9

స్వప్నోఽపి నాయం న హి మేఽస్తి నిద్రా, శోకేన దుఃఖేన చ పీడితాయాః
సుఖం హి మే నాస్తి యతోఽస్మి హీనా, తేనేందుపూర్ణప్రతిమాననేన. 10
రామేతి రామేతి సదైవ బుద్ధ్యా, విచింత్య వాచా బ్రువతీ తమేవ,
తస్యానురూపాం చ కథాం తదర్థా, మేవం ప్రపశ్యామి తథా శృణోమి. 11
అహం హి తస్యాద్య మనోభవేన, సంపీడితా తద్గతసర్వభావా,
విచింతయంతీ సతతం తమేవ, తథైవ పశ్యామి తథా శృణోమి. 12
మనోరథః స్యాదితి చింతయామి, తథాపి బుద్ధ్యా చ వితర్కయామి,
కిం కారణం తస్య హి నాస్తి రూపం, సువ్యక్తరూపశ్చ వదత్యయం మామ్. 13

---

ఇది కలగాదు. శోకము, దుఃఖము కలచివేయుచున్న నాకు నిద్రయే లేదు. అట్టిచో కల యెట్లు వచ్చును? సుఖమున్న గదా నిదురవచ్చుట. పూర్ణచంద్రునికి సాటియగు ముఖముగల నా నతి రాము నెడబాసిన నాకు సుఖమే లేదే. 10

రామునే మదిలో తలంచుచు, మాటలతో అ రామునే రామా! రామా! యని ఎల్లప్పుడు పలుకుచు, ఆయనకు సంబంధించినట్టి కథలనే వినుచు, అ దృశ్యములనే మనోనేత్రముతో చూచుచున్నాను. 11

నే నిపుడు రాము నెడబాసి, మదన పీడితనై ఆయననే తలంచుచు, తద్గతమగు మనోభావము కలదాననై , ఆయననే చూచుచున్నాను. ఆయన గుణములనే వినుచున్నాను. 12

ఇట్లు రామనామము పలుకుచున్న వానిని చూచుట అన్నది నా అభిలాష మాత్రమేనా అని ఆలోచించుచున్నాను. అట్లభిలాష కలిగినను బుద్ధితో తర్కించుచున్నాను. ఇది నా అభిలాష కాదు. ఏలన అభిలాషకు రూప ముండదు. ఈ కోతి చక్కగా కనుపించుచు నాతో మాటలాడుచున్నాడు. (కావున ఇది వాస్తవమే). 13

దేవగురువగు బృహస్పతికి నమస్కారము. దేవేంద్రునకు వందనము. బ్రహ్మకు

**నమోఽస్తు వాచస్పతయే సవజ్రిణే, స్వయంభువే చైవ హుతాశనాయ చ,**
**అనేన చోక్తం యదిదం మమాగ్రతో, వనౌకసా తచ్చ తథాస్తు నాన్యథా. 14**

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్వాత్రింశః సర్గః.*

---

ప్రణామము. అగ్ని కభివాదము. ఈ వానరుడు నా యెదుట ఏమి పలికెనో యది వాస్తవ మగుగాక. కల కాకుండుగాక" అని సీత భావించెను. 14

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పది రెండవ సర్గము.*

# 33. త్రయస్త్రింశః సర్గః

*(సీత హనుమంతునకు తన వృత్తాంతము తెలుపుట)*

సోఽవతీర్య ద్రుమాత్తస్మా ద్విద్రుమప్రతిమాననః,
వినీతవేషః కృపణః ప్రణిప త్యోపసృత్య చ. 1

తా మబ్రవీ న్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః,
శిర స్యంజలి మాధాయ సీతాం మధురయా గిరా. 2

కా ను పద్మపలాశాక్షి క్లిష్టకౌశేయవాసిని,
ద్రుమస్య శాఖా మాలంబ్య తిష్ఠసి త్వ మనిందితే. 3

కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజమ్,
పుండరీకపలాశాభ్యాం విప్రకీర్ణ మివోదకమ్. 4

సురాణా మసురాణాం వా నాగగంధర్వరక్షసామ్,
యక్షాణాం కిన్నరాణాం వా కా త్వం భవసి శోభనే. 5

---

పగడము వలె ఎఱ్ఱని ముఖము వినయాన్వితవేషము కల, మహాపరాక్రమశాలి వాయునందనుడు హనుమంతుడు సీతాదేవి దురవస్థను చూచి, దీనుడై ఆమెను సమీపించి, శిరముపై అంజలి ఘటించి మధురవాక్కులతో ఇట్లు పలికెను. 1,2

తామరరేకుల వంటి కన్నులు కలదానా! అనిందితమగు సౌశీల్యము గలదానా! మాసిన పట్టువస్త్రము దాల్చి ఈ చెట్టు కొమ్మను పట్టుకొని నిలచిన నీ వెవ్వరవు? 3

అలల తాకిడిచే తామరాకులపై బడి, అనంతరమే జారిపోవు నీటివలె నీ కనుల నుండి శోకమువలన కన్నీరు కారుచున్న దేల? 4

ఓ మంగళరూపిణీ! దేవతలలో, అసురులలో, నాగులలో, గంధర్వులలో, రక్షస్సులలో, యక్షులలో, కిన్నరులలో నీ వే వర్గమునకు చెందినదానవు? 5

కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే,
వసూనాం వా వరారోహే దేవతా ప్రతిభాసి మే. 6

కిన్ను చంద్రమసా హీనా పతితా విబుధాలయాత్,
రోహిణీ జ్యోతిషాం శ్రేష్ఠా శ్రేష్ఠసర్వగుణాన్వితా,
కా త్వం భవసి కల్యాణి త్వ మనిందితలోచనే. 7

కోపా ద్వా యది వా మోహా ద్భర్తార మసితేక్షణే,
వసిష్ఠం కోపయిత్వా త్వం నాసి కల్యా ణ్యరుంధతీ. 8

కో ను పుత్రః పితా భ్రాతా భర్తా వా తే సుమధ్యమే,
అస్మా ల్లోకా దముం లోకం గతం త్వ మనుశోచసి. 9

రోదనా దతినిశ్వాసా ద్భూమిసంస్పర్శనా దపి,
న త్వాం దేవీ మహం మన్యే రాజ్ఞ స్సంజ్ఞావధారణాత్. 10

---

ఓ సుముఖీ! రుద్రులలో, మరుత్తులలో, వసువులలో నీ వెవ్వతెవు? ఓ సుందరమగు కటిభాగము కలదానా! నీవు నాకు దేవకాంతవుగా తోచుచున్నావు. 6

ఏ లోపము లేని సుందరనేత్రములు కల ఓ శుభాంగీ! నీవు, చంద్రు నెడబాసి స్వర్గమునుండి భూమిపై బడిన తారారత్నము, ఉత్తమనకలగుణాన్విత యగు రోహిణివా? నీ వెవ్వతెవు? 7

నల్లని కన్నులు కలదానా! నీవు కోపము లేదా మోహముచే భర్తయగు వసిష్ఠుని కోపమునకు గురియై దివినుండి భువికి వచ్చిన మంగళమూర్తి అరుంధతివి కావు గదా? 8

ఓ చక్కని నడుము కలదానా! నీ పుత్రుడు, తండ్రి, సోదరుడు, భర్త వీరిలో ఎవరిని కోల్పోయి, వారు ఈ లోకమునుండి పరలోకమునకు పోగా నీవు శోకించుచున్నావు? 9

నీవు రోదించుటవల్లను, మిక్కిలి నిట్టూర్పుటవలనను, భూమిని స్పృశించుటవలనను, నీయందలి రాజలక్షణములవల్లను నీవు దేవతవు కావవి తోచుచున్నది. 10

వ్యంజనాని చ తే యాని లక్షణాని చ లక్షయే,
మహిషీ భూమిపాలస్య రాజకన్యాసి మే మతా. 11

రావణేన జనస్థానా ద్బలా దపహృతా యది,
సీతా త్వమసి భద్రం తే తన్మమాచక్ష్వ పృచ్ఛతః. 12

యథా హి తవ వై దైన్యం రూపం చాప్యతిమానుషమ్,
తపసా చాన్వితో వేష స్త్వం రామమహిషీ ధ్రువమ్. 13

సా తస్య వచనం శ్రుత్వా రామకీర్తనహర్షితా,
ఉవాచ వాక్యం వైదేహీ హనుమంతం ద్రుమాశ్రితమ్. 14

పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః,
స్నుషా దశరథ స్యాహం శత్రుసైన్యప్రతాపినః. 15

దుహితా జనక స్యాహం వైదేహస్య మహాత్మనః,
సీతేతి నామ నామ్నాఽహం భార్యా రామస్య ధీమతః. 16

---

నీ స్తనజఘనాదికము లగు అవయవముల తీరు, సాముద్రికలక్షణములను బట్టి నీవు రాజపుత్రివి, ఏ రాజునకో పట్టమహిషివని తోచుచున్నది. 11

రావణుడు జనస్థానమునుండి బలాత్కారముగ పట్టి తెచ్చిన సీతవా? అట్లగుచో తెలుపుము. నీవు శుభమగుగాక! 12

నీ ముఖమందలి దైన్యము, మానవకాంతలలో అగపడని సౌందర్యము, తాపస వేషములను బట్టి నిశ్చయముగా నీవు రామభార్యవే యని తోచుచున్నది. 13

సీత హనుమంతుని మాట విని, అతడు రాముని గూర్చి ముచ్చటించుటచే సంతోషించినదై చెట్టుపై కూర్చుండిన అతనితో నిట్లనెను. 14

భూమండలముపై నున్న రాజశ్రేష్ఠులలో ప్రధానుడు, ప్రశస్తమగు బుద్ధి కలవాడు, శత్రుసైన్యములను పీడించువాడగు దశరథమహారాజు కోడలివి నేను. 15

మహాత్ముడు, విదేహరాజగు జనకుని పుత్రిని. నా పేరు సీత. ధీమంతుడగు

సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే,
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ. 17

తత్ర త్రయోదశే వర్షే రాజ్యే నేక్ష్వాకునందనమ్,
అభిషేచయితుం రాజా సోపాధ్యాయః ప్రచక్రమే. 18

తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవ స్యాభిషేచనే,
కైకేయీ నామ భర్తారం దేవీ వచన మబ్రవీత్. 19

న పిబేయం న ఖాదేయం ప్రత్యహం మమ భోజనమ్,
ఏష మే జీవిత స్యాంతో రామో యద్యభిషిచ్యతే. 20

యత్తదుక్తం త్వయా వాక్యం ప్రీత్యా నృపతిసత్తమ,
తచ్చే న్న వితథం కార్యం వనం గచ్ఛతు రాఘవః. 21

---

రాముని భార్యను. 16

నేను పండ్రెండు సంవత్సరములు మా యత్తవారింట మానవుల కందుబాటులో నుండెడి సకలభోగముల ననుభవించుచు, సమృద్ధిగా భోగోపకరణములు కలదాననై యుంటిని. 17

అంత పదమూడవ సంవత్సరము మహారాజు తన తనయుడు రాముని పట్టాభిషిక్తుని చేయవలెనని వసిష్ఠుడు మున్నగు పురోహితులతో గూడి ప్రయత్న మారంభించెను. 18

అట్లు రామాభిషేకార్థము రాజు సకలసంచారములు సంపాదించుచుండగా కైకేయి అను రాణి ఆయనతో నిట్లనెను. 19

రామునకు పట్టాభిషేకము చేయుచో నేను ఎన్నటికిని భోజనము చేయను. నీరు త్రాగను. ఉపవసించి ప్రాణములు విడుతును. 20

నీవు నాయందలి ప్రీతితో పలికిన వరదానరూపమగు వచనము వ్యర్థము చేయరా దనుకొన్నచో రాము నడవికి పంపుము. 21

స రాజా సత్యవా గ్దేవ్యా వరదాన మనుస్మరన్,
ముమోహ వచనం శ్రుత్వా కైకేయ్యాః క్రూర మప్రియమ్. 22
తతస్తు స్థవిరో రాజా సత్యే ధర్మే వ్యవస్థితః,
జ్యేష్ఠం యశస్వినం పుత్రం రుదన్ రాజ్య మయాచత. 23
స పితు ర్వచనం శ్రీమా నభిషేకాత్ పరం ప్రియమ్,
మనసా పూర్వ మాసాద్య వాచా ప్రతిగృహీతవాన్. 24
దద్యా న్న ప్రతిగృహ్ణీయాన్న బ్రూయాత్ కించిదప్రియమ్,
అపి జీవితహేతో ర్వా రామ స్సత్యపరాక్రమః. 25
స విహా యోత్తరీయాణి మహార్హాణి మహాయశాః,
విసృజ్య మనసా రాజ్యం జనన్యై మాం సమాదిశత్. 26
సాహం తస్యాగ్రత స్తూర్ణం ప్రస్థితా వనచారిణీ,

---

సత్యభాషి యగు దశరథమహారాజు తన వరదానమును స్మరించుచు కైక నలికిన కఠోరము, అప్రియమగు వాక్యము విని మూర్ఛిల్లెను. 22

పిమ్మట ఆ ముసలిరాజు సత్యమును ధర్మమును కాపాడుచు యశస్వి, ప్రీతిపాత్రుడు, జ్యేష్ఠపుత్రుడగు రాముని "నీ కిచ్చెదనని నిశ్చయించుకొనిన రాజ్యము మఱల నా కి"మ్మని ఏడ్చుచు కోరెను. 23

అంతట శ్రీమంతుడగు రాము డభిషేకము కంటె ప్రియమైన పితృవచనమును మనఃపూర్వకముగా నంగీకరించెను. 24

సత్యనిష్ఠుడగు రాము డెవ్వ రేది యడిగినను ఇచ్చును కాని ఎవ్వరిని యాచింపడు. ప్రాణములు పోవుచున్నను ఎవ్వరిని గూర్చియు చెడ్డమాటలు పలుకడు. 25

మహాకీర్తిశాలియగు రాముడు అమూల్యములగు ఉత్తరీయములు విడిచి, రాజ్యమును మనఃపూర్వకముగ త్యజించి, నన్ను తన తల్లి కౌసల్య కడ నుండు మనెను. 26

నేను శీఘ్రమే ఆయనకంటె ముందుగా అడవికి బయలుదేరితిని. ఆయన లేనిచో

న హి మే తేన హీనాయా వాసః స్వర్గేఽపి రోచతే. 27

ప్రాగేవ తు మహాభాగ స్సౌమిత్రి ర్మిత్రనందనః,
పూర్వజ స్యానుయాత్రార్థే ద్రుమచీరై రలంకృతః. 28

తే వయం భర్తు రాదేశం బహుమాన్య దృఢవ్రతాః,
ప్రవిష్టాః స్మ పురాఽ దృష్టం వనం గంభీరదర్శనమ్. 29

వసతో దండకారణ్యే తస్యాహ మమితౌజసః,
రక్షసాఽపహృతా భార్యా రావణేన దురాత్మనా. 30

ద్వౌ మాసౌ తేన మే కాలో జీవితానుగ్రహః కృతః,
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం తతస్త్యక్ష్యామి జీవితమ్.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రయస్త్రింశః సర్గః.*

---

స్వర్గమైనను నాకు రుచింపదు కదా. 27

మాకంటెను ముందుగానే రామకైంకర్య మను మహాభాగ్యము కలవాడు (పట్టాభిషేకమున కేర్పడిన అంతరాయముచే రామునకు సకలోపచారములు స్వయముగ చేయు భాగ్యము వందినవాడు) అగు లక్ష్మణుడు అన్న ననుసరించి పోవుటకు నారవస్త్రములు ధరించెను. 28

ఇట్లు మేము ప్రభువు ఆజ్ఞను గౌరవించి, దృఢచిత్తులమై మున్నెన్నడును చూచి యెఱుగని గంభీరమగు అడవిలో ప్రవేశించితిమి. 29

మే మట్లు దండకారణ్యమున వసించుచుండగా మహాతేజశ్శాలియగు రాముని భార్యనైన నన్ను దుష్టరాక్షసుడు రావణు డపహరించినాడు. 30

అతడు నా ప్రాణము తీయుట కింకను రెండు మాసముల గడువిచ్చినాడు. ఆ రెండు నెలలు గడువగనే నేను తప్పక ప్రాణములు విడతును. 31

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదిమూడవ సర్గము.*

# 34. చతుస్త్రింశః సర్గః

*(సీతాహనుమత్సంవాదము)*

తస్యా స్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరియూథపః,
దుఃఖా ద్దుఃఖాభిభూతాయా స్సాంత్వ ముత్తర మబ్రవీత్. 1

అహం రామస్య సందేశా ద్దేవి దూత స్తవాగతః,
వైదేహి కుశలీ రామ స్త్వాం చ కౌశల మబ్రవీత్. 2

యో బ్రాహ్మ మస్త్రం వేదాంశ్చ వేద వేదవిదాం వరః,
స త్వాం దాశరథీ రామో దేవి కౌశల మబ్రవీత్. 3

లక్ష్మణశ్చ మహాతేజా భర్తు స్తేఽనుచరః ప్రియః,
కృతవాన్ శోకసంతప్త శ్శిరసా తేఽభివాదనమ్. 4

సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః,

---

వానరయూథమున కధిపతి యగు హనుమంతు డట్లు దుఃఖము పై దుఃఖము నొంది దురపిల్లుచున్న సీత పలుకు లాలించి, యామె నూరడిల్లజేయుచు ఇట్లు పలికెను. 1

ఓ సీతాదేవీ! నేను రాముని సందేశమును నీకు కొనివచ్చితిని. రాముడు క్షేమముగ నున్నాడు. తన కుశలము నీకు చెప్పు మనినాడు. 2

బ్రహ్మాస్త్రమును వేదములను ఎఱిగినవాడు, వేదవిదులలో శ్రేష్ఠుడు, దశరథతనయుడగు రాముడు నిన్ను కుశల మడిగినాడు. 3

మహాతేజశ్శాలి, నీ పతికి తోడునీడ, ప్రీతిపాత్రుడగు లక్ష్మణుడు శోకపీడితుడై శిరము వంచి నీకు నమస్కరించినాడు. 4

ఇటు లా నరశ్రేష్ఠులగు రామలక్ష్మణులకు కుశలమని తెలిసికొని ప్రీతితో మంతయు

ప్రీతిసంహృష్టసర్వాంగీ హనుమంత మథాబ్రవీత్. 5
కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మా,
ఏతి జీవంత మానందో నరం వర్షశతా దపి. 6
తయా సమాగతే తస్మిన్ ప్రీతిరుత్పాదితాఽద్భుతా,
పరస్పరేణ చాలాపం విశ్వస్తౌ తౌ ప్రచక్రతుః. 7
తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరియూథపః,
సీతాయా శ్శోకదీనాయా స్సమీప ముపచక్రమే. 8
యథా యథా సమీపం స హనుమా నుపసర్పతి,
తథా తథా రావణం సా తం సీతా పరిశంకతే. 9
అహో ధిగ్ దుష్కృతమిదం కథితం హి యదస్య మే,
రూపాంతర ముపాగమ్య స ఏవాయం హి రావణః. 10

---

పులకించగా సీత హనుమంతున కిట్లనెను. 5

"మనుజుడు జీవించియున్నచో నూరు సంవత్సరములకైన ఆనందము కలుగును" అను నీ సామెత వాస్తవమని నా కీ ప్రియవాక్యశ్రవణముచే తోచుచున్నది. 6

హనుమంతు డటు లామెను కలసికొనగా ఆమె కా హనుమంతుని యెడ ఆశ్చర్యకరమగు ప్రీతి కలిగెను. వారిరువురు విశ్వాసముతో మాటలాడుకొనిరి. 7

ఆమె వాక్యము విని యా వానరయూథపతి యగు హనుమంతుడు శోకముచే దైన్యము నొందిన సీతాదేవి చెంతకు వచ్చెను. 8

హనుమంతు డామె చెంతకు వచ్చిన కొలది, అతని నామె రావణు దనియే శంకింప జొచ్చెను. 9

'అయ్యో! నే నీతనితో మాటలాడుట అనుచితమాయెనే! వేరొక రూపము దాల్చి వచ్చిన రావణుడే ఇతడు'. 10

తా మశోకస్య శాఖాం సా విముక్త్వా శోకకర్శితా,
తస్యామే వానవద్యాంగీ ధరణ్యాం సముపావిశత్. 11

హనుమానపి దుఃఖార్తాం తాం దృష్ట్వా భయమోహితామ్,
అవందత మహాబాహు స్తత స్తాం జనకాత్మజామ్.
సా చైనం భయవిత్రస్తా భూయో నై వాభ్యుదైక్షత. 12

తం దృష్ట్వా వందమానం తు సీతా శశినిభాననా,
అబ్రవీ ద్దీర్ఘ ముచ్ఛ్వస్య వానరం మధురస్వరా. 13

మాయాం ప్రవిష్టో మాయావీ యది త్వం రావణః స్వయమ్,
ఉత్పాదయసి మే భూయ స్సంతాపం తన్న శోభనమ్. 14

స్వం పరిత్యజ్య రూపం యః పరివ్రాజకరూపధృత్,
జనస్థానే మయా దృష్ట స్త్వం స ఏవాసి రావణః. 15

---

సీత యిట్లు శంకించి, యా అశోకవృక్షపు శాఖను విడచి శోకపీడితయై కటిక వేలపైవే కూర్చుండెను. 11

మహాభుజుడగు హనుమంతుడును దుఃఖపీడితయు, భయముచే వాస్తవ మెఱుగకున్నదియు అగు సీతకు ప్రణామ మొనర్చెను. 12

సీతాదేవియు భయమునకు కారణమగు శంకచే భీతి నొంది తిరిగి హనుమంతుని చూడదయ్యెను. చంద్రుని బోలు ముఖకాంతి గల సీతాదేవి, హనుమంతు డట్లు నమస్కరించుట గాంచి, దీర్ఘముగ నిట్టూర్చి, మధురస్వరముతో హనుమ కిట్లనెను. 13

సహజముగనే మాయావియై, యిపుడు మాయచే రూపాంతరము నొందిన రావణుడవే నీవై, నాకు మఱల సంతాపము కలిగించుచున్నచో నీకిది ఎంతమాత్రము తగదు. 14

మున్ను జనస్థానమున నీ సహజరూపమును వీడి సంన్యాసిరూపము దాల్చి నా కగపడిన రావణుడవే నీవు. 15

ఉపవాసకృశాం దీనాం కామరూప నిశాచర,
సంతాపయసి మాం భూయస్సంతప్తాం తన్న శోభనమ్. 16
అథవా నైత దేవం హి యన్మయా పరిశంకితమ్,
మనసో హి మమ ప్రీతి రుత్పన్నా తవ దర్శనాత్. 17
యది రామస్య దూత స్త్వ మాగతో భద్ర మస్తు తే,
పృచ్ఛామి త్వాం హరిశ్రేష్ఠ ప్రియా రామకథా హి మే. 18
గుణాన్ రామస్య కథయ ప్రియస్య మమ వానర,
చిత్తం హరసి మే సౌమ్య నదీకూలం యథా రయః. 19
అహో స్వప్నస్య సుఖతా యాఽహ మేవం చిరాహృతా,
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసమ్. 20
స్వప్నేఽపి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణమ్,

---

కామరూపివగు రాక్షసుడా! ఉపవాసముచే చిక్కి, భర్త నెడబాసి, దీననై, దురపిల్లుచున్న నన్ను మఱల నీవు బాధింప దలచుట మంచిది కాదు. 16

అట్లు, నేను శంకించినది వాస్తవము కానిచో, నీ దర్శనముచే నా మనస్సు ప్రసన్న మైనది. 17

నీవు రాముని దూతవై వచ్చినచో నీకు శుభమగు గాక. ఓ వానరశ్రేష్ఠుడా! నాకు రామకథ యన్న ఇష్టము.కావున నిన్నడుగుచున్నాను. 18

సౌమ్యుడవగు ఓ వానరుడా! రాముని గుణములు వర్ణింపుము. నదీప్రవాహ మెట్లు ఒడ్డును హరించునో అట్లు నీవు నీ మాటలతో నా హృదయమును హరించుచున్నావు. 19

ఆహా! ఈ స్వప్న మెంత సుఖమైనది! నన్నిటకు తెచ్చి చాలా కాలమైనను ఈనాటికి కలలో రాముడు పంపగా వచ్చిన ఈ వానరుని చూచుచున్నాను. 20

నేను కలలో నైనను వీరుడగు రాముని, లక్ష్మణుని చూడగలుగుచో నా కిట్టి దుర్దశ

పశ్యేయం నావసీదేయం స్వప్నేఽపి మమ మత్సరీ. 21
నాహం స్వప్న మిమం మన్యే స్వప్నే దృష్ట్వా హి వానరమ్,
న శక్యోఽభ్యుదయః ప్రాప్తుం ప్రాప్త శ్చాభ్యుదయో మమ. 22
కిన్ను స్యాచ్చిత్తమోహోఽయం భవేద్వాతగతి స్త్వియమ్,
ఉన్మాదజో వికారో వా స్యాదియం మృగతృష్ణికా. 23
అథవా నాయ మున్మాదో మోహోఽప్యున్మాదలక్షణః,
సంబుధ్యే చాహ మాత్మాన మిమం చాపి వనౌకసమ్. 24
ఇత్యేవం బహుధా సీతా సంప్రధార్య బలాబలమ్,
రక్షసాం కామరూపత్వా న్మేనే తం రాక్షసాధిపమ్. 25
ఏతాం బుద్ధిం తదా కృత్వా సీతా సా తనుమధ్యమా,
న ప్రతివ్యాజహా రాథ వానరం జనకాత్మజా. 26

---

కలిగెడిది కాదు. కాని ఆ స్వప్నముగూడ నాపై కోపించినది. 21

కలలో కోతిని చూచిన ఆనందము కలుగదు. నాకిపుడు సంతోషము కలుగుచున్నది కదా! నే నిది కల యని తలంపను. 22

లేక యిది యేమైన చిత్తభ్రమయా లేక వాతప్రకోపఫలమా? లేక ఉన్మాద మను విరహిజన సహజమగు అవస్థకు ఫలమా? లేక యిది యేమైన ఎండమావియా? 23

అయినను ఇది ఉన్మాదము కాదు. ఉన్మాదము వంటి మోహము కూడ కాజాలదు. ఏలనన నేను నన్ను, ఈ వానరుని గూడ గుర్తించుచున్నాను. 24

అని యిట్లు సీత తాను భావించిన చిత్తమోహత్వాదుల దుర్బలతను, అతడు రావణుడే యగుటలోని బలమును భావించి, అతనిని రావణుడనియే తలంచెను. 25

అని యపు డావిధముగా నిశ్చయించినదై యా సన్నని నడుముగల సీత, హనుమంతునితో ఏమియు పలుకదయ్యెను. 26

వాయుపుత్రుడగు హనుమంతుడు సీతాదేవి ఆలోచన నెరిగినవాడై, వీనుల కింపగు

సీతాయా శ్చింతితం బుద్ధ్వా హనుమాన్ మారుతాత్మజః,
శ్రోత్రానుకూలై ర్వచనై స్తదా తాం సంప్రహర్షయత్. 27

ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాంత శ్శశీ యథా,
రాజా సర్వస్య లోకస్య దేవో వైశ్రవణో యథా. 28

విక్రమే ణోపపన్నశ్చ యథా విష్ణు ర్మహాయశాః,
సత్యవాదీ మధురవాగ్ దేవో వాచస్పతి ర్యథా. 29

రూపవాన్ సుభగః శ్రీమాన్ కందర్ప ఇవ మూర్తిమాన్,
స్థానక్రోధః ప్రహర్తా చ శ్రేష్ఠో లోకే మహారథః. 30

బాహుచ్ఛాయా మవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః,
అపకృ ష్యాశ్రమపదా న్మృగరూపేణ రాఘవమ్,
శూన్యే యేనాపనీతాసి తస్య ద్రక్ష్యసి యత్ఫలమ్. 31

---

మాటలతో ఆమె నిట్లానందింపజేసెను. 27

రాముడు సూర్యునివలె తేజశ్శాలి. చంద్రునివలె జనుల నాహ్లాదింపచేయువాడు. సకలలోకములకును కుబేరునివలె రాజాధిరాజు. 28

విష్ణువువలె పరాక్రమశాలి, అత్యంతకీర్తిశాలియు. దేవగురువు బృహస్పతివలె సత్యములు, మధురములగు మాటలు పలుకువాడు. 29

ఆయన సౌందర్యశాలి, రమణీయుడు, కాంతిమంతుడు, రూపుదాల్చిన మన్మథుని వంటివాడు. కోపింపదగినచోట్ల కోపించువాడు. ఎవ్వనిపై కోపించునో యతనిని ప్రహరింపగల సమర్థుడు. శ్రేష్ఠుడు, మహారథుడు. 30

ఈ లోకమంతయు ఏ మహాత్ముని భుజచ్ఛాయ నాశ్రయించి యున్నదో అట్టి రామునికి బంగారులేడి రూపము జూపి, ఆశ్రమము నుండి దూరము పంపి, యెవ్వరును లేని సమయమున నిన్నపహరించుకొనిపోవుట యను తన దుష్కృత్యమున కేది ఫలమో దానిని (మరణమును) రావణు డనుభవించగా చూచెదవు. 31

నచిరా ద్రావణం సంఖ్యే యో వధిష్యతి వీర్యవాన్,
రోషప్రముక్తై రిషుభి ర్జ్వలద్భిరివ పావకైః,
తేనాహం ప్రేషితో దూత స్త్వత్సకాశ మిహాగతః. 32

త్వద్వియోగేన దుఃఖార్త స్స త్వాం కౌశల మబ్రవీత్,
లక్ష్మణశ్చ మహాతేజా స్సుమిత్రానందవర్ధనః,
అభివాద్య మహాబాహు స్స త్వాం కౌశల మబ్రవీత్. 33

రామస్య చ సఖా దేవి సుగ్రీవో నామ వానరః,
రాజా వానరముఖ్యానాం స త్వాం కౌశల మబ్రవీత్. 34

నిత్యం స్మరతి రామ స్త్వాం ససుగ్రీవ స్సలక్ష్మణః,
దిష్ట్యా జీవసి వైదేహి రాక్షసీవశ మాగతా. 35

నచిరాద్ ద్రక్ష్యసే రామం లక్ష్మణం చ మహాబలమ్,
మధ్యే వానరకోటీనాం సుగ్రీవం చామితౌజసమ్. 36

---

పరాక్రమశాలి యగు ఎవ్వ డచిరకాలముననే మిక్కిలి కోపించి యుద్ధమున మండుచున్న అగ్నులవంటి బాణములను విడచి, రావణుని సంహరింపగలడో యట్టి రాముడు పంపగా దూతనై, నీ చెంతకు వచ్చితిని. 32

రాముడు నిన్నెడబాసి దుఃఖపీడితుడై నిన్ను కుశల మడిగినాడు. మహాపరాక్రమశాలి, మహాభుజుడు, సుమిత్రాదేవి ఆనందమును పెంపొందించువా డగు లక్ష్మణుడు నీకు ప్రణమిల్లి నీ క్షేమ మడిగినాడు. 33

ఓ సీతాదేవీ! రాముని మిత్రుడు, వానరశ్రేష్ఠుల కధిపతి యగు సుగ్రీవుడను వానరుడు నిన్ను కుశల మడిగినాడు. 34

ఓ విదేహరాజపుత్రీ! రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు నిన్ను తలంచని దినము లేదు. నీవు రాక్షసుల నడుమ చిక్కియు భాగ్యవశముచే జీవించుచున్నావు. 35

శీఘ్రమే నీవు రాముని, మహాబలుడగు లక్ష్మణుని అమితపరాక్రమము కల సుగ్రీవుని

అహం సుగ్రీవసచివో హనుమా న్నామ వానరః,
ప్రవిష్టో నగరీం లంకాం లంఘయిత్వా మహోదధిమ్. 37

కృత్వా మూర్ధ్ని పదన్యాసం రావణస్య దురాత్మనః,
త్వాం ద్రష్టు ముపయాతోఽహం సమాశ్రిత్య పరాక్రమమ్. 38

నాహ మస్మి తథా దేవి యథా మా మవగచ్ఛసి,
విశంకా త్యజ్యతా మేషా శ్రద్ధత్స్వ వదతో మమ. 39

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చతుస్త్రింశః సర్గః.*

---

కోట్లకొలది వానరుల నడుమ చూచెదవు. 36

నేను సుగ్రీవుని మంత్రిని, హనుమంతుడను వానరుడను. ఈ మహాసముద్రమును దాటి లంకలో ప్రవేశించితిని. 37

నా పరాక్రమముచే రావణుని శిరముపై నా పాదమునుంచి (తాదృశమగు లంకాధిదేవతావశీకరణము చేసికొని, లంకలో కాలిడి) నిన్ను చూడవచ్చితిని. 38

అమ్మా! నీవు తలంచినట్లు నేను వానరరూపముతో వచ్చిన రావణుడను గాను. నీ వీ శంకను వీడి నామాటయందు విశ్వాస ముంచుము. 39

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదినాల్గవ సర్గము.*

# 35. పంచత్రింశః సర్గః

*( హనుమంతుడు సీతకు రామలక్ష్మణవృత్తాంతము తెలుపుట)*

తాం తు రామకథాం శ్రుత్వా వైదేహీ వానరర్షభాత్,
ఉవాచ వచనం సాంత్వ మిదం మధురయా గిరా. 1

క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణమ్,
వానరాణాం నరాణాం చ కథ మాసీత్ సమాగమః. 2

యాని రామస్య లింగాని లక్ష్మణస్య చ వానర,
తాని భూయ స్సమాచక్ష్వ న మాం శోక స్సమావిశేత్. 3

కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశమ్,
కథ మూరూ కథం బాహూ లక్ష్మణస్య చ శంస మే. 4

ఏవ ముక్తస్తు వైదేహ్యా హనుమాన్ మారుతాత్మజః,

---

సీతాదేవి హనుమంతుడు చెప్పిన రామకథ విని, ఇట్లు మధురవచనములతో ప్రీతియుక్తముగ మాటలాడెను. 1

నీవు రాము నెచట కలిసికొంటివి? లక్ష్మణుని ఎట్లెఱుగుదువు? వానరులగు మీకు నరులగు రామలక్ష్మణులతో కలయిక ఏట్లేర్పడినది? 2

వానరుడా! రాముని చిహ్నము లేవో, లక్ష్మణుని గురుతు లేవో మఱల తెలుపుము. నీవట్లు తెలిపిన నాకు శోకము కలుగకుండును. 3

రామలక్ష్మణుల అవయవసంస్థానము, రూపము, ఊరువులు, బాహువులు ఎట్టివో నాకు తెలుపుము. 4

సీత అట్లు పలుకగా వాయుపుత్రుడగు హనుమంతుడు రాముని స్వరూపమును

తతో రామం యథాతత్త్వ మాఖ్యాతు ముపచక్రమే. 5

జానంతీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి,
భర్తుః కమలపత్రాక్షి సంస్థానం లక్ష్మణస్య చ. 6

యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ యాని వై,
లక్షితాని విశాలాక్షి వదత శ్శృణు తాని మే. 7

రామః కమలపత్రాక్ష స్సర్వసత్త్వమనోహరః,
రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతో జనకాత్మజే. 8

తేజసా౽౽ దిత్యసంకాశః క్షమయా పృథివీసమః,
బృహస్పతిసమో బుద్ధ్యా యశసా వాసవోపమః. 9

రక్షితా జీవలోకస్య స్వజన స్యాభిరక్షితా,

---

యథాతథముగ వర్ణింపజొచ్చెను. 5

ఓ కమలదళముల వంటి కన్నులుగల విదేహరాజపుత్రీ! నీకు తెలిసినను , నా భాగ్యముచే నన్నిట్లు నీ పతియగు రామునియొక్కయు, లక్ష్మణునియొక్కయు అవయవసంస్థానము నడుగుచున్నావు. 6

ఓ విశాలాక్షీ! రాముని చిహ్నములు, లక్ష్మణుని లక్షణములు నేను చూచిన విధముగ పేర్కొందును. వినుము. 7

ఓ జనకరాజపుత్రీ! నీ పతి రాముడు సర్వాంగసుందరుడు. తామరతేకులవంటి కన్నులు గలవాడు. సకలజీవుల మనస్సులను ఆనందింపజేయువాడు. సౌందర్యము మున్నగు దేహగుణములు, దాక్షిణ్యము మున్నగు ఆత్మగుణములు కలవాడై జన్మించినవాడు. (ఇవి రాముని సహజగుణములని భావము.) 8

ఆయన తేజముచే సూర్యసదృశుడు. సహనమున భూమికి సాటి. తెలివిచే బృహస్పతితో సమానుడు. కీర్తిచే దేవేంద్రుని పోలువాడు. 9

ఆయన సకలజీవులను కాపాడువాడు. తనవారిని రక్షించువాడు. తన నడవడిని,

రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః. 10

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా,
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః. 11

అర్చిష్మా నర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః,
సాధూనా ముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్. 12

రాజవిద్యావినీతశ్చ బ్రాహ్మణానా ముపాసితా,
శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః. 13

యజుర్వేదవినీతశ్చ వేదవిద్భి స్సుపూజితః,
ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితః. 14

---

ధర్మమును కాపాడుకొనువాడు. శత్రువులను పీడించువాడు. 10

అమ్మా! రాముడు నాలుగు వర్ణముల వారితో కూడిన సకలప్రపంచమును కాపాడువాడు. లోకమర్యాదను తా ననుసరించి, అందరిచే అనుష్ఠింపజేయువాడు. 11

ఆయన మహాతేజశ్శాలి. సజ్జనులచే పూజించబడువాడు. బ్రహ్మచర్యవ్రతనిష్ఠుడు (గృహస్థాశ్రమమునందున్నవాడు. బ్రహ్మచర్యము నవలంబించుట యనగా ఋతు సమయములు విడచి, తక్కిన సమయములందు స్త్రీసంగమము చేయకుండుట అని మనువచనము). సజ్జనుల కుపకారము చేయు టెఱిగినవాడు. ఐహికాముష్మికకర్మల హేతుఫలభావవ్యవస్థను చక్కగా ఎఱిగినవాడు. 12

రాముడు ఆన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి యను ఈ నాలుగు విద్యలలో సుశిక్షితుడు. బ్రాహ్మణులను సేవించువాడు, సదాచారసంపన్నుడు. వినయవంతుడు, శత్రువుల నణచువాడు. 13

ఆయన యజుర్వేదమం దాసక్తి కలవాడు (యజుర్వేది కనుక). వేదవిదులచే పూజింపబడువాడు. ధనుర్వేదమందును, యజుర్వేదమందే గాక తక్కిన వేదములందును, వేదాంగములందును ఆదరము గలవాడు. 14

విపులాంసో మహాబాహుః కంబుగ్రీవ శ్శుభాననః,
గూఢజత్రు స్సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః. 15
దుందుభిస్వననిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్,
సమ స్సమవిభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః. 16
త్రిస్థిర స్త్రిప్రలంబశ్చ త్రిసమ స్త్రిషు చోన్నతః,
త్రితామ్ర స్త్రిషు చ స్నిగ్ధో గంభీర స్త్రిషు నిత్యశః. 17
త్రివలీవాం స్త్ర్యవనత శ్చతుర్వ్యంగ స్త్రిశీర్షవాన్,

---

రాముడు విశాలమగు మూపు కలవాడు. పెద్ద బాహువులు కలవాడు. శంఖము వంటి మెదగలవాడు. శుభమగు మోము గలవాడు. అగపడని మెడక్రిందగల సంధి యెముకలు గలవాడు. కొనలందు ఎఱ్ఱనైన నేత్రములు కలవాడు. జనులలో ప్రసిద్ధి గాంచినవాడు. 15

ఆయన భేరీధ్వనిని బోలు కంఠధ్వని కలవాడు. నిగనిగలాడు దేహచ్ఛాయ గలవాడు. పరాక్రమశాలి. ఎచ్చుతగ్గులు లేక సమమైన దేహప్రమాణము కలవాడు. అట్లే ఎచ్చుతగ్గులు లేక సమముగ విభజింపబడిన అవయవముల పొంకము గలవాడు. శ్యామలవర్ణుడు. 16

ఆయన సాముద్రికశాస్త్రమున చెప్పబడినట్లు వక్షఃస్థలము, మణికట్టు, పిడికిలి అను నీ మూటి దార్ఢ్యము కలవాడు (ఇది రాజలక్షణము). దీర్ఘములైన కనుబొమలు, బాహువులు, వృషణములు అను నీ మూడు కలవాడు (ఇట్టివాడు చిరంజీవియు, ధనికుడు నగును). కేశాగ్రములు, వృషణములు, మోకాళ్ళు అను మూడు సమానముగా గలవాడు. (ఇదియు రాజలక్షణము), ఎత్తైన ఉదరము, నాభి చుట్టును కలప్రదేశము, తొమ్ము అను నీ మూడును కలవాడు (రాజలక్షణము), కనుకొనలు, గోళ్ళు, అఱచేతులు అను మూడు ఎఱ్ఱగా నున్నవాడు (సుఖవంతుని లక్షణము), పాదరేఖలు, శిరోజము, లింగము అను నీ మూడును నునుపుగా కలవాడు (మహాభాగ్యశాలి లక్షణము). స్వరము, నడక, నాభి యను నీమూడును గంభీరముగా కలవాడు. 17

చతుష్కల శ్చతుర్లేఖ శ్చతుష్కిష్కు శ్చతుస్సమః. 18
చతుర్దశసమద్వంద్వ శ్చతుర్దంష్ట్ర శ్చతుర్గతిః,
మహోష్ఠహనునాసశ్చ [1]పంచస్నిగ్ధోఽష్టవంశవాన్. 19

---

ఆయన ఉదరముపై మూడు ముడతలు కలవాడు, పల్లముగ నున్న చూచుకములు, స్తనములు, పాదరేఖలు కలవాడు. దీర్ఘముకాని లింగము, బలుపులేని పొత్తికడుపు కలవాడు. మూడు సుడులతో గూడిన తల గలవాడు. బొటనవ్రేలి మొదట చతుర్వేదవిదు డగుటను సూచించు నాల్గు రేఖలు కలవాడు. నుదుట, పాదములందు, అఱచేతులందు నాలుగు రేఖలు కలవాడు. తొంబదియా రంగుళముల ఎత్తు కలవాడు. బాహువులు, మోకాళ్ళు, తొడలు, చెక్కిళ్లు అను నాలుగు సమానముగా గలవాడు. 18

ఆయన సమానమైన పదునాలుగు జతల అవయవములు (కనుబొమ్మలు, నాసాపుటములు, కన్నులు, పెదవులు, స్తనాగ్రములు, కూర్పరములు, మణిబంధములు, మోకాళ్ళు, వృషణములు, నడుము యిరుప్రక్కలు, కరములు, పాదములు, పిరుదుల బలుపులు) కలవాడు, కోరల ఆకారముగల నాలుగు దంతములు కలవాడు, సింహములు, పులులు, ఏనుగులు, వృషభము లను ఈ నాల్గింటి గమనమును పోలిన గమనము కలవాడు, మంకెన, దొండపండ్లవలె ఎఱ్ఱనైన మాంసలమైన పెదవులు గలవాడు, బలమైన చెక్కిళ్ళు, పొడవై యెత్తైన ముక్కు గలవాడు. కేశ, నేత్ర, దంత, త్వక్, పాదతలము లను నైదవయవములయందు నిగనిగలాడుట కలవాడు, పొడవగు వెన్నుపాము, శరీరము, (కాలు, చేతుల) వ్రేళ్ళు, చేతులు, ముక్కు, కళ్ళు, చెవులు, మేఢ్రము కలవాడు. 19

---

1. 17వ శ్లోకమున 'త్రిషు స్నిగ్ధః' అని చెప్పి, ఇపుడు 'పంచస్నిగ్ధః' అనుట మతభేదము ననుసరించి యని తెలియవలెను.

చక్షుస్స్నేహేన సౌభాగ్యం దంతస్నేహేన భోజనమ్,
త్వచఃస్నేహేన శయనం పాదస్నేహేన వాహనమ్" (-వరరుచిః)

(నిగనిగలాడు కన్నులచే సౌభాగ్యమును, దంతముల మెరుపుచే భోజనసౌఖ్యమును, చర్మపు మార్దవముచే శయ్యాసౌఖ్యమును, పాదముల నిగారింపుచే వాహనసౌఖ్యమును తెలియనగును.)

దశపద్మో దశబృహత్ త్రిభి ర్వ్యాప్తో ద్విశుక్లవాన్,
షడున్నతో నవతను స్త్రిభి ర్వ్యాప్నోతి రాఘవః. 20

సత్యధర్మపరః శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః,
దేశకాలవిభాగజ్ఞ స్సర్వలోకప్రియంవదః. 21

భ్రాతా చ తస్య ద్వైమాత్రః సౌమిత్రి రపరాజితః,
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః. 22

---

ఆయన పద్మాకృతిగల ముఖము, నేత్రములు, నోరు, నాలుక, పెదవులు, దౌడలు, స్తనములు, గోళ్ళు, చేతులు, పాదము లను పది అవయవములు కలవాడు. రొమ్ము, తల, నుదురు, మెడ, భుజములు, మూపు, బొడ్డు, ప్రక్కలు, వీపు, స్వర మను పది విశాలావయవములు కలవాడు (లేదా శిరస్సు, లలాటము, చెవులు, మెడ, రొమ్ము, హృదయము, పొట్ట, చేతులు, కాళ్ళు, వీపు అను పది విపులములైన అవయవములు కలవాడు), తేజస్సు, యశస్సు, సంపద యను మూటిచే వ్యాపించినవాడు. పరిశుద్ధములగు మాతాపితరుల వంశములు కలవాడు, ఉన్నతములగు చంక, కడుపు, రొమ్ము, ముక్కు, మూపు, లలాటములను అరును కలవాడు, సూక్ష్మములగు వ్రేలి కణుపులు, కురులు, వెండ్రుకలు, గోళ్లు, చర్మము, లింగము, మీసములు, దృష్టి, బుద్ధి అను నీ తొమ్మిది కలవాడు, పూర్వాహ్ణ, మధ్యాహ్న, అవరాహ్ణము లను మూడు కాలములలో ధర్మార్థకామముల నాచరించువాడు. 20

ఆయన సత్యమును, ధర్మమును ఆసక్తితో అనుష్ఠించువాడు. శ్రీమంతుడు. విత్త మార్జించుట, యోగ్యుల కొసంగుట తెలిసినవాడు. దేశకాలముల నెఱిగి ప్రవర్తించువాడు. ఎల్లరి మనస్సులకు ఆనందము కలుగునట్లు పలుకువాడు. 21

ఆ రాముని తమ్ముడు లక్ష్మణుడు. ఆయన ఇద్దరు తల్లుల ముద్దుబిడ్డడు (జన్మమిచ్చుటచే సుమిత్ర, రామునివలె పెంచుటచే కౌసల్యయు లక్ష్మణువకు తల్లులే). ఆయన పరాజయ మన్నది యెఱుగడు. అనురాగముచే, రూపముచే, గుణములచే గూడ అన్న యగు రాముని పోలువాడు. 22

తావుభౌ నరశార్దూలౌ త్వద్దర్శనసముత్సుకౌ,
విచిన్వంతౌ మహీం కృత్స్నా మస్మాభి రభిసంగతౌ. 23
త్వామేవ మార్గమాణౌ తౌ విచరంతౌ వసుంధరామ్,
దదర్శతు ర్నృపగతిం పూర్వజే నావరోపితమ్. 24
ఋశ్యమూకస్య పృష్ఠే తు బహుపాదపసంకులే,
భ్రాతు ర్భయార్త మాసీనం సుగ్రీవం ప్రియదర్శనమ్. 25
వయం తు హరిరాజం తం సుగ్రీవం సత్యసంగరమ్,
పరిచర్యాస్మహే రాజ్యాత్ పూర్వజే నావరోపితమ్. 26
తతస్తౌ చీరవసనౌ ధనుఃప్రవరపాణినౌ,
ఋశ్యమూకస్య శైలస్య రమ్యం దేశ ముపాగతౌ. 27
స తౌ దృష్ట్వా నరవ్యాఘ్రౌ ధన్వినౌ వానరర్షభః,

---

నరశ్రేష్ఠులగు ఆ రామలక్ష్మణు లిరువురును నిన్ను చూడవలయునని యుత్కంఠ కలవారై భూమండలమెల్ల వెదకుచు మమ్ము కలసికొనిరి. 23

ఆ రామలక్ష్మణులు నిన్నే వెదకు ప్రయత్నములో భూమియం దంతటను తిరుగుచు, అన్నయగు వాలి రాజ్యాధికారమునుండి తొలగించగా అతనికి వెరచి, అనేకవృక్షములతో క్రిక్కిరిసియున్న ఋశ్యమూకపర్వతపు వెనుకభాగమున నున్న ప్రియదర్శను డగు సుగ్రీవుని చూచిరి. 24,25

అట్లు తన యన్న కారణముగ రాజ్యభ్రష్టుడైన సత్యసంధుడు, వానరరాజగు సుగ్రీవుని మేము సేవించుచుందుము. 26

అంత ఆ రామలక్ష్మణులు నారవస్త్రములు దాల్చి, శ్రేష్ఠములగు విండ్లు చేతబట్టి ఋశ్యమూకపర్వతపు సుందరప్రదేశము చేరిరి. 27

వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు కోదండములు ధరించి వచ్చిన రామలక్ష్మణులను చూచి, భయముచే కలత నొంది, యా ఋశ్యమూకపర్వతశిఖరము పైకి

అవప్లుతో గిరేస్తస్య శిఖరం భయమోహితః. 28

తత స్స శిఖరే తస్మిన్ వానరేంద్రో వ్యవస్థితః,
తయో స్సమీపం మామేవ ప్రేషయామాస సత్వరమ్. 29

తావహం పురుషవ్యాఘ్రౌ సుగ్రీవవచనాత్ ప్రభూ,
రూపలక్షణసంపన్నౌ కృతాంజలి రుపస్థితః. 30

తౌ పరిజ్ఞాతతత్త్వార్థౌ మయా ప్రీతిసమన్వితౌ,
పృష్ఠ మారోప్య తం దేశం ప్రాపితౌ పురుషర్షభౌ. 31

నివేదితౌ చ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే,
తయో రన్యోన్యసల్లాపాత్ భృశం ప్రీతి రజాయత. 32

తతస్తౌ ప్రీతిసంపన్నౌ హరీశ్వరనరేశ్వరౌ,
పరస్పరకృతాశ్వాసౌ కథయా పూర్వవృత్తయా. 33

---

ఎగిరిపోయెను. 28

అట్లు పోయిన సుగ్రీవు డా పర్వతశిఖరముననే నిలచి, రామలక్ష్మణుల చెంతకు నన్ను శీఘ్రముగ పంపెను. 29

నేను సుగ్రీవునాజ్ఞ చొప్పున సౌందర్యము, తక్కిన శుభలక్షణములతో కూడిన రాజపుత్రులు, నరశ్రేష్ఠులగు రామలక్ష్మణుల కడ కేగి కేలుమోడ్చి నిలచితిని. 30

నేను వారికి మా ప్రభువు సుగ్రీవుని యథార్థస్థితి నెఱిగించగా వారు మిక్కిలి ప్రీతి కలవారైరి. అంత నే నా పురుషశ్రేష్ఠులను నా వీపు (భుజముల)పై నెక్కించుకొని సుగ్రీవుడున్న ప్రదేశమునకు తీసికొని పోయితిని. 31

సుగ్రీవునకు వా రిరువురి వృత్తాంతము యథాతథముగ విన్నవించితిని. పిమ్మట ఒండొరులతో మాటలాడుకొనుటచే రామసుగ్రీవులకు పరస్పరము ప్రీతి కలిగెను. 32

అట్లు ఒండొరులపై ప్రీతి కలిగిన యా రామసుగ్రీవులు తమ తమ గత వృత్తాంతములను పరస్పరము తెలుపుకొనుచు ఒండొరులకు ఊఱట కలిగించుకొనిరి. 33

తత స్స సాంత్వయామాస సుగ్రీవం లక్ష్మణాగ్రజః,
స్త్రీహేతో ర్వాలినా భ్రాత్రా నిరస్త మురుతేజసా. 34

తత స్త్వన్నాశజం శోకం రామ స్యాక్లిష్టకర్మణః,
లక్ష్మణో వానరేంద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్. 35

స శ్రుత్వా వానరేంద్రస్తు లక్ష్మణే నేరితం వచః,
తదాసీ న్నిష్ప్రభోऽత్యర్థం గ్రహగ్రస్త ఇవాంశుమాన్. 36

తత స్త్వద్గాత్రశోభీని రక్షసా హ్రియమాణయా,
యా న్యాభరణజాలాని పాతితాని మహీతలే. 37

తాని సర్వాణి రామాయ ఆనీయ హరియూథపాః,
సంహృష్టా దర్శయామాసు ర్గతిం తు న విదు స్తవ. 38

తాని రామాయ దత్తాని మయై వోపహృతాని చ,

---

అంత రాముడు స్త్రీనిమిత్తమై మహాపరాక్రమశాలి, అన్న యగు వాలిచే అవమానింపబడిన సుగ్రీవు నోదార్చెను. 34

పిమ్మట లక్ష్మణుడు నీ వగపడకపోవుటచే రామునకు కలిగిన దుఃఖమును వానరరాజగు సుగ్రీవునకు నివేదించెను. 35

సుగ్రీవుడును లక్ష్మణుడు పలికిన వృత్తాంతమును విని గ్రహణము పట్టిన సూర్యునివలె మిక్కిలి కాంతిహీనుడయ్యెను. 36

అంతట నీవు రావణునిచే నపహరింపబడుచున్న సందర్భమున నీ శరీరమున శోభిల్లు ఏ నగలను భూమిపై పడవైచితివో వాని నన్నింటిని వానరముఖ్యులు సంతోషముతో తెచ్చి రామునకు చూపిరి. కాని నీ వెచ్చట నున్నదియు తెలియక చెప్ప జాలరైరి. 37,38

పూర్వము నీవు నేలపై పడవైచినపుడు గలగల మ్రోతతో పడి ఆభరణములు చెదిరియుండగా నేనే తీసికొని వచ్చితిని. ఆ నగలను సుగ్రీవుడు రామున కిచ్చెను.

స్వనవం త్ర్వవకీర్ణాని తస్మిన్ విగతచేతసి. 39

తాన్యంకే దర్శనీయాని కృత్వా బహువిధం తవ,
తేన దేవప్రకాశేన దేవేన పరిదేవితమ్. 40

పశ్యత స్తాని రుదత స్తామ్యతశ్చ పునః పునః,
ప్రాదీపయన్ దాశరథే స్తాని శోకహుతాశనమ్. 41

శయితం చ చిరం తేన దుఃఖార్తేవ మహాత్మనా,
మయాపి వివిధై ర్వాక్యైః కృచ్ఛ్రా దుత్థాపితః పునః. 42

తాని దృష్ట్వా మహాబాహు ర్దర్శయిత్వా ముహు ర్ముహుః,
రాఘవ స్సహసౌమిత్రి స్సుగ్రీవే స వ్యవేదయత్. 43

స తవాదర్శనా దార్యే రాఘవః పరితప్యతే,
మహతా జ్వలతా నిత్య మగ్నినే వాగ్నిపర్వతః. 44

---

రాముడు వానిని చూడగనే దుఃఖముతో తెలివి దప్పినాడు. 39

దేవునివలె ప్రకాశించు రాముడు చూచుట కింపైన అభరణములను తన తొడపై విడుకొని పలువిధములుగా విలపించెను. 40

రాముడు అట్లా నగలను చూచి రాముడు రోదించుచు పరితపించెను. అవి కనపడుటచే రాముని శోకాగ్నిని ప్రజ్వలింపజేసినవి. 41

ఆ మహాత్ము డట్లు దుఃఖపీడితుడై చాల తడవు నేలపై పడియుండెను. నే నెన్నియో విధములగు సాంత్వనవాక్యములచే ఎట్లో ఆయనను తేర్పగా తెలివినొంది లేచెను. 42

మహాభుజుడగు రాము డా ఆభరణములను తాను చూచి, లక్ష్మణునకు వానిని మఱల మఱల చూపి, పిమ్మట వానిని సుగ్రీవున కిచ్చెను. 43

ఓ పూజ్యురాలా! నీవు కనపడకపోవుటచే రాముడు, నిత్యము జ్వలించు మహాగ్నిచే అగ్నిపర్వతమువలె పరితపించుచున్నాడు. 44

త్వత్కృతే త మనిద్రా చ శోక శ్చింతా చ రాఘవమ్,
తాపయంతి మహాత్మాన మగ్న్యగార మివాగ్నయః. 45

తవాదర్శనశోకేన రాఘవః ప్రవిచాల్యతే,
మహతా భూమికంపేన మహానివ శిలోచ్చయః. 46

కాననాని సురమ్యాణి నదీః ప్రస్రవణాని చ,
చర న్న రతి మాప్నోతి త్వా మపశ్యన్ నృపాత్మజే. 47

స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః,
సమిత్రబాంధవం హత్వా రావణం జనకాత్మజే. 48

సహితౌ రామసుగ్రీవా వుభా వకురుతాం తదా,
సమయం వాలినం హంతుం తవ చాన్వేషణం తథా. 49

తత స్తాభ్యాం కుమారాభ్యాం వీరాభ్యాం స హరీశ్వరః,

---

నీకొరకై రాముని నిద్రలేకుండుట, శోకము, చింత యను నీ మూడును త్రేతాగ్నులు అగ్నిగృహమును వలె తపింపజేయుచున్నవి. 45

నీ వగపడకుండుటవలన పెద్ద భూకంపముచే మహాశైలము కంపించినట్లు శోకముచే రాముడు కంపించుచున్నాడు. 46

ఓ రాజపుత్రీ! సుందరవనములలో, నదీతీరములలో, జలపాతప్రదేశములలో తిరుగుచు గూడ రాముడు నిన్ను చూడక ఆనందించుటలేదు. 47

ఓ జనకమహారాజపుత్రీ! మనుజశ్రేష్ఠుడగు రాముడు రావణుని, ఆతని మిత్రులను గూడ చంపి శీఘ్రమే నిన్ను చేరగలడు. 48

అపుడు వాలిని సంహరింతునని రాముడు, నిన్ను వెదకింతునని సుగ్రీవుడును ఒడంబడిక చేసికొనిరి. 49

అంత వీరులగు రామలక్ష్మణులు కిష్కింధకు వచ్చి, యుద్ధమున వానరరాజగు వాలిని సంహరించిరి. 50

కిష్కింధాం సముపాగమ్య వాలీ యుద్ధే నిపాతితః. 50

తతో నిహత్య తరసా రామో వాలిన మాహవే,
సర్వర్క్షహరిసంఘానాం సుగ్రీవ మకరోత్ పతిమ్. 51

రామసుగ్రీవయో రైక్యం దేవ్యేవం సమజాయత,
హనుమంతం చ మాం విద్ధి తయో ర్దూత మిహాగతమ్. 52

స్వరాజ్యం ప్రాప్య సుగ్రీవ స్సమానీయ హరీశ్వరాన్,
త్వదర్థం ప్రేషయామాస దిశో దశ మహాబలాన్. 53

ఆదిష్టా వానరేంద్రేణ సుగ్రీవేణ మహౌజసా,
అద్రిరాజప్రతీకాశా స్సర్వతః ప్రస్థితా మహీమ్. 54

తతస్తే మార్గమాణా వై సుగ్రీవవచనాతురాః,
చరంతి వసుధాం కృత్స్నాం వయ మన్యే చ వానరాః. 55

అంగదో నామ లక్ష్మీవాన్ వాలిసూను ర్మహాబలః,

---

అంతట అట్లు రాము డా యుద్ధమున శీఘ్రమే వాలిని చంపి, సమస్తములగు ఎలుగులకు, కోతులకును సుగ్రీవుని రాజు నొనర్చెను. 51

ఓ దేవీ! ఈ విధముగ రామసుగ్రీవుల సమాగమ మేర్పడినది. నే నా రామసుగ్రీవులు పంపగా వచ్చిన దూతను. నన్ను హనుమంతునిగా నెఱుంగుము. 52

సుగ్రీవుడు తన రాజ్యమును సంపాదించుకొని మహాబలులగు కపిశ్రేష్ఠులను రావించి, నీకై వారిని దశదిశలకు పంపెను. 53

మహాపరాక్రమశాలి, వానరరాజగు సుగ్రీవు డాదేశింపగా, మహాపర్వతముల వలె ఉన్నతులైన వానరులు భూమిపై అన్నివైపులకు వెడలిరి. 54

అంత సుగ్రీవు నాజ్ఞకు భయపడిన మేము, తక్కిన వానరులును నిన్ను వెదకుచు భూమిపై ఎల్లెడల తిరుగుచున్నాము. 55

శ్రీమంతుడు, వాలితనయుడు, మహాబలశాలి, కపిశ్రేష్ఠుడగు అంగదుడు

ప్రస్థితః కపిశార్దూల స్త్రిభాగబలసంవృతః. 56

తేషాం నో విప్రణష్టానాం విన్ధ్యే పర్వతసత్తమే,
భృశం శోకపరీతానా మహోరాత్రగణా గతాః. 57

తే వయం కార్యనైరాశ్యాత్ కాల స్యాతిక్రమేణ చ,
భయాచ్చ కపిరాజస్య ప్రాణాం స్త్యక్తుం వ్యవస్థితాః. 58

విచిత్య వనదుర్గాణి గిరిప్రస్రవణాని చ,
అనాసాద్య పదం దేవ్యాః ప్రాణాం స్త్యక్తుం సముద్యతాః. 59

దృష్ట్వా ప్రాయోపవిష్టాంశ్చ సర్వాన్ వానరపుంగవాన్,
భృశం శోకార్ణవే మగ్నః పర్యదేవయ దంగదః. 60

తవ నాశం చ వైదేహి వాలినశ్చ వధం తథా,
ప్రాయోపవేశ మస్మాకం మరణం చ జటాయుషః. 61

---

కపిసైన్యములో మూడింట నొకవంతు సేనతో బయలుదేరినాడు. 56

నిన్ను వెదకుచు వింధ్యపర్వతబిలములో ప్రవేశించి, మఱలివచ్చుదారి తెలియక మిక్కిలి దుఃఖితులమైతిమి. అట్లే కొన్ని దినములు గడచినవి. 57

అట్లు దురవస్థాగతులమై కార్యము నెఱవేరు ఆశ చెడి, కాల మతిక్రమించుటచే మా రాజు సుగ్రీవుడు తీవ్రదండన మిచ్చునని భయము నొంది, మేము ప్రాణములు విడువ సంకల్పించితిమి. 58

అడవులు, దుర్గములు, కొండలు, నదులు, ప్రవాహములు అన్ని పట్టులను వెదకి నీవున్న చోటు కానక ప్రాణములు వీడ దలంచితిమి. 59

అట్లు వానరశ్రేష్ఠు లందరును ప్రాయోపవేశము జేయుట చూచి, అంగదుడు మిక్కిలి శోకసాగరమున మునిగి వగచెను. 60

నీ వగపడకుండుట, తండ్రియగు వాలి మరణించుట, మే మెల్లరము ప్రాయోపవేశము చేయుట, నీ వృత్తాంత మెఱిగిన జటాయువు మరణించుటలను తలంచి అంగదుడు మిక్కిలి దుఃఖించినాడు. 61

తేషాం నః స్వామిసందేశా న్నిరాశానాం ముమూర్షతామ్,
కార్యహేతో రివాయాత శ్శకుని ర్వీర్యవాన్ మహాన్. 62
గృధ్రరాజస్య సోదర్య స్సంపాతి ర్నామ గృధ్రరాట్,
శ్రుత్వా భ్రాతృవధం కోపా దిదం వచన మబ్రవీత్. 63
యవీయాన్ కేన మే భ్రాతా హతః క్వ చ నిపాతితః,
ఏత దాఖ్యాతు మిచ్ఛామి భవద్భి ర్వానరోత్తమాః. 64
అంగదోఽకథయ త్తస్య జనస్థానే మహద్వధమ్,
రక్షసా భీమరూపేణ త్వా ముద్దిశ్య యథాతథమ్. 65
జటాయుషో వధం శ్రుత్వా దుఃఖిత స్సోఽరుణాత్మజః,
త్వాం శశంస వరారోహే వసంతీం రావణాలయే. 66
తస్య తద్వచనం శ్రుత్వా సంపాతేః ప్రీతివర్ధనమ్,

---

మా ప్రభువు 'ఒక్క మాసములోపల మఱలిరానిచో శిక్షింతు'నని యాదేశించుట వలన మాకు జీవితాశ సన్నగిలి, మరణింప నిశ్చయించుకొంటిమి. అపుడు మహాత్ముడు, పరాక్రమశాలి, జటాయువు సోదరుడు, పక్షిరాజగు సంపాతి మా పనికొరకే యన్నట్లు అట కేతెంచెను. అతడు తన సోదరుడు హతుడయ్యెనని విని, కోపముతో నిట్లు పలికెను. 62,63

'ఓ వానరశ్రేష్ఠులారా! నా తమ్ము నెవరు చంపిరి? అత డెచ్చట పడియున్నాడో వే నీ విషయము మీరు చెప్పగా వినగోరుచున్నాను. 64

అమ్మా! అంతట జనస్థానమున నిన్ను కాపాడుటకై భీకరరాక్షసుడు రావణునితో తలపడి మరణించిన జటాయువు వృత్తాంతమును అంగదుడు సంపాతికి తెలిపెను. 65

ఓ సుందరమగు నడుము గలదానా! జటాయువు మరణవార్త విని దుఃఖించినవాడై అరుణపుత్రుడగు సంపాతి నీవు రావణుని లంకలో నున్నావని చెప్పినాడు. 66

సంపాతి మాకు సంతోషమును పెంపొందించునట్టి నీ యునికిని తెలుపగా

అంగదప్రముఖా స్తూర్ణం తత స్సంప్రస్థితా వయమ్. 67
వింధ్యా దుత్థాయ సంప్రాప్తా స్సాగర స్యాంత ముత్తరమ్,
త్వద్దర్శనకృతోత్సాహా హృష్టా స్తుష్టాః ప్లవంగమాః. 68
అంగదప్రముఖా స్సర్వే వేలోపాంత ముపస్థితాః,
చింతాం జగ్ముః పునర్భీతా స్త్వద్దర్శనసముత్సుకాః. 69
అథాహం హరిసైన్యస్య సాగరం ప్రేక్ష్య సీదతః,
వ్యవధూయ భయం తీవ్రం యోజనానాం శతం ప్లుతః. 70
లంకా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా,
రావణశ్చ మయా దృష్ట స్త్వం చ శోకపరిప్లుతా. 71
ఏతత్తే సర్వ మాఖ్యాతం యథావృత్త మనిందితే,
అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథే రహమ్. 72

---

అంగదుడు మున్నగు మే మందరము శీఘ్రమే బయలుదేరితిమి. 67

అంతట నిన్ను చూడవలెనను కుతూహలముతో ఉత్సాహము, ఆనందము కలిగిన వానరులు వింధ్యపర్వతము నుండి లేచి, సముద్రపు ఉత్తర తీరము చేరిరి. 68

అంగదుడు మున్నగు వారందరును నీ దర్శనము చేయవలెనని ఉత్కంఠితులై సముద్ర తీరము చేరి, సముద్రమును చూచి భయపడిరి. 69

నే నపుడు సముద్రము జూచి విషాదము నొందిన వానరసైన్యపు భయము తొలగించి, నూరు యోజనముల దూరము కల సముద్రమును లంఘించితిని. 70

రాక్షసావృతమైన యీ లంకలో రాత్రివేళ ప్రవేశించితిని. రావణుని చూచితిని. శోకముతో నిండియున్న నిన్నును కాంచగలిగితిని. 71

ఓ సుందరీ! జరిగినదెల్ల యథాతథముగా నీకు తెలిపితిని. నేను రాముని దూతను. నాతో మాటలాడుము. 72

తం మాం రామకృతోద్యోగం త్వన్నిమిత్త మిహాగతమ్,
సుగ్రీవసచివం దేవి బుధ్యస్వ పవనాత్మజమ్. 73

కుశలీ తవ కాకుత్స్థ స్సర్వశస్త్రభృతాం వరః,
గురో రారాధనే యుక్తో లక్ష్మణశ్చ సులక్షణః. 74

తస్య వీర్యవతో దేవి భర్తు స్తవ హితే రతః,
అహమేకస్తు సంప్రాప్త స్సుగ్రీవవచనా దిహ. 75

మయేయ మసహాయేన చరతా కామరూపిణా,
దక్షిణా ది గనుక్రాంతా త్వన్మార్గవిచయైషిణా. 76

దిష్ట్యాఽహం హరిసైన్యానాం త్వన్నాశ మనుశోచతామ్,
అపనేష్యామి సంతాపం తవాభిగమశంసనాత్. 77

దిష్ట్యా హి మమ న వ్యర్థం దేవి సాగరలంఘనమ్,

---

దేవీ! నేను రామకార్యార్థినై నీ కొరకై వచ్చినవాడను. సుగ్రీవుని మంత్రిని. వాయుపుత్రుడ నని నన్ను తెలిసికొమ్ము. 73

సకలధనుష్మంతులలో శ్రేష్ఠుడు, నీ పతి యగు రామునకు కుశలము. తన యన్న సేవలో తత్పరుడైనవాడు, యోగ్యలక్షణములు గల నీ మఱది లక్ష్మణునకు కుశలము. 74

దేవీ! పరాక్రమశాలి నీ పతియగు రాముని హితము గోరి, మా రాజు సుగ్రీవు నాజ్ఞచే నే నొక్కడనే యిట కేతెంచితిని. 75

ఒంటరిగా కామరూపముతో నిన్ను వెదుకగోరి సంచరించుచు నే నీ దక్షిణదిశకు ప్రయాణము చేసి వచ్చితిని. 76

నీ వగపడక దుఃఖించుచున్న కోతుల సేనకు భాగ్యవశముచే నీ వగపడితి వని చెప్పి వారి సంతాపము దీర్తును. 77

అమ్మా! నా యదృష్టముచే నేను సముద్రము దాటుట విఫలము కాలేదు. నా

ప్రాప్స్యా మ్యహ మిదం దిష్ట్యా త్వద్దర్శనకృతం యశః. 78
రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వా మభిపత్స్యతే,
సమిత్రబాంధవం హత్వా రావణం రాక్షసాధిపమ్. 79
మాల్యవా న్నామ వైదేహి గిరీణా ముత్తమో గిరిః,
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః. 80
స చ దేవర్షిభి ర్దిష్టః పితా మమ మహాకపిః,
తీర్థే నదీపతేః పుణ్యే శంబసాదన ముద్ధరత్. 81
తస్యాహం హరిణః క్షేత్రే జాతో వాతేన మైథిలి,
హనుమా నితి విఖ్యాతో లోకే స్వే నైవ కర్మణా. 82
విశ్వాసార్థం తు వైదేహి భర్తు రుక్తా మయా గుణాః,
అచిరా ద్రాఘవో దేవి త్వా మితో నయితాఽనఘే. 83

---

భాగ్యముచే నిన్ను దర్శించుటవలన కీర్తిని పొందెదను. 78

మహాపరాక్రమశాలి యగు రాముడు మిత్రులతో బంధువులతో కూడిన రాక్షసరాజగు రావణుని సంహరించి శీఘ్రమే నిన్ను చేరగలడు. 79

ఓ వైదేహీ! పర్వతములలో ఉత్తమమగు మాల్యవంతమను పర్వతమున్నది. అచట నుండి కేసరి యను వానరుడు గోకర్ణక్షేత్రమున కేగెను. 80

మహాకపియగు ఆ నా తండ్రి కేసరి, దేవర్షులచే నియుక్తుడై సముద్రతీరమందలి పవిత్ర మగు ఒక తీర్థమున తీవ్రమగు ఉపద్రవము కలిగించు శంబసాదనుడను రాక్షసుని సంహరించెను. 81

ఓ సీతాదేవీ! నే నా కేసరి భార్యయగు అంజనయందు వాయుదేవుని అనుగ్రహముచే పుట్టితిని. నా (పరాక్రమ) కృత్యము చేతనే హనుమంతుడని ప్రసిద్ధి నొందితిని. 82

ఓ వైదేహీ! నీకు విశ్వాసము కలుగుటకై నీ భర్తగుణములు పేర్కొంటిని. ఓ

ఏవం విశ్వాసితా సీతా హేతుభి శ్శోకకర్శితా,
ఉపపన్నై రభిజ్ఞానైర్దూతం త మవగచ్ఛతి. 84
అతులం చ గతా హర్షం ప్రహర్షేణ చ జానకీ,
నేత్రాభ్యాం వక్రపక్ష్మాభ్యాం ముమో చానందజం జలమ్. 85
చారు తద్వదనం తస్యా స్తామ్రశుక్లాయతేక్షణమ్,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్. 86
హనుమంతం కపిం వ్యక్తం మన్యతే నాన్యథేతి సా,
అథోవాచ హనూమాం స్తా ముత్తరం ప్రియదర్శనామ్. 87
ఏతత్తే సర్వ మాఖ్యాతం సమాశ్వసిహి మైథిలి,
కిం కరోమి కథం వా తే రోచతే ప్రతియా మ్యహమ్. 88
హతేఽ_సురే సంయతి శంబసాదనే, కపిప్రవీరేణ మహర్షిచోదనాత్,

---

పుణ్యవతీ ! శీఘ్రమే రాముడు నిన్నిటనుండి తీసికొనిపోగలడు. 83

అని యీ విధముగా శోకపీడితయగు సీతాదేవి, పూర్వోక్తములగు హేతువులచే విశ్వాసము పొంది, ఆ యా గురుతులచే అతడు దూత యని తెలిసికొనెను. 84

అట్లు తెలిసికొని సీత అంతులేని ఆనందము పొందెను. అట్టి హర్షముచే ఆమె వంగిన కనుబొమలు కల కన్నుల నుండి ఆనందబాష్పములు కార్చెను. 85

ఎఱ్ఱని కొనలతో తెల్లనై విశాలములైన కన్నులు గల ఆ సీతాదేవి ముఖము రాహువు విడచిన చంద్రునివలె ప్రకాశించెను. 86

"ఇతడు వానరుడే. నేను సందేహించినట్లు రావణుడు కాదు" అని సీత తలంచెను. అపు డా ప్రియదర్శిని యగు ఆమెతో హనుమంతు డిట్లనెను. 87

ఓ సీతాదేవీ! నేను విషయమంతయు సవిస్తరముగ తెలిపితిని. నీవింక ఊరడిల్లుము. నే నేమి చేయవలయునో తెలుపుము. ఆపైన నేను పోయి వచ్చెదను. 88

'మహర్షులచే ప్రేరితుడై కపివీరుడగు కేసరి యుద్ధమున శంబసాదనుడను రాక్షసుని

తతో౽స్మి వాయుప్రభవో హి మైథిలి,
ప్రభావత స్తత్ప్రతిమశ్చ వానరః. 89

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచత్రింశః సర్గః.*

---

సంహరించెను. అట్లు అసురులను వధించుట యను నుపకార మొనర్చిన కేసరియొక్క భార్య అంజనకు వాయువువలన జనించినవాడను. ప్రభావముచే వాయుదేవునితో సమానుడను' అని హనుమ పలికెను. 89

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదిఐదవ సర్గము.*

# 36. షట్త్రింశః సర్గః

*(అంగుళీయక ప్రదానము)*

భూయ ఏవ మహాతేజా హనుమాన్ మారుతాత్మజః,
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం సీతాప్రత్యయకారణాత్. 1

వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః,
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్. 2

ప్రత్యయార్థం తవాఽఽనీతం తేన దత్తం మహాత్మనా,
సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలా హ్యసి. 3

గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్,
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్. 4

చారు తద్వదనం తస్యా స్తామ్రశుక్లాయతేక్షణమ్,

---

మహాతేజశ్శాలి, వాయుపుత్రు డగు హనుమంతుడు సీతకు విశ్వాస మేర్పడుటకై మఱల వినయముతో నిట్లు పలికెను. 1

'మహాభాగ్యవతి వగు ఓ దేవీ! నేను వానరుడను. ధీమంతుడగు రాముని దూతను. రామనామము లిఖించబడిన ఈ ఉంగరము చూడుము. 2

నీకు నాపై విశ్వాసము కలుగవలెనని మహాత్ముడగు రాము డీ యుంగర మీయగా తెచ్చితిని. నీ వింక ఊరడిల్లుము. నీకు మంగళమగుగాక. నీ దుఃఖము లన్నియు నశించినవి' అనెను. 3

సీతాదేవి భర్తచేతి కలంకారమగు ఉంగరమును తీసికొని చూచుచు తన పతిచెంతకు చేరినదానివలె సంతోషించెను. 4

కొనలయందు ఎఱ్ఱనివి, చుట్టును తెల్లనివి, విశాలమైన వగు కన్నులతో సుందరమైన

అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్. 5

తత స్సా హ్రీమతీ బాలా భర్తృసందేశహర్షితా,
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్. 6

విక్రాంత స్త్వం సమర్థ స్త్వం ప్రాజ్ఞ స్త్వం వానరోత్తమ,
యే నేదం రాక్షసపదం త్వయైకేన ప్రధర్షితమ్. 7

శతయోజనవిస్తీర్ణ స్సాగరో మకరాలయః,
విక్రమశ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః. 8

న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ,
యస్య తే నాస్తి సంత్రాసో రావణా న్నాపి సంభ్రమః. 9

అర్హసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్,

---

ఆమె ముఖమపుడు రాహువు వీడిన చంద్రునివలె శోభిల్లెను. 5

అంత నా సీత స్త్రీస్వభావమగు సిగ్గునొందినదై, తన భర్త పంపిన సందేశముచే పులకితయై, మిక్కిలి హర్షము నొందుచు హనుమంతు విట్లు ప్రశంసించెను. 6

నీవు పరాక్రమశాలివి. సమర్థుడవు. ప్రాజ్ఞుడవు. కావుననే నీ వొంటరిగా ఈ రాక్షసస్థాన మగు లంక నెదిర్చితివి. నూరు యోజనముల వెడలుపు గలది, మొసళ్ళ కాలవాలమైన దగు సముద్రమును, మెచ్చదగినట్లు ఎగురుచు దాటిన నీవు ఆవుపాదము మోపినంత స్వల్పపరిమాణము గలదిగా భావించితివి. (ఇచట విక్రాంత-సమర్థ-ప్రాజ్ఞ శబ్దములచే వ్యుత్క్రమముగ జ్ఞానశక్తిబలములు చెప్పబడుచున్నవి. రాక్షసస్థావ మనుటచే ప్రజ్ఞ, ఒంటరిగా ననుటచే సామర్థ్యము, ఎదిర్చితి వనుటచే విక్రమము సూచితమైనవి.) 7,8

ఓ వానరశ్రేష్ఠుడా! నేను నిన్నొక సామాన్యునిగా భావింపను. ఏలన నీకు రావణు దన్న భయముగాని తొట్రుబాటుగాని లేదు. 9

ఓ కపిశ్రేష్ఠుడా! నీవు బుద్ధిశాలియగు రామునిచేతనే పంపబడినవాడవగుచో

యద్యసి ప్రేషిత స్తేన రామేణ విదితాత్మనా. 10

ప్రేషయిష్యతి దుర్ధర్షో రామో న హ్యపరీక్షితమ్,
పరాక్రమ మవిజ్ఞాయ మత్సకాశం విశేషతః. 11

దిష్ట్యా చ కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః,
లక్ష్మణశ్చ మహాతేజా స్సుమిత్రానందవర్ధనః. 12

కుశలీ యది కాకుత్స్థః కిం ను సాగరమేఖలామ్,
మహీం దహతి కోపేన యుగాంతాగ్ని రివోత్థితః. 13

అథవా శక్తిమంతౌ తౌ సురాణామపి నిగ్రహే,
మమైవ తు న దుఃఖానా మస్తి మన్యే విపర్యయః. 14

కచ్చిన్న వ్యథితో రామః కచ్చిన్న పరితప్యతే,
ఉత్తరాణి చ కార్యాణి కురుతే పురుషోత్తమః. 15

---

నాతో మాటలాడదగుదువు. 10

ఎదిరింపరాని పరాక్రమశాలి రాముడు. ఆయన పరీక్షింపక ఎవ్వనినీ పంపడు. విశేషించి నాకడకు పరాక్రమము తెలియకయే ఎవ్వనిని కూడ పంపడు. 11

ధర్మాత్ముడు, సత్యప్రతిజ్ఞ కలవాడగు రాముడు నా భాగ్యవశముచే కుశలముగ నున్నాడు. మహాతేజశ్శాలి, సుమిత్రాదేవి ఆనందమును పెంపొందించువాడగు లక్ష్మణుడును కుశలముగ నున్నాడు. 12

రాముడు కుశలముగ నున్నచో సముద్రము చుట్టుముట్టిన ఈ భూమిని విజృంభించిన ప్రళయాగ్నివలె ఏల దహింపడు? 13

రామలక్ష్మణులు దేవతలనైన నిగ్రహింప సమర్థులు. అట్లయ్యును వారు రావణుని నిగ్రహింపకుండుటచే నా దుఃఖముల కింక అంతము లేదని తలంతును. 14

రాముడు న న్నెడబాసి కృశింపలేదు కదా? దుఃఖించుటలేదు కదా? నన్ను తిరిగి సంపాదించుట కా పురుషోత్తముడు ప్రయత్నించుచున్నాడా? 15

కచ్చిన్న దీన స్సంభ్రాంతః కార్యేషు చ న ముహ్యతి,
కచ్చిత్ పురుషకార్యాణి కురుతే నృపతే స్సుతః. 16

ద్వివిధం త్రివిధోపాయ ముపాయమపి సేవతే,
విజిగీషు స్సుహృత్ కచ్చిన్మిత్రేషు చ పరంతపః. 17

కచ్చి న్మిత్రాణి లభతే మిత్రైశ్చా ప్యభిగమ్యతే,
కచ్చిత్ కల్యాణమిత్రశ్చ మిత్రైశ్చాపి పురస్కృతః. 18

కచ్చి దాశాస్తి దేవానాం ప్రసాదం పార్థివాత్మజః,
కచ్చిత్ పురుషకారం చ దైవం చ ప్రతిపద్యతే. 19

కచ్చి న్న విగతస్నేహః ప్రవాసా న్మయి రాఘవః,
కచ్చి న్మాం వ్యసనా దస్మా న్మోక్షయిష్యతి వానర. 20

---

రాముడు దైన్యమును పొందడు కదా? సంభ్రమము నొంది కార్యములు పాడుచేయడు కదా? పురుషుడు చేయవలసిన కార్యముల నా రాజపుత్రుడు నెఱవేర్చుచున్నాడా? 16

శత్రువులను పీడించువాడగు రాముడు మిత్రులయెడ ప్రీతుడై సామదానరూపమగు ఉపాయమును సేవించుచున్నాడా? శత్రువుల విషయమున (వారిని జయింపగోరువాడై) దాన-భేద-దండోపాయములను ప్రయోగించుచున్నాడా? (మిత్రులయెడ భేదదండములు శత్రువుల యెడల సామోపాయము ప్రయోగించరాదని భావము). 17

మిత్రుల కుపకరించుచు వారికడ కేగునా? అటులే మిత్రులకును అందుబాటులో ఉన్నాడా? అతని మిత్రులు మంచివారే కదా. ఆ మిత్రు లతనిని ముఖ్యునిగా గౌరవింతురా? 18

రాజపుత్రుడగు రాముడు దేవతల అనుగ్రహమును కోరుచున్నాడా? తన బలమును నమ్మి ప్రయత్నించుచు దైవానుకూల్యమును కూడ పొందుచున్నాడా? 19

చిరకాలము నన్నెడబాయుటచే నాయం దనురాగము విడువలేదు కదా? వానరుడా! నన్నీ కష్టములనుండి రాముడు విడిపించునా? 20

సుఖానా ముచితో నిత్య మసుఖానా మనౌచితః,
దుఃఖ ముత్తర మాసాద్య కచ్చి ద్రామో న సీదతి. 21
కౌసల్యాయా స్తథా కచ్చిత్ సుమిత్రాయా స్తథైవ చ,
అభీక్ష్ణం శ్రూయతే కచ్చిత్ కుశలం భరతస్య చ. 22
మన్నిమిత్తేన మానార్హః కచ్చి చ్ఛోకేన రాఘవః,
కచ్చి న్నాన్యమనా రామః కచ్చి న్మాం తారయిష్యతి. 23
కచ్చి దక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః,
ధ్వజినీం మంత్రిభి ర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే. 24
వానరాధిపతిః శ్రీమాన్ సుగ్రీవః కచ్చి దేష్యతి,
మత్కృతే హరిభిర్వీరై ర్వృతో దంతనఖాయుధైః. 25
కచ్చిచ్చ లక్ష్మణః శూరః సుమిత్రానందవర్ధనః,

---

రాముడు సదా సుఖము లనుభవింపవలసినవాడు. దుఃఖము లనుభవింప దగనివాడు, దుస్సహమగు ఈ దుఃఖమును పొంది ఆయన నశింపడుగదా. 21

కౌసల్య, సుమిత్ర, భరతుడు వీరి కుశలవార్త అప్పుడప్పుడు వినబడుచుండును కదా? 22

మాన్యుడగు రాముడు నాకొఱకు శోకముతో పరితాపము నొందదు కదా? ఆయన కార్యాంతరాసక్తుడు కాడు గదా? నన్నీ యాపదనుండి దాటించునా? 23

అన్నపై అనురాగము గల భరతుడు తన మంత్రులు కాపాడుచున్న, అక్షౌహిణిపరిమాణము కల భయంకర సేనను నాకొరకై పంపునా? 24

శ్రీమంతుడు వానరరాజగు సుగ్రీవుడు నాకొరకై దంతములు, గోళ్ళు ఆయుధములుగా గల వానరవీరులతో గూడి బయలుదేరునా? 25

శూరుడు, సుమిత్ర ఆనందమును వృద్ధినందించువాడు, వివిధాస్త్రప్రయోగవిదుడగు

అస్త్రవి చ్ఛరజాలేన రాక్షసాన్ విధమిష్యతి. 26
రౌద్రేణ కచ్చి దస్త్రేణ జ్వలతా నిహతం రణే,
ద్రక్ష్యా మ్యల్పేన కాలేన రావణం ససుహృజ్జనమ్. 27
కచ్చిన్న తద్ధేమసమానవర్ణం, తస్యాననం పద్మసమానగంధి,
మయా వినా శుష్యతి శోకదీనం, జలక్షయే పద్మమివాతపేన. 28
ధర్మాపదేశాత్ త్యజతశ్చ రాజ్యం, మాం చాప్యరణ్యం నయతః పదాతిమ్,
నాసీద్ వ్యథా యస్య న భీ ర్న శోకః, కచ్చి త్స ధైర్యం హృదయే కరోతి. 29
న చాస్య మాతా న పితా చ నాన్యః, స్నేహా ద్విశిష్టోఽస్తి మయా సమోవా,
తావ త్త్వహం దూత జిజీవిషేయం,యావత్ ప్రవృత్తిం శృణుయాం ప్రియస్య.
ఇతీవ దేవీ వచనం మహార్థం, తం వానరేంద్రం మధురార్థ ముక్త్వా,

---

లక్ష్మణుడు బాణసమూహముతో రాక్షసులను చెండాడునా? 26

ప్రజ్వలించుచు భయంకరముగ నున్న అస్త్రముచే రావణుడు, అతని మిత్రగణము, అచిరకాలమునవే మరణించపగా నేను చూడగలుగుదునా? 27

బంగారమెట్లు కోరదగినదో అట్లు స్పృహణీయమైనది, పద్మమువలె సురభిళమైనది అగు రాముని ముఖము, నేను చెంత లేకుండుటవలని శోకముచే దీనమై జల మింకిపోవుటచే పద్మమువలె వాడిపోవుటలేదు కదా? 28

ధర్మమును దృష్టిలో నుంచుకొని, రాజ్యమును విడచి నన్ను కాలినడకన అడవికి తీసికొనిపోయినపుడు కూడ భయశోకములు పొందని ధైర్యశాలియగు రాము డిపుడు కూడ హృదయమున ధైర్యము వహించుచున్నాడా? 29

రామునకు తల్లిగాని, తండ్రిగాని వేఱొక్కరు గాని స్నేహముచే నాకు తుల్యులు గాని, విశిష్టులుగాని కాజాలరు. ఓ దూతా! నా ప్రియుడగు రాముని వార్త వినుచున్నంత వరకే నేను జీవింపగోరుచున్నాను. 30

అని యిట్లు సీతాదేవి యా వానరశ్రేష్ఠుడగు హనుమంతునకు మహార్థవంతమై,

శ్రోతుం పున స్తస్య వచోఽభిరామం, రామార్థయుక్తం విరరామ రామా. 31

సీతాయా వచనం శ్రుత్వా మారుతి ర్భీమవిక్రమః,
శిర స్యంజలి మాధాయ వాక్య ముత్తర మబ్రవీత్. 32

న త్వా మిహస్థాం జానీతే రామః కమలలోచనే,
తేన త్వాం నానయ త్యాశు శచీమివ పురందరః. 33

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్ర మేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్ మహతీం హర్యృక్షగణసంకులామ్. 34

విష్టంభయిత్వా బాణౌఘై రక్షోభ్యం వరుణాలయమ్,
కరిష్యతి పురీం లంకాం కాకుత్స్థః శాంతరాక్షసామ్. 35

తత్ర యద్యంతరా మృత్యు ర్యది దేవా స్సహాసురాః,
స్థాస్యంతి పథి రామస్య స తానపి వధిష్యతి. 36

---

ప్రీతిని గూర్చు విషయమును పలికి, రాముని ప్రయోజనముతో కూడిన ఆ హనుమంతుని ప్రీతికరమగు వచనమును వినుటకై విరమించెను. 31

భయంకరమగు పరాక్రమముగల హనుమంతుడు సీత పలికిన వాక్యములు విని, శిరముపై కేలుమోడ్చి యామెకు ప్రణమిల్లి యనంతరవాక్యము లిట్లు పలికెను. 32

"కమలముల వంటి కన్నులు కల ఓ సీతాదేవీ! నీ విచట నున్నట్లు రాము డెఱుగడు. కావుననే దేవేంద్రుడు అనుహ్లాదుని హస్తగతమైన శచీదేవిని విడిపించుకొని పోయినట్లు విన్న వెంటనే తీసికొనిపోలేదు." 33

నీ యువికిని నావలన విని రాముడు కోతులు, ఎలుగులతో కూడిన పెద్ద సేనను తీసికొని వెంటనే రాగలడు. 34

లంకానగరమువ కేతెంచి రాక్షసులను చంపగలడు. 35

అట్లు రాముడు శత్రుసంహారము చేయు ప్రయత్నమున నుండగా నడుమ యముడే ఎదుతైనను, దేవతలు, రాక్షసులు కలిసి వచ్చి యడ్డగించినను వారిని గూడ రాముడు

తవాదర్శనజే నార్యే శోకేన స పరిప్లుతః,
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః. 37

మలయేన చ విన్ధ్యేన మేరుణా మందరేణ చ,
దర్దురేణ చ తే దేవి శపే మూలఫలేన చ. 38

యథా సునయనం వల్గు బింబోష్ఠం చారుకుండలమ్,
ముఖం ద్రక్ష్యసి రామస్య పూర్ణచంద్ర మివోదితమ్. 39

క్షిప్రం ద్రక్ష్యసి వైదేహి రామం ప్రస్రవణే గిరౌ,
శతక్రతు మివాసీనం నాకపృష్ఠస్య మూర్ధని. 40

న మాంసం రాఘవో భుంక్తే న చాపి మధు సేవతే,
వన్యం సువిహితం నిత్యం భక్త మశ్నాతి పంచమమ్. 41

---

వధింపగలడు. 36

పూజ్యురాలా! రాముడు నిన్ను గానక శోకమున మునిగినవాడై సింహము పీడించిన యేనుగువలె సుఖము నందుటలేదు. 37

నీ వచిరకాలమున చక్కని కన్నులు కలది, సుందరమైనది, దొండపండువంటి పెదవి కలది, సుందరములగు కుండలములు కలది యగు రాముని ముఖమును ఉదయించిన పూర్ణచంద్రునివలె చూచెదవని మేము సంచరించు మలయము, వింధ్యము, మేరువు, మందరము, దర్దురము అను పర్వతములపైనను, మేము తిను కందమూలఫలముల పైనను శపథము చేయుచున్నాను. 38,39

సీతాదేవీ! నాకపృష్ఠ మను యసాధారణస్వర్గస్థానవిశేషమున దేవేంద్రుని వలె, ప్రస్రవణాద్రిని రాము డధిష్ఠించియుండగా చూచెదవు. 40

రాము డిపుడు మాంసము భుజించుట లేదు. మద్యము త్రావుట లేదు. వానప్రస్థులకు యోగ్యముగా విహితమైన యన్నమును ప్రాతస్సు–సంగమము – మధ్యాహ్నము – అపరాహ్ణము– సాయాహ్నమను ఐదు కాలములలో నాల్గుకాలములను

నైవ దంశా న్న మశకా న్న కీటా న్న సరీసృపాన్,
రాఘవోఽ పనయేద్ గాత్రాత్ త్వద్గతే నాంతరాత్మనా. 42

నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోకపరాయణః,
నాన్య చ్చింతయతే కించిత్ స తు కామవశం గతః. 43

అనిద్ర స్సతతం రామ స్సుప్తోఽపి చ నరోత్తమః,
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే. 44

దృష్ట్వా ఫలం వా పుష్పం వా, యద్వాఽన్యత్ సుమనోహరమ్,

---

వీడి కేవలము సాయంకాలమున ప్రాణధారణకై తినుచున్నాడు. (వానప్రస్థులు కందమూల ఫలాదుల నైదుభాగము లొనర్చి యందు నాల్గు భాగములు దేవ-పితృ-అతిథి-భూతముల కొసగి పంచమభాగము మాత్రము స్వీకరింతురు. అట్లు రాము డాహారముగ పంచమాంశమును మాత్రమే స్వీకరించవలెనని లేదా "షోడశారణ్యావాసినః" అని వానప్రస్థునకు విహితమైన పదునారు కబలములలో గూడ నైదవపాలు మాత్రమే భుజించువాడని మహేశ్వర తీర్థీయము.) (శరీరధారణకు వలసినంత ఆహారమును మాత్రమే భుజించుచున్నాడని అర్థము-తనిశ్లోకి). 41

రాముడు నిన్నే తలంచుచు శరీరముపై వాలిన అడవియీగలను గాని, దోమలను గాని, కీటకములను గాని, పాములు మున్నగు సరీసృపములను గాని తోలుకొనుట లేదు. (రాముని అంతరాత్మ నీయందు లగ్నమైనది. పరకాయమున ప్రవేశించిన అంతరాత్మ తాను విడచిన శరీరమునకు సంబంధించిన వికారముల నెట్లు తెలిసికొను? ఆ శరీమందున్ననే కదా అందలి బాధ తెలియును అని భావము). 42

రాము డెప్పుడును నిన్నే తలంచుచున్నాడు. సదా నీకై శోకించుచున్నాడు. అయన కామవరవశుడై వేఱేమియు చింతించుట లేదు. 43

ఆ పురుషోత్తముడు నిదురించుటే లేదు. ఒకప్పుడు నిదురించినను అకస్మాత్తుగా "సీతా!"యని మధురముగా పలుకుచు మేల్కాంచుచున్నాడు. 44

బహుశో హా ప్రియే త్యేవం, శంసం స్త్వా మభిభాషతే. 45

స దేవి నిత్యం పరితప్యమాన, స్త్వామేవ సీతే త్యభిభాషమాణః,

ధృతవ్రతో రాజసుతో మహాత్మా, తవైవ లాభాయ కృతప్రయత్నః. 46

సా రామసంకీర్తనవీతశోకా, రామస్య శోకేన సమానశోకా,

శరన్ముఖే సాంబుదశేషచంద్రా, నిశేవ వైదేహసుతా బభూవ. 47

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షట్త్రింశః సర్గః.*

---

పండునుగాని, పూవునుగాని లేక సుందరమగు మఱే వస్తువునుగాని చూచిన, వెనువెంటనే నిన్ను స్మరించి, 'హా ప్రియా!' అని పలుకుచు నిన్ను గూర్చియే మాటలాడుచున్నాడు. 45

"దేవీ! పితృాజ్ఞచే వనవాసవ్రతము నవలంబించినవాడు, మహాత్ముడగు రాముడు నిత్యము పరితపించుచు, సీతా! యని నిన్నే పిలుచుచు, నిన్ను పొందుటకే ప్రయత్నించుచున్నాడు" అని చెప్పెను. 46

సీతయు రాముని యవస్థను హనుమంతుడు వర్ణింపగా శోకము వీడి, రాముని శోకముతో సమానమగు శోకము కలదై, శరత్కాలప్రారంభమున మేఘశకలముచే నొకింత కప్పబడిన చంద్రునితో కూడిన రాత్రి వలె ప్రకాశించియు, ప్రకాశింపక యుండెను. 47

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదాఱవ సర్గము.*

# 37. సప్తత్రింశః సర్గః

*(హనుమంతునికి సీత ప్రతివచన మిచ్చుట)*

సీతా తద్వచసం శ్రుత్వా పూర్ణచంద్రనిభాననా,
హనుమంత మువాచేదం ధర్మార్థసహితం వచః. 1

అమృతం విషసంసృష్టం త్వయా వానర భాషితమ్,
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోకపరాయణః. 2

ఐశ్వర్యే వా సువిస్తీర్ణే వ్యసనే వా సుదారుణే,
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి. 3

విధి ర్నూన మసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ,
సౌమిత్రిం మాం చ రామం చ వ్యసనైః పశ్య మోహితాన్. 4

---

పున్నమిచంద్రుని బోలు మోముగల సీతాదేవి ఆ హనుమంతుని వాక్యము విని, యతని కిట్లు ధర్మార్థసహితముగ పలికెను. 1

ఓ వానరా! రాముడు ఎల్లప్పుడు నన్నే మదిలో తలచుచున్నాడను సంతోషవార్తను, సదా నన్ను తలచుకొని శోకించుచునే ఉన్నాడను దుఃఖవార్తను చెప్పుచున్నావు. నీ ఈ మాటలు నాకు విషము కలిసిన అమృతము వలె నున్నవి. 2

సమృద్ధిగా ఐశ్వర్యము కలిగినపుడు గాని, దారుణమగు కష్టము గలిగిన సమయమునగాని, మానవు డెంతమాత్రము స్వతంత్రుడు కాదు. దైవము వానిని త్రాటితో కట్టినట్లు పట్టి ఈడ్చుకొనిపోవును. 3

ఓ వానరోత్తమా! నిశ్చయముగ దైవము నివారింప శక్యమైనది కాదు. లక్ష్మణుడు, నేను, రాముడును ఆపదలలో చిక్కినాము. చూడుము. 4

శోక స్యాస్య కదా పారం రాఘవోఽధిగమిష్యతి,
ప్లవమానః పరిశ్రాంతో హతనౌ స్సాగరే యథా. 5

రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణమ్,
లంకా మున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః. 6

స వాచ్య స్సంత్వరస్వేతి యావదేవ న పూర్యతే,
అయం సంవత్సరః కాల స్తావద్ధి మమ జీవితమ్. 7

వర్తతే దశమో మాసో ద్వౌ తు శేషౌ ప్లవంగమ,
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ. 8

విభీషణేన చ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి,
అనునీతః ప్రయత్నేన న చ తత్ కురుతే మతిమ్. 9

మమ ప్రతిప్రదానం హి రావణస్య న రోచతే,

---

సముద్రమున ఓడ మునుగగా, నీటబడి ఈదుచు అలసినవాని వలె రాము డీ శోకసాగరము నెపుడు దాటగలడు? 5

రాక్షసులను వధించి, రావణుని హతమార్చి, లంకను నాశమొనర్చి రాముడు నన్నెపుడు చూచును? 6

రావణుడు డిచ్చిన గడువొక సంవత్సరకాలము. అది పూర్తియగులోపల త్వరపడవలసినదిగా రామునకు తెలుపుము. ఆ గడువువఱకే నేను జీవింతును. 7

ఓ వానరుడా! ఇపుడు పదియవమాసము గడచుచున్నది. క్రూరుడగు రావణుడు నా కిచ్చిన గడువులో రెండు మాసము లింకను మిగిలియున్నవి. 8

రావణుని తమ్ముడు విభీషణుడు నన్ను విడిపించి రామునకు సమర్పింపవలెనని ప్రయత్నపూర్వకముగ అన్న ననునయించినాడు. కాని రావణు డా మాటలు పెడచెవిని పెట్టినాడు. 9

నన్ను తిరిగి రామునకు సమర్పించుటకు రావణు డెంతమాత్ర మంగీకరింప

రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశం గతమ్. 10

జ్యేష్ఠా కన్యాఽనలా నామ విభీషణసుతా కపే,
తయా మమేదమాఖ్యాతం మాత్రా ప్రహితయా స్వయమ్. 11

అసంశయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః,
అంతరాత్మా హి మే శుద్ధ స్తస్మిం శ్చ బహవో గుణాః. 12

ఉత్సాహః పౌరుషం సత్త్వ మానృశంస్యం కృతజ్ఞతా,
విక్రమశ్చ ప్రభావశ్చ సంతి వానర రాఘవే. 13

చతుర్దశ సహస్రాణి రాక్షసానాం జఘాన యః,
జనస్థానే వినా భ్రాత్రా శత్రుః కస్తస్య నోద్విజేత్. 14

---

కున్నాడు. కాలవశుడైన యా రావణుని యుద్ధమునకు కొనిపోవుటకై మృత్యువు వెదకుచున్నది. 10

ఓ వానరా! విభీషణుని పెద్దకూతురు అనల. (కొంద రీమెను నలగా పేర్కొనిరి. ఒక పాఠమున 'కల' అని ఉన్నది.) ఆమె తన తల్లి పంపగా నాకడకు వచ్చినది. ఆమెయే నా కీ విషయము తెలియజేసినది. 11

ఓ వానరశ్రేష్ఠుడా! నిస్సంశయముగా నా పతి రాముడు శీఘ్రముగ నన్ను పొందును. ఇందు సందేహము లేదు. ఏలన నా అంతరాత్మ పరిశుద్ధమైనది. రామునిలో గుణము లెన్నియో కలవు. 12

ఓ వానరుడా! గొప్ప కార్యములు చేయవలయునను పట్టుదల, దానిని చేయుటకు వలయు పౌరుషము, బలము, క్రూరత లేకుండుట, కృతజ్ఞత, శౌర్యము, శక్తి యను నీ గుణవిశేషము లన్నియు రామునియం దున్నవి. 13

జనస్థానమున తమ్ముడైనను తోడు లేకుండగనే తా నొంటరిగ అసహాయుడై పదునాలుగువేల రాక్షసులను సంహరించెనే. అట్టి వీరాగ్రేసరుడగు రామునితో పగ పెట్టుకొని దుఃఖపడనివా డెవడు? 14

న స శక్యస్తులయితుం వ్యసనైః పురుషర్షభః,
అహం తస్య ప్రభావజ్ఞా శక్రస్యేవ పులోమజా. 15
శరజాలాంశుమాన్ శూరః కపే రామదివాకరః,
శత్రురక్షోమయం తోయ ముపశోషం నయిష్యతి. 16
ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్,
అశ్రుసంపూర్ణనయనా మువాచ వచనం కపిః. 17
శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్ర మేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్ మహతీం హర్యృక్షగణసంకులామ్. 18
అథవా మోచయిష్యామి త్వా మద్యైవ వరాననే,
అస్మా ద్దుఃఖా దుపారోహ మమ పృష్ఠ మనిందితే. 19
త్వాం హి పృష్ఠగతాం కృత్వా సంతరిష్యామి సాగరమ్,

---

కష్టములు పురుషశ్రేష్ఠుడగు రాముని ధైర్యమును చెఱువజాలవు. దేవేంద్రుని ప్రభావము శచీదేవి యెరిగినట్లు నే నాయన సామర్థ్య మెఱిగినదానను. 15

ఓ హనుమంతుడా! బాణసమూహ మను కిరణములు గల రాము డను చండభానుడు, తనకు శత్రువులగు రాక్షసు లను జలముల నెండించి వేయును. 16

అని యిట్లు ఏమేమో అధికముగా మాటలాడుచు, రామునిగూర్చి దుఃఖపీడితయై కన్నుల నీరు క్రమ్ముకొని యున్న ఆ సీతను చూచి కపివరుడగు హనుమంతు డిట్లనెను. 17

రాముడు నా మాట వినుటతోడనే వానరులు, భల్లూకముల సమూహములతో నిండిన పెద్ద సైన్యమును వెంటబెట్టుకొని శీఘ్రమే బయలుదేరును. 18

లేదా ఓ సుముఖీ! అనిందితా! సీతాదేవీ! నీవు నా వీపు నధిరోహింపుము. నిన్నిపుడే యీ దుఃఖము నుండి విడిపింతును. 19

నిన్ను నా వీపుపై కూర్చుండబెట్టుకొని సముద్రము దాటెదను. ఈ లంకను,

శక్తి రస్తి హి మే వోఢుం లంకామపి సరావణామ్. 20

అహం ప్రస్రవణస్థాయ రాఘవా యాద్య మైథిలి,
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుత మివానలః. 21

ద్రక్ష్య స్యద్యైవ వైదేహి రాఘవం సహలక్ష్మణమ్,
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధే యథా. 22

త్వద్దర్శనకృతోత్సాహ మాశ్రమస్థం మహాబలమ్,
పురందర మివాసీనం నాకపృష్ఠస్య మూర్ధని. 23

పృష్ఠ మారోహ మే దేవి మా వికాంక్షస్వ శోభనే,
యోగ మన్విచ్ఛ రామేణ శశాంకేనేవ రోహిణీ. 24

కథయంతీవ చంద్రేణ సూర్యేణ చ మహార్చిషా,
మత్పృష్ఠ మధిరుహ్యా త్వం తరాకాశమహార్ణవౌ. 25

---

రావణుని గూడ మోసికొని పోవుటకు నాకు శక్తియున్నది. 20

ఓ సీతా! అగ్నిహోమము చేయబడిన ద్రవ్యమును దేవేంద్రుని కిచ్చినట్లు నేను నిన్నిపుడు ప్రస్రవణగిరిపై నున్న రామునికి సమర్పించెదను. 21

ఓ విదేహరాజపుత్రీ! నీ విపుడే, దైత్యులను వధింప సమకట్టిన విష్ణువువలె నున్న లక్ష్మణసమేతుడగు రాముని చూచెదవు. 22

నిన్ను చూచుటకై పలు ప్రయత్నములు చేయుచు ఆశ్రమమున నున్న మహాబలుడు, నాకపృష్ఠ మను స్వర్గప్రదేశమున కూర్చుండిన దేవేంద్రుని వలె శోభిల్లువాడగు రాముని చూచెదవు. 23

మంగళరూపిణివగు ఓ దేవీ! నీవు నావీపుపై నెక్కుము. ఉపేక్ష చేయకుము. రోహిణి చంద్రునితో కూడినట్లు రామునితో కూడుము. 24

చంద్రునితోను, గొప్ప ప్రకాశముగల సూర్యునితో మాటలాడుచున్నదానవువలె నీవు నావీపుపై నెక్కి ఆకాశమును, మహాసముద్రమును గూడ దాటుము. 25

న హి మే సంప్రయాతస్య త్వామితో నయతోఽఙ్గనే,
అనుగంతుం గతిం శక్తా స్సర్వే లంకానివాసినః. 26

యథైవాహ మిహ ప్రాప్త స్తథైవాహ మసంశయః,
యాస్యామి పశ్య వైదేహి త్వా ముద్యమ్య విహాయసమ్. 27

మైథిలీ తు హరిశ్రేష్ఠా చ్ఛ్రుత్వా వచన మద్భుతమ్,
హర్షవిస్మితసర్వాంగీ హనుమంత మథాబ్రవీత్. 28

హనుమన్ దూర మధ్వానం కథం మాం వోఢు మిచ్ఛసి,
తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప. 29

కథం వాల్పశరీర స్త్వం మా మితో నేతు మిచ్ఛసి,
సకాశం మానవేంద్రస్య భర్తు ర్మే ప్లవగర్షభ. 30

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,

---

నే నిటనుండి బయలుదేరి, నిన్ను తీసికొని పోవుచుండగా ఈ లంకలో నివసించువా రెవ్వరును నా గమనవేగము ననుసరించి పోజాలరు. 26

ఓ విదేహరాజపుత్రీ! నే నిచట కెట్లు రాగలిగితినో అట్లే నిన్నెత్తుకొని ఆకాశమార్గమున పోగలను, చూడుము. నీ కీ విషయమున సంశయ మక్కరలేదు. 27

సీత వానరశ్రేష్ఠుడగు హనుమంతుడు పల్కిన ఆశ్చర్యము గొల్పు వాక్యము విని హర్షముచే సర్వశరీరము పులకితము కాగా యతనితో నిట్లనెను. 28

హనుమంతుడా! నీవు సుదూరమార్గమున నన్ను మోసికొనిపోవ గోరుచున్నావు. ఓ వానరయూథపతీ! ఇది యెట్లు సాధ్యము? నీ విట్లు చేయ తలంచుటచే నీ కపిత్వము స్పష్టమగుచున్నది. 29

ఓ వానరశ్రేష్ఠుడా! నా పతి, నరపతియగు రాముని కడకు చిన్న శరీరము కల నీవు నన్నెట్లు మోసికొనిపోవగోరుచుంటివి? 30

సీతాదేవి పలికినది విని, వాయుపుత్రుడు, శ్రీమంతుడగు హనుమంతుడు తానప్పటి

చింతయామాస లక్ష్మీవాన్ నవం పరిభవం కృతమ్. 31

న మే జానాతి సత్త్వం వా ప్రభావం వాఽసితేక్షణా,
తస్మాత్ పశ్యతు వైదేహీ యద్రూపం మమ కామతః. 32

ఇతి సంచింత్య హనుమాం స్తదా ప్లవగసత్తమః,
దర్శయామాస వైదేహ్యాః స్వరూప మరిమర్దనః. 33

స తస్మాత్ పాదపా ద్ధీమా నాప్లుత్య ప్లవగర్షభః,
తతో వర్ధితు మారేభే సీతాప్రత్యయకారణాత్. 34

మేరుమందరసంకాశో బభౌ దీప్తానలప్రభః,
అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః. 35

హరిః పర్వతసంకాశ స్తామ్రవక్త్రో మహాబలః,
వజ్రదంష్ట్రనఖో భీమో వైదేహీ మిద మబ్రవీత్. 36

---

వఱకు అవమాన మన నేమో ఎఱుగనివాడగుటచే, ఆమెకు కలిగిన సందేహమును తనకు సరిక్రొత్త పరాభవముగా తలంచెను. 31

ఈ శుభనేత్రి సీతాదేవి నా బలముగాని, ప్రభావముగాని ఏ మాత్రమును యెఱుగదు. కావున యీమెకు నా స్వేచ్ఛారూపమును చూపెదను. 32

వానరశ్రేష్ఠుడు, శత్రుమర్దనుడగు హనుమంతు డట్లు తలంచి, సీతకు తన రూపము ప్రదర్శించెను. 33

ధీమంతుడు వానరశ్రేష్ఠుడగు ఆ హనుమంతుడు తా నెక్కియున్న చెట్టుకొమ్మనుండి దిగి సీతాదేవికి విశ్వాసము కలుగుటకై తన శరీరమును పెంచసాగెను. 34

అట్లు శరీరమును పెంచి మేరు, మందరపర్వతముల వలె ఉన్నతుడై, ప్రజ్వలించిన అగ్నివలె వెలుగుచు హనుమంతుడు సీతాదేవి యెదుట నిలచెను. 35

అట్లు పర్వతాకారుడై, ఎఱ్ఱని ముఖముగలవాడు, మహాబలుడు వజ్రమువలె కఠినములైన కోరలు, గోళ్ళు కలవాడు, భయంకరుడగు ఆ హనుమంతుడు సీత కిట్లనెను. 36

సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణామ్,
లంకా మిమాం సనాథాం వా నయితుం శక్తి రస్తి మే. 37

త దవస్థాప్యతాం బుద్ధి రలం దేవి వికాంక్షయా,
విశోకం కురు వైదేహి రాఘవం సహలక్ష్మణమ్. 38

తం దృష్ట్వా భీమసంకాశ మువాచ జనకాత్మజా,
పద్మపత్రవిశాలాక్షీ మారుత స్యౌరసం సుతమ్. 39

తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే,
వాయోరివ గతిం చైవ తేజ శ్చాగ్నే రివాద్భుతమ్. 40

ప్రాకృతోఽన్యః కథం చేమాం భూమి మాగంతు మర్హతి,
ఉదధే రప్రమేయస్య పారం వానరపుంగవ. 41

జానామి గమనే శక్తిం నయనే చాపి తే మమ,

---

పర్వతములు, వనములు, కోట బురుజులు, ప్రాకారములు, పురద్వారములతో సహా యీ లంకను, దీని అధిపతి రావణునితో గూడ పెల్లగించి తీసికొనిపోవు శక్తి నాకున్నది. 37

కావున, ఓ దేవీ! నీ బుద్ధిని స్థిరము చేసికొమ్ము. నీవు భయము నొందవలదు. నీ ఆగమనముచే రామలక్ష్మణుల శోకము దీర్చుము. 38

తామరరేకులవలె విశాలములగు కన్నులుగల సీతాదేవి భీకరాకారుడైన వాయుదేవుని తనయుడగు హనుమంతుని చూచి యిట్లనెను. 39

ఓ మహాకపీ! నీ ధైర్యమును, బలమును, వాయువేగమునకు సాటియగు గమనమును, అగ్నిసదృశమగు అద్భుతతేజస్సును నేను తెలిసికొంటిని. 40

ఓ వానరశ్రేష్ఠుడా! అంతులేని సముద్రము దాటి సామాన్యుడగు ఎవ్వ డీ భూమికి రాగలుగును? 41

నీవు సముద్రముపై ప్రయాణించి యవ్వలి యొడ్డు చేరగలవని, నన్నును మోసికొని

అవశ్యం సంప్రధార్యాశు కార్యసిద్ధి ర్మహాత్మనః. 42

అయుక్తం తు కపిశ్రేష్ఠ మమ గంతుం త్వయాఽనఘ,
వాయువేగసవేగస్య వేగో మాం మోహయే త్తవ. 43

అహ మాకాశ మాపన్నా హ్యుప ర్యుపరి సాగరమ్,
ప్రపతేయం హి తే పృష్ఠాద్ భయా ద్వేగేన గచ్ఛతః. 44

పతితా సాగరే చాహం తిమినక్రఝషాకులే,
భవేయ మాశు వివశా యాదసా మన్న ముత్తమమ్. 45

న చ శక్ష్యే త్వయా సార్ధం గంతుం శత్రువినాశన,
కళత్రవతి సందేహ స్త్వయ్యపి స్యా దనంశయః. 46

హ్రియమాణాం తు మాం దృష్ట్వా రాక్షసా భీమవిక్రమాః,

---

పోగలవని నే నెఱుగుదును. అయినను, మహాత్ముడగు రాముని కార్యము (ప్రతికూలము కాక) అనుకూలమగువ ట్లాలోచింపవలయును. 42

పాపరహితుడ వగు ఓ కపిశ్రేష్ఠుడా! నేను నీతో బయలుదేరి వచ్చుట తగదు. వాయువేగముతో సాటియగు నీ వేగముచే నేను తెలివి దప్పవచ్చును. 43

నీ వాకాశమున సాగరోపరిభాగమున వేగముగ పోవుచుండగా, భయమువే నీ వీవుపై నుండి నేను పడిపోవచ్చును. 44

అట్లు తిమింగిలములు, మొసళ్ళు, పెను చేపలతో నిండిన సాగరమున బడినదాననై శీఘ్రమే తెలివి దప్పి, జంతువులకు ఉత్తమాహార మయ్యెదను. 45

ఓ శత్రువులను నశింపజేయువాడా! నేను నీతో రాజాలను. రక్షింపదగిన మరియొక వ్యక్తి చెంతనున్నపుడు ( ఆ వ్యక్తిని కాపాడు ప్రయత్నములో) నీ కావద కలుగు సందేహమున్నది. 46

నీవు నన్ను తీసికొనిపోవుట చూచి భయంకరపరాక్రమము గల రాక్షసులు,

అనుగచ్ఛేయు రాదిష్టా రావణేన దురాత్మనా. 47

తై స్త్వం పరివృత శ్శూరై శ్శూలముద్గరపాణిభిః,
భవే స్త్వం సంశయం ప్రాప్తో మయా వీర కళత్రవాన్. 48

సాయుధా బహవో వ్యోమ్ని రాక్షసా స్త్వం నిరాయుధః,
కథం శక్ష్యసి సంయాతుం మాం చైవ పరిరక్షితుమ్. 49

యుధ్యమానస్య రక్షోభి స్తవ తైః క్రూరకర్మభిః,
ప్రపతేయం హి తే పృష్ఠాద్ భయార్తా కపిసత్తమ. 50

అథ రక్షాంసి భీమాని మహాంతి బలవంతి చ,
కథంచిత్ సాంపరాయే త్వాం జయేయుః కపిసత్తమ. 51

అథవా యుధ్యమానస్య పతేయం విముఖస్య తే,
పతితాం చ గృహీత్వా మాం నయేయుః పాపరాక్షసాః. 52

---

దురాత్ముడగు రావణుని ఆదేశముచే నిన్ను వెంటాడుదురు. 47

వీరుడా! శూలములు, ముద్గరములు చేత ధరించినట్టి యా పరాక్రమవంతులగు రాక్షసులు నిన్ను చుట్టుముట్టగా, కాపాడవలసిన నేను నీ చెంత నుండుటచే నీవు 'జయింప గలనో లేదో' యని సంశయమున పడెదవు. 48

ఆకాశమున ఆయుధధారులైన రాక్షసులు చాలమంది చుట్టుముట్టగా, నీవు నిరాయుధుడవై పోరుటకు, నన్ను ఎట్లు కాపాడగలవు? 49

ఓ కపిశ్రేష్ఠుడా! క్రూరకార్యము లాచరించువారగు ఆ రాక్షసులతో నీవు పోరుచుండగా నేను భయపీడితనై నీ వీపుపై నుండి పడిపోయెదను. 50

ఓ వానరోత్తమా! భయంకరులు, అధికసంఖ్యలో నున్నవారు, బలవంతులగు రాక్షసులు నిన్ను యుద్ధమున చుట్టుముట్టి ఎట్లైనను జయింపవచ్చును. 51

లేదా,యుద్ధమునందే నీ మనస్సు లగ్నమైయుండగా నేను నీకు తెలియకయే పడి పోవచ్చును. అట్లుపడిన నన్నా పాపరాక్షసులు తీసుకొని పోయినను పోవచ్చును.52

మాం వా హరేయు స్త్వద్ధస్తాద్ విశసేయు రథాపి వా,
అవ్యవస్థో హి దృశ్యేతే యుద్ధే జయపరాజయౌ. 53

అహం వాపి విపద్యేయం రక్షోభి రభితర్జితా,
త్వత్ప్రయత్నో హరిశ్రేష్ఠ భవే న్నిష్ఫల ఏవ తు. 54

కామం త్వమసి పర్యాప్తో నిహంతుం సర్వరాక్షసాన్,
రాఘవస్య యశో హీయేత్ త్వయా శస్తైస్తు రాక్షసైః. 55

అథవాదాయ రక్షాంసి న్యసేయు స్సంవృతే హి మామ్,
యత్ర తే నాభిజానీయు ర్హరయో నాపి రాఘవౌ. 56

ఆరంభస్తు మదర్థోఽయం తత స్తవ నిరర్థకః,
త్వయా హి సహ రామస్య మహా నాగమనే గుణః. 57

మయి జీవిత మాయత్తం రాఘవస్య మహాత్మనః,

---

యుద్ధమున జయపరాజయములు అనిశ్చితము లగుట చూతుము. కనుక నీ వోడినచో నీకడనుండి నన్ను తీసికొనిపోయి ఈ రాక్షసులు చంపివేయుదురు. 53

ఓ వానరశ్రేష్ఠుడా! నన్నా రాక్షసులు భయపెట్టగా నేను ఆపద నొందెదను. ఏవిధముగ చూచినను నన్ను తీసుకొని పోవు ప్రయత్నము నిష్ఫలమే కాగలదు. 54

రాక్షసులందఱను నీ వొక్కడవే చంపగలవు. అయినను దూతవగు నీ వట్లు రాక్షసులను చంపుటచే, ఆ కార్యము సాధింపవలసిన రాముని కీర్తి సన్నగిల్లును. 55

లేదా నన్నా రాక్షసులు తీసికొనిపోయి, వేఱొకచోట దాచియుంచెదరు. ఆ చోటును వానరులు గాని, రామలక్ష్మణులు గాని తెలిసికొనలేకపోవచ్చును. 56

ఈ విధముగ నాకై నీ ప్రయత్నము వ్యర్థము కాగలదు. అట్లుకాక నాపతి రాముడు నీతో కలసి వచ్చుటలో ఎంతో ప్రయోజనమున్నది. 57

మహాత్ముడగు రాముని జీవితము, ఆయన సోదరుల ప్రాణములు, నీ రాజగు

భ్రాతౄణాం చ మహాబాహో తవ రాజకులస్య చ. 58

తౌ నిరాశౌ మదర్థం తు శోకసంతాపకర్శితౌ,
సహ సర్వర్క్షహరిభి స్త్యక్ష్యతః ప్రాణసంగ్రహమ్. 59

భర్తు ర్భక్తిం పురస్కృత్య రామా దన్యస్య వానర,
న స్పృశామి శరీరం తు పుంసో వానరపుంగవ. 60

యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్ గతా,
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ. 61

యది రామో దశగ్రీవ మిహ హత్వా సబాంధవమ్,
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్. 62

శ్రుతా హి దృష్టాశ్చ మయా పరాక్రమా, మహాత్మన స్తస్య రణావమర్దినః,

---

సుగ్రీవుని వంశక్షేమము నేను బ్రతుకుటపై ఆధారపడి యున్నవి. 58

నాకు ప్రాణాపాయము కలుగునేని రామలక్ష్మణులు నేను తిరిగి వత్తునను ఆశలేక, శోకసంతప్తులై, కృశించి ఎలుగులు, కోతులతో సహ ప్రాణములు వీడుదురు. 59

వానరశ్రేష్ఠుడా! నాపతిపై భక్తిని పురస్కరించుకొని రాముని కంటె వేఱొక్క పురుషుని శరీరము తాకజాలను. 60

నాడు బలాత్కారముగ రావణుని శరీరస్పర్శ కాలేదా యందువేమో నేనపు డమితదుఃఖపరవశనై శక్తిలేనిదాననై యుంటిని. నా పతియు చెంత లేకుండెను. నేనేమి చేయగలను? 61

రాముడు యుద్ధమున రావణుని బంధువులతో గూడ సంహరించి నన్నిటనుండి తీసికొనిపోవుట ఆయనకు తగిన పని. 62

మహాత్ముడు, యుద్ధమున శత్రువుల నణచువాడగు రాముని పరాక్రమములను నేను వినియుంటిని, చూచితిని కూడ. దేవతలు, గంధర్వులు, ఉరగులు, రాక్షసులును యుద్ధమున రామునికి సాటికారు. 63

న దేవగంధర్వభుజంగరాక్షసా, భవంతి రామేణ సమా హి సంయుగే. 63

సమీక్ష్య తం సంయతి చిత్రకార్ముకం, మహాబలం వాసవతుల్యవిక్రమమ్,
సలక్ష్మణం కో విషహేత రాఘవం, హుతాశనం దీప్తమి వానిలేరితమ్. 64

సలక్ష్మణం రాఘవ మాజిమర్దనం, దిశాగజం మత్తమివ వ్యవస్థితమ్,
సహేత కో వానరముఖ్య సంయుగే, యుగాంతసూర్యప్రతిమం శరార్చిషమ్.

స మే హరిశ్రేష్ఠ సలక్ష్మణం పతిం, సయూథపం క్షిప్ర మిహోపపాదయ,
చిరాయ రామం ప్రతి శోకకర్శితాం, కురుష్వ మాం వానరముఖ్య హర్షితామ్.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తత్రింశః సర్గః*

---

దేవేంద్రునకు సాటియగు పరాక్రమము కల, మహాబలశాలియగు రాముడు తన వింటిని చిత్రవిచిత్రముగ తిప్పుచు వాయువు తోడైన అగ్నివలె లక్ష్మణునితో కూడి తేజరిల్లుచుండగా, యుద్ధమున నతని కెదురొడ్డి నిలువగలవా డెవ్వడు? 64

వానరశ్రేష్ఠుడా! యుద్ధమున శత్రువులను మర్దించువాడు, దిగ్గజమువలె నున్నవాడు, ప్రళయకాలసూర్యునివలె బాణము లను కిరణములతో నొప్పు రాముని తేజమును యుద్ధమువ సహింవగలవా డెవ్వడు? 65

ఓ వానరశ్రేష్ఠుడా! నీవు నా పతియగు రాముని, లక్ష్మణుని, తక్కిన వానరయూథపతులతో నిటకు కొనిరమ్ము. చిరకాలముగ రాముని చూడక శోకపీడితురాలనగు నన్ను హర్షింపజేయుము. 66

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదియేడవ సర్గము.*

# 38. అష్టత్రింశః సర్గః

*(చూడామణిప్రదానము)*

తతస్స కపిశార్దూల స్తేన వాక్యేన హర్షితః,
సీతా మువాచ తచ్ఛ్రుత్వా వాక్యం వాక్యవిశారదః. 1
యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే,
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్య చ. 2
స్త్రీత్వం న తు సమర్థం హి సాగరం వ్యతివర్తితుమ్,
మా మధిష్ఠాయ విస్తీర్ణం శతయోజన మాయతమ్. 3
ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే,
రామా దన్యస్య నార్హామి సంస్పర్శమితి జానకి. 4
ఏత త్తే దేవి సదృశం పత్న్యా స్తస్య మహాత్మనః,

---

అంతట ఆ కపిశ్రేష్ఠుడు, భాషణకుశలు డగు హనుమంతుడు సీత పలికిన వాక్యములకు సంతోషించి, యామె కిట్లు పలికెను. 1

ఓ దేవీ! నిన్ను చూచిన శుభము కలుగును. నీవు పలికినది స్త్రీస్వభావ మగు భయాదులకు, పతివ్రతలు పాటించు వినయమునకు తగియున్నది. 2

నా వీపుపై ఎక్కి నూఱు యోజనముల వెడలుపైన సముద్రమును దాటుటకు స్త్రీలెవ్వరికిని ఎంతమాత్రము సాధ్యము కాదన్నది సత్యము. 3

వినయవతివగు ఓ జానకీ! రాముడు తప్ప వేరొకడు నన్ను తాకదగదని యే రెండవ కారణము పలుకుచుంటివో యట్టి మాట మహాత్ముడగు రాముని భార్యవగు నీకే తగినమాట. నీవు దక్క వేరెవ్వతె యిట్లు పలుకగలుగును? 4,5



చూడామణి ప్రదానము

కా హ్యన్యా త్వామృతే దేవి బ్రూయా ద్వచన మీదృశమ్. 5

శ్రోష్యతే చైవ కాకుత్స్థ స్సర్వం నిరవశేషతః,
చేష్టితం యత్త్వయా దేవి భాషితం మమ చాగ్రతః. 6

కారణై ర్బహుభి ర్దేవి రామప్రియచికీర్షయా,
స్నేహప్రస్కన్నమనసా మయైతత్ సముదీరితమ్. 7

లంకాయా దుష్ప్రవేశత్వా ద్దుస్తరత్వా న్మహోదధేః,
సామర్థ్యా దాత్మనశ్చైవ మయైతత్ సముదీరితమ్. 8

ఇచ్ఛామి త్వాం సమానేతు మద్యైవ రఘుబంధునా,
గురుస్నేహేన భక్త్యా చ నాన్యథైత దుదాహృతమ్. 9

యది నోత్సహసే యాతుం మయా సార్ధ మనిందితే,
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయా ద్రాఘవో హి యత్. 10

---

ఓ జానకీ! నీవు నాయెదుట రామవిరహము సహింపజాలక ఉరిపోసుకొనబోవుట మొదలగు ప్రయత్నములు, రావణుని తృణీకరించి పలికిన మాటలు సర్వమును రామునకు వినిపింతును. 6

దేవీ! నీకు దుఃఖము కలిగించు కారణము లనేకములను చూచి పలు ఉపాయములతో రామునకు ప్రియము గూర్పవలెనను నిచ్ఛతో, ఆయనయందలి ప్రీతి మనమున నిండియుండగా నిన్ను నాతో తీసికొని పోయెద నంటినేగాని వేరు కారణముచే కాదు. 7

లంకలో ప్రవేశించుట చాల కష్టము కనుకను, సముద్రము దాటుట దుష్కరము కనుకను, నిన్ను సముద్రము దాటింప సమర్థుడను కనుకను ఇట్లు చెప్పితిని. 8

ఇప్పుడే నిన్ను రఘువంశ్యుడగు రామునికడకు చేర్చగోరితిని. రామునిపై స్నేహము, భక్తిచేతనే నే నిట్లు నలికితిని గాని వేరొక కారణముచే కాదు. 9

ఓ సాధ్వీ! నీవు నాతో వచ్చుటకు ఇష్టపడనిచో, ఏదేని రాముడు గుర్తింపగలుగు గుర్తు నొసంగుము. 10

ఏవముక్తా హనుమతా సీతా సురసుతోపమా,
ఉవాచ వచనం మందం బాష్పప్రగ్రథితాక్షరమ్. 11
ఇదం శ్రేష్ఠ మభిజ్ఞానం బ్రూయా స్త్వం తు మమ ప్రియమ్,
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా. 12
తాపసాశ్రమవాసిన్యాః ప్రాజ్యమూలఫలోదకే,
తస్మిన్ సిద్ధాశ్రమే దేశే మందాకిన్యా హ్యదూరతః. 13
తస్యోపవనషండేషు నానాపుష్పసుగంధిషు,
విహృత్య సలిలక్లిన్నా తవాంకే సముపావిశమ్. 14
తతో మాంససమాయుక్తో వాయసః పర్యతుండయత్,
తమహం లోష్ట ముద్యమ్య వారయామి స్మ వాయసమ్. 15
దారయన్ స చ మాం కాక స్తత్రైవ పరిలీయతే,

---

అని యిట్లు హనుమంతుడు పలుకగా దేవకన్యను బోలిన సీతాదేవి (రామునితో ఏకాంతమున జరిగిన యొక వృత్తాంతము తలపునకు వచ్చి) బాష్పోద్రేకమువే మాటలు తడబడగా మెల్లగా నిట్లు పలికెను. 11

నేనిపుడు చెప్పు అభిజ్ఞానమును నీవు నాకు ప్రియుడగు రామునకు తెలుపుము. పూర్వము చిత్రకూటము చెంతనున్న పర్వతమునం దీశాన్యదిక్కున, మందాకినీనదికి సమీపమున సిద్ధులు నివసించునట్టిది, సమృద్ధిగ కందమూలఫలములు, జలములు కల ప్రదేశమున తాపసాశ్రమములో నేను నివసించినప్పటి విషయ మిది. 12,13

"నాథా! నే వచట వివిధపుష్పములతో పరిమళించు వనములందు విహరించి, యలసి, చెమటచే తడిసి, నీ చెంత కూర్చుంటిని. 14

అపుడు మాంసమందు లోభము కల కాకి యొకటి వచ్చి నా స్తనముల నడుమ పొడిచెను. నే నొక మట్టిగడ్డ నెత్తి యా కాకిని వారింప సాగితిని. 15

ఆ కాకి నన్ను స్తనప్రదేశమున మాటిమాటికి పొడుచుచు నచటనే యొక్కచో

న చాప్యుపారమ న్మాంసా ద్భక్షార్థీ బలిభోజనః. 16

ఉత్కర్షన్త్యాం చ రశనాం క్రుద్ధాయాం మయి పక్షిణి,
స్రస్యమానే చ వసనే తతో దృష్టా త్వయా హ్యహమ్. 17

[1]త్వయాఽపహసితా చాహం క్రుద్ధా సంలజ్జితా తదా,
భక్షగృధ్నేన కాకేన దారితా త్వా ముపాగతా. 18

ఆసీనస్య చ తే శ్రాంతా పున రుత్సంగ మావిశమ్,
క్రుధ్యంతీ చ ప్రహృష్టేన త్వయాఽహం పరిసాంత్వితా. 19

బాష్పపూర్ణముఖీ మందం చక్షుషీ పరిమార్జతీ,
లక్షితాఽహం త్వయా నాథ వాయసేన ప్రకోపితా. 20

---

దాగుచుండెను. అంతేకాని మాంసభక్షణమునుండి మఱలలేదు. 16

నేనపుడు దానిని తోలివేయుటకై ప్రయత్నించుచుండగా నేను ధరించిన చీరముడి జారినది. నేను మొలత్రాడు లాగిపట్టి నా వస్త్రము బిగియగట్టుకొని యా కాకిపై కోపించుచుండగా నీవు (రాముడు) నిద్రలేచి నన్ను చూచితివి. 17

నీవు నా విఫలప్రయత్నము చూచి నవ్వితివి. దానికి నేను ముందు సిగ్గుపడియు, కాకి ఆహారలోభముతో మరల నన్ను గీరగా దానిపై కోపించి, (దానిని తరిమివైచి) మఱల నీ చెంతకు వచ్చితిని. 18

అట్లు కాకిని తోలివచ్చి యలసి నీ చెంతనే కూర్చుంటిని. కోపించిన నన్ను నీ వూరడించితివి. 19

నాథా! నేను కన్నులలో నిండిన నీటిని మెల్లగా తుడుచుకొనుచుండగా నీవు కాకి కారణముగ కోపించిన నన్ను చూచితివి. 20

---

1. కాకిని పారద్రోలుటకు సీత స్వయముగ ప్రయాసపడుచు, అట్లు త్రోలజాలక రోదించుట గాంచి రాముడు పరిహాసపూర్వకముగ ఓదార్చినాడు. దీనిచే ఆత్మరక్షణమునకై తానే ప్రయత్నించుచో ఈశ్వరుడు ఉపేక్షించుననియు అట్లు ప్రవర్తించనిచో అతడే కాపాడుననియు సూచితము. (గోవిందరాజీయము)

పరిశ్రమాత్ ప్రసుప్తా చ రాఘవాంకేఽప్యహం చిరమ్,
పర్యాయేణ ప్రసుప్తశ్చ మమాంకే భరతాగ్రజః.
స తత్ర పునరేవాథ వాయస స్సముపాగమత్. 21

తత స్సుప్తప్రబుద్ధాం మాం రామస్యాంకాత్ సముత్థితామ్,
వాయస స్సహసాఽఽగమ్య విదదార స్తనాంతరే. 22

పునః పున రథోత్పత్య విదదార స మాం భృశమ్,
తతః సముత్క్షితో రామో ముక్తై శ్శోణితబిందుభిః. 23

వాయసేన తతస్తేన బలవత్ క్లిశ్యమానయా,
స మయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః. 24

స మాం దృష్ట్వా మహాబాహు ర్వితున్నాం స్తనయో స్తదా,
ఆశీవిష ఇవ క్రుద్ధః శ్వసన్ వాక్య మభాషత. 25

---

హనుమంతుడా! నే నా కాకిని పారద్రోలుటకై పోయి వచ్చుటచే శ్రమకలిగి చాల తడవు రాముని తొడపై పరుంటిని. మఱల రాముడు నా తొడపై తలనుంచి కొంతసేపు విశ్రమించెను. మఱల ఆ కాకి యటకు వచ్చెను. 21

అట్లు రామాంకముపై శయనించి, యప్పుడే మేల్కొన్న నన్నా కాకి అకస్మాత్తుగా వచ్చి స్తనాంతరమున గీరినది. 22

అది మాటిమాటికి నాపై బడి నన్ను అధికముగా గీఱినది. అపు డటనుండి రక్తము కారగా ఆ బిందువులచే రాముడు తడిసెను. 23

ఆ విధముగా ఆ కాకి నన్ను తీవ్రముగ బాధపెట్టుచుండగా అప్పటివఱకు సుఖముగా నిదురించుచున్న, పరంతపుడు రాముని నేను మేల్కొలిపితిని. 24

మహాభుజుడగు రాముడు నా స్తనముల నడుమ కాకి చేసిన గాయము చూచి సర్పమువలె పెద్దగా నిట్టూర్చుచు నాతో నిట్లనెను. 25

కేన తే నాగనాసోరు విక్షతం వై స్తనాంతరమ్,
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా. 26

వీక్షమాణ స్తత స్తం వై వాయసం సముదైక్షత,
నఖై స్సరుధిరై స్తీక్ష్ణై ర్మామే వాభిముఖం స్థితమ్. 27

[1]పుత్రః కిల స శక్రస్య వాయసః పతతాం వరః,
ధరాంతరగత శ్శీఘ్రం పవనస్య గతౌ సమః. 28

తత స్తస్మిన్ మహాబాహుః కోపసంవర్తితేక్షణః,
వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాం వరః. 29

న దర్భం సంస్తరాద్ గృహ్య, బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్,

---

"ఏనుగు తొండముల వంటి సుందరములగు తొడలు కలదానా! ఎవరు నీ స్తనముల నడుమ గాయము చేసిరి? కోపించిన ఐదుతలల పాముతో క్రీడించువా రెవ్వరు? 26

రాము డట్లు పలికి నలుదిక్కుల పరిశీలించుచు, వాడియై రక్తసిక్తములైన గోళ్ళతో నా కభిముఖమై నిలచియున్న యా కాకిని చూచెను. 27

వేగముగ పోవువారిలో శ్రేష్ఠుడగు ఆ కాకి ఇంద్రుని తనయుడు. వాయువువలె సంచరించువాడగు అతడు వేగముగా భువికి దిగివచ్చెను. 28

అంతట బుద్ధిమంతులలో అగ్రగణ్యుడు, మహాభుజుడగు రాముడు కోపముతో కాకిపై దృష్టి మఱల్చి దానిని తీవ్రముగా దండింపదలచెను. 29

ఆయన ఆసనమునుండి యొక దర్భను తీసి బ్రహ్మాస్త్రముతో అభిమంత్రించెను.

---

1. ఇంద్రు డహల్యను చెఱపదలచి యొక రాత్రి గౌతమాశ్రమమున కాకియై కూసెను. గౌతము డది ప్రాతఃకాలసూచకమని పొరబడి స్నానార్థము నది కేగి, నది యింకను నిద్రించుచుండుట చూచి, యిది యింద్రుని దుష్కృత్యమని యూహించి, నీకు కాకిరూపమే శాశ్వతమగునని ఇంద్రుని శపించెను. పిమ్మట దేవతలు, ఋషులు ప్రార్థింపగా నీ శాపము నీ కొడుకునకు కలుగునని, రామబాణపీడితుడై యత డాయనచేతనే రక్షింపబడగా శాపము వీడునని గౌతము డింద్రునకు శాపమోక్షము కలిగించెను. (వాసిష్ఠ రామాయణము)

స దీప్త ఇవ కాలాగ్ని, ర్జజ్వాలాభిముఖో ద్విజమ్. 30
స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి,
తత స్తం వాయసం దర్భ స్సోఽ౨ంబరేఽ౨నుజగామ హ. 31
అనుసృష్ట స్తదా కాకో జగామ వివిధాం గతిమ్,
లోకకామ ఇమం లోకం సర్వం వై విచచార హ. 32
[1]స పిత్రా చ పరిత్యక్త స్సురైశ్చ సమహర్షిభిః,
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః. 33
స తం నిపతితం భూమౌ శరణ్య శ్శరణాగతమ్,

అది ప్రకాశించు కాలాగ్నివలె ఆ పక్షి కెదురై ప్రజ్వలింపజొచ్చెను. 30

అట్లు ప్రజ్వలించుచున్న యా దర్భను రాముడు కాకిపై విసరెను. ఆ దర్భ అకాశమందు కాకిని వెంబడించెను. 31

అట్లా దర్భ వెంబడించగా ఆ కాకి వివిధమార్గములలో పరుగులెత్తెను. రక్షణము కోరుచు సకలలోకములలో సంచరించెను. 32

ఆ వాయసము తన (హితము కోరు) తండ్రి, (తన ప్రీతిని కోరు) తల్లి, (బంధువర్గ మగు) దేవతలు, (సదా లోకానుగ్రహతత్పరులగు) మహర్షులు గూడ పట్టించుకొనక విడిచిపెట్టగా, ముల్లోకములు తిరిగి తుద కా రామునే శరణుజొచ్చెను. 33

అట్లు తన్ను శరణుగోరి వచ్చి నేలబడిన యా కాకి, క్షమింపదగనట్టి అపరాధము

[1] తండ్రి తనయుని రక్షింపడా? అందును త్రిలోకాధిపతి కాపాడకుండునా? యని కాకి ఇంద్రునికడకు పోయెను. ఇంద్రుడు, పురుషకారము చేయునట్టి సీతమ్మకే కీడు తలపెట్టిన తనయుని రక్షించుట తనవల్ల కాదనెను. 'ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా' అన్నట్లు అత డిందులకు అసమర్థుడు. అతడు తనయుని త్యజించెను. త్యజించుటయు బుద్ధిపూర్వకముగ (పరిత్యక్తః). 'త్యజేదేకం కులస్యార్థే' అని న్యాయమున్నది కదా! లేదా అతనినే కాదు అతని ఆలుబిడ్డలను కూడ ఇంద్రుడు విడచిపెట్టెను. చకారముచే తల్లియు విడిచిపెట్టెను. తండ్రి హితము కోరువాడు. తల్లి తనయుని ప్రియము కోరునది కదా అన్నచో ఆమెయు 'సీతా నారీజనస్యాస్య యోగక్షేమం విధాస్యతి' అని తమ స్త్రీజాతికే రక్షకురాలయిన సీతయెడ అపరాధి

వధార్హ మపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్,
న శర్మ లబ్ధ్వా లోకేషు తమేవ శరణం గతః. 34
పరిద్యూనం విషణ్ణం చ స త మాయాంత మబ్రవీత్,
మోఘం కర్తుం న శక్యం తు బ్రాహ్మమస్త్రం తదుచ్యతామ్. 35
హినస్తు దక్షిణాక్షి త్వచ్ఛర ఇత్యథ సోఽబ్రవీత్,

---

చేయుటచే చంపదగినట్టిదే అయినను, శరణ్యుడగు రాముడు దయతో దానిని కాపాడెను. ఆ కాకియు లోకములం దెచ్చటను అపాయము తొలగు నెలవు లభింపక తుద కా రామునే శరణు పొందెను. 34

ఆత్మరక్షణముకొరకై తాను చేసిన ప్రయత్న మంతయు నిష్ఫలము కాగా పరితాపము నొంది దుఃఖించుచు తన కడ కేతెంచిన ఆ కాకిని చూచి రాముడు 'నేను విడచిన బ్రహ్మాస్త్రము వ్యర్థము కారాదు. కావున ఏమి చేయమందువు?' అనెను. 35

అంతట ఆ కాకి 'నీ బాణముతో నా కుడికంటిని పోగొట్టుము' అని ప్రార్థించెను.

---

యగుటచే తనయుని వీడెను. తల్లిదండ్రులు విడచినను బంధువులగు దేవతలు విడతురా? అనగా వారును విడచిపెట్టిరి. "కస్య బిభ్యతి చేవాశ్చ జాతరోషస్య సంయుగే" అని రాముడు కన్నెఱ్ఱ చేసిన చాలును వారు భీతిల్లుదురు. పూర్వరూపమున సజాతీయులైనవారు విడచిన విడుతురు గాక, కనీసము పక్షిరూపికదా, సజాతీయులగు పక్షులును విడచినవా? చకారముచే విడచిన వనియే సూచితము. "పక్షిణోఽపి ప్రయాచన్తే సర్వభూతానుకంపినమ్" అని పక్షులకును రక్షకుడు కనుకను, ఆ పక్షులకు నాయకుడైన గరుడునకే రక్షకుడు కనుకను పక్షులును విడచినవి. పోనిండు. శమప్రధానులు మహర్షులు కాపాడవచ్చును కదా? ఈతనిని చేరదీసినచో సంసర్గదోషముచే మనకును చేటు తప్పదు. తుదకు అనన్యగతికుడగు వీనిని రాముడే రక్షించునని మహర్షులును విడచిపెట్టిరి. ఇట్లు తన్ను రక్షించువారు లేక 'నష్టగజో ఘటమ ప్యన్వేషతే' (ఏనుగును పోగొట్టుకొన్నవాడు తుదకు కుండలలో కూడ వెదకును) అను న్యాయముచే ద్వారము తెఱచియున్న ఇండ్లన్నింటిలో ప్రవేశించి, ముల్లోకములలో ఎవ్వరును తన్ను కాపాడకుండుటచే ఆ రామునే శరణుపొందెను. రాముడును "యది వా రావణః స్వయమ్" సర్వలోకశరణ్యుడుగా రక్షాసన్నద్ధుడు కదా. అతడు "దోషో యద్యపి", "న త్యజేయమ్" అని దోషిని కూడ క్షమించి, కాపాడువాడు అని భావము.

తత స్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్. 36

[1]దత్త్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః. 37

స రామాయ నమస్కృత్వా రాజ్ఞే దశరథాయ చ,
విసృష్ట స్తేన వీరేణ ప్రతిపేదే స్వ మాలయమ్. 38

మత్కృతే కాకమాత్రే తు బ్రహ్మాస్త్రం సముదీరితమ్,
కస్మా ద్యో మాం హర త్త్వత్తః క్షమసే తం మహీపతే. 39

స కురుష్వ మహోత్సాహః కృపాం మయి నరర్షభ,
త్వయా నాథవతీ నాథ హ్యనాథా ఇవ దృశ్యతే. 40

ఆనృశంస్యం పరో ధర్మః త్వత్త ఏవ మయా శ్రుతః,

---

అపు డా (బ్రహ్మాస్త్రముచే అభిమంత్రిత మగు) దర్భ కాకి కుడికంటిని పోగొట్టెను. ఆ కాకి అట్లు తన కుడికంటిని విడచిపెట్టి ప్రాణములు దక్కించుకొనెను. 36,37

అతడు రామునకు, దశరథ మహారాజునకును (దశరథుడు తన లోకముననే యుండుటచే ఆ కాకికి మిత్రభూతుడు కనుక) ప్రణమిల్లి వీరుడగు రాముడు విడిచిపెట్టగా తన నివాసమున కేగెను. 38

'రామా! నాకై కాకిపైగూడ బ్రహ్మాస్త్రము వేసినవాడవే. నన్నపహరించి నీనుండి దూరము చేసిన యా రావణుని క్షమించుచుంటివేల? 39

ఓ పురుషశ్రేష్ఠుడవగు రామా! నీవు మిక్కిలి ఉత్సాహము పూని నాపై దయ జూపుము. నీవు నాకు నాథుడవై యుండగా నే ననాథవలె నుంటినే. 40

పరుల దుఃఖము సహింపలేకుండుట పరమధర్మమని నీవలననే కదా వింటిని.

---

1 "సర్వనాశే సముత్పన్నే అర్ధం త్యజతి పండితః,
అర్ధేన కురుతే కార్యం సర్వనాశో హి దుర్భరః".

'సర్వము కోల్పోవు పరిస్థితి దాపురించినపుడు తెలివికలవాడు సగము వీడి, తక్కిన సగము కాపాడుకొనును.' అన్న లోకనీతి ననుసరించి సర్వేంద్రియములలో ప్రధానములగు కన్నులు రెంటిలో ఒకదానిని ఆ కాకి వదలుకొనెను.

జానామి త్వాం మహావీర్యం మహోత్సాహం మహాబలమ్. 41
అపారపార మక్షోభ్యం గాంభీర్యాత్ సాగరోపమమ్,
భర్తారం ససముద్రాయా ధరణ్యా వాసవోపమమ్. 42
ఏవ మస్త్రవిదాం శ్రేష్ఠ స్సత్యవాన్ బలవానపి,
కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః. 43
న నాగా నాపి గంధర్వా నాసురా న మరుద్గణాః,
రామస్య సమరే వేగం శక్తాః ప్రతిసమాధితుమ్. 44
తస్య వీర్యవతః కశ్చి ద్యద్యస్తి మయి సంభ్రమః,
కిమర్థం న శరైస్తీక్ష్ణైః క్షయం నయతి రాక్షసాన్. 45
భ్రాతు రాదేశ మాదాయ లక్ష్మణో వా పరంతపః,
కస్య హేతో ర్న మాం వీరః పరిత్రాతి మహాబలః. 46

---

నీవు మహాపరాక్రమశాలివవి, గొప్ప ఉత్సాహము కలవాడవని, మహాబలుడ వని, అంతులేని అనేకఘనకార్యములు సాధించితివని, ధైర్యశాలివని, గాంభీర్యమున సముద్రమునకు సాటియైనవాడవని, సముద్రవేలావలయితమగు సకలధరాతలమునకు ప్రభుడవని, దేవేంద్రునకు సాటియైనవాడ వనియు నే నెఱుగుదును. 41,42

హనుమంతుడా! ఇట్లు అస్త్రప్రయోగవిదులలో శ్రేష్ఠుడు, సత్యవంతుడు, బలవంతు డయ్యును, రాముడు రాక్షసులపై అస్త్ర మేల ప్రయోగింపడు? 43

నాగులుగాని, గంధర్వులుగాని, అసురులుగాని, మరుద్గణములు గాని యుద్ధమున రాముని వేగము నాపుటకు సమర్థులు కారు. 44

నరాక్రమశాలియగు రామునకు నా విషయమున ఏ మాత్రము త్వరయున్నను, వాడియైన బాణములతో రాక్షసుల నేల చంపడు? 45

మహాబలుడు, శత్రువులను పీడించువాడగు లక్ష్మణుడైనను అన్న యనుజ్ఞ పొంది నన్నేల కాపాడడు? 46

యది తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ,
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మా ముపేక్షతః. 47
మమైవ దుష్కృతం కించి న్మహ దస్తి న సంశయః,
సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ. 48
వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్,
అథాబ్రవీ న్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః. 49
త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన మే శపే,
రామే దుఃఖాభిపన్నే చ లక్ష్మణః పరితప్యతే. 50
కథంచి ద్భవతీ దృష్ట్వా న కాలః పరిశోచితుమ్,
ఇమం ముహూర్తం దుఃఖానాం ద్రక్ష్య స్యంత మనిందితే. 51

---

వాయువు, అగ్నులకు సాటియగు తేజముతో విరాజిల్లు నరశ్రేష్ఠులగు రామలక్ష్మణులు కలసియున్నచో దేవతలు కూడ వారి నెదిరింప లేరు. వారేల నన్ను ఉపేక్షించు చున్నారు? 47

కాన ఇందులకు నేను చేసిన మహాపాప మేదో కారణమై యున్నది. కావుననే నన్ను కాపాడ సమర్థులయ్యు శత్రుతాపములగు రామలక్ష్మణులు నన్ను చూడకున్నారు. 48

మహాతేజశ్శాలి, వాయుపుత్రుడగు హనుమంతు డట్లు దయగొలుపుచు కనుల నీరు కార్చుచున్న సీత మాట లాలించి యిట్లనెను. 49

ఓ సీతాదేవీ! నీ యెడబాటువలని శోకముచే రాముడు విషయాంతరవిముఖుడై యున్నాడు. (నీయందే మనను నిలిపి యున్నాడు) నేను సత్యముపై శపథము చేయుచున్నాను. రాముడు దుఃఖితుడగుటచే లక్ష్మణుడును దుఃఖించుచున్నాడు. 50

మహాప్రయత్నముచే నిన్ను చూడగలిగితిని. నీ విపుడు దుఃఖింపదగిన సమయము గాదు. ఓ అనిందితమగు శీలము కలదానా! అల్పకాలములో నీ దుఃఖములు నశింపగా

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రౌ మహాబలౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః. 52

హత్వా చ సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవ స్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి. 53

బ్రూహి యద్రాఘవో వాచ్యో లక్ష్మణశ్చ మహాబలః,
సుగ్రీవో వాపి తేజస్వీ హరయోఽపి సమాగతాః. 54

ఇత్యుక్తవతి తస్మింశ్చ సీతా సురసుతోపమా,
ఉవాచ శోకసంతప్తా హనుమంతం ప్లవంగమమ్. 55

[1]కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ,
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ. 56

---

చూతువు. 51

మహాబలవంతులు, రాజపుత్రులు, శ్రేష్ఠులగు రామలక్ష్మణులు నిన్ను చూడవలయునని ఉత్సాహము నొందినవారై లంకను గాల్చుదురు. 52

ఓ విశాలాక్షీ! రాముడు యుద్ధమున క్రూరుడగు రావణుని, వాని బంధువులను గూడ సంహరించి, నిన్ను తన నగరమునకు కొనిపోగలడు. 53

నే నట కేగి రామునకు, మహాబలుడగు లక్ష్మణునకు, తేజశ్శాలియగు సుగ్రీవునకు, నన్ను కలసికొనిన వానరులకు ఏమి చెప్పవలయునో తెలుపుము. 54

అని హమమంతుడు పలుకగా, దేవకన్యకు సాటియగు సీతాదేవి శోకపీడితయై ఆ హనుమంతున కిట్లనెను. 55

విశాలహృదయ యగు కౌసల్య కనినట్టి లోకపతియగు రాముని నాకొఱకై కుశల మడుగుము. శిరము వంచి ప్రణమిల్లితి ననుము. 56

---

[1] లోకమున స్త్రీలు ఇహపరలోకములలో స్వరక్షణార్థము పుత్రులను కనియెదరు. కాని మా అత్త అట్టిది కాదు. ఆమె విశాలమగు మనస్సు కలది. నా తనయుడు సర్వలోకరక్షకుడు కావలెనని వ్రత మొనర్చి పుత్రుని కనినది.

స్రజశ్చ సర్వరత్నాని ప్రియా యాశ్చ వరాంగనాః,
ఐశ్వర్యం చ విశాలాయాం పృథివ్యామపి దుర్లభమ్. 57
పితరం మాతరం చైవ సమ్మా న్యాభిప్రసాద్య చ,
అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః. 58
ఆనుకూల్యేన ధర్మాత్మా త్యక్త్వా సుఖ మనుత్తమమ్,
అనుగచ్ఛతి కాకుత్స్థం భ్రాతరం పాలయన్ వనే. 59
సింహస్కంధో మహాబాహు ర్మనస్వీ ప్రియదర్శనః,
పితృవ ద్వర్తతే రామే మాతృవ న్మాం సమాచరన్. 60
హ్రియమాణాం తదా వీరో న తు మాం వేద లక్ష్మణః,
వృద్ధోపసేవీ లక్ష్మీవాన్ శక్తో న బహుభాషితా. 61
రాజపుత్రః ప్రియః శ్రేష్ఠః సదృశః శ్వశురస్య మే,

---

సుమిత్రకు సత్సంతాన మగు లక్ష్మణుడు పుష్పమాలలను, సకలరత్నములను, ప్రియురాలగు ఊర్మిళను, శ్రేష్ఠవనితలను, విశాలమగు భూతలముపై దుర్లభమగు ఐశ్వర్యమును పరిత్యజించి, తండ్రిని, తల్లిని గౌరవించి, వారిని ప్రసన్నుల నొనర్చి రాము ననుసరించినాడు. 57,58

ధర్మాత్ముడగు లక్ష్మణుడు అన్నయందలి భక్తిచే పరమసుఖమును సయితము వీడి, అడవిలో తన యన్న రాముని కాపాడుచు అనుసరించుచున్నాడు. 59

అతడు సింహపు మూపువంటి మూపు కలవాడు. గొప్ప బాహువులు కలవాడు. మానధనుడు. చూచువారికి ప్రీతి గూర్చువాడు. అట్టి లక్ష్మణుడు రాముని తండ్రినివలెను, నన్ను తల్లినివలెను ఆదరముతో చూచుచున్నాడు. 60

రావణు డపుడు న నన్నపహరించుకొనిపోవుట నా మరది, లక్ష్మణు డెఱుగడు. అతడు పెద్దలను సేవించువాడు, శ్రీమంతుడు, సమర్థుడు, మితభాషి. 61

అతడు రాచబిడ్డ. ఎల్లరకు ప్రీతిపాత్రుడు. యోగ్యుడు. మా మామగారికి

మమ ప్రియతరో నిత్యం భ్రాతా రామస్య లక్ష్మణః,
నియుక్తో ధురి యస్యాం తు తా ముద్వహతి వీర్యవాన్. 62

యం దృష్ట్వా రాఘవో నైవ వృత్త మార్య మనుస్మరేత్,
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనా న్మమ,
మృదు ర్నిత్యం శుచి ర్దక్షః ప్రియో రామస్య లక్ష్మణః. 63

యథా హి వానరశ్రేష్ఠ దుఃఖక్షయకరో భవేత్,
త్వ మస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ. 64

రాఘవ స్త్వత్సమారంభా న్మయి యత్నపరో భవేత్,
ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునః పునః. 65

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ,
ఊర్ధ్వం మాసా న్న జీవేయం సత్యే నాహం బ్రవీమి తే. 66

---

సాటియైన వాడు. నా కెల్లప్పుడు మిక్కిలి ప్రీతి గూర్చువాడు. తన కిచ్చిన పనిని చక్కగా నిర్వహించువాడు. 62

లక్ష్మణునిపై (తండ్రివలె కాపాడుచున్నాడని) ప్రేమతో రాముడు గతించిన మా మామ దశరథుని గూడ తలంపడు అట్టి లక్ష్మణునితో నా మాటగా కుశలము తెలుపుము. అతడు మృదువైనవాడు, నిత్యము కపటము లేనివాడు, సమర్థుడు, రామునకు ప్రీతిపాత్రుడు. 63

ఓ వానరశ్రేష్ఠుడా! ఎట్లాచరించిన నా దుఃఖము తొలగునో అటు లాచరించుటకు నీవే సమర్థుడవు. 64

రాముడు నీ ప్రయత్నమువలననే నన్ను కొనిపోవుట కుద్యమించగలడు. శూరుడు నా నాథుడు రామునకు మరల మరల నిట్లు తెలుపుము. 65

రామా! నే నింక నొక్క నెల జీవింతును. ఆపైన జీవింపను. నేను నీతో సత్యము పలుకుచున్నాను. 66

రావణే నోపరుద్ధాం మాం నికృత్యా పాపకర్మణా,
త్రాతు మర్హసి వీర త్వం [1]పాతాళాదివ కౌశికీమ్. 67
తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్,
ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ. 68
ప్రతిగృహ్య తతో వీరో మణిరత్న మనుత్తమమ్,
[2]అంగుళ్యా యోజయామాస న హ్యస్య ప్రాభవద్ భుజః. 69

---

వీరుడవగు రామా! వంచనచేసి పాపాత్ముడగు రావణుడు చెఱబెట్టిన నన్ను పాతాళమునుండి ఇంద్రుని రాజ్యలక్ష్మిని వలె రక్షింపదగుదువు. 67

పిమ్మట ఆమె తన చీరకొంగున కట్టుకొనిన దివ్యము, శుభమగు చూడామణిని తీసి, రాముని కిమ్మని హనుమంతుని కిచ్చెను. 68

వీరుడగు హనుమ ఆ మణిశ్రేష్ఠమును స్వీకరించి దానిని తన వ్రేలికి పెట్టుకొనెను. ఆ సమయమున అతడు గమనోచితమగు సూక్ష్మరూపము దాల్చుటచే అతని చేయి లావుగా లేకుండెను. (కాన చూడామణిని వ్రేలికి తొడుగుటకు వీలు కలిగెను.) 69

---

[1] పూర్వము దేవేంద్రుడు వృత్రుని వధించుటచే బ్రహ్మహత్యాపాపము నంది, నిశ్శ్రీకు డయ్యెను. అపుడు భగవంతుడగు శ్రీమన్నారాయణుడు దేవతలతో కూడి విష్ణువు దేవతగా కల అశ్వమేధయాగముచే అతనిని పాపరహితుని చేసి, త్రైలోక్యరాజ్యమం దభిషిక్తు నొనర్చి, వెనుకటి దేవేంద్రుని సిరి నాహ్వానించెను. ఆమె గవాక్షతీర్థమం దున్నదని అశరీరవాణి పలుకగా, ఆమెకై విష్ణువు, దేవతలును అట కేగిరి. అంతట వారలను చూచిన సిరి పాతాళమున ప్రవేశించెను. అచట ప్రవేశింప నశక్తులైన దేవతలు మరల 'మీలో సర్వలక్షణ సంపన్నుడగునా డామెను తీసికొనరాగలుగు' నను అశరీరవాణి మాటలు విని విష్ణువును ప్రార్థించిరి. ఆయన పాతాళమున ప్రవేశించి, అటనుండి ఆమెను తెచ్చి, దేవేంద్రుని కిచ్చెనని బ్రహ్మపురాణ గాథ.

[2] చూడామణికి పృష్ఠభాగము బంగారముతో చేయబడినది. దానికి గల ఛిద్రము గుండా వెంట్రుకలు జొనిపి వనితలు దీనిని ధరింతురు. ఆ ఛిద్రము (చిల్లి) ఉండుటవల్లనే హనుమ ఆ మణిని వ్రేలికి ధరింపగలుగుట.

మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాఽభివాద్య చ,
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతః స్థితః. 70
హర్షేణ మహతా యుక్త స్సీతాదర్శనజేన సః,
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః. 71
మణివరముపగృహ్య తం మహార్హం, జనకనృపాత్మజయా ధృతం ప్రభావాత్,
గిరిరివ పవనావధూతముక్త, స్సుఖితమనాః ప్రతిసంక్రమం ప్రపేదే. 72

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టత్రింశః సర్గః.*

---

హనుమంతు డా మణిశ్రేష్ఠమును సీత వద్ద స్వీకరించి, యామెకు ప్రదక్షిణమొనర్చి, ప్రణమిల్లి ప్రక్కనే నిలచెను. 70

సీతాదేవిని చూచుటవలన మహానందముతో నిండిన హనుమంతుడు మనస్సుచే రాముని చేరెను. (మదిలో తలంచెను.) శరీరముచే మాత్ర మచట నిలచెను. 71

హనుమంతు డా విధముగ సీతను దర్శించి తన ప్రభావాతిశయముచే ఆమె ధరించిన ఉత్తమమగు ఆ చూడామణిని తీసికొని, పెనుగాలికి కంపించి, యా గాలి తాకిడినుండి విముక్తమైన కొండవలె (ఇచట కొండ కంపించుట అనగా దానిపై నున్న వృక్షాదులు చలించుట) ముందు సీతాన్వేషణకాలమున మనస్సు తల్లడిల్లి, పిదప ఆమె దర్శనముచే ఆనందించగా తిరుగు ప్రయాణమున కుద్యుక్తుడయ్యెను. 72

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదియెనిమిదవ సర్గము.*

# 39. ఏకోనచత్వారింశః సర్గః

*( హనుమంతుడు సీత నోదార్చుట)*

మణిం దత్త్వా తత స్సీతా హనుమంత మథాబ్రవీత్,
అభిజ్ఞాన మభిజ్ఞాత మేత ద్రామస్య తత్త్వతః. 1

మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి,
వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ. 2

స భూయ స్త్వం సముత్సాహే చోదితో హరిసత్తమ,
అస్మిన్ కార్యసమారంభే ప్రచింతయ యదుత్తరమ్. 3

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ,
హనుమన్ యత్న మాస్థాయ దుఃఖక్షయకరో భవ,
తస్య చింతయతో యత్నో దుఃఖక్షయకరో భవేత్. 4

---

సీతాదేవి హనుమంతున కా మణి నిచ్చి ఇట్లనెను. 'ఈ యభిజ్ఞానము రామునకు బాగుగా తెలిసినట్టిది. వీరుడగు రాము డీ మణిని చూచి మా తల్లిని, నన్ను, దశరథుని స్మరింపగలడు. 1,2

ఓ వానరోత్తమా! నీ వెట్టైన రాముని ప్రేరణ చేసి కార్యము సంఘటిల్లునట్లు చేయుమని మఱల చెప్పుచున్నాను. నీ వీ పనిలో నిటుపై చేయవలసిన దేమో యూహింపుము. 3

ఈ కార్యము నెరవేరుటకు నీవే వ్యవస్థాపకుడవు (కర్తవు). ఓ వానరశ్రేష్ఠుడవగు హనుమంతుడా! నీవు ప్రయత్నపూర్వకముగ నా దుఃఖము తొలగించుము. మహాత్ముడవగు నీవు బాగుగ ఆలోచించి కార్యము చేయుదుచేని నీ ప్రయత్నము నా దుఃఖమును పోగొట్టును. 4

స తథేతి ప్రతిజ్ఞాయ మారుతి ర్భీమవిక్రమః,
శిరసాऽऽవంద్య వైదేహీం గమనా యోపచక్రమే. 5
జ్ఞాత్వా సంప్రస్థితం దేవీ వానరం మారుతాత్మజమ్,
బాష్పగద్గదయా వాచా మైథిలీ వాక్య మబ్రవీత్. 6
కుశలం హనుమన్ బ్రూయా స్సహితౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవం చ సహామాత్యం వృద్ధాన్ సర్వాంశ్చ వానరాన్,
బ్రూయా స్త్వం వానరశ్రేష్ఠ కుశలం ధర్మసంహితమ్. 7
యథా న చ మహాబాహు ర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్ త్వం సమాధాతు మర్హసి. 8
జీవంతీం మాం యథా రామ స్సంభావయతి కీర్తిమాన్,
తత్తథా హనుమన్ వాచ్యం వాచా ధర్మ మవాప్నుహి. 9
నిత్య ముత్సాహయుక్తాశ్చ వాచః శ్రుత్వా త్వయేరితాః,

---

అరిభయంకరమగు పరాక్రమము గల హనుమంతు డట్లే యని సీతాదేవికి ప్రతిజ్ఞ చేసి, శిరము వంచి యామెకు ప్రణమిల్లి బయలుదేర నుద్యమించెను. 5

మారుతాత్మజు డగు హనుమ బయలుదేరుట తెలిసి సీతాదేవి బాష్పముచే రుద్ధమైన మాటలతో నతని కిట్లనెను. 6

హనుమంతుడా! రామలక్ష్మణు లిరువురిని క్షేమ మడుగుము. వానరశ్రేష్ఠుడా! సుగ్రీవుని, ఆయన మంత్రులను, సకలవానరవృద్ధులను ధర్మపురస్సరముగా కుశల మడిగితి ననుము. 7

మహాభుజుడగు రాముడు నన్నీ దుఃఖసముద్రమునుండి దాటించునట్లు నీ వాయనను సమాధానపఱచుము. 8

హనుమంతుడా! కీర్తిమంతు డగు రాముడు నన్ను జీవించినదానినిగా చేయునట్లు నీ వాయనతో మాటలాడుము. ఇట్లు నీవు వాచికధర్మ మాచరింపుము. 9

నీవు నిత్యము ఉత్సాహము కలిగించు మాటలు పలుకగా, వానిని విని నన్ను

వర్ధిష్యతే దాశరథేః పౌరుషం మదవాప్తయే. 10

మత్సందేశయుతా వాచస్త్వత్తః శ్రుత్వైవ రాఘవః,
పరాక్రమవిధిం వీరో విధివత్ సంవిధాస్యతి. 11

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః,
శిర స్యంజలి మాధాయ వాక్య ముత్తర మబ్రవీత్. 12

క్షిప్ర మేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరై ర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి. 13

న హి పశ్యామి మర్త్యేషు నాసురేషు సురేషు వా,
యస్తస్య క్షిపతో బాణాన్ స్థాతు ముత్సహతేఽగ్రతః. 14

అప్యర్కమపి పర్జన్యమపి వైవస్వతం యమమ్,
స హి సోఢుం రణే శక్త స్తవ హేతో ర్విశేషతః. 15

---

తీసికొనివచ్చుటకు రాముని పౌరుషము పెంపొందగలదు. 10

నా సందేశరూపములగు నీ మాటలు వినుటతోడనే వీరుడగు రాముడు యథావిధిగా పరాక్రమమును ప్రదర్శింపగలడు. 11

వాయుపుత్రుడగు హనుమంతుడు సీతాదేవి పలికిన మాటలు విని శిరముపై కేలుమోడ్చి, యనంతరవాక్య మిట్లు పలికెను. 12

అమ్మా! రాముడు శీఘ్రమే వానరశ్రేష్ఠులతో, భల్లూకములతో గూడి రాగలడు. ఆయన యుద్ధమున శత్రువులను జయించి, నీ శోకము పోగొట్టగలడు. 13

మనుజులలో, అసురులలో లేదా దేవతలలో, రాముడు బాణములు విడచు చుండగా నాతని యెదుట నిలువ జాలిన వానిని నేనింతవఱకు చూడలేదు. 14

అతడు యుద్ధమున సూర్యుని గాని, ఇంద్రుని గాని, యముని గాని జయింప సమర్థుడు. నీకొరకై జయించునని విశేషించి చెప్ప పనిలేదు. 15

ఆయన సాగరపర్యంతమగు భూమిని పాలింప నుత్సహించుచున్నాడు. ఓ జనక

స హి సాగరపర్యంతాం మహీం శాసితు మీహతే,
త్వన్నిమిత్తో హి రామస్య జయో జనకనందిని. 16

తస్య తద్వచనం శ్రుత్వా సమ్యక్ సత్యం సుభాషితమ్,
జానకీ బహుమేనేஉథ వచవం చేద మబ్రవీత్. 17

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం సౌహార్దా దనుమానయత్. 18

యది వా మన్యసే వీర వసైకాహమరిందమ,
కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాంతః శ్వో గమిష్యసి. 19

మమ చే దల్పభాగ్యాయాః సాన్నిధ్యా త్తవ వానర,
అస్య శోకస్య మహతో ముహూర్తం మోక్షణం భవేత్. 20

గతే హి హరిశార్దూల పునరాగమనాయ తు,
ప్రాణానామపి సందేహో మమ స్యా న్నాత్ర సంశయః. 21

---

రాజపుత్రీ!రాముడు నీ కొరకై లంకను జయించును. 16

సీతాదేవి హనుమంతుడు పలికిన యుక్తము, సత్యము, వీనుల కింపైనది యగు వచనమును విని అతడు మఱల పోవుట కుద్యమించుచుండగా, మాటిమాటికి, అతనిని చూచుచు భర్తకు తనపై గల ప్రీతిని వెల్లడించు హనుమంతుని వాక్యములకు సంతోషించి యతనిని గౌరవించుచు నిట్లనెను. 17,18

శత్రువుల నణచునట్టి ఓ వీరుడా! నీ కిష్టమగుచో నిచట ఏదో ఒక రహస్యప్రదేశమున ఈ దినము విశ్రమించి రేపు పోవచ్చును. 19

ఓ వానరుడా! నీ వట్లు ఉన్నచో మందభాగ్యురాల నగు నేను నాకు కలిగిన యీ మహాదుఃఖమునుండి క్షణకాలమైన నిముక్తి నందెదను. 20

ఓ వానరశ్రేష్ఠుడా! అట్లుగాక నీవిపుడే పోయివచ్చెదవేని నా ప్రాణములు నిలుచుట కూడా సంశయమే. ఇందేమియు సందేహము లేదు. 21

తవాదర్శనజ శ్శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖా ద్దుఃఖపరామృష్టాం దీపయన్నివ వానర. 22
అయం చ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాం స్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర. 23
కథం ను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. 24
త్రయాణా మేవ భూతానాం సాగర స్యాస్య లంఘనే,
శక్తిః స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా. 25
తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిదాం వరః. 26
కామ మస్య త్వమే వైకః కార్యస్య పరిసాధనే,

---

వానరుడా! నీ వగపడకపోవుటచే కలుగు దుఃఖము, పూర్వము కలిగిన దుఃఖము కంటె అధికదుఃఖ మనుభవించుచున్న నన్నింకను పరితపింపజేయగలదు. 22

వీరుడా! నీకు సహాయులగు వానరులు, భల్లూకముల విషయమున నాకొక సందేహము మదిలో నెలకొని రూపుదాల్చి నా యెదుట నిలచినటులున్నది. 23

ఆ కోతులుగాని, ఎలుగులుగాని లేక ఆ రాజపుత్రులు గాని అపారమగు సముద్రము నెట్లు దాటెదరు? 24

ఈ నముద్రము దాటుటకు గరుత్మంతుడు, నీవు, నీ తండ్రి వాయుదేవుడు ముప్వురు మాత్రమే సమర్థులు. 25

ఓ వీరుడా! ఇట్లు కష్టసాధ్యమగు ఈ కార్యమును నిర్వహించుట కుపాయ మేమాలోచించితివి? నీవు కార్యము సాధించు నుపాయజ్ఞులలో శ్రేష్ఠుడవు కదా! 26

శత్రువీరులను నంహరించువాడా! సకలరాక్షసులను వధించి నన్ను కాపాడుట యను కార్యమును సాధించుటకు నీ వొక్కడవే చాలును. కాని అట్టి శక్తిసమృద్ధి నీకు

పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే ఫలోదయః. 27

బలై స్సమగ్రై ర్యది మాం రావణం జిత్య సంయుగే,
విజయీ స్వపురం యాయాత్ తత్తు మే స్యాద్ యశస్కరమ్. 28

శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయే ద్యది కాకుత్స్థ స్తత్తస్య సదృశం భవేత్. 29

తద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః,
భవే దాహవశూరస్య తథా త్వ ముపపాదయ. 30

తదర్థోపహితం వాక్యం సహితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాన్ శేషం వాక్య ముత్తర మబ్రవీత్. 31

దేవి హర్యృక్షసైన్యానా మీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవ స్సత్త్వసంపన్న స్తవార్థే కృతనిశ్చయః. 32

---

యశస్సు నిచ్చునే గాని నాకు మాత్రము కాదు. 27

అట్లు కాక, రాముడు పమగ్రసేనాపరివృతుడై యుద్ధమున రావణుని జయించి, నన్ను తీసికొని తన నగరమున కేగుచో అది నాకు కీర్తికరము కాగలదు. 28

కకుత్స్థవంశజుడగు రాముడు శత్రుసైన్యములను పీడించువాడయి లంకానగరిని బాణములతో నింపి, నన్ను తీసికొనిపోవుట ఆయనకు తగినపని. 29

కావున యుద్ధమున శౌర్యము జూపగలవాడు, మహాత్ముడగు రాము డనురూపమగు పరాక్రమము నెట్లు ప్రదర్శింపగలుగునో నీవట్లు చేయవలయును. 30

అర్థయుక్తము, పరస్పరసంగతము, యుక్తియుక్తము అగు సీతాదేవి వచన మాలించి హనుమంతుడు (ముందు తెలిపియుండని) ఉత్తరవాక్య మిట్లు చెప్పెను. 31

ఓ దేవీ! కోతులు ఎలుగుల సేన కధిపతి, బలసమన్వితుడు, వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుడు నీ కార్యము సాధింప దృఢనిశ్చయుడై యున్నాడు. 32

స వానరసహస్రాణాం కోటీభి రభిసంవృతః,
క్షిప్ర మేష్యతి వైదేహి రాక్షసానాం నిబర్హణః. 33
తస్య విక్రమసంపన్నా స్సత్త్వవంతో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః. 34
యేషాం నోపరి నాధస్తా న్న తిర్యక్ సజ్జతే గతిః,
న చ కర్మసు సీదంతి మహ త్స్వమితతేజసః. 35
అసకృత్ త్రై ర్మహోత్సాహై స్ససాగరధరాధరా,
ప్రదక్షిణీకృతా భూమి ర్వాయుమార్గానుసారిభిః. 36
మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చి న్నాస్తి సుగ్రీవసన్నిధౌ. 37
అహం తావ దిహ ప్రాప్తః కింపున స్తే మహాబలాః,

---

ఓ సీతాదేవీ! రాక్షసులను యుద్ధమున సంహరింపగల అతడు వేలాది కోట్ల వానరులతో శీఘ్రమే బయలుదేరి రాగలడు. 33

పరాక్రమసంపన్నులు, ధైర్యశాలురు, మహాబలసమన్వితులు, మనోవేగముతో సదృశమగు గమనము కల వానరు లాయన యాజ్ఞకు లోబడి యున్నారు. 34

వారు పైకిగాని, క్రిందకుగాని, అడ్డముగాగాని, అడ్డులేకయే సంచరింపగలరు. అమిత పరాక్రమసంపన్నులు. పెద్ద కార్యములు చేపట్టియు వైఫల్యము నొందరు. 35

అధికోత్సాహులగు ఆ వానరు లనేకమార్లు వాయుమార్గమున తిరుగుచు సముద్ర పర్వతములతో కూడిన భూమికి ప్రదక్షిణము చేసినవారు. 36

ఆ సుగ్రీవునికడ నాకంటె నధికులు, నాతో సమానులగు వానరు లనేకులు కలరు. నా కంటె హీనబలు డం దొక్కడును లేడు. 37

నేనే ఈ విశాలసాగరమును దాటి యిటకు రాగలిగితిని. ఇంక మహాబలులగు తక్కిన వానరుల విషయము వేఱుగా చెప్పవలెనా? ఇట్టి దౌత్యము మున్నగు పనులకు

న హి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః. 38

తదలం పరితాపేన దేవి శోకో వ్యపైతు తే,
ఏకోత్పాతేన తే లంకా మేష్యంతి హరియూథపాః. 39

మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యా వివోదితౌ,
త్వత్సకాశం మహాసత్త్వౌ నృసింహా వాగమిష్యతః. 40

తతో వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ,
ఆగమ్య నగరీం లంకాం సాయకై ర్విధమిష్యతః. 41

సగణం రావణం హత్వా రాఘవో రఘునందనః,
త్వా మాదాయ వరారోహే స్వపురం ప్రతియాస్యతి. 42

తదాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ,
నచిరాద్ ద్రక్ష్యసే రామం ప్రజ్వలంత మివానలమ్. 43

---

సామాన్యుల నంపుదురు కాని గొప్పవారిని కాదు కదా (కావున మా రాజు కనుసన్నలలో మెలగు చాలమంది నా కంటె విశిష్టులే). 38

కావున ఓ దేవీ! నీవింక పరితాపము చెందకుము. నీ శోకము వీడుము. ఆ వానర యూథపతు లంద రొక్క గంతుతో ఈ లంకాపురికి చేరగలరు. 39

మహాబలవంతులు, పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణులు నా వీపుపై నెక్కి ఉదయించిన సూర్యచంద్రులవలె నీచెంతకు వత్తురు లెమ్ము. 40

పిమ్మట వీరులు, నరశ్రేష్ఠులగు రామలక్ష్మణు లిరువురును ఆ నగరమును బాణములతో నాశము చేతురు. 41

ఓ సుందరాంగీ! రఘువంశమున బుట్టినవాడగు రాముడు రావణుని వాని బంధువర్గముతో కూడ చంపివైచి నిన్ను తీసికొని తన పురమున కేగగలడు. 42

కావువ ఓ సీతాదేవీ! నీ వింక ఊరడిల్లుము. నిన్ను నీ పతి విడిపించుకొను సమయమున కెదురుచూడుము. శీఘ్రమే నీవు జ్వలించు అగ్నివలె నున్న నీ వతి రాముని చూచెదవు. 43

నిహతే రాక్షసేంద్రేఽ స్మిన్ సపుత్రామాత్యబాంధవే,
త్వం సమేష్యసి రామేణ శశాంకే వేవ రోహిణీ. 44
క్షిప్రం త్వం దేవి శోకస్య పారం యాస్యసి మైథిలి,
రావణం చైవ రామేణ నిహతం ద్రక్ష్యసేఽ చిరాత్. 45
ఏవ మాశ్వాస్య వైదేహీం హనుమాన్ మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీం పున రబ్రవీత్. 46
తమరిఘ్నం కృతాత్మానం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్,
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వార ముపస్థితమ్. 47
నఖదంష్ట్రాయుధాన్ వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,
వానరాన్ వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్. 48
శైలాంబుదనికాశానాం లంకామలయపానుషు,

---

రావణుడు, అతని పుత్రులు, మంత్రులు, బంధువులు యుద్ధమున చచ్చిన పిమ్మట రోహిణి చంద్రునితో వలె, నీవు రామునితో కూడగలవు. 44

సీతాదేవీ! నీవు శీఘ్రమే దుఃఖసాగరము దరిజేరెదవు. రాముడు రావణు నచిరకాలముననే చంపగా చూతువు. 45

అని యిట్లు వాయుతనయుడగు హనుమంతుడు సీత నోదార్చి ప్రయాణింప నిశ్చయించుకొని మఱల సీత కిట్లనెను. 46

"అమ్మా! శత్రుసూదనుడు, కృతనిశ్చయుడగు రాముడు, విల్లు చేపట్టిన లక్ష్మణుడును అచిరకాలముననే లంకాద్వారమును సమీపించగా చూతువు. 47

శీఘ్రమే గోళ్ళు కోఱలు ఆయుధములుగా గలవారు, సింహములు, పెద్దపులులవలె పరాక్రమశాలురును, గజశ్రేష్ఠములవలె పెనుమేను గలవారును అగు వానరులు శీఘ్రమే లంకాద్వారము చేరగా చూచెదవు. 48

ఆర్యురాలా! నీవు శీఘ్రమే పర్వతములవలె, మబ్బులవలెను ఉన్నవారై, లంకానగర

నర్దతాం కపిముఖ్యానా మార్యే యూథా న్యనేకశః. 49

స తు మర్మణి ఘోరేణ తాడితో మన్మథేషుణా,
న శర్మ లభతే రామ స్సింహార్దిత ఇవ ద్విపః. 50

మా రుదో దేవి శోకేన మా భూత్తే మనసోఽప్రియమ్,
శచీవ పత్యా శక్రేణ భర్త్రా నాథవతీ హ్యసి. 51

రామా ద్విశిష్టః కోఽ న్యోఽ స్తి కశ్చిత్ సౌమిత్రిణా సమః,
అగ్నిమారుతకల్పౌ తౌ భ్రాతరౌ తవ సంశ్రయౌ. 52

నాస్మిం శ్చిరం వత్స్యసి దేవి దేశే, రక్షోగణై రధ్యుషితేఽ తిరౌద్రే,
న తే చిరా దాగమనం ప్రియస్య, క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్. 53

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకోనచత్వారింశః సర్గః.*

---

మందలి మలయసానువులపై సింహనాదము లొనర్చు వానరుల గుంపు లనేకములను చూచెదవు లెమ్ము. 49

రాముడును తీవ్రమగు మన్మథబాణములు మర్మస్థానమును తాకగా సింహపీడితమగు ఏనుగువలె సుఖము నొందుట లేదు. 50

దేవీ! నీ వింక శోకింపకుము. నీ మనస్సున కలతపడకుము. దేవేంద్రునితో శచీదేవి వలె నీవు నీ పతితో కూడినట్లే యవి తలంపుము. 51

రామునికంటె గొప్పవాడెవ్వడు? లక్ష్మణునకు సాటియగువా డెవ్వడు? అగ్నివాయువులతో సమానులగు ఆ సోదరులిరువురు నీ కాశ్రయముగా నున్నారు. 52

ఓ సీతాదేవీ! రాక్షససమూహముల కావాసమై, మిక్కిలి భయంకరమగు ఈ లంకలో నీ వెంతో కాలముండవు. నీ ప్రియుడు శీఘ్రమే రాగలడు. నే నాయనను కలిసికొనువఱకు నీ వీ క్లేశము సహింపుము" మని హనుమ సీతాదేవితో పలికెను. 53

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ముప్పదితొమ్మిదవ సర్గము.*

# 40. చత్వారింశః సర్గః

*(రామునకు సీత సందేశ మిచ్చుట)*

శ్రుత్వా తు వచనం తస్య వాయుసూనో ర్మహాత్మనః,
ఉవా చాత్మహితం వాక్యం సీతా సురసుతోపమా. 1

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర,
అర్ధసంజాతసస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా. 2

యథా తం పురుషవ్యాఘ్రం గాత్రై శ్శోకాభికర్శితైః,
సంస్పృశేయం సకామాహం తథా కురు దయాం మయి. 3

అభిజ్ఞానం చ రామస్య దద్యా హరిగణోత్తమ,
క్షిప్తా మిషీకాం కాకస్య కోపా దేకాక్షిశాతనీమ్. 4

---

దేవకన్యను బోలు ఆ సీతాదేవి మహాత్ముడగు ఆ హనుమంతుని వచన మాలించి, తనకు హితమగు ఈ మాట పలికెను. 1

హనుమా! నాకు ప్రియవార్త చెప్పుచున్న నిన్ను చూచుటవల్ల వాన కురియగా భూమిపై వెనుక సగము మొలచిన పైరు, మరల మొలచునట్లు నాకు సగము కార్యము నెరవేరెనని మిక్కిలి సంతోషించుచున్నాను. 2

మదనపీడిత నగు నేను శోకపీడితములగు అవయవములతో తనివితీర పురుషశ్రేష్ఠుడగు రాముని చక్కగా స్పృశించగలుగునట్లు నాకు దయతో సంఘటిల్లజేయుము. 3

వానరగణశ్రేష్ఠుడా ! కాకిపై కోపముతో తృణమును ప్రయోగించి దాని నేత్రమును హరించుట యను వృత్తాంతమును రామునకు ఆనవాలుగా తెలుపుము. 4

మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తు మర్హసి. 5
స వీర్యవాన్ కథం సీతాం హృతాం సమనుమన్యసే,
వసంతీం రక్షసాం మధ్యే మహేంద్రవరుణోపమః. 6
ఏష చూడామణి ర్దివ్యో మయా సుపరిరక్షితః,
ఏతం దృష్ట్వా ప్రహృష్యామి వ్యసనే త్వా మివానఘ. 7
ఏష నిర్యాతితః శ్రీమాన్ మయా తే వారిసంభవః,
అతః పరం న శక్ష్యామి జీవితుం శోకలాలసా. 8
అసహ్యాని చ దుఃఖాని వాచశ్చ హృదయచ్ఛిదః,
రాక్షసీనాం సుఘోరాణాం త్వత్కృతే మర్షయా మ్యహమ్. 9

---

"పూర్వమొకప్పుడు నేను నుదుట ధరించిన తిలకము గండ మను పర్వత పార్శ్వ ప్రదేశమునం దరణ్యసంచారమున చెమటకు కరిగిపోగా నీవు మణిశిలను తిలకముగా చేసి నుదుటికి బదులుగా నా చెక్కిలిపై పెట్టితివి. దానిని కూడ స్మరించుము. 5

"రామా! నీవు పరాక్రమమున దేవేంద్రునకు, వరుణునకు సాటియగువాడవు. నన్ను రావణు డపహరింపగా రాక్షసుల నడుమ చిక్కియుంటివే. నీ వీ తిరస్కార మెట్లు సహించుచున్నావు"? 6

ఓ అనఘుడా! దివ్యమగు ఈ చూడామణిని నేను బాగుగా కాపాడుకొనుచుంటిని. కష్టములలో దీనిని చూచుకొని నిన్ను చూచినట్లు సంతోషించుచుందును. 7

శ్రీమంతమై, రత్నములకు నెలవగు సముద్రమున పుట్టిన ఈ మణిని నీకు పంపితిని. నే నింక (ఊరటనిచ్చు ఈ మణియు చెంతలేదు కాన) శోకపీడితనై చిరకాలము జీవింపజాలను. 8

భయంకరాకారలగు ఈ రాక్షసవనితలు పెట్టు బాధలు దుస్సహములు. వారి పలుకులు గుండెలో నాటుకొను ములుకులు. నీకొరకై వీనిని సహించుచున్నాను. 9

ధారయిష్యామి మాసం తు జీవితం శత్రుసూదన,
ఊర్ధ్వం మాసా న్న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ. 10
ఘోరో రాక్షసరాజోఽయం దృష్టిశ్చ న సుఖా మయి,
త్వాం చ శ్రుత్వా విషజ్జంతం న జీవేయ మహం క్షణమ్. 11
వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్,
అథాబ్రవీ న్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః. 12
త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే. 13
కథంచిత్ భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్,
ఇమం ముహూర్తం దుఃఖానా మంతం ద్రక్ష్యసి భామిని. 14
తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రా వరిందమౌ,

---

ఓ శత్రువినాశకుడవగు రామా! నేనింక నొక్క మాసము జీవింతును. నిన్ను విడచి ఆపై జీవింపజాలను. 10

నీవును దుఃఖించుచుంటివని విని (ఒక్క నెలతరువాత) క్షణకాలమైనను జీవింపనొల్లను. 11

మహాతేజశ్శాలి వాయుపుత్రుడగు హనుమంతుడు, కన్నుల నీరు నింపుకొని దయనీయముగ సీతాదేవి పలికిన మాటలు విని యిట్లనెను. 12

"ఓ దేవీ! నీ యెడబాటువలని శోకముచే రాము డన్ని పనులందును విముఖుడై యున్నాడు. నేను సత్యముపై ఒట్టు పెట్టి చెప్పుచున్నాను. రాముడు దుఃఖించగనే లక్ష్మణుడును దుఃఖించుచున్నాడు". 13

ఓ సీతాదేవీ! చాల ప్రయత్నముచే నీ వగపడితివి. ఇది దుఃఖింపదగిన సమయము కాదు. ఈ క్షణమే నీ దుఃఖములు తొలగగా చూచెదవు. 14

నరశ్రేష్ఠులు, రాజపుత్రులు, శత్రువినాశకులగు రామలక్ష్మణులు నిన్ను చూడవలెనను

త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః. 15
హత్వా తు సమరే క్రూరం రావణం సహబాంధవమ్,
రాఘవౌ త్వాం విశాలాక్షి స్వాం పురీం ప్రాపయిష్యతః. 16
యత్తు రామో విజానీయా దభిజ్ఞాన మనిందితే,
ప్రీతిసంజననం తస్య భూయ స్త్వం దాతు మర్హసి. 17
సాఽబ్రవీ ద్దత్తమేవేతి మయాభిజ్ఞాన ముత్తమమ్,
ఏతదేవ హి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్,
శ్రద్ధేయం హనుమన్ వాక్యం తవ వీర భవిష్యతి. 18
స తం మణివరం గృహ్య శ్రీమాన్ ప్లవగసత్తమః,
ప్రణమ్య శిరసా దేవీం గమనా యోపచక్రమే. 19
త ముత్పాతకృతోత్సాహ మవేక్ష్య హరిపుంగవమ్,

---

ఉత్సాహముతో లంకను భస్మము చేతురు. 15

ఓ విశాలాక్షీ! రామలక్ష్మణులు యుద్ధమున క్రూరుడగు రావణుని, వాని బంధువులను వధించి నిన్ను తమ నగరమునకు కొనిపోయెదరు. 16

ఓ పతివ్రతా! రామునకు గుర్తింప వీలగునది, ఆయనకు ప్రీతి కలిగించునది యగు గురుతును వేఱొకదానిని గూడ నీ వీయవలసినది". 17

ఆమెయు "హనుమంతుడా! నే నుత్తమమగు అభిజ్ఞాన మిచ్చియే యుంటిని. నేను కేశాలంకరణముగ వాడుకొనిన ఈ చూడామణిని చూచి రాముడు నీ వాక్యములను విశ్వసించును." 18

శ్రీమంతుడగు హనునుంతు డా శ్రేష్ఠమగు మణిని స్వీకరించి సీతాదేవికి ప్రణమిల్లి వెడలసాగెను. 19

అట్లు వెడలిపోవ నుద్యుక్తుడై, శరీరమును పెంచి, ఎగురుటకు సిద్ధపడుచున్న హనుమంతుని చూచి సీత కన్నుల నీరు నింపుకొని, దైన్యముతో, బాష్పవశముచే

వర్ధమానం మహావేగ మువాచ జనకాత్మజా,
అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పగద్గదయా గిరా. 20
హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్. 21
యథా చ స మహాబాహు ర్మాం తారయతి రాఘవః,
అస్మా ద్దుఃఖాంబుసంరోధాత్ త్వం సమాధాతు మర్హసి. 22
ఇమం చ తీవ్రం మమ శోకవేగం, రక్షోభి రేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గత స్సమీపం, శివశ్చ తేఽ ధ్వాస్తు హరిప్రవీర. 23
స రాజపుత్ర్యా ప్రతివేదితార్థః, కపిః కృతార్థః పరిహృష్టచేతాః,
అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం, దిశం హ్యుదీచీం మనసా జగామ. 24

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చత్వారింశః సర్గః.*

---

కలుషితమైన స్వరముగలదై యిట్లు పలికెను. 20

హనుమంతుడా! సింహసదృశులగు సోదరులు రామలక్ష్మణులను, మంత్రిసహితుడగు సుగ్రీవుని ఎల్లరను కుశల మడిగితి ననుము. 21

మహాభుజుడగు రాము డే రీతిని నన్నీ దుఃఖసముద్రమునుండి దాటించునో అందులకు ఓ వానరవీరుడా! నా యీ తీవ్రశోకమును, రాక్షసుల బెదిరింపును నీవు రామునిచెంత కేగుచునే తెలుపుము. నీకు మార్గమున సుఖమగుగాక. 23

అని యీ విధముగా సీతాదేవి తెలిపిన విషయములను (అభిజ్ఞానములను) తెలిసికొనిన వాడై సీతాదర్శనముచే తాను కృతార్థుడనైతినని ఉప్పొంగుచు, తా నింక చేయవలసిన పని యల్పముగనే మిగిలియుండుట కాంచి హనుమంతుడు ఉత్తరదిశగా పయనించవలెనని మదిలో నిశ్చయించుకొనెను. 24

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదవ సర్గము.*

# 41. ఏకచత్వారింశః సర్గః

*(హనుమంతుడు అశోకవనమును విఱచుట)*

న చ వాగ్భిః ప్రశస్తాభి ర్గమిష్యన్ పూజిత స్తయా,
తస్మా ద్దేశా దపక్రమ్య చింతయామాస వానరః. 1
అల్పశేష మిదం కార్యం దృష్టేయ మసితేక్షణా,
త్రీ నుపాయా నతిక్రమ్య చతుర్థ ఇహ విద్యతే. 2
న సామ రక్షస్సు గుణాయ కల్పతే, న దానమర్థోపచితేషు యుజ్యతే,
న భేదసాధ్యా బలదర్పితా జనాః, పరాక్రమస్త్వేవ మమేహ రోచతే. 3
న చాస్య కార్యస్య పరాక్రమాదృతే, వినిశ్చయః కశ్చిదిహోపపద్యతే,

---

సీతాదేవి తన్నట్లు ప్రశస్తములైన వాక్యములతో అభినందించగా, హనుమంతుడు పయనమై పోనున్నవాడై ఆ ప్రదేశమునుండి తొలగిపోయి తనలో నిట్లు తలంచెను. 1

రావణుని నివాసపరిజ్ఞానరూప మగు పని యింక కొంచెమే మిగిలి యున్నది. (అంతఃపురసహితముగ లంక చక్కగా తెలియవచ్చినను రాక్షసుల బలాబలములు, రావణహృదయము మున్నగునవి తెలియకుండుటచే పని యింకను మిగిలియున్నదనుట) నల్లని కనులు గల సీత అగపడినది. ఇంక నీ రాక్షసబలాబలములు, రావణహృదయము తెలిసికొను పనికి సామ, దాన, భేదోపాయములు కాక నాల్గవదగు దండోపాయమే సాధనముగా కనుపించుచున్నది. 2

రాక్షసుల యెడ సామోపాయము ప్రయోజనకారి కాజాలదు. సమృద్ధిగా సంపదలు గలవా రగుటచే దానోపాయము కూడ పొసగదు. బలముచే గర్వించిన యీ రాక్షసులు భేదోపాయసాధ్యులు కాదు. కావున నా కిచట పరాక్రమమే ఇష్టముగ నున్నది. 3

కావున నేను చేయదలంచిన పనికి పరాక్రమము తప్ప మఱొక్కటి సాధనము

హతప్రవీరా హి రణే హి రాక్షసాః, కథంచిదీయు ర్యదిహాద్య మార్దవమ్. 4
కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్,
పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తు మర్హతి. 5
న హ్యేక స్సాధకో హేతుః స్వల్ప స్యాపీహ కర్మణః,
యో హ్యర్థం బహుధా వేద స సమర్థోఽర్థసాధనే. 6
ఇహైవ తావత్ కృతనిశ్చయో హ్యహం యది వ్రజేయం ప్లవగేశ్వరాలయమ్,
పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్ తతః కృతం స్యా న్మమ భర్తృశాసనమ్. 7
కథం ను ఖల్వద్య భవేత్సుఖాగతం, ప్రసహ్య యుద్ధం మమ రాక్షసైస్సహ,
తథైవ ఖల్వాత్మబలం చ సారవత్, సంమానయేన్మాం చ రణే దశాననః. 8
తతస్సమాసాద్య రణే దశాననం, సమంత్రివర్గం సబలప్రయాయినమ్,

---

కానేరదు. రాక్షసులలో ముఖ్యులు కొందఱు మరణింతురేని తక్కినవా రెట్టులైన మృదుత్వము నొందుదురు. 4

తాను చేయవలసిన పనిని నిర్దేశింపగా మొదటి పని చెడకుండగా దానితో బాటు అనేక కార్యములు సాధించువాడు కార్యాచరణయోగ్యు డగును. 5

ఒకే కారణముతో చిన్నపని కూడా సాధింప శక్యము గాదు. అట్టిచో మహాకార్య మెట్లు సాధింపనగును? ఎవడు అనేకహేతువులతో కార్యసాధన కుపక్రమించునో అత డా పని సాధించుటలో సమర్థుడగును. 6

నే నిచట నుండగనే రాక్షసులకు, మనకును యుద్ధము చేయుటలో తారతమ్య మెఱిగి, బలాబలనిశ్చయము చేసికొని సుగ్రీవుని కడకు పోవుదు నేని, అపుడు నా స్వామి యాజ్ఞ చక్కగా నిర్వహించినట్లగును. 7

నా కిపు డెట్లు రాక్షసులతో యుద్ధ మప్రయత్నముగా జరుగును? అట్లు యుద్ధము జరిగిననే రావణుడు తన పక్షపు బలమును నా బలమును చక్కగా తెలిసికొనగలుగును. 8

నే నిక యుద్ధమున రావణుని, అతని మంత్రిసమూహమును, సేనానిని ఎదిర్చి,

హృది స్థితం తస్య మతం బలం చ వై,
సుఖేన మత్వాహమితః పునర్వ్రజే. 9

ఇద మస్య నృశంసస్య నందనోపమ ముత్తమమ్,
వనం నేత్రమనఃకాంతం నానాద్రుమలతాయుతమ్. 10

ఇదం విధ్వంసయిష్యామి శుష్కం వన మివానలః,
అస్మిన్ భగ్నే తతః కోపం కరిష్యతి దశాననః. 11

తతో మహత్ సాశ్వమహారథద్విపం బలం సమాదేక్ష్యతి రాక్షసాధిపః,
త్రిశూలకాలాయసపట్టిసాయుధం తతో మహద్యుద్ధ మిదం భవిష్యతి. 12

అహం తు తైస్సంయతి చండవిక్రమై, స్సమేత్య రక్షోభి రసహ్యావిక్రమః,
నిహత్య తద్రావణచోదితం బలం, సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్. 13

---

సీత యెడల రావణుని మనోనిశ్చయమును, వాని బలమును సుఖముగా తెలిసికొని యిటనుండి మరలిపోయెదను. 9

ఇది ఆ క్రూరాత్ముడగు రావణుని యుద్యానము. దేవేంద్రుని నందనవనమునకు సాటియైనది. ఇది కన్నులకు, మనస్సునకును హాయినిచ్చునది. అనేకవృక్షములు, తీగలతో కూడినది. 10

అగ్ని ఎండుకట్టెను దహించినట్లు నే నీ వనమును పాడుచేసెదను. ఈ వనము పాడగుచో రావణుడు కోపించును. 11

అపుడు రావణుడు గుఱ్ఱములు మహారథములు ఏనుగులతో కూడినదై, త్రిశూలములు ఇనుముతో చేసిన పట్టసములు అను ఆయుధములు దాల్చిన పెద్ద సైన్యమును నాతో యుద్ధముచేయ నాజ్ఞాపించును. అపుడు పెద్ద యుద్ధమే జరుగును. 12

నే నపుడు యుద్ధమున తీవ్రపరాక్రమము గల రాక్షసులతో తలపడి వారు సహింపలేనట్లు పరాక్రమము ప్రదర్శించుచు రావణుడు పంపిన సేనను చంపి ఆపైన సుఖముగ కిష్కింధ కేగెదను. 13

తతో మారుతవత్ క్రుద్ధో మారుతి ర్భీమవిక్రమః,
ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తు మథారభత్. 14

తతస్తు హనుమాన్ వీరో బభంజ ప్రమదావనమ్,
మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమలతాయుతమ్. 15

తద్వనం మథితై ర్వృక్షై ర్భిన్నైశ్చ సలిలాశయైః,
చూర్ణితైః పర్వతాగ్రైశ్చ బభూ వాప్రియదర్శనమ్. 16

నానాశకుంతవిరుతైః ప్రభిన్నై స్సలిలాశయైః,
తామ్రైః కిసలయైః క్లాంతైః క్లాంతద్రుమలతాయుతమ్,
న బభౌ తద్వనం తత్ర దావానలహతం యథా. 17

వ్యాకులావరణా రేజు ర్విహ్వలా ఇవ తా లతాః. 18

---

అని యిట్లు కార్యనిశ్చయము చేసికొని భయంకరపరాక్రమము కల హనుమంతుడు వాయుదేవునివలె కోపించి తన తొడల వేగముతో ఆ వనమందలి చెట్లను విఱువ నారంభించెను. 14

అటు లా వీరుడగు హనుమంతుడు మదించిన పక్షుల కిలకిలారావములతోడను, పెద్ద చెట్లు, తీగలతోను కూడిన ప్రమదావనమును విఱిచెను. 15

ఆ వనము విఱిగిన చెట్లతో, కట్టలు తెగిన కొలనులతో, పొడి చేయబడిన కొండ కొనలతో చూచువారికి ఎంత మాత్రము ప్రీతిని కలిగించలేదు. 16

వివిధపక్షుల అఱుపులతో, కట్టలు తెగిన కొలమలతో, వాడిన యెఱ్ఱని చిగురు టాకులతో, వాడిన చెట్లు తీగలతో ఆ వనము దావానలముచే తగులబెట్టబడినది వలె శోభిల్లదయ్యెను. 17

అచటి తీగలును తమ కావరణములుగా నున్న ఆకులు మున్నగునవి వాడిపోవుటచే వ్యాకులత నొందిన స్త్రీలవలె నుండెను. 18

లతాగృహములు చిత్రగృహములు నశించుటచేతను, మహోసర్పములు,

లతాగృహైశ్చిత్రగృహైశ్చ నాశితై, ర్మహోరగై ర్వ్యాళమృగైశ్చ నిర్ధుతై,
శిలాగృహైరున్మథితైస్తథా గృహైః, ప్రణష్టరూపం తదభూన్మహద్వనమ్. 19

సా విహ్వలా ౾శోకలతాప్రతానా, వనస్థలీ శోకలతాప్రతానా,
జాతా దశాస్యప్రమదావనస్య, కపేర్బలాద్ధి ప్రమదావనస్య. 20

స తస్య కృత్వార్థపతేర్మహాకపి,
ర్మహ ద్వ్యళీకం మనసో మహాత్మనః,
యుయుత్సురేకో బహుభిర్మహాబలైః,
శ్రియా జ్వలన్ తోరణమాస్థితః కపిః. 21

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకచత్వారింశః సర్గః*

---

దుష్టజంతువు లెల్లెడల పడి చచ్చుటచేతను, శిలాగృహములు, గృహములు విఱిగిపడుటచేతను ఆ పెద్దవనము తన స్వరూపమునే కోల్పోయిన దయ్యెను. 19

పూర్వము రావణుని స్త్రీజనమున కాహ్లాదజనకమై వారికెంతమాత్రము బాధ కలుగకుండునట్లు చేయునదగు ఆ అశోకలతలతో కూడిన అంతఃపురోద్యాన ప్రదేశము, హనుమంతుడు తన బలముచే విఱువగా శోకలతలతో కూడిన పందిరివలె మారెను. 20

హనుమంతుడు ఈ విధముగ వరమనంపదచే శోభిల్లు మహాత్ముడగు రావణుని మదిలో మిక్కిలి వ్యథ కలిగించి, మహాబలశాలురగు పలువురితో తానొక్కడే యుద్ధము చేయగోరుచు ఆ యశోకవనబహిర్ద్వారమును చేరెను. 21

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదియొకటవ సర్గము.*

# 42. ద్విచత్వారింశః సర్గః

*(వనభంగమును రాక్షసస్త్రీలు రావణునకు నివేదించుట)*

తతః పక్షినినాదేన వృక్షభంగస్వనేన చ,
బభూవు స్త్రాససంభ్రాంతాః సర్వే లంకానివాసినః. 1

విద్రుతాశ్చ భయత్రస్తా వినేదు ర్మృగపక్షిణః,
రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతిపేదిరే. 2

తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః,
తద్వనం దదృశు ర్భగ్నం తం చ వీరం మహాకపిమ్. 3

స తా దృష్ట్వా మహాబాహు ర్మహాసత్త్వో మహాబలః,
చకార సుమహద్రూపం రాక్షసీనాం భయావహమ్. 4

తతస్తం గిరిసంకాశ మతికాయం మహాబలమ్,

---

అంతట పక్షుల కూతలచేతను, చెట్లు విఱుగుటచే ఏర్పడిన ధ్వనిచేతను, లంకలో నివసించువా రెల్లరును భయపడిరి. 1

భయముచే బెదరిన మృగములు, పక్షులును తమ తమ స్థానములు వీడి పోవుచు అఱచెను. రాక్షసులకు దుశ్శకునములు పొడసూపెను. 2

వికృతముఖులగు రాక్షసాంగనలు ఆ సవ్వడికి నిద్రనుండి లేచి విఱిగిన అశోకవనమును, వీరుడగు హనుమంతుని చూచిరి. 3

మహాభుజుడు, మహాధైర్యశాలి, మహాబలుడగు హనుమంతు డా రాక్షసాంగనలను చూచి, వారికి భయము కలిగించు పెనురూపు దాల్చెను. 4

అపుడు కొండవలె ఉన్నతుడును, పెద్ద శరీరము కలవాడును, మహాబలుడును అగు హనుమంతుని చూచి, రాక్షసస్త్రీలు సీత నిట్లు ప్రశ్నించిరి. 5

రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛు ర్జనకాత్మజామ్. 5

కో௨యం కస్య కుతో వాయం కిన్నిమిత్త మిహాగతః,
కథం త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత. 6

ఆచక్ష్వ నో విశాలాక్షి మా భూత్తే సుభగే భయమ్,
సంవాద మసితాపాంగే త్వయా కిం కృతవానయమ్. 7

అథాబ్రవీ త్తదా సాధ్వీ సీతా సర్వాంగసుందరీ,
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః. 8

యూయమే వాభిజానీత యో௨యం యద్వా కరిష్యతి,
అహి రేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః. 9

[1]అహమ ప్యస్య భీతాస్మి నైనం జానామి కో న్వయమ్,

'ఓ సీతా! ఈయన ఎవ్వడు? ఏల ఈ ప్రదేశమునకు వచ్చినాడు? ఎచటనుండి వచ్చినాడు? ఏ విషయమును గూర్చి నీతో సంభాషించినాడు?' 6

ఓ విశాలాక్షీ! మాకీ విషయము తెలుపుము. నీవు భయపడ పనిలేదు. ఓ నల్లని కనుకొనలు కలదానా! నీతో వానరు డేమి మాటలాడెను? 7

అంత పతివ్రత, సర్వాంగసుందరి యగు సీత యిట్లనెను. "భయంకరరూపముగల రాక్షసులను గూర్చి తెలిసికొను శక్తి నా కెక్కడిది? 8

అత డెవ్వడో, ఏమి చేయనున్నాడో మీరే తెలిసికొనుడు. పాముకాళ్లు పామునకు కదా తెలియును? ఇందు సందేహము లేదు. 9

ఇతనిని చూచి నేనును భయపడితిని. ఇతడెవ్వడో నే నెఱుగను. ఇతడు ఇచ్ఛవచ్చిన

1. ఇది సీతాదేవి పలికిన అసత్యవచనము. కొన్ని సందర్భములలో అసత్యమును పలుకవచ్చునని స్మృతులు చెప్పుచున్నవి -

'వివాహకాలే రతిసంప్రయోగే ప్రాణాత్యయే సర్వధనాపహారే,
మిత్రస్య చార్థే హ్యనృతం వదేయుః పంచాన్నతా న్యాహు రపాతకాని.'

వివాహము, రతి, ప్రాణనాశము, సర్వస్వాపహరణము, మిత్రప్రయోజన మను నీ యైదు సందర్భములలో పలికెడు అసత్యమువలన పాతకము కలుగదని భావము.

వేద్మి రాక్షస మేవైనం కామరూపిణ మాగతమ్. 10

వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా దిశః,
స్థితాః కాశ్చి ద్గతాః కాశ్చిద్ రావణాయ నివేదితుమ్. 11

రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః,
విరూపం వానరం భీమ మాఖ్యాతు ముపచక్రముః. 12

అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః,
సీతయా కృతసంవాద స్తిష్ఠ త్యమితవిక్రమః. 13

న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా,
అస్మాభి ర్బహుధా పృష్టా నివేదయితు మిచ్ఛతి. 14

వాసవస్య భవే ద్దూతో దూతో వైశ్రవణస్య వా,
ప్రేషితో వాపి రామేణ సీతాన్వేషణకాంక్షయా. 15

---

రూపముతో వచ్చిన రాక్షసు డనియే తలంతును." 10

సీతాదేవి మాటలు విని కొందరు రాక్షసస్త్రీలు భయముతో నలుదెసలకు పరుగెత్తిరి. కొంద ఱచట కావలి యుండిరి. మఱికొంద రా వృత్తాంతమును రావణునికి తెలుపుటకు పోయిరి. 11

వికృతమగు ముఖము కల ఆ రాక్షసస్త్రీలు రావణుని చెంత కేగి విరూపము కలవాడై, భయము కలిగించుచున్న వానరుని గూర్చి యిట్లు పలికిరి. 12

రాజా! అశోకవనమందు భయంకరశరీరము గలిగి అంతులేని పరాక్రమముగల వానరు డొకడు సీతతో మాటలాడుచున్నాడు. 13

మే మెన్నిమారు లడిగినను లేడి కనులవంటి కన్నులు గల సీత ఆ వానరునిగూర్చి యేమియు తెలుప నిచ్ఛగించుట లేదు. 14

ఆ వానరుడు దేవేంద్రుడు లేక కుబేరుడు పంపిన దూత కావచ్చును. లేక సీతను వెదకుటకై రాముడు పంపిన దూత కావచ్చును. 15

తేన త్వద్భుతరూపేణ యత్తత్ తవ మనోహరమ్,
నానామృగగణాకీర్ణం ప్రమృష్టం ప్రమదావనమ్. 16

న తత్ర కశ్చి దుద్దేశో యస్తేన న వినాశితః,
యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః. 17

జానకీరక్షణార్థం వా శ్రమా ద్వా నోపలభ్యతే,
అథవా కశ్శ్రమ స్తస్య సైవ తేనాభిరక్షితా. 18

చారుపల్లవపుష్పాఢ్యం యం సీతా స్వయ మాస్థితా,
ప్రవృద్ధ శ్శింశుపావృక్షః స చ తేనాభిరక్షితః. 19

తస్యోగ్రరూప స్యోగ్ర! త్వం దండ మాజ్ఞాతు మర్హసి,
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్. 20

మనఃపరిగృహీతాం తాం తవ రక్షోగణేశ్వర,

---

ఆశ్చర్యము కలిగించు పెద్ద శరీరము గల అతడు వివిధమృగగణములతో కూడిన మనోహరమగు నీ ప్రమదావనమును విఱిచివేసినాడు. 16

అతడు పాడుచేయని ప్రదేశము లేదు. సీతాదేవి యున్న ప్రదేశమును మాత్ర మతడు నాశము చేయలేదు. 17

అట్లు నాశము చేయకుండుట సీతను కాపాడుటకా, లేక అంతవఱకు వనము విఱుచుటచే కలిగిన శ్రమవల్లనా యనునది తెలియదు. అయినను, అంతటి శక్తిశాలికి శ్రమ ఎక్కడిది? అత డామెను కాపాడుటకే అట్లు చేసినాడు. 18

సుందరములగు చిగురాకులు, పూలతో శ్లాఘ్యమైనదియు, మిక్కిలి పెద్దదియు అగు ఏ శింశుపావృక్షముక్రింద సీత కూర్చుండినదో అ వృక్షమును మాత్ర మతడు విఱువలేదు. 19

అట్లు సీతాదేవితో మాటలాడి, అశోకవనము విఱిచిన ఆ భయంకరాకారుడగు వానరునికి ఉగ్రుడవగు నీవు తీవ్రదండవము విధింవదగును. 20

ఓ రాక్షసరాజా! నీవు హృదయమున నిలుపుకొన్న సీతతో, ప్రాణములపై ఆశలేనివాడు

క స్సీతా మభిభాషేత యో న స్యాత్ త్యక్తజీవితః. 21
రాక్షసీనాం వచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
హుతాగ్ని రివ జజ్వాల కోపసంవర్తితేక్షణః. 22
తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపత న్నాస్రబిందవః,
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహబిందవః. 23
ఆత్మన స్సదృశాన్ శూరాన్ కింకరా న్నామ రాక్షసాన్,
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః. 24
తేషా మశీతిసాహస్రం కింకరాణాం తరస్వినామ్,
నిర్యయు ర్భవనా త్తస్మాత్ కూటముద్గరపాణయః. 25
మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః,
యుద్ధాభిమనస స్సర్వే హనుమద్గ్రహణోద్యతాః. 26

---

దక్క వేతెవ్వడు మాటలాడజాలును? 21

అని పలుకగా, రాక్షసరాజగు రావణు డా రాక్షసస్త్రీల వచన మాలించి, కోపముతో కనులు త్రిప్పుచు హోమాగ్నివలె ప్రజ్వలించెను. 22

ప్రజ్వరిల్లు రెండు దీపములనుండి మంటలతో కూడిన నూనెబొట్లు రాలినట్లు కోపించిన యా రావణుని కండ్లనుండి కన్నీరు కారెను. 23

అంతట ఆ తేజశ్శాలి యగు రావణుడు బలమున తనతో సమానులు, పరాక్రమ శాలులగు కింకరు లను రాక్షసులను హనుమంతుని పట్టుకొన నాజ్ఞాపించెను. 24

వేగవంతులగు ఆ కింకరు లను రాక్షసు లెనుబదివేలమంది కూటములు, ముద్గరము లను ఆయుధములు చేత ధరించి రావణభవనమునుండి వెడలిరి. 25

పెద్ద పొట్టగలవారు, పెద్ద కోఱలు కలవారు, భయంకరరూపము కలవారు, గొప్ప బలము కలవా రగు ఆ ఎనుబదివేలమంది కింకరులును యుద్ధముచేయ మనసుపడినవారై హనుమంతుని పట్టుకొనుట కుద్యుక్తులైరి. 26

తే కపీంద్రం సమాసాద్య తోరణస్థ మవస్థితమ్,
అభిపేతు ర్మహావేగాః పతంగా ఇవ పావకమ్. 27
తే గదాభి ర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః,
అజఘ్ను ర్వానరశ్రేష్ఠం శరై శ్చాదిత్యసన్నిభైః. 28
ముద్గరైః పట్టిసై శ్శూలైః ప్రాసతోమరశక్తిభిః,
పరివార్య హనూమంతం సహసా తస్థు రగ్రతః. 29
హనుమానపి తేజస్వీ శ్రీమాన్ పర్వతసన్నిభః,
క్షితా వావిధ్య లాంగూలం ననాద చ మహాస్వనమ్. 30
న భూత్వా సుమహాకాయో హనుమాన్ మారుతాత్మజః,
ధృష్ట మాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్. 31
తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా,

వారెల్లరును బహిర్ద్వారముపై నెక్కి మిడుతలు అగ్నిలో పడునట్లు మహావేగముతో యుద్ధమునకు సన్నద్ధుడైన ఆ హనుమంతుని పైకి పోయిరి. 27

వారు వివిధములగు గదలచేతను, బంగారముతో నలంకరించబడిన యినుప గుదియలచేతను, సూర్యునివలె ప్రకాశించు బాణములచేతను, వానరశ్రేష్ఠుడగు హనుమంతుని కొట్టిరి. 28

ఇనుపగుదియలు, అడ్డకత్తులు , శూలములు, ఈటెలు, తోమరములు, చిల్లకోలలను నాయుధములు దాల్చి వా రా హనుమంతుని చుట్టుముట్టి యెదుట నిలిచిరి. 29

హనుమంతుడు మహాతేజు డగుటచే యుద్ధావసరము కలిగెనని మోదముతో ముఖము ప్రకాశింప, కొండవలె నిలచి, తోకను నేలపై కొట్టి, పెద్దధ్వని గలుగున ట్లుఱచెను. 30

వాయుపుత్రు డగు హనుమంతుడు పెనుశరీరము దాల్చి, లంక నెల్ల శబ్దముతో నింపుచు స్వేచ్ఛగా తన తోకను విదల్చెను. 31

ప్రతిధ్వనించిన ఆ (తోక సడలించుటవలన పుట్టిన) శబ్దముచేత పక్షు లాకసమున

పేతు ర్విహంగా గగనా దుచ్చై శ్చేద మఘోషయత్. 32

జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః. 33

దాసోఽహం కోసలేంద్రస్య రామ స్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః. 34

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః. 35

అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీమ్,
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్. 36

తస్య సన్నాదశబ్దేన తేఽభవన్ భయశంకితాః,
దదృశుశ్చ హనూమంతం సంధ్యామేఘ మివోన్నతమ్. 37

---

కెగసెను. అంత హనుమంతు డిట్లు ప్రకటించుకొనెను. 32

అత్యంతబలశాలి యగు రామునకు జయము. మహాబలశాలి యగు లక్ష్మణునకు జయము. రామునిచే (వాలివధద్వారా) కాపాడబడిన సుగ్రీవునకు జయము. 33

నే ననాయాసముగనే మహాకార్యములు సాధించునట్టి కోసలరాజు రాముని దాసుడను. హనుమంతు డనువాడను. వాయుదేవుని తనయుడను. శత్రుసైన్యములను సంహరించువాడను. 34

నేను వేలకొలది శిలలతో, వృక్షములతో ప్రహరించుచుండగా వేయి మంది రావణులును యుద్ధమున నాకు సరి కాజాలరు. 35

సకలరాక్షసుల సమక్షముననే నే నీ లంకను పీడించి, సీతాదేవికి నమస్కరించి, నా ప్రయత్నమును ఫలవంత మొనర్చుకొని పోయెదను. 36

ఆ హనుమంతుని గర్జనముచే కింకరరాక్షసులు వెఱగందిరి. వారి కా హనుమంతు డెత్తైన సంజమబ్బువలె చూపట్టెను. 37

స్వామిసందేశనిశ్శంకా స్తత స్తే రాక్షసాః కపిమ్,
చిత్రైః ప్రహరణై ర్భీమై రభిపేతు స్తత స్తతః . 38

స తైః పరివృత శ్శూరై స్సర్వత స్స మహాబలః,
ఆససాదాఽఽఽయసం భీమం పరిఘం తోరణాశ్రితమ్. 39

స తం పరిఘ మాదాయ జఘాన రజనీచరాన్,
స పన్నగ మివాదాయ స్ఫురంతం వినతాసుతః.
విచచా రాంబరే వీరః పరిగృహ్య చ మారుతిః. 40

స హత్వా రాక్షసాన్ వీరాన్ కింకరాన్ మారుతాత్మజః.
యుద్ధకాంక్షీ పున ర్వీర స్తోరణం సముపాశ్రితః. 41

తత స్తస్మా ద్భయా న్ముక్తాః కతిచిత్ తత్ర రాక్షసాః,
నిహతాన్ కింకరాన్ సర్వాన్ రావణాయ న్యవేదయన్. 42

---

అంతట తమ ప్రభువు నాజ్ఞ పొందిన వారగుటచే ఏమాత్రము జంకులేనివారగు రాక్షసులు వివిధాయుధములతో హనుమంతునిపై కుఱికిరి. 38

మహాబలుడగు హనుమంతుడు శూరులగు ఆ రాక్షసులు తన్ను చుట్టుముట్టగా ఆ బహిర్ద్వారమున నున్న భయంకరమగు పరిఘను (యినుపగుదియను) చేపట్టెను. 39

వీరుడగు ఆ హనుమంతుడు సర్పమును గరుడుడు పట్టిన ట్లా యినుపగుదియను చేత బట్టి యాకాశమున తిరిగెను. రాక్షసులను దానితో మోదెను. 40

వాయుపుత్రుడగు హనుమంతు డా గుదియతో కింకరుల నెల్లరను మట్టుపెట్టి యుద్ధమువే కోరుచు నుఱల నా బహిర్ద్వారముపై కూర్చుండెను. 41

అపు డా హనుమంతుని చూచి భయపడి పారిపోయి తప్పించుకొనిన కొలదిమంది రాక్షసులు రావణుని కడ కేగి, కింకరు లెల్లరు మడిసిరని విజ్ఞాపన మొనర్చిరి. 42

స రాక్షసానాం నిహతం మహద్బలం, నిశమ్య రాజా పరివృత్తలోచనః,
సమాదిదే శాప్రతిమం పరాక్రమే, ప్రహస్తపుత్రం సమరే సుదుర్జయమ్. 43

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్విచత్వారింశః సర్గః*

---

రావణుడు కింకరు లను రాక్షసుల మహాసైన్య మట్లు మడియుట విని, కన్నులు త్రిప్పుచు, పరాక్రమమున సాటిలేనివాడు, యుద్ధమున జయింప నసాధ్యుడగు ప్రహస్తపుత్రుని హనుమంతునితో తలపడ నాజ్ఞాపించెను. 43

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదిరెండవ సర్గము.*

# 43. త్రిచత్వారింశః సర్గః

*(హనుమ చైత్యప్రాసాదమందలి రాక్షసులను చంపుట)*

తత స్స కింకరాన్ హత్వా హనుమాన్ ధ్యాన మాస్థితః,
వనం భగ్నం మయా చైత్యప్రాసాదో న వినాశితః. 1

తస్మాత్ ప్రాపాదమ ప్యేవం భీమం విధ్వంసయా మ్యహమ్,
ఇతి సంచింత్య మనసా హనుమాన్ దర్శయన్ బలమ్. 2

చైత్యప్రాసాద మాప్లుత్య మేరుశృంగ మివోన్నతమ్,
ఆరురోహ కపిశ్రేష్ఠో హనుమాన్ మారుతాత్మజః. 3

ఆరుహ్యా గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః,
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః. 4

సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్యప్రాసాద ముత్తమమ్,
హనుమాన్ ప్రజ్వలన్ లక్ష్మ్యా పారియాత్రోపమోఽభవత్. 5

---

హనుమంతు డట్లు కింకరులను పరిమార్చి యిటు లాలోచించెను. 'అశోకవనమును విఱచితిని. అందు చెట్ల నడుమ నున్న భవనము నింక పాడుచేయవలసియున్నది. కావున ఈ భీకరమగు భవనమును గూడా నాశనము చేసెదను. అని మదిలో నిశ్చయించుకొని హనుమ తన బలమును ప్రదర్శించుచు మేరుపర్వతశిఖరము వలె నున్న చైత్యప్రాసాదము నెక్కెను. 1-3

అట్లు కొండవలె నున్న ప్రాసాదము నెక్కినవాడై సుహాతేజశ్శాలి యగు మారుతి రెండవ సూర్యునివలె తేజరిల్లెను. 4

ఉన్నతమగు ఆ చైత్యప్రాసాదము నాక్రమించిన మారుతి, మిక్కిలి ప్రకాశించుచు పారియాత్ర మను పేరు గల కులపర్వతమువలె నుండెను. 5

స భూత్వా సుమహాకాయః ప్రభావాన్ మారుతాత్మజః,
ధృష్ట మాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్. 6
తస్యాస్ఫోటితశబ్దేన మహతా శ్రోత్రఘాతినా,
పేతుర్విహంగమా స్తత్ర చైత్యపాలాశ్చ మోహితాః. 7
అస్త్రవి జ్జయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః. 8
దాసోఽహం కోసలేంద్రస్య రామ స్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః. 9
న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః. 10
అర్దయిత్వా పురీం లంకా మభివాద్య చ మైథిలీమ్,

---

కాంతిమంతుడగు హనుమ తన శరీరమును పెద్దది చేసికొని లంకను శబ్దముతో నింపుచు పెద్దగా జబ్బలు చఱచుకొనెను. 6

ఆ శబ్దము విస్తరించి కర్ణరంధ్రములను చీల్చగా, పక్షు లటనుండి పారిపోయెను. చైత్యప్రాసాదపు కావలివాండ్రు తెలివిదప్పిరి. 7

వెంటనే హనుమంతుడు మఱల వి ట్లుద్ఘోషించెను. 'అస్త్రప్రయోగకుశలుడగు రామునకు జయము. మహాబలుడగు లక్ష్మణునకు జయము. రాముడు కాపాడిన మా రాజు సుగ్రీవునకు జయము. 8

అనాయాసముగ మహాకార్యములను సాధించు రాముని దానుడను. వాయు పుత్రుడను. హనుమంతుడను. శత్రుసైన్యములను నాశము చేయువాడను. 9

నేను వేలకొలదిగా రాలను విసరుచు, వృక్షములతో కొట్టచుండగా వేయిమంది రావణులును యుద్ధమున నాకు సాటి కాజాలరు. 10

నే నీ లంకాపురిని ధ్వంసమొనర్చి, సీతాదేవికి ప్రణమిల్లి సకల రాక్షసులు

సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్. 11

ఏవ ముక్త్వా విమానస్థ శ్చైత్యస్థాన్ హరియూథపః,
ననాద భీమనిర్హ్రాదో రక్షసాం జనయన్ భయమ్. 12

తేన శబ్దేన మహతా చైత్యపాలా శ్శతం యయుః,
గృహీత్వా వివిధా నస్త్రాన్ ప్రాసాన్ ఖడ్గాన్ పరశ్వథాన్,
విసృజంతో మహాకాయా మారుతిం పర్యవారయన్. 13

తే గదాభి ర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః,
ఆజఘ్ను ర్వానరశ్రేష్ఠం బాణై శ్చాదిత్యసన్నిభైః. 14

ఆవర్త ఇవ గంగాయా స్తోయస్య విపులో మహాన్,
పరిక్షిప్య హరిశ్రేష్ఠం స బభౌ రక్షసాం గణః. 15

తతో వాతాత్మజః క్రుద్ధో భీమం రూపం సమాశ్రితః, 16
ప్రాసాదస్య మహాన్తస్య స్తంభం హేమపరిష్కృతమ్,

---

చూచుచుండగనే సఫలుడనై వెడలెదను'. 11

అని విమానస్థుడగు హనుమంతుడు చైత్యప్రాసాదమున నున్నవారికి తెలిపి రాక్షసులకు భయము కలిగించుచు భీకరముగ గర్జించెను. 12

ఆ మహాశబ్దము విని మహాకాయులగు చైత్యరక్షకులు నూఱ్ఱురు వివిధాస్త్రములు చేపట్టి ప్రాసములు, కత్తులు, గొడ్డళ్ళు విసరుచు హనుమను చుట్టుముట్టిరి. 13

వారు విచిత్రములగు గదలతో, బంగారు కట్లు గల యినుపగుదియలతో, సూర్యునివలె ప్రకాశించు బాణములతో హనుమంతుని ప్రహరించిరి. 14

వానరశ్రేష్ఠుడగు హనుమంతుని చుట్టుకొని నిలచిన రాక్షససమూహము, గంగానదిలో జలములవలన ఏర్పడిన నుడిగుండము వలె ప్రకాశించెను. 15

అపుడు హనుమంతుడు కోపించి భయంకరరూపము దాల్చెను. 16

బంగారముతో నలంకరించబడిన నూరు అంచులు గల ఆ మహాప్రాసాదపు

ఉత్పాటయిత్వా వేగేన హనుమాన్ పవనాత్మజః,
తతస్తం భ్రామయామాస శతధారం మహాబలః. 17
తత్ర చాగ్ని స్సమభవత్ ప్రాసాదశ్చా ప్యదహ్యత. 18
దహ్యమానం తతో దృష్ట్వా ప్రాపాదం హరియూథపః,
స రాక్షసశతం హత్వా వజ్రే ణేంద్ర ఇవాసురాన్,
అంతరిక్షే స్థిత శ్శ్రీమా నిదం వచన మబ్రవీత్. 19
మాదృశానాం సహస్రాణి విసృష్టాని మహాత్మనామ్,
బలినాం వానరేంద్రాణాం సుగ్రీవవశవర్తినామ్. 20
అటన్తి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః. 21
దశనాగబలాః కేచిత్ కేచి ద్దశగుణోత్తరాః,
కేచి న్నాగసహస్రస్య బభూవు స్తుల్యవిక్రమాః. 22

---

స్తంభమును వాయుపుత్రుడు వేగముగ పెఱికివైచి, దానిని గిరగిర త్రిప్పెను. 17

అప్పు డా స్తంభము వేరొకదానితో ఒరసికొని అగ్ని పుట్టెను. ప్రాసాదము తగుల బడెను. 18

అపు డా ప్రాసాదము తగులబడుచుండుట కాంచి, ఇంద్రుడు వజ్రాయుధముతో రాక్షసులను చంపినట్లు, వందమంది రాక్షసులను పరిమార్చి హనుమ ఆకాశమున శ్రీమంతుడై శోభిల్లుచు నిలచి యిట్లనెను. 19

మహాత్ములు, బలవంతులు, సుగ్రీవుని అజ్ఞకు విధేయులైన నావంటి వానరులు వేలాదిగా పంపబడిరి. మేమును, ఇంకను కొందరు వానరులును భూమిపై ఎల్లెడల సంచరించు చున్నారు. 20,21

అందు కొందరు పదియేనుగుల బలము కలవారు. కొందరు అంతకు పదింతలు (నూరు యేనుగుల) బలముకలవారు. ఇంకను కొందఱు వెయ్యి యేనుగులకు సమానమగు బలము కలవారు. 22

సంతి చౌఘబలాః కేచిత్ కేచి ద్వాయుబలోపమాః,
అప్రమేయబలా శ్చాన్యే తత్రాసన్ హరియూథపాః. 23

ఈదృగ్విధై స్తు హరిభి ర్వృతో దంతనఖాయుధైః,
శతై శ్శతసహస్రైశ్చ కోటీభి రయుతై రపి,
ఆగమిష్యతి సుగ్రీవ స్సర్వేషాం వో నిషూదనః. 24

నేయ మస్తి పురీ లంకా న యూయం న చ రావణః,
యస్మా దిక్ష్వాకునాథేన బద్ధం వైరం మహాత్మనా. 25

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రిచత్వారింశః సర్గః.*

---

ఈ కపిసేనాధిపతులలో కొందరు ఓఘ మను పెద్దసంఖ్య కల ఏనుగుల బలము కలవారు. మఱికొందరు వాయుబలము కలవారు. 23

దంతములు, గోళ్ళు ఆయుధములుగా గల యిట్టి వానరులు వందలు, లక్షలు, కోట్లు, అయుతములతో కూడి మా రాజు సుగ్రీవుడు మి మ్మంతమొందించుటకు రాగలడు. 24

ఇక్ష్వాకువంశ్యుడు, మహాత్ముడగు రామునితో వైరము పెంపొందించుకొనిన కారణముచే యీ లంకానగరముగాని, మీరు గాని, రావణుడు గాని యింక లేనటులే భావించుడు. 25

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదిమూడవ సర్గము.*

# 44. చతుశ్చత్వారింశః సర్గః

*(హనుమంతుడు జంబుమాలిని చంపుట)*

సందిష్టో రాక్షసేంద్రేణ ప్రహస్తస్య సుతో బలీ,
జంబుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః. 1

రక్తమాల్యాంబరధరః స్రగ్వీ రుచిరకుండలః,
మహాన్ వివృత్తనయన శ్చండ స్సమరదుర్జయః. 2

ధను శ్శక్రధనుఃప్రఖ్యం మహ ద్రుచిరసాయకమ్,
విష్ఫారయానో వేగేన వజ్రాశనిసమస్వనమ్. 3

తస్య విష్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః,
ప్రదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత. 4

---

రాక్షసరాజగు రావణు డాజ్ఞాపించగా పెద్దకోఱలు కలవాడు, ప్రహస్తుని కుమారుడగు జంబుమాలి ధనుస్సు చేత ధరించి యుద్ధమునకు వెడలెను. 1

అతడు ఎఱ్ఱని మాలలు, వస్త్రములు దాల్చియుండెను. మెడలో హారములు, చెవులకు సుందరకుండలములు ధరించియుండెను. మహాకాయుడు, కోపనుడగు ఆ జంబుమాలి కన్నులు గిరగిర త్రిప్పుచు, యుద్ధమున జయింప శక్యము గానివాడై యుండెను. 2

అతడు యింద్రుని ధనుస్సునకు సాటియైనది, ఉన్నతమైనది, సుందరములగు బాణములు కలది యగు వింటి అల్లెత్రాటిని వజ్రము, పిడుగులకు సాటియగు ధ్వని కలుగునట్లుగా లాగి విడచెను. 3

అత డట్లు తన పెద్దవింటిని మ్రోగింపగా, దాని తీవ్రటంకారధ్వని దిక్కులు, విదిక్కులు, ఆకాశముల నొక్కుమ్మడిగా వ్యాపించెను. 4

రథేన ఖరయుక్తేన తమాగత ముదీక్ష్య సః,
హనుమాన్ వేగసంపన్నో జహర్ష చ ననాద చ. 5
తం తోరణవిటంకస్థం హనుమంతం మహాకపిమ్,
జంబుమాలీ మహాబాహు ర్వివ్యాధ నిశితై శ్శరైః. 6
అర్ధచంద్రేణ వదనే శిర స్యేకేన కర్ణినా,
బాహ్వో ర్వివ్యాధ నారాచై ర్దశభి స్తం కపీశ్వరమ్. 7
తస్య తచ్ఛుశుభే తామ్రం శరే ణాభిహతం ముఖమ్,
శరదీ వాంబుజం ఫుల్లం విద్ధం భాస్కరరశ్మినా. 8
తత్తస్య రక్తం రక్తేన రంజితం శుశుభే ముఖమ్,
యథాకాశే మహాపద్మం సిక్తం చందనబిందుభిః. 9
చుకోప బాణాభిహతో రాక్షసస్య మహాకపిః,

---

గాడిదలతో పూన్చబడిన రథము నెక్కి వచ్చిన యా జంబుమాలిని చూచి, మహావేగము గల హనుమంతుడు హర్షముతో గర్జించెను. 5

మహాభుజుడగు ఆ జంబుమాలి బహిర్ద్వారపు దూలము నెక్కి యున్న మహాకపి యగు హనుమంతునిపై వాడిబాణములను ప్రయోగించెను. 6

ఆ జంబుమాలి అర్ధచంద్రాకృతి గల బాణమును హనుమంతుని ముఖముపై, చెవి వంటి యొక బాణమును తలపై, పది బాణములను భుజములపై నాటెను. 7

సహజముగనే ఎఱ్ఱనిదగు హనుమంతుని ముఖము ఆ జంబుమాలి బాణాఘాతముచే మఱింత ఎఱ్ఱనై, శరత్కాలమున సూర్యుని కిరణములు ప్రసరించి, వికసించిన తామరపూవువలె శోభిల్లెను. 8

సహజముగ ఎఱ్ఱనై, బాణాఘాతముచే రక్తము కారి, మఱింతగా ఎఱ్ఱనైన హనుమంతుని ముఖము, ఆకాశమున రక్తచందనబిందువులచే తడుపబడిన పెద్ద తామరపూవువలె శోభిల్లెను. 9

ఆ రాక్షసుని బాణములచే దెబ్బ తిని హనుమంతుడు మిక్కిలి కోపించెను. అంతట

తతః సార్శ్వేఽతివిపులాం దదర్శ మహతీం శిలామ్. 10
తరసా తాం సముత్పాట్య చిక్షేప బలవ ద్బలీ,
తాం శరై ర్దశభిః క్రుద్ధ స్తాడయామాస రాక్షసః. 11
విపన్నం కర్మ తద్దృష్ట్వా హనుమాం శ్చండవిక్రమః,
సాలం విపుల ముత్పాట్య భ్రామయామాస వీర్యవాన్. 12
భ్రామయంతం కపిం దృష్ట్వా సాలవృక్షం మహాబలమ్,
చిక్షేప సుబహూన్ బాణాన్ జంబుమాలీ మహాబలః. 13
సాలం చతుర్భి శ్చిచ్ఛేద వానరం పంచభి ర్భుజే,
ఉర స్యేకేన బాణేన దశభిస్తు స్తనాంతరే. 14
స శరైః పూరితతనుః క్రోధేన మహతా వృతః,
తమేవ పరిఘం గృహ్య భ్రామయామాస వేగితః. 15

తన ప్రక్కనే విశాలమగు పెద్దరాయి యుండుట చూచెను. 10

బలవంతుడగు హనుమంతు డా రాతిని వేగముగా పెఱికి జంబుమాలిపై విసరెను. దానిని చూచి కోపించిన యా రాక్షసుడు పది బాణములు ప్రయోగించి యా రాతిని పడగొట్టెను. 11

తాను చేసిన పని వ్యర్థమగుట చూచి, భయంకరపరాక్రమము కల హనుమంతు డొక విశాలసాలవృక్షమును పెఱికి గిరగిర త్రిప్పెను. 12

మహాబలుడగు హనుమంతు డట్లు సాలవృక్షమును త్రిప్పుచుండగా చూచి, బలశాలియగు జంబుమాలి యనేకబాణముల నాతనిపై విసరెను. 13

ఆ జంబుమాలి నాల్గుబాణములచే సాలవృక్షమును, ఐదు బాణములచే హనుమంతుని భుజములను, ఒక్క బాణముచే వక్షఃస్థలమును, పది బాణములచే స్తనప్రదేశమును కొట్టెను. 14

అంత హనుమంతు డా విధముగ బాణములతో నిండిన శరీరము కలవాడై, మహాకోపము నొంది, యా యినుపగుదియనే గ్రహించి వేగముగ త్రిప్పెను. 15

అతివేగోఽతివేగేన భ్రామయిత్వా బలోత్కటః,
పరిఘం పాతయామాస జంబుమాలే ర్మహోరసి. 16

తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ,
న ధను ర్న రథో నాశ్వా స్తత్రాదృశ్యంత నేషవః. 17

స హత స్సహసా తేన జంబుమాలీ మహాబలః,
పపాత నిహతో భూమౌ చూర్ణితాంగవిభూషణః. 18

జంబుమాలిం చ నిహతం కింకరాంశ్చ మహాబలాన్,
చుక్రోధ రావణః శ్రుత్వా కోపసంరక్తలోచనః. 19

స రోషసంవర్తితతామ్రలోచనః, ప్రహస్తపుత్రే నిహతే మహాబలే,
అమాత్యపుత్రా నతివీర్యవిక్రమాన్, సమాదిదే శాశు నిశాచరేశ్వరః. 20

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చతుశ్చత్వారింశఃసర్గః*

---

మహాబలము , మహావేగము కలవాడగు హనుమంతు డా గుదియ నతివేగమున త్రిప్పి, జంబుమాలియొక్క విశాలమగు రొమ్ముపై దానిని పడవైచెను. 16

అపు డచట జంబుమాలి తలగాని, చేతులు గాని, మోకాళ్ళు గాని, విల్లు గాని, రథము గాని, గుఱ్ఱములు గాని కానరావయ్యెను. 17

అట్లు వేగముగ హనుమంతుడు కొట్టగా మహాబలుడయ్యును ఆ జంబుమాలి అవయవములు, ఆభరణములు చూర్ణము కాగా నేలపై బడి చచ్చెను. 18

జంబుమాలిని, మహాబలులగు కింకరులను హనుమంతుడు నంహరించెనని విని రావణుడు కోపముచే ఎఱ్ఱబడిన కన్నులు కలవాడై క్రోధపరవశుడయ్యెను. 19

అట్లు ప్రహస్తుని కుమారుడగు జంబుమాలి మృతినొందగా, కోపముతో ఎఱ్ఱబారిన నేత్రములు గల రావణుడు మహాబలపరాక్రమసంపన్నులగు మంత్రిపుత్రులను శీఘ్రమే హనుమంతునితో పోర నాజ్ఞాపించెను. 20

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబది నాల్గవ సర్గము.*

# 45. పంచచత్వారింశః సర్గః

*(హనుమంతుడు మంత్రిపుత్రులను సంహరించుట)*

తత స్తే రాక్షసేంద్రేణ చోదితా మంత్రిణ స్సుతాః,
నిర్యయు ర్భవనా త్తస్మాత్ సప్త సప్తార్చివర్చసః. 1
మహాబలపరీవారా ధనుష్మంతో మహాబలాః,
కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః. 2
హేమజాలపరిక్షిప్తై ర్ధ్వజవద్భిః పతాకిభిః,
తోయదస్వననిర్ఘోషై ర్వాజియుక్తై ర్మహారథైః. 3
తప్తకాంచనచిత్రాణి చాపా న్యమితవిక్రమాః,
విష్ఫారయంతః సంహృష్టా స్తటిత్వంత ఇవాంబుదాః. 4

---

అంత రాక్షసరాజు రావణు డానతీయగా అగ్నివలె తేజోవంతు లగు మంత్రిపుత్రు లేడ్వురును ఆ రాజభవనమునుండి (యుద్ధమునకు) వెడలిరి. 1

వారితో పెద్దసేన బయలుదేరెను. వా రత్యంతబలసంపన్నులు, అస్త్రవిద్యయందు సుశిక్షితులు, అస్త్రవేత్తలలో శ్రేష్ఠులు, పరస్పరము పందెము వేసికొని శత్రువులను జయింపగోరువారునై యుండిరి. 2

వారి మహారథములకు గుఱ్ఱములు పూన్చబడియుండెను. ఆ రథములపై బంగారు జాలీలు కప్పబడియుండెను. తమ తమ అసాధారణచిహ్నములతో కూడిన ధ్వజములు, చిత్రవస్త్రములతో నలంకరింపబడిన పతాకములును రథమునకు కట్టబడియుండెను. ఆ రథములు మేఘముల ధ్వని కలిగియుండెను. 3

అమితపరాక్రమసంపన్ను లగు వా రా రథములలో కూర్చుండి మేలిమి బంగారముతో చిత్రింపబడిన తమ విండ్లను టంకారము చేయుచు, మెఱుపులతో కూడిన మేఘముల వలె నొప్పుచు, హర్షము నొందియుండిరి. 4

జనన్యస్తు తత స్తేషాం విదిత్వా కింకరాన్ హతాన్,
బభూవు శ్శోకసంభ్రాంతా స్సబాంధవసుహృజ్జనాః. 5
తే పరస్పరసంఘర్షాత్ తప్తకాంచనభూషణాః,
అభిపేతు ర్హనూమంతం తోరణస్థ మవస్థితమ్. 6
సృజంతో బాణవృష్టిం తే రథగర్జితనిస్స్వనాః,
వృష్టిమంత ఇవాంభోదా విచేరు ర్నైర్భృతాంబుదాః. 7
అవకీర్ణ స్తత స్తాభిర్హనుమాన్ శరవృష్టిభిః,
అభవత్ సంవృతాకార శ్శైలరాడివ వృష్టిభిః. 8
స శరాన్ మోఘయామాస తేషా మాశుచరః కపిః,
రథవేగం చ వీరాణాం విచరన్ విమలేఽంబరే. 9
స తైః క్రీడన్ ధనుష్మద్భి ర్వ్యోమ్ని వీరః ప్రకాశతే,

---

అంత, నా మంత్రిపుత్రుల తల్లులు, కింకరరాక్షసులు హనుమంతునితో యుద్ధము చేసి నశించిరని విని, బంధుమిత్రాదులతో గూడి మిక్కిలి చింతాక్రాంతలైరి. 5

మేలిమి బంగారు విభూషణములు దాల్చిన యా మంత్రిపుత్రు లేద్వురును నేను నేనని సందెము వేసికొనుచు ద్వారప్రదేశమున నున్న హనుమంతుని పైకి బోయిరి. 6

అ రాక్షసు లను మేఘములు, రథగర్జిత మను మేఘగర్జనధ్వని కలవారై, వర్షించు మేఘముల వలె బాణవర్షము కురియించుచు, నెల్లెడల తిరిగిరి. 7

అ బాణవర్షము తన్నట్లు కప్పివేయగా హనుమంతుడు వర్షములచే పర్వతరాజము వలె అగపడకుండెను. 8

ఆ హనుమంతుడు బాణముల నడుమ వేగముగ సంచరించుచు వానిని నిష్ఫల మొనర్చెను. అట్లే నిర్మలాకాశమున సంచరించుచు రాక్షసవీరుల రథవేగమును వమ్ము చేసెను. 9

వీరుడగు ఆ హనుమంతుడు ధనుర్ధారులగు రాక్షసవీరులతో అంతరిక్షమున

ధనుష్మద్భి ర్యథా మేఘై ర్మారుతః ప్రభు రంబరే. 10

స కృత్వా నినదం ఘోరం త్రాసయం స్తాం మహాచమూమ్,
చకార హనుమాన్ వేగం తేషు రక్షస్సు వీర్యవాన్. 11

తలే నాభ్యహనత్ కాంశ్చిత్ పాదైః కాంశ్చిత్ పరంతపః,
ముష్టినాఽభ్యహనత్ కాంశ్చిన్నఖైః కాంశ్చిద్ వ్యదారయత్. 12

ప్రమమా థోరసా కాంశ్చి దూరుభ్యా మపరాన్ కపిః,
కేచి త్తస్య నినాదేన తత్రైవ పతితా భువి. 13

తతస్తే ష్వవసన్నేషు భూమౌ నిపతితేషు చ,
తత్ సైన్య మగమత్ సర్వం దిశో దశ భయార్దితమ్. 14

వినేదు ర్విస్వరం నాగా నిపేతు ర్భువి వాజినః,
భగ్ననీడధ్వజచ్ఛత్రై ర్ధ్వాశ్చ కీర్ణాఽభవ ద్రథైః. 15

---

యుద్ధక్రీడ యొనరించుచు, యింద్రధనుస్సులతో విలసిల్లు మేఘములతో అంబరతలమున క్రీడించు మేటియగు వాయుదేవునివలె ప్రకాశించెను. 10

పరాక్రమశాలియగు హనుమంతుడు పెద్దగా గర్జించి, యా గర్జనచే ఆ పెద్ద రాక్షససేనను భయపెట్టుచు, రాక్షసులపై తన బలవేగము ప్రదర్శించెను. 11

శత్రువులను పీడించువాడగు హనుమ కొందరిని చేతులతో, కొందరిని పాదములతో, కొందరిని పిడికిళ్ళతో కొట్టెను. కొందరిని గోళ్ళతో చీల్చెను. 12

అతడు కొందరిని తన ఱొమ్ముతోడను, మఱికొందరిని తన తొడలతోడను పడగొట్టెను. కొందరు హనుమంతుని యఱపుచేతనే నేలపై పడిరి. 13

అటు లావిధముగ మంత్రిపుత్రులు హతులై నేలగూలగా, ఆ సైన్యమంతయు భయపీడితమై దశదిశలకు పరుగులెత్తెను. 14

ఏనుగులు ఉచ్చస్వరముతో ఘీంకరించెను. గుఱ్ఱములు నేలబడెను. ఆ యుద్ధభూమి యంతయు విఱిగిన రథముల టెక్కెములు, గొడుగులు మున్నగు వాని ముక్కలతో

ప్రవతా రుధిరేణాథ ప్రవంత్యో దర్శితాః పథి,
వివిధైశ్చ స్వరై ర్లంకా ననాద వికృతం తదా. 16
స తాన్ ప్రవృద్ధాన్ వినిహత్య రాక్షసాన్,
మహాబల శ్చండపరాక్రమః కపిః,
యుయుత్సు రన్యైః పునరేవ రాక్షసై
స్తమేవ వీరో౽భిజగామ తోరణమ్. 17

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచచత్వారింశః సర్గః.*

---

వ్యాప్తమయ్యెను. 15

అప్పుడు రక్తధారలచే మార్గములు తడిసినవై కన్పట్టెను. లంకానగరమున వివిధములగు వికృతశబ్దములు విననయ్యెను. 16

మహాబలుడు, గొప్ప పరాక్రమము కలవాడగు హనుమంతు డట్లు విజృంభించి ఆ రాక్షసులను చంపి, ఇంకను కొందరు రాక్షసులతో యుద్ధము చేయగోరి యా తోరణమునే యాశ్రయించెను. 17

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదియైదవ సర్గము.*

# 46. షట్చత్వారింశః సర్గః

*(హనుమంతుడు పంచసేనానులను వధించుట)*

హతాన్ మంత్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా,
రావణ స్సంవృతాకార శ్చకార మతి ముత్తమామ్. 1

స విరూపాక్షయూపాక్షౌ దుర్ధరం చైవ రాక్షసమ్,
ప్రఘసం భాసకర్ణం చ పంచ సేనాగ్రనాయకాన్. 2

సందిదేశ దశగ్రీవో వీరాన్ నయవిశారదాన్,
హనుమద్గ్రహణవ్యగ్రాన్ వాయువేగసమాన్ యుధి. 3

యాత సేనాగ్రగా స్సర్వే మహాబలపరిగ్రహాః,
సవాజిరథమాతంగాః స కపిః శాస్యతా మితి. 4

యత్తైశ్చ ఖలు భావ్యం స్యా త్తమాసాద్య వనాలయమ్,

---

మహాత్ముడగు హనుమంతుడు మంత్రికుమారులను మట్టుబెట్టెనని తెలిసికొనినవాడై, రావణుడు ధీరుడగుటచే ఆకృతిచే తన విషాదమును బయటపడనీయక ఇటు లుత్తమమగు ఆలోచన చేసెను. 1

ఆయన వెంటనే వీరులు, నీతికోవిదులు, హనుమంతుని పట్టుకొనుటయం దుత్సాహము కలవారు, యుద్ధమున వాయువేగముతో సంచరించువారగు విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడను నైదుగురు సేనానాయకుల కిట్లాదేశించెను. 2,3

ఓ సేనాపతులారా! మీరు గొప్ప సైన్యమును, గుఱ్ఱములు, యేనుగులు, రథములను తీసికొని యా వానరునిపై యుద్ధమునకు పొండు. అతని నెట్టైన అదుపులోనికి తెండు. 4

మీ రా వానరుని సమీపించి, కడుజాగరూకులై యుండవలయును. అట్లే దేశవిరోధి,

కర్మ చాపి సమాధేయం దేశకాలవిరోధితమ్,
న హ్యాహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్. 5
సర్వథా తన్మహద్భూతం మహాబలపరిగ్రహమ్,
భవే దింద్రేణ వా సృష్ట మస్మదర్థం తపోబలాత్. 6
సనాగయక్షగంధర్వా దేవాసురమహర్షయః,
యుష్మాభి స్సహితై స్సర్వై ర్మయా సహ వినిర్జితాః. 7
తై రవశ్యం విధాతవ్యం వ్యళీకం కించిదేవ నః,
తదేవ నాత్ర సందేహః ప్రసహ్య పరిగృహ్యతామ్. 8
నావమాన్యో భవద్భిశ్చ హరి ర్ధీరపరాక్రమః,
దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః. 9
వాలీ చ సహసుగ్రీవో జాంబవాంశ్చ మహాబలః,

---

కాలవిరోధి కానట్టి పనిని ఆలోచించి చేయవలయును. చే నతని ఘోరకృత్యములను బట్టి యతడు కోతి యని తలంపలేకున్నాను. 5

గొప్ప బలముతో కూడినట్టి యే భూతమో అది కావచ్చును. మనలను బాధించుట కింద్రుడే తన తపోబలముచే దానిని సృష్టించి యుండవచ్చును. 6

నేను మీతో కలసి పూర్వమే నాగులు, యక్షులు, గంధర్వులు, దేవతలు, అసురులు, మహర్షులను జయించియుంటిని. 7

వారే యిప్పుడు మన కీ యప్రియము కల్పించియుందురు. ఇందు సందేహము లేదు. కావున మీ రా కోతిని గట్టిగా పట్టుకొనుడు. 8

ధీరుడు, పరాక్రమశాలియగు ఆ వానరుని మీ రవమానింపకుడు. నేను పూర్వ మిట్టి మహాపరాక్రమశాలులగు వానరులను చూచియుంటిని. 9

వాలి, సుగ్రీవుడు, మహాబలుడగు జాంబవంతుడు, సేనాపతి యగు నీలుడు,

నీల స్సేనాపతి శ్చైవ యే చాన్యే ద్వివిదాదయః. 10
నైవం తేషాం గతి ర్భీమా న తేజో న పరాక్రమః,
న మతి ర్న బలోత్సాహౌ న రూపపరికల్పనమ్. 11
మహత్ సత్త్వ మిదం జ్ఞేయం కపిరూపం వ్యవస్థితమ్,
ప్రయత్నం మహ దాస్థాయ క్రియతా మస్య నిగ్రహః. 12
కామం లోకా స్త్రయ స్సేంద్రా స్ససురాసురమానవాః,
భవతా మగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే. 13
తథాపి తు నయజ్ఞేన జయ మాకాంక్షతా రణే,
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధి ర్హి చంచలా. 14
తే స్వామివచనం సర్వే ప్రతిగృహ్య మహౌజసః,

---

ఇంకను ద్వివిదుడు మున్నగు వానరవీరు లున్నారు. 10

కాని వారి గమన మిట్లు భీకరము కాదు. వారి కింతటి తేజముగాని, పరాక్రమముగాని, ఆలోచనగాని, బలముగాని, ఉత్సాహముగాని, యిట్లు తమ కిష్టమైన రూపమును పొందుటగాని కనిపించవు. 11

ఇది వానరరూపములో వచ్చినట్టి ఒక పెద్ద భూత మని తోచుచున్నది. కావున మహాప్రయత్నముతో దీనిని పట్టవలెను. 12

యుద్ధక్షేత్రమున ఇంద్రుడు, సురలు, అసురులు, మానవులతో కూడిన ముల్లోకములు మీ యెదుట నిలువజాలవు. 13

అట్లయ్యును నీతికోవిదుడు, యుద్ధమున జయము కోరువాడును మిక్కిలి ప్రయత్నముతో తన్ను దాను రక్షించుకొనవలెను. ఏలయన యుద్ధమున జయము చంచలమైనది. 14

అని రావణుడు చెప్పగా, తమ యజమాని యాజ్ఞ గైకొని మహాతేజశ్శాలు లగు సేనాపతులు అగ్నిసమతేజులై వాడియైన వివిధాయుధములు దాల్చి, రథములు,

సముత్పేతు ర్మహావేగా హుతాశసమతేజసః. 15

రథై ర్మత్తై శ్చ మాతంగై ర్వాజిభిశ్చ మహాజవైః,
శస్త్రైశ్చ వివిధై స్తీక్ష్ణై స్సర్వై శ్చోపచితా బలైః. 16

తతస్తం దదృశు ర్వీరా దీప్యమానం మహాకపిమ్,
రశ్మిమంత మివోద్యంతం స్వతేజోరశ్మిమాలినమ్. 17

తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్,
మహామతిం మహావేగం మహాకాయం మహాబలమ్. 18

తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వా స్వవస్థితాః,
తై స్తైః ప్రహరణై ర్భీమై రభిపేతు స్తతస్తతః. 19

తస్య పంచాయసా స్తీక్ష్ణా శ్శితాః పీతముఖా శ్శరాః,
శిర స్యుత్పలపత్రాభా దుర్ధరేణ నిపాతితాః. 20

---

మదించిన ఏనుగులు, వేగము గల గుఱ్ఱములు, కాల్బలమును తీసికొని మహావేగముతో హనుమంతుని పైకి పోయిరి. 15,16

అంతట వీరులగు ఆ సేనానాయకులు గొప్ప ఉత్సాహము కలవాడును, మహాబల పరాక్రమసంపన్నుడును, గొప్పబుద్ధిశాలియు, గొప్పవేగము కలవాడును, పెద్ద శరీరము కలవాడును, ఉదయించు సూర్యునివలె నున్నవాడును, తన తేజస్సుచే సూర్యుడే యన వెలుగుచు బహిర్ద్వారముపై విలసిల్లుచున్నవాడును అగు హనుమంతుని చూచిరి. 17,18

వా రా హనుమంతుని చూచుచునే యన్నివైపులను ఆవరించి నిలచి, భయంకరములగు వివిధాయుధములతో హనుమంతు నెదిర్చిరి. 19

అపుడు దుర్ధరుడు ఇనుముతో చేయబడినవి, క్రూరమైనవి, వాడిగలవి, పసుపువన్నె గలవియగు నైదు బాణములను కలువతేకులను వేసినట్లు హనుమంతుని తలపై కొట్టెను. 20

హనుమంతు డా ఐదుబాణముల ప్రహారములు తగులగా దశదిశలును

స తైః పంచభి రావిద్ధ శ్శరై శ్శిరసి వానరః,
ఉత్పపాత నదన్ వ్యోమ్ని దిశో దశ వినాదయన్. 21

తత స్తు దుర్ధరో వీర స్సరథ స్సజ్యకార్ముకః,
కిరన్ శరశతై స్తీక్ష్ణై రభిపేదే మహాబలః. 22

స కపి ర్వారయామాస తం వ్యోమ్ని శరవర్షిణమ్,
వృష్టిమంతం పయోదాంతే పయోదమిన మారుతః. 23

అర్ద్యమాన స్తత స్తేన దుర్ధరే ణానిలాత్మజః,
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్. 24

స దూరం సహసోత్పత్య దుర్ధరస్య రథే హరిః,
నిపపాత మహావేగో విద్యుద్రాశి ర్గిరావివ. 25

తత స్స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్,
విహాయ న్యపత ద్భూమౌ దుర్ధర స్త్యక్తజీవితః. 26

---

మార్మ్రోగునటులు సింహనాదము చేయుచు ఆకసమున కెగసెను. 21

అంతట మహాబలుడు, వీరుడగు దుర్ధరుడు రథమెక్కి, ధనుస్సు నెక్కుపెట్టి, వందలకొలది వాడి బాణములతో హనుమంతు నెదిరించెను. 22

శరత్కాలమందు వర్షించుచున్న మేఘమును వాయు వడ్డుకొనునట్లు ఆకాశమున బాణములు కురిపించుచున్న దుర్ధరుని హనుమంతు డడ్డుకొనెను. 23

అట్లు దుర్ధరుడు బాణవర్షముచే పీడింపగా హనుమ తన శరీరమును పెంచి, వేగవంతుడై మఱల యుద్ధ మొనరించెను. 24

హనుమంతు డట్లు మహావేగముతో పైకెగసి కొండపై పిడుగుల రాశి పడినట్లు, ఒక్కుమ్మడిగా నా దుర్ధరుని రథముపై బడెను. 25

ఆ పాటువకు గుఱ్ఱము లెనిమిది నలిగి, రథపు కండ్లును, నొగయు విఱువగా, దుర్ధరుడా రథము నుండి క్రింద పడి చచ్చెను. 26

తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా నిపతితం భువి,
సంజాతరోషౌ దుర్ధర్షా వుత్పేతతు రరిందమౌ. 27

స తాభ్యాం సహసోత్పత్య విష్ఠితో విమలేఽంబరే,
ముద్గరాభ్యాం మహాబాహు ర్వక్ష స్యభిహతః కపిః. 28

తయో ర్వేగవతో ర్వేగం వినిహత్య మహాబలః,
నిపపాత పున ర్భూమౌ సుపర్ణసమవిక్రమః. 29

స సాలవృక్ష మాసాద్య త ముత్పాట్య చ వానరః,
తావుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః. 30

తతస్తాం స్త్రీన్ హతాన్ జ్ఞాత్వా వానరేణ తరస్వినా,
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిమ్. 31

భాసకర్ణశ్చ సంక్రుద్ధ శ్శూల మాదాయ వీర్యవాన్,

---

అట్లు దుర్ధరుడు మరణించి, వేలబడుట గాంచి శత్రువుల నణచెడి విరూపాక్ష యూపాక్షులు మిక్కిలి కోపించి హనుమంతునిపై కురికిరి. 27

ఆ విరూపాక్ష యూపాక్షు లపుడు నిర్మలాకాశమున నిలిచియున్న హనుమంతునిపై కొక్కుమ్మడిగా ఎగిరి ముద్గరములతో నాతని ఱొమ్ముపై కొట్టిరి. 28

మహాబలుడగు హనుమంతు డా వేగవంతులగు విరూపాక్ష యూపాక్షుల వేగమును నివారించి, గరుత్మంతునకు సాటియగు పరాక్రమము కలవాడై మఱల భూమిపై దిగెను. 29

ఆ వాయుపుత్రుడు ఒక సాలవృక్షము కడకేగి, దానిని పెకలించి, దానితో నా వీరులగు రాక్షసుల నిరువురను చంపివేసెను. 30

అట్లా సేనాపతులు ముగ్వురును వేగవంతుడగు హనుమంతునిచేత చచ్చుట కాంచి మహావేగము కలవాడగు ప్రఘసుడు హనుమంతుని పైకి పోయెను. 31

అట్లే పరాక్రమశాలియగు భాసకర్ణుడు కోపించి యొక శూలమును చేతబట్టి వేఱొక

ఏకతః కపిశార్దూలం యశస్విన మవస్థితమ్. 32

పట్టిసేన శితాగ్రేణ ప్రఘసః ప్రత్యయోధయత్,
భాసకర్ణశ్చ శూలేన రాక్షసః కపిసత్తమమ్. 33

స తాభ్యాం విక్షతై ర్గాత్రై రసృగ్దిగ్ధతనూరుహః,
అభవద్ వానరః క్రుద్ధో బాలసూర్యసమప్రభః. 34

సముత్పాట్య గిరేః శృంగం సమృగవ్యాళపాదపమ్,
జఘాన హనుమాన్ వీరో రాక్షసౌ కపికుంజరః. 35

తతస్తే ష్వవసన్నేషు సేనాపతిషు పంచసు,
బలం తదవశేషం చ నాశయామాస వానరః. 36

అశ్వై రశ్వాన్ గజైర్నాగాన్ యోధైర్యోధాన్ రథై రథాన్,
స కపి ర్నాశయామాన సహస్రాక్ష ఇవాసురాన్. 37

---

వైపునుండి కీర్తిమంతుడగు హనుమంతునిపైకి వెడలెను. 32

ప్రఘసుడు వాడియగు అడ్డకత్తితోడను, భాసకర్ణుడు శూలముతోడను హనుమంతునితో యుద్ధము చేసిరి. 33

ఆ ప్రకారము ప్రఘస భాసకర్ణు లాయుధములతో కొట్టగా, అవయవములు గాయపడి, శరీరమంతయు రక్తముచే తడియగా, బాలసూర్యునితో సమానమగు కాంతిగలవాడగు హనుమంతుడు తీవ్రముగ కోపించెను. 34

అంత వీరుడు, కపిశ్రేష్ఠుడగు హనుమంతుడు జంతువులతో, పాములతో, చెట్లతో కూడిన యొక పర్వతశిఖరమును పెకలించి దానితో నా రాక్షసులను కొట్టెను. 35

అంత నా సేనాపతు లయిదుగురు నశింపగా, మిగిలిన సైన్యమును గూడ హనుమంతుడు నాశనము చేసెను. 36

ఆ హనుమంతు డపుడు దేవేంద్రుడు రాక్షసులనువలె, గుఱ్ఱములను గుఱ్ఱములతోడను, యేనుగుల నేనుగులతోడను, యోధులను యోధులతోడను,

హతై ర్నాగైశ్చ తురగై ర్భగ్నాక్షైశ్చ మహారథైః,
హతైశ్చ రాక్షసై ర్భూమీ రుద్ధమార్గా సమంతతః. 38
తతః కపి స్తాన్ ధ్వజినీపతీన్ రణే
నిహత్య వీరాన్ సబలాన్ సవాహనాన్,
సమీక్ష్య వీరః పరిగృహ్య తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే. 39

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షట్చత్వారింశః సర్గః.*

---

రథములను రథములతోడను నాశనము చేసెను. 37

మరణించిన యేనుగులతో, చచ్చిన గుఱ్ఱములతో, యిరుసులు విరిగిన మహా రథములతో, మృతినొందిన రాక్షసులతో నా యుద్ధభూమార్గము అడ్డగించబడిన దయ్యెను. 38

వీరుడగు హనుమంతు డట్లా వీరులగు సేనాపతులను, వారి సైన్యమును, వాహనములను నాశన మొనరించి, మఱల నా బహిర్ద్వారము చేరి ప్రజలు నశించు సమయమున (అవకాశమున) కెదురుచూచు యమునివలె నిలచెను. 39

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదియారవ సర్గము.*

# 47. సప్తచత్వారింశః సర్గః

*(అక్షరాక్షస సంహారము)*

సేనాపతీన్ పంచ స తు ప్రమాపితాన్,హనూమతా సానుచరాన్ సవాహనాన్,
సమీక్ష్య రాజా సమరోద్ధతోన్ముఖం, కుమార మక్షం ప్రసమైక్ష తాగ్రతః. 1
స తస్య దృష్ట్యర్పణసంప్రచోదితః, ప్రతాపవాన్ కాంచనచిత్రకార్ముకః,
సముత్పపా తాథ సదస్యుదీరితో, ద్విజాతిముఖ్యై ర్హవిషేవ పావకః. 2
తతో మహద్ బాలదివాకరప్రభం, ప్రతప్తజాంబూనదజాలసంతతమ్,
రథం సమాస్థాయ యయౌ స వీర్యవాన్, మహాహరిం తం ప్రతి నైర్ఋతర్షభః
తతస్తపస్సంగ్రహసంచయార్జితం, ప్రతప్తజాంబూనదజాలశోభితమ్,

---

రాక్షసరాజగు రావణు డట్లు సేనాపతులయిదుగురు, వారి యనుచరులు, వాహనములు హనుమంతునిచేత నశించుట తెలిసికొని ఎల్లప్పుడు యుద్ధమున నేనే జయింతునని గర్వించువాడును, యుద్ధోన్ముఖుడును అగు అక్షకుమారునిపై తన చూపును ప్రసరింపజేసెను. 1

ప్రతాపవంతుడగు అక్షుడును, తన తండ్రి యట్లు చూచుటచేతనే ప్రేరితుడై బంగారురంగు కలిగి ఆశ్చర్యము కలిగించు విల్లు దాల్చి, బ్రాహ్మణశ్రేష్ఠులు హవిస్సు నర్పించగా వృద్ధి నందిన యగ్నివలె వేగముగ వెడలెను. 2

పరాక్రమవంతుడగు ఆ అక్షరాక్షసుడు బాలసూర్యునివంటి కాంతి గలవాడై, మేలిమి బంగారు జాలీలతో నలంకృతమైన రథము నధిరోహించి హనుమంతునిపైకి వెడలెను. 3

అంత నా అక్షరాక్షసుడు, తపస్సు లనేకములు చేసి సంపాదించినదియు, మేలిమి బంగారపు జాలీలతో అలంకరింపబడినదియు, సామాన్యములగు జెండాలును, రత్నములతో నలంకృతములయిన జెండాలును కలదియు, మనోవేగముతో సమానమగు వేగముగల గుఱ్ఱము లెనిమిదింటితో చక్కగా పూన్చబడినదియు, దేవతలకుగాని,

పతాకినం రత్నవిభూషితధ్వజం, మనోజవాష్టాశ్వవరై స్సుయోజితమ్. 4
సురాసురాధృష్యమసంగచారిణం, రవిప్రభం వ్యోమచరం సమాహితమ్,
సతూణ మష్టాసినిబద్ధబంధురం, యథాక్రమావేశితశక్తితోమరమ్. 5
విరాజమానం ప్రతిపూర్ణవస్తునా, సహేమదామ్నా శశిసూర్యవర్చసా,
దివాకరాభం రథమాస్థితస్తత, స్స నిర్జగా మామరతుల్యవిక్రమః. 6
స పూరయన్ ఖం చ మహీం చ సాచలాం, తురంగమాతంగమహారథస్వనై,
బలైస్సమేతైస్స హి తోరణస్థితం, సమర్థమాసీన ముపాగమత్ కపిమ్. 7
స తం సమాసాద్య హరిం హరీక్షణో, యుగాంతకాలాగ్నిమివ ప్రజాక్షయే,
అవస్థితం విస్మితజాతసంభ్రమ, స్సమైక్షతాక్షో బహుమానచక్షుషా. 8

---

రాక్షసులకుగాని ఎదిరింపరానిదియు, సూర్యకాంతిని పోలు కాంతి కలదియు, ఆకాశమున పోవునదియు, యుద్ధమునకై చక్కగా సిద్ధము చేయబడినదియు, అమ్ములపొదులు కలదియు, ఎనిమిది కత్తులతో కూడినదియు, ఆ యా స్థానములలో క్రమముగా నుంచబడిన శక్తి, తోమరము లను ఆయుధములు కలదియు, సమగ్రములగు యుద్ధోపకరణములతో విరాజిల్లునదియు, బంగారముతో చేయబడినవి, సూర్యచంద్రులవలె ప్రకాశించుచున్నవి యగు గుఱ్ఱములు మున్నగు వానిని బంధించు త్రాళ్ళు కలదియు, ఆకాశమున సూర్యునివలె సంచరించునదియు అగు రథ మెక్కి, దేవతలకు సాటియైన పరాక్రమము కలవాడై వెడలెను. 4-6

ఆ అక్షుడు గుఱ్ఱములు, ఏనుగులు, మహారథముల ధ్వనులతో ఆకాశమును, కొండలతో గూడిన భూమిని నింపుచు, వెంట వచ్చు సేనలతో బహిర్ద్వారమున నున్న సమర్థుడగు హనుమంతుని సమీపించెను. 7

సింహనయనముల వంటి నేత్రములు కలవాడగు అక్షుడు, ప్రళయాగ్నివలె ప్రజానాశనము చేయుటకు ప్రవర్తించుచున్న హనుమంతుని కడ కేగెను. హనుమంతుని చూడగనే ఆశ్చర్యము, ఒకింత తత్తరబాటును పొంది అక్షు డాయనను గౌరవముతో చూచెను. 8

స తస్య వేగం చ కపే ర్మహాత్మనః, పరాక్రమం చారిషు పార్థివాత్మజః,
విధారయన్ స్వం చ బలం మహాబలో, హిమక్షయే సూర్య ఇవాభివర్ధతే. 9
స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమం, స్థిరం స్థిత స్సంయతి దుర్నివారణమ్,
సమాహితాత్మా హనుమంతమాహవే, ప్రచోదయామాస శరైస్త్రిభిశ్శితైః. 10
తతః కపిం తం ప్రసమీక్ష్య గర్వితం, జితశ్రమం శత్రుపరాజయోర్జితమ్,
అవైక్షతాక్ష స్సముదీర్ణమానస, స్సబాణపాణిః ప్రగృహీతకార్ముకః. 11
స హేమనిష్కాంగదచారుకుండల, స్సమాససాదాశుపరాక్రమః కపిమ్,
తయో ర్బభూవాప్రతిమస్సమాగమ, స్సురాసురాణామపి సంభ్రమప్రదః. 12
రరాస భూమి ర్న తతాప భానుమాన్,వవౌ న వాయుః ప్రచచాల చాచల,
కపేః కుమారస్య చ వీక్ష్య సంయుగం,ననాద చ ద్యౌ రుదధిశ్చ చుక్షుభే. 13

---

మహాబలుడగు ఆ అక్షరాక్షసుడు మహాత్ముడగు హనుమంతుని వేగమును, శత్రువులపై అతడు చూపు పరాక్రమమును, తన బలమును నిర్ధారణ చేసికొని వసంతర్తువునందు సూర్యునివలె వృద్ధినొందెను. 9

ఆ రాక్షసుడు, హనుమంతుడు యుద్ధమున అసాధ్యుడని యాతని పరాక్రమమును బట్టి గ్రహించి, కోపించి, స్థైర్యము కూడగట్టుకొని అవహితుడై మూడు వాడిబాణములతో హనుమంతుని యుద్ధమునకు పురిగొల్పెను. 10

అపుడు అక్షుడు హనుమంతుడు గర్వితుడనియు, శత్రువులను జయించుటచే విజృంభించెననియు, శ్రమము లెక్కచేయడనియు గమనించి, విల్లమ్ములు చేత దాల్చి ఉత్సాహముగ అతనిని చూచెను. 11

అతడు బంగారు బాహుపురులు, సుందరకుండలములు దాల్చి, శీఘ్రమే పరాక్రమించుచు హనుమంతు నెదుర్కొనెను. వారి యా సమాగమము సాటిలేనిదై దేవదానవులకును భయము కలిగించెను. 12

ఆ అక్షహనుమంతుల యుద్ధము చూచి భీతిల్లి భూమి పెద్ద ధ్వని చేసెను. సూర్యుడు తపించడయ్యెను. వాయువు వీవదయ్యెను. పర్వతము అచలమయ్యు చలించెను. ఆకాశము పెద్ద ధ్వని చేసెను. సముద్రము క్షోభిల్లెను. 13

తత స్స వీర స్సుముఖాన్ పతత్రిణ, స్సువర్ణపుంఖాన్ సవిషా నివోరగాన్,
సమాధిసంయోగవిమోక్షతత్త్వవి, చ్ఛరానథ త్రీన్ కపిమూర్ధ్న్యపాతయత్. 14

స తైశ్శరై ర్మూర్ధ్ని నమం నిపాతితైః, క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః,
నవోదితాదిత్యనిభశ్శరాంశుమాన్, వ్యరాజతాదిత్య ఇవాంశుమాలికః. 15

తతస్స పింగాధిపమంత్రిసత్తమ, స్సమీక్ష్య తం రాజవరాత్మజం రణే,
ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం, జహర్ష చాపూర్యత చాహవోన్ముఖః. 16

స మందరాగ్రస్థ ఇవాంశుమాలికో, వివృద్ధకోపో బలవీర్యసంయుతః,
కుమారమక్షం సబలం సవాహనం, దదాహ నేత్రాగ్నిమరీచిభిస్తదా. 17

---

లక్ష్యము నెఱిగి శరసంధానము చేయుట, బాణము ప్రయోగించుట చక్కగా వెఱిగిన అక్షుడు, చక్కని యగ్రభాగము కలవియు, ఱెక్కలు గట్టినవియు, బంగారు వర్ణము గల వెనుక భాగము కలవియు, విషసర్పములవలె నున్నవియు అగు మూడుబాణములను హనుమంతుని తలపై నాటెను. 14

ఆ మూడు బాణములు సమానముగా శిరమున నాటుకొని రక్తము కారుటచే వృత్తాకారపు కన్నులు తడిసిపోగా, హనుమంతుడు, అపుడే ఉదయించిన సూర్యునివలె నొప్పుచు బాణము లను కిరణములతో కూడినవాడై, కిరణములు మాలగా కల సూర్యునివలె విరాజిల్లెను. 15

అపు డా సుగ్రీవుని మంత్రులతో శ్రేష్ఠుడగు హనుమంతుడు యుద్ధమున బహువిధములగు శ్రేష్ఠములైన ఆయుధములు, ఆశ్చర్యము గొల్పు విల్లు ధరించిన యీ రాక్షసరాజు కుమారుడగు అక్షుని చూచి సంతోషించి యుద్ధోన్ముఖుడై శరీరమును పెంచెను. 16

అపుడు మందరపర్వతశిఖముపై వెలుగు సూర్యునివలె వృద్ధినందిన కోపము గలవాడై హనుమ బలపరాక్రమములు కూడగట్టుకొని, అక్షకుమారుని, అతని సేనను, వాహనములను తన కంటినుండి వెలువడిన క్రోధోష్ణవీక్షణములతో కాల్చెను. 17

తతస్స బాణాసనచిత్రకార్ముక, శ్శరప్రవర్షో యుధి రాక్షసాంబుదః,
శరా న్ముమోచాశు హరీశ్వరాచలే, వలాహకో వృష్టిమి వాచలోత్తమే. 18
తతః కపిస్తం రణచండవిక్రమం, వివృద్ధతేజోబలవీర్యసంయుతమ్,
కుమారమక్షం ప్రసమీక్ష్య సంయుగే, ననాద హర్షాద్ఘనతుల్యవిక్రమః. 19
స బాలభావా ద్యుధి వీర్యదర్పితః, ప్రవృద్ధమన్యుః క్షతజోపమేక్షణః,
సమాససాదాప్రతిమం కపిం రణే, గజో మహాకూపమివావృతం తృణైః.
స తేన బాణైః ప్రసభం నిపాతితై, శ్చకార నాదం ఘననాదనిస్వనః,
సముత్పపాతాశు నభస్స మారుతి, ర్భుజోరువిక్షేపణఘోరదర్శనః. 21
సముత్పతంతం సమభిద్రవద్బలీ, స రాక్షసానాం ప్రవరః ప్రతాపవాన్,

---

అంతట ఆ రాక్షసు డను మేఘము, బాణములను విడచు (ఇంద్రధనుస్సువలె) చిత్రమైన విల్లు ధరించి, యుద్ధమున ఆ వానరశ్రేష్ఠుడను కొండపై, మేఘము కొండపై వాన కురిపించినట్లు బాణవర్షమును కురిపించెను. 18

అపుడు, యుద్ధమున భీకరమగు పరాక్రమము కలవాడు, పెంపొందిన తేజస్సు, బలము, పరాక్రమములతో కూడినవాడగు అక్షకుమారుని యుద్ధమున చూచి, మేఘమువలె ఆకాశమున స్వేచ్ఛగా సంచరించుచున్న హనుమ హర్షముతో సింహనాదము చేసెను. 19

ఆ రాక్షసుడు బాలుడగుటచే యుద్ధమున దన పరాక్రమమునకు తానే గర్వించుచు, కోపము పెరిగినవాడై, కోపముచే కన్ను లెఱ్ఱబడగా, ఏనుగు గడ్డితో కప్పబడిన పెద్దబావికడకు పోయినట్లు యుద్ధమున సాటిలేని పరాక్రమముగల హనుమంతుని పైకి పోయెను. 20

మేఘధ్వనిని బోలు ధ్వనిగల హనుమంతు డక్షుని బాణముల దెబ్బతిని పెద్దగా నఱచెను. అతడు వెంటనే భుజములు తొడలు విదిలించుకొని శత్రువులకు భీకరమగు రూపముతో నాకాశమున కెగసెను. 21

బలవంతుడును, రాక్షసశ్రేష్ఠుడును, ప్రతాపశాలియు, రథికులలో శ్రేష్ఠుడును అగు

రథీ రథిశ్రేష్ఠతమః కిరన్ శరైః, పయోధర శ్శైలమివాశ్మవృష్టిభిః. 22
స తాన్ శరాంస్తస్య హరిర్విమోక్షయన్, చచార వీరః పథి వాయుసేవితే,
శరాంతరే మారుతవద్వినిష్పతన్, మనోజవ స్సంయతి చండవిక్రమః. 23
తమాత్తబాణాసన మాహవోన్ముఖం, ఖమాస్తృణంతం విశిఖై శ్శరోత్తమైః,
అవైక్షతాక్షం బహుమానచక్షుషా, జగామ చింతాం చ స మారుతాత్మజః.
తతశ్శరై ర్భిన్నభుజాంతరః కపిః, కుమారవీరేణ మహాత్మనా నదన్,
మహాభుజః కర్మవిశేషతత్త్వవి, ద్విచింతయామాస రణే పరాక్రమమ్. 25
అబాలవద్బాలదివాకరప్రభః, కరోత్యయం కర్మ మహన్మహాబలః,
న చాస్య సర్వాహవకర్మశోభినః, ప్రమాపణే మే మతిరత్ర జాయతే. 26
అయం మహాత్మా చ మహాంశ్చ వీర్యత, స్సమాహితశ్చాతిసహశ్చ సంయుగే,

---

అక్షుడు, మేఘము కొండపై వడగండ్ల వాన కురిపించినట్లు బాణవర్షము కురిపించుచు ఆకాసమున నెగురుచున్న హనుమంతు ననుసరించి తానును ఆకసమున కెగిరెను. 22

మనోవేగము కలవాడును, యుద్ధమున భీకరపరాక్రమము కలవాడును, వీరుడు నగు హనుమంతుడు అక్షుడు ప్రయోగించిన బాణముల నడుమ వాయువువలె చరించి, బాణాఘాతమును తప్పించుకొనుచు, ఆకాశమున సంచరించెను. 23

వాయుపుత్రుడగు హనుమంతు డట్లు విల్లు ధరించి, యుద్ధసన్నద్ధుడై, ఆకాశమును బాణములతో నింపుచున్న అక్షుని ఆదరముతో చూచి, చింతించెను. 24

మహాభుజుడగు హనుమంతుడు వీరుడగు అక్షకుమారుడు తన్నట్లు భుజములపై బాణములతో కొట్టగా, పెద్దగా నాదము చేయుచు, కార్యవిశేషముల స్వరూప మెఱిగిన వాడగుటచే యుద్ధమున పరాక్రమమును జూపు టెట్లా యని యాలోచించెను. 25

మహాబలుడగు ఈ అక్షుడు బాలుడయ్యును బాలసూర్యునివలె ప్రకాశించుచు, మహాకార్యమునే చేయుచున్నాడు. సకలయుద్ధవిధానములను ప్రయోగించుచు ప్రకాశించు నీ అక్షుని చంపుటకు మనసు రాకున్నది. 26

ఈ అక్షుడు మహాత్ముడు. పరాక్రమముచే గొప్పవాడు. యుద్ధమువ ఏమరుపాటు

అసంశయం కర్మగుణోదయాదయం, సనాగయక్షైర్మునిభిశ్చ పూజితః. 27
పరాక్రమోత్సాహవివృద్ధమానసః, సమీక్షతే మాం ప్రముఖాగతస్స్థితః,
పరాక్రమో హ్యస్య మనాంసి కంపయేత్, సురాసురాణామపి శీఘ్రగామినః. 28
న ఖల్వయం నాభిభవే దుపేక్షితః, పరాక్రమో హ్యస్య రణే వివర్ధతే,
ప్రమాపణం త్వేవ మమాస్య రోచతే, న వర్ధమానోఽగ్నిరుపేక్షితుం క్షమః. 29
ఇతి ప్రవేగం తు పరస్య తర్కయన్, స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్,
చకార వేగం తు మహాబలస్తదా, మతిం చ చక్రేఽస్య వధే మహాకపిః. 30
న తస్య తా నష్టహయా న్మహాజవాన్, సమాహితాన్ భారసహాన్వివర్తనే,
జఘాన వీరః పథి వాయుసేవితే, తలప్రహారైః పవనాత్మజః కపిః. 31

---

లేనివాడు. మిక్కిలి సహనశక్తి గలవాడు. తన యుద్ధవిద్యాకౌశలముచే నాగులు, యక్షులు, మునుల ప్రశంస బడసినవాడు. 27

పరాక్రమము, ఉత్సాహము మనమున పెల్లుబుకగా ఇతడు నా యెదుట నిలిచి నన్ను చూచుచున్నాడు. మిక్కిలి వేగముగ పోవు ఇతని పరాక్రమము సురాసురులకైన మనమున దుడుకు పుట్టించును. 28

ఇతని నుపేక్షించుదునేని నన్ను బాధింపక మానదు. యుద్ధమున ఇతని పరాక్రమము పెరుగుచున్నది. కావున నా కితనిని చంపుటయే ఇష్టమగుచున్నది. అగ్ని పెరుగుచుండగా ఉపేక్షచేయరాదు గదా. 29

పరాక్రమశాలి, మహాబలుడగు హనుమంతు డిట్లు తన శత్రువుయొక్క పరాక్రమము నూహించుచు, తన కర్తవ్యము తలంచుకొని యా రాక్షసుని చంపవలెననియే నిశ్చయించుకొనెను. 30

వీరుడు, వాయుపుత్రు డగు హనుమంతుడు వెంటనే మహావేగము కలవి, ఏమరుపాటులేనివి, కుడియెడమలకు తిరిగినపుడు గూడ రథము బరువు మోయజాలినవి అగు అక్షుని గుఱ్ఱము లెనిమిదింటిని ఆకాశమున అఱచేతితో కొట్టి చంపెను. 31

తతస్తలే నాభిహతో మహారథ, స్స తస్య పింగాధిపమంత్రినిర్జితః,
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః, పపాత భూమౌ హతవాజిరంబరాత్. 32
స తం పరిత్యజ్య మహారథో రథం, సకార్ముకః ఖడ్గధరః ఖముత్పతన్,
తపోఽభియోగాదృషిరుగ్రవీర్యవాన్, విహాయ దేహం మరుతామివాలయమ్.
తతః కపిస్తం విచరంతమంబరే, పతత్రిరాజానిలసిద్ధసేవితే,
సమేత్య తం మారుతతుల్యవిక్రమః, క్రమేణ జగ్రాహ స పాదయోర్దృఢమ్.
స తం సమావిధ్య సహస్రశః కపి, ర్మహోరగం గృహ్య ఇవాండజేశ్వరః,
ముమోచ వేగాత్పితృతుల్యవిక్రమో, మహీతలే సంయతి వానరోత్తమః. 35
స భగ్నబాహూరుకటీశిరోధరః, క్షర న్నసృఙ్నిర్మథితాస్థిలోచనః,
స భగ్నసంధిః ప్రవికీర్ణబంధనో, హతః క్షితౌ వాయుసుతేన రాక్షసః. 36

---

పిమ్మట ఆ అక్షుని రథము సుగ్రీవుని మంత్రియగు హనుమంతుని యఱచేతి దెబ్బచే నొగ తొలగి, చక్రములు విఱిగి, గుఱ్ఱములు చచ్చి, యాకసము నుండి నేలబడెను. 32

అంతట మహారథుడగు అక్షుడు తీవ్రపరాక్రమ మొప్పగా, ఆ రథమును వీడి, విల్లు ధరించి, కత్తి చేతగొని, ఋషి తన తపఃప్రభావముచే శరీరము వీడి స్వర్గమున కేగినట్లు ఆకసమున కెగసెను. 33

పిమ్మట వాయువుతో సమానమగు పరాక్రమముగల హనుమంతుడు, గరుత్మంతుడు వాయుదేవుడు సిద్ధులు సంచరించునట్టి యాకాశమున తిరుగుచున్న అక్షుని సమీపించి, అతని పాదములు గట్టిగా పట్టుకొనెను. 34

వానరశ్రేష్ఠుడు, తండ్రియగు వాయుదేవునకు సాటియగు వేగము కలవా డగు హనుమంతుడు, గరుత్మంతుడు మహాసర్పమును వలె అక్షుని పట్టి వేయిమార్లు త్రిప్పి యుద్ధక్షేత్రమున నేలపై వేగముగ విసరికొట్టెను. 35

అపు డా రాక్షసుడు భుజములు, తొడలు, నడుము, మెడ విఱిగి కారుచున్న రక్తముచే దేహము తడిసి, ఎముకలు, కండ్లు నలిగి, సంధిబలములు విడిపోయి హనుమంతునిచేత చచ్చెను. 36

మహాకపి ర్భూమితలే నిపీడ్య తం, చకార రక్షోధిపతేర్మహద్భయమ్. 37

మహర్షిభిశ్చక్రచరైర్మహావ్రతై, స్సమేత్య భూతైశ్చ సయక్షపన్నగైః,
సురైశ్చ సేంద్రైర్భృశజాతవిస్మయై, ర్హతే కుమారే స కపి ర్నిరీక్షితః. 38

నిహత్య తం వజ్రిసుతోపమప్రభం, కుమారమక్షం క్షతజోపమేక్షణమ్,
తమేవ వీరోఽభిజగామ తోరణం, కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తచత్వారింశః సర్గ.*

---

అటులా మహావానరుడగు హనుమంతుడు అక్షుని వేలపై కొట్టి చంపి రాక్షసరాజగు రావణునకు మహాభయము కలిగించెను. 37

అట్లు అక్షకుమారుడు నురణింపగా జ్యోతిశ్చక్రమున తిరుగువారు, మహావ్రతులగు మహర్షులు, భూతములు, యక్షులు, ఉరగులు, దేవేంద్రుడు, దేవతలు మిక్కిలి ఆశ్చర్యముతో హనుమను చూచిరి. 38

వీరుడగు హనుమంతు డట్లు తేజమువే దేవేంద్రుని కుమారునకు సాటియైనవాడును, నెత్తురువలె ఎఱ్ఱని నేత్రములు కలవాడును అగు అక్షకుమారుని చంపి ప్రళయకాల యమునివలె మఱల ఆ బహిర్ద్వారమువద్దకే చేరెను. 39

*ఇట్లు వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదియేడవ సర్గము.*

# 48. అష్టచత్వారింశః సర్గః

*(ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముచే హనుమంతుని బంధించుట)*

తతస్స రక్షోధిపతి ర్మహాత్మా, హనూమతాఽక్షే నిహతే కుమారే,
మనస్సమాధాయ తదేంద్రకల్పం, సమాదిదేశేంద్రజితం సరోషమ్.
త్వ మస్త్రవి చ్ఛస్త్రవిదాం వరిష్ఠ, స్సురాసురాణా మపి శోకదాతా,
సురేషు సేంద్రేషు చ దృష్టకర్మా, పితామహారాధనసంచితాస్త్రః. 2
తవాస్త్రబల మాసాద్య నాసురా న మరుద్గణాః,
న శేకు స్సమరే స్థాతుం సురేశ్వరసమాశ్రితాః. 3
న కశ్చి త్త్రిషు లోకేషు సంయుగే న గతశ్రమః,
భుజవీర్యాభిగుప్తశ్చ తపసా చాభిరక్షితః,

---

హనుమంతుడు అక్షకుమారుని చంపగా, మహాత్ముడగు రావణు డపు డెట్లో తన మనస్సును సమాధానపఱచుకొని కోపముతో మండిపడుచు ఇంద్రసదృశుడగు ఇంద్రజిత్తునకు ఇట్లాజ్ఞాపించెను. 1

నీవు అస్త్రములను ఎఱిగినవాడవు. శస్త్రప్రయోగ మెఱిగినవారిలో శ్రేష్ఠుడవు. దేవతలకు, రాక్షసులకును గూడ దుఃఖము కలిగించువాడవు. నీ పరాక్రమము సురులకు అసురులకును సుపరిచితము. బ్రహ్మ నారాధించి బ్రహ్మాస్త్రము బడసినవాడవు. 2

నీ అస్త్రబలము వెదిరించి యుద్ధమున అసురులు నశింతురు. దేవతలుగాని, దేవేంద్రుడు గాని నీ ముందు నిలువజాలరు. 3

ముల్లోకములలో ఎవ్వడును యుద్ధమున నిన్నెదిరించి, శ్రమనొందనివాడు గాని, తన బలముచే, తపముచే రక్షింపబడినవాడు గాని లేదు. నీవే ఆ యా దేశ, కాలముల

దేశకాలవిభాగజ్ఞ స్త్వమేవ మతిసత్తమః. 4
న తేఽ_స్త్యశక్యం సమరేషు కర్మణా, న తేఽ_స్త్యకార్యం మతిపూర్వమంత్రణే,
న సోఽ_స్తి కశ్చిత్త్రిషు సంగ్రహేషు వై,న వేద యస్తేఽ_స్త్రబలం బలం చ తే.
మమానురూపం తపసో బలం చ తే, పరాక్రమశ్చాస్త్రబలం చ సంయుగే,
న త్వాం సమాసాద్య రణావమర్దే, మనశ్శ్రమం గచ్ఛతి నిశ్చితార్థమ్. 6
నిహతాః కింకరా స్సర్వే జంబుమాలీ చ రాక్షసః. 7
అమాత్యపుత్రా వీరాశ్చ పంచ సేనాగ్రయాయినః,
బలాని సుసమృద్ధాని సాశ్వనాగరథాని చ. 8
సహోదర స్తే దయితః కుమారోఽ_క్షశ్చ సూదితః,
న హి తేష్వేవ మే సారో యస్త్వ య్యరినిషూదన. 9

---

భేదములను చక్కగా ఎరిగినవాడవు. మిక్కిలి మేలైన బుద్ధివైభవము కలవాడవు. 4

యుద్ధములందు నీ పరాక్రమమున కసాధ్యమగు కార్యము లేదు. బుద్ధికౌశలముతో ఆలోచించి నీవు సాధింపలేని పని లేదు. ముల్లోకములలో నీ అస్త్రబలమును, భుజబలమును ఎఱుగని వీరుడు లేడు. 5

నీ తపోబలము, యుద్ధమున నీ పరాక్రమము, అస్త్రబలమును నీవు నా పుత్రుడ వైనందులకు తగియున్నవి. యుద్ధక్షేత్రమున నీవు నిలచియుండగా, జయము నిశ్చితమగుటచే నా మనస్సు ఎంతమాత్రము కలతనొందదు. 6

కింకరరాక్షసు లెల్లరును, జంబుమాలియు చచ్చినారు. 7

వీరులగు అమాత్యపుత్రులు, సేనాను లైదుగురు మరణించినారు. సమర్థులయిన సైనికులు, గుఱ్ఱములు, ఏనుగులు, రథములు నశించినవి. 8

నీ సహోదరుడు, మనకెంతో ప్రీతిపాత్రుడగు అక్షకుమారునికూడ చంపినారు. ఓ శత్రునాశకుడా! నా బలము వారియందు పరిమితము గాదు. ఆ బలము నీయందే గలదు. (నీయందు కల నా బలము వారియందు లేనే లేదని భావము). 9

ఇదం హి దృష్ట్వా మతిమన్మహద్బలం, కపేః ప్రభావం చ పరాక్రమం చ,
త్వమాత్మనశ్చాపి సమీక్ష్య సారం, కురుష్వ వేగం స్వబలానురూపమ్. 10
బలావమర్దస్త్వయి సన్నికృష్టే, యథా గతే శామ్యతి శాంతశత్రౌ,
తథా సమీ క్ష్యాత్మబలం పరం చ, సమారభ స్వాస్త్రవిదాం వరిష్ఠ. 11
న వీర సేనా గణశోచ్యవంతి, న వజ్రమాదాయ విశాలసారమ్,
న మారుతస్యాస్య గతేః ప్రమాణం, న చాగ్నికల్పః కరణేన హంతుమ్. 12
తమేవమర్థం ప్రసమీక్ష్య సమ్యక్, స్వకర్మసామ్యాద్ధి సమాహితాత్మా,
స్మరంశ్చ దివ్యం ధనుషోఽస్త్రవీర్యం, వ్రజాక్షతం కర్మ సమారభస్వ. 13
న ఖల్వియం మతిః శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయా మ్యహమ్,

ఓ బుద్ధిమంతుడా! నీ విపుడు మన గొప్ప సేనాబలమును, వానరుని ప్రభావమును, పరాక్రమమును, నీ బలమును కూడ నమీక్షించి, నీ బలమునకు, తగిన వేగమును పొందుము. 10

అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడా! శత్రువులను నాశనము చేయు స్వభావముగల నీవా వానరునకు చెంతనుండగా, ఎట్లు సైన్యమునకు నాశము కలుగకుండునో ఆ విధముగ నీ బలమును శత్రుబలమును పరిశీలించి కర్తవ్య మనుష్ఠింపుము. 11

వీరుడా! సామూహికముగ యోధులను పరిమార్చు ఆ వానరుని యెదుట సేన ప్రయోజనకారి కాదు. వజ్రమువంటి కఠినమైన ఆయుధముతో నెదిరించుటయు నిష్ఫలము. అది యాతని ముందు దుర్బలమే యగును. హనుమంతుని గమనశక్తి, వాయుదేవునకును లేదు. అత డగ్నివలె తేజోమూర్తి యగుటచే పిడికిలి మున్నగువానిచే చావడు. 12

కావున నీ వీ విషయములను ఏకాగ్రతతో ఆలోచించి, శత్రువు నీకు తీసిపోదని నిశ్చయ మొనర్చుకొని దివ్యమగు నీ అస్త్రముల ప్రభావమును తలంచుచు వెడలుము. అపాయము కలుగనిరీతిగా కర్తవ్య మారంభింపుము. 13

పిన్నవగు నిన్ను పంపుటకు నిశ్చయించుట తండ్రి నగు నాకు తగిన ఆలోచన

ఇయం చ రాజధర్మాణాం క్షత్త్రస్య చ మతి ర్మతా. 14

నానాశస్త్రైశ్చ సంగ్రామే వైశారద్య మరిందమ,
అవశ్యమేవ యోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే. 15

తతః పితుస్త ద్వచనం నిశమ్య, ప్రదక్షిణం దక్షసుతప్రభావః,
చకార భర్తార మదీనసత్త్వో, రణాయ వీరః ప్రతిపన్నబుద్ధిః. 16

తత స్తైః స్వగణై రిష్టై రింద్రజిత్ ప్రతిపూజితః,
యుద్ధోద్ధతః కృతోత్సాహ స్సంగ్రామం ప్రత్యపద్యత. 17

శ్రీమాన్ పద్మపలాశాక్షో రాక్షసాధిపతే స్సుతః,
నిర్జగామ మహాతేజా స్సముద్ర ఇవ పర్వసు. 18

---

కాదు. కాని ఇది రాజధర్మము. క్షత్రియుని ఆలోచనము. క్షత్రధర్మమున యోధుని పంపుటలో బంధుత్వము చూచుట జరుగదు. 14

ఓ శత్రుసూదనుడా! కుశలు డగువాడు యుద్ధమున వివిధాయుధములను తప్పక ఉపయోగింపవలెను. యుద్ధమున విజయము కోరవలెను. (విజయముకొఱకు సర్వాస్త్రములను స్మరించవలెను.) 15

దేవతలతో సమానమగు ప్రభావము గలవాడు, మహాబలశాలి, వీరుడగు ఇంద్రజిత్తు తండ్రి పలికిన యా మాట విని, యుద్ధము చేయుటకు కృతనిశ్చయుడై, తండ్రికి ప్రదక్షిణ మొనర్చెను. 16

ఆ ప్రకారముగ ఇంద్రజిత్తు తనయందు భక్తిగల రాక్షసగణములు తన్ను పొగడుచుండగా, యుద్ధమునకు మిట్టిపడుచు ఉత్సాహముతో యుద్ధభూమిని చేరెను. 17

శ్రీమంతుడు, తామరరేకులవంటి కన్నులుగలవాడు, మహాతేజశ్శాలి, రాక్షసరాజైన రావణుని తనయుడగు ఇంద్రజిత్తు పర్వసమయములందు సముద్ర ముప్పొంగునట్లు విజృంభించి యుద్ధమునకు వెడలెను. 18

ఇంద్రసమానుడగు ఇంద్రజిత్తు, వేగమున పక్షిరాజగు గరుత్మంతునకు సాటియై

స పక్షిరాజోపమతుల్యవేగై, ర్వ్యాళై శ్చతుర్భి స్సితతీక్ష్ణదంష్ట్రైః,
రథం సమాయుక్త మసంగవేగం, సమారురోహేంద్రజి దింద్రకల్పః. 19

స రథీ ధన్వినాం శ్రేష్ఠ శ్శస్త్రజ్ఞోఽస్త్రవిదాం వరః,
రథే నాభియయౌ క్షిప్రం హనుమా న్యత్ర సోఽభవత్. 20

స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ,
నిశమ్య హరివీరోఽసౌ సంప్రహృష్టతరోఽభవత్. 21

సుమహ చ్చాప మాదాయ శితశల్యాంశ్చ సాయకాన్,
హనుమంత మభిప్రేత్య జగామ రణపండితః. 22

తస్మింస్తత స్సంయతి జాతహర్షే రణాయ నిర్గచ్ఛతి బాణపాణౌ,
దిశశ్చ సర్వాః కలుషా బభూవు,ర్మృగాశ్చ రౌద్రా బహుధా వినేదుః

సమాగతాస్తత్ర తు నాగయక్షా, మహర్షయ శ్చక్రచరాశ్చ సిద్ధాః,

---

తెల్లనై, వాడియైన కోరలుగల నాలుగు సింహములు పూన్చగా ఎంతమాత్రము విలంబము లేక మహావేగముతో భూమి నంటకయే పోగల రథము నధిష్ఠించెను. 19

రథికుడు, విలుకాండ్రలో శ్రేష్ఠుడు, శస్త్రాస్త్రవిదులలో కుశలుడగు ఆ ఇంద్రజిత్తు హనుమంతుడున్న చోటికి శీఘ్రమే రథమెక్కి వెడలెను. 20

హనుమంతుడును, యింద్రజిత్తు రథపు ధ్వనిని, వింటినారి సవ్వడివి విని మిక్కిలి ఆనందించెను. 21

యుద్ధకుశలుడగు ఆ ఇంద్రజిత్తు, పెద్ద వింటిని, తీక్ష్ణములగు ములుకులుగల బాణములను దాల్చి, హనుమంతునితో పోరుట కేగెను. 22

అట్లు ఆ ఇంద్రజిత్తు మిక్కిలి సమరోత్సాహము కలవాడై బాణములు చేత దాల్చి వెడలుచుండగా, దిక్కులన్నియు కలుషితములయ్యెను. క్రూరమృగములు పలువిధములుగా అఱచెను. 23

ఆ సమయమున నాగులు, యక్షులు, మహర్షులు, సిద్ధులు తమ సంఘములతో

నభ స్సమావృత్య చ పక్షిసంఘా, వినేదు రుచ్చైః పరమప్రహృష్టాః.

ఆయాంతం సరథం దృష్ట్వా తూర్ణ మింద్రజితం కపిః,
విననాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్. 25

ఇంద్రజిత్తు రథం దివ్య మాస్థిత శ్చిత్రకార్ముకః,
ధను ర్విష్ఫారయామాస తటిదూర్జితనిస్స్వనమ్. 26

తత స్సమేతా వతితీక్ష్ణవేగౌ, మహాబలౌ తౌ రణనిర్విశంకౌ,
కపిశ్చ రక్షోధిపతేశ్చ పుత్రః, సురాసురేంద్రావివ బద్ధవైరౌ. 27

స తస్య వీరస్య మహారథస్య, ధనుష్మతస్సంయతి సమ్మతస్య,
శరప్రవేగం వ్యహనత్ ప్రవృద్ధ, శ్చచార మార్గే పితురప్రమేయే.

తతశ్శరా నాయతతీక్ష్ణశల్యాన్, సుపత్రిణః కాంచనచిత్రపుంఖాన్,

---

అటకు వచ్చి చేరిరి. పక్షిసంఘములును ఆకాశమును కప్పివైచి మిక్కిలి హర్షముతో బిగ్గఱగా అఱచుచుండెను. 24

అట్లు రథము నెక్కి వచ్చుచున్న ఇంద్రజిత్తును చూచి వేగవంతుడగు హనుమంతుడు శీఘ్రమే సింహనాదము చేసి తన శరీరమును పెంచెను. 25

ఇంద్రజిత్తు దివ్యమగు రథమెక్కి, చిత్రమగు వింటిని చేత ధరించినవాడై, పిడుగువలె పెద్దధ్వని వచ్చునట్లు ధనుష్టంకారము చేసెను. 26

మిక్కిలి దుస్సహమగు వేగము కలవారును, మహాబలశాలులును, యుద్ధమున భయమెఱుగనివారును అగు మేఘనాద హనుమంతు లిఱువురును పరస్పరము వైరము పూనిన దేవరాజగు ఇంద్రుడు-బలివలె నుండిరి. 27

హమమంతుడును తన శరీరమును పెంచి వీరుడు, మహారథుడు, విల్లు దాల్చినవాడు, యుద్ధకుశలుడగు ఆ ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణముల వేగము నడ్డుకొనుచు సంచరించెను. 28

అపు డా శత్రువీరులను సంహరించునట్టి ఇంద్రజిత్తు, పొడవైన వాడి మొనలు

ముమోచ వీరః పరవీరహంతా, సుసన్నతాన్ వజ్రనిపాతవేగాన్.

తతస్తు తత్స్యందననిస్స్వనం చ మృదంగభేరీపటహస్వనం చ,
వికృష్యమాణస్య చ కార్ముకస్య నిశమ్య ఘోషం పున రుత్పపాత. 30

శరాణా మంతరే ష్వాశు వ్యవర్తత మహాకపిః,
హరి స్తస్యాభిలక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్. 31

శరాణా మగ్రత స్తస్య పున స్సమభివర్తత,
ప్రసార్య హస్తౌ హనుమా నుత్పపా తానిలాత్మజః. 32

తా వుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ,
సర్వభూతమనోగ్రాహి చక్రతు ర్యుద్ధ ముత్తమమ్. 33

హనూమతో వేద న రాక్షసోఽంతరం, న మారుతిస్తస్య మహాత్మనోఽంతరమ్,

---

గలవి, చక్కని ఈకలు కట్టినవి, బంగారముతో నిర్మింపబడిన వెనుకభాగము కలవి, కొంచెము వంగియున్నవగు బాణముల నా హనుమంతునిపై విడచెను. 29

అపుడా హనుమంతుడు రథధ్వనిని, మృదంగ, భేరీ, పటహావాద్యనాదమును, ధనుష్టంకార శబ్దమును విని మఱల పైకెగిరెను. 30

గురిచూచి బాణము కొట్టగల యింద్రజిత్తునకు లక్ష్యముపై నున్న దృష్టిని నిష్ఫల మొనర్చుచు, హనుమంతు డా యింద్రజిత్తు ప్రయోగించిన బాణముల నడుమ సంచరించెను. 31

వాయుపుత్రుడగు హనుమంతు డా యింద్రజిత్తు ప్రయోగించు బాణముల కెదురు నిలచుచు, అవి తన్ను చేరులోపలనే తన చేతులు చాచి పై కెగయుచుండెను. 32

అట్లు మహావేగము కలవారు, యుద్ధకుశలురగు వారిరువురును, సకలప్రాణుల మనస్సులను రంజింపజాలిన గొప్పయుద్ధ మొనర్చిరి. 33

రాక్షసునకు హనుమంతుని గొట్టు అవకాశము గాని, వానరునకు ఇంద్రజిత్తును కొట్టుటకు తగు వీలుకావి కలుగదయ్యెను. దేవతలకు పాటియగు పరాక్రమముగల

పరస్పరం నిర్విషహౌ బభూవతు, స్సమేత్య తౌ దేవసమానవిక్రమౌ. 34
తతస్తు లక్ష్యే స విహన్యమానే, శరే ష్వమోఘేషు చ సంపతత్సు,
జగామ చింతాం మహతీం మహాత్మా, సమాధిసంయోగసమాహితాత్మా. 35
తతో మతిం రాక్షసరాజసూను, శ్చకార తస్మిన్ హరివీరముఖ్యే,
అవధ్యతాం తస్య కపే స్సమీక్ష్య, కథం నిగచ్ఛేదితి నిగ్రహార్థమ్.
తతః పైతామహం వీర స్సో௨స్త్ర మస్త్రవిదాం వరః,
సందధే సుమహాతేజా స్తం హరిప్రవరం ప్రతి. 37
అవధ్యో௨య మితి జ్ఞాత్వా త మస్త్రే ణాస్త్రతత్త్వవిత్,
నిజగ్రాహ మహాబాహు ర్మారుతాత్మజ మింద్రజిత్. 38
తేన బద్ధ స్తతో௨స్త్రేణ రాక్షసేన స వానరః,
అభవ న్నిర్విచేష్టశ్చ పపాత చ మహీతలే. 39

---

వారిద్దరును ఒండొరులను జయించుటకు అసాధ్యులై యుండిరి. 34

అట్లు పలుమారు గురితప్పుచు, అమోఘములగు బాణములు నిష్ఫలములగుచుండగా చూచి మహాత్ముడగు యింద్రజిత్తు, వింటి నెక్కుపెట్టుటలో మతింతగా దృష్టి నిల్పి, మిక్కిలి చింతాక్రాంతుడయ్యెను. 35

"ఈ హనుమంతు డిట్లు శరయుద్ధముచే చంపుటకు సాధ్యముకా"దని ఇంద్రజిత్తు నిశ్చయించి, యీతని నెట్లు పట్టుకొనుటయా యని ఆలోచించెను. 36

అపుడు మహాతేజస్వి, వీరుడు, అస్త్రవేత్తలలో శ్రేష్ఠుడగు ఇంద్రజిత్తు, ఆ కపిశ్రేష్ఠుడగు హనుమంతునిపై బ్రహ్మాస్త్రము నంధించెను. 37

మహాభుజుడును, అస్త్రప్రయోగకుశలుడును అగు ఇంద్రజిత్తు హనుమంతుడు చంపుటకసాధ్యుడని తెలిసికొని బ్రహ్మాస్త్రముతో బంధించెను. 38

అట్లా హనుమంతుడా రాక్షసుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచే బంధింపబడినవాడై, చేష్టలుడిగి నేలపై బడెను. 39

తతోఽథ బుద్ధ్వా స తదాస్త్రబంధం, ప్రభోః ప్రభావా ద్విగతాత్మవేగః
పితామహానుగ్రహ మాత్మనశ్చ, విచింతయామాస హరిప్రవీరః.
తత స్స్వాయంభువై ర్మంత్రై ర్బ్రహ్మాస్త్ర మభిమంత్రితమ్,
హనుమాం శ్చింతయామాస వరదానం పితామహాత్. 41
న మేఽస్త్రబంధస్య చ శక్తి రస్తి, విమోక్షణే లోకగురోః ప్రభావాత్,
ఇత్యేవ మత్వా విహితోఽస్త్రబంధో, మయాఽఽత్మయోనే రనువర్తితవ్యః.
స వీర్య మస్త్రస్య కపి ర్విచార్య పితామహానుగ్రహ మాత్మనశ్చ,
విమోక్షశక్తిం పరిచింతయిత్వా పితామహాజ్ఞా మనువర్తతే స్మ. 43
అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే,
పితామహమహేంద్రాభ్యాం రక్షిత స్యానిలేన చ. 44

---

పిమ్మట హనుమంతుడు తాను బ్రహ్మాస్త్రముచే బంధింపబడిన ట్లెఱిగియు, బ్రహ్మదేవుని వరముచే ఇసుమంతయు బాధలేనివాడై, తనకు పూర్వము బ్రహ్మదేవుడు 'బ్రహ్మాస్త్ర బంధము నుండి నీవు ముహూర్తములోనే ముక్తుడవు కాగల' వని ఇచ్చిన వరమును తలంచుకొనెను. 40

పిమ్మట బ్రహ్మకు సంబంధించిన మంత్రములతో నభిమంత్రితమైన ఆ బ్రహ్మాస్త్రమును చూచి హనుమంతుడు బ్రహ్మ తన కిచ్చిన వరమువిట్లు తలంచెను. 41

బ్రహ్మప్రభావమువే ఈ బ్రహ్మాస్త్రమునుండి విడిపించుకొనుటకు సామర్థ్యము నాకు లేదు. లోకగురువకు బ్రహ్మ ప్రభావ మిది. ఇది గమనించి వే నీ బ్రహ్మదేవుని యస్త్రమునకు బద్ధుడనై ఉండవలయును. 42

అని యట్లు హనుమంతుడు బ్రహ్మాస్త్రబలమును, తనకు బ్రహ్మ యనుగ్రహించి యొసగిన వరమును, అస్త్రమును విడిపించుకొను శక్తిని ఆలోచించి బ్రహ్మయాజ్ఞ ననుసరించి యూరకుండెను. 43

(సూర్యుని మ్రింగి విడచివ పిమ్మట) బ్రహ్మ, మహేంద్రుడు, నా తండ్రి వాయు దేవుడును నన్ను రక్షింపగా, ఇపుడు బ్రహ్మాస్త్రము నన్ను బంధించినను భయపడను. 44

గ్రహణే చాపి రక్షోభి ర్మహా న్మే గుణదర్శనః,
రాక్షసేంద్రేణ సంవాద స్తస్మా ద్గృహ్ణంతు మాం పరే. 45
స నిశ్చితార్థః పరవీరహంతా, సమీక్ష్యకారీ వినివృత్తచేష్టః,
పరైః ప్రస హ్యాభిగతై ర్నిగృహ్య, ననాద తై స్తైః పరిభర్త్స్యమానః.
తత స్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్ట మరిందమమ్,
బబంధు శ్శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః. 47
స రోచయామాస పరైశ్చ బంధనం, ప్రసహ్య వీరైరభినిగ్రహం చ,
కౌతూహలాన్మాం యది రాక్షసేంద్రో, ద్రష్టుం వ్యవస్యేదితి నిశ్చితార్థః. 48
స బద్ధ స్తేన వల్కేన విముక్తోఽ స్త్రేణ వీర్యవాన్,
అస్త్రబంధ స్స చాన్యం హి న బంధ మనువర్తతే. 49

---

నన్నీ రాక్షసులు పట్టుకొని బంధించినప్పటికిని నా కిందు పర్యవసానమున గుణమే అగపడుచున్నది. ఏలనన ఈ విధముగనైన నేను రాక్షసేశ్వరుడు రావణునితో మాటలాడగలుగుదును. కావున శత్రువులు నన్ను బంధింతురుగాక. 45

అని యిట్లు కర్తవ్యమును నిశ్చయించినవాడై, శత్రువీరులను సంహరించువాడు, ముందు వెనుక లాలోచించి కర్తవ్యము నాచరించువాడగు హనుమంతుడు చేష్ట లుడిగి, శత్రువులు తన్ను గట్టిగా పట్టి బంధించి బెదరించుచుండగా పెద్దగా గర్జించెను. 46

శత్రువులను నశింపజేయువాడగు హనుమంతు డట్లు కదలిక లేక యుండగా ఆ రాక్షసులు చూచి జనపనారలతో నారచీరలతో త్రాళ్ళు పేని వానితో బంధించిరి. 47

హనుమంతుడు తన్నట్లు శత్రువులు బలాత్కారముగా పట్టి బంధించుట తెలిసికొనినవాడై రాక్షసరాజు రావణుడు కుతూహలముతో తన్ను తప్పక చూడదలంచునని నిశ్చయించుకొని శత్రువులచే బంధము నిష్టపడినవాడయ్యెను. 48

హనుమంతు నా రాక్షసులు నారత్రాళ్లచే బంధించుటచే బ్రహ్మాస్త్రబంధము తొలగెను. అస్త్రబంధనము వేఱొక బంధనము చేయుచో నిలువదు గదా. 49

అథేంద్రజిత్తు ద్రుమచీరబద్ధం, విచార్య వీరః కపిసత్తమం తమ్,
విముక్త మస్త్రేణ జగామ చింతాం, నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్. 50
అహో మహత్ కర్మ కృతం నిరర్థకం, న రాక్షసై ర్మంత్రగతి ర్విమృష్టా,
పునశ్చ నాస్త్రే విహతేఽస్త్ర మన్యత్, ప్రవర్తతే సంశయితాః స్మ సర్వే. 51
అస్త్రేణ హనుమాన్ ముక్తో నాత్మాన మవబుధ్యత,
కృష్యమాణస్తు రక్షోభి స్తైశ్చ బంధై ర్నిపీడితః. 52
హన్యమాన స్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః,
సమీపం రాక్షసేంద్రస్య ప్రాకృష్యత స వానరః. 53
అథేంద్రజిత్తం ప్రసమీక్ష్య ముక్త, మస్త్రేణ బద్ధం ద్రుమచీరసూత్రైః,
వ్యదర్శయ త్తత్ర మహాబలం తం, హరిప్రవీరం సగణాయ రాజ్ఞే.

---

అనంతరము వీరుడగు ఇంద్రజిత్తు, హనుమంతుని రాక్షసులు నారవస్త్రములచే బంధించుటచే బ్రహ్మాస్త్రబంధనము వీడెనని తెలిసికొని "అయ్యో! ఏ యితరవిధమగు బంధనము చేసినను బ్రహ్మాస్త్రబంధము నిలువదే" యని విచారించెను. 50

"అయ్యో! ఈ మహాకార్య మిట్లు నిష్ఫలమైనది. ఈ రాక్షసులు మంత్రప్రభావమెట్టిదో ఆలోచింపలేదు. ఒకమాఱు బ్రహ్మాస్త్రము నిష్ఫలమగుచో మఱొక్కమాఱు అది గాని, వేఱొక అస్త్రముగాని పనిచేయదు. ఇపు డందరము సంశయమున బడితిమి" అని యింద్రజిత్తు చింతించెను. 51

హనుమంతుడు బ్రహ్మాస్త్రబంధమునుండి విడువబడియు, ఆ విషయమును గమనింపడయ్యెను. తన్నా రాక్షసులు లాగికొనిపోవుచుండగా అట్లే బంధములచే పీడింపబడుచుండెను. 52

కఠినాత్ములగు ఆ రాక్షసులు హనుమంతుని కట్టెలతో కొట్టుచు, పిడికిళ్ళతో పొడుచుచు రాక్షసరాజగు రావణుని సమక్షమునకు కొనిపోయిరి. 53

అంత ఇంద్రజిత్తు పూర్వము బ్రహ్మాస్త్రబద్ధుడై వృక్షసంబంధమైన త్రాళ్ళచే మఱల గట్టుటచే ఆ బంధము నుండి విడువబడిన కపిశ్రేష్ఠుడు, మహాబలశాలి యగు

తం మత్తమివ మాతంగం బద్ధం కపివరోత్తమమ్,
రాక్షసా రాక్షసేంద్రాయ రావణాయ న్యవేదయన్. 55
కోఽయం కస్య కుతో వాఽత్ర కిం కార్యం కో వ్యపాశ్రయః,
ఇతి రాక్షసవీరాణాం తత్ర సంజజ్ఞిరే కథాః. 56
హన్యతాం దహ్యతాం వాఽపి భక్ష్యతా మితి చాపరే,
రాక్షసా స్తత్ర సంక్రుద్ధాః పరస్పర మథాబ్రువన్. 57
అతీత్య మార్గం సహసా మహాత్మా, స తత్ర రక్షోఽధిపపాదమూలే,
దదర్శ రాజ్ఞః పరిచారవృద్ధాన్, గృహం మహారత్నవిభూషితం చ.
స దదర్శ మహాతేజా రావణః కపిసత్తమమ్,
రక్షోభి ర్వికృతాకారైః కృష్యమాణ మిత స్తతః. 59

---

హనుమంతుని, రాక్షస గణపరివేష్టితుడగు రావణునకు చూపెను. 54

మదించిన ఏనుగువలె బంధింపబడియున్న యా వానరశ్రేష్ఠుని రాక్షసులు తమ రాజు రావణునకు చూపిరి. 55

"ఇత డెవ్వడు! ఎవరింట దిగినాడు? ఎక్కడ నుండి వచ్చెను? ఏల వచ్చెను? ఎవ్వరివాడు?" అని యిట్లు హనుమంతుని గూర్చి రాక్షసవీరులు పరస్పరము చెప్పుకొనిరి. 56

ఇతనిని చంపుడు, కాల్చుడు, తినుడని యీ ప్రకారముగ కుపితులైన రాక్షసు లొండొరులతో చెప్పుకొనజొచ్చిరి. 57

మహాత్ముడగు హనుమంతు డట్లు రాజమార్గమును గడచి, మహారత్నములతో నలంకరింపబడిన యింటిని, అందు రావణుని పాదముల చెంత వృద్ధులగు అమాత్యులను దర్శించెను. 58

మహాతేజశ్శాలి యగు రావణుడును వికృతాకారులగు రాక్షసులచే నిటు నటు లాగబడుచున్న హనుమంతుని చూచెను. 59

రాక్షసాధిపతిం చాపి దదర్శ కపిసత్తమః,
తేజోబలసమాయుక్తం తపంత మివ భాస్కరమ్. 60

స రోషసంవర్తితతామ్రదృష్టి, ర్దశానన స్తం కపి మన్వవేక్ష్య,
అథోపవిష్టాన్ కులశీలవృద్ధాన్, పమాదిశ త్తం ప్రతి మంత్రిముఖ్యాన్. 61

యథాక్రమం తై స్స కపి ర్విపృష్టః, కార్యార్థ మర్థస్య చ మూల మాదౌ,
నివేదయామాస హరీశ్వరస్య, దూత స్సకాశా దహ మాగతోఽస్మి. 62

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టచత్వారింశః సర్గః.*

---

కపిశ్రేష్ఠుడగు హనుమంతుడును తేజోబలసమన్వితుడై ప్రజ్వలించు సూర్యునివలె నున్న రావణుని చూచెను. 60

ఆ రావణుడు తోడనే ఎఱ్ఱని నేత్రములను గుండ్రముగా త్రిప్పుచు హనుమంతుని చూచి యచట ఉపవిష్టులైన కులవృద్ధులు, శీలవృద్ధులు అగు మంత్రిముఖ్యుల నతని గూర్చి తెలిసికొన నాదేశించెను. 61

అపు డా మంత్రులును క్రమముగా నత డే కర్తవ్యము నాచరించుటకు వచ్చినాడో, అతని నెవరు పంపిరో అడుగగా హనుమంతుడును "నేను వానరరాజగు సుగ్రీవుని కడనుంచి వచ్చిన దూత" నని తెలియజేసెను. 62

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబదియెనిమిదవ సర్గము.*

# 49. ఏకోనపంచాశః సర్గః

*(హనుమంతుడు రావణవైభవము చూచుట)*

తత స్స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః,
హనుమాన్ రోషతామ్రాక్షో రక్షోధిప మవైక్షత. 1

భ్రాజమానం మహార్హేణ కాంచనేన విరాజతా,
ముక్తాజాలావృతే నాథ మకుటేన మహాద్యుతిమ్. 2

వజ్రసంయోగసంయుక్తై ర్మహార్హమణివిగ్రహైః,
హైమై రాభరణై శ్చిత్రై ర్మనసేవ ప్రకల్పితైః. 3

మహార్హక్షౌమసంవీతం రక్తచందనరూషితమ్,

---

భయంకరపరాక్రమశాలి యగు హనుమంతుడు "రావణుడు నాతో యుద్ధము చేయుటకు రావలెనని ప్రయత్నించితిని. కాని ఇతడు నీతిశాస్త్రకోవిదు డగుటచే తా నాసనము వీడకయే ఇంద్రజిత్తు నంపి నన్ను బంధించి రప్పించినా" దని యట్టి రావణుని రాజనీతిని తలంచి ఆశ్చర్యము నొంది, రోషముచే ఎఱ్ఱబారిన కన్నులతో రాక్షసరాజగు రావణు నీక్షించెను. 1

సహజముగనే తేజశ్శాలి యగు ఆ రావణుడు బంగారముతో చేసి, ముత్యములు పొదిగిన అమూల్యకిరీటము దాల్చి కాంతితో ప్రకాశించుచుండెను. 2

ఆ రావణుడు వజ్రముచే రంధ్రము చేసి, మాలగా కూర్చబడిన అమూల్య మణిరూపములై, మనస్సంకల్పమాత్రముచేతనే సృజింపబడినవివలె ఆశ్చర్యము గొలుపు బంగారు ఆభరణములు దాల్చి ప్రకాశించుచుండెను. 3

అతడు గొప్ప వెలగల పట్టువస్త్రము ధరించెను. ఒడలికి రక్తచందనము పూసికొనెను.

స్వనులిప్తం విచిత్రాభి ర్వివిధాభిశ్చ భక్తిభిః. 4
వివృతై ర్దర్శనీయైశ్చ రక్తాక్షై ర్భీమదర్శనైః.
దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః ప్రలంబదశనచ్ఛదైః. 5
శిరోభి ర్దశభి ర్వీరం భ్రాజమానం మహౌజసమ్,
నానావ్యాళసమాకీర్ణై శ్శిఖరై రివ మందరమ్. 6
నీలాంజనచయప్రఖ్యం హారే ణోరసి రాజతా,
పూర్ణచంద్రాభవక్త్రేణ సబలాక మివాంబుదమ్. 7
బాహుభి ర్బద్ధకేయూరై శ్చందనోత్తమరూషితైః,
భ్రాజమానాంగదైః పీనైః పంచశీర్షై రివోరగైః. 8
మహతి స్ఫాటికే చిత్రే రత్నసంయోగసంస్కృతే,

---

విచిత్రములైన కస్తూరి మున్నగువాని రచనలు ఒడలికి పూసికొని యుండెను. 4

చక్కగా తెరచిననోళ్ళు కలవి, దర్శనీయములు, ఎఱ్ఱని కన్నులతో కూడినవి, చూచువారికి భయము కలిగించునవి, ప్రకాశించు వాడియైన పెనుకోఱలు కలవి, వ్రేలాడు పెదవులు కలవి యగు పదితలలతో ప్రకాశించువాడును, వీరుడును, మహాతేజశ్శాలియు అగు ఆ రావణుడు అనేక దుష్టమృగములతో వ్యాప్తమైన శిఖరములతో మందర పర్వతమువలె నుండెను. 5,6

కాటుక రాశివలె నల్లనై, వక్షఃస్థలమున పూర్ణచంద్రుని వలె విలసిల్లు హారముతో రాజిల్లు రావణుడు, కొంగలతో కూడిన మేఘమువలె నుండెను. 7

ఆ రావణుడు బలిష్ఠములగు బాహువులకు భుజకీర్తులు ధరించెను. శ్రేష్ఠమగు చందనము పూసికొనెను. ఆ బాహువులు భుజకీర్తులతో ప్రకాశించుచు (కొనలందు వ్రేళ్ళు కలవై) ఐదు తలల పాములవలె నుండెను. 8

అతడు మిక్కిలి పెద్దది, స్ఫటికములు పొదిగినది, చిత్రవర్ణము కలది, అట నట రత్నములు కూర్చి సుందరముగ చేయబడినది, శ్రేష్ఠమగు అస్తరణము వేయబడినది

ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే. 9

అలంకృతాభి రత్యర్థం ప్రమదాభి స్సమంతతః,
వాలవ్యజనహస్తాభి రారాత్ సముపసేవితమ్. 10

దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా,
మంత్రిభి ర్మంత్రతత్త్వజ్ఞై ర్నికుంభేన చ మంత్రిణా. 11

సుఖోపవిష్టం రక్షోభి శ్చతుర్భి ర్బలదర్పితైః,
కృత్స్నం పరివృతం లోకం చతుర్భిరివ సాగరైః. 12

మంత్రిభి ర్మంత్రతత్త్వజ్ఞై రన్యైశ్చ శుభబుద్ధిభిః,
అన్వాస్యమానం రక్షోభి స్సురైరివ సురేశ్వరమ్. 13

అపశ్య ద్రాక్షసపతిం హనుమా నతితేజసమ్,
విష్ఠితం మేరుశిఖరే సతోయమివ తోయదమ్. 14

---

అగు ఉత్తమసింహాసనము నధిష్ఠించి యుండెను. 9

చక్కగా నలంకరించుకొనిన సుందరాంగన లాయన చుట్టును చామరములు చేత ధరించి విసరుచు సేవించుచుండిరి. 10

ఆ రావణుడు దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభు డను మంత్రాలోచన మెఱిగిన నలుగురు రాక్షసులతో పరివేష్టితుడై, నాలుగు సముద్రములతో పరివేష్టితమగు భూమివలె నుండెను. 11,12

ఆయన మంత్రస్వరూప మెఱిగిన మంత్రవేత్తలును, శ్రేష్ఠమగు బుద్ధికలవారును అగు రాక్షసులచే దేవతలచే దేవేంద్రునివలె సేవింపబడుచుండెను. 13

హనుమంతు డట్లు నల్లని రూపము కలిగి బంగారు సింహాసనముపై కూర్చుండి యుండుటచే మేరుశిఖరము నధిరోహించిన జలపూర్ణమగు (నల్లని) మేఘమువలె, మహాతేజశ్శాలియై విలసిల్లు రాక్షసరాజు రావణుని చూచెను. 14

స తైః సంపీడ్యమానోఽపి రక్షోభి ర్భీమవిక్రమైః,
విస్మయం పరమం గత్వా రక్షోధిప మవైక్షత. 15

భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్ రాక్షసేశ్వరమ్,
మనసా చింతయామాస తేజసా తస్య మోహితః. 16

అహో రూప మహో ధైర్య మహో సత్త్వ మహో ద్యుతిః,
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా. 17

యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః,
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా. 18

అస్య క్రూరై ర్నృశంసైశ్చ కర్మభి ర్లోకకుత్సితైః,
సర్వే బిభ్యతి ఖల్వస్మా ల్లోకా స్సామరదానవాః. 19

అయం హ్యుత్సహతే క్రుద్ధః కర్తు మేకార్ణవం జగత్,

---

భయంకరమగు సరాక్రమముగల రాక్షసులు తన్ను పీడించుచున్నను దానిని లెక్క సేయక హనుమంతు డాశ్చర్యముతో ఆ రాక్షసరాజునే చూడసాగెను. 15

హనుమంతుడట్లు తేజముతో వెలుగొందు రాక్షసరాజగు రావణుని చూచి ఆయన తేజముచే మోహితుడై మనస్సులో నిట్లు తలంచెను. 16

'అహో ఏమి రూపము! ఏమి ధైర్యము! ఏమి బలము! ఏమి కాంతి! అహో! ఈ రాక్షసరాజు సకలప్రశస్తలక్షణములతో అలరారుచున్నాడే! 17

ఈ రావణుడు బలవత్తరమగు నిట్టి సీతాపహారరూపమగు అధర్మము నాచరించి యుండనిచో, నీతడు దేవేంద్రసహితముగ దేవలోకమునకే యేలిక కాదగినవాడు. 18

ఇత డాచరించిన భీకరములు, పరద్రోహాచరణశీలములగు కార్యములచే అమరులు, దానవులు మున్నగు సకలలోకములవారును భయపడుచున్నారు. 19

ఇతడు కోపించినచో జగమెల్ల ఏకసముద్రముగా జేయగలుగును' అని హనుమంతు

ఇతి చింతాం బహువిధా మకరో న్మతిమాన్ హరిః,
దృష్ట్వా రాక్షసరాజస్య ప్రభావ మమితౌజసః. 20

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకోనపంచాశః సర్గః.*

---

డిట్లు రాక్షసరాజగు రావణుని ప్రభావము జూచి పరిపరి విధముల ఆలోచన చేసెను. 20

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నలుబది తొమ్మిదవ సర్గము.*

# 50. పంచాశః సర్గః

*(రావణుడు హనుమంతుని ప్రశ్నించుట)*

తముద్వీక్ష్య మహాబాహుః పింగాక్షం పురతః స్థితమ్,
కోపేన మహతాఽఽవిష్టో రావణో లోకరావణః. 1
శంకాహృతాత్మా దధ్యౌ స కపీంద్రం తేజసా వృతమ్,
కిమేష భగవాన్నందీ భవేత్ సాక్షా దిహాగతః. 2
యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా,
సోఽయం వానరమూర్తిః స్యాత్ కింస్విద్బాణోఽపి వాఽసురః.
స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమమ్,
కాలయుక్త మువా చేదం వచో విపుల మర్థవత్. 4
దురాత్మా పృచ్ఛ్యతా మేష కుతః కిం వాఽస్య కారణమ్,

---

మహాభుజుడు, లోకములను పీడించువాడగు ఆ రావణుడు, గోరోచనవర్ణపు కండ్లు కలవాడై, తేజశ్శాలి అగు, వావరశ్రేష్ఠుడు హనుమంతుని చూచి, మదిలో సందేహము కలుగగా యిట్లు చింతింప దొడగెను. 'ఏమిది! ఈతడు సాక్షాత్తుగా నిటకు వచ్చిన భగవంతుడగు నందీశ్వరుడు కాదు కదా! 1,2

పూర్వము నేను కైలాసమును కదల్చినపుడు నాకు శాపమిచ్చిన నందీశ్వరుడుగాని, లేక బలిసుతుడగు బాణుడను రాక్షసుడు గాని ఈ వానరరూపముతో వచ్చెనా? 3

అని యిట్లాలోచించి రావణుడు కోపముతో కన్ను లెఱ్ఱబడగా మంత్రిశ్రేష్ఠుడగు ప్రహస్తునితో మిక్కిలి అర్థవంతమగు వాక్యమును సమయోచితముగ నిట్లనెను. 4

'ప్రమాస్తుడా! ఇతడే దేశమునుండి వచ్చెనో, అట్లు వచ్చుట కేది హేతువో , నా

వనభంగే చ కో౽స్యార్థో రాక్షసీనాం చ తర్జనే. 5
మత్పురీ మప్రధృష్యాం వా౽౽ గమనే కిం ప్రయోజనమ్,
ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్యతా మేష దుర్మతిః. 6
రావణస్య వచః శ్రుత్వా ప్రహస్తో వాక్య మబ్రవీత్,
సమాశ్వసిహి భద్రం తే న భీః కార్యా త్వయా కపే. 7
యది తావ త్త్వ మింద్రేణ ప్రేషితో రావణాలయమ్,
తత్త్వ మాఖ్యాహి మా భూత్తే భయం వానర మోక్ష్యసే. 8
యది వైశ్రవణస్య త్వం యమస్య వరుణస్య చ,
చారరూప మిదం కృత్వా ప్రవిష్టో నః పురీ మిమామ్,
విష్ణునా ప్రేషితో వా౽పి దూతో విజయకాంక్షిణా. 9
న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్,
తత్త్వతః కథయస్వాద్య తతో వానర మోక్ష్యసే. 10

---

తోట పాడుచేయుటవలన నీతని కేమి ప్రయోజనమో, రాక్షసాంగనలను భయపెట్టిన కారణమేమో యీ దురాత్మ నడుగుము. 5

ఎదిరింపరాని నా యీ నగరమునకు వచ్చుట కేది హేతువో, యుద్ధము చేయుట కేమి కారణమో యీ దుర్మతి యగు వానరు నడుగుము. 6

రావణుని వచన మాలించి ప్రహస్తు డిట్లనెను. 'ఓ వానరుడా! తెప్పరిల్లుము. నీకు శుభమగుగాక. భయపడకుము. 7

ఓ వానరుడా! ని న్నింద్రుడే ఈ లంకకు పంపినచో నిజము తెలుపుము. నీకు భయము వలదు. అట్లు తెలుపుదువేని నిన్ను విడచి పెట్టెదము. 8

నీవు కుబేరునకో, యమునకో, వరుణునకో చారుడవై మా యీ పట్టణము ప్రవేశించితివా? లేదా విజయము కోరుచున్న విష్ణువుచే పంపబడిన దూతవా? 9

నీది వానరరూపమయ్యు నీ తేజము వానరుల కుండునది గాదు. నీ విపుడు నిజము చెప్పుము. వెంటనే నిన్ను విడిపింతుము. 10

అనృతం వదత శ్చాపి దుర్లభం తవ జీవితమ్,
అథవా యన్నిమిత్తం తే ప్రవేశో రావణాలయే. 11

ఏవముక్తో హరిశ్రేష్ఠ స్తదా రక్షోగణేశ్వరమ్,
అబ్రవీ న్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య వా. 12

ధనదేన న మే సఖ్యం విష్ణునా నాస్మి చోదితః,
జాతి రేవ మమ త్వేషా వానరో౽హ మిహాగతః. 13

దర్శనే రాక్షసేంద్రస్య దుర్లభే తదిదం మయా,
వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్. 14

తత స్తే రాక్షసాః ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణః,
రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే. 15

అస్త్రపాశై ర్న శక్యో౽హం బద్ధుం దేవాసురైరపి,
పితామహా దేష వరో మమా ప్యేషో౽భ్యుపాగతః. 16

---

అట్లుగాక అనృతము పలుకుచో నీవు బ్రతుకుట దుర్లభము. లేదా నీ వెందులకు రావణుని యీ లంకలో ప్రవేశించితివో దానిని తెలియజెప్పుము. 11

అని ప్రహస్తుడు పలుకగా అపు డా కపిశ్రేష్ఠుడు రావణున కిట్లనెను. 'నేను దేవేంద్రుడు గాని, యముడు గాని, వరుణుడు గాని వంపగా వచ్చిన దూతను గాను.

నాకు కుబేరునితో చెలిమియు లేదు. విష్ణువు నన్నిటకు పంపలేదు. నేను జాతిచేగూడ వానరుడనే కాని వానరరూపము దాల్చివచ్చిన వేఱొకడను గాను. 13

రాక్షసరాజగు రావణుని దర్శనము దుర్లభ మగుటచే, అయనను చూచుకొరకే ఈ వనము పాడుచేసితిని. 14

అపుడు బలవంతులు, యుద్ధము కోరువారగు రాక్షసులు నాపైకి వచ్చిరి. ఆత్మరక్షణకై నేను వారితో తలపడి పోరితిని. 15

దేవాసురులకు గూడా వే నస్త్రములవే బంధింప శక్యమైనవాడను కాను. నా కీ వరము బ్రహ్మదేవునివల్లనే లభించినది. 16

రాజానం ద్రష్టుకామేన మయాస్త్ర మనువర్తితమ్,
విముక్తో హ్యహ మస్త్రేణ రాక్షసై స్త్వభిపీడితః. 17
కేనచి ద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాంతికమ్,
దూతోఽహ మితి విజ్ఞేయో రాఘవ స్యామితౌజసః,
శ్రూయతాం చాపి వచనం మమ పథ్య మిదం ప్రభో. 18

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచాశః సర్గః.*

---

రాక్షసరాజును చూడవలెననియే నేను బ్రహ్మాస్త్రబంధము నట్లే నిలుపుకొంటిని. రాక్షసులు త్రాళ్ళతో కట్టి పీడించుటచే ఆ బ్రహ్మాస్త్రబంధము తొలగినది. 17

నే నొక రాజకార్యమువే నీకడకు వచ్చితిని. నే నమితపరాక్రమశాలి యగు రాముని దూతను. ఓ రాజా! నీ హితము గోరి నేను చెప్పు మాట వినుము. 18

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదియవ సర్గము.*

# 51. ఏకపంచాశః సర్గః

*(హనుమంతుడు రావణునకు రామసుగ్రీవుల పరాక్రమము చెప్పుట)*

తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః,
వాక్య మర్థవ దవ్యగ్ర స్తమువాచ దశాననమ్. 1
అహం సుగ్రీవసందేశా దిహ ప్రాప్త స్తవాలయమ్,
రాక్షసేంద్ర హరీశ స్త్వాం భ్రాతా కుశల మబ్రవీత్. 2
భ్రాతుః శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః,
ధర్మార్థోపహితం వాక్య మిహ చాముత్ర చ క్షమమ్. 3
రాజా దశరథో నామ రథకుంజరవాజిమాన్,
పితేవ బంధు ర్లోకస్య సురేశ్వరసమద్యుతిః. 4

---

బలవంతుడు, వానరశ్రేష్ఠుడగు ఆ హనుమంతుడు మహాబలశాలియగు రావణుని చూచి ఎంతమాత్రము తొణకక, అర్థవంతముగ నిట్లు మాటలాడెను. 1

నేను (రామదూత నైనను) సుగ్రీవుని సందేశము తీసుకొని నీ యీ లంకకు వచ్చితిని. ఓ రాక్షసరాజా! వానరరాజగు సుగ్రీవుడు నీకు సోదరునివలె హితకరుడు. ఆయన నిన్ను కుశల మడిగినాడు. 2

మహాత్ముడగు సుగ్రీవుడు సోదరునివలె హితబుద్ధితో నీ కంపిన సందేశము వినుము. ఇది యీ లోకమునను పరలోకమునను గూడ నీ కభ్యుదయమును సాధించును. 3

దశరథుడను ప్రసిద్ధుడగు రాజు రాజ్యము చేసెడివాడు. ఆయన రథములు, ఏనుగులు, గుఱ్ఱములు సమృద్ధిగా కలవాడు. ఆయన ప్రజలను కన్నతండ్రి వలె పాలించువాడు. దేవేంద్రునితో సమానమగు కాంతి గలవాడు. 4

జ్యేష్ఠ స్తస్య మహాబాహుః పుత్రః ప్రియకరః ప్రభుః,
పితు ర్నిదేశా న్నిష్క్రాంతః ప్రవిష్టో దండకావనమ్. 5

లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చాపి భార్యయా,
రామో నామ మహాతేజా ధర్మ్యం పంథాన మాశ్రితః. 6

తస్య భార్యా వనే నష్టా సీతా పతి మనువ్రతా,
వైదేహస్య సుతా రాజ్ఞో జనకస్య మహాత్మనః. 7

స మార్గమాణ స్తాం దేవీం రాజపుత్ర స్సహానుజః,
ఋశ్యమూక మనుప్రాప్త స్సుగ్రీవేణ సమాగతః. 8

తస్య తేన ప్రతిజ్ఞాతం సీతాయాః పరిమార్గణమ్,
సుగ్రీవస్యాపి రామేణ హరిరాజ్యం నివేదితమ్. 9

తత స్తేన మృధే హత్వా రాజపుత్రేణ వాలినమ్,
సుగ్రీవః స్థాపితో రాజ్యే హర్యృక్షాణాం గణేశ్వరః. 10

---

ఆయన పెద్దకుమారుడు రాముడు మహాభుజుడు, మహాతేజస్వి, రాజునకు ప్రీతి కలిగించువాడు, తండ్రియాజ్ఞ తలదాల్చి, తమ్ముడు లక్ష్మణునితో, భార్య సీతతో ధర్మమార్గము నాశ్రయించి నగరము వీడి దండకారణ్యము ప్రవేశించినాడు. 5,6

ఆయన భార్య సీతాదేవి పతి ననువర్తించునట్టిది. విదేహరాజు, మహాత్ముడగు జనకుని కూతురు. ఆమె అడవిలో నుండగా అపహరింపబడినది. 7

రాజపుత్రుడగు ఆ రాముడు తమ్మునితో కూడి యా దేవిని వెదకుచు ఋశ్యమూకమునకు వచ్చి సుగ్రీవుని కలిసికొనెను. 8

సీతను వెదకించెదనని సుగ్రీవుడు రామునకు ప్రతిజ్ఞ చేసెను. నిన్ను వానరరాజ్యాభిషిక్తుని చేసెదనని రాముడు సుగ్రీవునకు మాట నిచ్చెను. 9

పిమ్మట రాజపుత్రుడగు రాముడు యుద్ధమున వాలిని చంపి, సమస్తమైన కోతులు, ఎలుగులకు సుగ్రీవుని రాజును చేసెను. 10

త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానరపుంగవః,
రామేణ నిహత స్సంఖ్యే శరే ణైకేన వానరః. 11

స సీతామార్గణే వ్యగ్ర స్సుగ్రీవ స్సత్యసంగరః,
హరీన్ సంప్రేషయామాస దిశ స్సర్వా హరీశ్వరః. 12

తాం హరీణాం సహస్రాణి శతాని నియుతాని చ,
దిక్షు సర్వాసు మార్గంతే హ్యథ శ్చోపరి చాంబరే. 13

వైనతేయసమాః కేచిత్ కేచిత్తత్రానిలోపమాః,
అసంగగతయ శ్శీఘ్రా హరివీరా మహాబలాః. 14

అహం తు హనుమా న్నామ మారుత స్యౌరస స్సుతః,
సీతాయా స్తు కృతే తూర్ణం శతయోజన మాయతమ్. 15

సముద్రం లంఘయిత్వైవ తాం దిదృక్షు రిహాగతః,
భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా. 16

---

వానరశ్రేష్ఠుడగు వాలి నీకు పూర్వమే పరిచితుడు. ఆ వానరు నొక బాణముచే రాముడు చంపినాడు. 11

సత్యప్రతిజ్ఞ కలవాడు, వానరాజగు సుగ్రీవుడు సీతాన్వేషణతత్పరుడై అన్ని దిక్కులకు కోతులను పంపెను. 12

సీతకై వందలు, వేలు, లక్షలకొలది వానరులు దశదిశలందును వెదకుచున్నారు. 13

ఆ వానరులు వేగముచే కొందరు గరుత్మంతునకు, కొందరు వాయువునకు సాటియైనవారు. మహాబలులగు ఆ వానరవీరులు ఎవరికి వారే శీఘ్రముగా పోగలవారు. 14

అందు నేను హనుమంతు డనువాడను, వాయుపుత్రుడను. నేను సీతాదేవిని వెదకుటకై నూరు యోజనముల పొడవైన సముద్రమును శీఘ్రమే దాటి వచ్చితిని. ఈ లంకలో తిరుగుచు నీ నివాసమున సీతాదేవిని చూచితిని. 15,16

తద్భవాన్ దృష్టధర్మార్థ స్తపఃకృతపరిగ్రహః,
పరదారాన్ మహాప్రాజ్ఞ నోపరోద్ధుం త్వమర్హసి. 17
న హి ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు,
మూలఘాతిషు సజ్జంతే బుద్ధిమంతో భవద్విధాః. 18
కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినామ్,
శరాణా మగ్రతః స్థాతుం శక్తో దేవాసురేష్వపి. 19
న చాపి త్రిషు లోకేషు రాజన్ విద్యేత కశ్చన,
రాఘవస్య వ్యలీకం యః కృత్వా సుఖ మవాప్నుయాత్. 20
తత్త్రికాలహితం వాక్యం ధర్మ్య మర్థానుబంధి చ,
మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్. 21

---

కావున ఓ మహాప్రాజ్ఞుడా! శాస్త్రోక్తమగు ధర్మస్వరూప మెఱిగినవాడవు. మహా తపస్సంపన్నుడవు. పరభార్యను నీవిట్లు నిరోధించుట తగదు. 17

నీవంటి బుద్ధిమంతులు ధర్మవిరుద్ధములు, అనేక అపాయములు కలవి, ఆత్మ వినాశకరము లగు పనులలో తలదూర్చరు. 18

రాముడు కోపించుటచే లక్ష్మణుడు విడచిన బాణముల కెదురు నిలచుటకు దేవతలలోగాని, అసురులలోగాని యెవ్వడు సమర్థుడగును? 19

ఓ రాజా! రాముని కప్రియ మొనర్చి సుఖము పొందగలవాడు ముల్లోకములలో నొక్కడును ఉండబోడు. 20

కావున (సీతానిరోధ మధర్మము కనుక, రామాపచారము పరిహరింపదగినది కనుకను) ధర్మసమ్మతమైనది, అర్థవంతమైన దగు నా వాక్యము భూతభవిష్యద్వర్త మానకాలములు మూడింటియందును మేలు కూర్చునదిగా తలంచి సీతాదేవిని రామున కర్పింపుము. 21

దృష్టా హీయం మయా దేవీ లబ్ధం యదిహ దుర్లభమ్,
ఉత్తరం కర్మ యచ్ఛేషం నిమిత్తం తత్ర రాఘవః. 22

లక్షితేయం మయా సీతా తథా శోకపరాయణా,
గృహ్య యాం నాభిజానాసి పంచాస్యామివ పన్నగీమ్. 23

నేయం జరయితుం శక్యా సాసురై రమరైరపి,
విషసంసృష్ట మత్యర్థం భుక్త మన్న మివౌజసా. 24

తపస్సంతాపలబ్ధస్తే యోఽయం ధర్మపరిగ్రహః,
న స నాశయితుం న్యాయ్య ఆత్మప్రాణపరిగ్రహః. 25

అవధ్యతాం తపోభి ర్యాం భవాన్ సమనుపశ్యతి,
ఆత్మన స్సాసురై ర్దేవైర్హేతు స్తత్రాప్యయం మహాన్. 26

---

అనితరసులభమగు సీతాదర్శనము నాకు లభించినది. ఇటుపై కర్తవ్యమగు సీతాదేవిని తీసికొనిపోవుట యెట్లో రాముడే నిర్ణయించును. 22

నాకు సీతాదేవి శోకమూర్తియై కనుపించినది. (ఈమెను నేను తెచ్చితిని గదా యని వశము చేసికొన దలచితివేమో) నీవు తీసికొని వచ్చిన ఈమె ఐదుతలల పాము వలె నీ ప్రాణములు తీయునని యెఱుంగకున్నావు. 23

ఆహారశక్తి బలముచే విషము కలసిన యాహార మెట్లు జీర్ణము చేసికొనుట కసాధ్యమైనదో అట్లే ఈమె అసురులకు గాని, దేవతలకు గాని వశీకరింప శక్యమైనది కాదు. 24

నీవెంతో శ్రమించి తపస్సుచేసి పొందిన ధర్మమునకు ఫలముగా నీకు దీర్ఘాయువు కలిగినది. నీవు దానిని నాశమొనరించుకొన తగదు. 25

నీవు తపస్సుచే సంపాదించిన వరముతో అసురులుగాని, దేవతలు గాని నిన్నెవ్వరును చంపలేరని తలంచుచున్నావు. అట్లు నీ వవధ్యుడవని తలంచినను నీకు మృత్యువు అపరిహార్యమే. 26

సుగ్రీవో న హి దేవోఽయం నాసురో న చ రాక్షసః,
న దానవో న గంధర్వో న యక్షో న చ పన్నగః,
తస్మాత్ ప్రాణపరిత్రాణం కథం రాజన్ కరిష్యసి. 27

న తు ధర్మోపసంహార మధర్మఫలసంహితమ్,
తదేవ ఫల మన్వేతి ధర్మ శ్చాధర్మనాశనః. 28

ప్రాప్తం ధర్మఫలం తావ ద్భవతా నాత్ర సంశయః,
ఫల మస్యా ప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే. 29

జనస్థానవధం బుద్ధ్వా బుద్ధ్వా వాలివధం తథా,
రామసుగ్రీవసఖ్యం చ బుధ్యస్వ హిత మాత్మనః. 30

కామం ఖల్వహ మప్యేక స్సవాజిరథకుంజరామ్,

---

సుగ్రీవుడు దేవుడు కాదు, అసురుడు కాదు, రాక్షసుడు కాదు, దానవుడు కాదు, గంధర్వుడు కాదు, యక్షుడు కాదు, ఉరగుడును కాదు. నీవు ఎవరివలన చావు కలుగరాదని కోరితివో వారిలో ఎవ్వడును కాదు. రాజా! నీ వతనినుండి ప్రాణముల నెట్లు కాపాడుకొందువు. 27

ఆచరించిన ధర్మము తన ఫలిత మిచ్చి నట్లే అధర్మమును తన ఫలము నిచ్చునే కాని విడువదు. గొప్పగా ఆచరించిన ధర్మము కూడ అధర్మమును నిర్మూలించజాలదు. కాన ధర్మఫల మనుభవించినట్లే అధర్మఫలము కూడ అనుభవించక తప్పదు. 28

నీకు ధర్మఫల మంతయు పూర్తిగా లభించినది. ఇందావంతయు సందేహము లేదు. (సీతాపహరణముచే కలిగిన అధర్మఫలము తొలగించు ఉపాయమేదియు నీవద్ద లేదు) కనుక నీవు శీఘ్రమే నీ అధర్మఫల మనుభవింపనున్నావు. 29

జనస్థానమున సకలరాక్షసులు రాము డొక్కని చేతిలో చచ్చుటను, మహాబలశాలి వాలి రామునిచే నిహతుడగుటను, రామసుగ్రీవుల సఖ్యమును తెలిసికొని నీకు హితమేదో యూహింపుము. 30

కావలె ననుకొన్నచో నేనొక్కడనే స్వేచ్ఛగా గుఱ్ఱములు, రథములు, ఏనుగులతో

లంకాం నాశయితుం శక్త స్తస్యైష తు న నిశ్చయః. 31
రామేణ హి ప్రతిజ్ఞాతం హర్య్రృక్షగణసన్నిధౌ,
ఉత్సాదన మమిత్రాణాం సీతా యైస్తు ప్రధర్షితా. 32
అపకుర్వన్హి రామస్య సాక్షాదపి పురందరః,
న సుఖం ప్రాప్నుయా దన్యః కిం పునస్త్వద్విధో జనః. 33
యాం సీతే త్యభిజానాసి యేయం తిష్ఠతి తే వశే,
కాళరాత్రీతి తాం విద్ధి సర్వలంకావినాశినీమ్. 34
తదలం కాలపాశేన సీతావిగ్రహరూపిణా,
స్వయం స్కంధావసక్తేన క్షమ మాత్మని చింత్యతామ్. 35
సీతాయా స్తేజసా దగ్ధాం రామకోపప్రపీడితామ్,
దహ్యమానా మిమాం పశ్య పురీం సాట్టప్రతోళికామ్. 36

---

సహ లంకను నాశనము చేయగలవాడను. కాని నన్నట్లు చేయుమని రాముని యాజ్ఞ లేదు. 31

సీతను చెఱపట్టిన శత్రువులయినవారిని నాశము చేసెదనని రాముడు కోతులు ఎలుగుల సమక్షముననే ప్రతిన బూనినాడు. 32

రామున కపకారము చేసి సాక్షాత్తుగ దేవేంద్రుడే సుఖము పొందలే డన్నచో నీవొక లెక్కయా. 33

నీ వెవ్వతెను సీత యని తలంచుచుంటివో ఆమె సకలలంకానగరమును నాశనము చేసెడి కాలరాత్రి యను శక్తిగా తలంపుము. 34

కావున సీతాశరీరరూపము దాల్చిన యమపాశమును స్వయముగా నీ మెడకు చుట్టుకొనకుము. నీవు తగిన విధముగా ఆలోచింపుము. 35

సీతయొక్క తేజముచే తగులబడి, రామకోపపీడితమై ఈ లంకానగరము మేడలు మిద్దెలతో గూడ అచిరకాలమున కాలిపోవుట చూడుము. 36

స్వాని మిత్రాణి మంత్రీంశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్ సుతాన్ హితాన్,
భోగాన్ దారాంశ్చ లంకాం చ మా వినాశ ముపానయ. 37
సత్యం రాక్షసరాజేంద్ర శృణుష్వ వచనం మమ,
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః. 38
సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్,
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః. 39
దేవాసురనరేంద్రేషు యక్షరక్షోగణేషు చ,
విద్యాధరేషు సర్వేషు గంధర్వే షూరగేషు చ. 40
సిద్ధేషు కిన్నరేంద్రేషు పతత్రిషు చ సర్వతః,
సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః,
యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్. 41

---

నీ మిత్రులను, మంత్రులను, బంధువులను, సోదరులను, కుమారులను, హితులను, భోగములను, భార్యలను, లంకను వినాశము నొందింపకుము. 37

ఓ రాక్షసరాజా! నామాట వినుము. విశేషించి, రామదూతనై వచ్చిన వానరుడను. నామాట పాటించుము. 38

భూరాది సకలలోకములను, పంచమహాభూతములను, బ్రహ్మ సృష్టించిన సకల స్థావరజంగమరాశిని, ప్రళయావసానమున రుద్రునిద్వారా లయింపజేయుటకును, తిరిగి కల్పాదిని పూర్వమువలెనే సృష్టించుటకును మహాయశస్వి రాముడు సమర్థుడు సుమా. 39

దేవతలు, అసురులు, రాజులు, యక్షులు, రక్షస్సులు, విద్యాధరులు, గంధర్వులు, ఉరగులు, సిద్ధులు, కిన్నరులు, పక్షులు అందరిలోను, సర్వభూతములందును, సకల ప్రదేశములందును, సర్వకాలములయందును, విష్ణువుతో సాటియగు పరాక్రమము గల రాముని కెదురు నిలువగలవారు లేనే లేరు. 40,41

సర్వలోకేశ్వర స్త్వైవం కృత్వా విప్రియ ముత్తమమ్,
రామస్య రాజసింహస్య దుర్లభం తవ జీవితమ్. 42

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేంద్ర గంధర్వవిద్యాధరనాగయక్షాః,
రామస్య లోకత్రయనాయకస్య స్థాతుం స శక్తా స్సమరేషు సర్వే.

బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా, రుద్ర స్త్రిణేత్ర స్త్రిపురాంతకో వా,
ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా, త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్.

స సౌష్ఠవోపేత మదీనవాదినః, కపే ర్నిశ మ్యాప్రతిమోఽప్రియం వచః,
దశాననః కోపవివృత్తలోచన, స్సమాదిశ త్తస్య వధం మహాకపేః. 45

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకపంచాశః సర్గః.*

---

సకలలోకములకు ప్రభువు, రాజశ్రేష్ఠుడు అగు రామున కిట్టి అపకార మొనర్చి నీవు జీవించుట దుర్లభము. 42

ఓ రాక్షసరాజా! దేవతలు గాని, దైత్యులు గాని, గంధర్వులు గాని, విద్యాధరులు గాని, ఉరగులు గాని, యక్షులు గాని, యుద్ధక్షేత్రమున త్రిలోకనాయకు డగు రాముని యెదుట నిలువజాలరు. 43

స్వయంభువగు చతుర్ముఖబ్రహ్మయే గాని, ముక్కంటి, త్రిపురాసురసంహారి యగు రుద్రుడే గాని, త్రిదివనాయకుడు, పరమైశ్వర్యసంపన్నుడగు దేవేంద్రుడే గాని రాముడు చంపదలచిన వానిని కాపాడజాలరు. 44

అని యిట్లు గంభీరముగ మాటలాడు హనుమంతుని యుక్తియుక్తము, తనకు ఇష్టము కానిది అగు వచన మాలించి, సాటిలేనివాడగు రావణుడు కోపముతో కన్నులు త్రిప్పుచు ఆ వానరశ్రేష్ఠుని చంపుట కాదేశించెను. 45

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదియొకటవ సర్గము.*

# 52. ద్విపంచాశః సర్గః

*(రావణుడు హనుమంతుని చంప నాజ్ఞాపించుట)*

తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః,
ఆజ్ఞాపయ ద్వధం తస్య రావణః క్రోధమూర్ఛితః. 1

వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా,
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః. 2

తం రక్షోధిపతిం క్రుద్ధం తచ్చ కార్య ముపస్థితమ్,
విదిత్వా చింతయామాస కార్యం కార్యవిధౌ స్థితః. 3

నిశ్చితార్థ స్తత స్సామ్నాఽఽ పూజ్య శత్రుజి దగ్రజమ్,
ఉవాచ హిత మత్యర్థం వాక్యం వాక్యవిశారదః. 4

---

మహాత్ముడగు హనుమంతుడు పలికినది వినిన రావణు డట్లు కోపముతో మూఢుడై అతనిని చంప నాజ్ఞాపించెను. 1

దురాత్ముడగు రావణు డటు లాజ్ఞాపించగా, దూతకార్యముగ తాను చెప్పవలసినది చెప్పిన హనుమంతుని చంపుటకు విభీషణు డంగీకరింపలేదు. 2

కర్తవ్యము నాచరించుటలో నిశ్చయబుద్ధి కల విభీషణుడు రాక్షసరాజగు రావణుడు కోపించుటను, దూతను వధించుట యను రాజాజ్ఞారూపమగు కార్యమును తెలిసికొని అనంతరకర్తవ్య మాలోచించెను. 3

అట్లు అనంతర మేమి చేయవలెనో నిశ్చయించుకొని శత్రువులను జయించువాడగు విభీషణుడు అన్నను పూజించి, మాటలాడుటలో కౌశలము కలవాడగుటచే మిక్కిలి హితకరమగు సామవచనములతో ఇట్లు పలికెను. 4

క్షమస్వ రోషం త్యజ రాక్షసేంద్ర, ప్రసీద మద్వాక్య మిదం శృణుష్వ,
వధం న కుర్వంతి పరావరజ్ఞా, దూతస్య సంతో వసుధాధిపేంద్రా.

రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేశ్చ గర్హితమ్,
తవ చాసదృశం వీర కపే రస్య ప్రమాపణమ్. 6

ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః,
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్. 7

గృహ్యంతే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః,
తత శ్శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్. 8

తస్మాత్ ప్రసీద శత్రుఘ్న రాక్షసేంద్ర దురాసద,
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదండో విధీయతామ్. 9

విభీషణవచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,

---

ఓ రాక్షసరాజా! నీ వీ వానరుని క్షమింపుము. అతనిపై కోపము వీడుము. నా ఈ మాట వినుము. ఏ కార్యములు చేయక విడువవలెనో, ఎట్టి పనులు విడువక చేయవలెనో ఎఱిగిన రాజశ్రేష్ఠులు దూతను వధింపరు. 5

వీరుడా! ఈ వానరుని సంహరించుట రాజధర్మమునకు విరుద్ధము. లోక వ్యవహారమునను నింద్యము. నీ వంటి వీరునకు తగని పని. 6

నీవు ధర్మజ్ఞుడవు. కృతజ్ఞుడవు. రాజధర్మములలో కుశలుడవు. ప్రాణులకు కర్తవ్యా కర్తవ్యము లెఱిగినవాడవు. పరమార్థము తెలిసినవాడవు. 7

నీవంటి పండితులు కూడ రోషకలుషితు లగుచో, ఇంక వివిధశాస్త్రములు చదివి, జ్ఞానసంపాదనము చేయుట కేవలము శ్రమయే కాగలదు. 8

కావున శత్రుసంహారకుడవు, చెంతకు చేరరాని తేజము గలవాడవు అగు ఓ రాక్షసరాజా! యుక్తాయుక్తముల నెఱిగి దూతను దండింపుము. 9

అంత రాక్షసరాజగు రావణుడు విభీషణుని వాక్యము విని, మిక్కిలి కోపముగలవాడై

రోషేణ మహతాఽఽవిష్టో వాక్య ముత్తర మబ్రవీత్. 10
న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన,
తస్మా దేనం వధిష్యామి వానరం పాపచారిణమ్. 11
అధర్మమూలం బహుదోషయుక్త, మనార్యజుష్టం వచనం నిశమ్య,
ఉవాచ వాక్యం పరమార్థతత్త్వం విభీషణో బుద్ధిమతాం వరిష్ఠ. 12
ప్రసీద లంకేశ్వర రాక్షసేంద్ర, ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ,
దూతా నవధ్యాన్ సమయేషు రాజన్, సర్వేషు సర్వత్ర వదంతి సంతః. 13
అసంశయం శత్రురయం ప్రవృద్ధః , కృతం హ్యనేనాప్రియ మప్రమేయమ్,
న దూతవధ్యాం ప్రవదంతి సంతో, దూతస్య దృష్టా బహవో హి దండాః.
వైరూప్య మంగేషు కశాభిఘాతో, మౌండ్యం తథా లక్షణసన్నిపాతః,

---

యిట్లు పలికెను. 10

శత్రునాశకుడవగు విభీషణుడా! పాపులను చంపుచో పాపము కలుగదు. కావున రాజద్రోహి యగుటచే పాపాచరణ గల వీనిని చంపుదును. 11

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడగు విభీషణుడు అధర్మమే మూలముగా కలది, బహు దోషములతో కూడినది, అనార్యుల కాచరణీయమైనది యగు అన్న పలికిన మాట విని, చెప్పవలసిన విషయము నిట్లు సూటిగా పలికెను. 12

లంకాధిపతివగు రాక్షసరాజా! నీవు ప్రసన్నుడవు కమ్ము. ధర్మార్థయుక్తమగు ఈ మాట వినుము. తన యజమాని యాజ్ఞను నిర్వహించు సందర్భములో ఎచ్చటను, ఏ జాతిలోను దూతను చంపుట యన్నది తగదు. 13

ఇతడు బలవంతుడగు శత్రు వనుటలో సందేహము లేదు. ఇతడు మనకు చేసిన అపకారమును యింతింత యనరానిది. అట్లయ్యును, సత్పురుషులు దూతవధను దండముగా పేర్కొనరు. దూతలకు విధించదగిన దండనములు వేరుగా కలవు. 14

అంగవైరూప్యము కలిగించుట, కొరడాలతో కొట్టుట, ముండనము చేయించుట,

ఏతాన్హి దూతే ప్రవదంతి దండాన్, వధస్తు దూతస్య న నః శ్రుతోఽపి. 15
కథం చ ధర్మార్థవినీతబుద్ధిః, పరావరప్రత్యయనిశ్చితార్థః,
భవద్విధః కోపవశే హి తిష్ఠేత్, కోపం నియచ్ఛంతి హి సత్త్వవంతః. 16
న ధర్మవాదే న చ లోకవృత్తే, న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి,
విద్యేత కశ్చిత్ తవ వీర తుల్య, స్త్వం హ్యుత్తమస్సర్వసురాసురాణామ్. 17
న చాప్యస్య కపే ర్ఘాతే కంచిత్ పశ్యా మ్యహం గుణమ్,
తేష్వయం పాత్యతాం దండో యైరయం ప్రేషితః కపిః. 18
సాధు ర్వా యది వాఽసాధుః పరై రేష సమర్పితః,
బ్రువన్ పరార్థం పరవాన్ న దూతో వధ మర్హతి. 19
అపి చాస్మిన్ హతే రాజన్ నాన్యం పశ్యామి ఖేచరమ్,

---

ముద్రవేయుట... వీనిని దూతల కొసగు దండనము లని చెప్పుదురు గాని, దూతను వధించగా విననైన లేదు. 15

ధర్మార్థములందు సుశిక్షితమైన బుద్ధి కలవాడు, ఉత్కృష్టాపకృష్టముల నెఱిగి కార్యనిశ్చయము చేయువాడు అగు నీవంటివాడు కోపించు టెట్లు? ధీరులు కోపమును నిగ్రహించుకొందురు కదా. 16

వీరుడా! ధర్మశాస్త్రమున గాని, లౌకికకార్యమున గాని, శాస్త్రార్థముల నెఱిగి వానిని మరువకుండుటయందు గాని నీతో సమాను డెవ్వడును ఉండడు. నీవు సురాసురులలో నెల్ల ఉత్తముడవు. 17

ఈ వానరుని చంపుటలో గుణవిశేష మేమియు నా కగపడలేదు. నీ విచ్చు దండ మితనికి కాక యితనిని పంపినవారికి వర్తింపజేయుము. 18

ఇతడు యోగ్యుడే కాని, అయోగ్యుడే కాని పరులు పంపగా వచ్చినవాడు. పరులకు సంబంధించిన విషయమును పరాధీనుడై పలుకునట్టి దూత దండింపదగినవాడు కాదు. 19

రాజా! అంతేకాక, ఈతనిని చంపినచో ఆకాశమున ప్రయాణము చేసి సముద్రము

ఇహ యః పున రాగచ్ఛేత్ పరం పారం మహోదధేః. 20

తస్మా న్నాస్య వధే యత్నః కార్యః పరపురంజయ,
భవాన్ సేంద్రేషు దేవేషు యత్న మాస్థాతు మర్హతి. 21

అస్మిన్ వినష్టే న హి దూతమన్యం, పశ్యామి యస్తౌ నరరాజపుత్రౌ,
యుద్ధాయ యుద్ధప్రియ దుర్వినీతా, వుద్యోజయే ద్దీర్ఘపథావరుద్ధౌ.

పరాక్రమోత్సాహమనస్వినాం చ, సురాసురాణామపి దుర్జయేన,
త్వయా మనోనందన నైర్ఋతానాం, యుద్ధాయతి ర్నాశయితుం న యుక్తా. 23

హితాశ్చ శూరాశ్చ సమాహితాశ్చ, కులేషు జాతాశ్చ మహాగుణేషు,
మనస్విన శ్శస్త్రభృతాం వరిష్ఠాః, కోట్యగ్రత స్తే సుభృతాశ్చ యోధాః

తదేకదేశేన బలస్య తావత్, కేచిత్తవాదేశకృతోఽభియాంతు,

---

దాటి యిటకు రాగలుగు దూత వేరొకడు నాకు కనిపించుటలేదు. 20

ఓ శత్రునగరములను జయించు రావణుడా! ఈ కారణముచే నీ వీ దూతను వధించు ప్రయత్నము చేయకుము. ఇంద్రుడు మొదలగు దేవతలపై నీ ప్రతాపము చూపుము. 21

యుద్ధమందు ప్రీతికల రావణా! ఇతడు మరణింపగా దుర్వినీతులై, దూరప్రవేశ మగుటచే నిచటకు రాలేని రామలక్ష్మణులను యుద్ధమువకు ప్రోత్సహింపగల వేఱొక దూత నా కగపడుటలేదు. 22

ఓ రాక్షసుల మనస్సులను రంజింపజేయువాడా! పరాక్రమము, ఉత్సాహము, అభిమానము కల దేవాసురులకైనను జయింపశక్యము కాని నీ వీ యుద్ధావకాశము జారవిడువరాదు. 23

నీ మేలు కోరువారు, పరాక్రమశాలురు, ఏకాగ్రత కలవారు,. మహాగుణములు కల ఉత్తమవంశమున పుట్టినవారు, మావధనులు, ఆయుధధారులు, శ్రేష్ఠులు, యోగ్యులగు సేవకులు, యోధులును నీ వద్ద కోట్లకొలది కలరు. 24

తౌ రాజపుత్రౌ వినిగృహ్య మూఢౌ, పరేషు తే భావయితుం ప్రభావమ్. 25
నిశాచరాణా మధిపోఽ నుజస్య, విభీషణ స్యోత్తమవాక్య మిష్టమ్,
జగ్రాహ బుద్ధ్యా సురలోకశత్రు, ర్మహాబలో రాక్షసరాజముఖ్యః.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్విపంచాశః సర్గః.*

---

అట్టి నీ మహాసైన్యములో కొద్దిభాగమును తీసికొని, నీ యాజ్ఞానువర్తులగు కొందరు వెడలి, మూఢులగు ఆ రామలక్ష్మణులను బంధించి, శత్రువులకు నీ ప్రభావమెట్టిదో చూపవలెను. 25

మహాబలశాలి, రాక్షసరాజు, దేవశత్రువగు రావణుడు తన తమ్ముడు విభీషణుడు పలికిన మంచి మాట విని, బుద్ధిపూర్వకముగ దాని నంగీకరించెను. 26

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదిరెండవ సర్గము.*

# 53. త్రిపంచాశః సర్గః

*(రాక్షసులు హనుమంతుని తోకను కాల్చుట)*

తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాబలః,
దేశకాలహితం వాక్యం భ్రాతు రుత్తర మబ్రవీత్. 1

సమ్య గుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా,
అవశ్యం తు వధా దన్యః క్రియతా మస్య నిగ్రహః. 2

కపీనాం కిల లాంగూల మిష్టం భవతి భూషణమ్,
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు. 3

తతః పశ్యం త్విమం దీన మంగవైరూప్యకర్శితమ్,
సమిత్రజ్ఞాతయ స్సర్వే బాంధవా స్ససుహృజ్జనాః. 4

ఆజ్ఞాపయ ద్రాక్షసేంద్రః పురం సర్వం సచత్వరమ్,

---

మహాబలశాలి యగు రావణుడు విభీషణుడు పలికిన వాక్యము విని, దేశకాలోచితముగ అతని కిట్లు ప్రత్యుత్తర మొసంగెను. 1

నీవు చక్కగా చెప్పితివి. దూతను వధించుట నింద్యమే. ఇతని కిది కాక యేదేని వేఱొక దండనము తప్పక విధించవలయును. 2

కోతులకు తోక ఇష్టమగు అలంకారము గదా! దానిని శీఘ్రమే కాల్చుడు. అట్లు కాలిన తోకతో నితడు వెడలుగాక! 3

అటుపైన దీనుడై అంగవైరూప్యముచే కృశించిన ఇతనిని అప్తులు, సోదరులు, బంధువులు, మిత్రులు ఎల్లరును చూతురు గాక. 4

అని సోదరువితో పలికి యా రాక్షసరాజు 'చతుష్పథసహితముగా లంకానగరమం

లాంగూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతామ్. 5

తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్శితాః,
వేష్టయంతి స్మ లాంగూలం జీర్ణైః కార్పాసకైః పటైః. 6

సంవేష్ట్యమానే లాంగూలే వ్యవర్ధత మహాకపిః,
శుష్క మింధన మాసాద్య వనేష్వివ హుతాశనః. 7

తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్. 8

లాంగూలేన ప్రదీప్తేన రాక్షసాం స్తా నపాతయత్,
రోషామర్షపరీతాత్మా బాలసూర్యసమాననః. 9

లాంగూలం సంప్రదీప్తం తు ద్రష్టుం తస్య హనూమతః,
సహస్త్రీబాలవృద్ధాశ్చ జగ్ముః ప్రీతా నిశాచరాః. 10

స భూయ స్సంగతైః క్రూరై రాక్షసై ర్హరిసత్తమః,

---

దెల్లెడలను తోక కాలుచున్న ఈ వానరుని త్రిప్పు'డని రాక్షసుల నాజ్ఞాపించెను. 5

అంత రాక్షసులు రావణుడు చెప్పినది విని హనుమంతునిపై కోపించి యతని తోకను చిరిగిన గుడ్డముక్కలతో చుట్టిరి. 6

అట్లు రాక్షసులు తోకను గుడ్డలతో చుట్టుచుండగా, అడవులలో ఎండుకట్టెల కంటుకొని అగ్ని పెరుగునట్లు హనుమంతుడుమ పెరుగసాగెను. 7

రాక్షసు లా హనుమంతుని తోకను నూనెతో తడిపి దానికి నిప్పంటించిరి. 8

హనుమంతుడు తీవ్రకోపము నొంది బాలభానుని వలె ముఖ మెఱ్ఱబాఱగా మండుచున్న తోకతో ఆ రాక్షసులను మోదెను. 9

ఆ హనుమంతుని మండుచున్న తోకను చూడవలెనని స్త్రీలు, వృద్ధులతో గూడ రాక్షసు లెల్లరును ఆనందముతో వచ్చిరి. 10

మఱల ఆ క్రూరులగు రాక్షసు లెల్లరును కలిసి తన్ను బంధింపగా హనుమంతుడు

నిబద్ధః కృతవాన్ వీర స్తత్కాలసదృశీం మతిమ్. 11

కామం ఖలు న మే శక్తా నిబద్ధస్యాపి రాక్షసాః,

ఛిత్త్వా పాశాన్ సముత్పత్య హన్యా మహ మిమాన్ పునః. 12

యది భర్తు ర్హితార్థాయ చరంతం భర్తృశాసనాత్,

బధ్నం త్యేతే దురాత్మానో న తు మే నిష్కృతిః కృతా. 13

సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానా మహం యుధి,

కింతు రామస్య ప్రీత్యర్థం విషహిష్యేఽ హ మీదృశమ్. 14

లంకా చారయితవ్యా వై పునరేవ భవేదితి. 15

రాత్రౌ న హి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః,

అవశ్య మేవ ద్రష్టవ్యా మయా లంకా నిశాక్షయే. 16

---

కాలోచితముగ నిట్లు తలంచెను. 11

ఈ రాక్షసు లిట్లు నన్ను బంధించియు ఏమియు చేయలేరు. ఏలన బంధములను ఛేదించుకొని పై కెగసి వీరలను చంపగలను. 12

నేను నా యజమాని మేలుకోరి, ఆయన యాజ్ఞచే నిచట సంచరించుచుండగా దురాత్ములగు వీరు నన్ను బంధించిరి. వీరికి నేను ప్రతీకారము చేయవైతిని. 13

యుద్ధమున ఈ సకలరాక్షసులను సంహరించుటకు నే నొక్కడనే చాలుదును. కాని రాముడు తానే రావణుని చంపెదనని ప్రతిన బూని యున్నాడు. కనుక ఆయన ప్రీతికిని, ఈ రాక్షసులు నన్ను నాల్గువైపులను త్రిప్పుదురు కనుక లంకను చక్కగా చూడవచ్చు ననియు వీరి యిట్టి యాగడము సహింతును. 14,15

నేను లంకలో తిరిగినను రాత్రిసమయ మగుటచే నగరరక్షణమునకై నిర్మించబడిన దుర్గములు, ఇతరపద్ధతులు చక్కగా తెలిసికొనుట జరుగలేదు. ప్రాతఃకాలమున ఈ లంకను నేను తప్పక పరిశీలింపవలయును. 16

నన్నీ రాక్షసులు బంధించియే యున్నారు. తిరిగి తోకను కాల్చి నన్ను పీడించివ

కామం బద్ధస్య మే భూయః పుచ్ఛ స్యోద్దీపనేన చ,
పీడాం కుర్వంతు రక్షాంసి న మేఽ స్తి మనసః శ్రమః. 17

తతస్తే సంవృతాకారం సత్త్వవంతం మహాకపిమ్,
పరిగృహ్య యయు ర్హృష్టా రాక్షసాః కపికుంజరమ్. 18

శంఖభేరీనినాదైస్తం ఘోషయంతః స్వకర్మభిః,
రాక్షసాః క్రూరకర్మాణ శ్చారయంతి స్మ తాం పురీమ్. 19

అన్వీయమానో రక్షోభి ర్యయౌ సుఖ మరిందమః,
హనుమాం శ్చారయామాస రాక్షసానాం మహాపురీమ్. 20

అథాపశ్య ద్విమానాని విచిత్రాణి మహాకపిః,
సంవృతాన్ భూమిభాంగాశ్చ సువిభక్తాంశ్చ చత్వరాన్. 21

వీథీశ్చ గృహసంబాధాః కపిః శృంగాటకాని చ,

---

పీడింతురుగాక. నా మనస్సున కెంతమాత్రము శ్రమ కలుగదు. 17

అంత రాక్షసులు శ్రేష్ఠవానరుడు, బలవంతుడు, మహాబుద్ధిశాలి అగు హనుమంతుడు తన ఆకారమును కప్పిపుచ్చుకొని యుండుటచే అతని గొప్పదన మెంత మాత్రము తెలియజాలక హర్షముతో అతనిని పట్టి తీసికొనిపోయిరి. 18

క్రూరకార్యము లొనర్చు ఆ రాక్షసులు శంఖముల నూదుచు, భేరులు మ్రోగించుచు, సింహనాదములు చేయుచు హనుమంతుని లంకలో త్రిప్పిరి. 19

శత్రువుల నణచివేయగల హనుమంతు డావిధముగ రాక్షసులు తన్ననుసరింపగా లంకానగరమున సుఖముగా పోవుచు, లంకను చక్కగా బరిశోధించెను. 20

మహాకపి యగు హనుమ వివిధములగు విమానము (సౌధోపరిభాగము)లను ఆయుధాదికములు దాచి మూసియుంచబడిన భూప్రదేశములను, చక్కగా నేర్పఱుపబడిన యిళ్ల ముంగిళ్లను చూచెను. 21

వాయుపుత్రుడగు హనుమ యిరువైపులను ఇండ్లతో నిండిన వీథులను,

తథా రథ్యోపరథ్యాశ్చ తథైవ గృహకాంతరాన్,
గృహాంశ్చ మేఘసంకాశాన్ దదర్శ పవనాత్మజః. 22
చత్వరేషు చతుష్కేషు రాజమార్గే తథైవ చ,
ఘోషయంతి కపిం సర్వే చారీక ఇతి రాక్షసాః. 23
స్త్రీబాలవృద్ధా నిర్జగ్ము స్తత్ర తత్ర కుతూహలాత్,
తం ప్రదీపితలాంగూలం హనుమంతం దిదృక్షవః. 24
దీప్యమానే తత స్తస్య లాంగూలాగ్రే హనూమతః,
రాక్షస్య స్తా విరూపాక్ష్య శ్శంసు ర్దేవ్యా స్తదప్రియమ్. 25
యస్త్వయా కృతసంవాద స్సీతే తామ్రముఖః కపిః,
లాంగూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే. 26
శ్రుత్వా తద్వచనం క్రూర మాత్మాపహరణోపమమ్,

---

చతుష్పథములను, మహావీథులను, నందుగొందులను, చిన్నయిండ్లను, అంతర్ద్వారములను, మేఘములవలె ఉన్నతములై యున్న యిండ్లను అచట దర్శించెను. 22

ముంగిళ్లలో, చతుష్పథములలో, రాజమార్గములలో ఆ రాక్షసు లందరును హనుమంతుని "ఇతడు చారు" దని ప్రకటింపసాగిరి. 23

అట్లు హనుమంతుని తోక కాలుచుండగా చూడవలెనను కోరికతో అట నట రాక్షసుల స్త్రీలు, బాలురు, వృద్ధులు గృహములనుండి వెలికి వచ్చిరి. 24

హనుమంతుని తోక అట్లు కాలుచుండగా, వికృతములగు కండ్లుగల రాక్షసాంగనలు సీత కా దుఃఖవార్త తెలియజేసిరి. 25

"సీతా! నీతో మాటలాడి పోయిన ఎఱ్ఱమూతి గల కోతి తోకను నిప్పుపెట్టి రాక్షసులు తీసికొనిపోవుచున్నారు". 26

వారి మాటలు వినిన సీత తన ప్రాణములనే అపహరించినట్లు మిక్కిలి శోకపీడితయై

వైదేహీ శోకసంతప్తా హుతాశన ముపాగమత్. 27

మంగళాభిముఖీ తస్య సా తదాఽఽసీ న్మహాకపేః,
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్. 28

యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః,
యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః. 29

యది కించి దనుక్రోశ స్తస్య మ య్యస్తి ధీమతః,
యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః. 30

యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్,
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః. 31

యది మాం తారయే దార్య స్సుగ్రీవ స్సత్యసంగరః,
అస్మా ద్దుఃఖాంబుసంరోధా చ్ఛీతో భవ హనూమతః. 32

---

అగ్నిదేవుని ధ్యానించెను. 27

అపు డామె ఆ మహాకపి హనుమంతునకు శరీరము కాలకుండుట యను శుభము కలుగవలెనని తలంచి, పరిశుద్ధమనస్సుతో అగ్ని నుపాసించెను. 28

ఓ అగ్నిదేవా! నేను పతిసేవ చేసియుంటినేని, తపస్సు నాచరించితినేని, పతివ్రత నేని నీవు హనుమంతుని శరీరమును కాల్పక చల్లగా నుండుము. 29

ధీమంతుడగు నా పతికి నాయం దించుకయైన దయయుండునేని, నా కేమైన భాగ్యము మిగిలియుండునేని నీవు హనుమకు చల్లనై యుండుము. 30

నేను పాతివ్రత్యము గలిగియున్నట్లు రాముని సమాగమమునకు పరితపించుచున్నట్లు ధర్మాత్ముడగు హనుమంతుడు (లేదా రాముడు) ఎఱుగునేని నీవు హనుమంతునికి చల్లనగుము. 31

సత్యప్రతిజ్ఞ కలవాడు, పూజ్యుడగు సుగ్రీవుడు నన్నీ దుఃఖసాగరమునుండి తరింపజేయు నేని నీవు హనుమంతుని బాధింపక చల్లనగుము. 32

తతస్తీక్ష్ణార్చి రవ్యగ్రః ప్రదక్షిణశిఖోఽనలః,
జజ్వాల మృగశాబాక్ష్యా శ్శంసన్నివ శివం కపేః. 33

హనుమజ్జనకశ్చాపి పుచ్ఛానలయుతోఽనిలః,
వవౌ స్వాస్థ్యకరో దేవ్యాః ప్రాలేయానిలశీతలః. 34

దహ్యమానే చ లాంగూలే చింతయామాస వానరః,
ప్రదీప్తోఽగ్ని రయం కస్మా న్న మాం దహతి సర్వతః. 35

దృశ్యతే చ మహాజ్వాలః కరోతి న చ మే రుజమ్,
శిశిరస్యేవ సంపాతో లాంగూలాగ్రే ప్రతిష్ఠితః. 36

అథవా తదిదం వ్యక్తం యద్దృష్టం ప్లవతా మయా,
రామప్రభావా దాశ్చర్యం పర్వత స్సరితాం పతౌ. 37

---

అని యామె ప్రార్థింపగా, వేడియైన జ్వాలలు గల హనుమంతుని తోకయందలి అగ్ని నిరాకులుడై, సీతాదేవితో హనుమంతునికి శుభమే యని తెలుపుచున్న వానివలె ప్రదక్షిణముగా తిరుగు జ్వాలలతో మండెను. 33

హనుమంతుని తోకయందు అగ్నితో కూడియున్న హనుమతండ్రి వాయుదేవుడును, మంచుగాలివలె చల్లనై సీతాదేవికి సుఖము గూర్చుచు వీచెను. 34

తన తోక అట్లు తగులబడుచుండగా హనుమంతు డిట్లు తలంచెను. 'నా తోక చివర ప్రజ్వలించుచున్న ఈ యగ్ని నన్నేల కాల్పకున్నది? 35

చూచుట కీ జ్వాల మిక్కిలి పెద్దదిగా నున్నది. కాని నా కెంత మాత్రము బాధ కలిగించుట లేదు. చందనము, వట్టివేళ్లగంధము వంటి శీతలద్రవ్యము అలదినట్లు వలె నా తోకచివర చల్లదనమే వ్యక్తమగుచున్నది. 36

అయినను, ఇప్పు డిది రామప్రభావము వల్లనే యని స్పష్టము. పూర్వము కూడ నేను సముద్రము దాటునపుడు రాముని ప్రభావము చేతనే సముద్రమధ్యమునుండి ఆశ్చర్యకరమగు పర్వతమొక్కటి నాకు సహాయమునకై పైకి వచ్చెను కదా. 37

యది తావత్ సముద్రస్య మైనాకస్య చ ధీమతః,
రామార్థం సంభ్రమ స్తాదృక్ కి మగ్ని ర్న కరిష్యతి. 38
సీతాయా శ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ,
పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః. 39
భూయ స్స చింతయామాస ముహూర్తం కపికుంజరః,
ఉత్పపాతాథ వేగేన ననాద చ మహాకపిః. 40
పురద్వారం తత శ్శ్రీమాన్ శైలశృంగ మివోన్నతమ్,
విభక్తరక్షస్సంబాధ మాససా దానిలాత్మజః. 41
స భూత్వా శైలసంకాశః క్షణేన పున రాత్మవాన్,
హ్రస్వతాం పరమాం ప్రాప్తో బంధనా న్యవశాతయత్. 42
విముక్త శ్చాభవ చ్ఛ్రీమాన్ పునః పర్వతసన్నిభః,

---

సముద్రమునకు, ధీమంతుడగు మైనాకునకును గూడ రామకార్యమం దింత యాసక్తి యుండగా, అగ్ని యే సహకారము చేయదు? 38

సీతయొక్క సౌమ్యతచేతను, రాముని తేజస్సుచేతను, మా తండ్రి వాయుదేవునితోడి చెలిమిచేతను, దహించు స్వభావము కలవాడయ్యును అగ్ని నన్ను కాల్పకున్నాడు'. 39

తిరిగి యా కపిశ్రేష్ఠు డొక్క క్షణము కర్తవ్య మేమా యని ఆలోచించెను. పిమ్మట ఆ మహాకపి యగు హనుమ వేగముగా పైకెగసి సింహనాద మొనర్చెను. 40

శ్రీమంతుడు, వాయుపుత్రు డగు ఆ హనుమంతుడు పర్వతశిఖరమువలె మహోన్నతమును రాక్షససంచారము లేనిదియు అగు పురద్వారము కడ కేగెను. 41

పర్వతాకారుడు, బుద్ధిమంతుడగు ఆ హనుమంతుడు క్షణకాలము కురుచరూపమును పొంది బంధనములను జారవిడిచెను. 42

అట్లు బంధవిముక్తుడైన పిమ్మట శ్రీమంతుడు హనుమ మఱల పర్వతాకారుడై

వీక్షమాణశ్చ దదృశే పరిఘం తోరణాశ్రితమ్. 43
స తం గృహ్యా మహాబాహుః కాలాయసపరిష్కృతమ్,
రక్షిణస్తాన్ పున స్సర్వాన్ సూదయామాస మారుతిః.
స తా న్నిహత్వా రణచండవిక్రమ స్సమీక్షమాణః పునరేవ లంకామ్,
ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ ప్రకాశతాదిత్య ఇవార్చిమాలీ. 45

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రిపంచాశః సర్గః.*

---

ఎల్లెడల పరిశీలించుచు పురద్వారము కడనున్న ఇనుపగుదియను చూచెను. 43

మహాభుజుడగు హనుమంతు డా ఇనుపగుదియను తీసికొని తనకు కావలియున్న రాక్షసులను దానితో మోదెను. 44

యుద్ధమున ప్రచండపరాక్రమము కల ఆ హనుమంతు డట్లు వారిని చంపి, తిరిగి లంకాపట్టణమును చూచుచు, తగులబడుచున్న తోకనుండి వెడలు అగ్ని జ్వాలలు మాలారూపముగ కలవాడై, కిరణసమూహములతో కూడిన సూర్యునివలె ప్రకాశించెను. 45

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదిమూడవ సర్గము.*

# 54. చతుఃపంచాశః సర్గః

*(లంకాదహనము)*

వీక్షమాణ స్తతో లంకాం కపిః కృతమనోరథః,
వర్ధమానసముత్సాహః కార్యశేష మచింతయత్. 1

కిన్ను ఖల్వవశిష్టం మే కర్తవ్య మిహ సాంప్రతమ్,
యదేషాం రక్షసాం భూయ స్సంతాపజననం భవేత్. 2

వనం తావత్ ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః,
బలైకదేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్. 3

దుర్గే వినాశితే కర్మ భవేత్ సుఖపరిశ్రమమ్,
అల్పయత్నేన కార్యేఽ స్మిన్ మమ స్యాత్ సఫలః శ్రమః. 4

యో హ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః,

---

అంతట హనుమంతు డట్లు లంకను చూచుచు, తన మనోరథ మీడేరగా, పెంపొందెడు ఉత్సాహముతో ఇట్లు మిగిలిన కర్తవ్యమును గూర్చి యాలోచించెను. 1

"రాక్షసులకు మఱల దుఃఖము కలిగించునట్టి పని నేనిపుడు చేయగా మిగిలియున్న దేది?" 2

నే నశోకవనమును పాడుచేసితిని. శ్రేష్ఠులగు రాక్షసులను చంపితిని. రాక్షససైన్యమును కొంత నాశము చేసితిని. ఇంక నగరమును పాడుచేయుటే మిగిలియున్నది. 3

ఈ నగరమును నశింపజేయుచో నే నాచరించిన పని (అశోకవనభంగము లేక సముద్ర లంఘనము, దౌత్యము) వలన కలిగిన ఆయాసము సఫలమగును. అల్పప్రయత్నముతో సాధింపగల యీ పనిచే నా శ్రమమెల్ల సఫలము కాగలదు. 4

నా తోకయందు వెలుగుచున్న అగ్ని కీ శ్రేష్ఠములగు గృహములతో సంతర్పణము

అస్య సంతర్పణం న్యాయ్యం కర్తు మేభి ర్గృహోత్తమైః. 5
తతః ప్రదీప్తలాంగూలః సవిద్యుదివ తోయదః,
భవనాగ్రేషు లంకాయా విచచార మహాకపిః. 6
గృహాద్ గృహం రాక్షసానా ముద్యానాని చ వానరః,
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః. 7
అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్,
అగ్నిం తత్ర స నిక్షిప్య శ్వసనేన సమో బలీ. 8
తతోఽన్యత్ పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్,
ముమోచ హనుమా నగ్నిం కాలానలశిఖోపమమ్. 9
వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజా స్సారణస్య చ ధీమతః. 10

---

చేయుట న్యాయ్యము. 5

అపుడు మహాకపి యగు మారుతి మండుచున్న తోక కలవాడై, మెఱుపులతో కూడిన మేఘమువలె లంకానగరపు భవనముల పైభాగములందు సంచరించెను. 6

ఆ హనుమంతుడు నిర్భయముగా ఒక రాక్షసగృహమునుండి వేఱొక రాక్షసగృహమునకు పోవుచు, ఉద్యానవనములను వీక్షించుచు, మహాభవనములలో కూడ సంచరించెను. 7

వేగమున వాయువుతో సాటియగువాడును, బలవంతుడును అగు హనుమంతుడు మహావేగముతో ప్రహస్తుని యింటివద్ద దిగి, ఆ యింటికి చిచ్చుపెట్టి, మఱల నటనుండి మహాపార్శ్వుని యింటిపై కెగిరి దానిని అగ్నితో ప్రజ్వలింపజేసెను. 8,9

అట్లే హనుమంతుడు వజ్రదంష్ట్రుని యింటికి, మహాతేజశ్శాలియగు శుకుని యింటికి, ధీమంతుడగు సారణుని యింటికి చిచ్చుపెట్టెను. 10

తథా చేంద్రజితో వేశ్మ దదాహ హరియూథపః.
జంబుమాలే స్సుమాలేశ్చ దదాహ భవనం తతః. 11
రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రో స్తథైవ చ,
హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః. 12
యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య రక్షసః,
విద్యుజ్జిహ్వాస్య ఘోరస్య తథా హస్తిముఖస్య చ. 13
కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి,
కుంభకర్ణస్య భవనం మకరాక్షస్య చైవ హి. 14
యజ్ఞశత్రోశ్చ భవనం బ్రహ్మశత్రో స్తథైవ చ,
నరాంతకస్య కుంభస్య నికుంభస్య దురాత్మనః. 15
వర్జయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి,
క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుంగవః. 16
తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,

---

పిమ్మట వానరయూథపతి యగు హనుమంతుడు ఇంద్రజిత్తుభవనమును, జంబుమాలి, సుమాలి, యను రాక్షసుల భవనములను తగులబెట్టెను. 11

పిమ్మట ఆ కపిశ్రేష్ఠుడు రశ్మికేతువు, సూర్యశత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, భయంకరుడగు విద్యుజ్జిహ్వుడు, హస్తిముఖుడు అనువారి యిండ్లకును, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు, యజ్ఞశత్రువు, బ్రహ్మశత్రువు, నరాంతకుడు, కుంభుడు, దురాత్ముడగు వికుంభుడు అనువారి యిండ్లకును క్రమముగా పోయి నిప్పుపెట్టెను. ఒక్క విభీషణుని గృహమును మాత్రము కాల్చక విడచెను. 12-16

మహాకీర్తిశాలి, మహాకపి యగు హనుమంతుడు, ఆ యా గొప్ప గొప్ప విలువైన

గృహే ష్వృద్ధిమతా మృద్ధిం దదాహ స మహాకపిః. 17

సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేంద్రస్య వీర్యవాన్,

ఆససాదాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్. 18

తత స్తస్మిన్ గృహే ముఖ్యే నానారత్నవిభూషితే,

మేరుమందరసంకాశే సర్వమంగళశోభితే. 19

ప్రదీప్త మగ్ని ముత్సృజ్య లాంగూలాగ్రే ప్రతిష్ఠితమ్,

ననాద హనుమాన్ వీరో యుగాంతజలదో యథా. 20

శ్వసనేన చ సంయోగా దతివేగో మహాబలః,

కాలాగ్నిరివ జజ్వాల ప్రావర్ధత హుతాశనః. 21

ప్రదీప్త మగ్నిం పవన స్తేషు వేశ్మ స్వచారయత్,

అభూ చ్ఛ్వసనసంయోగా దతివేగో హుతాశనః. 22

---

రాక్షసమహాభవనములలో సంపన్నుల పంపదల నన్నింటిని కాల్చివైచెను. 17

శ్రీమంతుడు, పరాక్రమశాలి యగు హనుమంతుడు ఆ విధముగ సకలరాక్షస గృహములను గడచి రాక్షసరాజగు రావణుని గృహము చేరెను. 18

పిమ్మట వీరుడగు హనుమంతుడు, బహురత్నభూషితము, సకలశుభలక్షణ శోభితము, మేరుమందరపర్వతముల వలె ఉన్నతము అగు రావణుని ప్రధాన భవనమును తన తోకచివర ప్రజ్వలించుచున్న అగ్నితో కాల్చి ప్రళయకాల మేఘమువలె సింహనాదము చేసెను. 19,20

వాయువుతో సంబంధమువే (గాలియు వేగముగ వీచుచుండుటచే) అగ్ని మిక్కిలి వేగము, బలము పొందినవాడై, వృద్ధి నంది, ప్రళయాగ్నివలె ప్రజ్వలించెను. 21

మండుచున్న అగ్నిని వాయు వన్ని యిండ్లకును పాకించెను. వాయుసంయోగముతో అగ్ని మహావేగము కలవాడయ్యెను. 22

తాని కాంచనజాలాని ముక్తామణిమయాని చ,
భవనా న్యవశీర్యంత రత్నవంతి మహాంతి చ. 23

తాని భగ్నవిమానాని నిపేతు ర్వసుధాతలే,
భవనానీవ సిద్ధానా మంబరాత్ పుణ్యసంక్షయే. 24

సంజజ్ఞే తుముల శ్శబ్దో రాక్షసానాం ప్రధావతామ్,
స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియామ్,
నూన మేషోఽగ్ని రాయాతః కపిరూపేణ హా ఇతి. 25

క్రందంత్య స్సహసా పేతుః స్తనంధయధరాః స్త్రియః,
కాశ్చి దగ్నిపరీతేభ్యో హర్మ్యేభ్యో ముక్తమూర్ధజాః. 26

పతంత్యో రేజిరేఽభ్రేభ్య స్సౌదామిన్య ఇవాంబరాత్. 27

వజ్రవిద్రుమవైదూర్యముక్తారజతసంహితాన్,
విచిత్రాన్ భవనాన్ ధాతూన్ స్యందమానాన్ దదర్శ సః. 28

---

బంగారు గవాక్షములు కలవై, ముత్యములు, మణులతో నిర్మితములై, రత్నపూర్ణములైన మహాభవనములు అగ్నిదాహముచే నేలగూలెను. 23

పుణ్యము క్షయించుటచే ఆకాశము నుండి నేలబడిన సిద్ధుల భవనములవలె ఆ రాక్షసభవనములు విమానములు విఱిగి నేలగూలెను. 24

ఉత్సాహము, గొప్ప శోభయు తొలగి, తమ తమ యిండ్లను కాపాడుకొనుటకై, "అయ్యో! అగ్నియే యిటులు వానరరూపము దాల్చి వచ్చిపడెనని విలపించుచు పారిపోవుచున్న రాక్షసులు చేయు భీకరనాదము విననయ్యెను. 25

పాలుత్రాగు పసిపాపలను చంకనెత్తుకొని పెక్కండ్రు స్త్రీలు కురులు వీడ, అక్రందన మొనర్చుచు అగ్ని చుట్టుముట్టిన గృహములనుండి నేలపై బడిరి. 26

వారట్లు పడుచు ఆకాశమునుండి నేలకూలు మెఱుపుతీగలవలె ప్రకాశించిరి. 27

కాలుచున్న ఆ భవనములనుండి వజ్రములు, పగడములు, వైదూర్యములు, ముత్యములు, వెండి, బంగారములు కరిగి ప్రవహింపగా హనుమ చూచెను. 28

నాగ్ని స్తృప్యతి కాష్ఠానాం తృణానాం హరియూథపః,
నాగ్నే ర్నాపి విశస్తానాం రాక్షసానాం వసుంధరా. 29

క్వచిత్ కింశుకసంకాశాః క్వచిచ్ఛాల్మలిసన్నిభాః,
క్వచిత్ కుంకుమసంకాశా శ్శిఖా వహ్నే శ్చకాశిరే. 30

హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా,
లంకాపురం ప్రదగ్ధం త ద్రుద్రేణ త్రిపురం యథా. 31

తతస్తు లంకాపురపర్వతాగ్రే, సముత్థితో భీమపరాక్రమోఽగ్నిః,
ప్రసార్య చూడావలయం ప్రదీప్తో, హనూమతా వేగవతా విసృష్టః
యుగాన్తకాలానలతుల్యవేగ, స్సమారుతోఽగ్ని ర్వవృధే దివిస్పృక్,
విధూమరశ్మి ర్భవనేషు సక్తో, రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః. 33

---

అగ్ని కట్టెలచేగాని, గడ్డిచేగాని తృప్తినొందదు. అట్లే హనుమంతుడు రాక్షస గృహములం దగ్నిని పడవేయుటచేత తృప్తినందలేదు. భూమియు ఆ రాక్షసులు చావగా తృప్తిపడలేదు. 29

ఆరని అగ్నిశిఖ లా యా తగులబడు వస్తువుల కనుగుణముగ మోదుగపువ్వుల వలెను, బూరుగపూలవలెను, కుంకుమపువ్వువలెను ప్రకాశించెను. 30

రుద్రుడు త్రిపురములను కాల్చినట్లు ఆ లంకానగరమును వేగవంతుడు, మహాత్ముడగు హనుమంతుడు తగులబెట్టెను. 31

వేగవంతుడగు హనుమంతు డట్లు అంటించి విడువగా లంకాపురపర్వతాగ్రమున ప్రజ్వలించిన భయంకరపరాక్రమముకల అగ్ని జ్వాలాసమూహమును ప్రసరింపజేసి విరాజిల్లెను. 32

వాయువుతో కలసిన అగ్ని ప్రళయకాలాగ్నితో సమానమగు వేగము కలదై, పొగలేక ప్రకాశించుచు, రాక్షసభవనములకును తాకి రాక్షసశరీరము లను నేతితో ప్రజ్వలించిన జ్వాల కలదై ఆకాశము వంటుచు వృద్ధినందెను. 33

ఆదిత్యకోటీసదృశ స్సుతేజా, లంకాం సమస్తాం పరివార్య తిష్ఠన్,
శబ్దై రనేకై రశనిప్రరూఢై, ర్భిందన్నివాండం ప్రబభౌ మహాగ్నిః.
తత్రాంబరా దగ్నిరతిప్రవృద్ధో, రూక్షప్రభః కింశుకపుష్పచూడః,
నిర్వాణధూమాకులరాజయశ్చ, నీలోత్పలాభాః ప్రచకాశిరేఽభ్రాః
వజ్రీ మహేంద్ర స్త్రిదశేశ్వరో వా, సాక్షాద్యమో వా వరుణోఽనిలో వా,
రుద్రోఽగ్ని రర్కో ధనదశ్చ సోమో, న వానరోఽయం స్వయమేవ కాలః.
కిం బ్రహ్మణస్సర్వపితామహస్య, సర్వస్య ధాతుశ్చతురాననస్య,
ఇహాగతో వానరరూపధారీ, రక్షోపసంహారకరః ప్రకోపః. 37
కిం వైష్ణవం వా కపిరూప మేత్య, రక్షోవినాశాయ పరం సుతేజ,
అనన్త మవ్యక్త మచిన్త్య మేకం, స్వమాయయా సాంప్రత మాగతం వా. 38

---

ఆ మహాగ్ని కోటిసూర్యులవలె దేదీప్యమాన మగుచు సమస్తమగు లంకానగరమును ఆవరించి యున్నదై, పిడుగుపాటువలె తీవ్రములగు శబ్దములచే బ్రహ్మాండమును బ్రద్దలు చేయుచున్నదివలె ప్రకాశించెను. 34

అటు లాకాశపర్యంతము మిక్కిలి వృద్ధినందిన యగ్ని తీవ్రమగు కాంతిగలదై, మోదుగపూలరంగుగల మంటలు గలదయ్యెను. అనంతర మా మంటలు శమించుటచే ఏర్పడిన పొగ వ్యాపించగా మేఘములు నల్లకలువలవలె ప్రకాశించెను. 35

ఇతడు దేవరాజగు యముడో, వరుణుడో, వాయువో, రుద్రుడో, అగ్నియో, సూర్యుడో, కుబేరుడో, చంద్రుడో కావలెను. ఇతడు వావరుడు ఎంత మాత్రము కాదు. స్వయముగ నితడు యముడును కావచ్చును. 36

సకలలోకములకు తాతయు, సకలజీవులకు పోషకుడును అగు బ్రహ్మయొక్క కోపము సకలరాక్షసులను సంహరించునట్టిదై ఈ రూపముతో వచ్చినదా? 37

త్రివిధపరిచ్ఛేదశూన్యమైనది, చక్షురాదులకు గోచరముకానిది, కేవలము మనస్సునకు తెలియశక్యముగానిది, అద్వితీయమైనది యగు వైష్ణవతేజమే తన యసాధారణమగు ఆశ్చర్యశక్తితో కపిరూపము దాల్చి యిపు డిచటకు వచ్చినదా? 38

ఇత్యేవ మూచు ర్బహవో విశిష్టా, రక్షోగణా స్తత్ర సమేత్య సర్వే,
సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం దగ్ధాం పురీం తాం సహసా సమీక్ష్య. 39
తతస్తు లంకా సహసా ప్రదగ్ధా, సరాక్షసా సాశ్వరథా సనాగా,
సపక్షిసంఘా సమృగా సవృక్షా, రురోద దీనా తుములం సశబ్దమ్.
హా తాత హా పుత్రక కాంత మిత్ర, హా జీవితం భోగయుతం సుపుణ్యమ్,
రక్షోభిరేవం బహుధా బ్రువద్భిః, శబ్దః కృతో ఘోరతర స్సుభీమః . 41
హుతాశనజ్వాలసమావృతా సా, హతప్రవీరా పరివృత్తయోధా,
హనూమతః క్రోధబలాభిభూతా, బభూవ శాపోపహతేవ లంకా. 42
స సంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం
సముజ్జ్వలజ్జ్వాలహుతాశనాంకితామ్,

---

అని యీ విధముగా ప్రాణులు, గృహములు, వృక్షములతో కూడ తగులబడిన యీ లంకానగరమును గాంచి, జ్ఞానాధికులగు రాక్షసులెల్లరు నొక్కచో చేరి తలపోసిరి. 39

పిమ్మట, రాక్షసులు అశ్వములు ఏనుగులు పక్షులు మృగముల భీకరములగు అఱపులతో, రథములు వృక్షములు మున్నగునవి కాలుటవల్ల నేర్పడిన ధ్వనులతో నా లంక దీనపరిస్థితి నొంది, భీకరధ్వని కలదయ్యెను. 40

"అయ్యో! తండ్రీ! అయ్యో కొడుకా! అయ్యో ప్రియుడా! మిత్రుడా! గొప్ప పుణ్యము చేసికొని తత్ఫలితముగ భోగముల ననుభవించు ఓ జీవితమా!" అని యిట్లు అనేక విధములుగా పలుకుచు రాక్షసులు చేయు శబ్దము మిక్కిలి విస్తృతము, భయంకరమై వినిపించెను. 41

హనుమంతుని కోపబలముచే తిరస్కృతమైన యీ లంకానగరము అగ్నిజ్వాలలతో నెల్లెడల నాకర్షింపబడినదై, వీరులు మరణింపగా వెనుకకు మఱలిన భటులు కలదై శాపముచే వినాశము నొందినది వలె నయ్యెను. 42

మహామనస్వి యగు హనుమంతుడు దిక్కు తోచక భయముతో పరుగులెత్తు రాక్షసులతో, పెరిగి మిన్నంటు అగ్నిజ్వాలల సమూహములతో, ప్రళయకాలమున

దదర్శ లంకాం హనుమాన్ మహామనాః
స్వయంభుకోపోపహతా మివావనిమ్. 43

భంక్త్వా వనం పాదపరత్నసంకులం
హత్వా తు రక్షాంసి మహాంతి సంయుగే,
దగ్ధ్వా పురీం తాం గృహరత్నమాలినీం
తస్థౌ హనూమాన్ పవనాత్మజః కపిః 44

త్రికూటశృంగాగ్రతలే విచిత్రే, ప్రతిష్ఠితో వానరరాజసింహః,
ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ, వ్యరాజతాదిత్య ఇవాంశుమాలీ. 45

స రాక్షసాంస్తాన్ సుబహూంశ్చ హత్వావన చ భంక్త్వా బహుపాదపం తత్,
విసృజ్య రక్షోభవనేషు చాగ్నిం, జగామ రామం మనసా మహాత్మా. 46

తతస్తు తం వానరవీరముఖ్యం, మహాబలం మారుతతుల్యవేగమ్,

---

భగవంతుని కోపముచే నాశము చేయబడిన భూమివలె నున్న లంకను చూచెను. 43

వాయుపుత్రుడగు ఆ హనుమంతు డట్లు శ్రేష్ఠములగు చెట్లతో వ్యాప్తమైన వనమును విఱచి, మహాబలపరాక్రమములుగల రాక్షసులను యుద్ధమున సంహరించి, శ్రేష్ఠములగు గృహము లనేకములు గల యా లంకానగరమును కాల్చి యూరకుండెను. 44

వానరశ్రేష్ఠుడగు ఆ హామమంతు డట్లు లంకను గాల్చి ఆశ్చర్యము గొల్పు త్రికూట పర్వతశిఖరముపై కూర్చుండెను. మండుచున్న తోకనుండి వెలువడు జ్వాలల వరుసలతో అయన కిరణసమూహములచే సూర్యునివలె ప్రకాశించెను. 45

మహాత్ముడగు ఆ హనుమంతు డ ట్లనేకరాక్షసులను పరిమార్చి, అనేక వృక్షము లతో కూడిన ఆ యశోకవనము విఱచి, రాక్షసగృహములను తగులబెట్టి ఆపైన రాముని స్మరించెను. 46

అపుడు వానరవీరులలో శ్రేష్ఠుడు, మహాబలుడు, వాయువేగము కలవాడు, మహా

మహామతిం వాయుసుతం వరిష్ఠం, ప్రతుష్టువు ర్దేవగణాశ్చ సర్వే.

భంక్త్వా వనం మహాతేజా హత్వా రక్షాంసి సంయుగే,
దగ్ధ్వా లంకాపురీం రమ్యాం రరాజ స మహాకపిః. 48

తత్ర దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః,
దృష్ట్వా లంకాం ప్రదగ్ధాం తాం విస్మయం పరమం గతాః. 49

తం దృష్ట్వా వానరశ్రేష్ఠం హనుమంతం మహాకపిమ్,
కాలాగ్ని రితి సంచింత్య సర్వభూతాని తత్రసుః. 50

దేవాశ్చ సర్వే మునిపుంగవాశ్చ, గంధర్వవిద్యాధరనాగయక్షాః,
భూతాని సర్వాణి మహాంతి తత్ర, జగ్మః పరాం ప్రీతిమతుల్యరూపామ్. 51

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే*
*చతుఃపంచాశః సర్గః*

---

బుద్ధిశాలి, శ్రేష్ఠుడగు వాయుపుత్రుని దేవతలెల్లరు పొగడిరి. 47

ఆ విధముగ మహాతేజశ్శాలి, మహాకపి యగు హనుమంతుడు అశోకవనము విఱచి, యుద్ధమున రాక్షసులను పరిమార్చి, సుందరమగు లంకానగరమును కాల్చి, మిక్కిలి ప్రకాశించెను. 48

అపుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఆ లంక అట్లు తగులబడుట గాంచి మిక్కిలి ఆశ్చర్యము నందిరి. 49

వానరశ్రేష్ఠుడగు హనుమంతుని చూచి ప్రళయాగ్ని యని తలచి సకలభూతములును భయపడెను. 50

సకలదేవతలు, మునిశ్రేష్ఠులు, గంధర్వులు, విద్యాధరులు, నాగులు, రక్షస్సులు, మహాభూతములును ఆ సన్నివేశము గాంచి సాటిలేని యానందము నందిరి. 51

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదినాల్గవ సర్గము.*

# 55. పంచపంచాశః సర్గః

*(హనుమంతుడు సీత దహింపబడెనని భీతిల్లుట)*

లంకాం సమస్తాం సందీప్య లాంగూలాగ్నిం మహాబలః,
నిర్వాపయామాస తదా సముద్రే హరిసత్తమః. 1

సందీప్యమానాం విధ్వస్తాం త్రస్తరక్షోగణాం పురీమ్,
అవేక్ష్య హనుమాన్ లంకాం చింతయామాస వానరః. 2

తస్యాభూత్ సుమహాంస్త్రాసః కుత్సా చాఽఽత్మ న్యజాయత,
లంకాం ప్రదహతా కర్మ కింస్విత్ కృతమిదం మయా. 3

ధన్యా స్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోప ముత్థితమ్,
నిరుంధంతి మహాత్మానో దీప్తమగ్ని మివాంభసా. 4

క్రుద్ధః పాపం న కుర్యాత్ కః క్రుద్ధో హన్యాద్ గురూనపి,

---

మహాబలశాలి, వానరశ్రేష్ఠుడగు హనుమంతుడు, సమస్తమైన లంకానగరమును కాల్చి, పిమ్మట తన తోకయందున్న అగ్నిని సముద్రమున చల్లార్చెను. 1

అగ్నిలో తగులబడుచు, నాశనమై, చెడి, చీకాకై, చెదరి, చెదరి, భయపడిన రాక్షస సమూహములతో కూడిన ఆ లంకను చూచి హనుమంతు డిట్లు చింతించెను. 2

అంతలో అతనికి మిక్కిలి భయము కలిగెను. తన్ను తానే నిందించుకొనెను. "అయ్యో! ఈ లంకను గాల్చుచు నేనెంత నింద్యమగు కార్యము చేసితిని! 3

ఎవరు ప్రజ్వలించు అగ్నిని నీటితో చల్లార్చినటులు తమకు కలిగిన కోపమును తమ బుద్ధితో నిరోధింపగలరో అట్టి మహాత్ములగు పురుషశ్రేష్ఠులు ధన్యులు. 4

కోపము హద్దుమీరినపుడు పాపము చేయనివా డెవడు? కోపించినవాడు పెద్దలను

క్రుద్ధః పరుషయా వాచా నర స్సాధూ నధిక్షిపేత్. 5
వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్,
నాకార్య మస్తి క్రుద్ధస్య నాఽవాచ్యం విద్యతే క్వచిత్. 6
య స్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి,
యథోరగ స్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే. 7
ధిగస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమమ్,
అచింతయిత్వా తాం సీతా మగ్నిదం స్వామిఘాతుకమ్. 8
యది దగ్ధా త్వియం లంకా నూనమార్యాఽపి జానకీ,
దగ్ధా తేన మయా భర్తు ర్హతం కార్య మజానతా. 9
యదర్థ మయ మారంభ స్తత్కార్య మవసాదితమ్,
మయా హి దహతా లంకాం న సీతా పరిరక్షితా. 10

---

కూడా చంపును. కోపించినవాడు కఠినోక్తులతో సత్పురుషుల నాక్షేపించును. 5

మిక్కిలి కోపించినవాడు ఏది పలుకవలెనో, ఏది పలుకరాదో ఎఱుగడు. అతనికి చేయరాని పని లేదు. ఎచ్చటను పలుకరానిది లేదు. 6

ఎవడు తనలో పెల్లుబికిన క్రోధమును, పాము నలిగిపోయిన కుబుసమును వీటినట్లు ఓర్పుతోడనే తొలగించుకొనునో అతడు పురుషు డనబడును. 7

దుర్బుద్ధిని, సిగ్గులేనివాడను, మహాపాపము చేసినవాడను, పూర్వాపరముల నాలోచింపక సీతాదేవిని గాల్చి, స్వామి ఘాతుకుడైన వాడను అగు నాకు నింద యగుగాక. 8

ఈ లంక పూర్తిగా తగులబడినచో, పూజ్యురాలగు జానకియు తప్పక యిందు తగులబడి యుండును. కావున, తెలియకయే నేను నా ప్రభువు కార్యము పాడుచేసితిని. 9

ఏ సీతాదేవిని వెదకుట కీ లంకాపురికి వచ్చితినో, ఆ పనిని సంపూర్ణముగ చెఱచితిని. నేను లంకను గాల్చుచు సీతను రక్షింపనైతివి. 10

ఈషత్కార్యమిదం కార్యం కృతమాసీ న్న సంశయః,
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః. 11

వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే,
లంకాయాం కశ్చి దుద్దేశ స్సర్వా భస్మీకృతా పురీ. 12

యది తద్విహతం కార్యం మమ ప్రజ్ఞావిపర్యయాత్,
ఇహైవ ప్రాణసన్న్యాసో మమాపి హ్యద్య రోచతే. 13

కిమగ్నౌ నిపతా మ్యద్య ఆహోస్వి ద్బడబాముఖే,
శరీర మాహో సత్త్వానాం దద్మి సాగరవాసినామ్. 14

కథం హి జీవతా శక్యో మయా ద్రష్టుం హరీశ్వరః,
తౌ వా పురుషశార్దూలౌ కార్యసర్వస్వఘాతినా. 15

మయా ఖలు తదేవేదం రోషదోషాత్ ప్రదర్శితమ్,

---

నిస్సంశయముగ నేను పనిని అఱకొఱగా చేసితినే గావి సమగ్రముగ కాదు. కోపపూరితుడనై నేను నా కార్యమునకు మూలమెవ్వరో ఆ సీతాదేవినే నాశనము చేసికొంటిని. 11

సీతాదేవి తప్పక నశించియుండును. ఏలన ఈ లంకలో ఏ ప్రదేశమును తగులబడనిది లేదు. నగరి సర్వము బూడిదయైనది. 12

నా అవివేకమువలననే స్వామికార్యము చెడినచో నా కిపు డిచటనే ప్రాణములు విడచుట ఇష్టమైన పని. 13

నే నిపు డగ్నిలో పడుదునా లేక బడబాగ్ని నోట బడుదునా? లేక సముద్రమందలి జీవులకు నా శరీరము నాహారముగ అర్పింతునా? 14

సకలకార్యమును చెడగొట్టిన నేను జీవించుచు వానరరాజగు సుగ్రీవుని గాని, రాజశ్రేష్ఠులగు రామలక్ష్మణులను గాని ఎట్లు చూడగలను? 15

నేను నా రోషపు దోషముచే, కోతుల స్వభావముగా ముల్లోకము లలో ప్రసిద్ధమైన

ప్రథితం త్రిషు లోకేషు కపిత్వ మనవస్థితమ్. 16

ధిగస్తు రాజసం భావ మనీశ మనవస్థితమ్,

ఈశ్వరేణాపి యద్రాగా న్మయా సీతా న రక్షితా. 17

వినష్టాయాం తు సీతాయాం తావుభౌ వినశిష్యతః,

తయో ర్వినాశే సుగ్రీవః సబన్ధు ర్వినశిష్యతి. 18

ఏత దేవ వచః శ్రుత్వా భరతో భ్రాతృవత్సలః,

ధర్మాత్మా సహశత్రుఘ్నః కథం శక్ష్యతి జీవితుమ్. 19

ఇక్ష్వాకువంశే ధర్మిష్ఠే గతే నాశ మసంశయమ్,

భవిష్యంతి ప్రజా స్సర్వా శ్శోకసంతాపపీడితాః. 20

తదహం భాగ్యరహితో లుప్తధర్మార్థసంగ్రహః,

రోషదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః. 21

---

చంచలత్వమును ప్రదర్శించితిని. 16

రజోగుణమువలన ఏర్పడిన నా యీ చేష్ట ఎందులకును కొఱగానిది, నిలుకడ లేనిది. నే నీ రజోగుణమూలకమగు క్రోధమునకు లోబడి, సమర్థుడ నయ్యు సీతాదేవిని రక్షింప జాలనైతిని. 17

సీతాదేవి మరణించుచో, రామలక్ష్మణులు జీవింపరు. వారు జీవింపనిచో సుగ్రీవుడు, అతని బంధువులును నశింతురు. 18

ఈ వార్త విని అన్నయం దనురాగముగల ధర్మాత్ముడగు భరతుడు, శత్రుఘ్నుడును ఎట్లు జీవింతురు? 19

ధర్మనిష్ఠులు ఇక్ష్వాకువంశ్యులగు రామాదులు నలుగురు నశింపగా నిస్సంశయముగా ప్రజలందరును శోకముచే పీడితులగుదురు. 20

కావున భాగ్యహీనుడనైన నేనిట్లు ధర్మార్థసంగ్రహము చేయక, రోష మను దోషము పట్టి పీడింపగా లోకమునకే చేటు తెచ్చితి ననుట స్పష్టము. 21

ఇతి చింతయత స్తస్య నిమిత్తా న్యుపపేదిరే,
పూర్వమ ప్యుపలబ్ధాని సాక్షాత్ పున రచింతయత్. 22
అథవా చారు సర్వాంగీ రక్షితా స్వేన తేజసా,
న నశిష్యతి కల్యాణీ నాగ్ని రగ్నౌ ప్రవర్తతే. 23
వ హి ధర్మాత్మన స్తస్య భార్యా మమితతేజసః,
స్వచారిత్రాభిగుప్తాం తాం స్ప్రష్టు మర్హతి పావకః. 24
నూనం రామప్రభావేణ వైదేహ్యా స్సుకృతేన చ,
యన్మాం దహనకర్మాఽయం నాదహ ద్ధవ్యవాహనః. 25
త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతా చ యా,
రామస్య చ మనఃకాంతా సా కథం వినశిష్యతి. 26
యద్వా దహనకర్మాఽయం సర్వత్ర ప్రభు రవ్యయః,

---

హనుమంతు డిట్లు తలచుచుండగనే, పూర్వము కన్పడినట్టి శుభశకునములు కలిగెను. వానిని గమనించి మరల హనుమంతు డిట్లు తలంచెను. 22

(ఈ ప్రకారము లోకదృష్టితో ఆలోచన చేసి తత్త్వదృష్టితో హనుమంతు డిట్లు తలంచెను). అయినను, అనవద్యసౌందర్యశాలిని, మంగళరూపిణి యగు సీతాదేవి కామె తేజమే రక్షకమై యుండగా ఆమె నశింపదు. అగ్ని అగ్నిని దహింపదు కదా! 23

ధర్మాత్ముడు, అమితతేజశ్శాలి యగు రాముని భార్య సీతాదేవి నామె నిర్మలమగు నడవడియే రక్షించును. అగ్ని ఆమెను తాకుటకును తగదు. 24

నిశ్చయముగా అగ్ని దహించు స్వభావము కలవాడయ్యును రాముని ప్రభావముచేతను, సీతాదేవి పున్నెపు బలిమిచేతను నన్ను కాల్పలేదు. 25

భరత లక్ష్మణ శత్రుఘ్నులకు దేవతవలె పూజనీయురాలు, రాముని మనస్సున కాహ్లాదము కలిగించునది అగు సీతాదేవి నశించుటెట్లు? 26

అగ్నికి కాల్చుట స్వభావము. దానికి నాశమన్నది లేదు. అది సర్వకాలసర్వావస్థలలో

న మే దహతి లాంగూలం కథ మార్యాం ప్రధక్ష్యతి. 27

పునశ్చాచింతయ త్తత్ర హనుమాన్ విస్మిత స్తదా,
హిరణ్యనాభస్య గిరే ర్జలమధ్యే ప్రదర్శనమ్. 28

తపసా సత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి,
అపి సా నిర్దహే దగ్నిం న తా మగ్నిః ప్రధక్ష్యతి. 29

స తథా చిన్తయం స్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహమ్,
శుశ్రావ హనుమాన్ వాక్యం చారణానాం మహాత్మనామ్. 30

అహో ఖలు కృతం కర్మ దుష్కరం హి హనూమతా,
అగ్నిం విసృజతాఽభీక్ష్ణం భీమం రాక్షసవేశ్మని. 31

ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా,
జనకోలాహలాధ్మాతా క్రందంతీ వాద్రికందరే. 32

---

దహనశక్తి కలది. అది నా తోకనే కాల్పకుండెనే. పూజ్యురాలగు సీతను కాల్చునా? 27

మఱల హనుమంతుడు సముద్రమధ్యమున మైనాకుడు దర్శన మిచ్చుట అను పూర్వవృత్తము స్మరించి, ఆశ్చర్యపడి యిట్లు తలంచెను. 28

తపముచేతను, సత్యవచనముచేతను పతియం దనన్యభక్తిచేతను సీతయే అగ్నిని దహింపగలుగును. గాని అగ్ని ఆమెను దహింపలేదు. 29

అని ఇట్లు హనుమంతుడు సీతాదేవియొక్క ధర్మనిష్ఠను తలంచుచు, మహాత్ములగు చారణులు పలుకు వాక్యములు వినెను. 30

"ఆహా ఏమి ఆశ్చర్యము! హనుమంతుడు రాక్షసుల గృహములలో భయంకరము, దుస్సహమగు అగ్నిని రగులుకొలిపి మిక్కిలి అద్భుతము, దుష్కరమగు కార్యమువే ఆచరించినాడు. 31

పారిపోవు రాక్షసవనితలు, బాలురు, వృద్ధులతో నిండినదై, జనుల కలకలములచే పెద్దధ్వని కలదై, కొండగుహలందు ప్రతిధ్వనించు నాదములచే ఆక్రందనము

దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా,
జానకీ న చ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః. 33

స నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ హనుమా నభవత్ ప్రీతమానసః. 34

తతః కపిః ప్రాప్తమనోరథార్థ, స్తా మక్షతాం రాజసుతాం విదిత్వా,
ప్రత్యక్షతస్తాం పునరేవ దృష్ట్వా, ప్రతిప్రయాణాయ మతిం చకార.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే*
*పంచపంచాశః సర్గః.*

---

చేయుచున్నది వలె నున్నదై, మిద్దెలు ప్రాకారములు ద్వారములతో కూడ సమస్తమగు ఈ లంకానగరి తగులబడినది. కాని సీత కాలకుండుట మా కాశ్చర్యము కలిగించినది". 32,33

హనుమంతు డట్లు పూర్వము ఫలితములచే పరీక్షించి నిశ్చయించుకొనబడిన శుభశకునములచేతను, సీతాపాతివ్రత్యము, రామప్రభావము మున్నగు గొప్ప గుణములను కారణములచేతను, చారణవాక్యములచేతను మదిలో ఆనందించెను. 34

పిమ్మట హనుమంతు డట్లు తన కోరిక ఈడేరగా, సీతాదేవి కే ఆపదయు కలుగలేదని తెలిసికొని , మఱల నొక్కమా రామెను దర్శించి పోవలయునని నిశ్చయించుకొనెను. 35

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదియైదవ సర్గము.*

# 56. షట్పంచాశః సర్గః

*(హనుమ తిరిగి సీతను చూచుట; సముద్రలంఘనము)*

తతస్తు శింశుపామూలే జానకీం పర్యుపస్థితామ్,
అభివా ద్యాబ్రవీ ద్దిష్ట్యా పశ్యామి త్వా మిహాక్షతామ్. 1
తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం హనుమంత మభాషత. 2
కామ మస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే బలోదయః. 3
శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయే ద్యది కాకుత్స్థ స్తత్తస్య సదృశం భవేత్. 4

---

పిమ్మట హనుమంతు డట్లు అశోకవృక్షము క్రింద కూర్చుండియున్న సీతాదేవి కడ కేగి, ఆమెకు ప్రణమిల్లి "అమ్మా! నా భాగ్యముచే వి న్నిపుడు ఏ యాపదయు లేనిదానివిగా చూచుచున్నాను" అనెను. 1

సీతాదేవియు తిరుగు ప్రయాణమునకై సిద్ధపడిన హనుమంతుని మాటిమాటికి చూచుచు,తన పతియందలి భక్తితో ఇట్లు పలికెను. 2

శత్రువీరులను సంహరించు హనుమంతుడా! నీ వొక్కడవే సర్వరాక్షసులను వధించి, నన్ను రామునకు సమర్పించజాలుదువు. కాని ఆ విధమగు బలప్రకర్షము నీకు కీర్తిని కలిగించునే కాని రామునకు కాదు. 3

అట్లు కాక శత్రుసైన్యమును చెండాడు రాముడు లంకను తన బాణములతో చీకాకుపరచి, నన్ను తీసికొని పోవునేని అది ఆయన కనురూపముగ నుండును. 4

తద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః,
భవ త్యాహవశూరస్య తథా త్వ ముపపాదయ. 5

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్య హనుమాం స్తస్యా వాక్య ముత్తర మబ్రవీత్. 6

క్షిప్ర మేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరై ర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి. 7

ఏవ మాశ్వాస్య వైదేహీం హనుమాన్ మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీ మభ్యవాదయత్. 8

తత స్స కపిశార్దూలః స్వామిసందర్శనోత్సుకః,
ఆరురోహ గిరిశ్రేష్ఠ మరిష్ట మరిమర్దనః. 9

తుంగపద్మకజుష్టాభి ర్నీలాభి ర్వనరాజిభిః,

---

కావున యుద్ధమున మహాశూరుడు మహాత్ముడగు రాముడు తనకు తగిన విధముగ పరాక్రమించునట్లు నీవు ప్రయత్నము చేయుము. 5

ఆమె పలికిన అర్థవంతము, విశ్వాసపూర్వకము, సహేతుకమును అగు వాక్యము విని, హనుమంతు డామె కిట్లు ప్రత్యుత్తర మొసగెను. 6

అమ్మా! రాముడు కోతులు, ఎలుగుల సేనతో కూడి శీఘ్రమే యిటకు రాగలడు. ఆయన యుద్ధమున శత్రువులను జయించి, నీ శోకమును పోగొట్టగలడు. 7

వాయుతనయుడగు హనుమంతు డిట్లు సీతాదేవి నోదార్చి, వెడలి పోవుటకు నిశ్చయించుకొని ఆమెకు ప్రణమిల్లెను. 8

అనంతర మా కపిశ్రేష్ఠుడు, శత్రువులను పీడించువాడగు హనుమంతుడు తన ప్రభువు శ్రీరాముని దర్శింపవలెనని యుత్కంఠకలవాడై అరిష్టమను పర్వతశ్రేష్ఠము నధిరోహించెను. 9

వాయుపుత్రుడగు హనుమంతుడు ఉన్నతములైన పద్మకము లను వృక్షములతో

సోత్తరీయ మివాంభోదైః శృంగాంతరవిలంబిభిః. 10

బోధ్యమానమివ ప్రీత్యా దివాకరకరై శ్శుభైః,

ఉన్మిషంత మివోద్ధూతై ర్లోచనై రివ ధాతుభిః. 11

తోయౌఘనిస్స్వనై ర్మంద్రైః ప్రాధీతమివ పర్వతమ్,

ప్రగీతమివ విస్పష్టై ర్నానాప్రస్రవణస్వనైః. 12

దేవదారుభి రత్యుచ్చై రూర్ధ్వబాహు మివ స్థితమ్,

ప్రపాతజలనిర్ఘోషైః ప్రాక్రుష్టమివ సర్వతః. 13

వేపమానమివ శ్యామైః కంపమానై శ్శరద్ఘనైః,

వేణుభి ర్మారుతోద్ధూతైః కూజంత మివ కీచకైః. 14

నిశ్శ్వసంత మివామర్షా ద్ఘోరై రాశీవిషోత్తమైః,

నీహారకృతగంభీరై ర్ధ్యాయంతమివ గహ్వరైః. 15

---

కూడిన నల్లని వనసమూహములచే నల్లని వస్త్రము ధరించినదివలెను, శిఖరముల నడుమ వ్రేలాడు మేఘములచే ఉత్తరీయము ధరించినదివలెను, మంగళకరములగు సూర్యకిరణముచే ప్రేమతో మేల్కొలుపబడుచున్నదివలెను, పైకి కాంతులను ప్రసరింపజేయుచున్న ధాతువులచే కన్నులతో చూచుచున్నదివలెను, జల జల ప్రవహించు సెలయేళ్ల గంభీరములగు మ్రోతలచే వేదగానము చేయుచున్నదివలెను, సుస్పష్టముగా అందు వివిధములగు జలప్రవాహములు పాఱు శబ్దములచే చక్కగా పాడుచున్నదివలెను, పొడవుగా పెరిగిన దేవదారువృక్షములచే చేతులెత్తి తపము చేయుచున్నదివలెను, చరియలనుండి జారుచున్న జలముల ధ్వనులచే అంతటను ఆక్రోశించుచున్నదివలెను, కదలుచున్న శరత్కాలపు మేఘములతో వణకుచున్నదివలెను, గాలికి కదల్చబడిన కీచకము లను వెదుళ్లధ్వనిచే కూయుచున్నదివలెను, భీకరములగు శ్రేష్ఠసర్పములు కోపముచే బుసలు కొట్టుటలచే నిశ్వసించుచున్నదివలెను, మంచుతో నిండి, ధ్యానముచే నిరోధించబడిన యింద్రియస్థానీయములగు గుహలచే

మేఘపాదనిభైః పాదైః ప్రక్రాంతమివ సర్వతః,
జృంభమాణ మివాఽఽకాశే శిఖరై రభ్రమాలిభిః. 16

కూటైశ్చ బహుధా కీర్ణై శ్శోభితం బహుకందరైః,
సాలతాళాశ్వకర్ణైశ్చ వంశైశ్చ బహుభి ర్వృతమ్. 17

లతావితానై ర్వితతైః పుష్పవద్భి రలంకృతమ్,
నానామృగగణాకీర్ణం ధాతునిష్యందభూషితమ్. 18

బహుప్రస్రవణోపేతం శిలాసంచయసంకటమ్,
మహర్షియక్షగంధర్వ కిన్నరోరగసేవితమ్. 19

లతాపాదపసంఘాతం సింహాధ్యుషితకందరమ్,
వ్యాఘ్రసంఘసమాకీర్ణం స్వాదుమూలఫలద్రుమమ్. 20

తమారురోహ హనుమాన్ పర్వతం పవనాత్మజః,
రామదర్శనశీఘ్రేణ ప్రహర్షే ణాభిచోదితః. 21

ధ్యానించుచున్నది వలెను, మబ్బుల పాదముల వలె నొప్పు చిన్నపర్వతములచే అన్ని వైపులకును నడుచుచున్నదివలెను, బారులు తీరిన మేఘముల నొఱయుచున్న శిఖరములచే ఆకాశమున ఆవులించుచున్నదివలె ఉన్నదియు, పలు విధములుగా వ్యాపించిన అనేక గుహలతో శోభిల్లుచున్నదియు, మద్ది, తాడి, అశ్వకర్ణములు, వెదుళ్ల అనేకములతో వ్యాప్తమైనదియు, అంతటను వ్యాపించిన తీగ లనేకములు పూయగా వానిచే నలంకరింపబడినదియు, వివిధములగు మృగసమూహములతో వ్యాప్తమైవదియు, ధాతు స్రావములచే నలంకృతమైనదియు, అనేక ప్రవాహములతో కూడినదియు, శిలాసమూహములతో నిండినదియు, మహర్షులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, ఉరగుల కావాసమైనదియు, తీగలు, చెట్ల సమూహములు కలదియు, సింహముల కావాసమైన గుహలు గలదియు, పులులతో వ్యాప్తమైనదియు, ఆస్వాద్యములగు దుంపలు, పండ్లు కలదియు అగు అరిష్టపర్వతమును రాముని దర్శింపవలెనను తొందర, హర్షము ప్రేరింపగా అధిరోహించెను. 10-21

తేన పాదతలాక్రాంతా రమ్యేషు గిరిసానుషు,
సఘోషా స్సమశీర్యంత శిలా శ్చూర్ణీకృతా స్తతః. 22

స త మారుహ్య శైలేంద్రం వ్యవర్ధత మహాకపిః,
దక్షిణా దుత్తరం పారం ప్రార్థయన్ లవణాంభసః. 23

అధిరుహ్య తతో వీరః పర్వతం పవనాత్మజః,
దదర్శ సాగరం భీమం మీనోరగనిషేవితమ్. 24

స మారుత ఇవాకాశం మారుతస్యాత్మసంభవః,
ప్రపేదే హరిశార్దూలో దక్షిణా దుత్తరాం దిశమ్. 25

స తదా పీడిత స్తేన కపినా పర్వతోత్తమః,
రరాస సహ తై ర్భూతైః ప్రవిశన్ వసుధాతలమ్,
కంపమానైశ్చ శిఖరైః పతద్భిరపి చ ద్రుమైః. 26

---

సుందరములగు కొండచరియలయందలి శిలలపై హనుమంతు డెక్కి తొక్కగా అవి పెద్ద మ్రోతతో చూర్ణములై దొరలి వడెను. 22

అపు డా మహాకపి హనుమంతు డా శైలరాజము నధిరోహించి సముద్రపు దక్షిణతీరము నుండి యుత్తరతీరమునకు పోవగోరి శరీరమును పెంచెను. 23

వాయుపుత్రు డగు హనుమంతు డా పర్వతము నెక్కి చేపలతో, పాములతో కూడి భీకరమైన సముద్రమును చూచెను. 24

వాయుదేవుని తనయుడగు హనుమంతుడు వాయుదేవునివలె వేగముగ పయనించి దక్షిణమునుండి ఉత్తరదిశకు పోయెను. 25

ఆ సమయమున హనుమంతుడు గట్టిగా పీడించిన ఆ అరిష్టమను పర్వతము, కదలుచున్న శిఖరములతో, పడిపోవుచున్న చెట్లతో పాతాళమున దిగబడుచుండగా అందలి సకలప్రాణులును పెద్ద నాదము చేసెను. 26

పూచిన చెట్లు హనుమంతుని తొడల వేగముచే పీడింపబడినవై, వజ్రాయుధముచే

తస్యోరువేగోన్మథితాః పాదపాః పుష్పశాలినః,
నిపేతు ర్భూతలే రుగ్ణా శ్చక్రాయుధహతా ఇవ. 27

కందరాంతరసంస్థానాం పీడితానాం మహౌజసామ్,
సింహానాం నినదో భీమో నభో భిందన్ స శుశ్రువే. 28

స్రస్తవ్యావిద్ధవసనా వ్యాకులీకృతభూషణాః,
విద్యాధర్య స్సముత్పేతుః సహసా ధరణీధరాత్. 29

అతిప్రమాణా బలినో దీప్తజిహ్వా మహావిషాః,
నిపీడితశిరోగ్రీవా వ్యవేష్టంత మహాహయః. 30

పీడితం తం నగవరం త్యక్త్వా గగన మాస్థితాః. 31

స చ భూమిధరః శ్రీమాన్ బలినా తేన పీడితః,
సవృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలమ్. 32

---

కొట్టబడినట్లు విఱిగి నేల గూలెను. 27

గుహల అంతర్భాగములందున్న, మహాబలము కల సింహములు హనుమంతుని పాదఘట్టనముచే పీడింపబడి అఱవగా ఆ ధ్వని ఆకసమును చీల్చుచు వినబడెను. 28

భయంకరమగు ఆ సింహముల అఱపులచే బెదరిన విద్యాధరాంగనలు భయముచే తమ వస్త్రములు జారి, చిందర వందరలు కాగా, ఆభరణములు స్థానములు తప్పగా ఆ పర్వతమునుండి ఆకసమున కెగసిరి. 29

పెనుశరీరముగలవి, బలవంతములైనవి, ప్రకాశించు ఎఱ్ఱని నాల్కలు కలవి, ఘోరవిషము కలవి అగు సర్పముల తలలు, మెడలు పగిలిపోగా, అవి చుట్టచుట్టుకొని పోయెను. 30

కిన్నరులు , ఉరగులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులును అపు డట్లు హనుమంతుడు అణచివేసిన యా పర్వతమును వీడి యాకాశమును చేరుకొనిరి. 31

శ్రీనుంతము, వృక్షములతో కూడిన శిఖరములతో విలసిల్లు ఆ అరిష్టమను పర్వతము, బలిష్ఠుడగు హనుమంతునిచే పీడింపబడినదై పాతాళము జొచ్చెను. 32

దశయోజనవిస్తార స్త్రింశద్యోజన ముచ్ఛ్రితః,
ధరణ్యాం సమతాం యాతః స బభూవ ధరాధరః. 33

స లిలంఘయిషు ర్భీమం సలీలం లవణార్ణవమ్,
కల్లోలాస్ఫాలవేలాంత ముత్పపాత నభో హరిః. 34

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షట్పంచాశః సర్గః.*

---

పది యోజనములు వెడల్పు, ముప్పది యోజనములు ఎత్తైనదగు ఆ అరిష్టమను పర్వత మపుడు భూమితో సమానముగ అణగెను. 33

ఆ హనుమంతు డట్లు తరంగములతో కొట్టబడిన తీరప్రదేశము గల భయంకరమగు సముద్రము నవలీలగ దాటగోరినవాడై ఆకాశముపై కెగిరెను. 34

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున
సుందరకాండమున ఏబదియారవ సర్గము.*

# 57. సప్తపంచాశః సర్గః

*(హనుమంతుడు తిరిగి వానరులను కలసికొనుట)*

సచంద్రకుముదం రమ్యం సార్కకారండవం శుభమ్,
తిష్యశ్రవణకాదంబ మభ్రశైవాలశాద్వలమ్. 1
పునర్వసుమహామీనం లోహితాంగమహాగ్రహమ్,
ఐరావతమహాద్వీపం స్వాతీహంసవిలోళితమ్. 2
వాతసంఘాతజాతోర్మి చంద్రాంశుశిశిరాంబుమత్,
భుజంగయక్షగంధర్వ ప్రబుద్ధకమలోత్పలమ్. 3
హనుమాన్ మారుతగతి ర్మహానౌ రివ సాగరమ్,
అపార మపరిశ్రాంతః పుప్లువే గగనార్ణవమ్. 4
గ్రసమాన ఇవాకాశం తారాధిప మివోల్లిఖన్,

---

చంద్రుడు తెల్లకలువగా, సూర్యుడు నీరుకోడిగా, పుష్యశ్రవణనక్షత్రములు కలహంసలుగా, మేఘములు నాచు మరియు తీరపు పచ్చిక భూమిగా, పునర్వసు నక్షత్రము పెనుమీనుగా, అంగారకగ్రహము పెనుమొసలిగా, ఐరావతము మహాద్వీపముగా, స్వాతీనక్షత్రము హంసగా, గాలితాకిడిచే పుట్టు అలల వంటి చంద్రకిరణములు చల్లని నీరుగా, ఆ యా వర్ణములతో నొప్పు ఉరగులు, యక్షులు, గంధర్వులు వికసించిన తామరలు, కలువలుగా అపారమై రెండవ సముద్రమువలె రమణీయమై విలసిల్లు ఆకాశమును అలసటలేక పెద్దనావ సముద్రమును దాటునట్లు హనుమంతుడు వాయువేగముతో ఎగిరెను. 1-4

శ్రీమంతుడు, వాయుపుత్రుడు, ఆకాశచారి, మహాత్ముడు అగు హనుమంతుడు

హరన్నివ సనక్షత్రం గగనం సార్కమండలమ్. 5
మారుత స్యాత్మజః శ్రీమాన్ కపిర్ వ్యోమచరో మహాన్,
హనుమాన్ మేఘజాలాని వికర్షన్నివ గచ్ఛతి. 6
పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ,
హరితారుణవర్ణాని మహాభ్రాణి చకాశిరే. 7
ప్రవిశ న్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే. 8
వివిధాభ్రఘనాపన్నగోచరో ధవళాంబరః,
దృశ్యాదృశ్యతను ర్వీర స్తదా చంద్రాయతేఽంబరే. 9
తార్క్ష్యాయమాణో గగనే బభాసే వాయునందనః,
దారయన్ మేఘబృందాని నిష్పతంశ్చ పునః పునః.

---

ఆకాశమును మ్రింగువానివలె, చంద్రుని గోళ్లతో గీరుచున్న వానివలె, నక్షత్రములు, సూర్యమండలములతో కూడిన ఆకాశమును హరించుచున్నవానివలె, మేఘములను ఆకర్షించుచున్నవానివలెను పోవసాగెను. 5,6

అపు డా మహామేఘములు హనుమంతునితో సంపర్కమువల్ల తెల్లనివిగాను, కొంచెము ఎఱ్ఱనివిగాను, నల్లనివిగాను, పసుపువన్నె కలవిగాను, ఆకుపచ్చనివిగాను, మిక్కిలి ఎఱ్ఱనివిగాను ప్రకాశించినవి. 7

హనుమంతు డా మేఘసమూహములోనికి పోవుచు, వెడలుచు, కొంతతడ వగపడి, అగపడక చంద్రునివలె చూపట్టెను. 8

అనేకవిధములుగా మేఘసమూహము నడుమ సంచరించు, శ్వేతవస్త్రధారి, వీరుడగు హనుమంతు డొకప్పు డగపడి వేఱొకప్పు డగపడక ఆకాశమున చంద్రునివలె నుండెను. 9

మాటిమాటికి మేఘసంఘములను చీల్చుకొని లోనికి పోవుచు, మరల వెడలుచు, మేఘగర్జనను బోలు మహాధ్వని కల ఆ హనుమంతు డాకాశమున గరుత్మంతునివలె

నద న్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః. 10

ప్రవరాన్ రాక్షసాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః,
ఆకులాం నగరీం కృత్వా వ్యథయిత్వా చ రావణమ్. 11

అర్దయిత్వా బలం ఘోరం వైదేహీ మభివాద్య చ,
ఆజగామ మహాతేజాః పున ర్మధ్యేన సాగరమ్. 12

పర్వతేంద్రం సునాభం చ సముపస్పృశ్య వీర్యవాన్,
జ్యాముక్త ఇవ నారాచో మహావేగో ఽభ్యుపాగతః. 13

స కించి దనుసంప్రాప్తః సమాలోక్య మహాగిరిమ్,
మహేంద్రం మేఘసంకాశం ననాద హరిపుంగవః. 14

స పూరయామాస కపి ర్దిశో దశ సమంతతః,
నద న్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః. 15

---

ప్రకాశించెను. 10

తేజశ్శాలి యగు హనుమంతుడు శ్రేష్ఠులగు రాక్షసులను చంపి, తన పేరును ప్రకటించుకొని, లంకానగరమును కల్లోలిత మొనర్చి, భయంకరమగు రాక్షససేనను నాశమొనర్చి, సీతాదేవికి ప్రణమిల్లినవాడై మఱల సముద్రము దాట మొదలిడి నడుమకు వచ్చెను. 11,12

పరాక్రమశాలి యగు హనుమంతు డట్లు మహావేగముకలవాడై, పర్వతశ్రేష్ఠుడగు మైనాకుని హస్తస్పర్శతో తృప్తి నొందించి, అల్లెత్రాటి నుండి వెలువడిన బాణమువలె మహావేగముతో పోయెను. 13

వానరశ్రేష్ఠుడగు హనుమంతు డటు లొకింత దూరము గడచి, మేఘమువలె ఉన్నతమైన మహేంద్రపర్వతమును చూచి ఆనందముతో సింహనాదము చేసెను. 14

మేఘగర్జనను బోలు మహాధ్వని కల హనుమంతు డట్లు మహానాదము చేసి ఆ ధ్వనితో దశదిశలను పూరించెను. 15

స తం దేశ మనుప్రాప్తః సుహృద్దర్శనలాలసః,
ననాద హరిశార్దూలో లాంగూలం చాప్యకంపయత్. 16
తస్య నానద్యమానస్య సుపర్ణచరితే పథి,
ఫలతీ వాస్య ఘోషేణ గగనం సార్కమండలమ్. 17
యే తు తత్రోత్తరే తీరే సముద్రస్య మహాబలాః,
పూర్వం సంవిష్ఠితా శ్శూరా వాయుపుత్రదిదృక్షవః. 18
మహతో వాతనున్నస్య తోయదస్యేవ గర్జితమ్,
శుశ్రువు స్తే తదా ఘోష మూరువేగం హనూమతః. 19
తే దీనమనస స్సర్వే శుశ్రువుః కాననౌకసః,
వానరేంద్రస్య నిర్ఘోషం పర్జన్యనినదోపమమ్. 20
నిశమ్య నదతో నదం వానరాస్తే సమంతతః,

---

కపిశ్రేష్ఠుడగు హనుమంతు డా ప్రదేశమునకు వచ్చి, తన మిత్రులను చూడవలయునను వేడుక కలవాడై, అట్లు సింహనాద మొనర్చి తన తోకను కదల్చెను. 16

గరుత్మంతుని గమనప్రదేశమగు ఆకాశమున సింహనాదము చేయుచున్న ఆ హనుమంతుని ధ్వనికి ఆకాశము సూర్యమండలముతో కూడ బ్రద్దలగుచున్నదా అనిపించెను. 17

ఆ సముద్రపు ఉత్తరతీరముననున్నవారును, మహాబలశాలురును, హనుమంతుని రాకకు వీక్షించుచున్నవారును అగు వానరశ్రేష్ఠులు, వాయుప్రేరితమైన మహామేఘపు గర్జనను పోలు, తొడల వేగముచే ఏర్పడిన ధ్వనిని వినిరి. 18,19

హనుమంతుడు రాకుండుటచే అంతవఱకు నిరుత్సాహులై యున్న ఆ వానరు లందఱును మేఘగర్జనవంటి సింహనాదము వినిరి. 20

ఆ ధ్వని వినిన వానరులందరును, తమ మిత్రుడగు హనుమంతుని చూడగోరినవారై,

బభూవు రుత్సుకా స్సర్వే సుహృద్దర్శనకాంక్షిణః. 21
జాంబవాన్ స హరిశ్రేష్ఠః ప్రీతిసంహృష్టమానసః,
ఉపామంత్ర్య హరీన్ సర్వా నిదం వచన మబ్రవీత్. 22
సర్వథా కృతకార్యోఽసౌ హనుమా న్నాత్ర సంశయః,
న హ్యస్యాకృతకార్యస్య నాద ఏవంవిధో భవేత్. 23
తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః,
నిశమ్య హరయో హృష్టాః సముత్పేతు స్తత స్తతః. 24
తే నగాగ్రా న్నగాగ్రాణి శిఖరా చ్ఛిఖరాణి చ,
ప్రహృష్టా స్సమపద్యంత హనూమంతం దిదృక్షవః. 25
తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖా స్సువిష్ఠితాః,
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యంత వానరాః. 26

---

మిక్కిలి యుత్కంఠితులైరి. 21

అంత, వానరశ్రేష్ఠుడగు జాంబవంతుడు, సంతుష్టాంతరంగుడై, వానరు లెల్లరను రావించి ఇట్లనెను. 22

హనుమంతు డన్ని విధములుగ కార్యము సాధించి వచ్చుచున్నాడు. ఇందేమాత్రము సందేహము లేదు. అట్లు కార్యము సాధింపనిచో హనుమంతుని నాద మిట్లుండదు. 23

మహాత్ముడగు హనుమంతుని బాహువేగము, ఊరువేగమును, సింహనాదమును విని ఆనందించివారై కోతు లట నట గంతులు వేసిరి. వారు హనుమంతుని చూడగోరిన వారై, ఒక చెట్టుకొననుండి వేఱొక చెట్టుకొనకు, ఒక కొండకొననుండి వేఱొక పర్వతాగ్రము నకు ఆనందముతో దూకసాగిరి. 24,25

వా రట్లు హర్షము నొంది వృక్షాగ్రమున కెగబ్రాకి, కొమ్మలను పట్టుకొని కూర్చుండినవారై, (దూరమం దున్న తమవారిని రమ్మని పిలుచుటకు మనుజులు వస్త్రము కదలించినట్లు) హనుమంతు నాహ్వానించుచు పెద్దకొమ్మలు కదలించిరి. 26

గిరిగహ్వరసంలీనో యథా గర్జతి మారుతః,
ఏవం జగర్జ బలవాన్ హనుమాన్ మారుతాత్మజః. 27

తమభ్రఘనసంకాశ మాపతంతం మహాకపిమ్,
దృష్ట్వా తే వానరా స్సర్వే తస్థుః ప్రాంజలయ స్తదా. 28

తతస్తు వేగవాం స్తస్య గిరే ర్గిరినిభః కపిః,
నిపపాత మహేంద్రస్య శిఖరే పాదపాకులే. 29

హర్షేణాపూర్యమాణోఽసౌ రమ్యే పర్వతనిర్ఝరే,
ఛిన్నపక్ష ఇవాఽఽకాశాత్ పపాత ధరణీధరః. 30

తతస్తే ప్రీతమనసః సర్వే వానరపుంగవాః,
హనుమంతం మహాత్మానం పరివా ర్యోపతస్థిరే. 31

పరివార్య చ తే సర్వే పరాం ప్రీతి ముపాగతాః. 32

---

బలవంతుడును, వాయుపుత్రుడును అగు హనుమంతుడు, వాయువు కొండగుహలో చేరి గర్జించినట్లు గర్జన చేసెను. 27

మేఘసమూహమువలె నొప్పుచు వచ్చుచున్న ఆ మహాకపి హనుమంతుని చూచి, వానరు లెల్లరు కేలుమోడ్చి నిలచిరి. 28

వేగవంతుడును, పర్వతమువలె పెనుమేను కలవాడును అగు హనుమంతు డట్లు వృక్షములతో వ్యాప్తమైన మహేంద్రపర్వతశిఖరముపై వ్రాలెను. 29

హనుమంతుడు తిరిగి తనవారిని కలిసికొనుచుంటినని సంతుష్టాంతరంగుడై సుందరమును, ప్రవహించు సెలయేళ్లు కలదియు అగు పర్వతశిఖరముపై లెక్కలు తెగిన కొండవలె ఆకాశమునుండి వ్రాలెను. 30

హనుమంతుని రాకచే ఆనందించిన వానరశ్రేష్ఠు లందఱును మహాత్ముడగు ఆయన చుట్టును చేరి నిలచిరి. 31

అట్లాయనను పరివేష్టించి వారెంతో ప్రీతిని పొందిరి. 32

ప్రహృష్టవదనా స్సర్వే తమరోగ ముపాగతమ్,
ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలాని చ,
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజమ్. 33

హనుమాంస్తు గురూన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాం స్తదా,
కుమార మంగదం చైవ సోఽవందత మహాకపిః. 34

స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః,
దృష్టా సీతేతి విక్రాంత స్సంక్షేపేణ న్యవేదయత్. 35

నిషసాద చ హస్తేన గృహీత్వా వాలిన స్సుతమ్,
రమణీయే వనోద్దేశే మహేంద్రస్య గిరే స్తదా. 36

హనుమా నబ్రవీ ద్దృష్ట స్తదా తాన్ వానరర్షభాన్. 37

అశోకవనికాసంస్థా దృష్టా సా జనకాత్మజా,
రక్ష్యమాణా సుఘోరాభీ రాక్షసీభి రనిందితా. 38

---

ముఖమున ఆనందము వెలయగా వానరు లందరును, ఏ బాధయు లేక క్షేమముగ మఱలివచ్చిన వాయుపుత్రుడు, కపిశ్రేష్ఠుడగు హనుమంతునకు దుంపలు, పండ్లు, కానుకల నిచ్చి పూజించిరి. 33

మహాకపి యగు హనుమంతుడు పూజనీయులు, పెద్దలగు జాంబవంతుడు మున్నగు వారికి, యువరాజగు అంగదునికి వందన మొనర్చెను. 34

తిరిగి ఆ జాంబవంతుడు అంగదుడు నత్కరింపగా హనుమంతుడు "చూచితి సీత" నని సంక్షేపముగ నివేదించెను. 35

పిమ్మట వాలితనయుడగు అంగదుని కౌగిలించుకొనినవాడై ఆ మహేంద్రపర్వతమందలి సుందరవనప్రదేశమున కూర్చుండెను. 36

అపు డా హనుమంతుడు హర్షముతో ఆ వానరశ్రేష్ఠుల కిట్లనెను. 37

'అశోకవనమందు అనిందితయగు సీతాదేవిని చూచితిని. ఆమెకు భయంకర స్త్రీలు కావలియుండిరి. 38

ఏకవేణీధరా బాలా రామదర్శనలాలసా,
ఉపవాసపరిశ్రాంతా జటిలా మలినా కృశా. 39

తతో దృష్టేతి వచనం మహార్థ మమృతోపమమ్,
నిశమ్య మారుతే స్సర్వే ముదితా వానరా భవన్. 40

క్ష్వేళంత్యన్యే నదంత్యన్యే గర్జంత్యన్యే మహాబలాః,
చక్రుః కిలికిలా మన్యే ప్రతిగర్జంతి చాపరే. 41

కేచి దుచ్ఛ్రితలాంగూలాః ప్రహృష్టాః కపికుంజరాః,
అంచితాయతదీర్ఘాణి లాంగూలాని ప్రవివ్యథుః. 42

అపరే చ హనూమంతం వానరా వారణోపమమ్,
ఆప్లుత్య గిరిశృంగేభ్యః సంస్పృశంతి స్మ హర్షితాః. 43

ఉక్తవాక్యం హనూమంత మంగద స్త మథాబ్రవీత్,

---

ఆమె ఒంటిజడ ధరించి రాముని దర్శనమునకై పరితపించుచు, ఉపవాసములచే అలసి, జడలు దాల్చి, మలినాంగియై, కృశించుచున్నది' అని తెలిపెను. 39

అపుడు, గొప్ప అర్థముకలది, అమృతమునకు సాటియైనదగు హనుమంతుని "చూచితిని" అన్న మాటను విని వానరు లందఱును ఆనందించిరి. 40

అందు కొందరు సింహనాదము చేసిరి. కొంద రేవేవో ధ్వనులు చేసిరి. మహాబల వంతులగు వానరులు కొందరు గర్జించిరి. మఱికొందరు తమ జాతిస్వభావమగు కిచకిచధ్వని చేసిరి. తక్కినవారు దానికి ప్రతిగర్జన మొనర్చిరి. 41

అట్లు మిక్కిలి యానందించిన కొందరు వానరముఖ్యులు, సుందరములై, లావై, పొడవైన తమ తోకల నెత్తి నేలకు కొట్టిరి. 42

మఱికొందరు వానరులు కొండకొనలనుండి క్రిందకు దూకి, హర్షముతో ఏనుగువలె నున్న హనుమంతుని స్పృశించిరి. 43

హనుమంతు డట్లు పలికిన పిమ్మట, వానరవీరుల నడుమనున్న అంగదు డతనితో

సర్వేషాం హరివీరాణాం మధ్యే వచన ముత్తమమ్. 44
సత్త్వే వీర్యే న తే కశ్చిత్ సమో వానర విద్యతే,
యదవప్లుత్య విస్తీర్ణం సాగరం పునరాగతః. 45
అహో స్వామిని తే భక్తి రహో వీర్య మహో ధృతిః,
దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ,
దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్స్థః శోకం సీతావియోగజమ్. 46
తతోఽ_ంగదం హనూమంతం జాంబవంతం చ వానరాః,
పరివార్య ప్రముదితా భేజిరే విపులా శ్శిలాః. 47
శ్రోతుకామా స్సముద్రస్య లంఘనం వానరోత్తమాః,
దర్శనం చాపి లంకాయా స్సీతాయా రావణస్య చ,
తస్థుః ప్రాంజలయ స్సర్వే హనుమద్వదనోన్ముఖాః. 48

---

ని ట్లుత్తమమగు మాట పలికెను. 44

ఓ వానరుడా! నీ నీ విస్తీర్ణమగు సముద్రము దాటిపోయి, మఱల నట్లే రాగలిగితివి. బలపరాక్రమములలో నీకు సాటియగువాడు కనబడడు. 45

అహో ఏమీ నీ ప్రభుభక్తి! ఏమి పరాక్రమము! ఏమి నీ ధైర్యము! అదృష్టవశముచే రామునిభార్య కీర్తిశాలిని యగు సీతాదేవిని చూడ గలిగితివి. భాగ్యవశముచే రాము డింక సీతావియోగమువలన కలిగిన శోకము వీడగలడు. 46

అంత తక్కిన వానరు లందఱును అంగదుని, హనుమంతుని, జాంబవంతుని పరివేష్టించి, పెద్ద పెద్ద రాలపై కూర్చుండిరి. 47

ఆ వానరశ్రేష్ఠు లెల్లరును హనుమ సముద్రము దాటుటను, లంకను, సీతను, రావణుని చూచుటను వినగోరినవారై, చేతులు జోడించి, హనుమంతుని ముఖము చూచుచుండిరి. 48

తస్థౌ తత్రాంగదః శ్రీమాన్ వానరైర్బహుభి ర్వృతః,
ఉపాస్యమానో విబుధైర్దివి దేవపతి ర్యథా. 49

హనూమతా కీర్తిమతా యశస్వినా,
తథాంగదే నాంగదబద్ధబాహునా,
ముదా తదాఽ ధ్యాసిత మున్నతం మహ,
న్మహీధరాగ్రం జ్వలితం శ్రియాఽ భవత్. 50

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తపంచాశః సర్గః.*

---

అచట శ్రీమంతుడగు అంగదుడు స్వర్గలోకమున దేవగణములచే సేవింపబడు దేవేంద్రునివలె వానరు లనేకులతో పరివేష్టితుడై యుండెను. 49

బుద్ధికౌశలమువలన కలిగిన కీర్తితో విలసిల్లు హనుమంతుడును, భుజములకు బాహుపురులు దాల్చి శౌర్యజన్యనుగు యశస్సుతో రాజిల్లు అంగదుడును, ఆనందముతో నధిష్ఠించి యున్న ఉన్నతమగు ఆ మహేంద్రశిఖరము మిక్కిలి శోభతో తేజరిల్లెను. 50

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదియేడవ సర్గము.*

# 58. అష్టపంచాశః సర్గః

*(హనుమ వానరులకు లంకావృత్తాంతము తెలుపుట)*

తత స్తస్య గిరేః శృంగే మహేంద్రస్య మహాబలాః,
హనుమత్ప్రముఖాః ప్రీతిం హరయో జగ్ము రుత్తమామ్. 1

తం తతః ప్రీతిసంహృష్టః ప్రీతిమంతం మహాకపిమ్,
జాంబవాన్ కార్యవృత్తాంత మపృచ్ఛ దనిలాత్మజమ్. 2

కథం దృష్టా త్వయా దేవీ కథం వా తత్ర వర్తతే,
తస్యాం వా స కథంవృత్తః క్రూరకర్మా దశాననః. 3

తత్త్వత స్సర్వ మేత న్నః ప్రబ్రూహి త్వం మహాకపే,
శ్రుతార్థా శ్చింతయిష్యామో భూయః కార్యవినిశ్చయమ్. 4

యశ్చార్థ స్తత్ర వక్తవ్యో గతై రస్మాభి రాత్మవాన్,

---

అపుడు మహాబలవంతులగు హనుమంతుడు మున్నగు వానరులు మహేంద్రపర్వత శిఖరమున కలసికొని మిక్కిలి సంతోషము పొందిరి. 1

అంత జాంబవంతుడు సంతోషముతో పులకితుడై, సంతుష్టుడైన వాయుపుత్రుడగు హనుమంతుని "సీతాదేవిని చూచి వచ్చిన విధము తెలుపు"మని యడిగెను. 2

ఓ హనుమంతుడా! నీవు సీతాదేవి నెట్లు చూచితివి? ఆమె యట నెట్లున్నది? క్రూరకార్యములు చేయు రావణు డామె విషయమువ నెట్లు ప్రవర్తించుచున్నాడు? 3

ఓ మహావానరుడా! నీ వీ విషయమంతయు యథాతథముగ మాకు తెలుపుము. దానిని విని మఱల నేమి చేయుటయో ఆలోచించుదము. 4

మనము కిష్కింథకు పోయి, రాముని సన్నిధిలో ఏమి చెప్పవలయునో, దేనిని

రక్షితవ్యం చ యత్తత్ర తద్భవాన్ వ్యాకరోతు నః. 5

స నియుక్త స్తత స్తేన సంప్రహృష్టతనూరుహః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత. 6

ప్రత్యక్షమేవ భవతాం మహేంద్రాగ్రాత్ ఖమాప్లుతః,
ఉదధేర్దక్షిణం పారం కాంక్షమాణ స్సమాహితః. 7

గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూప మివాభవత్,
కాంచనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్. 8

స్థితం పంథాన మావృత్య మేనే విఘ్నం చ తం నగమ్,
ఉపసంగమ్య తం దివ్యం కాంచనం నగసత్తమమ్. 9

కృతా మే మనసా బుద్ధి ర్భేత్తవ్యోఽయం మయేతి చ,
ప్రహతం చ మయా తస్య లాంగూలేన మహాగిరేః,

---

దాచవలయునో బుద్ధిమంతుడ వగు నీవు మాకు వివరింపుము. 5

అంత హనుమంతు డట్లు జాంబవంతుని మాట విని, సంతోషముచే ఒడలు పులకరింపగా, సీతాదేవికి ప్రణమిల్లి యిట్లు పలికెను. 6

నేను మీరు చూచుచుండగనే సముద్రపు దక్షిణతీరము చేరదలచుచు ఏకాగ్రతతో, మహేంద్రపర్వతమునుండి ఆకాశమువ కెగిరితిని. 7

నే నట్లు ఆకాశమున పోవుచుండగా బంగారుశిఖరములు కలిగి దివ్యము , మిక్కిలి సుందరమగు పర్వత మొకటి నాకు భయంకరవిఘ్నమువలె (నా మార్గమును నిరోధించుచున్నది వలె) కనుపించినది. 8

నా మార్గము నావరించియున్న యా దివ్యమగు బంగారుకొండ చెంత కేగి, దానిని నా ప్రయాణమునకు విఘ్నముగా భావించితిని. 9

నే నీ కొండను వగులగొట్టవలెనని మదిలో నిశ్చయించితిని. తోడనే నా తోకతో ఆ మహాపర్వతమును కొట్టగా, సూర్యునివలె ప్రకాశించు ఆ కొండ వేయి

శిఖరం సూర్యసంకాశం వ్యశీర్యత సహస్రధా. 10

వ్యవసాయం చ తం బుద్ధ్వా స హోవాచ మహాగిరిః,
పుత్రేతి మధురాం వాణీం మనః ప్రహ్లాదయన్నివ. 11

పితృవ్యం చాపి మాం విద్ధి సఖాయం మాతరిశ్వనః,
మైనాకమితి విఖ్యాతం నివసంతం మహోదధౌ. 12

పక్షవంతః పురా పుత్ర బభూవుః పర్వతోత్తమాః,
ఛందతః పృథివీం చేరు ర్బాధమానా స్సమంతతః. 13

శ్రుత్వా నగానాం చరితం మహేంద్రః పాకశాసనః,
చిచ్ఛేద భగవాన్ పక్షాన్ వజ్రే ణైషాం సహస్రశః. 14

అహం తు మోక్షిత స్తస్మాత్తవ పిత్రా మహాత్మనా,
మారుతేన తదా వత్స ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే. 15

---

ముక్కలయ్యెను. 10

అపు డా మహాపర్వతము (తన్ను ముక్కలు చేయదలచు) నా ప్రయత్నము తెలిసికొని, పుత్రా! యని మధురముగ పలికి, నా మనస్సున కానందము కలిగించుచు నిట్లనెను. 11

నేను నీ తండ్రి వాయుదేవునకు మిత్రుడ నగుటచే నీకు పినతండ్రిని. నాపేరు మైనాకుడు. సముద్రము నా నివాసము. 12

నాయనా! పూర్వము శ్రేష్ఠములగు పర్వతము లన్నింటికి ఱెక్క లుండెడివి. ఆ ఱెక్కలతో అవి భూమిపై నెల్లెడల సంచరించుచు, ప్రాణులను బాధించుచుండెడివి. 13

అంత పాకాసురుని చంపిన మహాత్ముడగు దేవేంద్రుడా పర్వతముల దుష్టచేష్ట నెఱిగి, వాని ఱెక్కలను తన వజ్రాయుధముతో వేయి ముక్కలు చేసెను. 14

నాయనా! మహాత్ముడగు నీ తండ్రి వాయుదేవుడు న న్నా దేవేంద్రుని బారినుండి విడిపించినాడు. ఆయనయే న న్నిపు డీ సముద్రమున పడవైచి, దేవేంద్రుని కగపడకుండునట్లు చేసినాడు. 15

రామస్య చ మయా సాహ్యే వర్తితవ్య మరిందమ,
రామో ధర్మభృతాం శ్రేష్ఠో మహేంద్రసమవిక్రమః. 16

ఏత చ్ఛ్రుత్వా వచ స్తస్య మైనాకస్య మహాత్మనః,
కార్య మావేద్య తు గిరే రుద్యతం చ మనో మమ. 17

తేన చాహ మనుజ్ఞాతో మైనాకేన మహాత్మనా. 18

స చాప్యన్తర్హిత శ్శైలో మానుషేణ వపుష్మతా,
శరీరేణ మహాశైలః శైలేన చ మహోదధౌ. 19

ఉత్తమం జవ మాస్థాయ శేషం పన్థాన మాస్థితః,
తతోఽహం సుచిరం కాలం వేగే నాభ్యగమం పథి. 20

తతః పశ్యా మ్యహం దేవీం సురసాం నాగమాతరమ్,
సముద్రమధ్యే సా దేవీ వచనం మామభాషత. 21

---

ఓ శత్రువుల నణచువాడా! నేను రామునకు సహాయము చేయవలయును. రాముడు ధార్మికులలో శ్రేష్ఠుడు. దేవేంద్రునకు సాటియగు పరాక్రమము కలవాడు. 16

అట్లు పలికిన మహాత్ముడగు మైనాకుని వచనము విని, వే నాయనకు నా కార్యము తెలిపి, తిరిగి ప్రయాణము చేయ నుద్యమించితిని. 17

మహాత్ముడగు మైనాకుడును నన్నట్లు పోవుట కనుమతించెను. 18

అంతవఱకు మనుష్యశరీరము దాల్చి నాతో మాటలాడిన యా కొండ మానవరూపము మరుగు పఱచి, పెద్ద కొండరూపముతో సముద్రమున నిలచెను. 19

నేనును మహావేగముతో మిగిలిన మార్గమున పోవుచుంటిని. అట్లు చాలాకాలము వేగముగ ఆకాశమార్గమున పోయితిని. 20

అట్లు పోవుచు సర్పములకు తల్లియగు సురసాదేవిని చూచితిని. ఆమె సముద్రమధ్యమున నాతో నిట్లనెను. 21

“ఓ వానరశ్రేష్ఠుడా! నిన్ను దేవతలు నా కాహారముగ ప్రసాదించినారు. కావున

మమ భక్షః ప్రదిష్ట స్త్వ మమరై ర్హరిసత్తమ,
అత స్త్వాం భక్షయిష్యామి విహిత స్త్వం చిరస్య మే. 22

ఏవ ముక్తస్సురసయా ప్రాంజలిః ప్రణతః స్థితః,
వివర్ణవదనో భూత్వా వాక్యం చేద ముదీరయమ్. 23

రామో దాశరథిః శ్రీమాన్ ప్రవిష్టో దండకావనమ్,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ పరంతపః. 24

తస్య సీతా హృతా భార్యా రావణేన దురాత్మనా,
తస్యా స్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్. 25

కర్తు మర్హసి రామస్య సాహాయ్యం విషయే సతీ. 26

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్,
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే. 27

---

నేను చిరకాలమునకు దొరికిన నిన్ను భక్షింతును" అనెను. 22

అని సురస యిట్లు పలుకగా, నే నామెకు కేలు మోడ్చి ప్రణామ మొనర్చి (అయ్యో! మఱల రామకార్యమునకు విఘ్న మేర్పడెనే యని) ముఖమున కళ తప్పగా నిట్లంటిని. 23

శత్రువులను పీడించువాడు, దశరథుని కుమారుడు, శ్రీమంతుడగు రాముడు, తమ్ముడు లక్ష్మణునితో, భార్య సీతతో కలిసి దండకారణ్యమున ప్రవేశించినాడు. 24

దురాత్ము డగు రావణు డా రాముని భార్య నపహరించినాడు. రామాజ్ఞను తలదాల్చి, దూతనై నే నామెకడకు పోవుచున్నాను. రాముని రాజ్యమున నివసించుదానవగు నీ వాయనకు సహాయము చేయదగును. 25,26

అట్లు సాహాయ్యము చేయుట నీ కిష్టము కాకున్నచో, నేను లంక కేగి, సీతను చూచి, అనాయాసముగ మహాకార్యములను సాధించువాడగు రామున కీ విషయము నివేదించి వచ్చి, నీ నోట పడెదను. ఇది నిజము. ఇట్లని ప్రతిజ్ఞ చేయుచున్నాను. 27

ఏవ ముక్తా మయా సా తు సురసా కామరూపిణీ,
అబ్రవీ న్నాతివర్తేత కశ్చి దేష వరో మమ. 28

ఏవ ముక్తః సురసయా దశయోజన మాయతః,
తతో౽ర్ధగుణవిస్తారో బభూ వాహం క్షణేన తు. 29

మత్ప్రమాణానురూపం చ వ్యాదితం చ ముఖం తయా,
తద్దృష్ట్వా వ్యాదితం చాస్యం హ్రస్వం హ్యకరవం వపుః,
తస్మిన్ ముహూర్తే చ పున ర్బభూ వాంగుష్ఠమాత్రకః. 30

అభిపత్యాశు తద్వక్త్రం నిర్గతో౽హం తతః క్షణాత్,
అబ్రవీత్ సురసా దేవీ స్వేన రూపేణ మాం పునః. 31

అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్,
సమానయ చ వైదేహీం రాఘవేణ మహాత్మనా.

---

నే నిట్లు పలుకగా కామరూపిణి యగు సురస, "న న్నెవ్వరును తప్పించుకొని పోజాలరు. నా కట్టి వర మున్నది" అనెను. 28

అని సురస చెప్పగానే పది యోజనముల పొడవుగల నేను క్షణకాలములో పదునైదు యోజనముల పొడవు పెరిగితిని. 29

ఆమెయు నా శరీరప్రమాణమున కనుగుణముగ తన నోరు పెద్దదిగా తెఱచెను. అట్లు విపులముగా తెఱచిన ఆమె నోటిని చూచి నేను నా శరీరమును తగ్గించుకొని క్షణకాలముననే బొటనవ్రేలి ప్రమాణము కలవాడనైతిని. 30

అంత నామె నోట శీఘ్రమే ప్రవేశించి, క్షణకాలములో దానినుండి వెలువడితిని. అపుడు సురసాదేవియు తన సహజరూపము ధరించి నా కిట్లనెను. 31

సౌమ్యుడ వగు ఓ కపిశ్రేష్ఠుడా! నీ వింక సుఖముగా పోయి రమ్ము. నీకు కార్యసిద్ధి యగుగాక! మహాత్ముడగు రామునితో సీతను కూర్పుము. మహాభుజుడ

సుఖీ భవ మహాబాహో ప్రీతాஉస్మి తవ వానర. 32
తతోஉహం సాధు సాధ్వీతి సర్వభూతైః ప్రశంసితః. 33
తతోஉంతరిక్షం విపులం ప్లుతోஉహం గరుడో యథా,
ఛాయా మే నిగృహీతా చ న చ పశ్యామి కించన. 34
సోஉ హం విగతవేగస్తు దిశో దశ విలోకయన్,
న కించి త్తత్ర పశ్యామి యేన మేஉపహృతా గతిః. 35
తతో మే బుద్ధి రుత్పన్నా కిన్నామ గగనే మమ,
ఈదృశో విఘ్న ఉత్పన్నో రూపం యత్ర న దృశ్యతే. 36
అధోభాగేన మే దృష్టిః శోచతా పాతితా మయా,
తతోஉద్రాక్ష మహం భీమాం రాక్షసీం సలిలేశయామ్. 37
ప్రహస్య చ మహానాద ముక్తోஉహం భీమయా తయా,

---

వగు వానరుడా! నీవు సుఖము పొందుము. నీ బుద్ధికౌశలమునకు నేను సంతోషించితిని. 32

అపుడు సకలభూతములు నన్ను చూచి 'బాగు బాగు' అని ప్రశంసించినవి. 33

నే నపుడు గరుత్మంతుని వలె విశాలమగు ఆకాశమున కెగిరితిని. అంతలో నా నీడ పట్టి వెనుకకు లాగినట్లైనది. కాని నా కేమియు అగపడలేదు. 34

అపుడు నా వేగము మందగించగా దశదిశలను చూచియును, అట్లు నా గమనవేగము నిరోధింపబడుటకు కారణమైన వస్తువును కనుగొనజాలనైతిని. 35

అపుడు నే నిట్లాలోచించితిని. "నే నాకాశమున పోవుచుండగా ఇట్టి విఘ్నము కలిగిన దేమి? ఇట్లు విఘ్నము కలిగించిన జంతువుకూడ కనబడకున్నది. 36

ఇట్లాలోచించుచునే నేను క్రిందికి దృష్టి మఱల్చితిని. అపుడు భయంకరమగు రాక్షసి యొక్కతె నీటియందు దగపడినది. 37

ఆ భయంకరరాక్షసి నన్ను చూచి, అట్టహాసము చేసినదై జంకులేక దృఢముగా నీ

అవస్థిత మసంభ్రాంత మిదం వాక్య మశోభనమ్. 38
క్వాసి గంతా మహాకాయ క్షుధితాయా మమేప్సితః,
భక్షః ప్రీణయ మే దేహం చిర మాహారవర్జితమ్. 39
బాఢ మిత్యేవ తాం వాణీం ప్రత్యగృహ్ణ మహం తతః,
ఆస్యప్రమాణా దధికం తస్యాః కాయ మపూరయమ్,
తస్యా శ్చాస్యం మహ ద్భీమం వర్ధతే మమ భక్షణే. 40
న చ మాం సాధు బుబుధే మమ వా నికృతం కృతమ్. 41
తతోఽ హం విపులం రూపం సంక్షిప్య నిమిషాంతరాత్,
తస్యా హృదయ మాదాయ ప్రపతామి నభస్థలమ్. 42
సా విసృష్టభుజా భీమా పపాత లవణాంభసి,
మయా పర్వతసంకాశా నికృత్తహృదయా సతీ. 43

---

అమంగళకరమగు వాక్యము పలికినది. 38

ఓ మహాశరీరము కలవాడా! ఆకలిగొన్న నాకు నీ వభీష్టమగు భక్ష్యము. నీ వెక్కడకు పోయెదవు? చిరకాలముగ ఆహారము లేని నా దేహమును సంతుష్టి నొందించుము. 39

నే నపు డట్లే యామె వాక్యము నంగీకరించితిని. తోడనే నా శరీర మామె నోటికంటె పెద్దదిగా పెంచితిని. విపులము, భయంకరమగు ఆమె నోరు అంతకంటెను విపులము కాజొచ్చెను. 40

ఆ రాక్షసి నా సామర్థ్యమును గాని, (నా కామరూపముగాని) వే నామెకు చేయనున్న యపకారముగాని చక్కగా ఎఱుగదయ్యెను. 41

అంత మరియొక్క క్షణములో నేను నా పెద్ద రూపమును చిన్నదిగా చేసికొని యా రాక్షసి గుండెను పెఱికివైచి ఆకాశమున కెగిరితిని. 42

అట్లా రాక్షసి గుండెను నేను పెఱికివేయగా పర్వతము వలె భయంకరముగ

శృణోమి ఖగతానాం చ సిద్ధానాం చారణై స్సహ,
రాక్షసీ సింహికా భీమా క్షిప్రం హనుమతా హతా. 44
తాం హత్వా పునరేవాహం కృత్యమాత్యయికం స్మరన్,
గత్వా చాహం మహాధ్వానం పశ్యామి నగమండితమ్,
దక్షిణం తీర ముదధే ర్లంకా యత్ర చ సా పురీ. 45
అస్తం దినకరే యాతే రక్షసాం నిలయం పురమ్,
ప్రవిష్టోఽహ మవిజ్ఞాతో రక్షోభి ర్భీమవిక్రమైః. 46
తత్ర ప్రవిశత శ్చాపి కల్పాన్తఘనసన్నిభా,
అట్టహాసం విముంచంతీ నారీ కా ప్యుత్థితా పురః. 47
జిఘాంసంతీం తత స్తాం తు జ్వలదగ్నిశిరోరుహామ్,
సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య సుభైరవామ్,

---

నున్న ఆ రాక్షసియు భుజముల సంధిబంధములు సడలి సముద్రమున మునిగెను. 43

అపు డాకాశమున నిలచిన సిద్ధులు చారణులును "భయంకరరాక్షసి యగు సింహికను శీఘ్రమే హనుమంతుడు సంహరించినా"డని పలుకగా వింటిని. 44

ఆమె నట్లు చంపి, తిరిగి ప్రాణాంతకమగు సింహికాహననకృత్యమునే తలంచుకొనుచు ఆకాశమున బహుదూరము గడచి కొండలతో శోభిల్లు సముద్రపు దక్షిణతీరము చేరితిని. లంకానగర మచ్చటనే యున్నది. 45

సూర్యు డస్తమించిన పిమ్మట, భయంకరపరాక్రమముగల రాక్షసులకు తెలియరాకయే రాక్షసావాసమగు లంకానగరము ప్రవేశించితిని. 46

అట్లు లంకలో ప్రవేశించుచుండగా ప్రళయకాలపు మేఘమువలె నున్న యొక రాక్షసి అట్టహాసము చేయుచు నాముందు నిలచెను. 47

మండుచున్న అగ్నివలె ఎఱ్ఱనైన వెండ్రుకలు కలదై, మిక్కిలి భయంకరాకారముతో నన్ను చంప జూచుచున్న ఆ రాక్షసిని ఎడమచేతి పిడికిలి పోటుతో ఓడించి రాత్రి

ప్రదోషకాలే ప్రవిశం భీతయాఽహం తయోదితః. 48

అహం లంకాపురీ వీర నిర్జితా విక్రమేణ తే,
యస్మా త్తస్మా ద్విజేతాసి సర్వరక్షాం స్యశేషతః. 49

తత్రాహం సర్వరాత్రం తు విచిన్వన్ జనకాత్మజామ్,
రావణాంతఃపురగతో న చాపశ్యం సుమధ్యమామ్. 50

తత స్సీతా మపశ్యంస్తు రావణస్య నివేశనే,
శోకసాగర మాసాద్య న పార ముపలక్షయే. 51

శోచతా చ మయా దృష్టం ప్రాకారేణ సమావృతమ్,
కాంచనేన వికృష్టేన గృహోపవన ముత్తమమ్. 52

న ప్రాకార మవప్లుత్య పశ్యామి బహుపాదపమ్. 53

అశోకవనికామధ్యే శింశుపాపాదపో మహాన్,

---

ప్రారంభమున లంకలో అడుగిడితిని. 48

అపు డామె ఇట్లు పలికెను – 'ఓ వీరుడా! నేను లంకాధిదేవతను. నీ పరాక్రమముచే నన్ను జయించితివి కనుక సకలరాక్షసులను నీవు జయింపగలవు. 49

పిమ్మట నేను రావణాంతఃపురమున ప్రవేశించి, రాత్రి యంతయు వెదికినను, చక్కని నడుముగల సీతాదేవిని కాననైతిని. 50

అట్లు రావణుని గృహమున సీతను కానక దుఃఖసముద్రమున బడి, ఒడ్డును కావనైతిని. 51

నే నట్లు దుఃఖించుచు, అతివిస్తారమగు బంగారు ప్రాకారముచే పరివేష్టితమైన గృహోద్యానమును చూచితిని. 52

ఆ ప్రాకారము దాటి చాల చెట్లతో గూడిన యుద్యానము చూచితిని. ఆ యశోకవనము నడుమ పెద్ద శింశుపావృక్ష మున్నది. దానిపై నెక్కి బంగారువర్ణము గల అరటుల తోట చూచితిని. 53,54

తమారుహ్య చ పశ్యామి కాంచనం కదలీవనమ్. 54

అదూరే శింశుపావృక్షాత్ పశ్యామి వరవర్ణినీమ్,
శ్యామాం కమలపత్రాక్షీ ముపవాసకృశాననామ్. 55

తదేకవాసస్సంవీతాం రజోధ్వస్తశిరోరుహామ్,
శోకసంతాపదీనాంగీం సీతాం భర్తృహితే స్థితామ్. 56

రాక్షసీభి ర్విరూపాభిః క్రూరాభి రభిసంవృతామ్,
మాంసశోణితభక్షాభి ర్వ్యాఘ్రీభి ర్హరిణీమివ. 57

సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా. 58

భూమిశయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే. 59

---

అచట శింశుపావృక్షమునకు చెంతనే వరవర్ణినియు (శీతకాలమున సుఖోష్ణము, వేసవికాలమున చల్లనిది అగు శరీరము కలది, భర్తయం దత్యంతానురాగము కలది), వడియౌవనము కలది, తామరరేకుల వంటి కన్నులు గలది, ఉపవాసము చేయుటచే కృశించిన మోము కలదగు సీతాదేవిని చూచితిని. 55

ఆమె రావణు డపహరించిన సమయమున ఏ వస్త్రము దాల్చి యుండెనో, అదే వస్త్రమును ధరించియుండెను. ఆమె కేశములు ధూళిచే మలినములై యుండెను. ఆమె మానసిక మగు శోకముచేతను, శారీరకమగు సంతాపముచేతను దీనయై సదా భర్తృహితమునే కోరుచుండెను. 56

రక్తమాంసములు తిను అడుపులుల నడుమ ఆడులేడి వలె, వికృతరూపము కలిగి, భయంకరులగు రాక్షసస్త్రీలచే ఆమె పరివేష్టితయై యుండెను. 57

ఆమెను రాక్షసస్త్రీలు మాటిమాటికి భయపెట్టుచుండిరి. ఒంటి జడ దాల్చి, దీనయై, భర్తనే తలంచుచు, భూమిపైననే శయనించుచున్నదై, హేమంతమున కమలసమూహమువలె కళ దప్పి, రావణునియందు వైముఖ్యము గలదై, మరణింప

రావణాద్ వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథంచి న్మృగశాబాక్షీ తూర్ణ మాసాదితా మయా. 60

తాం దృష్ట్వా తాదృశీం నారీం రామపత్నీం యశస్వినీమ్,
తత్రైవ శింశుపావృక్షే పశ్య న్నహ మవస్థితః. 61

తతో హలహలాశబ్దం కాంచీనూపురమిశ్రితమ్,
శృణో మ్యధికగంభీరం రావణస్య నివేశనే. 62

తతోఽహం పరమోద్విగ్నః స్వం రూపం ప్రతిసంహరన్,
అహం తు శింశుపావృక్షే పక్షీవ గహనే స్థితః. 63

తతో రావణదారాశ్చ రావణశ్చ మహాబలః,
తం దేశం సమనుప్రాప్తా యత్ర సీతాఽభవత్ స్థితా. 64

తద్ దృష్ట్వాథ వరారోహా సీతా రక్షో మహాబలమ్,

---

నిశ్చయించియుండగా నే నెట్లో ఆమెను శీఘ్రమే చూడగలిగితిని. 58-60

రాముని పత్నియు, కీర్తిమతియు నగు సీతాదేవి యట్టి దీనావస్థలో నుండుట చూచి, యా శింశుపావృక్షము నెక్కి యట్లే చూచుచుంటిని. 61

అపుడు మొలత్రాటి చిరుగజ్జెలు, అందెల మ్రోతలతో కూడిన మిక్కిలి గంభీరమగు కోలాహల మా రావణుని భవనమునుండి వినవయ్యెను. 62

అపుడు నేను మిక్కిలి కలవరపడి నా రూపమును చిన్నది చేసికొని యా శింశుపావృక్షమున పక్షివలె ఆకులతో దట్టమైన ప్రదేశమున కూర్చుంటిని. 63

అపుడు రావణుని భార్యలు, మహాబలశాలి యగు రావణుడును సీతయున్న చోటికి వచ్చిరి. 64

అపు డా మహాబలుడగు రాక్షసుని చూచిన ఆ చక్కని కటిప్రదేశము కల సీత, తన తొడలను ముడుచుకొని పుష్టములైన స్తనములను చేతులతో ఆచ్ఛాదన

సంకుచ్యోరూ స్తనౌ పీనౌ బాహుభ్యాం పరిరభ్య చ. 65
విత్రస్తాం పరమోద్విగ్నాం వీక్షమాణాం తత స్తతః,
త్రాణం కించి దపశ్యంతీం వేపమానాం తపస్వినీమ్. 66
తా మువాచ దశగ్రీవ స్సీతాం పరమదుఃఖితామ్,
అవాక్ఛిరాః ప్రపతితో బహుమన్యస్వ మా మితి. 67
యది చేత్త్వం తు దర్పా న్మాం నాభినందసి గర్వితే,
ద్వౌ మాసా వంతరం సీతే పాస్యామి రుధిరం తవ. 68
ఏత చ్ఛ్రుత్వా వచ స్తస్య రావణస్య దురాత్మనః,
ఉవాచ పరమక్రుద్ధా సీతా వచన ముత్తమమ్. 69
రాక్షసాధమ రామస్య భార్యా మమితతేజసః,
ఇక్ష్వాకుకులనాథస్య స్నుషాం దశరథస్య చ,
అవాచ్యం వదతో జిహ్వా కథం న పతితా తవ. 70

---

మొనర్చుకొనెను. 65

అంత నా రావణుడు, మిక్కిలి భయపడినదై అధికముగ కలవరము చెంది, అటునిటు చూచుచు, రక్షింపగలవా రెవ్వరును కానరాక, వణకుచున్న సీతకు భూమిపై తలవంచి నమస్కరించి తన్నాదరింపుమని కోరెను. 66,67

"ఓ గర్వితురాలా! నన్నాదరింపక దర్పముతో తిరస్కరించుచో నే నిచ్చిన గడువు రెండు నెలలు ముగియగనే నీ రక్తము త్రాగెదను. 68

దురాత్ముడగు రావణుడు పలికిన వచనము విని, మిక్కిలి కోపించినదై సీతాదేవి ఇట్లుత్తమముగ పలికెను. 69

ఓ రాక్షసాధమా! అమితతేజశ్శాలి రాముని భార్యను, ఇక్ష్వాకుకులనాథుడగు దశరథుని కోడలిని అగు నన్ను అనరాని మాటలనుచున్న నీ నాలుక ఏల ఊడి పడకున్నది? 70

కించి ద్వీర్యం తవానార్య యో మాం భర్తు రసన్నిధౌ,
అపహృత్యాఽఽగతః పాప తే నాదృష్టో మహాత్మనా. 71
న త్వం రామస్య సదృశో దాస్యేఽప్యస్య న యుజ్యసే,
యజ్ఞీయ స్సత్యవాదీ చ రణశ్లాఘీ చ రాఘవః. 72
జానక్యా పరుషం వాక్య మేవ ముక్తో దశాననః,
జజ్వాల సహసా కోపా చ్చితాస్థ ఇవ పావకః. 73
వివృత్య నయనే క్రూరే ముష్టి ముద్యమ్య దక్షిణమ్,
మైథిలీం హంతు మారబ్ధః స్త్రీభి ర్హాహాకృతం తదా. 74
స్త్రీణాం మధ్యాత్ సముత్పత్య తస్య భార్యా దురాత్మనః,
వరా మండోదరీ నామ తయా స ప్రతిషేధితః. 75
ఉక్తశ్చ మధురాం వాణీం తయా స మదనార్దితః,

---

ఓ పాపిష్ఠుడా! నీవు నా పతి చెంతలేని సమయమున ఆయనకంట బడక నన్ను అపహరించి తెచ్చితివి. నీ పరాక్రమ మెంత యల్పమో దీనిచేతనే స్పష్టము. 71

నీవు రాముని పోలజాలవు. ఆయనకు దాస్యము చేయుటకైనను తగవు. రాముదు అనేకయాగములు చేయువాడు. సత్యము పలుకువాడు, యుద్ధమును మెచ్చుకొనువాడు. 72

సీత యిట్లు పరుషోక్తులు పలుకగా రావణుడు చితియందలి అగ్నివలె కోపముతో నొక్కసారిగా మండిపడెను. 73

అతడు భీకరముగ కన్నులు త్రిప్పి, కుడిచేతి పిడికిలి బిగించి, సీతను చంప నుద్యమించగా తక్కిన స్త్రీలు హాహాకార మొనర్చిరి. 74

అపుడు దురాత్ముడగు ఆ రావణుని భార్యలలో శ్రేష్ఠురాలగు మండోదరి యా స్త్రీల నడుమ నుండి లేచి, రావణు డా క్రూరకార్యము చేయకుండునట్లు వారించెను. 75

కామపీడితుడగు అతని కామె యిట్లు మధురముగా పలికెను. "పరాక్రమమున

సీతయా తవ కిం కార్యం మహేంద్రసమవిక్రమ. 76
దేవగంధర్వకన్యాభి ర్యక్షకన్యాభి రేవ చ,
సార్ధం ప్రభో రమస్వేహ సీతయా కిం కరిష్యసి. 77
తత స్తాభి స్సమేతాభి ర్నారీభి స్స మహాబలః,
ప్రసాద్య సహసా నీతో భవనం స్వం నిశాచరః. 78
యాతే తస్మిన్ దశగ్రీవే రాక్షస్యో వికృతాననాః,
సీతాం నిర్భర్త్సయామాసు ర్వాక్యైః క్రూరైః సుదారుణైః. 79
తృణవ ద్భాషితం తాసాం గణయామాస జానకీ,
గర్జితం చ తదా తాసాం సీతాం ప్రాప్య నిరర్థకమ్. 80
వృథాగర్జితనిశ్చేష్టా రాక్షస్యః పిశితాశనాః,
రావణాయ శశంసు స్తా స్సీతాధ్యవసితం మహత్. 81

---

దేవేంద్రుని బోలువాడా! నీకు సీతతో పనియేమి? 76

ఓ నాథా! దేవకాంతలు, గంధర్వకన్యలు, యక్షకన్యలతో క్రీడింపుము. ఈ సీతతో నీకేల?" 77

పిమ్మట మహాబలశాలి యగు ఆ రావణుని రాక్షసాంగనలు బుజ్జగించి, శీఘ్రమే అతని భవనమునకు తీసికొనిపోయిరి. 78

రావణు డట్లు వెడగలనే వికృతముఖములు గల రాక్షసాంగనలు భయంకరములు, కర్ణకఠోరములగు వాక్కులతో సీతను బెదరించిరి. 79

సీత వారి మాటలను గడ్డిపోచతో సమానముగా పరిగణించెను. వారి గర్జన లామె కడ ఎందులకును కొఱగాని వయ్యెను. 80

మాంసమును తినునట్టి యా రాక్షసాంగన లట్లు వ్యర్థముగా గర్జించి, యూఱకుండినవారై రావణునికి సీత దృఢవిశ్చయము నివేదించిరి. 81

తతస్తా స్సహితా స్సర్వా విహతాశా నిరుద్యమాః,
పరిక్షిప్య సమంతా త్తాం నిద్రావశ ముపాగతాః. 82
తాసు చైవ ప్రసుప్తాసు సీతా భర్తృహితే రతా,
విలప్య కరుణం దీనా ప్రశుశోచ సుదుఃఖితా. 83
తాసాం మధ్యాత్ సముత్థాయ త్రిజటా వాక్య మబ్రవీత్,
ఆత్మానం ఖాదత క్షిప్రం న సీతా వినశిష్యతి,
జనక స్యాత్మజా సాధ్వీ స్నుషా దశరథస్య చ. 84
స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రక్షసాం చ వినాశాయ భర్తు రస్యా జయాయ చ. 85
అల మస్మాత్ పరిత్రాతుం రాఘవాద్ రాక్షసీగణమ్,
అభియాచామ వైదేహీ మేతద్ధి మమ రోచతే. 86

---

అంత నా రాక్షసస్త్రీలు నిరాశలై, ఆమెను వశపరచుకొను ప్రయత్నము వీడి, సీతను చుట్టుకొనియుండి, నిద్రించిరి. 82

వారట్లు నిదురింపగా, పతిహితమే కోరు సీతాదేవి, దయనీయముగ ఏడ్చి మిక్కిలి దుఃఖముతో శోకించెను. 83

అపుడా రాక్షసవనితల నడుమనుండి త్రిజట యను నామె నిద్రనుండి లేచి యిట్లనెను. 'ఓ పాపులారా! వలయుచో శీఘ్రమే మిమ్ములను మీరే తినుడు. జనకుని కూతురు, పతివ్రత, దశరథుని కోడలును అగు సీత మాత్రము మరణింపదు. 84

నేనిపుడు భయము, గగుర్పాటు కలిగించు కలగంటిని. రాక్షసవినాశమును, ఆమె పతి విజయమును ఆ కల సూచించుచున్నది. 85

రామునినుండి మనలకు కాపాడుట కీమె సమర్థురాలు. కావున మనలను కాపాడుమని ఆమెను ప్రార్థించుదము. ఇపుడిట్లు చేయుట నాకు నచ్చిన పని. 86

యస్యా హ్యేవంవిధః స్వప్నో దుఃఖితాయాః ప్రదృశ్యతే,
సా దుఃఖై ర్వివిధై ర్ముక్తా సుఖ మాప్నో త్యనుత్తమమ్. 87
ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా. 88
తత స్సా హ్రీమతీ బాలా భర్తు ర్విజయహర్షితా,
అవోచద్ యది తత్తథ్యం భవేయం శరణం హి వః. 89
తాం చాహం తాదృశీం దృష్ట్వా సీతాయా దారుణాం దశామ్,
చింతయామాస విక్రాంతో న చ మే నిర్వృతం మనః. 90
సంభాషణార్థం చ మయా జానక్యా శ్చింతితో విధిః,
ఇక్ష్వాకూణాం హి వంశస్తు తతో మమ పురస్కృతః. 91
శ్రుత్వా తు గదితాం వాచం రాజర్షిగణపూజితామ్,
ప్రత్యభాషత మాం దేవీ బాష్పైః పిహితలోచనా. 92

---

దుఃఖితురాలైన ఈ సీతను గూర్చి నాకు వచ్చిన కలను బట్టి యీామె సకలదుఃఖములనుండి విముక్తురాలై గొప్ప సుఖము పొందును. జనకుని కూతురు సీత తనకు ప్రణమిల్లిన వారి యపరాధములు సైరించి, వారియెడ ప్రసన్నురాలగును. 87,88

పిమ్మట ఆ సీత తన భర్త విజయము నందునని త్రిజట పలికిన వాక్యమువకు హర్షమును, స్త్రీసహజమగు సిగ్గును పొంది ఆ రాక్షసులతో "త్రిజట పలికినది నిజమగుచో నేను మిమ్ము కాపాడెద"ననెను. 89

నే నపుడు సీతయొక్క ఆ దారుణదశను చూచి, చింతాక్రాంతుడనైతిని. నా మనస్సున కానందము కలుగకుండెను. 90

సీతతో నంభాషించు విధానము నాలోచించితిని. దానికి అనురూపముగ ఇక్ష్వాకు వంశమును కీర్తించితిని. 91

రాజర్షిసమూహముల కామోదయోగ్యమైన యా వాక్యమును విని సీతాదేవి కన్నీరు కనుల నిండగా నాతో నిట్లు పలికెను. 92

కస్త్వం కేన కథం చేహ ప్రాప్తో వానరపుంగవ,
కా చ రామేణ తే ప్రీతి స్తన్మే శంసితు మర్హసి. 93
తస్యా స్తద్వచనం శ్రుత్వా హ్యాహమప్యబ్రువం వచః. 94
దేవి రామస్య భర్తు స్తే సహాయో భీమవిక్రమః,
సుగ్రీవో నామ విక్రాంతో వానరేంద్రో మహాబలః. 95
తస్య మాం విద్ధి భృత్యం త్వం హనుమంత మిహాగతమ్,
భర్త్రాహం ప్రేషిత స్తుభ్యం రామే ణాక్లిష్టకర్మణా. 96
ఇదం చ పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథి స్స్వయమ్,
అంగుళీయ మభిజ్ఞాన మదా త్తుభ్యం యశస్విని. 97
తదిచ్ఛామి త్వయాఒఒజ్ఞప్తం దేవి కిం కరవా ణ్యహమ్,
రామలక్ష్మణయోః పార్శ్వం నయామి త్వాం కిముత్తరమ్. 98

---

ఓ వానరశ్రేష్ఠుడా! నీ వెవ్వడవు? ఇట కెట్లు వచ్చితివి? నీకు రామునిపై ఆదరమేల కలిగినది? నీ వీ విషయము తెలుపుము. 93

సీతాదేవి వచన మాలించి, నేను ప్రత్యుత్తర మిచ్చితిని. 'అమ్మా! నీ భర్త రామునకు సహాయుడు, భయంకరమగు పరాక్రమము కలవాడు, మహాబలుడగు సుగ్రీవుడను వాన రాజు కలడు. నే నాయన సేవకుడను. నా పేరు హనుమంతుడు. మహాకార్యముల ననాయాసముగ సాధించు నీ పెనిమిటి రాముడు నీకడకు పంపగా వచ్చితిని. 94-96

ఓ కీర్తిశాలినీ! పురుషశ్రేష్ఠుడగు రాము డీ యుంగరమును నీకు గుర్తుగా నొసంగినాడు. 97

కావున నన్నిపు డేమి చేయుమందువు? నీ యాదేశము ననుసరించి యాచరింతును. నేను నిన్ను రామలక్ష్మణులకడకు తీసికొని పోయెదను. నీ కభిమతమో కాదో తెలుపుము. 98

నేను చెప్పినది విని కర్తవ్యమును తలంచి, జనకరాజపుత్రి యగు సీత "రాముడు

ఏతచ్ఛ్రుత్వా విదిత్వా చ సీతా జనకనందినీ,
ఆహ రావణ ముత్పాద్య రాఘవో మాం నయత్వితి. 99
ప్రణమ్య శిరసా దేవీ మహ మార్యా మనిందితామ్,
రాఘవస్య మనోహ్లాద మభిజ్ఞాన మయాచిషమ్. 100
అథ మా మబ్రవీత్ సీతా గృహ్యతా మయ ముత్తమః,
మణి ర్యేన మహాబాహూ రామస్త్వాం బహుమన్యతే. 101
ఇత్యుక్త్వా తు వరారోహా మణిప్రవర మద్భుతమ్,
ప్రాయచ్ఛత్ పరమోద్విగ్నా వాచా మాం సందిదేశ హ. 102
తత స్తస్యై ప్రణమ్యాహం రాజపుత్ర్యై సమాహితః,
ప్రదక్షిణం పరిక్రామ మిహాభ్యుద్గతమానసః. 103
ఉక్తోఽహం పునరేవేదం నిశ్చిత్య మనసా తయా,
హనుమన్ మమ వృత్తాంతం వక్తు మర్హసి రాఘవే. 104

---

రావణుని చంపి నన్ను తీసికొనిపోవలెను" అనెను. 99

అనిందితురాలు, పూజ్యురాలగు సీతాదేవికి ప్రణమిల్లి రాముని మనస్సును సంతోషపెట్టజాలు గుర్తు నిమ్మని కోరితిని. 100

అపుడు సీత "హనుమంతుడా! నీ వీ యుత్తమమగు చూడామణి గ్రహింపుము. దీనిని చూచి మహాభుజుడగు రాముడు నిన్ను చాల గౌరవించగలడు. 101

అని ఆ ఉత్తమకాంత సీత ఆశ్చర్యకరమగు ఆ శ్రేష్ఠమణిని నా కిచ్చెను. తిరిగి రామునకు తెలుపవలసిన మాటలు కూడ చెప్పెను. 102

అంత నేను ఏకాగ్రచిత్తుడనై యిచ్చటికి శీఘ్రమే రావలెనని మనసు పట్టి లాగగా, సీతాదేవికి ప్రదక్షిణము చేసి, ప్రణమిల్లితిని. 103

మఱల సీతాదేవి మనస్సులో నిశ్చయించుకొని నా కిట్లు చెప్పినది. "ఓ హనుమంతుడా! నీవు నా వృత్తాంతమును రామునకు తెలుపుము. 104

యథా శ్రుత్వైవ న చిరాత్ తావుభౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవసహితౌ వీరా వుపేయాతాం తథా కురు. 105

యద్యన్యథా భవే దేతద్ ద్వౌ మాసౌ జీవితం మమ,
న మాం ద్రక్ష్యతి కాకుత్స్థో మ్రియే సాహ మనాథవత్. 106

తచ్ఛ్రుత్వా కరుణం వాక్యం క్రోధో మా మభ్యవర్తత,
ఉత్తరం చ మయా దృష్టం కార్యశేష మనంతరమ్. 107

తతోఽవర్ధత మే కాయ స్తదా పర్వతసన్నిభః,
యుద్ధకాంక్షీ వనం తచ్చ వినాశయితు మారభే. 108

తద్భగ్నం వనషండం తు భ్రాంతత్రస్తమృగద్విజమ్,
ప్రతిబుద్ధా నిరీక్షంతే రాక్షస్యో వికృతాననాః. 109

మాం చ దృష్ట్వా వనే తస్మిన్ సమాగమ్య తత స్తతః,
తా స్సమభ్యాగతాః క్షిప్రం రావణా యాచచక్షిరే. 110

---

నా వృత్తాంతము వినివతోడనే వీరులగు రామలక్ష్మణులు, సుగ్రీవునితో కలసి యిటకు వచ్చునట్లు చేయుము. 105

అట్లు వారు రాకపోవుచో నే నింక రెండు మాసములే జీవింతును. ఆపైన రాముడు నన్ను చూడజాలడు. నేను అనాథ వలె మరణింతును. 106

ఆమె పలికిన దయగొలుపు మాటలు వినిన నాకు రావణునిపై కోపము కలిగెను. అనంతరము నేను చేయక మిగిలిన పని ఏమా అని ఆలోచించితిని. 107

పిమ్మట నా శరీరమును పర్వతముతో సమానముగా పెంచితిని. యుద్ధము చేయగోరుచు అశోకవనము పాడుచేయ నారంభించితిని. 108

అపుడు వికృతములగు ముఖములు గల రాక్షసవనితలు మేల్కొంచి యా వనము విఱుగుటను, అందలి మృగములు, పక్షులు బెదరిపోవుటను చూడసాగిరి. 109

వా రా వనమందు నన్ను చూచి, యటనుండి వెలువడి శీఘ్రమే రావణుని కడ

రాజన్ వనమిదం దుర్గం తవ భగ్నం దురాత్మనా,
వానరేణ హ్యవిజ్ఞాయ తవ వీర్యం మహాబల. 111

దుర్బుద్ధే స్తస్య రాజేంద్ర తవ విప్రియకారిణః,
వధ మాజ్ఞాపయ క్షిప్రం యథాసౌ విలయం వ్రజేత్. 112

తచ్ఛ్రుత్వా రాక్షసేంద్రేణ విసృష్టా భృశదుర్జయాః,
రాక్షసాః కింకరా నామ రావణస్య మనోనుగాః. 113

తేషా మశీతిసాహస్రం శూలముద్గరపాణినామ్,
మయా తస్మిన్ వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్. 114

తేషాం తు హతశేషా యే తే గత్వా లఘువిక్రమాః,
నిహతం చ మహత్ సైన్యం రావణా యాచచక్షిరే. 115

తతో మే బుద్ధి రుత్పన్నా చైత్యప్రాసాద మాక్రమమ్. 116

---

కేగి యిట్లనిరి. 110

మహాబలుడవగు ఓ రాజా! ఇతరులకు ప్రవేశింపరాని నీ వనమును నీ పరాక్రమ మెఱుగక దురాత్ముడగు ఒక వానరుడు పాడుచేసినాడు. 111

ఓ రాజశ్రేష్ఠుడా! నీ కిష్టముకాని ఈ పని చేసిన యా దుర్బుద్ధి శీఘ్రమే నశించునట్లుగా అతనికి మరణదండన విధింపుము". 112

ఆ మాటలు వినిన రావణుడు జయింపశక్యము కానివారై, తన ఇచ్ఛానుసారము ప్రవర్తించు కింకరులు అను రాక్షసులను నాపైకి పంపినాడు. 113

శూలములు, ముద్గరములు దాల్చిన ఎనుబదివేల కింకరరాక్షసులను ఆ వనప్రదేశముననే పరిఘముతో చంపివైచితిని. 114

అట్లు వారిలో చావగా మిగిలిన కొద్దిమంది వేగముగ పోయి యా కింకరసైన్య మంతయు నశించెనని రావణునకు చెప్పిరి. 115

అపుడు నా కొక ఆలోచన కలిగినది. తదనుసారము నే నచట చైత్యప్రాసాదముపై కెగిరితిని. 116

తత్రస్థాన్ రాక్షసాన్ హత్వా శతం స్తంభేన వై పునః,
లలామభూతో లంకాయా స్స వై విధ్వంసితో మయా. 117

తతః ప్రహస్తస్య సుతం జంబుమాలిన మాదిశత్,
రాక్షసై ర్బహుభి స్సార్థం ఘోరరూపై ర్భయానకైః. 118

తమహం బలసంపన్నం రాక్షసం రణకోవిదమ్,
పరిఘే ణాతిఘోరేణ సూదయామి సహానుగమ్. 119

త చ్ఛ్రుత్వా రాక్షసేంద్రస్తు మంత్రిపుత్రాన్ మహాబలాన్,
పదాతిబలసంపన్నాన్ ప్రేషయామాస రావణః.
పరిఘేణైవ తాన్ సర్వాన్ నయామి యమసాదనమ్. 120

మంత్రిపుత్రాన్ హతాన్ శ్రుత్వా సమరే లఘువిక్రమాన్,
పంచ సేనాగ్రగాన్ శూరాన్ ప్రేషయామాస రావణః.

---

అచటి స్తంభముతోనే చైత్యప్రాసాదమునకు కావలియున్న రాక్షసులను చంపి లంకానగరికి అలంకారమగు ఆ ప్రసాదమును నాశనము చేసితిని. 117

అపుడా రావణుడు భయంకరరూపముగల అనేకరాక్షసులతో బాటు ప్రహస్తుని పుత్రుడగు జంబుమాలిని నాపైకి పంపెను. 118

మహాబలసమన్వితుడు, యుద్ధవిద్యావిశారదుడగు ఆ రాక్షసుని, అతని అనుచరులను భయంకరమగు పరిఘముతో సంహరించితిని. 119

వారట్లు నశించుట విని రాక్షసరాజగు రావణుడు మహాబలులగు మంత్రిపుత్రులను, కాల్బలమును గూడ నాపైకి పంపెను. నేను వారందరిని పరిఘము తోడనే యమపురికి పంపితిని. 120

యుద్ధమున గొప్ప పరాక్రమము చూపునట్టి మంత్రిపుత్రులు మరణించిరని విని రావణుడు సేనానాయకుల నైదుమందిని నాపైకి పంపెను.నేను వారందరిని వారి సైన్యములతో గూడ చంపివేసితిని. 121

తా నహం సహసైన్యాన్ వై సర్వానే వాభ్యసూదయమ్. 121
తతః పున ర్దశగ్రీవః పుత్ర మక్షం మహాబలమ్,
బహుభీ రాక్షసై స్సార్ధం ప్రేషయామాస రావణః. 122
తం తు మండోదరీపుత్రం కుమారం రణపండితమ్,
సహసా ఖం సముత్క్రాంతం పాదయోశ్చ గృహీతవాన్,
చర్మాసినం శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్. 123
త మక్ష మాగతం భగ్నం నిశమ్య స దశాననః,
తత ఇంద్రజితం నామ ద్వితీయం రావణ స్సుతమ్,
వ్యాదిదేశ సుసంక్రుద్ధో బలినం యుద్ధదుర్మదమ్. 124
తచ్చాప్యహం బలం సర్వం తం చ రాక్షసపుంగవమ్,
నష్టౌజనం రణే కృత్వా పరం హర్షముపాగమమ్. 125
మహతాపి మహాబాహుః ప్రత్యయేన మహాబలః,

---

అటు పిమ్మట రావణుడు తన కుమారుడగు అక్షుని, అనేకరాక్షసులను యుద్ధమున కంపెను. 122

మండోదరి కుమారుడు, యుద్ధకోవిదుడగు ఆ అక్షకుమారుడు కత్తి, డాలు ధరించి తటాలున ఆకాశమున కెగసినపు డాతని పాదము లొడిసి పట్టి నూరుమాఱు లాకాశమున త్రిప్పి నేలపై పడగొట్టి ముద్దచేసితిని. 123

అపుడు రావణుడు మిక్కిలి కోపముతో బలవంతుడు, యుద్ధోద్ధతుడు అగు ఇంద్రజిత్తను తన రెండవ తనయుని యుద్ధమునకు పోవ నాజ్ఞాపించెను. 124

నే నింద్రజిత్తును, అతని సైన్యమును యుద్ధమున తేజోవిహీనులను చేసి మిక్కిలి హర్షము నొందితిని. 125

మహాభుజుడు మహాబలుడగు ఇంద్రజిత్తు వానరుల నెట్టైనను జయించునను అచంచల విశ్వాసముతో రావణుడు మదోద్ధతులగు సైనికులను తోడిచ్చి పంపినాడు.

ప్రేషితో రావణేనైవ సహ వీరై ర్మదోత్కటైః. 126

సోఽవిషహ్యం హి మాం బుద్ధ్వా స్వం బలం చావమర్దితమ్,
బ్రాహ్మేణాస్త్రేణ స తు మాం ప్రాబధ్నా చ్చాతివేగితః. 127

రజ్జుభి శ్చాభిబధ్నంతి తతో మాం తత్ర రాక్షసాః,
రావణస్య సమీపం చ గృహీత్వా మా ముపానయన్,
దృష్ట్వా సంభాషితశ్చాహం రావణేన దురాత్మనా. 128

పృష్టశ్చ లంకాగమనం రాక్షసానాం చ తం వధమ్,
తత్సర్వం చ మయా తత్ర సీతార్థమితి జల్పితమ్. 129

అస్యాహం దర్శనాకాంక్షీ ప్రాప్త స్త్వద్భవనం విభో,
మారుత స్యౌరసః పుత్రో వానరో హనుమా నహమ్. 130

రామదూతం చ మాం విద్ధి సుగ్రీవపచివం కపిమ్,
సోఽహం దూత్యేన రామస్య త్వత్సకాశ మిహాగతః. 131

---

ఆ యింద్రజిత్తు, నే నెంతకును ఓడనని, తన సైన్యము నష్టమైనదని తెలిసికొని, వెంటనే బ్రహ్మాస్త్రముతో నన్ను బంధించెను. 127

అనంతరము రాక్షసులు నన్ను త్రాళ్ళతో బంధించి రావణుని చెంతకు కొనిపోయిరి. నేనపుడు రావణుని చూచి దురాత్ముడగు అతనితో మాటలాడితిని. 128

అపుడు నేను లంక కేల వచ్చితినో, రాక్షసుల నేల వధించితినో చెప్పుమని నన్నడిగిరి. నే నది యంతయు సీతాదేవిని చూచుటకే యని పలికితిని. 129

ఓ రాజా! నే నీమెను చూచుటకే యిట కేతెంచితిని. నేను వాయునందనుడను. హనుమంతు డను వానరుడను. 130

నేను రాముని దూతను. సుగ్రీవుని మంత్రిని. రాముని దూతనై నీకడకు వచ్చితిని. 131

మహాతేజశ్శాలి యగు సుగ్రీవుడు నిన్ను కుశల మడిగినాడు. ధర్మార్థకామసహితము,

సుగ్రీవశ్చ మహాతేజా స్స త్వాం కుశల మబ్రవీత్,
ధర్మార్థకామసహితం హితం పథ్య మువాచ చ. 132
వసతో ఋశ్యమూకే మే పర్వతే విపులద్రుమే,
రాఘవో రణవిక్రాంతో మిత్రత్వం సముపాగతః. 133
తేన మే కథితం రాజ్ఞా భార్యా మే రక్షసా హృతా,
తత్ర సాహాయ్య మస్మాకం కార్యం సర్వాత్మనా త్వయా. 134
మయా చ కథితం తస్మై వాలినశ్చ వధం ప్రతి,
తత్ర సాహాయ్యహేతో ర్మే సమయం కర్తుమర్హసి. 135
వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ మహాప్రభుః,
చక్రేఽగ్నిసాక్షికం సఖ్యం రాఘవ స్సహలక్ష్మణః. 136
తేన వాలిన ముత్పాట్య శరే ణైకేన సంయుగే,
వానరాణాం మహారాజః కృత స్స ప్లవతాం ప్రభుః. 137

---

ఈ లోకముననను, పరలోకముననను కూడ హితకరమగు వాక్యమును నీకు చెప్పినాడు. 132

"వృక్షము లధికముగా కల ఋశ్యమూకమను పర్వతమందు యుద్ధకోవిదుడగు రాముడు నాకు మిత్రుడయ్యెను. 133

నా భార్యను రాక్షసు డొక డపహరించినాడు. ఆ విషయమున అన్ని విధములుగను నీవు సహాయము చేయవలయును" అని యా రాముడు నన్ను కోరినాడు. 134

నేనును వాలిని వధింపవలసినదనియు, ఆ విషయమున నీవు నాకు సహాయము చేయవలె ననియు రాముని కోరితిని." 135

అపుడు వాలివలన రాజ్యము పోగొట్టుకొనిన సుగ్రీవునితో మహాప్రభువగు రాముడు లక్ష్మణసమేతుడై అగ్నిసాక్షికముగ చెలిమి చేసెను. 136

అపుడు రాము డొకే బాణము వేసి యుద్ధమున వాలిని చంపి సుగ్రీవుని వానరులకు మహారాజును చేసెను. 137

తస్య సాహాయ్య మస్మాభిః కార్యం సర్వాత్మనా త్విహ,
తేన ప్రస్థాపిత స్తుభ్యం సమీప మిహ ధర్మతః. 138
క్షిప్ర మానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ,
యావ న్న హరయో వీరా విధమంతి బలం తవ. 139
వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా,
దేవతానాం సకాశం చ యే గచ్ఛంతి నిమంత్రితాః. 140
ఇతి వానరరాజ స్త్వా మాహే త్యభిహితో మయా,
మామైక్షత తతః క్రుద్ధ శ్చక్షుషా ప్రదహ న్నివ. 141
తేన వధ్యోఽహ మాజ్ఞప్తో రక్షసా రౌద్రకర్మణా,
మత్ప్రభావ మవిజ్ఞాయ రావణేన దురాత్మనా. 142
తతో విభీషణో నామ తస్య భ్రాతా మహామతిః,

---

కావున మే మా రాముని కన్నివిధములుగను సహాయము చేయవలసి యున్నది. ఆ కారణముచే ధర్మసమ్మతమగు రీతిని రాముడు నీ కడకు నన్నంపినాడు. 138

కావున వానరులు నీ సైన్యమును నాశనము చేయుటకు ముందే సీతను తీసికొనివచ్చి రాముని కర్పింపుము. 139

సహాయార్థము పిలువగా దేవతలకడకు పోయి, వారికి తోడుపడి, జయము కలుగజేయు వానరుల ప్రభావమును పూర్వ మెరుగనివా రెవ్వరు? 140

ఈ విధముగ వానరరాజగు సుగ్రీవుడు పలికినాడని నేను రావణునకు తెలిపితిని. అతడు కోపము పెల్లుబుకగా తన కన్నులతో కాల్చువానివలె నన్ను తీక్ష్ణముగ చూచెను. 141

దురాత్ముడు, క్రూరుడగు రావణుడు నా ప్రభావము తెలియక నన్ను చంప నాజ్ఞాపించెను. 142

అపుడా రావణుని సోదరుడు, మహాబుద్ధిశాలి యగు విభీషణుడు నాకొఱకై అన్న

తేన రాక్షసరాజోఽసౌ యాచితో మమ కారణాత్. 143

నైవం రాక్షసశార్దూల త్యజ్యతా మేష నిశ్చయః,
రాజశాస్త్రవ్యపేతో హి మార్గ స్సంసేవ్యతే త్వయా. 144

దూతవధ్యా న దృష్టా హి రాజశాస్త్రేషు రాక్షస,
దూతేన వేదితవ్యం చ యథార్థం హితవాదినా. 145

సుమహ త్యపరాధేఽపి దూతస్యాతులవిక్రమ,
విరూపకరణం దృష్టం న వధోఽస్తీతి శాస్త్రతః. 146

విభీషణే నైవముక్తో రావణ స్సందిదేశ తాన్,
రాక్షసా నేత దేవాస్య లాంగూలం దహ్యతామితి. 147

తతస్తస్య వచః శ్రుత్వా మమ పుచ్ఛం సమంతతః,
వేష్టితం శణవల్కైశ్చ జీర్ణైః కార్పాసజైః పటైః. 148

రాక్షసా స్సిద్ధసన్నాహా స్తత స్తే చండవిక్రమాః,

---

నిట్లు ప్రార్థించెను. 143

"ఓ రాక్షసోత్తమా! ఇట్లు చేయుట తగదు. నీ వీ నిశ్చయము వీడుము. రాజశాస్త్ర విరుద్ధమగు మార్గమును నీ వవలంబించుచున్నావు. 144

ఓ రాక్షసరాజా! రాజశాస్త్రములం దెచ్చటను దూతను వధించవచ్చునని చెప్పలేదు. దూత యన్నవాడు తన స్వామి హితముగోరి వాస్తవము పలుకవలెను. 145

ఓ అతులితపరాక్రముడా! మహాపరాధమే చేసినను దూతకు అంగవైరూప్యమును తప్ప మరణదండనమును శాస్త్రము విధించలేదు." 146

విభీషణు డిట్లు చెప్పగా రావణుడు "ఈ వానరుని తోకను కాల్చు" డని రాక్షసుల కాజ్ఞాపించెను. 147

రావణుని వచనము విని, రాక్షసులు నా తోక నన్నివైపులనుండియు జనుపనారతో, గుడ్డపీలికలతో చుట్టిరి. అట్లు సన్నాహ మొనర్చి, తీవ్రపరాక్రమముగల రాక్షసులు

తదాஉదహ్యంత మే పుచ్ఛం నిఘ్నంతః కాష్ఠముష్టిభిః,
బద్ధస్య బహుభిః పాశై ర్యంత్రితస్య చ రాక్షసైః. 149

తతస్తే రాక్షసా శ్శూరా బద్ధం మా మగ్నిసంవృతమ్,
అఘోషయన్ రాజమార్గే నగరద్వార మాగతాః. 150

తతోஉహం సుమహద్రూపం సంక్షిప్య పునరాత్మనః,
విమోచయిత్వా తం బంధం ప్రకృతిస్థః స్థితః పునః. 151

ఆయసం పరిఘం గృహ్య తాని రక్షాం స్యసూదయమ్,
తత స్తన్నగరద్వారం వేగే నాప్లుతవా నహమ్. 152

పుచ్ఛేన చ ప్రదీప్తేన తాం పురీం సాట్టగోపురామ్,
దహామ్యహ మసంభ్రాంతో యుగాంతాగ్ని రివ ప్రజాః. 153

వినష్టా జానకీ వ్యక్తం న హ్యదగ్ధః ప్రదృశ్యతే,
లంకాయాం కశ్చిదుద్దేశ స్సర్వా భస్మీకృతా పురీ. 154

---

నన్ను కట్టెలతో, పిడికళ్ళతో కొట్టుచు అనేక త్రాళ్ళతో నా తోకను కట్టి కాల్చిరి. 149

శూరులగు రాక్షసు లట్లు నన్ను బంధించి, నా తోక కాలుచుండగా నన్ను తోడ్కొని నగరద్వారము కడకు వచ్చి "ఈ వానరుడు చేసిన అపరాధమునకు దండనముగా బంధనము, పుచ్ఛదహనము చేయుచుంటి"మని ఉద్ఘోషించిరి. 150

పిమ్మట నేను నా పెనురూపును చిన్నదిగా చేసికొని, కట్లు జారవిడచుకొని యెప్పటివలె నా శరీరము పెంచుకొనినవాడనై ఇనుపగుదియను చేతబట్టి దానితో రాక్షసులను చంపి పిమ్మట వేగముగ ఆ నగరద్వారముపై కెగిరితిని. 151,152

మండుచున్న నా తోకతో మిద్దెలు, గోపురములతో కూడిన లంకానగరమును ప్రళయాగ్ని ప్రజలనువలె, ఏ వెఱపును లేకయే కాల్చితిని. 153

"సీతాదేవి యీ మంటలో నశించె ననుట స్పష్టము. ఏలన ఈ లంకలో తగులబడని ప్రదేశమే లేదు. నగరి యంతయు బూడిదయైనది. 154

దహతా చ మయా లంకాం దగ్ధా సీతా న సంశయః. 155
రామస్య హి మహత్ కార్యం మయేదం వితథీకృతమ్,
ఇతి శోకసమావిష్ట శ్చింతా మహ ముపాగతః. 156
అథాహం వాచ మశ్రౌషం చారణానాం శుభాక్షరామ్,
జానకీ న చ దగ్ధేతి విస్మయోదంతభాషిణామ్. 157
తతో మే బుద్ధి రుత్పన్నా శ్రుత్వా తా మద్భుతాం గిరమ్,
అదగ్ధా జానకీత్యేవం నిమిత్తై శ్చోపలక్షితా. 158
దీప్యమానే తు లాంగూలే న మాం దహతి పావకః,
హృదయం చ ప్రహృష్టం మే వాతా స్సురభిగంధినః. 159
తై ర్నిమిత్తై శ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ సిద్ధార్థై రభవం హృష్టమానసః. 160

---

నే నీ లంకను కాల్చుటచే సీతయు దహింపబడినది. సందేహము లేదు. 155

రాముని మహాకార్యము నిట్లు నేను నిష్ఫల మొనరించితిని". అని దుఃఖాక్రాంతుడనై చింతించితిని. 156

అట్టి సమయమున, సీతాదేవి తగులబడలేదని ఆశ్చర్యముతో పలుకుచున్న చారణుల శుభవాక్యముల నాకర్ణించితిని. 157

ఆ చారణు లాశ్చర్యముతో మాటలాడిన వాక్యముచే సీత తగులబడలేదని నిశ్చయమునకు వచ్చితిని. ఆ నిశ్చయమును శుభనిమిత్తములు బలపఱచినవి. 158

తోక తగులబడుచున్నను, అగ్ని నన్ను కాల్చుటలేదు. నా హృదయము ప్రసన్నముగ నున్నది. వాయువులు సుగంధమును ప్రసరింపజేయుచు వీచుచున్నవి. 159

దృష్టఫలములగు ఆ నిమిత్తములచేతను, సఫలములగు కారణములచేతను, బాధితములు కాని చారణవాక్యములచేతను మదిలో సంతసించితిని. 160

పున ర్దృష్ట్వా చ వైదేహీం విసృష్టశ్చ తయా పునః. 161

తతః పర్వత మాసాద్య తత్రారిష్ట మహం పునః,
ప్రతిప్లవన మారేభే యుష్మద్దర్శనకాంక్షయా. 162

తతః పవనచంద్రార్కసిద్ధగంధర్వసేవితమ్,
పంథాన మహ మాక్రమ్య భవతో దృష్టవా నిహ. 163

రాఘవస్య ప్రభావేణ భవతాం చైవ తేజసా,
సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వ మనుష్ఠితమ్. 164

ఏతత్ సర్వం మయా తత్ర యథావ దుపపాదితమ్,
అత్ర యన్న కృతం శేషం తత్ సర్వం క్రియతామితి. 165

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టపంచాశః సర్గః.

---

అట్లు సీతాదేవి కే యాపదయు కలుగలేదని యూహించి, ఆమెను మఱల దర్శించి, ఆమెకడ సెలవు గైకొంటిని. 161

అటుపై అరిష్టపర్వతము కడ కేగి మిమ్ములను దర్శించు కోరికతో తిరుగు ప్రయాణమునకై ఎగిరితిని. 162

పిమ్మట వాయువు, చంద్రుడు, సూర్యుడు, సిద్ధులు, గంధర్వులు తిరుగాడు ఆకాశ మార్గమును గడచి మిమ్మిచట చూడగలిగితిని. 163

రాముని ప్రభావము, మీ తేజము కారణముగా మన రాజు సుగ్రీవుని కార్యార్థము నేను కర్తవ్యమంతయు నిర్వహించితిని. 164

నేను లంకకు వెడలినది మొదలు ఏ యే కృత్యము లొనర్చితినో, యథాతథముగ తెలిపితిని. ఇంక నేనేమి చేయక విడచితినో దానినంతను చేయవలసియున్నది" అని హనుమ వానరముఖ్యులకు తెలిపెను. 165

ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున
*సుందరకాండమున ఏబదియెనిమిదవ సర్గము.*

525

# 59. ఏకోనషష్టితమః సర్గః

*(రావణుని చంపుటకు వానరుల దర్పోక్తులు)*

ఏత దాఖ్యాయ తత్సర్వం హనుమాన్ మారుతాత్మజః,
భూయ స్సముపచక్రామ వచనం వక్తు ముత్తరమ్. 1

సఫలో రాఘవోద్యోగ స్సుగ్రీవస్య చ సంభ్రమః,
శీల మాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః. 2

తపసా ధారయే ల్లోకాన్ క్రుద్ధో వా నిర్దహేదపి,
సర్వథాఽతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః. 3

తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్,
న తదగ్నిశిఖా కుర్యాత్ సంస్పృష్టా పాణినా సతీ.
జనక స్యాత్మజా కుర్యాత్ యత్క్రోధకలుషీకృతా. 4

---

వాయుపుత్రుడగు హనుమంతు డీ విధముగ సవిస్తరముగ సీతాన్వేషణవృత్తాంతము తెలిపి, మఱల ని ట్లనంతరవాక్యము పలికెను. 1

శ్రీరాముని కార్యము సఫలమైనది. సుగ్రీవుని ఉత్సాహమును ఫలించినది. సీతాదేవి పాతివ్రత్యము గమనించి, నా మనస్సు పరవశమైనది. 2

రాక్షసరాజగు రావణుడు మహాతపస్సంపన్నుడు. తపస్సుచే వృద్ధినందిన అతడు కోపించినచో లోకములనే దహింపగలుగును. అంతటి తపస్సంపన్ను డగుటచేతనే సీతాదేవిని తాకినను అతని శరీరము దగ్ధము కాలేదు. 3

సీతాదేవియే కోపించినచో ఎట్లు తగులబెట్టగలదో, చేతితో తాకిన అగ్నిశిఖయు అట్లు కాల్పజాలదు. 4

జాంబవత్ప్రముఖాన్ సర్వా ననుజ్ఞాప్య మహాహరీన్,
అస్మిన్నేవంగతే కార్యే భవతాం చ నివేదితే,
న్యాయ్యం స్మ సహ వైదేహ్యా ద్రష్టుం తౌ పార్థివాత్మజౌ. 5
అహ మేకోఽపి పర్యాప్తః సరాక్షసగణాం పురీమ్,
తాం లంకాం తరసా హంతుం రావణం చ మహాబలమ్. 6
కిం పున స్సహితో వీరై ర్బలవద్భిః కృతాత్మభిః,
కృతాస్త్రైః ప్లవగైః శ్శూరై ర్భవద్భి ర్విజయైషిభిః. 7
అహం తు రావణం యుద్ధే ససైన్యం సపురస్సరమ్,
సహపుత్రం వధిష్యామి సహోదరయుతం యుధి. 8
బ్రాహ్మ మైంద్రం చ రౌద్రం చ వాయవ్యం వారుణం తథా,
యది శక్రజితోఽస్త్రాణి దుర్నిరీక్షాణి సంయుగే, 9

---

కావున ఇపుడు జాంబవంతుడు మున్నగు మహాకపుల అనుమతి వడసి, గడచిన కార్యమంతయు మీకు నివేదించిన పిమ్మట భృత్యవిజయము కూడ స్వామివిజయమే కనుక, ఇప్పుడు లంక కేగి సీతాదేవిని తీసికొనివచ్చి ఆమెతో కూడ రామలక్ష్మణులను చూచుట యుక్తమని తోచుచున్నది. 5

నే నొంటరిగనే నా బలముతో సకల రాక్షసులతో కూడిన లంకానగరమును జయించి, మహాబలశాలియగు రావణుని పంహరింపజాలుదును. 6

అట్టిచో వీరులు, బలవంతులు, ధీమంతులు, శస్త్రాస్త్రప్రయోగకుశలురు, శూరులు, విజయము కోరువారు అగు మీతో కలసి జయింపగలనని వేఱుగా చెప్పవలెనా? 7

నేను యుద్ధమున రావణుని, అతని సైన్యమును, అనుచరులను, పుత్రులను, సహోదరులను కూడ చంపెదను. 8

యుద్ధమున ఇంద్రజిత్తు ప్రయోగించెడి బ్రహ్మాస్త్రము, ఇంద్రాస్త్రము, రౌద్రాస్త్రము, వాయవ్యాస్త్రము, వారుణాస్త్రము మున్నగు తేఱిచూడరాని మహాస్త్రములను గూడ

తా న్యహం విధమిష్యామి హనిష్యామి చ రాక్షసాన్,
భవతా మభ్యనుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి తమ్. 10

మయాఽతులా విసృష్టా హి శైలవృష్టి ర్నిరంతరా,
దేవానపి రణే హన్యాత్ కిం పునరస్తా న్నిశాచరాన్. 11

సాగరోఽప్యతియా ద్వేలాం మందరః ప్రచలేదపి,
న జాంబవంతం సమరే కంపయే దరివాహినీ. 12

సర్వరాక్షససంఘానాం రాక్షసా యే చ పూర్వకాః,
అల మేకో వినాశాయ వీరో వాలిసుతః కపిః. 13

పనస స్యోరువేగేన నీలస్య చ మహాత్మనః,
మందరోఽప్యవశీర్యేత కిం పున ర్యుధి రాక్షసాః. 14

సదేవాసురయక్షేషు గంధర్వోరగపక్షిషు,

---

నిష్ఫలములను చేసి, రాక్షసులను చంపెదను. మీ రనుమతించినచో నా వరాక్రమము రావణుని బంధించగలదు. 9,10

యుద్ధమున నే నెడతెగక కురిపించు రాలవాన దేవతలనే సంహరించు నన్నచో రాక్షసుల విషయము వేఱుగా చెప్పవలయునా? 11

సముద్రమైన ఒడ్డును మీరవచ్చును. మందరపర్వతమైన చలింపవచ్చును కాని యుద్ధమున శత్రుసైన్యము జాంబవంతు వే మాత్రము కంపింపజేయజాలదు. 12

సకలరాక్షససమూహములకు అగ్రేసరులగు వారి నెల్లరను మట్టుపెట్టుట కొక్క వాలిసుతుడగు అంగదుడు చాలును. 13

మహాత్ముడగు పనసుడు, నీలుడు వీరల తొడల వేగముచే మందరపర్వతమే బ్రద్దలగు ననగా యుద్ధమున రాక్షసుల విషయము వేఱుగా చెప్పవలయునా? 14

దేవతలలో, అసురులలో, యక్షులలో, గంధర్వులలో, ఉరగులలో మైందునితోగాని, ద్వివిదునితో గాని తలపడగల శత్రువీరు దున్నచో చెప్పుడు. 15

మైందస్య ప్రతియోద్ధారం శంసత ద్వివిదస్య వా. 15
అశ్విపుత్రౌ మహాభాగా వేతౌ ప్లవగసత్తమౌ,
ఏతయోః ప్రతియోద్ధారం న పశ్యామి రణాజిరే. 16
పితామహవరోత్సేకాత్ పరమం దర్ప మాస్థితౌ,
అమృతప్రాశినా వేతౌ సర్వవానరసత్తమౌ. 17
అశ్వినో ర్మాననార్థం హి సర్వలోకపితామహః,
సర్వావధ్యత్వ మతుల మనయో ర్దత్తవాన్ పురా. 18
వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూమ్,
సురాణా మమృతం వీరౌ పీతవంతౌ ప్లవంగమౌ. 19
ఏతావేవ హి సంక్రుద్ధౌ సవాజిరథకుంజరామ్,
లంకాం నాశయితుం శక్తౌ సర్వే తిష్ఠంతు వానరాః. 20
మయైవ నిహతా లంకా దగ్ధా భస్మీకృతా పునః,

---

మహాత్ములగు మైందద్వివిదు లశ్వినీదేవతలకు పుట్టిన వానరశ్రేష్ఠులు. యుద్ధరంగమున వీరితో తలపడజాలు యోధులు నా కగపడలేదు. 16

ఈ మైందద్వివిదు లిద్దరును బ్రహ్మవరమును సంపాదించి, మిక్కిలి గర్వము కలిగియున్నారు. వీ రమృతము త్రాగినవారు. సకలవానరులలో శ్రేష్ఠులు. 17

పూర్వము బ్రహ్మ అశ్వినీదేవతలకు సంతోషము కలిగించుటకై మైందద్వివిదుల కెవ్వరివల్లను చావులేకుండుట యను సాటిలేని వరమిచ్చినాడు. 18

అట్లా బ్రహ్మవరముచే మదించిన యీ మైందద్వివిదులు పెద్ద శత్రుసేనను చెండాడి, దేవతల యమృతమును త్రాగిరి. 19

వీరిద్దరు కోపించినంతమాత్రముననే గుఱ్ఱములు, రథములు, ఏనుగులతో గూడ లంకనెల్ల నాశము చేయజాలుదురు. తక్కిన వానరుల మాట యటుంచుడు. 20

నేనే లంకను పాడుచేసితిని. కాల్చి బూడిద చేసితిని. రాజమార్గములం దెల్ల

రాజమార్గేషు సర్వత్ర నామ విశ్రావితం మయా. 21

జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవే ణాభిపాలితః. 22

అహం కోసలరాజస్య దాసః పవనసంభవః,
హనుమా నితి సర్వత్ర నామ విశ్రావితం మయా. 23

అశోకవనికామధ్యే రావణస్య దురాత్మనః,
అధస్తా చ్ఛింశుపావృక్షే సాధ్వీ కరుణ మాస్థితా. 24

రాక్షసీభిః పరివృతా శోకసంతాపకర్శితా,
మేఘలేఖాపరివృతా చంద్రలేఖేవ నిష్ప్రభా. 25

అచింతయంతీ వైదేహీ రావణం బలదర్పితమ్,
పతివ్రతా చ సుశ్రోణీ అవష్టబ్ధా చ జానకీ. 26

---

పేరును పెద్దగా చాటించితిని. 21

"అతిబలశాలియగు రామునకు జయము. మహాబలుడగు లక్ష్మణునకు జయము. రామునిచే కాపాడబడుచున్న వానరరాజు సుగ్రీవునకు జయము. 22

నేను కోసలదేశాధిపతి యగు రాముని దాసుడను. వాయుపుత్రుడను. హనుమంతుడ" నని యంతటను నా పేరు ప్రకటించితిని. 23

పతివ్రతయగు సీతాదేవి దురాత్ముడగు రావణుని యశోకవనమధ్యమందు శింశుపా వృక్షము క్రింద దుఃఖితయై యున్నది. రాక్షసాంగన లామెను చుట్టుముట్టి యున్నారు. 24

ఆమె శోకముతో, మనస్తాపముతో పీడింపబడుచు మేఘసమూహముచే కప్పబడిన చంద్రరేఖవలె కాంతి తొలగియున్నది. పతివ్రత, సుందరమగు కటిప్రదేశము కలదగు ఆమె బలగర్వితుడగు రావణుని తలంపనైన తలంపక రావణుని నిర్బంధమున ఉండియు రామునే ధ్యానించుచున్నది. 25,26

అనురక్తా హి వైదేహీ రామం సర్వాత్మనా శుభా,
అనన్యచిత్తా రామే చ పౌలోమీవ పురందరే. 27

తదేకవాసస్సంవీతా రజోధ్వస్తా తథైవ చ,
శోకసంతాపదీనాంగీ సీతా భర్తృహితే రతా. 28

సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
రాక్షసీభి ర్విరూపాభి ర్దృష్టా హి ప్రమదావనే. 29

ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా,
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే. 30

రావణా ద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథంచి న్మృగశాబాక్షీ విశ్వాస ముపపాదితా. 31

తత స్సంభాషితా చైవ సర్వ మర్థం చ దర్శితా,

---

మంగళరూపిణి యగు సీత శచీదేవి దేవేంద్రునియందువలె సర్వాత్మనా రామునియందే యనురాగము కలదై, వేఱొకనియందు మనసు నిలుపకున్నది. 27

సీతాదేవి యొకే వస్త్రమును విడువక ధరించినది. ఆమె శరీరము దుమ్ముచే మలినమై యున్నది. దుఃఖపీడిత అయినను ఆమె పతిహితమువే కోరుచున్నది. 28

ఆమె యశోకవనమందు విరూపముగల రాక్షసస్త్రీల నడుమ నున్నదై వారిచే మాటిమాటికి భయపెట్టబడుచుండగా చూచితిని. 29

ఒకే జడకట్టిన కేశములు కలదై, దీనయై, భర్తను గూర్చియే ధ్యానించుచు, నేలపైననే పండుకొనుచు, కాంతిహీనయై, శిశిరర్తువునందు తామరతీగవలె నున్నది. రావణునియందు పెడమొగమై మరణింప నిశ్చయించిన ఆ లేడిపిల్ల కన్నుల వంటి కన్నులు గల సీతకు ఎట్లో విశ్వాసము కలిగించితిని. 30,31

ఆ పైన ఆమెతో మాటలాడి విషయమంతయు తెలిపితిని. రామసుగ్రీవుల మైత్రి నెఱిగి ఆమె సంతోషించినది. 32

రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతి ముపాగతా. 32

నియత స్సముదాచారో భక్తి ర్భర్తరి చోత్తమా,
యన్న హంతి దశగ్రీవం స మహాత్మా కృతాగసమ్,
నిమిత్తమాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి. 33

సా ప్రకృత్త్యైవ తన్వంగీ తద్వియోగాచ్చ కర్శితా,
ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా. 34

ఏవ మాస్తే మహాభాగా సీతా శోకపరాయణా,
యదత్ర ప్రతికర్తవ్యం తత్సర్వ ముపపద్యతామ్. 35

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే*
*ఏకోనషష్టితమః సర్గః.*

---

సీతయొక్క సత్ప్రవర్తన మార్పులేక యున్నది. అట్లే భర్తపై ఆమె యనురాగము అచంచలముగా నున్నది. అట్టి యామె పాపియగు రావణుని తన ప్రభావముచే చంపకున్నదన్నచో అతడు నిజముగ మహానుభావుడే. (శాపమువలన అతనికి మృత్యువు విహితము కాలేదు కనుక) కావున రావణుని వధించుటకు రాముడు నిమిత్తమాత్రుడు కాగలడు. సీతాపచారమే రావణుని వినాశమునకు మూలకారణము. 33

సహజముగనే కృశాంగి యగు ఆమె, రాము నెడబాసి మఱింత కృశించినదై, పాడ్యమినాడు చదువువాని (ఆరంభశూరుని లేదా అనధ్యాయదినములలో పాడ్యమి యుండుటచే ఆనాడు అధ్యయనము చేయువాని) విద్య యెట్లు క్షీణించునో అట్లు కృశించియున్నది. 34

ఇట్లు సీతాదేవి సదా శోకించుచున్నది. కావున ఇపు డేది కర్తవ్యమో దాని నాచరించుడు" అని హనుమ వానరులతో చెప్పెను. 35

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున ఏబదితొమ్మిదవ సర్గము.*

# 60. షష్టితమః సర్గః

*(అంగదజాంబవత్సంవాదము)*

తస్య తద్వచనం శ్రుత్వా వాలిసూను రభాషత,
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః,
సమీపం గంతు మస్మాభీ రాఘవస్య మహాత్మనః. 1
దృష్టా దేవీ న చానీతా ఇతి తత్ర నివేదనమ్,
అయుక్తమివ పశ్యామి భవద్భిః ఖ్యాతవిక్రమైః. 2
న హి నః ప్లవనే కశ్చి న్నాపి కశ్చిత్ పరాక్రమే,
తుల్య స్సామరదైత్యేషు లోకేషు హరిసత్తమాః. 3
తేష్వేవం హతవీరేషు రాక్షసేషు హనూమతా,
కిమన్య దత్ర కర్తవ్యం గృహీత్వా యామ జానకీమ్. 4

---

హనుమంతుడు పలికినది విని వాలితనయుడగు అంగదు డిట్లనెను. 'ఓ వానరులారా! సీతాదేవిని దర్శించి, యామెను తీసికొనిపోవకయే మహాత్ముడగు రామునికడకు పోవుట అయుక్తమని తలంతును. 1

ప్రసిద్ధమగు పరాక్రమము కల వీరందరును రామునికడ కేగి, సీతాదేవిని చూచితిమి గాని, తీసికొని రాలేదని పలుకుట తగదని నాకు తోచుచున్నది. 2

వానరులారా! ఎగురుటలో గాని, పరాక్రమమున గాని దేవతలలో, దైత్యులలో ఎవ్వడును హనుమంతునకు సాటి కాజాలడు. 3

అట్లు హనుమంతుడే లంకలోని రాక్షసవీరులను సంహరించగా మన కింక వేఱు కర్తవ్య మేమున్నది? సీతాదేవిని తీసికొనియే రామసన్నిధికి పోవుదము. 4

తమేవం కృతసంకల్పం జాంబవాన్ హరిసత్తమః,
ఉవాచ పరమప్రీతో వాక్యమర్థవ దర్థవిత్. 5

న తావదేషా మతి రక్షమా నో, యథా భవాన్ పశ్యతి రాజపుత్ర,
యథా తు రామస్య మతిర్నివిష్టా, తథా భవాన్పశ్యతు కార్యసిద్ధిమ్. 6

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షష్టితమః సర్గః.*

---

కర్తవ్యమును చక్కగా నెఱిగిన వానరశ్రేష్ఠుడగు జాంబవంతుడు అట్లు సీతాదేవిని తీసికొనిపోయి రాముని చూడవలెనని నిశ్చయించుకొనిన అంగదునితో నిట్లు ప్రీతిపూర్వకముగ పలికెను. 5

"ఓ రాజపుత్రా! నీవు పలికినది ఎంత మాత్రము అయుక్తము కాదు. అట్లు యుక్తమయ్యును (మన మెంత సమర్థుల మయ్యును) మనము రామాజ్ఞ చొప్పుననే నడచుకొనవలెను గాని స్వతంత్రముగ కాదు. కావున ఆ విధముగ కార్యసిద్ధి కలుగునట్లు ఆచరింపు" మని అంగదునకు జాంబవంతుడు పలికెను. 6

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున అఱువదవ సర్గము.*

# 61. ఏకషష్టితమః సర్గః

*(వానరులు మధువనమును ధ్వంసము చేయుట)*

తతో జాంబవతో వాక్య మగృహ్ణంత వనౌకసః,
అంగదప్రముఖా వీరా హనుమాంశ్చ మహాకపిః. 1

ప్రీతిమంత స్తత స్సర్వే వాయుపుత్రపురస్సరాః,
మహేంద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః. 2

మేరుమందరసంకాశా మత్తా ఇవ మహాగజాః,
ఛాదయంత ఇవాకాశం మహాకాయా మహాబలాః. 3

సభాజ్యమానం భూతై స్త మాత్మవంతం మహాబలమ్,
హనుమంతం మహావేగం వహంత ఇవ దృష్టిభిః. 4

---

అట్లు పలికిన జాంబవంతుని వాక్యమును అంగదుడు మున్నగు వీరులు, మహాకపి యగు హనుమంతుడు, తక్కిన వానరులును అంగీకరించిరి. 1

అవుడా వానరశ్రేష్ఠు లందఱును హనుమంతుని ముందిడుకొని మహేంద్రపర్వతమును విడచి పైకెగసిరి. 2

మహాబలులగు వారు మేరుమందరపర్వతములవలెను, మదించిన మహాగజముల వలెను మహాకాయు లగుటచే, ఆకాశమును కప్పివేయుచున్నట్లు పై కెగసిరి. 3

వారు భూతములచే పూజితుడు, ధీరుడు, మహాబలుడు, మహావేగుడగు హనుమంతుని ప్రీతితో నట్లే రెప్పవేయక చూచుచుండుటచే, తమ చూపులపై అతనిని కూర్చుండబెట్టి మోసికొని పోవుచున్నట్లుండిరి. 4

వారు రామకార్యము సాధించి, అట్లు సాధించుటద్వారా గొప్పయశస్సును

రాఘవే చార్థనిర్వృత్తిం కర్తుం చ పరమం యశః,
సమాధాయ సమృద్ధార్థాః కర్మసిద్ధిభి రున్నతాః. 5
ప్రియాఖ్యానోన్ముఖా స్సర్వే సర్వే యుద్ధాభినందినః,
సర్వే రామప్రతీకారే నిశ్చితార్థా మనస్వినః. 6
ప్లవమానాః ఖమాప్లుత్య తతస్తే కాననౌకసః,
నందనోపమ మాసేదు ర్వనం ద్రుమలతాయుతమ్. 7
యత్త న్మధువనం నామ సుగ్రీవ స్యాభిరక్షితమ్,
అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్. 8
యద్రక్షతి మహావీర్య స్సదా దధిముఖః కపిః,
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః. 9
తే తద్వన ముపాగమ్య బభూవుః పరమోత్కటాః,

---

పొందగోరినవారు. రామకార్యము నిట్లు సాధించుటచే తక్కిన వానరులకంటె (వేరు దిక్కులకు పోయినవారి కంటె) అధికులు. 5

వారు రామునకు ప్రియమగు సీతాదర్శనవార్త నెరింగింప తహతహ పడుచు, (రావణునితో) యుద్ధము కోరుచు, రామునకు ప్రత్యుపకార మొనరింపవలెనని దృఢనిశ్చయముతో ఆకాశమున కెగసిపోవుచు నానావృక్షములు, లతలతో నందనవనమునకు సాటియగు ఒక వనమునకు పోయిరి. 6,7

అది సుగ్రీవుడు కాపాడు మధువనము. సకల ప్రాణికోటికి చొఱరానిది. సకలజీవులకు మనోహరమైనది. 8

దానిని మహాత్ముడు సుగ్రీవుని మేనమామ, మహాపరాక్రమశాలియగు దధిముఖుడను వానరముఖ్యుడు సదా రక్షించుచుండుము. 9

వానరు లా మధువనము కడ కేగి, వానరరాజు సుగ్రీవుని మదికి ఆనందము కలిగించు వానిలో మిక్కిలి గొప్పదైన ఆ వనమందలి మధువును త్రాగవలెనని

వానరా వానరేంద్రస్య మనఃకాంతతమం మహత్. 10

తతస్తే వానరా హృష్టా దృష్ట్వా మధువనం మహత్,
కుమార మభ్యయాచంత మధూని మధుపింగళాః. 11

తతః కుమార స్తాన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాన్ కపీన్,
అనుమాన్య దదౌ తేషాం నిసర్గం మధుభక్షణే. 12

తత శ్చానుమతా స్సర్వే సంప్రహృష్టా వనౌకసః,
ముదితాః ప్రేరితాశ్చాపి ప్రనృత్యంతో ఽ భవం స్తతః. 13

గాయంతి కేచిత్ ప్రణమంతి కేచిత్, నృత్యంతి కేచిత్ ప్రహసంతి కేచిత్,
పతంతి కేచి ద్విచరంతి కేచిత్, ప్లవంతి కేచిత్ ప్రలపంతి కేచిత్. 14

పరస్పరం కేచి దుపాశ్రయంతే, పరస్పరం కేచి దుపాక్రమంతే,

---

తహతహపడిరి. 10

అంత తేనెవలె పింగళవర్ణముగల వానరులు పెద్దదగు మధువనము నట్లు దర్శించి, తేనె త్రాగుటకు తమ్మనుమతింపవలసినదిగా అంగదుని ప్రార్థించిరి. 11

అపుడు యువరాజగు అంగదుడు వృద్ధులగు జాంబవంతుడు మున్నగు వానరముఖ్యుల అనుమతి వడసి, తేనె త్రాగుటకు వానరులను విడచెను. 12

సీతాదర్శనవార్త విన్నది మొదలు మిక్కిలి సంతోషపడుచున్న వానరులు తమ్ము అంగదు డట్లు అనుమతించుటచే మిక్కిలి సంతోషించి, అట్లు ప్రోత్సహించుటచే కలిగిన ఆనందము పట్టజాలక నాట్యము చేయసాగిరి. 13

ఆనందముతో కొందరు పాడసాగిరి. కొందరు వంగిరి. కొందరాడిరి. కొందరు పకపక నవ్విరి. కొందరు తలక్రిందులై పడిరి. కొందరు ఇటు నటు పరుగెత్తిరి. కొందరు ఎగిరిరి. కొంద రఱచిరి. 14

వారిలో కొంద రొండొరుల నాశ్రయించిరి. కొంద రొండొరులను పట్టుకొనిరి.

పరస్పరం కేచి దుపబ్రువంతే, పదస్పరం కేచి దుపారమంతే. 15
ద్రుమా ద్ద్రుమం కేచి దభిద్రవంతే, క్షితౌ నగాగ్రా న్నిపతంతి కేచిత్,
మహీతలాత్ కేచి దుదీర్ణవేగా, మహాద్రుమాగ్రా ణ్యభిసంపతంతి. 16
గాయంత మన్యః ప్రహస న్నుపైతి, హసంత మన్యః ప్రరుద న్నుపైతి,
రుదంత మన్యః ప్రణుద న్నుపైతి, నుదంత మన్యః ప్రణద న్నుపైతి.
సమాకులం తత్ కపిసైన్య మాసీ, న్మధుప్రపానోత్కటసత్త్వచేష్టమ్,
న చాత్ర కశ్చి న్న బభూవ మత్తో, న చాత్ర కశ్చి న్న బభూవ తృప్తః
తతో వనం తత్ పరిభక్ష్యమాణం, ద్రుమాంశ్చ విధ్వంసితపత్రపుష్పాన్,
సమీక్ష్య కోపా ద్దధివక్త్రనామా, నివారయామాస కపిః కపీం స్తాన్. 19
స తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో, వనస్య గోప్తా హరివీరవృద్ధః,

---

కొంద రొండొరులతో గుసగుసలాడిరి. కొందరు పరస్పరము కలసి విహరించిరి. 15

కొంద రొకచెట్టునుండి వేఱొకచెట్టునకు పరుగెత్తిరి. కొందరు వృక్షాగ్రమున కెక్కి క్రిందకు దూకిరి. కొందరు మహావేగముతో క్రిందినుండి వృక్షాగ్రములపై కెగసిరి. 16

ఒకడు పాడుచుండగా వేరొకడు నవ్వుచు అతని చెంతకేగెను. అట్లు నవ్వువానిచెంతకు ఏడ్చుచు వేరొకడు పోయెను. వేఱొక డటు లేడ్చువానిని త్రోయుచు చెంతకేగెను. వేఱొక డఱచుచు ఆ త్రోసినవాని వెంత కేగెను. 17

ఇట్లా వానరు లెల్లరును తేనె నధికముగా త్రాగుటచే మత్తెక్కి విపరీతచేష్టలు చేయుచుండిరి. వారిలో మత్తెక్కనివాడుగాని, తేనె త్రాగుటచే తృప్తి నొందనివాడు గాని లేకుండెను. 18

అపు డా వనపాలుడగు దధిముఖుడు, కపులు వనమందలి మధువునట్లు భక్షించుటను, చెట్లు విఱచుటను, ఆకులు, పూవులు రాల్చుటను చూచి కోపముతో వారిని అడ్డుకొనెను. 19

వనరక్షకుడు, వానరవీరులలో వృద్ధుడగు ఆ దధిముఖు డట్లు వానరులను

చకార భూయో మతి ముగ్రతేజా, వనస్య రక్షాం ప్రతి వానరేభ్యః. 20
ఉవాచ కాంశ్చిత్ పరుషాని ధృష్ట, మసక్త మన్యాంశ్చ తలై ర్జఘాన,
సమేత్య కైశ్చిత్ కలహం చకార, తథైవ సామ్నోపజగామ కాంశ్చిత్. 21
స తై ర్మదాత్ సంపరివార్య వాక్యై ర్బలాచ్చ తేన ప్రతివార్యమాణైః,
ప్రధర్షిత స్త్యక్తభయై స్సమేత్య ప్రకృష్యతే చాప్యనవేక్ష్య దోషమ్. 22
నఖై స్తుదంతో దశనై ర్దశంత స్తలైశ్చ పాదైశ్చ సమాపయంతః,
మదాత్ కపిం తం కపయ స్సమగ్రా మహావనం నిర్విషయం చ చక్రుః. 23

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ఏకషష్టితమః సర్గః.*

---

నివారించియు, వారు చెలరేగి, తన్ను లక్ష్యము చేయక బెదరింపగా, ఉగ్రతేజు డగుటచే మఱల నా వనము నెట్లైన కాపాడ దలంచెను. 20

అతడు కొందరు వానరులను కఠినోక్తులతో వనము విఱువవలదని తీవ్రముగా పలికెను. కొందరి నఱచేత గొట్టెను. కొందరి వద్దకుపోయి వారితో జగడమాడెను. కొందరిని బుజ్జగించి వనము పాడుచేయవల దనెను. 21

అపుడు మధుపానముచే మత్తెక్కిన వానరులా దధిముఖుని లెక్కచేయక, భయము లేనివారై, అతనిని చుట్టి మాటలతో తిరస్కరించుచు, ఇతడు వనరక్షకుడని, ఇతని నేమియు చేయరాదని యైన తలంపక ఇటు నటు లాగి పీడించిరి. 22

పిమ్మట వా రా దధిముఖుని గోళ్ళతో గీరుచు, పండ్లతో కఱచుచు, చేతులతో, కాళ్లతో మోదుచు, ఆ మధువనమందలి సకలభోగ్యపదార్థములను మిగులకుండునట్లుగా తినిరి. 23

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువది ఒకటవ సర్గము.*

# 62. ద్విషష్టితమః సర్గః

*(సుగ్రీవునిచెంత దధిముఖుని వేదనము)*

తానువాచ హరిశ్రేష్ఠో హనుమాన్ వానరర్షభః, 1
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః,
అహ మావారయిష్యామి యుష్మాకం పరిపంథినః. 2
శ్రుత్వా హనుమతో వాక్యం హరీణాం ప్రవరోఽంగదః
ప్రత్యువాచ ప్రసన్నాత్మా పిబంతు హరయో మధు. 3
అవశ్యం కృతకార్యస్య వాక్యం హనుమతో మయా,
అకార్యమపి కర్తవ్యం కిమంగ పునరీదృశమ్. 4
అంగదస్య ముఖా చ్ఛ్రుత్వా వచనం వానరర్షభాః,
సాధు సాధ్వితి సంహృష్టా వానరాః ప్రత్యపూజయన్. 5

---

అంత వానరశ్రేష్ఠుడగు హనుమంతుడు వానరుల కిట్లు చెప్పెను. 1

ఓ వానరులారా! మీ రెంతమాత్రము జంకు లేక తేనె త్రాగుడు. అట్లు త్రాగుటలో మీకు విఘ్నము కలిగించువారిని నేను వారింతును. 2

వానరులలో శ్రేష్ఠుడగు అంగదు డా హనుమంతుని వాక్యము విని ప్రసన్నచిత్తుడై ఇట్లనెను. "వానరులారా! మీరు తేనె త్రాగుడు. 3

రామకార్యము సాధించిన హమమంతుడు అకార్యమే పలికినను దాని నాచరించ వలయును. అట్టిచో ఇక ఈ కార్యము విషయమున వేరుగా చెప్పవలెనా?" 4

ఆ వానరశ్రేష్ఠు లంగదుని నోట వెలువడిన వాక్యము విని యా వాక్యమును బాగు బాగని ప్రశంసించుచు ఆనందించిరి. 5

పూజయి త్వాంగదం సర్వే వానరా వానరర్షభమ్,
జగ్ము ర్మధువనం యత్ర నదీవేగా ఇవ ద్రుతమ్. 6

తే ప్రవిష్టా మధువనం పాలా నాక్రమ్య వీర్యతః,
అతిసర్గాచ్చ పటవో దృష్ట్వా శ్రుత్వా చ మైథిలీమ్,
పపు స్సర్వే మధు తదా రసవత్ ఫల మాదదుః. 7

ఉత్పత్య చ తత స్సర్వే వనపాలాన్ సమాగతాన్,
తాడయంతి స్మ శతశ స్సక్తాన్ మధువనే తదా. 8

మధూని ద్రోణమాత్రాణి బాహుభిః పరిగృహ్యా తే,
పిబంతి సహితాస్సర్వే నిఘ్నంతి స్మ తథా పరే. 9

కేచిత్ పీత్వాఽపవిధ్యంతి మధూని మధుపింగళాః,

---

అట్లు వానరశ్రేష్ఠు లెల్లరును అంగదుని కొనియాడి నదీప్రవాహావేగము తీరమునందలి చెట్టును పడద్రోయునట్లు, మధువనమును పాడుచేయుటకు అచట కేగిరి. 6

సమర్థులగు వానరు లట్లు మధువనము ప్రవేశించి, సహజపరాక్రమమువలనను, అంగదుడు స్వేచ్ఛగా మధువు త్రాగుటకు వారి ననుమతించుటచేతను, హనుమంతునిద్వారా సీతను చూచితి మను అనందమువేతను, ఆ వృత్తాంతమును వినుటవలన కలిగిన హర్షముచేతను, తమ బలిమితో అ వనపాలురను తోసివేసి, తేనెలు త్రాగిరి. రుచిగల పండ్లు తినిరి. 7

అట్లు వందలకొలది వానరులు, వనమును కాపాడుటకై తమ పైకి వచ్చిన వనరక్షకులపై బడి బాదిరి. 8

వారు తూమెడు తేనెతెట్టల నొక్కొక్కరు చేతబట్టి, యొక్కచోట చేరి తేనె త్రాగసాగిరి. అట్లు మరికొందరు త్రాగగా మిగిలిన తెట్టెలను త్రుంచిచేసిరి. 9

తేనెవలె పింగళవర్ణముగల కొందరు తేనె త్రాగి యా తేనెతెట్టెలను విసరివైచసాగిరి.

మధూచ్ఛిష్టేన కేచిచ్చ జఘ్ను రన్యోన్య ముత్కటాః. 10
అపరే వృక్షమూలే తు శాఖాం గృహ్య వ్యవస్థితాః,
అత్యర్థం చ మదగ్లానాః పర్ణా న్యాస్తీర్య శేరతే. 11
ఉన్మత్తభూతాః ప్లవగా మధుమత్తాశ్చ హృష్టవత్,
క్షిపంతి చ తదాన్యోన్యం స్ఖలంతి చ తథాఽపరే. 12
కేచిత్ క్ష్వేళాం ప్రకుర్వంతి కేచిత్ కూజంతి హృష్టవత్,
హరయో మధునా మత్తాః కేచిత్ సుప్తా మహీతలే. 13
కృత్వా కేచి ద్ధసంత్యన్యే కేచిత్ కుర్వంతి చేతరత్,
కృత్వా కేచి ద్వదం త్యన్యే కేచిద్ బుధ్యంతి చేతరత్. 14
యేఽప్యత్ర మధుపాలాః స్యుః ప్రేష్యా దధిముఖస్య తు,

---

కొందరు తేనె త్రాగి మత్తెక్కి, త్రాగగా మిగిలిన తేనెతెట్టెలతో నొకరి నొకరు కొట్టుకొనిరి. 10

మఱికొంద రధికముగ తేనె త్రాగుటచే మదించినవారై చెట్లక్రింద చేరి, ఒక కొమ్మను పట్టుకొని యుండి అంతకంతకు మత్తు పెరగగా దాని యాకులు నేలపై పఱచి వానిపై పరుండిరి. 11

ఆ వానరులు తేనె త్రాగి మత్తులై సంతోషముతో పరస్పరము ఎత్తి క్రింద పడవైచుకొనిరి. కొందరు నడువ జాలక ఒకరినొకరు తన్ని తోసికొనిరి. 12

మద్యము త్రాగి మత్తెక్కిన వానరులు కొందరు సింహనాదము చేసిరి. మరికొందరు హర్షముతో పక్షులవలె నఱచిరి. మఱికొందరు నేలపై నిదురించిరి. 13

కొందరు చేయరాని గ్రామ్యమగు పనిచేసి నవ్వసాగిరి. మఱికొందరు వేఱొక గ్రామ్యకర్మను చేయజొచ్చిరి. మరికొంద రింకొక గ్రామ్యకృత్య మొనర్చి మేమిట్లు చేసితిమి సుమా యని చెప్పుకొనసాగిరి. ఇంకను కొందరు మేమిట్లు చేసెదమని సంకల్పించసాగిరి. 14

మధువనము కాపాడుచున్న దధిముఖుని ఆజ్ఞానువర్తు లగువా రా

తేఽపి తై ర్వానరైర్భీమైః ప్రతిషిద్ధా దిశో గతాః. 15
జానుభిస్తు ప్రకృష్టాశ్చ దేవమార్గం ప్రదర్శితాః,
అబ్రువన్ పరమోద్విగ్నా గత్వా దధిముఖం వచః. 16
హనూమతా దత్తవరైర్హతం మధువనం బలాత్,
వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః. 17
తతో దధిముఖః క్రుద్ధో వనప స్తత్ర వానరః,
హతం మధువనం శ్రుత్వా సాంత్వయామాస తాన్ హరీన్. 18
ఇహాగచ్ఛత గచ్ఛామో వానరాన్ బలదర్పితాన్,
బలేన వారయిష్యామో మధు భక్షయతో వయమ్. 19
శ్రుత్వా దధిముఖ స్యేదం వచనం వానరర్షభాః,
పున ర్వీరా మధువనం తేనైవ సహసా యయుః. 20

---

భయంకరవానరులు తమ్ము తోసివేయగా ఎల్లదిశలకు పోయిరి. 15

ఆ వనపాలకులను వానరులు మోకాళ్ళు పట్టి లాగి అపానద్వారము చూపగా, వారు మిక్కిలి దుఃఖితులై దధిముఖుని కడకేగి యా వృత్తాంతము తెలిపిరి. 16

"హనుమంతు ననుమతి బడసిన వానరులు మధువనము పాడుచేసినారు. మోకాళ్ళు పట్టి మమ్ము లాగి అపానద్వారము చూపినారు. 17

అని వారు తెలుపగా, ఆ వనరక్షకుడగు దధిముఖుడు మధువనభంగము విని కోపించి, తన భృత్యులగు వానరుల నోదార్చెను. 18

అతడు వారితో "మీ రిటు నాతో రండు. మన మిపుడు పోయి బలగర్వితులై తేనెలను భక్షించుచున్న యా వానరులను మన బలముతో అడ్డుకొందము" అనెను. 19

దధిముఖుని వాక్యము వినిన వీరులగు ఆ వానరశ్రేష్ఠు లతనితో కూడి మఱల మధువనమున కేగిరి. 20

దధిముఖు డొక చెట్టును పెఱికి చేతబట్టి యా వానరుల నడుమ వేగముగ

మధ్యే చైషాం దధిముఖః ప్రగృహ్య తరసా తరుమ్,
సమభ్యధావ ద్వేగేన తే చ సర్వే ప్లవంగమాః. 21

తే శిలాః పాదపాం శ్చాపి పర్వతాంశ్చాపి వానరాః,
గృహీత్వాఽభ్యగమన్ క్రుద్ధా యత్ర తే కపికుంజరాః. 22

తే స్వామివచనం వీరా హృదయే ష్వవసజ్య తత్,
త్వరయా హ్యభ్యధావంత సాలతాలశిలాయుధాః. 23

వృక్షస్థాంశ్చ తలస్థాంశ్చ వానరాన్ బలదర్పితాన్,
అభ్యక్రామం స్తతో వీరాః పాలా స్తత్ర సహస్రశః. 24

అథ దృష్ట్వా దధిముఖం క్రుద్ధం వానరపుంగవాః,
అభ్యధావంత వేగేన హనుమత్ప్రముఖా స్తదా. 25

తం సవృక్షం మహాబాహు మాపతంతం మహాబలమ్,
ఆర్యకం ప్రాహర త్తత్ర బాహుభ్యాం కుపితోఽంగదః. 26

---

పోయెను. అతని యనుచరులును అట్లే పోయిరి. 21

వారు రాలను, చెట్లను, పర్వతములను పట్టుకొని కోపముతో అ వానరశ్రేష్ఠులగు అంగదుడు మొదలగువారున్న తావున కేగిరి. 22

ఆ మధువనపాలకులగు వానరులు, తమ యజమాని యగు దధిముఖుడు పలికిన మాటలు మదిలో నిలుపుకొని మద్దిచెట్లు, తాడిచెట్లు, రాళ్ళు ఆయుధములుగా కలవారై వేగముగా వరుగెత్తిరి. 23

ఆ వీరులగు వేలాది వనపాలకులు చెట్లపై, నేలపై బలగర్వితులై నిలచియున్న వావరులపై అక్రమణ మొనర్చిరి. 24

అంతట దధిముఖుడు కోపించుట గాంచి, హనుమంతుడు మున్నగు వానరశ్రేష్ఠులు వేగముగ వతనిపైకి వచ్చిరి. 25

అంతట అంగదుడు కోపించి, మహాభుజుడును, మహాబలుడును, వృక్షము చేబూని వచ్చి పడుచున్నవాడును అగు తన తాత దధిముఖుని చేతులతో కొట్టెను. 26

మదాంధశ్చ న వేదైన మార్యకోఽ_యం మమేతి సః,
అథైనం నిష్పిపేషాశు వేగవ ద్వసుధాతలే. 27

స భగ్నబాహూరుభుజో విహ్వల శ్శోణితోక్షితః,
ముమోహ సహసా వీరో ముహూర్తం కపికుంజరః. 28

స సమాశ్వస్య సహసా సంక్రుద్ధో రాజమాతులః,
వానరాన్ వారయామాస దండేన మధుమోహితాన్. 29

స కథంచి ద్విముక్త స్తైర్వానరై ర్వానరర్షభః,
ఉవాచైకాంతమాశ్రిత్య భృత్యాన్ స్వాన్ సముపాగతాన్. 30

ఏతే తిష్ఠంతు గచ్ఛామో భర్తా నో యత్ర వానరః,
సుగ్రీవో విపులగ్రీవః సహ రామేణ తిష్ఠతి. 31

సర్వం చైవాంగదే దోషం శ్రావయిష్యామి పార్థివే,
అమర్షీ వచనం శ్రుత్వా ఘాతయిష్యతి వానరాన్. 32

---

ఆ అంగదుడు మదాంధుడై అతడు తన తాత యని యెఱుగడయ్యెను. కావుననే దధిముఖుని నేలపై పడవైచి భుజములతో పొడిచెను. 27

అపుడు వీరుడు, కపిశ్రేష్ఠుడగు దధిముఖుడును చేతులు, తొడలు, మూపులందు నొప్పి కలుగగా, వివశుడై యొక్క క్షణము మూర్ఛిల్లెను. 28

వానరరాజగు సుగ్రీవుని మేనమామ దధిముఖుడు శీఘ్రమే తెప్పరిల్లి, కోపించి, తేనె త్రావి, మదించి యొడ లెరుగని వానరులను దండము చేతబట్టి పారద్రోలెను. 29

వానరశ్రేష్ఠుడగు దధిముఖుడు ఆ వానరులనుండి ఎట్లో తప్పించుకొని, యొక ఏకాంతస్థానము చేరి, తనకడకు వచ్చిన సేవకుల కిట్లనెను. 30

వీరల నిచటనే యుండనిండు. మన మిపుడు మన యజమాని అగు సుగ్రీవుని కడకు పోవుదము. విశాలమగు మెడగల సుగ్రీవుడు రామునితో కూడియున్నాడు. 31

నేను మన రాజున కంగదుడు చేసిన అపచార మంతయు తెలిపెదను.

ఇష్టం మధువనం హ్యేతత్ సుగ్రీవస్య మహాత్మనః,
పితృపైతామహం దివ్యం దేవైరపి దురాసదమ్. 33

స వానరా నిమాన్ సర్వాన్ మధులుబ్ధాన్ గతాయుషః,
ఘాతయిష్యతి దండేన సుగ్రీవః ససుహృజ్జనాన్. 34

వధ్యా హ్యేతే దురాత్మనో నృపాజ్ఞాపరిభావినః,
అమర్షప్రభవో రోషః సఫలో నో భవిష్యతి. 35

ఏవముక్త్వా దధిముఖో వనపాలాన్ మహాబలః,
జగామ సహసోత్పత్య వనపాలై స్సమన్వితః. 36

నిమేషాంతరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః,
సహస్రాంశుసుతో ధీమాన్ సుగ్రీవో యత్ర వానరః. 37

రామం చ లక్ష్మణం చైవ దృష్ట్వా సుగ్రీవమేవ చ,

---

సహజకోపనుడగు ఆయన నా మాట వినగనే ఆ వానరుల నెల్ల చంపించివేయును. 32

ఈ మధువనము మహాత్ముడగు సుగ్రీవున కిష్టమైనది. ఆయనకు తండ్రితాతల నుండి సంక్రమించినది. దివ్యమైనది. దేవతలకును చొరరానిది. 33

సుగ్రీవుడు తేనెయందు మక్కువ గలవారును, పోగాలము సమీపించినవారును అగు ఈ వానరు లందరకును, వారి మిత్రులకు గూడ మరణదండన విధింపగలడు. 34

రాజాజ్ఞను ధిక్కరించుచున్న ఈ దురాత్ములకు మరణ దండము తప్పదు. అపుడు వీరి చాపలమున కోర్వజాలని మనకు కలిగిన కోపము సఫలము కాగలదు. 35

మహాబలుడగు దధిముఖుడు వనపాలుర కిట్లు పలికి, వారితో కూడి శీఘ్రమే ఆకసమున కెగిరి సుగ్రీవుని కడకు పోయెను. 36

ఒక్క నిమిషములోనే ఆ దధిముఖుడు సూర్యపుత్రుడగు సుగ్రీవుడున్న స్థానమున కేగెను. 37

దధిముఖుడు రాముని, లక్ష్మణుని, సుగ్రీవుని, చూచి, ఆకాశమునుండి సమతలముగ

సమప్రతిష్ఠాం జగతీ మాకాశా న్నిపపాత హ. 38

సన్నిపత్య మహావీర్యః సర్వై స్తైః పరివారితః,
హరి ర్దధిముఖః పాలైః పాలానాం పరమేశ్వరః. 39

స దీనవదనో భూత్వా కృత్వా శిరసి చాంజలిమ్,
సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ ప్రత్యపీడయత్. 40

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే ద్విషష్టితమః సర్గః.*

---

నున్న భూప్రదేశమున దిగెను. 38

వనపాలుర కధిపతి, మహాపరాక్రమశాలి యగు ఆ దధిముఖుడు తన సేవకులతో పరివేష్టితుడై సుగ్రీవుని కడ నేలకు దిగి, దీనవదనుడై, శిరము వంచి యతని పాదములు పట్టి ప్రణమిల్లెను. 39,40

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువదిరెండవ సర్గము.*

# 63. త్రిషష్టితమః సర్గః

*(హనుమంతుడు కార్యము సాధించెనని సుగ్రీవుడూహించుట)*

తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః,
దృష్ట్వై వోద్విగ్నహృదయో వాక్యమేత దువాచ హ. 1
ఉత్తిష్ఠోత్తిష్ఠ కస్మాత్త్వం పాదయోః పతితో మమ,
అభయం తే భవే ద్వీర సర్వమే వాభిధీయతామ్. 2
స తు విశ్వాసిత స్తేన సుగ్రీవేణ మహాత్మనా,
ఉత్థాయ సుమహాప్రాజ్ఞో వాక్యం దధిముఖోఽబ్రవీత్. 3
నైవర్క్షరజసా రాజన్ న త్వయా నాపి వాలినా,
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః. 4
ఏభిః ప్రధర్షితా శ్చైవ వానరా వనరక్షిభిః,

---

వానరశ్రేష్ఠుడగు సుగ్రీవు డట్లు తన పాదములపై బడి నమస్కరించిన దధిముఖుని చూచుటతోడనే కలత చెంది యిట్లనెను. 1

వీరుడవగు ఓ దధిముఖుడా! నీ వేల నా పాదములపై బడితివి? లే లెమ్ము. నీ కభయ మిచ్చుచున్నాను. విషయమేమో సవిస్తరముగ తెలుపుము. 2

మహాత్ముడగు సుగ్రీవుడట్లు విశ్వాసము కలిగించగా మహాబుద్ధిశాలి యగు దధిముఖుడు లేచి నిలచి యిట్లు పలికెను. 3

రాజా! నీ తండ్రియగు ఋక్షరజస్సు కాలమున గాని, నీ పాలనలో గాని, నీ యన్న వాలి పాలనలోగాని మధువన మిట్లు కాలేదు. దావి నిపుదు వానరులు పాడుచేసి తేనె తాగినారు. 4

మధువనపాలకులగు వీరు వానరులను బెదిరింపగా వారు లక్ష్యము చేయక

మధూ న్యచింతయిత్వేమాన్ భక్షయంతి పిబంతి చ. 5
శిష్ట మత్రాపవిధ్యంతి భక్షయంతి తథాపరే,
నివార్యమాణా స్తే సర్వే భ్రువౌ వై దర్శయంతి హి. 6
ఇమే హి సంరబ్ధతరా స్తథా తై స్సంప్రధర్షితాః,
వారయంతో వనా త్తస్మాత్ క్రుద్ధై ర్వానరపుంగవైః. 7
తత స్తై ర్బహుభి ర్వీరై ర్వానరై ర్వానరర్షభ,
సంరక్తనయనైః క్రోధా ద్ధరయః ప్రవిచాలితాః. 8
పాణిభి ర్నిహతాః కేచిత్ కేచిజ్జానుభి రాహతాః,
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః. 9
ఏవ మేతే హతా శ్శూరా స్త్వయి తిష్ఠతి భర్తరి,
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే. 10

---

ఫలాదులను తినుచు, మధువును త్రాగుచున్నారు. 5

కొందరు తాము త్రాగగలిగిన తేనె త్రాగి మిగిలినది పారబోయుచున్నారు. మఱికొందరు త్రాగుచున్నారు. అట్లు త్రాగవలదని బెదిరింపగా వారందరు కనుబొమ్మలు చూపి వెక్కిరించుచున్నారు. 6

ఈ వనరక్షకులగు వానరులు పట్టుదలతో వారిని తేనె త్రాగవలదని నివారింపగా అంగదాదులు వారిని కోపముతో బెదరించినారు. 7

ఓ వానరశ్రేష్ఠుడగు సుగ్రీవా! పిమ్మట అనేకులగు ఆ వానరవీరులు కోపముతో కన్ను లెఱ్ఱజేసి వనపాలురగు ఈ వానరులను తరిమి వేసినారు. 8

వీరిలో కొందరిని చేతులతోను, కొందరిని మోకాళ్ళతోను కొట్టిరి. కొందరి నిటు నటు లాగి అపానద్వారము చూపిరి. 9

నీవు మాకు పాలకుడవై యుండగా ఈ శూరులను వారు కొట్టినారు. స్వేచ్ఛగా మధువనమంతయు భక్షించుచున్నారు. 10

ఏవం విజ్ఞాప్యమానం తం సుగ్రీవం వానరర్షభమ్,
అపృచ్ఛత్తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా. 11
కిమయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః,
కం చార్థ మభినిర్దిశ్య దుఃఖితో వాక్యమబ్రవీత్. 12
ఏవ ముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా,
లక్ష్మణం ప్రత్యువా చేదం వాక్యం వాక్యవిశారదః. 13
ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దధిముఖః కపిః,
అంగదప్రముఖై ర్వీరై ర్భక్షితం మధు వానరైః,
విచిత్య దక్షిణా మాశా మాగతై ర్హరిపుంగవైః. 14
నైషా మకృతకృత్యానా మీదృశః స్యా దుపక్రమః,
ఆగతైశ్చ ప్రమథితం యథా మధువనం హి తైః,
ధర్షితం చ వనం కృత్స్న ముపయుక్తం చ వానరైః. 15

---

అని దధిముఖు డిట్లు వానరశ్రేష్ఠుడగు సుగ్రీవునకు విన్నవించుచుండగా, శత్రువీరులను సంహరించు మహాబుద్ధిశాలి యగు లక్ష్మణు డతని కిట్లనెను. 11

ఓ రాజా! వనపాలకుడగు యీ వానరుడు నీవద్ద కేల వచ్చినాడు? ఏ కార్యము గోరి దుఃఖితుడై మాటలాడినాడు? 12

మహాత్ముడగు లక్ష్మణు డిట్లు ప్రశ్నింపగా మాటలాడుటలో నేర్పరియగు సుగ్రీవు డతని కిట్లనెను. 13

"ఓ పూజ్యుడవగు లక్ష్మణుడా! సీతాన్వేషణమునకై దక్షిణదిశ కేగిన వానరశ్రేష్ఠులు తిరిగి వచ్చిరనియు, అందు అంగదుడు మున్నగు వానరవీరులు మధువనమందలి మధువును భక్షించిరనియు వీరుడగు యీ దధిముఖుడు పలుకుచున్నాడు. 14

వారట్లు మరల వచ్చి మధువనము పాడుచేసినారు. అందలి మధువును ఫలములను భక్షించినారు. వారు కార్యము సాధింపనిచో నిట్టి యుత్సాహకార్యములు చేయరు. 15

వనం యదాఽభిపన్నాస్తే సాధితం కర్మ వానరైః,
దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా. 16
న హ్యన్య స్సాధనే హేతుః కర్మణోఽస్య హనూమతః. 17
కార్యసిద్ధి ర్మతి శ్చైవ తస్మిన్ వానరపుంగవే,
వ్యవసాయశ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితమ్. 18
జాంబవాన్ యత్ర నేతా స్యా దంగదశ్చ మహాబలః,
హనూమాం శ్చాప్యధిష్ఠాతా న తస్య గతి రన్యథా. 19
అంగదప్రముఖై ర్వీరై ర్హతం మధువనం కిల,
వారయంతశ్చ సహితా స్తథా జానుభి రాహతాః. 20
ఏతదర్థ మయం ప్రాప్తో వక్తుం మధురవా గిహ,
నామ్నా దధిముఖో నామ హరిః ప్రఖ్యాతవిక్రమః. 21

---

వానరులు నా యనుమతి లేదని వెఱవకయే మధువనమున ప్రవేశించుటవే వారు కార్యము సాధించి రనుట స్పష్టము. 16

వేఱొకడు గాక సీతాదేవిని హనుమంతుడే చూచినాడు. ఇందు సందేహము లేదు. ఈ కార్యము సాధించుటలో హనుమంతుడు కాక వేఱొక్కడు కారణము కానేరడు.

వానరశ్రేష్ఠుడగు హనుమంతునియందు కార్యసిద్ధి, తెలివితేటలు, పట్టుదల, పరాక్రమము, విద్య అన్నియు నెలకొనియున్నవి. 18

జాంబవంతుడు, మహాబలుడగు అంగదుడును నాయకులుగా, హనుమంతుడు తోడుగా నుండి చేసిన పని వేఱు విధముగ కానేరదు. (నెఱవేరితీరును) 19

వీరులగు అంగదుడు మున్నగువారు మధువనము పాడుచేసిరి. వారిని వనపాలకులు కలసికట్టుగా వారించి, వారిచే దెబ్బలు తినినారు. 20

ఈ విషయము నాకు తెలుపుటకే మధురముగ మాటలాడువాడు, ప్రసిద్ధమగు పరాక్రమము కలవాడగు దధిముఖు డను యీ వానరుడు వచ్చినాడు. 21

దృష్టా సీతా మహాబాహో సౌమిత్రే పశ్య తత్త్వతః,
అభిగమ్య తథా సర్వే పిబంతి మధు వానరాః. 22

న చా ప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ,
వనం దత్తవరం దివ్యం ధర్షయేయు ర్వనౌకసః.

తతః ప్రహృష్టో ధర్మాత్మా లక్ష్మణ స్సహరాఘవః. 23
శ్రుత్వా కర్ణసుఖాం వాణీం సుగ్రీవవదనా చ్చ్యుతామ్,
ప్రాహృష్యత భృశం రామో లక్ష్మణశ్చ మహాబలః. 24

శ్రుత్వా దధిముఖ స్యేదం సుగ్రీవస్తు ప్రహృష్య చ,
వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత. 25

ప్రీతోఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః,

---

ఓ మహాభుజుడవగు లక్ష్మణుడా! సీతాదేవిని వీరు చూచినారు. వానరు లందరును తోటలో ప్రవేశించి తేనె త్రాగుచుండిరి కదా. వారి ఈ ప్రవృత్తిచే నీవును దీని నూహింప దగుదువు. 22

ఓ పురుషశ్రేష్ఠుడా! సీతాదేవిని చూడకయే ప్రసిద్ధులగు ఈ వానరులు నా తండ్రియగు ఋక్షరజస్సునకు బ్రహ్మదేవునిచే నీయబడిన ఈ దివ్యమగు మధువనమున ప్రవేశింపరు." అని సుగ్రీవుడు లక్ష్మణునితో చెప్పెను.ఆ వాక్యము విని ధర్మాత్ములగు రామలక్ష్మణులు సంతసించిరి. 23

సుగ్రీవుని నోట వెలువడిన వీనులవిం దొనరించు ఆ వాక్యమును విని రాముడును, మహాబలుడగు లక్ష్మణుడును మిక్కిలి హర్షము నొందిరి. 24

సుగ్రీవుడును వనరక్షకుడగు దధిముఖుని వాక్యమునకు ప్రీతి నొందినవాడై యతనితో నిట్లు పలికెను. 25

కార్యము సాధించుకొని వచ్చిన అంగదాదివానరులు మధువనమున తేనె మున్నగువానిని భక్షించుట విని ప్రీతుడనైతిని. కార్యసాధకులైన వారి చిలిపిచేష్ట

మర్షితం మర్షణీయం చ చేష్టితం కృతకర్మణామ్. 26

ఇచ్ఛామి శీఘ్రం హనుమత్ప్రధానాన్
శాఖామృగాం స్తాన్ మృగరాజదర్పాన్,
ద్రష్టుం కృతార్థాన్ సహ రాఘవాభ్యాం
శ్రోతుం చ సీతాధిగమే ప్రయత్నమ్. 27

ప్రీతిస్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ కుమారౌ
దృష్ట్వా సిద్ధార్థౌ వానరాణాం చ రాజా,
అంగై స్సంహృష్టైః కర్మసిద్ధిం విదిత్వా
బాహ్వో రాసన్నాం సోఽ తిమాత్రం ననంద. 28

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే త్రిషష్టితమః సర్గః.*

---

క్షమింపదగియుండుటచే నేను వారిని క్షమించితిని. 26

సింహములవలె బలదర్పితులై కార్యము సాధించి వచ్చిన హనుమంతుడు మున్నగు వానరులను చూడవలెనని, సీతాదేవిని వెదకుటలో వారి ప్రయత్నమునుగూర్చి వెంటనే వినవలెననియు రామలక్ష్మణులు, నేనును కోరుచున్నాము. 27

కార్యసిద్ధి యైనదని సంతోషముతో పులకితగాత్రులై వికసించిన నేత్రములు కల రామలక్ష్మణులను చూచి వానరరాజగు సుగ్రీవుడును సంతోషము నొంది, ఆ కార్యసిద్ధి హస్తగతమైనదని యెఱిగి మిక్కిలి ఆనందించెను. 28

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువది మూడవ సర్గము.*

# 64. చతుష్షష్టితమః సర్గః

*(హనుమదాదులు కిష్కింధకు వచ్చుట)*

సుగ్రీవే ణైవ ముక్తస్తు హృష్టో దధిముఖః కపిః,
రాఘవం లక్ష్మణం చైవ సుగ్రీవం చాభ్యవాదయత్. 1

స ప్రణమ్య చ సుగ్రీవం రాఘవౌ చ మహాబలౌ,
వానరై స్సహితై శ్శూరై ర్దివమే వోత్పపాత హ. 2

స యథైవాగతః పూర్వం తథైవ త్వరితం గతః,
నిపత్య గగనా ద్భూమౌ తద్వనం ప్రవివేశ హ. 3

ప ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్,
విమదా నుత్థితాన్ సర్వాన్ మేహమానాన్ మధూదకమ్. 4

స తా నుపాగమ ద్వీరో బద్ధ్వా కరపుటాంజలిమ్,

---

సుగ్రీవు డట్లు చెప్పగా దధిముఖుడు సంతోషించినవాడై రామలక్ష్మణులకు సుగ్రీవునకును ప్రణమిల్లెను. 1

అత డట్లు రాజగు సుగ్రీవునకు, మహాబలశాలులగు రామలక్ష్మణులకు ప్రణమిల్లి, శూరులగు వానరులతో కూడి యాకసమున కెగసెను. 2

అత డెట్లు వేగముతో సుగ్రీవుని వద్దకు పోయెనో అట్లే శీఘ్రముగా పోయి ఆకాశము నుండి భూమిపైకి దిగి యా మధువనమున ప్రవేశించెను. 3

అతడట్లు మధువనము ప్రవేశించి అచట వానరశ్రేష్ఠులను చూచెను. వారు మధుమిశ్రితమగు జలము మూత్రరూపమున పోగా, మత్తు తొలగి, లేచి నిలచియుండిరి. 4

వీరుడగు ఆ దధిముఖుడు అంజలి ఘటించి వానరుల కడ కేగెను. అంగదుని

ఉవాచ వచనం శ్లక్ష్ణ మిదం హృష్టవ దంగదమ్. 5

సౌమ్య రోషో న కర్తవ్యో యదేభి రభివారితః,
అజ్ఞానాద్ రక్షిభిః క్రోధాద్ భవంతః ప్రతిషేధితాః. 6

యువరాజ స్త్వమీశశ్చ వనస్యాస్య మహాబల,
మౌర్ఖ్యాత్ పూర్వం కృతో దోషస్తం భవాన్ క్షన్తుమర్హతి. 7

ఆఖ్యాతం హి మయా గత్వా పితృవ్యస్య తవానఘ,
ఇహోపయాతం సర్వేషా మేతేషాం వనచారిణామ్. 8

స త్వదాగమనం శ్రుత్వా సహైభి ర్హరియూథపైః,
ప్రహృష్టో న తు రుష్టోఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్. 9

ప్రహృష్టో మాం పితృవ్య స్తే సుగ్రీవో వానరేశ్వరః,
శీఘ్రం ప్రేషయ సర్వాం స్తా నితి హోవాచ పార్థివః. 10

---

చూచి హర్షముతో నిట్లు మధురముగ పలికెను. 5

ఓ సౌమ్యుడా! ఈ వనరక్షకులు మిమ్ము వారించినారని వారిపై కోపింపకుము. అజ్ఞానులగుటచే వారట్లు క్రోధముతో మిమ్ము వారించినారు. 6

ఓ మహాబలుడా! నీవు యువరాజువు కాన మధువనమునకు నీ వధిపతివి. అజ్ఞానముచే నీ యెడ ఆచరించిన అపచారమును క్షమింపదగుదువు. 7

ఓ అనఘుడా! నేను నీ పినతండ్రి కడ కేగి, యీ వానరులందరు మధువనమునకు వచ్చిరని ఆయనకు తెలిపితిని. 8

అయనయు తక్కిన వానరయూథపతులతో నీ విచటకు వచ్చుటను, వనభంగమును విని సంతోషించెనే కాని కోపించలేదు. 9

వానరరాజు, నీ పినతండ్రి యగు సుగ్రీవు డిట్లు సంతోషించినవాడై వానరుల నందఱను తన కడకు పంపుమని చెప్పెను. 10

అని దధిముఖుడు మధురముగ పలికిన వాక్యము నాకర్ణించినవాడై మాటలాడుటలో

శ్రుత్వా దధిముఖ స్యేదం వచనం శ్లక్ష్ణ మంగదః,
అబ్రవీ త్తాన్ హరిశ్రేష్ఠో వాక్యం వాక్యవిశారదః. 11

శంకే శ్రుతోఽయం వృత్తాంతో రామేణ హరియూథపాః,
తత్ క్షమం నేహ నః స్థాతుం కృతే కార్యే వరంతపాః. 12

పీత్వా మధు యథాకామం విశ్రాంతా వనచారిణః,
కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర మే గురుః. 13

సర్వే యథా మాం వక్ష్యంతి సమేత్య హరియూథపాః,
తథాఽస్మి కర్తా కర్తవ్యే భవద్భిః పరవా నహమ్. 14

నాజ్ఞాపయితు మీశోఽహం యువరాజోఽస్మి యద్యపి,
అయుక్తం కృతకర్మాణో యూయం ధర్షయితుం మయా. 15

బ్రువత శ్చాంగద స్యైవం శ్రుత్వా వచన మవ్యయమ్,
ప్రహృష్టమనసో వాక్య మిద మూచు ర్వనౌకసః. 16

---

కుశలుడగు అంగదుడు వానరశ్రేష్ఠుల కిట్లు పలికెను. 11

ఓ వానరయూథపతులారా! రాము డీ వృత్తాంతము వినెనని శంకించుచున్నాను. కావున శత్రువులను తపింపజేయు ఓ వానరులారా! మనము కార్యము సాధించియు ఇచట నుండదగదు. 12

వానరు లెల్లరు మధువు త్రావి విశ్రమించినారు. ఇంక నా పినతండ్రి యగు సుగ్రీవుని కడకు పోవుటే మిగిలియున్నది. 13

ఓ వానరయూథవతులారా! మీ రందరును కలసి ఎట్లు సూచించిన అట్లు చేయుదుము. కర్తవ్యవిషయమున నేను మీకు పరాధీనుడనే . 14

నేను యువరాజు నైనను మిమ్మాజ్ఞాపించుటకు సమర్థుడను కాను. కార్యము సాధించి వచ్చిన మిమ్ము నే ననాదరము చేయుట తగదు. 15

అని యిటు లంగదుడు పలికిన ఉత్తమవచనము విని యా వానరులు సంతుష్టాంతరంగులై యిట్లనిరి. 16

ఏవం వక్ష్యతి కో రాజన్ ప్రభు స్సన్ వానరర్షభ,
ఐశ్వర్యమదమత్తో హి సర్వోఽ హమితి మన్యతే. 17
తవ చేదం సుసదృశం వాక్యం నాన్యస్య కస్యచిత్,
సన్నతి ర్హి తవాఖ్యాతి భవిష్యచ్ఛుభయోగ్యతామ్. 18
సర్వే వయమపి ప్రాప్తా స్తత్ర గంతుం కృతక్షణాః,
స యత్ర హరివీరాణాం సుగ్రీవః పతి రవ్యయః. 19
త్వయా హ్యనుక్తై ర్హరిభి ర్నైవ శక్యం పదాత్ పదమ్,
క్వచిత్ గంతుం హరిశ్రేష్ఠ బ్రూమ స్సత్య మిదం తు తే. 20
ఏవం తు వదతాం తేషా మంగదః ప్రత్యభాషత,
బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖముత్పేతు ర్మహాబలాః. 21

---

ఓ వానరశ్రేష్ఠుడవగు యువరాజా! ప్రభువయ్యు ఎవ డిట్లు వినయముతో మాటలాడును? అధికారమదముచే మత్తిలి ప్రతివాడును అహంకారి యగుట సాధారణము. 17

ఇట్లు పలుకుట నీ స్వభావమునకు, యోగ్యతకు తగినట్టిది. వేరొకని కిట్లు పలుకుట సాధ్యపడదు. నీ వినయము రాబోవు శుభమునకు నీ యోగ్యతను సూచించుచున్నది. 18

మే మెల్లరమును వానరవీరుల కధిపతి, నాశరహితుడు అగు సుగ్రీవుడున్న తావుకు పోవు అవకాశమునకై నిరీక్షించుచున్నాము. 19

ఓ వానరశ్రేష్ఠుడా! అట్లు నిరీక్షించువార మైనను, వానరుల మందరమును నీ యాజ్ఞ లేక ఒక అడుగు కూడ ముందుకు పోవుట కశక్తులము. మేము సత్యము పలుకుచున్నాము. 20

అని వారు చెప్పగా అంగదుడును "అట్లే పోవుదము" అని వారికి చెప్పెను. అపుడు మహాబలులగు వానరు లందరును ఆకాశమున కెగిరిరి. 21

అట్లు ఎగిరిన వారి ననుసరించుచు తక్కిన వానరయూథపతు లెల్లరును,

ఉత్పతంత మనూత్పేతు స్సర్వే తే హరియూథపాః,
కృత్వాకాశం నిరాకాశం యంత్రోత్క్షిప్తా ఇవాచలాః. 22
తేఽ_ంబరం సహసోత్పత్య వేగవంతః ప్లవంగమాః,
వినదంతో మహానాదం ఘనా వాతేరితా యథా. 23
అంగదే హ్యననుప్రాప్తే సుగ్రీవో వానరాధిపః,
ఉవాచ శోకోపహతం రామం కమలలోచనమ్. 24
సమాశ్వసిహి భద్రం తే దృష్టా దేవీ న సంశయః,
నాగంతు మిహ శక్యం తై రతీతే సమయే హి నః. 25
న మత్సకాశ మాగచ్ఛేత్ కృత్యే హి వినిపాతితే,
యువరాజో మహాబాహుః ప్లవతాం ప్రవరోఽ_ంగదః. 26
యద్య ప్యకృతకృత్యానా మీదృశః స్యా దుపక్రమః,

---

యంత్రములచే పై కెగురగొట్టబడిన కొండలవలె ఎగిరి, ఆకాశమున నేమాత్రము చోటు విడువక ఆక్రమించి పోవసాగిరి. 22

వేగవంతులగు వారందరును శీఘ్రమే ఆకాశమున కెగసి, గాలిచే ప్రేరితములైన మేఘములవలె పెద్దనాదము చేయుచు పోవసాగిరి. 23

అంగదు డెంత సమయమునకును రాకుండుటచే శోకపీడితుడయిన, కమలముల వంటి కన్నులుగల రామునకు, వానరాధిపతి యగు సుగ్రీవు డిట్లనెను. 24

రామా! నీ వొకింత యూరడిల్లుము. సీతాదేవి యగపడినది. ఇందు సందేహము లేదు. కార్యము సాధింపక విలంబముగ వచ్చుట వానరులకు శక్యముకాదు. 25

యువరాజు, మహాభుజుడు, వానరులలో శ్రేష్ఠ డగు అంగదుడు తన కార్యము చెడినచో నా కడకు రానే రాడు. 26

అట్లు కాక కార్యము సాధింపకయే అత డొకవేళ మఱలివచ్చుచో నిట్లు వనభంగాది కార్యము చేయడు. దీనమగు ముఖముతో, మనస్సున కలవరపడుచుండును. 27

భవే త్స దీనవదనో భ్రాంతవిప్లుతమానసః. 27

పితృపైతామహం చైతత్ పూర్వకై రభిరక్షితమ్,
న మే మధువనం హన్యా దహృష్టః ప్లవగేశ్వరః. 28

కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత. 29

దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా,
న హ్యన్యః కర్మణో హేతు స్సాధనేఽ స్య హనూమతః. 30

హనూమతి హి సిద్ధిశ్చ మతిశ్చ మతినత్తమ,
వ్యవసాయశ్చ వీర్యం చ సూర్యే తేజ ఇవ ధ్రువమ్. 31

జాంబవాన్ యత్ర నేతా స్యా దంగదశ్చ బలేశ్వరః,
హనుమాం శ్చాప్యధిష్ఠాతా న తస్య గతి రన్యథా,
మాభూ శ్చింతాసమాయుక్త స్సంప్ర త్యమితవిక్రమ. 32

---

సీతాదేవిని చూడక హర్షము లేనివాడగు యువరాజు అంగదుడు మా తండ్రితాతల నుండి సంక్రమించినది, నా మేనమామ దధిముఖునిచే కాపాడబడుచున్నది అగు మధువనమును పాడుచేయడు. 28

రామా! సీత క్షేమము తెలిసినది. నీవు కుశలివే కావున నిను గన్న కౌసల్యయు సత్సంతానవతి యైనది. నీ వింక యూరడిల్లుము. 29

సీతాదేవిని హనుమంతుడు చూచినాడు. ఇందు సందేహము లేదు. సీతాసందర్శన రూపమగు కార్యమును సాధించుటలో హనుమంతుడు దప్ప వేరొకడు కారణము కాడు. 30

ఓ బుద్ధిశాలీ! సూర్యునియందు తేజస్సునలె హనుమంతునియందే సిద్ధి, బుద్ధి, ప్రయత్నము, పరాక్రమము ఉన్నవనుట నిశ్చయము. 31

జాంబవంతుడు నాయకుడుగా, అంగదుడు సేనాధిపతిగా, హనుమంతుడు సహాయుడుగా చేపట్టిన పని సిద్ధింపక మానదు. కావున ఓ అమిత పరాక్రమశాలీ! నీ

తతః కిలకిలాశబ్దం శుశ్రా వాసన్న మంబరే,
హనుమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్,
కిష్కింధా ముపయాతానాం సిద్ధిం కథయతామివ. 33

తతః శ్రుత్వా నినాదం తం కపీనాం కపిసత్తమః,
ఆయతాంచితలాంగూల స్సోఽభవ ద్ధృష్టమానసః. 34

ఆజగ్ము స్తేఽపి హరయో రామదర్శనకాంక్షిణః,
అంగదం పురతః కృత్వా హనూమంతం చ వానరమ్. 35

తేఽంగదప్రముఖా వీరాః ప్రహృష్టాశ్చ ముదాన్వితాః,
నిపేతు ర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ. 36

హనూమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః,
నియతా మక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్. 37

---

విపుడు చింతాక్రాంతుడవు కావలదు. 32

అంతట హనుమంతుని సీతాదర్శనరూపకార్యముచే గర్వించి, బిగ్గరగా అఱచుచు, కిష్కింధకు వచ్చుచున్న వానరుల కిలకిల యను శబ్దము, కార్యసిద్ధిని చెప్పుచున్నారో యనునటులు ఆకాశమున సమీపముననే విననయ్యెను. 33

వానరుల ఆ నాదము విని కపిశ్రేష్ఠుడగు సుగ్రీవుడు తన తోక పెంచుకొని మాలవలె తలపై నిలుపుకొనినవాడై సంతోషించెను. 34

వానరులును రాముని చూడవలెనను కోరికతో అంగదుని, హనుమంతుని ముందిడుకొని వచ్చిరి. 35

అట్లు అంగదుడు మున్నగు వీరులు, పులకితగాత్రులై, ఆనందితస్వాంతులై రామసుగ్రీవుల చెంతకు దిగిరి. 36

అంత మహాభుజుడగు హనుమంతుడు రామునకు శిరము వంచి నమస్కరించి, సీతాదేవి పాతివ్రత్యనియమవతియై, క్షేమముగ నున్నదని రామునకు నివేదించెను. 37

నిశ్చితార్థ స్తత స్తస్మిన్ సుగ్రీవః పవనాత్మజే,
లక్ష్మణః ప్రీతిమాన్ ప్రీతం బహుమానా దవైక్షత. 38

ప్రీత్యా చ రమమాణోఽథ రాఘవః పరవీరహా,
బహుమానేన మహతా హనుమంత మవైక్షత. 39

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే చతుష్షష్టితమః సర్గః.*

---

సుగ్రీవుడును హనుమంతుడు కార్యము సాధించి వచ్చెనని నిశ్చయించెను. లక్ష్మణుడును హనుమంతుని గాంచి సంతోషించినవాడై అతని నాదరముతో చూచెను. 38

అపుడు శత్రువీరులను సంహరించునట్టి రాముడు మిక్కిలి ఆదరముతో హనుమంతుని చూచెను. 39

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువదినాల్గవ సర్గము.*

# 65. పంచషష్టితమః సర్గః

*(హనుమ రామునకు చూడామణిని సమర్పించుట)*

తతః ప్రస్రవణం శైలం తే గత్వా చిత్రకాననమ్,
ప్రణమ్య శిరసా రామం లక్ష్మణం చ మహాబలమ్. 1

యువరాజం పురస్కృత్య సుగ్రీవ మభివాద్య చ,
ప్రవృత్తి మథ సీతాయాః ప్రవక్తు ముపచక్రముః. 2

రావణాంతఃపురే రోధం రాక్షసీభిశ్చ తర్జనమ్,
రామే సమనురాగం చ యశ్చాయం సమయః కృతః,
ఏత దాఖ్యాంతి తే సర్వే హరయో రామసన్నిధౌ. 3

వైదేహీ మక్షతాం శ్రుత్వా రామ స్తూత్తర మబ్రవీత్. 4

క్వ సీతా వర్తతే దేవీ కథం చ మయి వర్తతే,
ఏతన్మే సర్వ మాఖ్యాత వైదేహీం ప్రతి వానరాః. 5

---

అపు డా వానరు లెల్లరును అంగదుని ముందిడుకొని చిత్రములైన అడవులు గల ప్రస్రవణగిరికి పోయి, రామలక్ష్మణులకు నమస్కరించి, సుగ్రీవునకు ప్రణమిల్లి సీతా వృత్తాంతమును చెప్ప నారంభించిరి. 1,2

ఆ వానరు లందరు రాముని కడకేగి సీతాదేవి రావణుని అంతఃపురమున నిరోధింపబడినట్లును, రాక్షసస్త్రీ లామెను భయపెట్టుటను, రామునియం దామె యనురాగమును, రావణుని రెండు మాసముల గడువును రామునకు చెప్పసాగిరి. 3

సీతాదేవి కుశలముగా నున్నదని విని రాము డిట్లు పలికెను. 4

ఓ వానరులారా! సీతాదేవి యెచ్చట నున్నది? నాయం దామె యెట్టి యభిప్రాయము కలిగియున్నది? సీతకు సంబంధించిన ఈ విషయమును సాకల్యముగ నాకు చెప్పుడు. 5

రామస్య గదితం శ్రుత్వా హరయో రామసన్నిధౌ,
చోదయంతి హనూమంతం సీతావృత్తాంతకోవిదమ్. 6

శ్రుత్వా తు వచనం తేషాం హనుమాన్ మారుతాత్మజః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి,
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సీతాయా దర్శనం యథా. 7

సముద్రం లంఘయిత్వాఽహం శతయోజన మాయతమ్,
అగచ్ఛం జానకీం సీతాం మార్గమాణో దిదృక్షయా. 8

తత్ర లంకేతి నగరీ రావణస్య దురాత్మనః,
దక్షిణస్య సముద్రస్య తీరే వసతి దక్షిణే. 9

తత్ర దృష్టా మయా సీతా రావణాంతఃపురే సతీ,
సన్న్యస్య త్వయి జీవంతీ రామా రామ మనోరథమ్. 10

---

రాముడు పలికిన వాక్యము విని యా వానరులు రామునికడ సీతావృత్తాంత మెఱిగిన హనుమంతుని రామునకు సమాధాన మిమ్మని ప్రోత్సహించిరి. 6

వాయుపుత్రుడు చక్కగా మాటలాడుట తెలిసినవాడగు హనుమంతుడు వానరుల వచనము విని దక్షిణదిశకు తిరిగి, సీతాదేవికి మ్రొక్కి, సీతాదర్శన మెట్లయ్యెనో యీ విధముగా తెలియజెప్పెను. 7

“నేను నూరు యోజనములు పొడవైన సముద్రము దాటి సీతాదేవిని వెదకుచు ఆమెను చూడవలెనను కోరికతో పోయితిని. 8

అచట సముద్రమున కావల దక్షిణతీరమున దురాత్ముడగు రావణుని లంకానగర మున్నది. 9

రామా! అచట రావణుని అంతఃపురమునందు సీతాదేవి తన యభిలాషను నీయందే నిలుపుకొనినదై జీవించుచుండగా చూచితిని. 10

ప్రమదావనమున వికృతాకారులగు రాక్షసస్త్రీ లామెకు కావలి యుండిరి. వారామెను

దృష్టా మే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
రాక్షసీభి ర్విరూపాభీ రక్షితా ప్రమదావనే. 11
దుఃఖ మాసాద్యతే దేవీ తథాఽదుఃఖోచితా సతీ. 12

రావణాంతఃపురే రుద్ధా రాక్షసీభి స్సురక్షితా,
ఏకవేణీధరా దీనా త్వయి చింతాపరాయణా. 13

అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే,
రావణాద్ వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
దేవీ కథంచిత్ కాకుత్స్థ త్వన్మనా మార్గితా మయా. 14
ఇక్ష్వాకువంశవిఖ్యాతిం శనైః కీర్తయతాఽనఘ,
సా మయా నరశార్దూల విశ్వాస ముపపాదితా. 15
తత స్సంభాషితా దేవీ సర్వ మర్థం చ దర్శితా,

---

చుట్టుముట్టి మాటిమాటికి బెదరించుచుండగా చూచితిని. 11

పతివ్రత యగు ఆమె దుఃఖము లనుభవించదగినదె కాదు. సుఖము లనుభవింప దగినట్టిది. కాని ఆమె దుఃఖ మనుభవించుచున్నది. 12

ఒంటిజడ కలదై, దీనురాలై నిన్నే తలంచుచు ఆమె రావణు నంతఃపురమున నిరోధింపబడియున్నది. ఆమెకు రాక్షసస్త్రీలు కావలియున్నారు. 13

ఆమె నేలపైననే శయనించుచున్నది. హేమంతర్తువునందు తామరతీగవలె ఆమె శరీరము కాంతి తొలగియున్నది. రామా! ఆమె రావణునియందు వైముఖ్యము కలదై, మరణింప నిశ్చయించియున్నది. నీయందే మనసు నిలుపుకొన్న ఆమె నెట్లో వెదుకగలిగితిని. 14

దోషము లేని నరశ్రేష్ఠుడవగు రామా! నేను ఇక్ష్వాకువంశపు కీర్తిని మెల్లగా ప్రస్తుతించుచు, ఆమెకు నా పై విశ్వాసము కలిగించితిని. 15

ఆపైన ఆమె మాటలాడినది. ఆమెకు నీ పరిస్థితిని సాకల్యముగ తెలిపితిని.

రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతి ముపాగతా. 16

నియత స్సముదాచారో భక్తి శ్చాస్యా స్తథా త్వయి. 17

ఏవం మయా మహాభాగా దృష్టా జనకనందినీ,
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ. 18

అభిజ్ఞానం చ మే దత్తం యథావృత్తం తవాంతికే,
చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ. 19

విజ్ఞాప్యశ్చ నరవ్యాఘ్రో రామో వాయుసుత త్వయా,
అఖిలేనేహ యద్దృష్టమితి మా మాహ జానకీ. 20

అయం చాస్మై ప్రదాతవ్యో యత్నాత్ సుపరిరక్షితః,
బ్రువతా వచనా న్యేవం సుగ్రీవ స్యోపశృణ్వతః, 21

ఏష చూడామణిః శ్రీమాన్ మయా సుపరిరక్షితః. 22

---

రామసుగ్రీవుల మైత్రిని విని ఆమె సంతసించినది. 16

సీతాదేవియొక్క నడవడి (పరపురుషుని తలంచకుండుట మున్నగునది), నీయందలి భక్తియు, చెక్కు చెదరక అట్లే యున్నవి. 17

ఓ పురుషశ్రేష్ఠుడా! ఈ విధముగా మహాభాగ్యవతి, జనకరాజపుత్రియగు సీత నీయందు భక్తి కలదై, నిరాహారరూపమగు భయంకరతపము నాచరించుచున్నది. 18

రాఘవుడా! చిత్రకూటమున నీవు చెంతనుండగా కాకి విషయమున నెట్లు జరిగినదో దానిని గుర్తుగా నాకు చెప్పినది. 19

"ఓ వాయుపుత్రుడా! పురుషశ్రేష్ఠుడగు రామునకు నీ విచట (రావణుని రాక మున్నగు) ఏమేమి చూచితివో దానిని పూర్తిగా విజ్ఞాపన చేయుము" అని సీత నాతో చెప్పినది. 20

"ఈ నా వచనములు సుగ్రీవుడు వినుచుండగా రామునకు చెప్పి నేను ప్రయత్నముతో రక్షించుకొన్న యీ చూడామణిని రామున కిమ్ము. 21

శ్రీమంతమగు ఈ చూడామణిని నేనెంతో శ్రద్ధగా కాపాడితిని. 22

మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి. 23
ఏష నిర్యాతితః శ్రీమాన్ మయా తే వారిసంభవః,
ఏతం దృష్ట్వా ప్రమోదిష్యే వ్యసనే త్వామివానఘ. 24
జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ.
ఊర్ధ్వం మాసా న్న జీవేయం రక్షసాం వశ మాగతా. 25
ఇతి మా మబ్రవీత్ సీతా కృశాంగీ ధర్మచారిణీ,
రావణాంతఃపురే రుద్ధా మృగీ వోత్ఫుల్లలోచనా. 26
ఏతదేవ మయాఽఽఖ్యాతం సర్వం రాఘవ యద్యథా,
సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్. 27

---

పూర్వమొకప్పుడు నా నుదుటి బొట్టు చెమటకు కరిగి కనుపించకుండగా నీవు మణిశిలతో నా నుదుట తిలకము పెట్టుటకు బదులు చెక్కిలిపై పెట్టితివి. దానిని స్మరింపుము. 23

పాపరహితుడవగు రాముడా! సముద్రమున బుట్టిన శ్రీమంతమగు యీ చూడామణిని నీకై పంపినాను. నే నిప్పటివఱకు దుఃఖసమయములందు దీనిని చూచుకొని నిన్ను చూచినంతగా సంతోషించుచుంటిని. 24

దశరథతనయుడవగు రామా! నే నింకొక్క మాసము జీవింతును. ఆపైన యీ రాక్షసులకు వశమై జీవింపను". 25

ఆడులేడివలె బాగుగ విప్పారిన కన్నులు గల సీత రావణాంతఃపురమున నిరోధింపబడి, కృశించియు, ధర్మ మాచరించుచు నాతో ఇట్లు పలికినది. 26

రామా! నే నీ విషయము నీకు యథాతథముగా తెలిపితిని. నీ విటుపై సముద్రము దాటుటకై సేతునిర్మాణమునకు ఉపాయ మాలోచింపుము. 27

తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా,
తచ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ,
దేవ్యా చాఖ్యాతం సర్వమే వానుపూర్వ్యాత్,
వాచా సంపూర్ణం వాయుపుత్రః శశంస. 28

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే పంచషష్టితమః సర్గః.*

---

ఇట్లు పలికి, వాయుపుత్రుడగు హనుమంతుడు రాజకుమారులగు రామలక్ష్మణులు తన వచనములచే నూఱడిల్లు టెఱింగి, సీతాదేవి యొసగిన యా చూడామణిని రాముని కిచ్చి, యామె చెప్పిన దంతయు సక్రమముగ రాముని కెఱింగించెను. 28

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువదియైదవ సర్గము.*

# 66. షట్షష్టితమః సర్గః

*(సీతావృత్తాంతము విని రాముడు శోకించుట)*

ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః,
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః. 1

తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవ శ్శోకకర్శితః,
నేత్రాభ్యా మశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవ మిద మబ్రవీత్. 2

యథైవ ధేనుః స్రవతి స్నేహాద్ వత్సస్య వత్సలా,
తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్. 3

మణిరత్న మిదం దత్తం వైదేహ్యాః శ్వశురేణ మే,
వధూకాలే యథా బద్ధమధికం మూర్ధ్ని శోభతే. 4

అయం హి జలసంభూతో మణి స్సజ్జనపూజితః,

---

హనుమంతు డిట్లు పలుకగా దశరథతనయుడగు రాముడు లక్ష్మణునితో గూడినవాడై ఆ చూడామణిని హృదయమునకు హత్తుకొని మిక్కిలి రోదించెను. 1

రాము డా శ్రేష్ఠమగు మణిని చూచి, శోకపీడితుడై, కన్నుల నీరు నిండగా సుగ్రీవున కిట్లనెను. 2

తన బిడ్డపై వాత్సల్యముగల ఆవు లేగను చూడగానే యెట్లు క్షీరములను స్రవించునో అట్లే మణిరత్నమును చూడగానే నా హృదయము ద్రవించుచున్నది. 3

మా మామ జనకమహారా జీ మణిరత్నమును వివాహకాలమున సీత కొసగెను. అది మిక్కిలి శోభిల్లునట్లు దాని నామె శిరమున అలంకరించుకొనినది. 4

ఈ మణి సముద్రము నుండి పుట్టినది. సజ్జనులచే పూజితమైనది. జనకుడు

యజ్ఞే పరమతుష్టేన దత్త శ్శక్రేణ ధీమతా. 5

ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్,
అద్యా వ్యవగత స్సౌమ్య వైదేహస్య తథా విభోః. 6

అయం హి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మే మణిః,
అస్యాద్య దర్శనే నాహం ప్రాప్తాం తామివ చింతయే. 7

కిమాహ సీతా వైదేహీ బ్రూహి సౌమ్య పునః పునః,
పిపాసుమివ తోయేన సించంతీ వాక్యవారిణా. 8

ఇతస్తు కిం దుఃఖతరం యదిమం వారిసంభవమ్,
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీ మాగతాం వినా. 9

చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి,
క్షణం సౌమ్య న జీవేయం వినా తా మసితేక్షణామ్. 10

---

చేసిన యజ్ఞమునకు మిక్కిలి సంతోషించిన ధీమంతుడగు దేవేంద్రుడు దీనిని ఆయన కిచ్చినాడు. 5

ఓ సౌమ్యుడ వగు హనుమంతుడా! శ్రేష్ఠమగు ఈ మణిని చూచి నా తండ్రి దశరథుని, నా మామ యగు విదేహాధిపతిని కూడా చూచినటులైనది. (సీతాదేవి శిరముపై చూడామణి నలంకరింపజేసినవా రగుటచే) 6

ఈ మణి నా ప్రియురాలగు సీత తలపై శోభిల్లునది. నే డా మణిని చూచుటచే ఆమెయే వచ్చినట్లు అనిపించినది. 7

సౌమ్యుడా! విదేహరాజపుత్రి సీత, దప్పిక గొన్న వానిని నీటితో వలె నన్ను మాటలను నీటితో తడపుచు ఏమనెనో మాటిమాటికి తెలుపుము. 8

లక్ష్మణా! సముద్రమున బుట్టిన మణిని మాత్రము చూడగలిగినానే కాని సీత వచ్చుట చూడజాలనైతిని. ఇంతకంటె మిక్కిలి దుఃఖము కలిగించున దేమున్నది? 9

సీత యొక్క మాస మిటుపై జీవించుచో నామె బహుకాలము జీవించినట్లే. నేనుమాత్ర మా నల్లని కన్నులుగల సీత లేక ఇక నొక్క క్షణమైనను జీవింపనొల్లను. 10

నయ మామపి తం దేశం యత్ర దృష్టా మమ ప్రియా,
న తిష్ఠేయం క్షణమపి ప్రవృత్తి ముపలభ్య చ. 11
కథం సా మమ సుశ్రోణీ భీరుభీరు స్సతీ సదా,
భయావహానాం ఘోరాణాం మధ్యే తిష్ఠతి రక్షసామ్. 12
శారద స్తిమిరోన్ముక్తో నూనం చంద్ర ఇవాంబుదైః,
ఆవృతం వదనం తస్యా న విరాజతి రాక్షసైః. 13
కిమాహ సీతా హనుమం స్తత్త్వతః కథ యాద్య మే,
ఏతేన ఖలు జీవిష్యే భేషజే నాతురో యథా. 14
మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ,
మద్విహీనా వరారోహా హనుమన్ కథయస్వ మే. 15

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే షట్షష్టితమః సర్గః.*

---

నా ప్రియురాలగు సీత నెచట చూచితివో అచటకు నన్ను కూడ తీసికొని పొమ్ము. ఆమె వార్త తెలిసినది కనుక ఒక్క క్షణమైన నిలువజాలను. 11

సుందరమగు నడుము కల సీత సదా మిక్కిలి బెదరుచున్నదై, భయము కలిగించునట్టి రాక్షసుల నడుమ నెటు లుండగలుగుచున్నది? 12

చీకటియే లేకుండ వెన్నెల నిర్మలముగ కాయు శరదృతువునందు మేఘము లావరించిన చంద్రునివలె రాక్షసాంగన లావరించగా సీతముఖము ప్రకాశించుట లేదు. 13

హనుమంతుడా! సీత ఏమని చెప్పెనో ఉన్నది ఉన్నట్లుగ నాకు తెలుపుము. అట్లు నీవు చెప్పగా విని ఔషధముచే రోగివలె నేను జీవింతును. 14

హనుమంతుడా! సౌందర్యవతి, మధురముగ మాటలాడునది, చక్కని నడుము కలదగు నా ప్రియురాలు సీత నన్నెడబాసి ఏమనెనో నీవు నాకు చెప్పుము" అని రాముడు హనుమంతునితో పలికెను. 15

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువదియాఱవ సర్గము.*

# 67. సప్తషష్టితమః సర్గః

*(హనుమ సీతావచనమును రామునకు చెప్పుట)*

ఏవముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా,
సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే. 1
ఇద ముక్తవతీ వేవీ జానకీ పురుషర్షభ,
పూర్వవృత్త మభిజ్ఞావం చిత్రకూటే యథాతథమ్. 2
సుఖసుప్తా త్వయా సార్ధం జానకీ పూర్వ ముత్థితా,
వాయస స్సహసోత్పత్య విదదార స్తనాంతరే. 3
పర్యాయేణ చ సుప్తస్త్వం దేవ్యంకే భరతాగ్రజ,
పునశ్చ కిల పక్షీ స దేవ్యా జనయతి వ్యథామ్. 4
పునః పున రుపాగమ్య విదదార భృశం కిల,

---

మహాత్ముడగు రాము డిట్లు హనుమంతునితో పలుకగా, హనుమ సీత పలికిన దంతయు రామునకు నివేదించెను. 1

ఓ పురుషశ్రేష్ఠుడవగు రామా! సీతాదేవి చిత్రకూటమున పూర్వము జరిగిన యీ గురుతును యథాతథముగ నిట్లు చెప్పినది. 2

సీత చిత్రకూటమున నీచెంతనే సుఖముగ నిద్రించి ముందుగా మేల్కొనినది. అపుడొక కాకి యకస్మాత్తుగ వచ్చి యామె స్తనములపై గీరినది. 3

రామా! పిమ్మట నీవు సీత యొడిలో తల నిడుకొని నిదురించితివి. మఱల నా కాకి వచ్చి సీతాదేవిని బాధించినది. 4

ఆ కాకి మాటిమాటికి వచ్చి సీత స్తనప్రదేశమున పొడిచెను. అపుడు సీత కచట

తత స్త్వం బోధిత స్తస్యా శ్శోణితేన సముక్షితః. 5

వాయసేన చ తేనైవ సతతం బాధ్యమానయా,
బోధితః కిల దేవ్యా త్వం సుఖసుప్తః పరంతప. 6

తాం తు దృష్ట్వా మహాబాహో దారితాం చ స్తనాంతరే,
ఆశీవిష ఇవ క్రుద్ధో నిశ్వస న్నభ్యభాషథాః. 7

నఖాగ్రైః కేన తే భీరు దారితం తు స్తనాంతరమ్,
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా. 8

నిరీక్షమాణ స్సహసా వాయసం సమవైక్షథాః,
నఖై స్సరుధిరై స్తీక్ష్ణై స్తామే వాభిముఖం స్థితమ్. 9

సుతః కిల స శక్రస్య వాయసః పతతాం వరః,
ధరాంతరచర శ్శీఘ్రం పవనస్య గతౌ సమః. 10

---

గాయమై రక్తము స్రవింపగా దానివే నీ శరీరము తడసి నీవు మేల్కాంచితివి. 5

ఓ శత్రువులను పీడించువాడా! సుఖముగ నిదురించుచున్న నిన్ను, ఎడతెగక తన్ను కాకి పీడింపగా సీత నిద్రలేపినది. 6

మహాభుజుడా! స్తనముల కడ గాయము చేయబడిన ఆమెను చూచి నీవు కోపించిన సర్పమువలె నిట్టూర్చుచు విట్లంటివి.. 7

పిరికిదానా! నీ స్తనప్రదేశము నెవరు గోళ్లతో గీరినారు? కోపించిన ఐదుతలల పాముతో చెలగాట మాడువారెవ్వరు? 8

అని నీవు నలువంకల నిరీక్షించుచు వాడియై, రక్తసిక్తములైన గోళ్లతో ఆమె కభిముఖమై నిలచిన కాకిని చూచితివి. 9

పక్షులలో శ్రేష్ఠమగు ఆ కాకి దేవేంద్రుని తనయుడట. అతడు భూమిపై చరించును. వాయువేగముతో సమానవేగము కలవాడు. 10

మహాభుజుడవు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవగు రామా! నీ వపుడు కోపముతో

తత స్తస్మిన్ మహాబాహో కోపపంవర్తితేక్షణః,
వాయసే త్వం కృథాః క్రూరాం మతిం మతిమతాం వర. 11
స దర్భం సంస్తరాద్ గృహ్య బ్రహ్మాస్త్రేణ హ్యయోజయః,
స దీప్త ఇవ కాలాగ్ని ర్జజ్వా లాభిముఖః ఖగమ్. 12
క్షిప్తవాం స్త్వం ప్రదీప్తం హి దర్భం తం వాయసం ప్రతి,
తతస్తు వాయసం దీప్తః స దర్భోఽనుజగామ హ. 13
స పిత్రా చ పరిత్యక్త స్సురైశ్చ సమహర్షిభిః,
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య త్రాతారం నాధిగచ్ఛతి.
పునరేవాగత స్త్రస్త స్త్వత్సకాశ మరిందమ. 14
స తం నిపతితం భూమౌ శరణ్య శ్శరణాగతమ్,
వధార్హమపి కాకుత్స్థ కృపయా పర్యపాలయః. 15
మోఘ మస్త్రం న శక్యం తు కర్తు మిత్యేవ రాఘవ,

---

కండ్లు విప్పారునట్లు తెఱచి, యా కాకిపై క్రూరమగు ఆలోచన చేసితివి. 11

నీవు వెంటనే దర్భాసనము నుండి యొక దర్భను తీసి బ్రహ్మాస్త్రమంత్రముతో అభిమంత్రించితివి. అది మండుచున్న ప్రళయాగ్నివలె ఆ కాకి ఎదుట జ్వలించెను. 12

నీ వా జ్వలించుచున్న దర్భను కాకిపై విసరితివి. అపు డా దర్భ మండుచు ఆ కాకిని వెంటాడెను. 13

ఆ కాకిని కాపాడజాలక దాని తండ్రి యింద్రుడు దానిని విడచి పెట్టెను. దేవతలు, మహర్షులును దానిని రక్షింపజాలక విడచిరి. అట్లది ముల్లోకములలో నంచరించియు రక్షకుని కానలేదు. ఓ శత్రువులను పీడించువాడా! ఆ కాకి భయపడి మఱల నీ చెంతకే వచ్చినది. 14

ఓ కాకుత్స్థుడా! అట్లు వచ్చి శరణాగతుడై నేలపై బడియున్న ఆ కాకిని చంపవలసి యున్నను నీవు దానిని దయతో కాపాడితివి. 15

భవాం స్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ ప దక్షిణమ్. 16

రామ త్వాం స నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ,
విసృష్టస్తు తదా కాకః ప్రతిపేదే స్వ మాలయమ్. 17

ఏవ మస్త్రవిదాం శ్రేష్ఠః సత్త్వవాన్ శీలవా నపి,
కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః. 18

న నాగా నాపి గంధర్వా నాసురా న మరుద్గణాః,
న చ సర్వే రణే శక్తా రామం ప్రతిసమాసితుమ్. 19

తస్య వీర్యవతః కశ్చిద్ యద్యస్తి మయి సంభ్రమః,
క్షిప్రం సునిశితై ర్బాణై ర్హన్యతాం యుధి రావణః. 20

భ్రాతు రాదేశ మాజ్ఞాయ లక్ష్మణో వా పరంతపః,
స కిమర్థం నరవరో న మాం రక్షతి రాఘవః. 21

---

'రామా! 'నేను ప్రయోగించిన అస్త్రము విఫలమగుట శక్యముగాదు'. అని నీ వా కాకితో వలికి దాని కుడికంటిని ఆ యస్త్రముచే పోగొట్టితివి. 16

రామా! ఆ కాకి నీకును, నీ తండ్రి దశరథమహారాజునకును ప్రణమిల్లి, నీవు విడిచిపెట్టగా తన నివాసమున కేగినది. 17

"ఇట్లు అస్త్రముల నెఱిగినవారిలో శ్రేష్ఠుడు, బలవంతుడు, శీలవంతుడయ్యు రాముడు రాక్షసులపై అస్త్రమేల ప్రయోగింపకున్నాడు? 18

నాగులుగాని, గంధర్వులుగాని, అసురులుగాని, మరుద్గణములు గాని, యుద్ధమున రాముని యెదుట నిలుచుటకు సమర్థులుకారు. 19

పరాక్రమశాలియగు ఆయనకు వన్ను కాపాడవలెనని తొందర కలదేని శీఘ్రమే వాడి బాణములను ప్రయోగించి యుద్ధమున రావణుని పరిమార్చవలెను. 20

శత్రువులను తపింపజేయువాడు, నరశ్రేష్ఠుడు, రఘువంశమున పుట్టినవాడగు లక్ష్మణుడైనను అన్న యనుమతి బడసి నన్నేల రక్షింపడు? 21

శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ,
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మా ముపేక్షతః. 22
మమైవ దుష్కృతం కించి న్మహ దస్తి న సంశయః,
సమర్థౌ సహితౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ. 23
వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రు భాషితమ్,
పున రప్యహ మార్యాం తా మిదం వచన మబ్రువమ్. 24
త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే. 25
కథంచిద్ భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్,
అస్మిన్ ముహూర్తే దుఃఖానా మంతం ద్రక్ష్యసి భామిని. 26
తావుభౌ నరశార్దూలౌ రాజపుత్రా వనిందితౌ,

---

పురుషశ్రేష్ఠులగు ఆ రామలక్ష్మణులు కడు సమర్థులు. అగ్నివాయువులకు సాటియగు తేజము కలవారు. దేవతలకును ఎదిరింప నసాధ్యులు. మఱి వారు నన్నేల ఉపేక్ష చేయుచున్నారు. 22

శత్రువులను తపింపజేయువారు, సమర్థులు అగు వారిరువురును కలసి నన్ను దయచూడకుండుటచే నిశ్చయముగ నేనేదో బలవత్తరమైన పాపము చేసియుందును. 23

జాలి కలిగించునదై, కన్నీరు కార్చుచు సీత పలికిన వాక్యము విని నే నా పూజ్యురాలితో నిట్లు పలికితిని. 24

'ఓ, సీతాదేవీ! రాముడు నీ యెడబాటువలని దుఃఖముచే ఇతరకార్యములం దాసక్తి లేక యున్నాడు. రాముడు దుఃఖితు డగుటచే లక్ష్మణుడును పరితాపము నందుచున్నాడు. 25

ని న్నెట్లో చూడగలిగితిని. ఇపు డిది దుఃఖింపదగిన సమయము కాదు. తల్లీ! నీ వీ క్షణముననే దుఃఖములు తొలగుట చూతువు. 26

నరశ్రేష్ఠులు , అనిందితులు, రాజపుత్రులగు వారిరువురును నిన్ను చూచి

త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః. 27

హత్వా చ సమరే రౌద్రం రావణం సహబాంధవమ్,
రాఘవ స్త్వాం వరారోహే స్వాం పురీం నయతే ధ్రువమ్. 28

యత్తు రామో విజానీయా దభిజ్ఞాన మనిందితే,
ప్రీతిసంజననం తస్య ప్రదాతుం త్వ మిహార్హసి. 29

సాఽభివీక్ష్య దిశ స్సర్వా వేణ్యుద్గ్రథిత ముత్తమమ్,
ముక్త్వా వస్త్రా ద్దదౌ మహ్యం మణిమేతం మహాబల. 30

ప్రతిగృహ్య మణిం దివ్యం తవ హేతో రఘూద్వహ,
శిరసా తాం ప్రణ మ్యార్యా మహ మాగమనే త్వరే. 31

గమనే చ కృతోత్సాహ మవేక్ష్య వరవర్ణినీ,
వివర్ధమానం చ హి మా మువాచ జనకాత్మజా. 32

---

ఉత్సాహముతో లంకను భస్మము చేయుదురు. 27

ఓ చక్కని నడుము కలదానా! భయంకరుడగు రావణుని, అతని బంధువులను యుద్ధమున పరిమార్చి తప్పక నిన్ను రాముడు నగరమునకు తీసికొని పోగలడు. 28

ఓ అనిందితురాలా! రాముడు గుర్తించునట్టిది, ఆయనకు ప్రీతిని చేకూర్చునట్టిదగు గురుతు నొకదాని నీయదగుదువు.' 29

ఓ మహాబలశాలీ! ఆమెయు అన్ని దిక్కులు పరిశీలించి, (రాక్షసు లెవ్వరును చూచుట లేదని నిశ్చయించుకొని) జడకు ఆభరణమగు యీ యుత్తమమగు మణిని కొంగునుండి తీసి నా కిచ్చినది. 30

ఓ రఘుశ్రేష్ఠుడా! నే నా దివ్యమగు మణిని నీకై పరిగ్రహించి శిరము వంచి, యామెకు ప్రణమిల్లి యిచటకు వచ్చుటకు సన్నాహపడితిని. 31

వరవర్ణిని యగు (ఉష్ణకాలమున సుఖశీతము, శీతకాలమున సుఖోష్ణమగు శరీరము గల) సీతాదేవి నే నట్లు పోవ నుత్సహించుచుండుటను, శరీరము పెంచుటను కాంచి,

అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పసందిగ్ధభాషిణీ,
మమోత్పతనసంభ్రాంతా శోకవేగసమాహతా. 33

హనుమన్ సింహసంకాశా వుభౌ తౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్. 34

యథా చ స మహాబాహు ర్మాం తారయతి రాఘవః,
అస్మా ద్దుఃఖాంబుసంరోధాత్ త్వం సమాధాతు మర్హసి. 35

ఇమం చ తీవ్రం మమ శోకవేగం, రక్షోభి రేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గత స్సమీపం, శివశ్చ తేఽ ధ్వాస్తు హరిప్రవీర. 36

ఏతత్ తవార్యా నృపరాజసింహ, సీతా వచః ప్రాహ విషాదపూర్వమ్,
ఏతచ్చ బుద్ధ్వా గదితం మయా త్వం, శ్రద్ధత్స్వ సీతాం కుశలాం సమగ్రామ్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే సప్తషష్టితమః సర్గః.

---

కన్నుల నీరు నింపుకొని, కన్నీటిచే కంఠము రుద్ధమై మాటలు తడబడగా నే నెగిరిపోవు చుంటినని యొకింత కలవరనడి, శోకము పెల్లుబుకగా నా కిట్లనెను. 32,33

హనుమంతుడా! సింహసదృశు లగు ఆ రామలక్ష్మణు లిరువురిని, సుగ్రీవుని, అతని మంత్రులను అందరిని కుశల మడిగితి ననుము. 34

మహాభుజు డగు రాముడు నన్నీ దుఃఖసాగరమునుండి దాటించునట్లు నీవు సన్నాహము చేయదగుదువు. 35

ఓ వానరుడా! నీవు రాముని కడ కేగి పెల్లుబుకు నా యీ శోకమును, రాక్షసులు నన్ను బెదరించుటను ఆయనకు తెలుపుము. నీకు ప్రయాణము సుఖకర మగుగాక! 36

ఓ రాజోత్తమా! పూజ్యురాలగు నీ భార్య సీతాదేవి యిట్లు విషాదముతో పలికినది. నేను పలికిన దంతయు యోచించి, సీతాదేవి సమగ్రమగు కుశలము కలిగియున్నదని నమ్ముము. 37

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువదియేడవ సర్గము.*

# 68. అష్టషష్టితమః సర్గః

*(సీతాసమాశ్వాసన కథనము)*

అథాహ ముత్తరం దేవ్యా పునరుక్త స్ససంభ్రమః,
తవ స్నేహా న్నరవ్యాఘ్ర సౌహార్ద్దా దనుమాన్య వై. 1
ఏవం బహువిధం వాచ్యో రామో దాశరథి స్త్వయా.
యథా మా మాప్నుయా చ్ఛీఘ్రం హత్వా రావణ మాహవే. 2
యది వా మన్యసే వీర వసైకాహ మరిందమ,
కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాంతః శ్వో గమిష్యసి. 3
మమ చాప్యల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్ తవ వీర్యవన్,
అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యాద్విమోక్షణమ్. 4

---

నరశ్రేష్ఠుడవగు రామా! అపుడు సీతాదేవి నాయందు నీకు గల అనురాగవిశేషము చేతను, నేను తన హితము గోరువాడనను భావము చేతను ప్రయాణమునకై తొందరపడుచున్న నన్నాదరముతో జూచి, మఱల నిట్లనెను. 1

'దశరథతనయు డగు రాముడు యుద్ధమున రావణుని సంహరించి, శీఘ్రమే నన్ను తీసికొనిపోవునట్లు నీవనేకవిధములుగా చెప్పవలయును. 2

శత్రువుల నణపజాలు పరాక్రమవంతుడవగు హనుమంతుడా! నీవిట నుండదలంచునో నొక్క రహస్యప్రదేశమున నొక్క దినముండి విశ్రమించి రేపు పోవచ్చును. 3

ఓ పరాక్రమవంతుడా! నీ వింకొక్క దిన మిచట నుంటివేని, హితుడవగు నీ సాన్నిధ్యముచే, మందభాగ్యనగు నా కీ దుఃఖమున కొకింత యుపశాంతి కలుగును. 4

గతే హి త్వయి విక్రాంతే పునరాగమనాయ వై,
ప్రాణానామపి సందేహో మమ స్యా న్నాత్ర సంశయః. 5
తవాదర్శనజ శ్శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖా ద్దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీమ్. 6
అయం చ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాం స్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర. 7
కథం ను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిమ్,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. 8
త్రయాణా మేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే,
శక్తిః స్యాద్ వైనతేయస్య తవ వా మారుతస్య వా. 9
తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,

---

పరాక్రమశాలివగు నీవు పునరాగమనమునకై వెడలగనే నా ప్రాణములు నిలుచునో లేదో యని నాకు సందేహము కలదు. ఇందు సందేహము లేదు. 5

నా పతి నెడబాసి, దుఃఖముల పాలై, దుర్గతి నొందియున్న నాకు నీ వగపడకుండుట మఱింత శోకమును కలిగించును. 6

ఓ వీరుడవు వానరశ్రేష్ఠుడవగు హనుమంతుడా! నీ సహాయులగు ఋక్షవానరుల విషయమున నాకు గొప్ప సందేహ మేర్పడి యున్నది. 7

ఆ ఋక్ష, వానరసేనలు కాని యా రాజపుత్రులగు రామలక్ష్మణులు గాని దాటరాని మహాసముద్రము నెట్లు దాటుదురు? 8

ఈ సముద్రమును దాటుటకు గరుత్మంతునకుగాని, నీకుగాని, వాయుదేవునకుగాని ముప్పురకు మాత్రమే శక్తియుండును గాని తక్కినవారి కట్టి శక్తియుండదు. 9

వీరుడవు, కార్యవిదులలో శ్రేష్ఠుడవగు హనుమంతుడా! ఈ ప్రకారము

కిం పశ్యసి సమాధానం బ్రూహి కార్యవిదాం వర. 10

కామ మస్య త్వమే వైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్య స్తే బలోదయః. 11

బలై స్సమగ్రైర్యది మాం హత్వా రావణ మాహవే,
విజయీ స్వాం పురీం రామో నయేత్తత్ స్యాద్ యశస్కరమ్. 12

యథాఽహం తస్య వీరస్య వనా దుపధినా హృతా,
రక్షసా తద్భయా దేవ తథా నార్హతి రాఘవః. 13

బలైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయే ద్యది కాకుత్స్థ స్తత్తస్య సదృశం భవేత్. 14

తద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః,

---

కార్యనిర్వహణ మిట్లు దుష్కరమై యుండగా నీవే యుపాయ మూహించుచున్నావు? 10

ఓ శత్రువీరులను సంహరించువాడా! నీ వొక్కడవే రావణాది సకలరాక్షసులను సంహరించి నన్ను తీసుకొని రాముని సన్నిధికి చేర్చుట యను కార్యమును సాధింపజాలుదువు. కాని అట్లు నీ బలమును ప్రదర్శించుట నీకు యశస్కరముగాని రామునకు కాదు. 11

రాముడు సమగ్రమగు సేనతో వెడలి వచ్చి, యుద్ధమున రావణుని చంపి, విజయము పొంది, నన్ను తన నగరమునకు తీసికొనిపోవుట ఆయనకు యశస్కరము. 12

మున్ను రావణుడు రామునకు భయపడి కపటోపాయముతో నన్నెట్లు రహస్యముగా అపహరించుకొని వచ్చెనో, అట్లే రాముడును నన్ను రహస్యముగా తీసికొనిపోవు టుచితము కాదు. 13

శత్రుసైన్యములను పీడించువాడగు రాముడు, తన సైన్యములతో లంకను నింపి, నన్ను తీసుకొని పోవునేని అది ఆయనకు తగిన పని యగును. 14

కావున ఎట్లు మహాత్ముడు, యుద్ధమున పరాక్రమశాలి యగు రాము డాచరింప

భవ త్యాహవశూరస్య తథా త్వ ముపపాదయ. 15

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్,
నిశమ్యాహం తత శ్శేషం వాక్య ముత్తర మబ్రువమ్. 16

దేవి హర్యృక్షసైన్యానా మీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవ స్సత్త్వసంపన్న స్తవార్థే కృతనిశ్చయః. 17

తస్య విక్రమసంపన్నా స్సత్త్వవంతో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః. 18

యేషాం నోపరి నాధస్తా న్న తిర్యక్ సజ్జతే గతిః,
న చ కర్మసు సీదంతి మహ త్స్వమితతేజసః. 19

అసకృత్ తై ర్మహాభాగై ర్వానరై ర్బలదర్పితైః,
ప్రదక్షిణీకృతా భూమి ర్వాయుమార్గానుసారిభిః. 20

---

తగునో అట్లు నీవు ఏర్పాటుచేయుము. 15

అర్థవంతమును, వినయముతో కూడినది, యుక్తియుక్తము అగు ఆమె వాక్యము విని నేనిట్లు బదులు పలికితిని. 16

ఓ సీతాదేవీ! ఎలుగులు, కోతుల సేనకు ప్రభువు, వానరులలో శ్రేష్ఠుడు మహాబలసంపన్నుడగు సుగ్రీవుడు రామునకు తోడై నిన్ను కొని తెచ్చుటకు కృతనిశ్చయుడై యున్నాడు. 17

పరాక్రమసంపన్నులు, బుద్ధిబలము, శరీరబలము కలవారు, మనోవేగముతో వచ్చి శత్రువులపై పడగల వారగు వానరు లాయన చెప్పుచేతలలో నున్నారు. 18

వీ రాకాశమున, పాతాళమున, భూమిపై అంతటను అడ్డులేని సంచారము కలిగి యున్నారు. అమితతేజశ్శాలు లగు వారు మహాకార్యములు చేయుటలోభంగపడరు. 19

బలగర్వితులు, మహాత్ములగు ఆ వానరులు ఆకాశమార్గమున అనేక మార్లు భూమిని చుట్టివచ్చిరి. 20

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ. 21
అహం తావ దిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః,
న హి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః. 22
తదలం పరితాపేన దేవి మన్యు ర్వ్యపైతు తే,
ఏకోత్పాతేన వై లంకా మేష్యంతి హరియూథపాః. 23
మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యా వివోదితౌ,
త్వత్సకాశం మహాభాగే నృసింహా వాగమిష్యతః. 24
అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్,
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వార ముపస్థితమ్. 25
నఖదంష్ట్రాయుధాన్ వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,

---

ఆ సైన్యములో నా కంటెను శ్రేష్ఠులు, నాతో సమానులును అగు వానరులే కలరు. సుగ్రీవునికడ నాకంటె తక్కువవాడు లేనే లేడు. 21

నావంటి సామాన్యుడే సముద్రము దాటి యిటకు రాగలిగెనే. ఇంక మహాబలశాలులగు వారి విషయమున వేరుగా చెప్పవలయునా? దౌత్యము మున్నగు పనులకు సామాన్యులను పంపుదురు కాని శ్రేష్ఠులను కాదు కదా! 22

ఓ దేవీ! కావున నీ వింక చింతింపకుము. నీ శోకము వీడుము. ఆ వానరవీరు లొక్క గంతులో లంకను చేరగలరు. 23

ఓ మహాభాగ్యవతీ! నరశ్రేష్ఠులగు రామలక్ష్మణులు నా వీపుపై నెక్కి, కొండపై నుదయించు సూర్యచంద్రులవలె నీ కడకు వత్తురు. 24

శత్రువులను చంపువాడును, సింహసదృశుడును అగు రాముడు, విల్లుచేత ధరించిన లక్ష్మణుడును లంకాద్వారమును చేరగా శీఘ్రమే చూతువు. 25

గోళ్లు, పండ్లు ఆయుధములుగా కలవారును, వీరులును, సింహములు పులులవంటి

వానరాన్ వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్. 26
శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానా మచిరాత్ శ్రోష్యసి స్వనమ్. 27
నివృత్తవనవాసం చ త్వయా సార్ధ మరిందమమ్,
అభిషిక్త మయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్. 28
తతో మయా వాగ్భి రదీనభాషిణా, శివాభి రిష్టాభి రభిప్రసాదితా,
జగామ శాంతిం మమ మైథిలాత్మజా, తవాపి శోకేన తదాభిపీడితా.

*ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే సుందరకాండే అష్టషష్టితమః సర్గః.*

*శ్రీమత్సుందరకాండః సమాప్తః.*

---

పరాక్రమము గలవారును, గజశ్రేష్ఠములవలె మహాకాయములు గలవారును అగు వానరులు శీఘ్రమే యిచటకు వచ్చుట చూచెదవు. 26

కొండలవలె, మేఘములవలె నున్నతులై, లంకయందలి మలయపర్వత ప్రాంతములందు సింహనాదము చేయు కపిశ్రేష్ఠుల మహాధ్వనిని త్వరలో వినెదవు. 27

శత్రువుల నణచువాడగు రాముడు, వనవాసదీక్షను సమాప్తిచేసి, నీతో వెడలి, అయోధ్యలో పట్టాభిషిక్తుడగుటను త్వరలో కాంచెదవు. 28

అట్లు పూర్వము నీ వామెకై పరితపించుచుంటివని వినుటతోడనే శోకాక్రాంతయైన సీత దుఃఖము తొలగుటకు ఆమె కిష్టములు, ఉచితములు నగు వాక్కులతో నే నామెను ప్రసన్నురాలిని చేయగా యొకింత శాంతి వహించినది" అని హనుమంతుడు రామునకు సీతావృత్తాంతము తెలియజేసెను. 29

*ఇట్లు వాల్మీకిమహర్షి రచించిన శ్రీమద్రామాయణమున*
*సుందరకాండమున నఱువదియెనిమిదవ సర్గము.*

*శ్రీసుందరకాండము సమాప్తము.*